# ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్ర

## (స్పెషల్ తెలుగు)

## బి. ఎ. ద్వితీయ సంవత్సరం

**సెమిష్టర్ –3**


**రచయితలు**

**డా. గుంటుపల్లి రామారావు ,**
సి – 122, యస్. వి. యన్ కాలనీ,
గుంటూరు.

**డా. సి. హెచ్. సుశీలమ్మ,**
రీడర్, తెలుగుశాఖ,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,
గుంటూరు.

**డా. యల్లాప్రగడ మల్లికార్జునరావు,**
తెలుగుశాఖ,
హిందూ కళాశాల,
గుంటూరు.

**డా. పి. వి. సుబ్బారావు,**
రీడర్, తెలుగుశాఖ,
సి. ఆర్. కళాశాల, చిలకలూరిపేట.

**డా. ఎం. కమల,**
లెక్చరర్,
సి. ఆర్. కళాశాల,
చిలకలూరిపేట.

**డా. ఎం. స్వర్ణలతాదేవి,**
రీడర్, తెలుగుశాఖ,
టి .జె. పి. యస్. కళాశాల,
గుంటూరు.

**ఉప సంపాదకులు :**

**డా. సి. హెచ్. సుశీలమ్మ,**
రీడర్, తెలుగుశాఖ,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,
గుంటూరు.

**సంపాదకులు :**

**ఆచార్య జి. వై. ప్రభావతీదేవి,**
డిపార్ట్ మెంట్ ఆఫ్ తెలుగు అండ్
ఓరియంటల్ లాంగ్వేజెస్,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంచాలకులు**

**డా. నాగరాజు బట్టు**
*ఎం.బీ.ఏ., ఎం.హెచ్.ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజీ), ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సోషియాలజీ), ఎం.ఇ. డి., ఎం.ఫీల్., పిహెచ్.డి.*

దూర విద్యాకేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ – 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**Website : www.anucde.info**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. ఎ. ద్వితీయ సంవత్సరం  సెమిష్టర్ – 3
# స్పెషల్ తెలుగు :  ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్ర

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

© **ఆచార్య నాగార్జున యూనివర్శిటి**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున యూనివర్శిటిలోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు,**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడాని సంతోషిస్తున్నాను.ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

# బి. ఎ. ద్వితీయ సంవత్సరం : సెమిస్టర్ – 3

## అంశం : స్పెషల్ తెలుగు

## 312STL21 : కోర్సు-3 : ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్ర

★ **అభ్యసన ఫలితాలు :**

ఈ కోర్సు విజయవంతంగా ముగించాక, విద్యార్థులు క్రింది అభ్యసన ఫలితాలను పొందగలరు.

1. తెలుగువారి చరిత్రలో భాగమైన తెలుగు సాహిత్యచరిత్ర, చిరకాలంగా తెలుగువారు ఆచరిస్తున్న సంస్కృతిలో ఎలా అంతర్భాగమైందో తెలుసుకోగలరు.
2. తెలుగుసాహిత్య క్రమపరిణామాన్ని గురించిన స్థూలమైన అవగాహనను పొందుతారు.
3. తెలుగులో ఉన్న రెండు సాహిత్య సంప్రదాయాలైన మౌఖిక, లిఖిత రూపాలను గుర్తిస్తారు. వివిధ సాహిత్య ప్రక్రియల వికాసాన్ని అవగాహన చేసుకుంటారు.
4. కవులు తమ సృజనాత్మకత ద్వారా సృష్టించిన సాహిత్యాన్ని బోధించడం ద్వారా విద్యార్థులు సాహిత్యం పట్ల సంవేదనను, అభిరుచిని, విమర్శనాత్మక విశ్లేషణాశక్తిని పొందగలరు.
5. ఆయా శాస్త్రాలో కృషిచేసే వారికి ఆ రంగంలో విషయజ్ఞానం ఎలా అవసరమో తెలుసుకోగలరు. తెలుగుసాహిత్యంలో కృషిచేసే వారికి తెలుగులో పాండిత్యం అవసరమని గ్రహిస్తారు.
6. కవులు, రచయితలు వాడిన సృజనాత్మక భాషను పరిచయం చేయడం ద్వారా విద్యార్థులు తమ కళావసరాలు తీర్చుకోగలరు.

## పాఠ్య ప్రణాళిక :

**యూనిట్ – I : ప్రాఙ్నన్నయ యుగం**

1. వాఙ్మయం–సారస్వతం–సాహిత్యం, సాహిత్య అధ్యయన పద్ధతులు
2. సాహిత్య చరిత్ర–యుగ విభజన, 'చరిత్ర–సంస్కృతి–సమాజం–సాహిత్యం' సంబంధాలు
3. ప్రాఙ్నన్నయ యుగం – భాషా సాహిత్యాలు

**యూనిట్ – II : అనువాదయుగం**

4. నన్నయ మహాభారత రచన; నన్నయ కవితారీతులు; నన్నయ భారతాంధ్రీకరణ పద్ధతి
5. శివకవియుగంలోని దేశికవిత్వోద్యమం – నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు
6. మార్గ–దేశి భేదాలు; దేశి కవిత్వోద్యమం; పండితత్రయం

**యూనిట్ – III : కావ్య–పురాణయుగం**

7. తిక్కన మహాభారత రచన: తిక్కన కవితాశిల్పం
8. ఎఱ్ఱన భారతారణ్యపర్వ శేష రచన; ఎఱ్ఱన సూక్తివైచిత్రి
9. నాచన సోమన–ఉత్తర హరివంశం; శ్రీనాథుని కృతులు–సమీక్ష : పోతన భాగవత పురాణ రచన

**యూనిట్ – IV : ప్రబంధయుగం**

10. ప్రబంధ లక్షణాలు; శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజ కవులు–కృతులు–సమీక్ష
11. ఆముక్తమాల్యద–ప్రబంధలక్షణాలు – సమన్వయం
12. మనుచరిత్ర, వసుచరిత్ర – ప్రబంధ లక్షణాలు సమన్వయం

**యూనిట్–V: దక్షిణాంధ్రయుగం**

13. పదసాహిత్యం, శతకసాహిత్యం, వచనసాహిత్యం, యక్షగానాలు
14. దక్షిణాంధ్రయుగ వైశిష్ట్యం; రఘునాథనాయకుడు–కృతులు–సమీక్ష
15. దక్షిణాంధ్రయుగ ప్రసిద్ధ కవులు–కృతులు–సమీక్ష

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రవాఙ్మయ చరిత్రము – ఆచార్య దివాకర్ల వేంకటావధాని.
2. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర
3. తెలుగు సాహిత్య సమీక్ష(మొదటి సంపుటం) – ఆచార్య జి. నాగయ్య.
4. ఆంధ్రసాహిత్య చరిత్ర – ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.
5. చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య ముదిగంటి సుజాతారెడ్డి.

**సూచించబడిన సహపాఠ్య కార్యక్రమాలు :**

1. వివిధ సాహిత్యచరిత్ర గ్రంథాల ఆధారంగా విద్యార్థులచేత పాఠ్యప్రణాళికపై సమీక్షా వ్యాసాలు రాయించడం.
2. తరగతిగదిలో ఒక్కొక్క విద్యార్థికి ప్రత్యేకాంశంగా ఒక ప్రత్యేక కవిని/రచయితను అంశంగా ఇచ్చి, అందులో ప్రాజెక్టు తయారు చేయించడం.
3. వివిధ కవుల / కావ్యాల కావ్యగుణాలను; రచనల్లోని సామాన్యాంశాలను తులనాత్మకపద్ధతిలో చర్చించడం. ఉదా. ఎఱ్ఱన నాచన సోమనల కవితా తారతమ్య పరిశీలన.
4. సాహిత్య యుగ విభజనను చారిత్రక దృష్టితో పరిశీలింపజేయడం.
5. ఆయా కాలాల్లోని సామాజిక పరిస్థితుల ఆధారంగా కావ్యవస్తువుల్లో చోటుచేసుకొన్న మార్పులను నమోదు చేయించడం.
6. చారిత్రిక, సాంస్కృతికాంశాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలను సందర్శించడం.

# MODEL QUESTION PAPER

## Second Year – Third Semester

## Part – II : Special Telugu

## Paper III – PRACHEENA TELUGU SAHITYA CHARITRA

**Time: Three hours** **Max. Marks : 70**

**విభాగము అ – (5 x 4 = 20 మార్కులు)**

**ఈ క్రింది వాటిలో ఐదింటికి సంసాక్షిప్త సమాధానాలు రాయండి.**

**ప్రతి సమాధానానికి 5 మార్కులు.**

1. సాహిత్య అధ్యయన పద్ధతులు.
2. నన్నయ భారతాంధ్రీకరణ పద్ధతి
3. నన్నెచోడుడు
4. శ్రీకృష్ణదేవరాయలు
5. యక్షగానాలు
6. పోతన
7. తిక్కన
8. రఘునాథ నాయకుడు

**విభాగము ఆ – (5 x 10 = 50 మార్కులు)**

**క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.**

**ప్రతి సమాధానానికి 10 మార్కులు.**

9. ప్రాజ్ఞన్నయ యుగ భాషా సాహిత్యాలను విశ్లేషించండి.

లేదా

చరిత్ర – సంస్కృతీ – సమాజం సాహిత్యంల మధ్య సన్నిహిత సంబంధాన్ని వివరించండి.

10. నన్నయ భారతాంధ్రీకరణ పద్ధతి వివరించండి.

లేదా

పాల్కురికి సోమనాథుని రచనా విధానాన్ని తెలియ చేయండి.

11. శ్రీనాధుని కృతులని గూర్చి తెలియ చేయండి.

లేదా

పోతన భక్తితత్వాన్ని విశదీకరించండి.

12. ప్రభంద లక్షణాలను తెలిపి, మనుచరిత్ర ప్రభంధంతో అన్వయించండి.

లేదా

అష్ట దిగ్గజ కవులు – కృతులను సమీక్షించండి

13. యక్షగానాలు ప్రాధాన్యతను తెలియ చేయండి.

లేదా

పద సాహిత్యాన్ని నిర్వచించి, శతక సాహిత్యాన్ని తెలియ చేయండి.

★★★★★

# విషయసూచిక


| పాఠం సంఖ్య | పాఠం పేరు | పేజి సంఖ్య నుండి | వరకు |
|---|---|---|---|
| 1 | సాహిత్య అధ్యయనం – ప్రాఙ్నన్నయ యుగం | 1.1 - | 1.11 |
| 2 | నన్నయ యుగం | 2.1 - | 2.13 |
| 3 | శివకవి యుగం | 3.1 - | 3.7 |
| 4 | శివ కవులు | 4.1 - | 4.10 |
| 5 | తిక్కన యుగం | 5.1 - | 5.14 |
| 6 | ఎఱ్ఱన యుగం | 6.1 - | 6.11 |
| 7 | శ్రీనాథ యుగం | 7.1 - | 7.24 |
| 8 | బమ్మెర పోతన | 8.1 - | 8.19 |
| 9 | ప్రబంధ యుగం | 9.1 - | 9.13 |
| 10 | ప్రబంధ కవులు | 10.1 - | 10.42 |
| 11 | పద సాహిత్యం | 11. 1 - | 11.8 |
| 12 | దక్షిణాంధ్ర యుగం | 12. 1 - | 12.8 |
| 13 | దక్షిణాంధ్ర యుగం – సాహిత్య వైభవం | 13. 1 - | 13.20 |

# పాఠం - 1

# సాహిత్య అధ్యయనం - ప్రాఙ్నన్నయ యుగం

1.0 ప్రవేశిక
1.1 లక్ష్యం
1.2 వాఙ్మయము - సారస్వతము - సాహిత్యము
1.3 శాస్త్ర వాఙ్మయము, కావ్య వాఙ్మయము
1.4 తెలుగు సాహిత్య చరిత్ర - యుగవిభజన
1.5 ప్రాఙ్నన్నయ యుగం - తెలుగు భాషాపరిణామం
1.6 ప్రాఙ్నన్నయ యుగం - తెలుగు సాహిత్య పరిణామం
1.7 నన్నయకు పూర్వం ఉన్న తెలుగు భాషాకవులు
1.8 గుర్తుంచుకోదగిన ముఖ్య విషయాలు
1.9 ప్రశ్నలు
1.10 ఆధారగ్రంథాలు

## 1.0 ప్రవేశిక :

ఆంధ్రభాషలో నన్నయనుంచి ప్రామాణిక సాహిత్యం లభ్యం అవుతుంది. అంతకు ఎన్నో శతాబ్దాలకు పూర్వమే ఆంధ్రభాషాసాహిత్యాలు ప్రజాబాహుళ్యంలో విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ క్రీ.శ. 11వ శతాబ్ది నుంచి మాత్రమే ఆంధ్రసాహిత్యంలో వైవిధ్యభరితమైన గ్రంథాలు రచించబడ్డాయి. వివిధకాలాల్లో మహాకవులు రచించిన కావ్యజాలాన్ని కూలంకషంగా పరిశీలించటం ఆంధ్రసాహిత్య అధ్యయనం అవుతుంది. ప్రణాళికాబద్ధంగా ఆయాయుగాల్లో వెలసిన గ్రంథాలను గూర్చిన అవగాహన కల్పించుకోవలసిన అవసరంఉంది.

## 1.1 లక్ష్యం :

వాఙ్మయము, సారస్వతము, సాహిత్యము - ఈ పదాల అర్థవిస్తృతి, శాస్త్రకావ్య వాఙ్మయాల మధ్య ఉన్న వ్యత్యాసం ఆంధ్రసాహిత్యాన్ని ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేసేందుకు పండితులు నిర్దుష్టంగా చేసిన యుగ విభజన ఈ పాఠ్యభాగంలో తెలుసుకోవచ్చు. అలాగే ప్రాఙ్నన్నయ యుగంలోని తెలుగుభాష, సాహిత్యస్వరూపాలు తెలుసుకోవచ్చు.

## 1.2. వాఙ్మయము - సారస్వతము - సాహిత్యము :

వాఙ్మయము, సారస్వతము, సాహిత్యము అనే పదాలను ఈనాడు సమానార్థకాలుగానే ఉపయోగిస్తున్నారు. స్థూలదృష్టికి ఇవి సమానార్థకాలుగానే ప్రయోగింపబడుతున్నప్పటికీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే అర్థవిస్తృతిలో కొంత భేదం కనిపిస్తుంది.

ఈ మూడు పదాల్లో వాఙ్మయము మిగిలిన వానికంటె విస్తృతతరమైంది. 'వాక్' శబ్దానికి 'మయట్' ప్రత్యయం చేరిస్తే వాఙ్మయం అయింది. వాగ్రూపమైన సమస్తశబ్ద వికారాన్ని వాఙ్మయం అనవచ్చు. సర్వవిధములైన రచనలు, సంభాషణలు, ఉపన్యాసాలు, పద్దులు, ఉత్తరాలు కూడ వాఙ్మయం పరిధిలోకి వస్తాయి.

సారస్వతపదం వాఙ్మయమంత విస్తృతతరమైంది కాదు. సారస్వతంలో శబ్దార్థాలను పురస్కరించుకొని రసం ప్రధానంగా ఉంటుంది. ఆంతర చైతన్యం కలిగినట్టి శబ్దప్రపంచమంతా సారస్వతమే. శాస్త్ర గ్రంథాలు, పంచాంగాలు, వార్తాపత్రికలు, శాసనాలు, నిఘంటువులు మొదలైన వాటన్నింటినీ సారస్వతంలో చేర్చవచ్చు.

"సాహిత్యం'' పదం వాఙ్మయము, సారస్వతంకన్న కొంత పరిమితమైన అర్థం కలిగినట్టిది. రసప్రధానములు, ఆనందప్రదములు, అయిన కావ్యసముదాయం అంతా సాహిత్యం క్రిందికి వస్తుంది. హితముతో కూడినది సహితము. దాని భావం సాహిత్యం. సాహిత్యానికి విగళిత వేద్యాంతరమైన ఆనందం పరమ ప్రయోజనం అయినప్పటికీ ఉపదేశపరత్యంకూడ ఉండటం దానికి మరింత వన్నె చేకూరుస్తుంది. 'నానృషిః కురుతే కావ్యమ్', విశ్వశ్రేయః కావ్యమ్', 'సహితస్వభావమ్ సాహిత్యం' అనే సూక్తులను బట్టి సార్వజనీనము, సార్వకాలికమై, కవిఆత్మీయతను స్ఫురింపచేసే కావ్యజాలం అంతా సాహిత్యం అనబడుతుంది.

అయితే అర్థవిస్తృతిలో ఈషణ్మాత్రమైన భేదం కనపడుతున్నప్పటికీ ఈ మూడు పదాలను పర్యాయపదాలుగానే పరిగణిస్తున్నారు.

## 1.3 శాస్త్రవాఙ్మయము - కావ్యవాఙ్మయము :

రాజశేఖరుడు వాఙ్మయాన్ని శాస్త్రవాఙ్మయము, కావ్యవాఙ్మయము అని విభజించాడు.

కావ్యంలో కవి ఆత్మీయత అద్దంలో నీడలాగా ప్రతిబింబిస్తుంది. శాస్త్రగ్రంథంలో రచయిత ఆత్మీయత అణుమాత్రమైనా గోచరించదు. కావ్య వస్తువు కవి అంతరంగికము. కవి కర్మ కావ్యము. శాస్త్రంలోని విషయాలు కవికి బాహిరము. అందులో అతడి కర్తృత్వం ఉండదు. పరిశీలనకు అనుబంధమైన విజ్ఞానం ఉంటుంది. కావ్య వస్తువు కవికి బాహిరమైనప్పటికీ, కవిచే ఆస్వాదించబడి అతడి అంతరంగంనుంచి వెలువడుతుంది. కవిహృదయం, అభిరుచులు, కావ్యంలో ముద్రితాలవుతాయి. కవియే కావ్యరూపంలో పరిణమిస్తాడు. శాస్త్రంలో వస్తువు కవియొక్క ఆత్మకాదు. శాస్త్రకర్త తనకంటె పూర్వమే లోకంలో ఆవిర్భవించి నిగూఢమైఉన్న సత్యాలను దర్శించేవాడే కాని కొత్త వాటిని సృష్టించేవాడు కాదు. అతడు ద్రష్ట మాత్రమే కవి స్రష్ట. శాస్త్ర విషయాలను కావ్య విషయాల్లాగా మార్చటం సాధ్యంకాదు.

ఫలితార్థమేమనగా సుందరమైన రచన, సార్వజనీనమైన ప్రయోజనము కలిగి భావనాత్మకమైన నిర్వృత్తిని ఇస్తూ కర్త యొక్క ఆత్మీయతను స్ఫురింప చేసే గ్రంథము కావ్యము. తెలుగు భాషలో వెలసిన కావ్యాన చరిత్రను పరిశీలించటమే తెలుగు సాహిత్య చరిత్ర అధ్యయనం అవుతుంది.

## 1.4 తెలుగు సాహిత్య చరిత్ర - యుగవిభజన :

వాఙ్మయంలో చేరతగిన గ్రంథాలలో జాతి స్వభావం ఎట్లా వివరించబడిందో తెలుసుకోవటమే వాఙ్మయ చరిత్ర తెలుసుకోవటం అవుతుంది. కాలానుగుణంగా జాతి స్వభావంలాగానే ధర్మం కూడ మార్పు చెందుతూ అవిచ్ఛిన్నంగా వర్తిల్లుతుంది. జాతి ధర్మానికి సంఘర్షణ తటస్తించి నూతన సంస్కారం రూపొందేటప్పుడు వాఙ్మయ చరిత్రలో ఒక యుగం రూపొందుతుంది.

ఒక భాషలోని సాహిత్య చరిత్రను అధ్యయనంచేసి పరిశీలించటానికి యుగవిభజన అవసరం. కొన్ని విశిష్టమైన సమానమైన ధర్మాలుగల కాలాన్ని 'యుగం' అనవచ్చు. ఏ కవి సూత్రధారుడై సాహిత్యంలో నూతన ఒరవడిని సమకూరుస్తాడో అతడు ఆ యుగానికి కర్త అవుతాడు. ఆ యుగంలోని కవులందరికీ తలమానికల అవుతాడు. వాఙ్మయంలో ఆయా కాలాల్లో కలిగిన మార్పుల వల్ల ఏర్పడ్డ రూప పరిణామాలకు యుగకర్తలే కారకులవుతారు. ప్రతి యుగంలోను యుగకర్త అయినవాడు ఆ యుగంలో ఏ ప్రాంతంలోనైనా ఉండవచ్చు. ఆ యుగంలోని ఇతర కవులు అతణ్ణి గౌరవిస్తూ ఆదర్శంగా స్వీకరిస్తారు.

ఆంధ్ర సాహిత్య చరిత్రకారులు వారి సౌలభ్యాన్ని అనుసరించి, తమ అభిరుచినిబట్టి ఆంధ్ర సాహిత్యచరిత్రను భిన్న కోణాలలో యుగ విభజన చేశారు.

'కవి జీవితాలు' రచించిన శ్రీ గురజాడ శ్రీరామమూర్తి 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర'ను రచించిన శ్రీ వంగూరి సుబ్బారావు కవులు రచించిన గ్రంథాలను బట్టి భారతకవులు, రామాయణకవులు, ప్రబంధకవులు, గేయకవులు అని విభజించారు.

శ్రీ కందుకూరి వీరేశలింగం 'ఆంధ్రకవుల చరిత్ర'లో కవులను - 1. ప్రాచీనకవులు (క్రీ.శ.1000 నుంచి 1500 దాకా), 2. మధ్యయుగకవులు (క్రీ.శ.1500 నుంచి 1700 దాకా), 3. ఆధునికకవులు (క్రీ.శ.1700 నుంచి) అని విభజించారు. ఈ విభజన కవుల చరిత్ర అవుతుంది కాని వాఙ్మయ చరిత్ర కాదు. ఈ విభజన చాలా స్థూలంగా ఉంది.

శ్రీ దివాకర్ల వెంకటావధాని 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లో ఆంధ్ర సాహిత్యంలోని ప్రక్రియా వైవిధ్యాన్ని బట్టి - 1. ప్రాఙ్నన్నయ యుగము లేక అజ్ఞాత యుగము, 2. పురాణ యుగము లేక భాషాంతరీకరణ యుగము, 3. కావ్య యుగము, 4. ప్రబంధ యుగము, 5. గద్య, గేయ, యక్షగాన యుగము లేక దక్షిణాంధ్ర యుగము, 6. ఖండకావ్య యుగము లేక ఆధునిక యుగము అని విభజించినారు. ఈ విభజన వీరేశలింగంగారి విభజన కన్న స్థూలంగా ఉంది.

కవిత్వవేదిశ్రీ కె.వి.నారాయణరావు 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము'లో కావ్య భేదాలను, రాజ వంశాలను కలిపి యుగ విభజన చేశారు.

1. ప్రాచీన కవిత్వము. క్రీ.పూ. 28 నుంచి క్రీ.శ. 1000 దాకా.

2. పురాణ కవిత్వము. క్రీ.శ. 1001 నుంచి క్రీ.శ. 1380 దాకా.
 దీనిని చాళుక్యచోడ యుగము (క్రీ.శ. 1001 నుంచి 1200 దాకా), కాకతీయ యుగము (క్రీ.శ. 1201 నుంచి 1380 దాకా) అని రెండు విభాగాలు చేశారు.

3. కావ్య ప్రబంధ యుగము (క్రీ.శ. 1381 నుంచి 1650 దాకా).
 ఇందులో రెడ్డి, నాయక, కర్ణాటక యుగము (క్రీ.శ. 1381 నుంచి 1500 దాకా), రాయల యుగము (క్రీ.శ. 1501 నుంచి 1650 దాకా) అని రెండు భాగాలు చేశారు.

4. అర్వాచీన యుగము (క్రీ.శ. 1651 నుంచి 1875 దాకా).
 దీనిని మధ్యమ యుగము (క్రీ.శ. 1651 నుంచి 1800 దాకా), సంధి యుగము (క్రీ.శ. 1801 నుంచి 1900 దాకా) అని రెండు భాగాలు చేశారు.

5. నవ్య కవిత్వము (క్రీ.శ. 1901 నుంచి)

ఈ విధంగా ఐదు యుగాలుగా విభజించారు.

శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారు 1. అజ్ఞాత యుగము లేక ప్రాఙ్నన్నయ యుగము (క్రీ.శ. 1000 వరకు), 2. భాషాంతరీకరణ యుగము లేదా కవిత్రయ యుగము (క్రీ.శ. 1000 నుంచి 1350 దాకా), 3. సంధి యుగము లేక శ్రీనాథ యుగము (క్రీ.శ. 1350 నుంచి 1500 దాకా), 4. ప్రబంధ యుగము (క్రీ.శ. 1500 నుంచి 1700 దాకా), 5. దక్షిణదేశ వాఙ్మయ యుగము (క్రీ.శ. 1700 నుంచి 1800 దాకా), 6. ఆధునిక యుగము (క్రీ.శ. 1800 నుంచి 1900 దాకా) అని విభజించారు.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు 'ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము'లో ప్రధానకవులు, కాలము, కావ్యభేదాలను

ఆధారం చేసుకొని - 1. నన్నయ పూర్వయుగం, 2. నన్నయ తిక్కనల నడిమి కాలం, 3. తిక్కన యుగం, 4. ఎఱ్ఱన యుగం, 5. శ్రీనాథ యుగం, 6. కృష్ణరాయ యుగం, 7. అనంతర ప్రబంధ యుగం, 8. తెలంగాణ కవులు, 9. ఆంధ్ర కవయిత్రులు, 10. చారిత్రక కావ్యములు, 11. యక్షగానములు, 12. శతకములు, 13. గేయములు అని విభజించారు.

శ్రీ ఆరుద్ర 'సమగ్ర ఆంధ్ర సాహిత్యము' అనే గ్రంథంలో కవులను పోషించిన రాజులను రాజవంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ క్రింది విధంగా యుగ విభజన చేశాడు.

| | | |
|---|---|---|
| 1. | ఆదిమ చాళుక్య యుగము | క్రీ.శ. 12వ శతాబ్దం చివరి దాకా |
| 2. | కాకతీయ యుగము | క్రీ.శ. 1200 నుంచి 1290 దాకా |
| 3. | పద్మనాయక యుగము | క్రీ.శ. 1300 నుంచి 1375 దాకా |
| 4. | రెడ్డి రాజుల యుగము | క్రీ.శ. 1375 నుంచి 1450 దాకా |
| 5. | గజపతుల యుగము | క్రీ.శ. 1435 నుంచి 1450 దాకా |
| 6. | తొలి రాయల యుగము | క్రీ.శ. 1450 నుంచి 1500 దాకా |
| 7. | మలి రాయల యుగము | క్రీ.శ. 1500 నుంచి 1550 దాకా |
| 8. | నవాబుల యుగము | క్రీ.శ. 1550 నుంచి 1600 దాకా |
| 9. | ఆరవీటి రాజుల యుగము | క్రీ.శ. 16వ శతాబ్దం నాలుగో పాదం |
| 10. | నాయక రాజుల యుగము | క్రీ.శ. 1600 నుంచి 1670 దాకా |
| 11. | కడపటి రాజుల యుగము | క్రీ.శ. 1670 నుంచి 1750 దాకా |
| 12. | కుంపిణీ యుగము | క్రీ.శ. 1750 నుంచి 1850 దాకా |
| 13. | జమీందారీ యుగము | క్రీ.శ. 1850 నుంచి 1900 దాకా |
| 14. | ఆధునిక యుగము | క్రీ.శ. 1900 నుంచి |

ఆంధ్ర సాహిత్యం రాజుల ఆశ్రయంలో వృద్ధి చెందినప్పటికీ సాహిత్య స్రష్టలకు మారుగా వారికి ఆశ్రయం ఇచ్చిన రాజుల పేరుతో సాహిత్య చరిత్ర యుగ విభజన చేయటం సమంజసం కాదని కొందరు పండితులు భావించారు.

ఆంధ్ర సాహిత్య పరిణామ క్రమంలో ఆయా యుగాల్లోని మహాకవులకు ప్రాధాన్యం ఇచ్చి సాహిత్యంలో ఏ కొద్ది మార్పు కనిపించినా అక్కడ ఒక యుగంగా విభజించటం నిర్దుష్టంగా ఉంటుంది. శ్రీ పింగళి లక్ష్మీకాంతం ఆ పద్ధతిని అనుసరించి ఆంధ్ర సాహిత్య చరిత్రను ఈ క్రింది యుగాలుగా విభజించారు.

| | | |
|---|---|---|
| 1. | ప్రాఙ్నన్నయ యుగం | క్రీ.శ. 200 నుంచి 1000 దాకా |
| 2. | నన్నయ యుగం | క్రీ.శ. 11వ శతాబ్దం |
| 3. | శివకవి యుగం | క్రీ.శ. 12వ శతాబ్దం |
| 4. | తిక్కన యుగం | క్రీ.శ. 13వ శతాబ్దం |
| 5. | ఎఱ్ఱన యుగం | క్రీ.శ. 1300 నుంచి 1350 దాకా |
| 6. | శ్రీనాథ యుగం | క్రీ.శ. 1350 నుంచి 1500 దాకా |
| 7. | రాయల యుగం లేక ప్రబంధ యుగం | క్రీ.శ. 1500 నుంచి 1600 దాకా |
| 8. | దక్షిణాంధ్ర యుగం | క్రీ.శ. 1600 నుంచి 1775 దాకా |
| 9. | క్షీణ యుగం | క్రీ.శ. 1775 నుంచి 1875 దాకా |

10. ఆధునిక యుగం క్రీ.శ. 1875 నుంచి

ఆధునిక యుగాన్ని మూడు భాగాలుగా విభజించారు.

1. సంస్కార వాఙ్మయ యుగం క్రీ.శ. 1875 నుంచి 1900 దాకా
2. నాటక వాఙ్మయ యుగం క్రీ.శ. 1900 నుంచి 1914 దాకా
3. నవ్య సాహిత్య యుగం క్రీ.శ. 1914 నుంచి

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు చేసిన ఈ యుగ విభజనను అందరూ అంగీకరించారు. ప్రస్తుతం ఆంధ్ర సాహిత్య అధ్యయనాన్ని ఈ విభజనను అనుసరించే పరిశీలిస్తున్నారు. ఆధునిక యుగంలో భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద కవిత్వం, దళిత కవిత్వం, ఇంకా నవల, కథానిక వంటి వచనరచనా ప్రక్రియలు విస్తరిల్లాయి. వీటన్నింటిని కూలంకషంగా పరిశీలించటం ద్వారా ఆంధ్ర సాహిత్య చరిత్ర అధ్యయనం సమగ్రం అవుతుంది.

## 1.5 ప్రాఙ్నన్నయ యుగం :

మన భాషకు ఈనాడు ఆంధ్రము, తెలుగు, తెనుగు అనే పదాలు సాధారణంగా సమానార్థకాలుగా ప్రచారంలో ఉన్నాయి. నన్నయ నాటికే జాతి, దేశ, భాషాపరంగా ఈ మూడు పదాలు ప్రయోగంలో ఉన్నాయి. వీటిలో తెలుగు, తెనుగు పర్యాయ పదాలుగా చెలామణిలో ఉన్నాయి. ఆంధ్రము క్రీ.పూ. 7 శ॥ నాటికే జాతిపరంగా ప్రయుక్తం అయింది. అంటె అప్పటికెంతో ముందు కాలంనుంచే ఈ జాతి జనులు నివసించారనటంలో సందేహంలేదు. అయితే నన్నయ భారతాంధ్రీకరణమే ఆంధ్ర భాషలో ఆదికావ్యంగా పండితులు పరిగణించారు. అంటే నన్నయకు పూర్వం తెలుగు భాష కాని, సాహిత్యం కాని అసలు లేదని భావించనవసరంలేదు. జాతితోనే భాష ప్రారంభం అవుతుందు. భాషతోనే సాహిత్యం కూడ ఏదో ఒక రూపంలో ఉండి ఉంటుంది. కాల గమనంలో రాజకీయ, సాంస్కృతిక పరిణామాల నేపథ్యంలో తెలుగు భాష వివిధ సంస్కృతుల, భాషా సాహిత్యాల నడుమ నన్నయ నాటికి సంపూర్ణ వికాసాన్ని పొందింది. నన్నయ భారత రచనకు అంతకు పూర్వం జరిగిన పరిణామాలు దోహదంచేశాయని గట్టిగా విశ్వసించవచ్చు. లభ్యమయ్యే కొద్దిపాటి ఆధారాలను క్రోడీకరించి నన్నయ పూర్వ యుగంలోని ఆంధ్ర భాషాభివృద్ధిని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### 1.5.1. ఆంధ్రభాష ప్రాచీనత :

క్రీ.పూ. 225 నుంచి క్రీ.శ. 225 దాకా సుమారు 450 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించిన ఆంధ్రశాతవాహనులు రాజభాషగా ప్రాకృతాన్ని ఆదరించారు. అప్పటి ప్రజాభాష తెలుగు. విద్వద్భాషగా సంస్కృతం చెలామణి అయింది. శాతవాహనులు ఆంధ్రభాషను రాజభాషగా ఆదరించక పోయినా క్రీ.పూ. 7 శ॥నికి పూర్వమే ఈ జాతిజనుల ఉనికిని తెలిపే ఆధారాలు లభ్యం అవుతున్నాయి. 'ఆంధ్ర' పదం మొదట ఐతరేయ బ్రాహ్మణంలో 'ఆంధ్ర' అనే రూపంలో జాతిపరంగా కనిపిస్తుంది. విశ్వామిత్రుడు తన ఆజ్ఞను అతిక్రమించిన ఏబదిమంది కుమారులను, వారి సంతతివారిని అంధ్రులు, పుళిందులు, పూండ్రులు, శబరులు అనే పేరుతో ఆటవికులై ఆర్య భూముల సరిహద్దులలో నివసించేటట్లు శాసించాడనే ఉదంతం ఇందులో ఉంది. ఇతిహాస పురాణాలు దాక్షిణాత్య జాతులతో కలిపి ఆంధ్రులను ప్రస్తావించాయి. మహాభారత రామాయణాల్లో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. అశోకుని శాసనాల్లోను, బౌద్ధజాతక కథల్లోను ఆంధ్రజాతి ప్రస్తావన ఉంది. బుద్ధఘోషుడు వినయపిటక గ్రంథానికి వ్యాఖ్యానం వ్రాస్తూ ఆ గ్రంథానికి వచ్చిన పూర్వ వ్యాఖ్యానాల్లో 'అంధక అట్ట కథ' అనే దాన్ని పేర్కొన్నాడు. భాగవత పురాణంలోని అంధకులే ఆంధ్రులని కొందరు భావిస్తున్నారు. మెగస్తనీస్ ఆంధ్రుల సైనికబలాన్ని ప్రస్తావించాడు. మనుస్మృతిలో కూడ ఆంధ్రుల ప్రస్తావన ఉంది. ఈ ఆధారాలను పరిశీలిస్తే చరిత్రకు అందని కాలంలోనే ఆంధ్రులనే ఒక జాతి ఉన్నదని తెలుస్తుంది. వారు శాతవాహనులకు చాలాకాలం

పూర్వమే చిన్నవో పెద్దవో రాజ్యాలు స్థాపించారని భావించవచ్చు. ఆ జాతి జనుల దైనందిన వ్యవహారానికి ఏదో ఒక రూపంలో భాష ఉండి ఉంటుంది. మౌఖిక రూపంలో జానపద సాహిత్య సృష్టి కూడ జరిగి ఉంటుందని నమ్మవచ్చు. అనంతర కాలంలో ఆంధ్రభాష లిపిని రూపొందించుకొని బౌద్ధవాఙ్మయంలోను శాసనాల్లోను సంస్కృత ప్రాకృత భాషల సాన్నిహిత్యంతో క్రీ.శ. 6 శ॥ నాటికి అధికార భాష స్థాయిని పొందింది.

### 1.5.2. ప్రాఙ్నన్నయ యుగం - తెలుగు భాషా పరిణామం :

నన్నయకు పూర్వం ఆంధ్రభాషా స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఆ కాలంలో వచ్చిన సంస్కృత ప్రాకృత గ్రంథాలు, తెలుగు దేశాన్ని పాలించిన రాజులు వేయించిన శాసనాలే ఆధారం. శాతవాహనులు బౌద్ధమతాన్ని ఆదరించి ప్రాకృతాన్ని రాజభాషగా స్వీకరించారు. వీరి శాసనాలు ప్రాకృత భాషలో ఉన్నాయి. వీరి కాలంలో వెలసిన బృహత్కథ, గాథాసప్తశతి గ్రంథాలు ప్రాకృతంలోనే ఉన్నాయి. శాతవాహనుల అనంతరం ఆంధ్రదేశం చిన్నచిన్న భాగాలుగా చీలి భిన్న రాజవంశాల ఏలుబడిలో ఉంది. ఈ రాజ వంశాలలో ఇక్ష్వాకులు (క్రీ.శ. 225 - క్రీ.శ. 306), బృహత్ఫలాయనులు (క్రీ.శ. 270 - క్రీ.శ. 285), ఆనంద గోత్రికుల (క్రీ.శ. 4 శ॥) శాసనాలు ప్రాకృతంలో ఉన్నాయి. శాలంకాయనులు (క్రీ.శ. 300 - క్రీ.శ. 420), విష్ణుకుండినుల (క్రీ.శ. 420 - క్రీ.శ. 624) కాలంలో ప్రాకృత భాష ప్రాబల్యం క్రమంగా తగ్గి సంస్కృత భాషకు ప్రాధాన్యం క్రమంగా పెరిగింది. ఈ కాలంలోనే బౌద్ధమత ప్రాబల్యం క్రమంగా క్షీణించనారంభించింది. శాలంకాయనులు, పల్లవుల (క్రీ.శ. 300 - క్రీ.శ. 600) శాసనాలు కొన్ని ప్రాకృత భాషలోను, కొన్ని సంస్కృత భాషలోను కనిపిస్తున్నాయి. కడపటి పల్లవులు బ్రాహ్మణ మతావలంబులై శాసనాలను పూర్తిగా సంస్కృత భాషలోనే వేయించారు.

### 1.5.3. గాథాసప్తశతిలోని తెలుగు పదాలు :

క్రీ.శ. 1వ శతాబ్దంలో గుణాఢ్యుడు ప్రాకృత భాషలో రచించిన బృహత్కథ నేడు లభించటంలేదు. పింగళి లక్ష్మీకాంతం గారు గుణాఢ్యుడు తెలుగువాడేనని భావించారు.

క్రీ.శ.1వ శతాబ్దంలోనే హాలుడు సంకలనం చేసిన గాథాసప్తశతి గ్రంథంలో అత్త, అమ్మి, కంటె, పిలుఅ (పిల్ల), కరణి, బోణ్ణి, మోడి, రుంప (రంపం), సావులి (శాలువ), ఫలహి (పత్తి), వంటి తెలుగు దేశ్య పదాలు కనిపిస్తున్నాయని భాషాపరిశోధకులు గుర్తించారు.

### 1.5.4. సంస్కృత ప్రాకృత భాషా శాసనాల్లో కనిపించే తెలుగు పదాలు :

క్రీ.శ. 1వ శ॥ చెందిన అమరావతీ స్థూపంలోని ఒక ప్రాకృత భాషా శాసనంలో 'నాగబు' అనే తెలుగు పదం కనిపిస్తోంది. ఇందులోని 'బు' అనంతరకాలంలో అమహద్వాచక ప్రథమైక వచన ప్రత్యాయం 'ము', 'మ్బు' కు రూపాంతరమని, అదే తొలి తెలుగు మాట అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారి అభిప్రాయం.

క్రీ.శ. 1వ శతాబ్దానికే తెలుగు భాష వ్యవహారంలో ఉందని చెప్పటానికి క్రీ.శ. 1 - 6 శతాబ్దాల మధ్య వెలసిన రాజుల శాసనాలే ప్రబల సాక్ష్యాలు. ఈ శాసనాల్లో ప్రధానంగా దాత, ప్రతిగ్రహీత, దానం ఇవ్వబడ్డ కాలం దానం ఇచ్చిన వస్తువును ప్రధానంగా పేర్కొంటారు. దాన విషయం గ్రామమో, కొంత భూభాగమో అయితే దాని విస్తీర్ణము, సరిహద్దులు వివరించబడతాయి.

క్రీ.శ. 6వ శ॥ ముందు ఆంధ్రదేశంలో లభించిన శాసనాల్లో ప్రాకృత, సంస్కృత భాషల మధ్య ప్రజాభాష అయిన తెలుగు భాషా పదాలు కనిపించటం క్రమంగా వృద్ధి చెందింది. ఆ పదాల్లో అనేక గ్రామ నామాలు, వ్యక్తి నామాలు, గృహోపకరణాలు అధికంగా ఉన్నాయి. ఊరు, పఱ్ఱు, పల్లి, వాడ, చేడు, కుదురు, రేవు, పాక మొదలైన వాటితో అంతమయ్యే వేపూరు, కూడూర,

ఆంతుకూరు, నిరిపఱ, పెణకపఱ్ఱు, చెఙ్చెఱువు, సారపల్లి, ఊఱువుపల్లి, తెల్లపల్లి, కురవాడ, చూయిపాక, నఱాచేడు, కొలవాల, కురవక, కడాకుదురు, విళవట్టి మొదలైన గ్రామ నామాలు కనిపిస్తున్నాయి. గోలశర్మ, కొట్టిశర్మ, దొడ్డిస్వామి వంటి వ్యక్తి నామాలు కనిపిస్తున్నాయి.

ఈ కాలంలోని తెలుగు భాషలో ద్రావిడ భాషావర్ణమైన ళ (Zha) కారం వ్యవహారంలో ఉండటమే కాకుండ తెలుగు పదాలకు మొదటి అక్షరంగా కూడ కనిపిస్తుంది. ఉదా. (Zha)ందులూరు, చో(Zha) మహారాజు మొ॥నవి. అయితే ఈ అక్షరం నన్నయ నాటికే తెలుగులో ఉచ్చారణ కోల్పోయి 'డ' కారంగాను, 'ళ' కారంగాను రూపాంతరం చెందింది. శకట రేఫమే (ఱ) కాక 'న' కారముతో కూడిన 'న్ఱ' అనే సంయుక్తాక్షరం ఒకటి వాడుకలో ఉంది. ఉదా. త్ాన్ఱి కొన్ఱ, పాతకున్ఱ మొ॥నవి. ఈ 'న్ఱ' తరువాత కాలంలో 'ండు' గా మారింది. ఉదా. అవన్ఱు-వాండ. ఈ కాలపు భాషలో బహువచన ప్రత్యయం 'ళ' కారం కనిపిస్తోంది. ఇది మూల ద్రావిడంలోని 'కళ్' అనే దాని రూపాంతరం కావచ్చు. ద్రావిడ భాషలోని 'క' కారము 'చ' కారంగా మారటం ఈ నాటికే జరిగినట్లు తెలుస్తుంది. మూలద్రావిడ పదం 'కెఱుయ్' నుంచి 'చెఱువు' రూపాంతరం చెందింది. సంస్కృతంలోని పుంలింగ శబ్దాలు, అవి తిర్యగ్జడ వాచకాలైనపుడు తెలుగు భాషా సంప్రదాయాన్నిబట్టి అమహత్తులై 'వు, బు, ంబు' ప్రత్యయాలను గ్రహించి వాడుకొనే విధానం తెలుగులోకి ఈ కాలానికే వచ్చింది. ఉదా. సంవత్సరంబు, నాగంబు మొ॥నవి. ఈ నాటికే తెలుగులో సమాసప్రక్రియ కూడ ప్రారంభం అయినట్లు చెంచెఱువు (చెన్ను+చెఱువు), ముయ్యేలకూటువ (మూడు+ఎల్లకూటువ) వంటి పదాల వల్ల తెలుస్తుంది. దీనినిబట్టి ఈనాటి శాసనాల్లో తెలుగుభాష అస్తిత్వంతోపాటు దాని పరిణామక్రమం కూడ వ్యక్తం అవుతుంది.

### 1.5.5. తెలుగు భాషలో కన్పించే శాసనాల్లోని భాషా స్వరూపం :

క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి పూర్తిగా తెలుగు భాషలో వేయించిన శాసనాలు కనిపిస్తున్నాయి. ఇవి ప్రధానంగా గద్యరూపంలో ఉన్నాయి. తెలుగును రాజభాషగా ప్రకటించి దాని ప్రాభవానికి కృషి చేసిన ఘనత రేనాటి చోళులకు దక్కుతుంది.

ద్రావిడ భాషా పండితులు కడప మండలం కమలాపురం తాలూకా ఎఱ్ఱగుడిపాడు గ్రామంలో రేనాటి చోడవంశీయుడు ఎఱుకన ముత్తరాజు క్రీ.శ.575లో వేయించినట్లు లభించిన శాసనం మొట్టమొదటి ఆంధ్ర భాషామయ శాసనం అని నిర్ధారించారు.

క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన శాసనాల్లో ధనంజయుని కలమళ్ల శాసనము, విక్రమేంద్రవర్మ చిక్కుళ్ల శాసనము, పుణ్యకుమారుని పొట్లదుర్తి మాలెపాడు శాసనము ముఖ్యమైనవి.

క్రీ.శ. 7వ శతాబ్దం ప్రారంభం నుంచి కనిపించే శాసనాల్లో సంస్కృతం, ప్రాకృత భాషా పదాలతో కలగలుపుగా తెలుగు వాక్యాలు కనిపిస్తాయి. వీటిలో క్రీ.శ. 633 నాటి జయసింహ వల్లభుని విప్పర్ల శాసనం మొదటిది. ఈ శాసనంలో 'విజయ రాజ్య సంవత్సరంబుళ్' అనే బహువచన ప్రయోగం కనిపిస్తుంది. క్రీ.శ. 680 నాటి మంగిదొగరాజు లక్ష్మీపురం శాసనం రెండవది. ఈ శాసనంలో దొంగరతము, కొత్తవి, చోళి, వ్రచ్చిన మొదలైన తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. క్రీ.శ. 740 నాటి అహదహనకర శాసనం మూడవది. ఈ శాసనం ఐదవ విష్ణువర్ధనుని కాలంలోనిదని కొందరు, ఎనిమిదవ విష్ణువర్ధనుని కాలంలోనిదని మరికొందరు భావించారు. ఈ శాసనంలోని భాష లక్ష్మీపురం శాసనంలోని భాషకు సమీపంగా ఉంది. ఈ శాసనాల్లోని భాష వచనంలో ఉంది. ఇవి తెలుగు భాషా శాసనాలే అయినప్పటికీ ప్రాకృత పదాలు ఎక్కువగా ఉండటంవల్ల ఆ తెలుగు ఇప్పుడు మనకు అర్థం కాదు. ఈ శాసనాల్లోని భాషకు క్రీ.శ. 9వ శ॥ చివరి భాగంలో వేయించిన శాసనాల్లోని భాషకు ఎంతో వ్యత్యాసం కనిపిస్తుంది. రానురాను సంస్కృత ప్రాకృత భాషా ప్రాబల్యం తగ్గి దేశీయత స్పష్టం అవుతుంది.

ప్రాఙ్నన్నయ కాలపు తెలుగు శాసనాల్లో 'అచ్చెర్వు, అణపోతులు, అస్వమేధంబు, కొట్టంబు, కమ్మరి, కొమర, దమ్మపురము,

దోసంబు, దుగరాజు, పన్నస, భటార, బెజవాడ, బోయ, రట్టగుళ్ల వంటి ప్రాకృత భాషా పదాలు అనేకం కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామ నామాలు ప్రాకృత స్వరూపాన్ని విడిచిపెట్టి దేశీయతను సంతరించుకోవటం గమనించవచ్చు.

ఉదా॥ కొడతూర - నడతూరు,
ధన్నకడ - దఞకడ - ధాన్యకటక
విరిపర - విత్పఱ్ఱు - విప్పఱ్ఱు మొదలయినవి

అట్లానే 'భద్దజ్జ', 'నందిజ్జ' మొదలైన వ్యక్తుల పేర్లలోని 'అజ్జ' తరువాతి కాలంలో 'అయ్య' గా ప్రాచుర్యం పొందింది.

## 1.6 ప్రాఙ్నన్నయ యుగం - తెలుగు సాహిత్య పరిణామం :

ఏ భాషలోనైనా జానపద సాహిత్యం భాషాభివృద్ధితోనే జనిస్తుంది. అది మౌఖిక రూపంలో ప్రచారం అవుతుంది. నన్నయకు పూర్వం తెలుగు భాషలో జానపద గేయాలున్నట్లు ఆయా కవుల రచనల్లో పేర్కొన్నదాన్నిబట్టి తెలుస్తుంది. నన్నయ భారతంలో 'నాగీ గీతాల'ను పేర్కొన్నాడు. నన్నెచోడుడు 'ఊయల పాటలు, గౌడు గీతాల'ను కుమారసంభవంలో పేర్కొన్నాడు. పాల్కురికి సోమన 'తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు, ఆనంద పదాలు, శంకర గీతాలను ప్రస్తావించాడు. నన్నయ నాటికి ప్రచారంలో ఉన్న దేశికవిత పదగేయ రూపంలో ఉందని భావించవచ్చు.

నన్నయ మహాభారతాన్ని సంస్కృత ఛందస్సులోని పద్య రీతులను, దేశీయ పద్యరీతులను కలగలిపి గద్యపద్యాత్మకంగా తీర్చిదిద్దాడు. నన్నయకు రెండు శతాబ్దాలకు పూర్వంనుంచి లభిస్తున్న శాసనాల్లో గద్యపద్యాత్మకమైన తెలుగు భాషా వికాసం పొడకడుతుంది. శాసనాల్లోనేకాక మాత్రగణబద్ధములు, అక్షరగణబద్ధములైన పద్యరచన విరివిగా సాగి ఉంటుంది. కొద్దిపాటి గ్రంథరచన కూడ జరిగి ఉన్నట్లు భావించవచ్చు. క్రీ.శ. 9 - 11 శతాబ్దాల మధ్య లభ్యమయ్యే కొన్ని శాసనాలను పరిశీలిస్తే ఈ అంశం స్పష్టం అవుతుంది.

పద్యరూపంలో ఉన్న శాసనాలు ఎక్కువ భాగం తూర్పుచాళుక్యరాజులకు చెందినవి. ఇంతవరకు లభించిన వాటిలో మొట్టమొదటి పద్యశాసనం క్రీ.శ. 848 నాటి అద్దంకి శాసనము. ఈ శాసనం గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు వేయించింది. ఈ శాసనంలో గద్యతో పాటు పద్యరచన ఉండటం ఒక కొత్త పరిణామం. ఆ పద్యం దేశీ ఛందమైన తరువోజ కావటం విశేషం. కంద పద్యం కూడ కనిపిస్తుంది. ఈ శాసనంలో కొన్ని వికృతరూపాలున్నప్పటికి మొత్తం మీద సులభంగానే అర్థం అవుతుంది. దీర్ఘసమాసాలు అంతగా కానరావు. దేశీయపదాలు ప్రాకృత సంపర్కాన్ని అంతగా కలిగిలేవు. అద్దంకి శాసనంలోని తరువోజ పద్యాన్ని బట్టి గుణగ విజయాదిత్యుడే ఆంధ్రభాషలో పద్యవిద్యాపోషకులలో ప్రథముడని భావించవచ్చు.

క్రీ.శ. 848 నాటి గుణగ విజయాదిత్యుని కందుకూరు శాసనంలో సీసపద్యం కనిపిస్తుంది. ఈ శాసనం కేవలం పద్యమయం. ఇందులో కనిపించే సీస పద్యం ఏ పాదానికి ఆ పాదం తెగిపోని గునుగుసీసమని కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు గుర్తించారు. ఇందులో తత్సమపదాల ప్రయోగం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సీసపద్యం క్రింద తేటగీతి ఉన్నది.

క్రీ.శ. 9వ శతాబ్దంలో లభించిన శాసనాల్లో చాళుక్య భీమరాజు ధర్మవరంలో వేయించిన రెండు శాసనాలు ముఖ్యమైనవి. ఈ భీమరాజు గుణగ విజయాదిత్యుని తమ్ముడు విక్రమాదిత్యుని కుమారుడు. ధర్మవరం నెల్లూరు జిల్లాలో ఉంది. వీటిలో మొదటి ధర్మవరం శాసనం (క్రీ.శ. 849) లో ఒక సీసపద్యం, కొంత గద్యం ఉంది. సీసపద్యం పాదాలు వేనికవే విడిగా ఉన్నాయి. తత్సమ పదాల కంటె దేశ్య పదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. సీస పాదాల్లో ప్రాసయతి పాటించబడింది. ఈ ప్రాసయతి సంప్రదాయం నన్నయలో కనిపిస్తుంది. సీసపద్యం చివర ఆటవెలది ఉంది. ఇందులోని గద్య 'అనేక గుణగణాలంకృత సమస్త మహీమండల ప్రకాశిత కీర్తి' అని దీర్ఘ సమాస ఘటితంగా ఉంది.

రెండవ ధర్మవరం శాసనం (క్రీ.శ. 897) లో సంస్కృత భూయిష్టమైన గద్యపద్యాత్మక రచన కనిపిస్తుంది. తెలుగు పద్యరచనపై సంస్కృతం ప్రభావం క్రమంగా ప్రబలం కావటం ఆరంభమైంది. ఇందులో విజయాదిత్య పాదపద్మ భ్రమరాయమాణ' 'సమస్త రాజ్యభర నిరూపిత మహామంత్రాధిపతి' వంటి దీర్ఘ సమాసాలు ఉన్నాయి.

ధర్మవరం శాసనం తరువాత పద్యమయంగా లభించే శాసనం యుద్ధమల్లుని బెజవాడ శాసనం. ఇది ఒకే శాసనం కాదని తాతామనుమలైన ఇద్దరు యుద్ధమల్లులు భిన్నకాలాల్లో వ్రాయించిన రెండు శాసనాలని దివాకర్ల వెంకటావధాని గారు తీర్మానించారు. వీటిలో మొదటి శాసనం క్రీ.శ. 885 ప్రాంతంలో మొదటి యుద్ధమల్లుని కాలంలోను, రెండవ శాసనం క్రీ.శ. 927 - 934 మధ్య రెండవ యుద్ధమల్లుని కాలంనాటివని పండితులు నిర్ధారించారు. ఈ రెండింటిలోని మొదటి శాసనంలో నాలుగు మధ్యాక్కరలు, కొంత వచనం ఉంది. రెండవ శాసనంలో ఒక మధ్యాక్కర ఉంది. మధ్యాక్కర దేశీఛందస్సుకు చెందింది. ఈ మధ్యాక్కరలు నన్నయ మధ్యాక్కరలకు దగ్గరగా ఉన్నాయి. నన్నయ, ఎఱ్ఱన తప్ప తరువాతి కవులెవ్వరూ ఈ పద్యాన్ని తమ గ్రంథాల్లో వ్రాయలేదు.

రెండవ యుద్ధమల్లుని కుమారుడైన బాదక మహారాజు క్రీ.శ. 980లో వేయించిన 'ఆరుంబాక' సంస్కృత భాషా శాసనంలో కందపద్య లక్షణాలతో సంస్కృతంలో ఒక పద్యం ఉంది. కందము తెలుగు ఛందము. అప్పటికే ఈ పద్యం ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తుంది.

క్రీ.శ. 9వ శతాబ్దం నాటి సంస్కృత భాషాశాసనాల్లో చంపకమాల, ఉత్పలమాల, మత్తేభం వంటి వృత్త పద్యాలు గోచరిస్తున్నాయి. నన్నయకు పూర్వం తరువోజ, మధ్యాక్కర, సీసము వంటి దేశీ పద్యాలు శాసనాల్లో కనిపించటంతో పాటు కవుల రచనల్లోను ప్రచారంలోకి వచ్చి ఉంటాయి. సంస్కృత భాషాభిమానులైన పండితులు దేశీఛందస్సులను ఆదరించకుండ చంపకమాల, ఉత్పలమాల వంటి వృత్తాలలో రచనలు సాగించి ఉంటారు. ఇలాంటి ప్రభావంతోనే కావచ్చు క్రీ.శ. 1000 నాటిదని భావిస్తున్న విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు కనిపిస్తున్నాయి. ఈ పద్యాలు తత్సమ దేశ్యపద మిశ్రమమైన రచనతో కూడి నన్నయ భారతంలోని పద్యశైలిని తలపిస్తున్నాయి.

## 1.7 నన్నయకు పూర్వం ఉన్న తెలుగు భాషా కవులు :

నన్నయకు ముందు జానపద సాహిత్య స్రష్టలయిన కవులు ఊరుపేరు లేకుండ అజ్ఞాతంగానే ఉన్నారు. వారు రచించిన సాహిత్యమంతా ప్రజల వాక్కులో ప్రచారమై సామాన్యులకు ఆనందాన్ని కలిగించింది. ఆనాడున్న కొన్ని సాహిత్య రీతులను నన్నయాదులు తమ రచనల్లో పేర్కొన్నారు. దీనిని బట్టి నన్నయకు పూర్వం దేశిసాహిత్య స్రష్టలైన అజ్ఞాత కవులెందరో ఉన్నట్లు భావించవచ్చు.

అద్దంకి శాసనాన్ని వేయించిన పండరంగడే ఆ శాసనాన్ని రచించాడని నిడదవోలు వెంకటరావు గారు భావించారు. ఈ ఊహ నిజమైతే పండరంగడు సేనానియే కాక కవి కూడ అని, సంస్కృత వృత్తాలను తెలుగులోకి తెచ్చేందుకు అతడే మార్గదర్శకుడని చెప్పవచ్చు.

యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని శ్రీపతి పండితుడు రచించాడని నిడదవోలు వెంకటరావు గారు తీర్మానించారు.

ఆరుంబాక శాసన రచయిత అయ్యనభట్టు, క్రీ.శ. 1022 నాటి రాజరాజ కోరుమిల్లి శాసనాన్ని రచించిన చేతనభట్టు వంటివారు తెలుగు కవిత్వం చెప్పటంలో ప్రావీణ్యం కలవారని తెలుస్తుంది.

నన్నయకు పూర్వం తెలుగులో కవిత్వ రచన సాగింది, తెలుగులో కవిత్వం రచించగల కవులున్నారు అనేందుకు అప్పటి శాసనాల్లోని పద్యాలే బలమైన ఆధారం.

చాళుక్య రాజులే ఆంధ్రదేశంలో దేశికవితను నెలకొల్పి అపారమైన ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఈ విషయాన్నే నన్నెచోడుడు తన కుమారసంభవంలో

"మును మార్గ కవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చాళుక్య రాజు మొదలుగ పలువుర్"

అని ప్రస్తుతించాడు.

## 1.8 గుర్తుంచుకోదగిన ముఖ్యవిషయాలు :

నేటికాలంలో ఆంధ్రము, తెలుగు, తెనుగు పదాలు జాతి, దేశ, భాషాపరంగా సమానార్థకాలుగా ప్రయోగించబడుతున్నాయి. ఆంధ్రము క్రీ.పూ. 7వ శతాబ్దానికి పూర్వమే జాతిపరంగా కనిపిస్తున్నది. అశోకుని శాసనాల్లోను, బౌద్ధ జాతక కథల్లోను ఆంధ్రజాతి ప్రస్తావన ఉంది.

మహాభారతం, రామాయణం, భాగవత గ్రంథాల్లో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. మెగస్తనీస్ ఆంధ్రుల సైనిక బలాన్ని ప్రస్తావించాడు. మనుస్మృతిలో ఆంధ్రుల ప్రస్తావన ఉంది. శాతవాహనులు ఆంధ్రులమని చెప్పుకొన్నప్పటికీ ప్రాకృతాన్ని రాజభాషగా ఆదరించారు.

క్రీ.శ. 1వ శతాబ్దం నాటి గాథాసప్తశతిలో తెలుగు పదాలు కనిపిస్తున్నాయి. బృహత్కథ రచించిన గుణాఢ్యుడు తెలుగువాడే.

క్రీ.శ. 1వ శతాబ్దంలోని అమరావతి స్తూపంలోని ఒక ప్రాకృత శాసనంలో 'నాగబు' అనే తెలుగు పదం కనిపిస్తోంది. ఈ పదమే లిఖిత రూపంలో కనిపించే తొలి తెలుగు మాట అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారు అభిప్రాయపడ్డారు.

శాతవాహనుల అనంతరం ఆంధ్రదేశాన్ని చిన్నచిన్న రాజ్యాలుగా పాలించిన రాజులు కొందరు ప్రాకృతాన్ని, మరి కొందరు సంస్కృతాన్ని ఆదరించారు.

క్రీ.శ. 1 - 6 శతాబ్దాల మధ్య కాలంలో ఆంధ్రదేశంలో లభ్యం అయ్యే ప్రాకృత, సంస్కృత భాషా శాసనాల్లో వ్యక్తి నామాలు, గ్రామ నామాలు, గృహోపకరణాల పేర్లు కొన్ని తెలుగు పదాలు కనిపిస్తున్నాయి.

ఈ కాలపు శాసనాల్లో లభ్యమైన తెలుగు పదాలు మూల ద్రావిడంతో తెలుగు భాషకున్న జన్య జనక సంబంధాన్ని తెలుపుతాయి.

క్రీ.శ. 575 నాటి ఎఱ్ఱగుడిపాడు శాసనం తొలి తెలుగు భాషా శాసనమని భాషా శాస్త్రవేత్తలు నిర్ణయించారు.

తెలుగును రాజభాషగా చేసిన గౌరవం రేనాటి చోడులకు దక్కుతుంది. వారి శాసనాలు తెలుగు భాషలో ఉన్నాయి.

క్రీ.శ. 6వ శతాబ్దంలోని తెలుగు శాసనాల్లో ప్రాకృత పదాలు ఎక్కువగా ఉన్నాయి.

క్రీ.శ. 7వ శతాబ్దం నుంచి కనిపించే శాసనాల్లోని తెలుగు వాక్యాలలో ప్రాకృత సంస్కృత పదాలు కలగలుపుగా కనిపిస్తాయి. ఈ కాలపు శాసనాలు గద్యంలోనే ఉన్నాయి.

క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి పద్యమయమైన, పద్యగద్యాత్మకమైన తెలుగు శాసనాలు లభిస్తున్నాయి. ఈ కాలపు శాసన

భాషలో ప్రాకృత భాషా ప్రభావం క్రమంగా తగ్గుతూ, సంస్కృత భాషా సాహిత్యాలతో తెలుగు సాన్నిహిత్యం పెంచుకోవటం కనిపిస్తుంది.

ఎన్నో సంస్కృత పదాలు తత్సమ, తద్భవాలుగా తెలుగులో వ్యాప్తిలోకి వచ్చాయి.

శాసనాల్లో దేశీఛందస్సులైన తరువోజ, మధ్యాక్కర, సీసం వంటి పద్యాలతో పాటు క్రీ.శ. 1000 నాటికి సంస్కృత వృత్తాలయిన ఉత్పలమాల, చంపకమాల వంటి పద్యాలు కనిపిస్తున్నాయి.

నన్నయకు ముందు కొందరు కవులు తెలుగులో లఘు కావ్యాలు రచించి ఉంటారని విశ్వసించవచ్చు.

ఈ పరిణామాలన్నీ నన్నయభట్టు తెలుగులో మహాభారత నిర్మాణానికి భూమికగా ఉపకరించాయి.

## 1.9 ప్రశ్నలు :

1. ప్రాఙ్నన్నయ యుగంలోని తెలుగు భాషా పరిణామాన్ని వివరించుము.
2. ప్రాఙ్నన్నయ యుగంలోని తెలుగు సాహిత్య పరిణామాన్ని వివరించుము.

## 1.9.1. లఘు ప్రశ్నలు :

1. ఆంధ్రభాష ప్రాచీనతను గురించి వ్రాయుము.
2. ప్రాకృత, సంస్కృత భాషా శాసనాల్లో కనిపించే తెలుగు పదాలను వివరించుము.
3. క్రీ.శ. 9వ శతాబ్దానికి పూర్వపు తెలుగు శాసనాలు ఆధారంగా, తెలుగు భాషకు ద్రావిడ భాషతో కల జన్యజనక సంబంధాన్ని వివరించుము.
4. క్రీ.శ. 10వ శతాబ్దంలోని తెలుగు పద్యరచనా విధానాన్ని వివరించుము.

## 1.10 ఆధార గ్రంథాలు :


1. ఆంధ్రసాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగుసాహిత్య సమీక్ష - భాగం-1 - ఆచార్య జి. నాగయ్య
3. తెలుగుసాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా॥ నా॥ శాస్త్రి



డాక్టర్ గుంటుపల్లి రామారావు
సి-122, యస్.వి.యన్. కాలనీ
గుంటూరు - 522 006

పాఠం - 2

# నన్నయ యుగం

2.0 ఉద్దేశ్యం
2.1 ప్రవేశిక
2.2 నన్నయ ఆదికవి - ఆంధ్ర మహాభారతం తొలి తెలుగు కావ్యం
2.3 మహాభారతాంధ్రీకరణము - రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహము
2.4 నన్నయ మహాభారతాంధ్రీకరణ విధానము
2.5 నన్నయ కవితారీతులు
2.6 నన్నయ శైలి
2.7 నన్నయ ఇతర రచనలు
2.8 నన్నయ సమకాలికులు
2.9 గుర్తుంచుకోదగిన ముఖ్య విషయాలు
2.10 ప్రశ్నలు
2.11 ఆధారగ్రంథాలు

## 2.0 ఉద్దేశ్యం

ఈ పాఠ్య భాగం చదివింతరువాత ఈ క్రింది విషయాలు తెలుసుకోవచ్చు.

ఆంధ్రమహాభారతం తొలి తెలుగు కావ్యం. సంస్కృత దేశీ ఛందో రీతులను మేళవించి నన్నయ తెలుగు సాహిత్యానికి సంస్కారాన్ని సమకూర్చి అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

ఆంధ్ర భాషాభిమానం, వైదిక సంప్రదాయ విశ్వాసం, బ్రాహ్మణ మతాభిమానం ముప్పేటల పెనవేసుకొన్న రాజరాజ నరేంద్రుడు నన్నయను ఈ మహత్కార్యానికి ప్రోత్సాహించాడు.

వ్యాసుని అభిహితార్థం ప్రస్ఫుటంచేయటమే నన్నయ భారతాంధ్రీకరణం పరమార్థం.

నన్నయ సుమారు నాలుగువేల గద్యపద్యాలతో ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలోని కొంత భాగాన్ని అనువదించాడు.

యధా మాతృకమైన స్వతంత్రానువాదమే నన్నయ అనువాద విధానం. ప్రసన్నకథాకలితార్థ యుక్తి, అక్షరరమ్యత, రుచిరార్థ సూక్తి నిధిత్వము నన్నయ కవితా లక్షణాలు.

నన్నయ రచించినట్లుగా ప్రచారంలో ఉన్న గ్రంథాలేవీ ఆయన రచించలేదు.

## 2.1 ప్రవేశిక :

శాతవాహనులు తాము ఆంధ్రులమని చెప్పుకొన్నప్పటికీ పరిస్థితులను బట్టి ప్రాకృతాన్ని రాజభాషగా స్వీకరించారు. అప్పటి ప్రజాభాష అయిన తెలుగులో మౌఖికరూపంలో జానపద సాహిత్యం ప్రజాసామాన్యంలో ప్రచారంలో ఉంది. క్రీ.శ. 1వ శతాబ్దం

నుంచి ప్రాకృత, సంస్కృత శాసనాలలో కనపడుతూ వచ్చిన తెలుగు భాష చాళుక్య రాజుల ఆదరణలో రాజభాష స్థాయిని పొందింది. ఆ రాజుల ఆదరాభిమానాలవల్ల సంస్కృత ప్రాకృత భాషల సహాయంతో తత్సమ తద్భవాత్మక భాషగా మారి క్రీ.శ. 11వ శతాబ్దం నాటికి నన్నయ భారతాంధ్రీకరణ రూపంలో ప్రామాణిక కావ్యభాషగా వర్ధిల్లింది. చాళుక్యులు ఆంధ్ర భాషాపోషకులుగా ఖ్యాతిచెందారు. రాజరాజ నరేంద్రుడు, నన్నయభట్టు ఆంధ్ర సాహిత్య వికాసానికి మార్గదర్శకులయ్యారు.

## 2.2. నన్నయ ఆదికవి - ఆంధ్రమహాభారతం తొలి తెలుగు కావ్యం :

నన్నయకు ఆదికవి, వాగనుశాసనుడు అనే బిరుదులు ఉన్నాయి. మారన మార్కండేయ పురాణంలో 'ఆంధ్ర కవితా విశారదు'డని, కొలని గణపతిదేవుడు' ఆంధ్ర కావ్యపథము తీర్చినవాడ'ని, రామరాజ భూషణుడు వసుచరిత్రలో 'బహుళాంధ్ర మయోక్తిమయ ప్రపంచమును సృజియించిన వాడు' అని నన్నయను ప్రస్తుతించారు. ఈ స్తుతులలో నన్నయ ఆదికవి అనే అంశం స్ఫురిస్తుంది కాని వాచ్యంకాలేదు.

నన్నయ ఆదికవి అనటాన్ని బట్టి అతనికి ముందు తెలుగులో అసలు కవిత్వ నిర్మాణమే జరగలేదని అనలేము. క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి లభించే శాసనాలవల్ల తేటగీతి, ఆటవెలది, తరువోజ, మధ్యాక్కర వంటి పద్యాలున్నట్లు తెలుస్తుంది. అవేకాక తుమ్మెద పదాలు, ప్రభాత పదాలు, వెన్నెల పదాలు, వాలేశు పదాలు వంటివి జనసామాన్యంలో ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ దేశి కవిత్వమే కాని ప్రౌఢ సాహిత్యం కాదు. సంస్కృతాభిమానులైన పండితులు దేశి కవిత్వాన్ని ఆదరించకపోవటంవల్ల క్రీ.శ. 1000 ప్రాంతంనుంచి వచ్చిన తెలుగు శాసనాల్లో చంపకమాల, ఉత్పలమాల వంటి సంస్కృత వృత్తాలు కనిపిస్తున్నాయి. నన్నయభట్టు మధ్యాక్కర, ఆటవెలది, సీసము, తేటగీతి వంటివానిని చంపకమాలవంటి సంస్కృత వృత్తాలతో కూర్చి తెలుగుభాషకు చక్కని రూపందిద్దాడు. రసవత్తరము, కథా కమనీయమైన మహా కావ్యరచనకు దారి చూపాడు. అందువల్లనే నన్నయకు ఆదికవి అనే ప్రసిద్ధి సార్థకమైంది.

ఈ ప్రయత్నంలో నన్నయ జనవ్యవహారంలోని పదజాలం అంతటినీ పరిశీలించి సంస్కరించి సంస్కృత ప్రాకృత పదాలకు ప్రత్యయాలను ఏర్పరచి తెలుగులో ఉపయోగించే పద్ధతిని నిర్ణయించాడు. ధారాళంగా నడిచే శక్తి గల కొన్ని సంస్కృత వృత్తాలను గ్రహించి, అప్పటికే ప్రసిద్ధిచెంది ఉన్న కన్నడ వాఙ్మయంలోని ప్రశస్త లక్షణాలను సేకరించి, సంస్కృత వాక్యవిధానాన్ని, వ్యాకరణ పద్ధతిని అనుసరిస్తూ సంస్కృత కావ్యాలతో సరితూగగల తొలి ఆంధ్రమహా గ్రంథరచన చేశాడు. ఆంధ్ర భాషకు ఒక చక్కని వ్యవస్థను ఏర్పరచి వాగనుశాసనుడయ్యాడు. ఆంధ్రసాహిత్య మార్గాన్ని తీర్చి దిద్దిన నన్నయ మహాభారతాంధ్రీకరణం ప్రథమాంధ్ర కావ్యంగా విరాజిల్లింది.

## 2.3.0. మహాభారతాంధ్రీకరణము - రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహము :

నన్నయ జన్మించిన ప్రదేశము, సమయము, తల్లిదండ్రులకు సంబంధించిన వివరాలు తెలియవు. తెలుసుకోవటానికి ఆధారాలు కూడ కన్పించవు. మహాభారతం ఆదిపర్వం ప్రారంభంలోని ఒక సీసపద్యంలో నన్నయ రాజరాజ కుల బ్రాహ్మణుడని మాత్రం ఉంది. అనగా నన్నయ వంశీయులు రాజరాజ వంశీయులకు పరంపరాగతంగా వంశ గురువులని చెప్పవచ్చు. లేదా నన్నయ రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి అని భావించవచ్చు. ఏదిఏమైనా ఈ ఇరువురి అనుబంధం ఆత్మీయమైనదని నమ్మవచ్చు.

'తన కుల బ్రహ్మణు'తో ప్రారంభం అయ్యే సీసపద్యంలో నన్నయ ప్రతిభా విశేషాలు, పాండిత్య వైభవం వ్యక్తిత్వం మొదలైన విషయాలు తెలుస్తాయి. నన్నయ రాజరాజుకు కులబ్రాహ్మణుడు, అనురక్తుడు, అవిరళ జపహోమతత్పరుడు, విపుల శబ్దశాసనుడు, సంహితాభ్యాసుడు, బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతుడు, ఆపస్తంబ సూత్రుడు, ముద్గల గోత్ర జాతుడు, లోకజ్ఞుడు, ఉభయ భాషా కావ్యరచనాభిశోభితుడు, నిత్యసత్యవచనుడు, మత్యమతాధిపాచార్యుడు, పాత్రుడు, అవదాత చరిత్రుడని తెలుస్తుంది.

పంచమ వేదంగా భాసిల్లే భారతాన్ని ఆంధ్రీకరించేందుకు నన్నయ సంపూర్ణమైన యోగ్యత కలవాడని ఈ పద్యంలోని అంశాలు రూఢి పరుస్తున్నాయి.

రాజరాజ నరేంద్రుని కాలంలోని నందంపూడి శాసనకర్త నన్నయభట్టు. నన్నయభట్టులోని నన్నియ శబ్దాన్ని బట్టి అతడు కన్నడ దేశీయుడని కొందరు భావించారు. చాగంటి శేషయ్య గారు నన్నయ శుద్ధాంధ్ర బ్రాహ్మణుడని నిరూపించారు.

రాజరాజ నరేంద్రుడు క్రీ.శ. **1022 - 1063** సంవత్సరాల మధ్య రాజ్యాన్ని పాలించాడు. కాని క్రీ.శ. **1051** నుంచి మాత్రమే సుస్థిర రాజ్యపాలన అందించాడు. ఆ కాలంలోనే విద్యాపోషకుడుగా, అగ్రహారదాతగా, ప్రజా శ్రేయస్కరంగా సుపరిపాలన చేసి ఉంటాడు. కనుక క్రీ.శ. **1051 - 1063** మధ్యకాలంలోనే నన్నయ మహాభారత రచనా కార్యక్రమం చేపట్టి ఉంటాడు.

రాజరాజ నరేంద్రుడు మహాభారతాన్నే తెలుగులో వ్రాయించాలనే సంకల్పం కలగటానికి, అతడికి 'అనవరతంబును శ్రీమహాభారతము నందలి యభిప్రాయంబు పెద్దద్దెయుండుట' ముఖ్యకారణము. భారతము పంచమ వేదము. సనాతనధర్మ, సంస్కృతి సంప్రదాయాలకు నిలయము. రాజరాజ చంద్ర వంశానికి చెందినవాడు. భారతము చంద్ర వంశీయులైన పాండవుల చరిత్రను వివరించే గ్రంథం. అందువల్ల తన వంశకర్తల గాథలు వినాలనే కుతూహలం రాజరాజుకు ఉండటం సహజం.

భారతం అప్పటికే కన్నడంలో పంప మహాకవిచే 'విక్రమార్జున విజయము' అనే పేరుతో రచించబడింది. పేరిందేవనారు తమిళంలో కొంత భాగాన్ని రచించాడు. ఇవి పాక్షికానువాదాలే కాని సంపూర్ణ అనువాదాలు కావు. తమిళ కన్నడాల్లో ఈ రచనలను చూసిన రాజరాజుకు తెలుగులో భారతానువాదం పూర్తిగా జరగాలనే అభిలాష కలిగి ఉండవచ్చు.

భారతం విశిష్టత అమేయమైంది. ఆ గ్రంథాన్ని వింటూ బద్ధస్పృహులైనవారికి ఎన్నో యాగాలు చేసిన పుణ్యం లభిస్తుంది. అంతే కాక భారత శ్రవణాసక్తి వల్ల నూరు గోవులను వేద విప్రులకు దానం చేసిన ఫలం దక్కుతుంది.

రాజరాజ నరేంద్రుడు వైదిక మతాభిమాని. ఆ కాలంలో జైన బౌద్ధమత ప్రచారకులు సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా దేశభాషల్లో తమ మత ప్రచారం సాగిస్తున్నారు. వైదిక పురాణ వాఙ్మయం, మహాభారతం సంస్కృతంలో ఉండటంతో సామాన్య ప్రజలకు అర్థం కాదు. అన్యమత ప్రచారాన్ని అరికట్టి దేశభాషలో వైదిక మత ప్రభావాన్ని సామాన్య ప్రజలకు సుబోధం చేయాలనే సంకల్పం అతడికి కలిగింది. ఇన్ని కారణాల ప్రేరణతోనే రాజరాజ నరేంద్రుడు భారతాన్ని తెలుగులో వ్రాయించటానికి పూనుకొన్నాడు. ఆ మహాకార్యాన్ని సర్వసమర్థంగా నిర్వహించేందుకు తన కుల బ్రాహ్మణుడు, మిత్రుడు, ఉభయ భాషా కావ్య రచనాభి శోభితుడు, మహా పండితుడు అయిన నన్నయయే అర్హుడని భావించాడు. ఆ భావనతో కృష్ణద్వైపాయన మునివృషభ అభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థము స్పష్టం అయ్యేటట్లు తెలుగులో మహాభారత రచన నిర్వహించవలసిందని ప్రోత్సహించాడు.

## 2.3.1. మహాభారత వైశిష్ట్యము :

భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో లభించే ఏ రెండు సంస్కృత మహాభారత ప్రతులు ఒకదానితో ఒకటి సమానంగా ఉండటంలేదు. ఉత్తర దక్షిణ భారత ప్రతుల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. వ్యాసుని అనంతరం వ్రాయసకాండ్రు ఎన్నో ప్రక్షిప్తాలను చేర్చి ఉంటారు. కవిత్రయంవారు దాక్షిణాత్యులవటంవల్ల ఎక్కువగా దాక్షిణాత్య ప్రతులనే చూసి ఉంటారు.

మహాభారతాన్ని మొదట 'జయం' అనే పేరుతో **8800** శ్లోకాలతో వ్యాసుడు చెప్పాడు. వైశంపాయనాది శిష్యులు దానిని **24000** శ్లోకాలుగల భారతంగాను, లక్ష శ్లోక పరిమితిగల మహాభారతంగాను రూపొందించారు. లక్ష శ్లోకాలకు వ్యాపించిన ఈ గ్రంథాన్ని కవిత్రయం వారు **25000** పద్యగద్యాలలో తెనిగించారు. ఇందులో నన్నయ అనువదించిన భాగం మూలంలో **17000** శ్లోకాలలో ఉండి సుమారు నాలుగువేల పద్యగద్యాలలో విస్తరించింది.

వ్యాసభారతంలో కురుపాండవ కలహం బీజప్రాయంగా ఉన్న కథ. దీనిని ఆధారం చేసుకొని భారతీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విజ్ఞానమంతా మహాభారతంలో కూర్చబడింది. సమస్త వేదపూరాణ సారం అంతా మహాభారతంలో రూపాంతరం చెంది పంచమ వేదంగా ప్రఖ్యాతి పొందింది. ఒక విజ్ఞాన సర్వస్వంగా భాసించింది. మానవ జీవితాదర్శాలన్నీ భారతంలో ప్రతిఫలించాయి. అందుకే మహాభారతం 'ధర్మతత్వజ్ఞులకు ధర్మశాస్త్రంగా, అధ్యాత్మవిదులకు వేదాంతసారంగా, నీతివిచక్షణులకు నీతిశాస్త్రంగా, కవి వృషభులకు మహాకావ్యంగా, లాక్షణికులకు సర్వలక్ష్య సంగ్రహంగా, ఐతిహాసికులకు ఇతిహాసంగా, పౌరాణికులకు బహుపురాణ సముచ్చయంగా ద్యోతకమైంది. విజ్ఞానఖని అయిన మహాభారతాన్ని అనువదించటం సామాన్యులకు సాధ్యం కాదు. నన్నయభట్టు వంటి ప్రజ్ఞాదురంధరులకు మాత్రమే సాధ్యము. అందువల్లే రాజరాజ మహాభారతాంధ్రీకరణ చేయవలసిందిని నన్నయను అర్థించాడు. నన్నయ జనామోదంగా ఆంధ్రమహాభారతంలో వ్యాసుని హృదయాన్ని ఆవిష్కరించాడు. ఆంధ్రులకు అభిమానపాత్రుడైన ఆదికవిగా కీర్తిపొంది అనంతర కవులకు మార్గదర్శకుడయ్యాడు.

## 2.3.2 భారతాంధ్రీకరణంలో నన్నయకు నారాయణభట్టు సహాయము :

నన్నయ భారతాంధ్రీకరణంలో సహాధ్యాయుడు, వాఙ్మయ దురంధరుడు, ఇష్టుడు అయిన నారాయణభట్టు తనకు సహాయం అందించాడని

"పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా
రాయణనట్లు వాసిగధరామర వంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ దురంధరుడన్ తనకిష్టుడన్ సహా
ధ్యాయియు నైనవాడభిమతంబుగ దోడయి నిర్వహింపగన్" అనే పద్యంలో కృతజ్ఞత వెల్లడించాడు.

భారత యుద్ధంలో అర్జుననకు కృష్ణుడు అవసర సమయాల్లో సలహాలనిచ్చి విజయం సాధించేందుకు తోడ్పడినట్లుగా భారతాంధ్రీకరణంలో నారాయణభట్టు నన్నయకు సలహాలనిచ్చి మాట సహాయంచేసి ఉంటాడు.

ఆనాటి పండిత పరిషత్తులను దృష్టిలో ఉంచుకుంటే భారత రచనలో నన్నయకు నారాయణభట్టు చేసిన సహాయం ఎలాంటిది అనే ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. పంచమ వేదమైన భారతాన్ని తెనిగించటం అంటే వేదాలను తెనిగించటమే అనే భావంతో ఆనాటి పండితులు అంగీకరించి ఉండరు. ఒకవంక పండిత పరిషత్తులలోని పండితులను సమాధానపరుస్తూ, ఇంకొక వంక భారత రచన సాగించటం దుష్కరమైన కార్యం. పండిత పరిషత్తుల్లో జరిగే చర్చల్లో నారాయణభట్టు నన్నయ పక్షాన నిలిచి పండితుల సందేహాలను తొలగించి సమాధాన పరచి భారత రచనకు అనుకూల పరిస్థితిని కలిగించి ఉంటాడు.

నన్నయకు ముందే కన్నడ భాషలో పంపమహాకవి 'విక్రమార్జునీయం' రచించాడు. భారతానుసరణలైన కావ్యాలు కొన్ని వచ్చాయి. నారాయణభట్టు బహుభాషా పండితుడు కనుక కన్నడ భారతంలోని విశేషాలను నన్నయకు తెలిపిఉంటాడు. కన్నడ భారతంలోని లోపాలు తెలుగు భారతంలో చోటుచేసుకోకుండ సలహాలు ఇచ్చిఉంటాడు.

ఇంకా భారతాంధ్రీకరణంలో ఏయే భాగాలను ఆంధ్రీకరించాలో, ఎక్కడ కుదించి ఎక్కడ ప్రపంచీకరించాలో, లభ్యమైన మూలప్రతులను పరిశీలించి మేలు ప్రతిని స్థిరీకరించటం వంటి విషయాల్లో నారాయణభట్టు నన్నయకు సహాయకారిగా ఉన్నాడు. ఆ మాత్రపు నైతిక సహాయాన్నే కృతజ్ఞతాపూర్వకంగా నన్నయ అవతారికలో సంభావించాడు.

## 2.4 నన్నయ మహాభారతాంధ్రీకరణ విధానము :

సంస్కృతంలో మహాభారతం లక్ష శ్లోకాలతో నూరు పర్వాలకు వ్యాపించి ఉంది. దానిని కవిత్రయంవారు 18 పర్వాలలో

25000 పద గద్యాలలో రచించారు. కవిత్రయం వారు మూల గ్రంథాన్ని సంక్షేపించారనే ఒక వాదం ఉంది. కాని సంస్కృతంలోని నాలుగైదు అనుష్టుప్పులు కలిస్తే కాని తెలుగులో ఒక పద్యం కాదు. ఇంకా తెలుగులోని సీసము, అంతకు మించి వచనం ఎన్నో శ్లోకాలను ఇముడ్చుకోగలవు. అదీ కాక కవిత్రయం వారు వ్యాసుని అభిహితార్థాన్ని మనసుకు పట్టించుకొని తెనిగించారు కాని మక్కికి మక్కి అనువాదం చేయలేదు. కనుక నన్నయాదులు అనువాదంలో మూలగ్రంథాన్ని కుదించారనే అభిప్రాయం సమంజసంకాదు.

అనువాదం యథామాతృకం, యథోచితానుసరణం అని రెండు విధాలు. నన్నయ అనువాదం యథోచితానుసరణం. మూలంలోని కథను, కథాప్రణాళికను మాత్రం గ్రహించి వర్ణనలు, రసపోషణ, పాత్ర చిత్రణ, సందర్భానికి తగ్గ విధంగా మారుస్తూ స్వతంత్రమైన మార్గంలో రచించాడు. సంస్కృత భారతంలో వ్యాసుని ఆత్మీయత గోచరిస్తే తెలుగు భారతంలో నన్నయ ఆత్మీయత స్పష్టం అవుతుంది. ఈ యథోచితానుసరణలో నన్నయ మూలానికి కొన్ని చోట్ల వన్నె చేకూరిస్తే మరి కొన్ని చోట్ల ఆ వన్నె తగ్గిన తీరు కనిపిస్తుంది.

నన్నయ భారతాంధ్రీకరణ ప్రక్రియలో మూలంలోని కొన్నింటిని యథాతథంగా అనువదించాడు. కొన్నింటిని పెంచి వ్రాశాడు. కొన్ని భాగాలను అనౌచిత్యశంకతో పూర్తిగా విడిచివేశాడు. కొన్నిచోట్ల అన్యథా కల్పనలు చేశాడు.

కచదేవయాని కథ మూలంలో రమణీయంగాఉంది. సంప్రాప్త యౌవన, స్వతంత్రము అయిన దేవయాని రూపవంతుడు, బ్రహ్మచర్యవ్రత సంపన్నుడైన కచుణ్ణి ప్రేమిస్తుంది. అది స్వభావ సిద్ధమే. దేవయాని కోరిక సహజమైనప్పటికీ ధర్మ విరుద్ధం. అందువల్ల కచుడు సమయోచితంగా మృదూక్తులతో తప్పించుకొనే ప్రయత్నంచేశాడు. తాను శుక్రుని గర్భం నుంచి వెడలినవాడు కావటంచేత ఏకగర్భ జనితులకు దాంపత్యం ధర్మబద్ధం కాదని వారిస్తాడు. వ్యాసుడు ఈ పాత్రలు రెండింటిని నిష్పాక్షికంగా చిత్రించాడు. ఈ సందర్భంలో నన్నయ

"ఆ కచుడత్యంత విషా
దా కులుడై లోక నింద్యమగు నర్థము నీ
వాకునకు దెచ్చుటుచితమె
నాకు సహోదరివి నీవు నా చిత్తమునన్"

అని దేవయాని కోరిక ధర్మవిరుద్ధం కావటంవల్ల కచుని పక్షం వహించి ఆమె ఆశయాన్ని ఖండిస్తాడు. కచుని మాటల్లో మూలంలోని నేర్పు కనిపించదు. నన్నయ నాటి లోకధర్మం కచునిచేత ఖండితంగా పలికిస్తుంది. ఈ సన్నివేశంలో మూలంకన్న అనువాదానికి వన్నె చేకూరింది.

కర్ణ జనన వృత్తాంతం ఘట్టంలో నన్నయ మూలాన్ని విస్తృతపరచి వన్నెచేకూర్చాడు. మూలంలో కుంతి కర్ణుని విడిచిపెట్టే వృత్తాంతం ఒక్క శ్లోకంలో మాత్రమే ఉంది. నన్నయ దానిని రెండు పద్యాలు ఒక వచనంలో తెనిగించి కుంతీదేవి మాతృహృదయాన్ని మానసిక వితర్కాన్ని చక్కగా చిత్రించాడు.

సంస్కృత భారతంలో దుస్సల జనన వృత్తాంతం ఒక ఆశ్వాసం అంతా వ్యాపించి ఉంది. దానిని నన్నయ

"అతనూజుల కందర కనుజయై
లతాంగి దుస్సలయను కూతురమర బుట్ట
నందు దౌహిత్రవంతులదైన పుణ్య
గతియుగాంతునేనని బేంగె గౌరవుండ" అని ఒక్క పద్యంలో చెప్పాడు.

వ్యాసభారతంలో ద్రౌపదీ స్వయంవరం ఘట్టంలో కర్ణుడు మత్స్య యంత్రాన్ని పడగొట్టేందుకు బాణాన్ని సంధించబోయే సమయంలో ద్రౌపది కర్ణుడు సూతపుత్రుడు కనుక అతణ్ణి వివాహం చేసుకోనని తిరస్కరిస్తుంది. మత్స్య యంత్రాన్ని ఛేదించటం వీర పరీక్షయేకాని నిబంధనలలో కులప్రసక్తి లేదు. ఈ సందర్భం ద్రౌపది వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చేదిగా ఉంది. అందువల్ల నన్నయ ఈ భాగాన్ని తెనిగించలేదు. భారత కథలో ఇది చాలా ముఖ్యమైన ఘట్టం. ఇక్కడ ద్రౌపది కర్ణుణ్ణి అవమానించింది కనుక కర్ణుడు ద్యూత సభలో ద్రౌపదిని బంధకి అనటంలో విపరీతం ఉండదు. నన్నయ ద్రౌపది పక్షం వహించి, కర్ణుడు మత్స్య యంత్రాన్ని పడగొట్టే ప్రయత్నం చేసినట్లు, మూడు నువ్వు గింజలలో గురి తప్పినట్లు చెప్పి అతడి వైఫల్యాన్ని స్పష్టంచేశాడు. భారతం పాండవానుకూలం కావటం, కర్ణుడు సుయోధనుని పక్షం వహించి పాండవులకు విరోధికావటం వల్ల నన్నయ ఈ మార్పు చేసి ఉండవచ్చు.

భారతాంధ్రీ కరణంలో నన్నయకు భాషా విషయిక దృష్టితో పాటు బ్రాహ్మణమత ప్రచారదృష్టి గోచరిస్తుంది. వైదిక మతాచారాలను, వర్ణాశ్రమ ధర్మాలను, బ్రాహ్మణాధిక్యతను కొనియాడే సందర్భాల్లో నన్నయ మూలాన్ని విస్తరించి మెరుగులు దిద్దాడు.

ఉదంకుని కథలో మూలంలో "యథానవనీతం హృదయం బ్రాహ్మణస్య వాచిక్షురో నిశితః తీక్ష్ణధారా" అన్న ఒక్క శ్లోకాన్ని నన్నయ

"నిండు మనంబు నవ్య నవనీత సమానము పల్కుదారుగా
ఖండల శస్త్ర తుల్యము జగన్నుత విప్రులయందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్"

అని ఒక పద్యంలో విస్తారంగా చెప్పాడు. అంతేకాక మూలంలో 'హృదయం' అనే దానికి మారుగా 'మనసు' అని మార్చాడు. ఇట్లా మార్చటంలో తెలుగుతనం ఉట్టిపడుతుంది. మెత్తని మనసు అనటం మన అలవాటు. మూలంలో 'నిశితః తీక్ష్ణధారా' అనే దానిని 'దారుణాఖండల శస్త్రతుల్యము' అని చెప్పి మూలానికి అందం సమకూర్చాడు.

భృగుకథలో "మాన్యాస్త బ్రాహ్మణాంమమ" అన్న ఒక్క మాటను నన్నయ

"అడచిన తిట్టినన్ మఱి మహా పరుషంబులు వల్కియల్కతో
బొడిచిననుత్తమ ద్విజులు పూజ్యులు వారల కెగ్గ సేసినం
జెడ నిహముంబరంబు నిది సిద్ధముగావు టెఱింగి భక్తినె
ప్పుడు ధరణీ సురోత్తముల బూజనదన్పుదునల్గ నోడుదున్"

అని తెనిగించి బ్రాహ్మణులు గౌరవించదగ్గవారని విశదీకరించాడు.

ద్రౌపదీ స్వయంవరం సమయంలో బ్రాహ్మణ వేషంలో ఉన్న అర్జునునిపై కూడ నన్నయ ఎంతో అభిమానం ప్రదర్శించాడు.

వివాహం విషయంలో యయాతి దేవయానికి సమాధానం చెప్తూ "సర్వ వర్ణాశ్రమ ధర్మంబూలు సంకరంబులు కాకుండ రక్షించుచున్న యేనయిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతంబగు" అన్నట్లు నన్నయ వ్రాశాడు. ఈ అభిప్రాయం మూలంలో కనిపించదు. ఆంధ్ర మహాభారతం ప్రారంభంలో రాజరాజ నరేంద్రుని కూడ నన్నయ ఇట్లానే సంభావించాడు. వర్ణాశ్రమ ధర్మాల రక్షణ పట్ల నన్నయకు ఉన్న ఆసక్తి ఈ సందర్భంలో ద్యోతకం అవుతుంది.

ఆంధ్రమహాభారతంలో మూలంలోని శాస్త్ర సంబంధమైన ఘట్టాలను నన్నయ చాలావరకు సంక్షిప్తం చేశాడు. వ్యాసుని దృష్టి ఐతిహాసిక దృష్టి కావటంతో మూలంలో రాజుల చరిత్రను సుదీర్ఘంగా వివరించాడు. తెలుగు భారతం కావ్యదృష్టి కలది కావటంతో చారిత్రకాంశాలకు ప్రాముఖ్యం అంతగా లేదు. అందువల్ల నన్నయ చారిత్రకాంశాలను పూర్తిగా వదలి వేయటంకాని, స్వీకరించిన చోట్ల సంక్షేపించటంకాని చేశాడు.

నన్నయ కథా గమనంలో ఔచిత్యం పాటించటం కోసం కొన్ని మార్పులు చేశాడు. మూలంలో శకుంతలోపాఖ్యానం తరువాత యయాతి చరిత్ర ఉంది. చంద్రవంశంలో యయాతి భరతుని కన్న పూర్వుడు కావటం వల్ల నన్నయ ముందు యయాతి చరిత్రను చెప్పి తరువాత శకుంతలోపాఖ్యానం రచించాడు.

ఈ విధంగా నన్నయ కావ్య దృష్టితో మహాభారతాన్ని తెనిగిస్తూ ఆయా సందర్భాలకు అనుగుణంగా కొన్ని ఘట్టాలను పెంచి, కొన్నింటిని కుదించి, మరి కొన్నింటిని వదలి యధోచితానుసరణంగా ఆంధ్రమహాభారతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు.

## 2.5.0. నన్నయ కవితారీతులు :

నన్నయ భారతావతారికలో తన కవిత్వంలోని మూడు ప్రత్యేక గుణాలను పేర్కొన్నాడు.

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థ యుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితారచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్"

ఈ పద్యంలోని కవితా గుణాలలో మొదటిది ప్రసన్న కథాకలితార్థయుక్తి, రెండు అక్షరరమ్యత, మూడవది నానారుచిరార్థ సూక్తినిధిత్వము. ఇవి కాక రసపోషణ, పాత్రచిత్రణ మొదలైన గుణాలను పరిశీలించవలసిఉంది.

## 2.5.1. ప్రసన్న కథాకలితార్థ యుక్తి :

కథను అర్థయుక్తితో ప్రసన్నంగా పాఠకుని హృదయంలో హత్తుకొనే విధంగా చెప్పటమే ప్రసన్న కథా కలితార్థ యుక్తి. ఇది ఒక మహాశిల్పము. ఇది నన్నయ గారి ఉపజ్ఞ. నన్నయ ఉత్తమ కథకుడు. కథాకథన శిల్పంలో పారంగతుడు. కథకు ఆయువు పట్టయిన విషయాన్ని ఎక్కడ చెప్పాలో బాగా తెలిసినవాడు. నన్నయ కథా ప్రసన్నతను, అనవసరమైన వాటిని తొలగించటం, కథను సంక్షిప్తం చేయటం, కథనాన్ని వేగంగా నడపటం, ప్రధాన కథకు ఉపాఖ్యానాలకు సంబంధం కలిగించటం, పునరుక్తి లేకుండ చూడటం మొదలైన పద్ధతుల్లో సాధించాడు.

నన్నయ ప్రసన్న కథాకళకు యయాతి చరిత్ర, శకుంతలోపాఖ్యానం, శిశుపాలవధ, నలోపాఖ్యానం మొదలైనవి దృష్టాంతాలుగా నిలుస్తాయి. నన్నయ కథను వివరించేటప్పుడు రంగ విభజన చేసినట్లుగా సన్నివేశ కల్పన చేసి ఆ దృశ్యాన్ని పాఠకుల కళ్ళముందు ఉంచుతాడు. రసానుగుణంగా కథను చెప్పటం నన్నయ ప్రత్యేకత.

## 2.5.2. అక్షరరమ్యత :

అక్షరాల కూర్పువల్ల పుట్టిన రమ్యత అక్షరరమ్యత. ఇది శబ్దశిల్పానికి చెందిన గుణం. సామాన్యులకు కూడ శ్రవణానందాన్ని కలిగించి కవితాస్వాదన కూరుస్తుంది. నాదసౌష్టవం అక్షరరమ్యతకు ప్రాణం పోస్తుంది. సన్నివేశ చిత్రీకరణలో రసానుగుణమైన శబ్దవిన్యాసంతో నన్నయ అక్షరరమ్యతను సాధించాడు. కేవలం పద్యాల్లోనేకాక గద్యంలో కూడ అక్షరరమ్యత కనిపిస్తుంది.

కణ్వాశ్రమ వర్ణనలో 'కమ్మని లతాంతములకు మ్మొనసివచ్చు మధుపమ్ముల సుగీతనినదమ్ము' అన్న పద్యంలో ద్విత్వ మకార ప్రయోగంలో తుమ్మెదల ఝుంకారం స్ఫురించి పద్యానికి వింత సౌందర్యం చేకూరింది.

ద్యూత సమయంలో ద్రౌపదికి జరిగే అవమానాన్ని భరించలేక దుశ్శాసనునిపై క్రోధరోషాలతో ఊగిపోయిన భీముడు వీరరసావేశంతో పలికిన పద్యం రసానుగుణమైన నన్నయ అక్షరరమ్యతకు నిదర్శనంగా నిలుస్తుంది.

"కురువృద్ధుల్ గురువృద్ధబాంధవులనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధురుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభి
కరలీలన్ వధియించి తద్విపుల వక్షశ్శైల రక్తే ఘని
ర్ఘర ముర్వీపతి సూచుచుండ ననినాస్వాదింతు నుగ్రాకృతిన్"

ఇట్లా అనేక సన్నివేశాల్లో నన్నయ అక్షరరమ్యత పరిపూర్ణంగా వికసించింది.

## 2.5.3. నానారుచిరార్థ సూక్తినిధిత్వము :

సూక్తి అంటే సు+ఉక్తి. అనగా మంచిమాట. అనేకమైన అభిరుచులతో కూడిన అర్థాలతో నిండిన సూక్తులకు నన్నయనిధి. నీతులను సూక్తులుగా వ్యవహరిస్తాం. సూక్తి అంటే చమత్కారమైన కూర్పు అని అర్థం. ఈ చమత్కారం పదం, పదబంధం, సమాసం, అలంకారం, నానుడి, సామెత, లోకోక్తి మొదలైన వాటి ద్వారా ప్రకటితం అవుతుంది. కనుక ఆలంకారిక రచన, లోకోక్తులు, నీతులు, సామెతలు, పదబంధాలు అన్నీ సూక్తినిధిలోనే చేరతాయి. నన్నయ సూక్తులలో లౌకికమైనవి, రాజనీతిపరమైనవి, ఆధ్యాత్మికమైనవి, ధర్మప్రబోధకమైనవి ఎన్నో ఉన్నాయి.

నన్నయ కవితలో 'మతిదల పగ సంసారం బతి చంచలము', 'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్', 'కాముక శక్తి నోర్వగలరె జనులు', 'కుంతి కడుపు చల్లగా పుట్టిన ఘనభుజుండు', 'వంటయిలు కుందేలు సొచ్చె', 'వినిరోయు తీగ కాళ్లం బెనగెను తాననుచు', వంటి సూక్తులు కోకొల్లలుగా దర్శనం ఇస్తాయి. నన్నయ కథనకౌశలాన్ని అనుభవానికి తెస్తాయి.

## 2.5.4. రసపోషణ :

నన్నయ భారతం ఒక రసరమ్య కావ్యంగా మలచబడింది. ప్రధానరసమైన శాంత రసానికి భంగం రాకుండ వివిధ సందర్భాల్లో నన్నయ అంగరసాలను పోషించిన తీరు పండితుల ప్రశంసలు పొందింది. అనంతర కవులకు మార్గదర్శకం అయింది. యుద్ధ వర్ణనల్లో రౌద్ర వీర రసాలు, బకాసురవధ ఘట్టంలో భీభత్సరసం సముచితంగా వర్ణించబడ్డాయి. కణ్వుడు శకుంతలను దుష్యంతుని చెంతకు పంపే ఘట్టంలో వర్ణితమైన కరుణశాంతరసాలు తెలుగునాట నూతనవధువులకు, తల్లిదండ్రులకు అనుభవైక వేద్యమైనవే. ఋష్యశృంగుని కథలో శాంతరసానికి హాస్యరసం అంగరసంగా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. ఇట్లా అనేక సన్నివేశాల్లో నన్నయ రసావిష్కరణ సామర్థ్యం ప్రదర్శితం అవుతుంది.

## 2.5.5. పాత్రచిత్రణ :

నన్నయ పాత్రచిత్రణలో ఎంతో శ్రద్ధవహించాడు. ఈ అంశంలో కవిత్రయం వారికి వ్యాసుని మార్గమే శిరోధార్యం. నన్నయ మూలానికి భంగం రాకుండ సందర్భాన్నిబట్టి తెలుగువారికి ఇష్టమైన విధంగా పాత్రలకు తెలుగుదనం సమకూర్చాడు. ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు, శకుని, ధర్మరాజు, భీముడు, కర్ణుడు వంటి భారతవీరులు తెలుగు నుడికారాలు, జాతీయాల్లో కలిసిపోయి ఆంధ్రులకు ఆత్మీయులయ్యారు. నన్నయ ధర్మరాజును కథానాయకునిగా చిత్రించటంలో ఎంతో శ్రద్ధ కనపరచాడు.

ద్రౌపది పాత్ర వైవిధ్య భరితంగా ఉండి కవిత్రయం వారికి కత్తిమీద సాము అయింది. దుష్యంతుని పాత్రను మూలంకన్నా ఉదాత్తంగా చిత్రీకరించాడు. శకుంతల ఆంధ్రుల సానుభూతికి పాత్రమైంది. నన్నయ పాత్రచిత్రణ విధానం తిక్కన, ఎఱ్ఱనలకు మార్గదర్శకంగా ఉండి, భారతంలో పాత్రైక్యము అందరికీ ఆమోదంగా రూపొందింది.

## 2.6 నన్నయశైలి :

శైలి అనే పదం చాలా విపులార్థం కలది. భావగతి, పదగతి, శైలిలో ఇమిడి ఉంటాయి. ఆంగ్లంలోని 'style' అనే పదానికి శైలి సమానార్థకంగా భావిస్తున్నారు. శైలికావ్యానికి కేవలం బాహిరమైన ఆచ్ఛాదనేకాక, శబ్దసామగ్రి, పాత్రపోషణ, సన్నివేశకల్పన మొదలైన అనేక అంశాలను వ్యక్తంచేస్తుంది.

సాహిత్యం పరంగా శైలి రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి కావ్యసామాన్య లక్షణం, రెండు పదగుంఫన పద్ధతి లేక శబ్ద ప్రయోగవైఖరి. వీటిలో కావ్యసామాన్య లక్షణం కావ్యాన్ని నడిపించే సామాన్య ధర్మాన్ని అనుసరించి ఉంటుంది. ఇది వస్తు విన్యాసానికి సంబంధించింది.

కావ్య సామాన్య లక్షణం మూడు విధాలు. 1. ఆఖ్యానశైలి (Narrative), 2. నాటకీయశైలి (Dramatic), 3. వర్ణనాత్మకశైలి (Descriptive style) . ఆఖ్యానశైలిలో కవి కథకుడై సూటిగా ప్రసన్నంగా కథ చెప్తాడు. నాటకీయశైలిలో కవి సూత్రధారుడై పాత్రల ముఖంగా కథ నడుపుతాడు. వర్ణనాత్మకశైలిలో కవి కథను, పాత్రలను, భూమికను, భావాలను వర్ణించి చెప్తాడు. ఏ కావ్యంలోనైనా ఈ మూడు వర్గాల గుణాలు సందర్భాన్ని బట్టి కలసిఉంటాయి. ప్రధానంగా ఒక్కొక్క కవికి ఒక్కొక్క ప్రత్యేకశైలి ఆత్మధర్మమై ఉంటుంది. కవి ఆత్మీయత శైలిలో ఒక భాగం.

నన్నయది ప్రధానంగా ఆఖ్యానశైలి. అయినా అక్కడక్కడ నాటకీయ శైలి, వర్ణనాత్మక శైలి కూడ చోటు చేసుకొన్నాయి.

బకాసుర వధకు పూర్వం బ్రాహ్మణ కుటుంబంలో జరిగిన సంవాదం చక్కని నాటకీయతకు నిదర్శనం. సౌగంధికాపహరణ ఘట్టం భీమాంజనేయ సంవాదం, మయసభలో సుయోధనుని అసూయాగ్రస్త చిత్తవృత్తి నాటకీయంగా ప్రదర్శించబడింది.

మయసభావర్ణన, కణ్వాశ్రమ వర్ణన వర్ణనాత్మక శైలికి ఉదాహరణలు. ఇలాంటి ఘట్టాలు ఉన్నప్పటికీ నన్నయ శైలి నాటకీయము, వర్ణనాత్మకము కాదు.

నన్నయ ఉత్తమజాతి కథకుడు. ఆయన కథాగమనంలో వక్రతకాని, అతి సంకోచం, అతి విస్తృతి కాని కలగనీయడు. ప్రసన్న కథా కలితార్థ యుక్తి అనే తన ప్రతిజ్ఞను తుదముట్ట నిలుపుకొన్నాడు. నన్నయ కవితలో కథా ప్రసన్నతతో పాటు అర్థయుక్తి గోచరిస్తుంది.

నన్నయ శైలీవిన్యాసంలో పదాల పొందికలో అక్షర రమ్యత కూర్చబడింది. దీనిలో ఒకరి తీరు మరొకరికి ఉండదు. ఎవరి శైలి వారిది. నన్నయ కవిత్వంలో ఎక్కువ భాగం తత్సమ పదాలే కనిపిస్తాయి. ఆయనకు తెలుగు కవిత్వం లేకపోవటంచేత, దేశీయ పదాలన్నింటిని తెలుగు ప్రజానీకానికి అందించటానికి సంస్కృతాన్ని ఆశ్రయించక తప్పలేదు. నన్నయగారి తత్సమ పదాలు సంస్కృత కాఠిన్యాన్ని వదలి తెలుగులో ఉన్న సరళతను సంతరించుకొన్నాయి. ఒక్క పదం కూడ అర్థం కానిది ఉండదు.

నన్నయ శైలి గాంభీర్యము, ఠీవి కలిగి ఉదాత్తంగా ఉంటుంది. ఈ ఉదాత్తతను సాధించటానికి ఇతరులు శబ్దాడంబరాన్ని ఆశ్రయిస్తారు. కాని నన్నయ రచనలోని ఉదాత్తత అప్రయత్నంగా సిద్ధించిందే. శబ్దాడంబరం కనిపించిన ప్రదేశాల్లో అది సందర్భ సహజమేకాని ఆశ్రయించిన శబ్దాడంబరం కాదు. ఈ శబ్దాడంబరంలోని జటిలత కూడ భారతంలో ఉత్తరోత్తర సరళమైంది. ఈ సరళతవల్ల నన్నయ శైలికి ఒక వన్నె కొత్తదనం చేకూరాయి.

కథ నడపటంలో నన్నయ ఆదిపర్వం కన్నా సభాపర్వంలో పరిణతి చెందాడు. కథ సాగే కొద్దీ మూలానుసరణ తగ్గి స్వతంత్రత స్పష్టంగా కనిపిస్తుంది. ఆదిపర్వంలోని శకుంతలోపాఖ్యానాన్ని, ఆరణ్యపర్వంలోని నలోపాఖ్యానాన్ని పరిశీలించి చూస్తే ఈ అంశం స్పష్టం అవుతుంది.

## 2.7.0. నన్నయ ఇతర రచనలు :

నన్నయ చాముండికా విలాసము, ఇంద్ర విజయము అనే కావ్యాలను, ఆంధ్రశబ్ద చింతామణి, లక్షణసారము అనే లక్షణ గ్రంథాలను రచించినట్లు అనంతర కవులు పేర్కొన్నారు. కానీ ఈ గ్రంథాలేవీ నన్నయ రచనలు కావు.

## 2.7.1. చాముండికా విలాసము :

'చాముండికా విలాసము' గ్రంథానికి 'చౌడేశ్వరి విలాసము' అనే నామాంతరం ఉంది. ఇది మూడాశ్వాసాల గ్రంథము. ఇందులో సుమారు నూట ఇరువది పద్యాలు ఉన్నాయి. మూడు ఆశ్వాసాల్లోను ఆశ్వాసాంత గద్యలు ఒకే విధంగ లేవు. మొదటి ఆశ్వాసంలో నందవరీక బ్రాహ్మణులను గురించి, రెండు మూడు ఆశ్వాసాల్లో దేవాంగ కులంలోని ఒక శాఖను గురించి తెలిపే కథలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథంలోని శాక్తేయమైన ఆరాధన నన్నయ కాలంలో కనిపించదు. ఈ గ్రంథం అవతారికలో పద్య రచన కూడ నన్నయ రచనగా కన్పించదు. ఈ అంశాలను బట్టి ఇది నన్నయ రచన కాదని చెప్పవచ్చు.

## 2.7.2. ఇంద్ర విజయము :

'ఆనందరంగరాట్ఛందము' లో నన్నయ 'ఇంద్ర విజయము' లోనిదిగా ఒక పద్యం ఉదహరించబడింది. ఆ పద్యంలోని అచ్చ తెలుగు పదాల కూర్పును, 'అ-ల' ల యతిని, పలుకుబళ్ళను పరిశీలిస్తే నన్నయ రచన కాదని తెలుస్తుంది.

## 2.7.3. ఆంధ్రశబ్ద చింతామణి :

'ఆంధ్రశబ్ద చింతామణి' తెలుగు భాషకు సంస్కృతంలో వ్రాసిన వ్యాకరణము. దీనిని రచించటంవల్లే నన్నయకు 'విపుల శబ్దశాసనుడు' అనే బిరుదం వచ్చిందని కొందరు పండితులు చెప్పారు. ఎలకూచి బాలసరస్వతి క్రీ.శ. 16వ శతాబ్దంలో ఈ గ్రంథానికి తెలుగు వివరణ వ్రాసేంతవరకు దీని ఉనికి తెలియదు. క్రీ.శ. 17వ శతాబ్దంలో అహోబల పండితుడు దీనికి వ్యాఖ్యానం రచించాడు. పూర్వ లాక్షణికులైన కేతన, విన్నకోట పెద్దన వంటివారు దీనిని నన్నయ రచనగా చెప్పలేదు. ఈ వ్యాకరణ గ్రంథంలోని సూత్రాలకు నన్నయ భారతంలోని కొన్ని ప్రయోగాలకు సమన్వయం కుదరటంలేదు. ఈ కారణాలవల్ల కందుకూరి వీరేశలింగంగారు ఈ గ్రంథాన్ని నన్నయ రచించలేదని నిశ్చయించారు. చిలుకూరి నారాయణరావు గారు ఇది నన్నయకు చాలా కాలం తరువాత రచించిందని నిర్ణయించారు.

మొత్తం మీద నన్నయ పేరుతో ప్రచారం పొందిన పై గ్రంథాలేవీ ఆయన రచించలేదని తేలుతుంది. ఆంధ్రమహాభారతం ఒక్కటే నన్నయ రచన అని రూఢిఅయింది.

## 2.8.0. నన్నయ సమకాలికులు :

## 2.8.1. నారాయణభట్టు :

నారాయణభట్టు నన్నయ సహాధ్యాయుడు. వాఙ్మయ దురంధరుడు. సంస్కృత కర్ణాట ప్రాకృతపై శాచికాంధ్ర భాషల్లో పండితుడు. రాజరాజ నరేంద్రుడు నందంపూడి అగ్రహారాన్ని నారాయణభట్టుకు దానం ఇచ్చాడు. ఈ దానశాసనాన్ని సహాధ్యాయునిపై

గౌరవంతో నన్నయభట్టు రచించాడు. భారతాంధ్రీకరణంలో నన్నయకు తోడుగా ఉన్నాడు. నన్నయ మిత్రుని సహాయాన్ని 'పాయక పాకశాసనిక' అనే పద్యంలో స్మరించటం ఆ ఇరువురి అనుబంధాన్ని వ్యక్తం చేస్తుంది.

### 2.8.2. పావులూరి మల్లన :

పావులూరి మల్లన (క్రీ.శ. 1100) కమ్మనాటిలో పావులూరి కరణము. ఇతనికి రాజరాజ నరేంద్రుడు నవఖండవాడ అగ్రహారాన్ని దానంగా ఇచ్చాడు. సంస్కృతంలో మహావీరాచార్యుడు అనే జైన గురువు రచించిన గణిత శాస్త్ర గ్రంథాన్ని తెలుగులో అనువదించాడు. దీనికి 'పావులూరి గణితము' అని పేరు. శాస్త్రీయ గ్రంథాలలో దీనికి ఎంతో ప్రచారం ఉంది. ఈ గ్రంథంలో ఆనాటి కాలమానాలు, నాణెపు విలువలు, కొన్ని సాంఘిక విషయాలు తెలుస్తాయి.

### 3.8.3. మల్లియ రేచనుడు :

మల్లియ రేచనుడు 'కవిజనాశ్రయము' అనే ఛందో లక్షణ గ్రంధాన్ని రచించాడు. రేచన జైన మతస్తుడు. వాదీంద్ర చూడామణి ఇతని గురువు. కవిజనాశ్రయుడు, శ్రావకాభరణుడు అనేవి ఇతని బిరుదులు. కవిజనాశ్రయంలో సంజ్ఞాధికారము, వృత్తాధికారము, జాత్యధికారము, షట్ప్రత్యయాధికారము, దోషాధికారము అనే అయిదు భాగాలున్నాయి. ఇందులోని దోషాధికారంలో ఛందశ్శాస్త్రానికి చెందినవే కాక వ్యాకరణానికి చెందిన దోషాలు కూడ కూర్చబడ్డాయి.

కవిజనాశ్రయము 'భీమన ఛందము' అనే పేరుతో ప్రఖ్యాతమైంది. ఈ గ్రంథానికి ఉన్న పది తాళపత్రప్రతుల్లో ఒక్క ప్రతిలో మాత్రం వేములవాడ భీమకవి రేచన పేరుతో ఈ గ్రంథం రచించినట్లు కనిపిస్తుంది. దీనిని ఆధారం చేసుకొని కొందరు పండితులు కవిజనాశ్రయము భీమన కృతమని విశ్వసించారు. కాని ఆంతరంగిక సాక్ష్యలు, గ్రంథంలో అనేక చోట్ల రేచన తన పేరు చెప్పుకొని ఉండటంవల్ల ఈ గ్రంథం రేచన కృతంగానే నిలిచి ఉంది.

### 2.8.4. వేములవాడ భీమకవి :

వేములవాడ భీమకవి పూర్వకవి స్తుతిలోను, చాటువుల్లోను కనిపించటంతప్ప, ఈ కవి రచనలు ఏమీ లభించటం లేదు. ఈ కవి క్రీ.శ. 1076 - 1146 మధ్య ఉన్న అనంతవర్మ చోడగంగదేవుని సందర్శించినట్లు ఒక చాటువువల్ల తెలుస్తుంది. కనుక ఈ కాలంలో ఉన్నట్లు నమ్మవచ్చు. శ్రీనాథుడు "వచియింతు వేములవాడ భీమన భంగి నుద్దండలీల నొక్కొక్క మాటు" అని కాశీఖండంలో ఈ కవిని నన్నయ, తిక్కనల కన్న ప్రథమంగా పేర్కొన్నాడు. క్రీ.శ. 16వ శతాబ్దంవాడైన పింగళి సూరన రాఘవ పాండవీయంలో "భీమన తొల్లి చెప్పెనను పెద్దల మాటయె కాని యందు నొండేమియు నేయెడన్నిలుచు టెవ్వరు నొప్పరు" అని చెప్పాడు. దీనిని బట్టి భీమన రాఘవ పాండవీయం రచించాడనే ప్రచారం లోకంలో ఉన్నట్లు తెలుస్తుంది. కాని భీమకవి రచించాడంటున్న ఆ గ్రంథం ఎక్కడా లభ్యం కావటంలేదు. భీమకవి రచించిన రాఘవ పాండవీయం ముందు తన భారతం నిలువదనే భయంతో నన్నయ దానిని నాశనం చేశాడని ఒక కట్టుకథ ప్రచారంలో ఉంది. కవిజనాశ్రయము భీమన రచన అని కొందరు భావించారు కాని అది మల్లియ రేచనుని కృతం అని రూఢి అయింది. ఇంకా భీమన శతకంధర రామాయణము, నృసింహపురాణము, బసవపురాణము, జమతిశతకము, హరవిలాసము మొదలైన గ్రంథాలు రచించినట్లు లోకంలో వాడుక. ఈ గ్రంథాలు లభ్యంకాకపోయినప్పటికీ చాటువులు, శ్రీనాథుడు, పింగళి సూరన వంటివారి ప్రశంసల వల్ల వేములవాడ భీమకవి తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానం సంపాదించాడు.

### 2.8.5. అధర్వణాచార్యుడు :

అధర్వణాచార్యుడు నన్నయకు సమకాలికుడని ప్రతీతి. క్రీ.శ. 17వ శతాబ్దం వాడైన అహోబిల పండితుడు నన్నయను

ప్రథమాచార్యుడని, అధర్వణుని ద్వితీయాచార్యుడని పేర్కొన్నాడు. అప్పకవీయము మొదలైన లక్షణ గ్రంథాల్లో అధర్వణ భారతం లోనివని కొన్ని పద్యాలు ఉదహరించబడ్డాయి. ఈ పద్యాలలో అధర్వణుని కవిత్వం సంస్కృత పదభూయిష్టమై ప్రౌఢంగా ఉంది. నన్నయ అధర్వణుని భారతాన్ని తగులబెట్టించాడనే అపప్రథ లోకంలో ఉంది కాని అది విశ్వసనీయం కాదు.

అధర్వణుని పేరుతో వికృతి వివేకము, త్రిలిఙ్గ శబ్దానుశాసనము, అధర్వణ ఛందస్సు అనే మూడు లక్షణ గ్రంథాలు చలామణిలో ఉన్నాయి. వీటిలో అధర్వణ ఛందస్సు మాత్రమే అతని రచన అని పండితులు నిర్ధారించారు. క్రీ.శ. 1445 నాటి గౌరనతన 'లక్షణ దీపిక' లో అధర్వణ ఛందము నుంచి అని ఒక పద్యాన్ని ఉదాహరించాడు. ఈ పద్యాన్ని బట్టి అధర్వణాచార్యుడు నన్నెచోడునికి తరువాతి వాడవుతాడు కాని నన్నయకు సమకాలికుడు కాదు. అధర్వణుడు రచించినట్లుగా విశ్వసిస్తున్న భారతము, అధర్వణ ఛందము ఇప్పుడు లభ్యం కావటంలేదు.

## 2.9. గుర్తుంచుకోదగిన ముఖ్యవిషయాలు :

ఆంధ్రభాషా, సాహిత్యసేవ చేసిన ఖ్యాతి చాళుక్యులకు దక్కుతుంది.

నన్నయ వాగనుశాసనుడై ఆంధ్రభాషా సాహిత్యాలకు దిశానిర్దేశం చేసి ఆదికవిగా ప్రసిద్ధిచెందాడు.

వ్యాసుని అభిహితార్థం ఆవిష్కృతం అయ్యేటట్లు నన్నయ ఆంధ్రమహాభారతాన్ని తీర్చిదిద్దాడు.

నన్నయ అవిరళ జపహోమ తత్పరుడు, సంహితాభ్యాసుడు, బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు, విపుల శబ్దశాసనుడు, లోకజ్ఞుడు, ఉభయ భాషాకావ్య రచనాభి శోభితుడు, నిత్య సత్యవచనుడు, మత్యమతాధిపాచార్యుడు, - ఈ యోగ్యతలన్నీ మహాభారతాంధ్రీకరణకు సంపూర్ణ అర్హత కలవానిగా చేశాయి.

తన వంశకర్తల గాథలను వినాలనే కుతూహలం గాఢంగా ఉన్న రాజరాజ నరేంద్రుడు భారత రచనకు నన్నయను ప్రోత్సహించాడు. వైదిక మతప్రచార అపేక్ష, ఆంధ్రభాషాభిమానం కూడ ముఖ్యకారణాలు.

సంస్కృతంలో లక్ష శ్లోకాలకు వ్యాపించిన భారతాన్ని కవిత్రయం 25000 పద్యగద్యాలలో అనువదించారు. అందులో నన్నయ మూలంలో 17000 శ్లోకాలు ఉన్న భాగాన్ని నాలుగువేల పద్యగద్యాలలో రచించాడు.

ఈ మహాయజ్ఞంలో సహాధ్యాయి, వాఙ్మయ దురంధరుడైన నారాయణభట్టు నన్నయకు సహకారం అందించాడు. ఈ సహాయం భారతయుద్ధంలో అర్జునునకు కృష్ణుడు చేసిన సహాయం వంటిదని నన్నయ కృతజ్ఞత వ్యక్తం చేశాడు.

నన్నయ మూలంలోని కథను సందర్భానికి అనుగుణంగా మారుస్తూ స్వతంత్రమైన మార్గంలో రచించాడు. కథ సాగేకొద్దీ మూలానుసరణ తగ్గి స్వతంత్రత స్పష్టంగా కనిపిస్తుంది.

నన్నయ మూలంలోని కొన్నింటిని యథాతథంగా అనువదించాడు. కొన్నింటిని పెంచి వ్రాశాడు. కొన్ని భాగాలను పూర్తిగా విడిచివేశాడు. కొన్నిచోట్ల అన్యధా కల్పనలు చేశాడు.

భారతాంధ్రీ కరణంలో వైదిక మతాచారాలను, వర్ణాశ్రమ ధర్మాలను, బ్రాహ్మణాధిక్యతను కొనియాడే సందర్భాల్లో నన్నయ మూలాన్ని విస్తరించి మెరుగులు దిద్దాడు.

నన్నయ ప్రసన్న కథాకలితార్థ యుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తినిధిత్వాలను కవితాలక్షణాలుగా ప్రకటించి భారతాంధ్రీకరణంలో రసానుగుణంగా వీటిని తీర్చిదిద్దాడు.

ఆయా సందర్భాల్లో ప్రధాన రసమైన శాంతరసానికి ఉపబలకంగా అంగరసాలైన శృంగార, హాస్య, వీర, భీభత్సాది రసాలను సముచితంగా కూర్చి భారతాన్ని రసరమ్య కావ్యంగా మలచాడు.

పాత్రచిత్రణ విషయంలో పాత్రల మూలస్వభావాలను అతిక్రమించకుండ తెలుగుతనం ఉట్టిపడే విధంగా తీర్చిదిద్దాడు.

నన్నయ ప్రధానంగా ఆఖ్యానశైలిని అనుసరించినప్పటికీ సన్నివేశాలకు అనుగుణంగా నాటకీయ, వర్ణనాత్మకశైలిని కూర్చి కథాగమనానికి బలం చేకూర్చాడు.

నన్నయ ఆంధ్రమహాభారతం కాక మరికొన్ని గ్రంథాలు రచించాడనే ప్రచారం ఉన్నప్పటికీ, ఒక్క నందంపూడి శాసనరచన తప్ప నన్నయ ఇతర రచన ఏదీ చేయలేదని తెలుతుంది.

## 2.10. ప్రశ్నలు :

1. మహాభారతాంధ్రీకరణకు నన్నయను రాజరాజ నరేంద్రుడు ప్రోత్సహించిన విధానం వివరించుము.
2. నన్నయ భారతాంధ్రీకరణ విధానాన్ని గూర్చి వ్రాయుము.
3. నన్నయ కవితారీతులను వివరించుము.
4. నన్నయ శైలిని గూర్చి వ్రాయుము.

### లఘు ప్రశ్నలు :

1. నన్నయ వాగనుశాసనుడు అనే అంశాన్ని నిరూపించుము.
2. 'మహాభారతం తొలి తెలుగు కావ్యం' - ఈ అంశాన్ని రూఢి పరచుము.
3. నన్నయకు నారాయణభట్టు చేసిన సహాయం ఎట్టిది?
4. నన్నయ అక్షరరమ్యతను గూర్చి వ్రాయుము.
5. నన్నయ ప్రసన్న కథాకలితార్థయుక్తిని వివరించుము.
6. నన్నయ భారతంలోని సూక్తులను గూర్చి వ్రాయుము.
7. నన్నయ సమకాలికులను గూర్చి వ్రాయుము.
8. నన్నయ వ్యక్తిత్వమును వివరించుము.

## 2.11. ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రసాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగుసాహిత్య సమీక్ష - భాగం-1 - ఆచార్య జి. నాగయ్య
3. తెలుగుసాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా॥ నా॥ శాస్త్రి
4. నన్నయభట్టు - వ్యాసం - మహాభారతవైజయంతి - 5వ భాగం - ఆచార్య దివాకర్ల వెంకటావధాని.

డాక్టర్ గుంటుపల్లి రామారావు
సి-122, యస్.వి.యన్. కాలనీ
గుంటూరు - 522 006

పాఠం - 3

# శివకవి యుగం


3.0 లక్ష్యం
3.1 శివకవి యుగం - నేపథ్యం
3.2 దేశి కవిత
3.3 జాను తెనుగు
3.4 వస్తు కవిత
3.5 మార్గ - దేశి కవితలు
3.6 ద్విపద
3.7 శివకవి యుగం - ప్రత్యేకతలు
3.8 రాదగిన ప్రశ్నలు
3.9 ఆధార గ్రంథాలు


## 3.0 లక్ష్యం :

శివకవి యుగంలో వెలసిన శైవగ్రంథాలు, దేశి కవిత, జాను తెనుగు ప్రాచుర్యం గురించి, శివకవి యుగ ప్రత్యేకతల గురించి ఈ పాఠంలో తెలుసుకుంటారు.

## 3.1. శివకవి యుగం - నేపథ్యం :

తెలుగు సాహిత్య చరిత్రలో శివకవి యుగానికి ప్రత్యేక స్థానం ఉంది. దీనికి కారణం ఆ కాలంలో వచ్చిన రచనలు విశిష్ట లక్షణాలతో ఉండటమే. ఆంధ్రదేశంలో క్రీ.శ. 7వ శతాబ్ది నుండి రేనాడు, కొత్తపినాడు, కొణిదెన పాకనాడు లను తెలుగు చోళులు పరిపాలించారు. ఈ రాజుల కాలంలో తెలుగు భాషకు మంచి ఆదరణ లభించింది. తెలుగు చోళులు తెలుగులో వేయించిన శాసనాలు ఎర్రగుడిపాడు, పొట్లదుర్తి, కలమళ్ళ, మాలెపాడు తదితర ప్రదేశాలలో లభించాయి. ఇలాంటి శాసనాలు ఆధారంగా నాడు ఆవిర్భవించిన శివకవుల కవిత్వం తీరుతెన్నులు కూడా తెలుసుకొనేందుకు వీలు కలిగింది.

### 3.1.1. రాజకీయ నేపథ్యం :

శివకవి యుగ అవతరణకు కొంత రాజకీయ నేపథ్యం ఉంది. ఆంధ్రదేశ చరిత్రలో రాజరాజు మరణించిన తరువాత కాకతీయ సామ్రాజ్య స్థాపన జరిగే సమయం దాకా ఉన్న కాలాన్ని మాండలిక యుగం అంటారు. ఈ కాలంలో మండలాధిపతులలో శైవ, వైష్ణవ మత భేదాలు పెరిగి మత, రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఈ కాలానికి చెందిన నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు లాంటి శైవ మత ప్రముఖులైన వారు కొన్ని గ్రంథాలను రచించారు. వైదిక మతం మీద వారు నిరాశక్తతను కనబరుస్తూ ఉండేవారు. ఇలాంటి వారంతా శైవ మతస్థులుగా ఆనాడు ప్రత్యేక గుర్తింపు పొంది ఉండేవారు. శైవ మతాన్ని అనుసరించే వారిలో పాశుపతులు, కాపాలికులు, కాలాముఖులు, గోరక్షనాథులు, రాసేశ్వరులు, తదితర తెగలు ఉండేవి. తెలుగు నాట కాలాముఖ, పాశుపతశైవ సంప్రదాయాలు వ్యాపించిన కాలంలోనే ద్రవిడ దేశంలో శివభక్తులైన నయనార్లు

అవతరించారు. అక్కడ వారు భక్తి ప్రధాన శైవ మతాన్ని వ్యాపింపచేసారు. శివభక్తుల గాథలు దేశంలో వ్యాపించి ప్రజా హృదయాలలో అపూర్వ ఉత్సాహాన్ని రేకెత్తించాయి. భక్తి ప్రధానంగా ఉండే శైవం మీద జన సామాన్యానికి అత్యంత విశ్వాసం కలిగింది. భక్తి ఉద్యమం ఊపందుకోవటానికి తగిన వాతావరణం ఏర్పడింది.

ఇలా శైవం సామాన్య ప్రజానీకానికి చేరువైంది. అయితే అందులో మరి కొంత ఆవేశం చోటు చేసుకొని ఆవేశపూరితంగా ప్రవర్తించే శైవులంతా మేము వీరశైవులం అంటూ బయలుదేరారు. కర్ణాట దేశంలో బసవేశ్వరుడు ఈ వీరశైవాన్ని పెంచి పోషించాడు. క్రీ.శ. **1162** ప్రాంతంలో చాళుక్య సామ్రాజ్యాన్ని పాలించిన బిజ్జలుని మంత్రిగా, దండనాయకుడుగా బసవేశ్వరుడుండేవాడు. ఈయన ఊతంతో వీరశైవం బాగా ప్రచారంలోకి వచ్చింది. అనేక శైవ శాఖలున్నా వీరశైవ సంప్రదాయమే కన్నడ, ఆంధ్ర సారస్వతాలలో అపూర్వమైన దేశీ వాఙ్మయ సృష్టికి శ్రీకారం చుట్టింది.

దీనికి కారణం ఏ ఉద్యమం అయినా ప్రజల ఊతంతో ముందుకు సాగుతూ ప్రజల భావాలకు ఊతమిస్తూ తాను వెలుగొందడమే. శివకవి యుగమనేది ఓ ఉద్యమమై ఇలాగే ముందుకు సాగింది. నన్నయ్య, తిక్కనల మధ్య కాలంలో ఉన్న వైష్ణవ మతం కన్నా ఈ బసవ మతమే తెలుగు దేశంలో బాగా వ్యాప్తి చెందింది. దానికి కారణం తెలుగు దేశంలో అంతకు పూర్వమే శైవమతానుయాయులు ఎక్కువగా ఉండటమే. నన్నయ్య, తిక్కనల మధ్యకాలంలో ఉన్న తిక్క భూపాలుడు వైష్ణవుడు. ఈయన పాకనాడు, కమ్మనాడులలో వైష్ణవాన్ని వ్యాప్తిచేస్తూ ఆలయ నిర్మాణం కూడా చేపట్టాడు. అయినా శైవానిది ఆనాడు పైచేయిగా ఉండేది.

వీరశైవం వర్ణాశ్రమాలను నిరసిస్తూ భక్తి ప్రధానంగా ఉంటూ ఆవేశపూరితమైన భావాలతో ఉండేది. ఇలాంటి వీరశైవాన్ని రేవణారాధ్యుడు, మరుళారాధ్యుడు, పండితారాధ్యుడు, ఏకోరామారాధ్యుడు, విశ్వారాధ్యుడు అనే అయిదుగురు ప్రధానంగా ప్రచారం చేసారు. ఈ అయిదుగురిలో పండితారాధ్యుడు వీరశైవంలోని ఒక అవాంతరశాఖ అయిన ఆరాధ్య సంప్రదాయాన్ని స్థాపించాడు.

శివకవి యుగంలో ప్రధానంగా కనుపించే నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు అనే వారిని శైవకవిత్రయం అంటారు. వీరంతా శివ పారమ్యాన్ని బోధించే గ్రంథాలను రచించారు. వీరిలో మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు అనే ఇద్దరూ పరమ శైవాచార నిష్ఠాపరులు. పండితారాధ్యుడని శివప్రమథుల అవతారమని, శివుడితో సమానమైన శక్తి ఉన్నవాడని ఆనాడు భావించేవారు. అలాగే పాల్కురికి సోమనాదుడు ప్రమథగణాలలో ఒకడైన భృంగిరిటి అవతారమని భావించేవారు. సోమనాథుడు కేవలం కవిత్వాన్ని రాసి ఊరుకోక వీరశైవమత వ్యాప్తికి తన జీవిత సర్వస్వాన్ని అంకితం చేసాడు. చక్రపాణి రంగన శివభక్తుడుగా దీక్ష తీసుకోవటానికి నయన రగడ (శివభక్తి దీపిక), నమశ్శివాయ రగడ లాంటి శైవ గ్రంథాలను రచించటానికి ఎంతో స్ఫూర్తినిచ్చాడు.

శివకవి యుగంలో స్వతంత్ర గ్రంథాలు బాగా వెలువడ్డాయి. ఆ గ్రంథాలలోని విషయంలో, భాషలో, ఛందస్సులో దేశీ ప్రాధాన్యం అధికమైనందువల్ల శివకవి యుగాన్ని స్వతంత్ర యుగమని కూడా అనవచ్చు. ఈ యుగంలో వచ్చిన శైవ వాఙ్మయ స్వరూపంలో ఉన్న తొలి లక్షణం శివ పారమ్యాన్ని ఉద్బోధించటం.

శివకవులకు శైవమత ప్రచారమే పరమలక్ష్యం. కుమార సంభవాన్ని రచించిన నన్నెచోడుడు శివకవులలో ప్రథముడు. ఆయన కవిత్వ శైలిని పరిశీలిస్తే ప్రధానంగా ఆయనకు కావ్య రచనా దృష్టి ఉన్నట్లు అవగతమవుతుంది. శివపారమ్యాన్ని చెప్పటం ఆయన రచన ప్రణాళికలో ఉన్న ఒక అంశం మాత్రమే. నన్నెచోడుడు కుమార సంభవాన్ని శైవమత ప్రచారం కోసం రచించినట్లు ఎక్కడా చెప్పినట్లు కనుపించదు. తన గురువైన జంగమ మల్లికార్జున యోగికి తన కుమార సంభవం అంకితం చేసి లోకంలో కవిగా తాను ప్రసిద్ధి చెందాలని అనుకున్నట్లుగా కనుపిస్తుంది.

### 3.1.2. భాషా నేపథ్యం :

నన్నయ్య తరువాత భాషా పరిస్థితులలో మార్పు వచ్చినట్లు కనుపిస్తుంది. అప్పటిదాకా ఉన్న మార్గ పద్ధతి వెనుకపడి దేశి పద్ధతిలో జాను తెనుగు పదజాలంతో కవిత్వం ఆవిర్భవించింది. జన సామాన్యంలో ఉన్న భాష, వ్యవహార ప్రయోగాలతో ఈ కాలంలో రచన సాగింది. శైవమత కావ్యాలకు స్ఫూర్తి నిచ్చిన నన్నెచోడుడు మార్గ కవులను నిరసించటంతో పాటు దేశి కవిత్వాన్ని ప్రశంసించాడు. దేశి తెనుగును సంస్కృత భాషతో దీటుగా తీర్చిదిద్దారు నాటి శివకవులు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన చేసి వీరశైవ వాఙ్మయాన్ని మోర్చారు. దీంతో అలతి అలతి పదాలలో తేట తేట తెనుగులో వేదాంత విషయాలు కూడా సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా ఆవిర్భవించాయి.

### 3.1.3. మత పరిస్థితుల నేపథ్యం :

క్రీ.శ. 12వ శతాబ్దం నాటికి ఆంధ్ర, కర్ణాట దేశాలలో భక్తి ప్రధానంగా శైవ మతం విలసిల్లింది. దీనిలో ఇతర విషయాలకన్నా భక్తి ఒక్కటే ప్రధానంగా ఉండి వీరశైవానికి ప్రతీకగా అయింది. ఇలాంటి కవిత్వాన్ని నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు ఎక్కువగా సృష్టించారు. ఈ కారణం చేతనే వీరికి శివకవులలో అగ్రస్థానం లభించింది. దీనికి తోడు కన్నడ దేశంలో జన్మించిన బసవేశ్వరుడు వీరశైవ మతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. శివపారమ్యం తప్ప మరొకటి ఏదీ జీవిత లక్ష్యం కాకూడదన్నది నాటి శివకవుల మాట. శివుడు తప్ప ఇతర దేవత లెవరూ పూజార్హులు కాదన్నది వారి భావన. బసవేశ్వరుడు నందీశ్వరుడి అవతారమని, పాల్కురికి సోమన ప్రమధ గణాలలోని భృంగిరిటి అవతారమన్నది వారి నమ్మకం. బ్రాహ్మణ ధర్మాన్ని, వైదిక కర్మలను నాటి వీరశైవులు తెగనాడారు. కర్మజ్ఞానాన్ని విడనాడారు. కేవలం శివభక్తిని మాత్రమే ప్రబోధించారు. ఇలా నాడు ప్రబోధం ద్వారా ప్రజలలో ప్రచారమైనదే వీరశైవం. వీరశైవులంతా జంగమ దేవరలే. వేంగి రాజ్యంలో దాక్షారామంలో జన్మించిన మల్లికార్జున పండితుడు వీరశైవాన్ని సంస్కరించాడు. వీరశైవులలో బ్రాహ్మణులకు ఆధిపత్యాన్ని కల్పించి వారిని ఆరాధ్యులు అని అన్నాడు. పాల్కురికి సోమన సంస్కృతాంధ్ర భాషలలో తమిళ, కన్నడ భాషలలో గొప్ప పండితుడు. ఆయన బసవన్న చరిత్ర, పండితారాధ్య చరిత్రలను ప్రాచీన శివభక్తుల చరిత్రలను, స్తుతులను, ఎన్నిటినో రచించి ప్రసిద్ధి పొందాడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్రలను ద్విపదలలో రచించటంతో అవి ఎక్కువ ప్రజాదరణ పొందాయి.

## 3.2. దేశి కవితోద్యమం :

శివకవి యుగంలో ఉన్న ఓ ప్రత్యేకత దేశి కవితోద్యమం. శివకవులకు శైవం పరమ లక్ష్యమైనట్లే కవిత్వంలో దేశి రచన పరమలక్ష్యం. చాళుక్యలు దేశి కవితను పుట్టించి తెలుగును నిల్పినా మార్గ కవిత మీదే ఎక్కువ ఆసక్తి చూపారన్నది పండితాభిప్రాయం. అయితే శైవ మత ప్రచారం కోసమే పాల్కురికి సోమనాధుడు దేశికవితోద్యమాన్ని చేపట్టాడు. ఇలా తెలుగువారి స్వతంత్ర సాహిత్య ప్రక్రియలకు శివకవి యుగం తలుపులు తెరిచిందని చెప్పవచ్చు. ఈ యుగంలో ద్విపద, ఉదాహరణ, రగడ, శతక, గద్య తదితర దేశి సాహిత్య ప్రక్రియలు బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. పాల్కురికి సోమనాధుడు ఈ వ్యాప్తికి ప్రధాన కారకుడు. నన్నెచోడుని కూమార సంభవ కావ్యం ప్రధమాంధ్ర ప్రౌఢ ప్రబంధంగా ప్రసిద్ధి కెక్కింది.

శివకవులలో పండితత్రయంగా శ్రీపతి పండిత, మల్లికార్జున పండిత, మంచెన పండితులు ప్రసిద్ధికెక్కారు. ఈ ముగ్గురిలో శ్రీపతి పండితుడు క్రీ.శ. 950 ప్రాంతానికి చెందినవాడు. ఈయన బ్రహ్మవాదులను వ్యతిరేకించాడు. క్రీ.శ. 1030కి చెందిన మంచెన పండితుడు. విష్ణువాదులను, క్రీ.శ. 1160కి చెందిన మల్లికార్జున పండితుడు శివుడు కేవలం సంహారకర్త అనే పాక్షిక శైవ వాదులను ఖండించి శివుడి గొప్పతనాన్ని, శివశక్తిని ప్రచారం చేసారు. శైవమత ప్రచారం కోసం ఎన్నెన్నో మహిమలను చూపారు. వీరి తరువాత యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకాన్ని రచించి శివకవుల వరుసలో నిలిచాడు. చక్రపాణి రంగన స్వతహాగా

వైష్ణవుడే అయినా ఆ తరువాత శైవాన్ని స్వీకరించాడు. వీరభద్ర విజయం అనే 500 వందల సీసపద్యాలను శ్రీశైల మల్లికార్జునుడి పేరున ఎనిమిది వేల పద్యాలున్న ఒక గ్రంధాన్ని, వెయ్యి పాదాలున్న ఒక దండకాన్ని, ఒక తారావళిని, నాలుగు లయ గ్రాహులను, ఒక వృత్త శతకాన్ని, వేయి బోధక వృత్తాలను, వంద తోట వృత్తాలను, ఏడు రగడలను, మూడు వేల మత్త కోకిలలను, ఆరు వందల గీత పద్యాలను, ఎనిమిది మంజరులను, అయిదు వందల కంద పద్యాలను, ముప్ఫై ఆరు గద్య పద్యాలను మరో ముప్ఫై ఆరు ఉభయ శతకాలను రచించాడని పండితులు చెబుతున్నా ప్రస్తుతం అవేవీ లభించటం లేదు.

## 3.3. జాను తెనుగు :

జాను తెనుగు అనే పదాన్ని నన్నెచోడుడు తొలిగా వాడాడు. ఈ పదానికి అర్థం ఏమిటి? అనే విషయంలో పండితుల మధ్య సుదీర్ఘ చర్చలే జరిగాయి. జాను అనేది చదును శబ్దానికి రూపాంతరమని, చదును అనేది చదురు పదానికి రూపాంతరమని, ఇది చతుర శబ్దాన్నుండి పుట్టిందని కనుక జాను తెనుగు అంటే సర్వజన సుబోధకమైన తెనుగు అని అనవచ్చని చిలుకూరి నారాయణరావు గారు రాసారు. అయితే పాల్కురికి సోమనాధుడు తన వృషాధిప శతకంలో

"బలుపొడ తోలు సీరయము బాపనరుల్ గిలు పారు కన్ను వె
న్నెల తల సేదు గుత్తుకయు నిండిన వేలుపు టేఱు వల్గు పూ
సలు గల జేని లెంకవని జాను దెనుంగున విన్నవించెదన్"

ఈ పద్యం వల్ల జాను తెనుగు అంటే అచ్చ తెనుగేనని అర్థమవుతుందని శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి గారు అన్నారు. జాను తెనుగు కన్నడ జాన్నుడికి ప్రత్యామ్నాయమైన తెనుగు పదమని మరి కొందరు పండితులు భావించారు. జాను శబ్దం జ్ఞానశబ్ద భవమని, జాణకు తోబుట్టువని నేలటూరి వేంకట రమణయ్య గారు అన్నారు. అయితే జాను శబ్దానికి అందం, సౌందర్యం, అనే అర్థాలను మామిడి వేంకటార్యుడి ఆంధ్ర దీపిక, శబ్ద రత్నాకరం పేర్కొంటున్నాయి. జాను శబ్దాన్ని స్పష్టం అనే అర్థంలో తిక్కన ప్రయోగించాడు. ఇలా చూస్తే జాను తెనుగు అంటే అందమైన, ఇంపైన, స్పష్టమైన తెనుగు అని అనవచ్చన్నది అధిక సంఖ్యాక పండితాభిప్రాయం.

## 3.4. వస్తు కవిత :

నన్నెచోడుడు పేర్కొన్న మరో శబ్దం వస్తుకవిత వస్తుకవిత శబ్దాన్ని కన్నడ కవులైన పంపకవి లాంటి వారిని అనుసరించే నన్నెచోడుడు వాడినట్లుగా తెలుస్తుంది. తెలుగులో ఆశుకవిత, మధుర కవిత, చిత్ర, విస్తర కవితలనే చతుర్విధ కవితలు ప్రచారంలో ఉన్నాయి. నన్నెచోడుడు వాడిన వస్తు కవిత విస్తర కవితలో అంతర్భాగం కావచ్చునని తిమ్మావజ్జల కోదండ రామయ్య గారు భావించారు. వస్తు ప్రధానమైన కవితే వస్తు కవిత అని విన్నకోట పెద్దన చెప్పారు. సామాన్యంగా వస్తువు అంటే కథ. ఇతివృత్తం అని ఆలంకారికుల పరిభాష. కోరాడ రామకృష్ణయ్య గారు భావ ప్రధానమైన దానికి భిన్నమై వస్తు ప్రాధాన్యం కలిగి వర్ణనీయ వస్తువును గూర్చి చమత్కార వర్ణనలతో కూడిన కవితను వస్తు కవిత అనవచ్చన్నారు. వస్తు శబ్దానికి ప్రకృతి అని మరో అర్థం ఉండటం చేత ప్రకృతిని గూర్చి వర్ణించే కవిత వస్తు కవిత అని అమరేశం రాజేశ్వర శర్మ అభిప్రాయం వ్యక్తం చేసారు. ఇది కోరాడ రామకృష్ణయ్య లాంటి వారి నిర్వచనాలకు దగ్గరగా ఉంది. దీన్ని అనుసరించి చూస్తే నన్నెచోడుడి కవిత్వంలో ఉన్న వన, ఋతు, సముద్ర, చంద్రోదయ, సూర్యోదయ, జలకేళి తదితర వర్ణనలు ప్రకృతి వర్ణనలే కనుక నన్నెచోడుడి కవిత వస్తు కవిత అని అనడానికి వీలుంటుంది. అలా చూస్తే నన్నెచోడుడి కంటే ముందు వారైన వాల్మీకి, భార్గవి, ఉద్భటుడు లాంటి కవుల కవిత్వం కూడా వస్తు కవితేనని అనిపించక మానదు.

## 3.5. మార్గ - దేశి కవితలు :

శివకవి యుగంలో ప్రస్తావన కొచ్చిన మరో ప్రధానాంశం, మార్గ-దేశి అనే కవితా భేదం. తెలుగులో మార్గ-దేశి పదాలను కవిత్వ పరంగా వాడిన తొలికవి నన్నెచోడుడు. ఈయన రచించిన కుమార సంభవ పీఠికలో మార్గ - దేశి భేదాల ప్రస్తావన ఉంది.

"మునుమార్గ కవిత లోకంబున వెలయఁగ
దేశి కవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్ర విషయంబునఁ జనఁ
చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"

అనే పద్యంలో చాళుక్య రాజుల్లాంటి అనేకులు దేశి కవితను పుట్టించి తెలుగు దేశంలో నిలిపారని నన్నెచోడుడు తెలిపాడు. సంస్కృత కవితను మార్గ అని, దేశభాషల్లోని కవితను దేశి అని ఈ పద్యాన్ని బట్టి అనవచ్చని శ్రీ పాద లక్ష్మీపతి శాస్త్రి లాంటి వారు అభిప్రాయపడ్డారు.

ఇతివృత్తం, భాష, ఛందస్సు తదితరాల విషయంలో సంస్కృత సాహిత్య లక్షణ ప్రభావానికి విధేయమైన దంతా మార్గ కవిత అని, దానికి భిన్నమైన దంతా దేశి అని మరి కొంత మంది వ్యాఖ్యానించారు. మార్గ కవిత అంటే కేవలం పండితుల స్థాయిలో ఉండే ప్రౌఢ కవిత. దేశి కవిత అంటే అంత ప్రౌఢ తరంగా కాక కథావస్తువు, వర్ణనలు, భావం, భాష, రీతులు, అలంకారాలు, కవి సమయాలు, ఛందస్సు, సాహిత్య ప్రక్రియలు లాంటి వాటిలో దేశీయ లక్షణాలను కలిగి ఉండి ప్రజా జీవితానికి సన్నిహితంగా జన సామాన్యానికి దగ్గరగా ఉండే ప్రజా కవిత అని స్థూలార్థంలో పండితులు నిర్ధారించి చెప్పారు.

## 3.6. ద్విపద :

దేశి కవితా శాఖలన్నింటిలో గుణము, పరిమాణం, ప్రయోజనం, పండిత లోకాదరణలలో అగ్రగణ్యమైనది ద్విపద కవితాశాఖ. ద్విపద అంటే మాత్రా ఛందస్సుకు చెందిన రెండు పాదాలున్న రచన, ఒక్కొక్క పాదానికి మూడు ఇంద్ర గణాలు, ఒక సూర్య గణము ఉంటాయి. ప్రతి పాదం లోని మూడవ గణం మొదటి అక్షరంపై యతి చెల్లుతుంది. అటువంటి రెండు పాదాలను ప్రాస కలుపుతుంది. ద్విపదలో రెండు పాదాలు మొదలుకొని ఎన్ని పాదాలైనా ఉండవచ్చు. అయితే ఆ పాదాల సంఖ్య సరి సంఖ్యలో ఉండాలి. ఈ ద్విపద తెలుగులో ఉన్న అనేక దేశి ఛందస్సులకు మూలమైంది. ఈ ద్విపదే ప్రాస లేనప్పుడు మంజరి అవుతుంది. దీనిలోని రెండు పాదాలను ఒకదాని వెనుక ఒకటి రాసినప్పుడు కర్వోజ పాదమవుతుంది. నాలుగు పాదాలుగల కర్వోజ, మధ్యాక్కర, సీసపద్యం ఇలాంటి వన్నీ ద్విపద రూపాంతరాలే. శివ కవులలో ప్రధానుడైన పాల్కురికి సోమనాధుడికి ముందు ద్విపద కావ్యాలు లేవు. ద్విపద కావ్య కర్తలలో ఈయనే ప్రథముడు. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర అనేవి ద్విపద శైలిలో ఆవిర్భవించి వీర శైవ మత ప్రచారానికి బాగా ఉపకరించాయి. సోమనాధుడి తర్వాత కోన బుద్ధ భూపతి (గోన బూద్దారెడ్డి) రంగనాథ రామాయణాన్ని ద్విపదలో రచించాడు. అనంతర కాలంలో ఈ ద్విపద మరికొద్ది పాటి మార్పులలో విస్తృత ప్రచారం జరిగింది.

## 3.7. శివకవి యుగం - ప్రత్యేకతలు :

శివకవుల వల్ల దేశి కవితాశాఖలైన ద్విపద, శతకము, ఉదాహరణము, రగడ, గద్యలు విరివిగా వ్యాప్తిలోకి వచ్చాయి.

నన్నెచోడుడి విషయానికి వస్తే ఓ ప్రత్యేకత కనుపిస్తుంది. ఈయన శివభక్తుడే కానీ వీరశైవుడు మాత్రం కాదు. వీరశైవులకు కొన్ని లక్షణాలున్నాయి. వీర శైవాన్ని స్వీకరించి జంగములుగా అయిన వారు ఎక్కడా తమకు జన్మనిచ్చిన తల్లితండ్రుల పేర్లను చెప్పరు. కానీ నన్నెచోడుడు తన తల్లితండ్రులు శ్రీపతి, చోడబల్లి అనే వారని పేర్కొన్నాడు. దీన్నిబట్టి నన్నెచోడుడు వీరశైవుడు

కాడని తెలుస్తుంది. ఈయన తాను రచించిన కుమార సంభవాన్ని కేవలం శివ పారమ్య దృష్టితో రచించలేదు. దీనిలో అన్ని రకాల వర్ణనలు కనుపిస్తాయి. శివుడిని అష్టమూర్తిగా వర్ణించటం, పార్వతీ పరమేశ్వరుల ప్రణయ వృత్తాంతం, కుమారస్వామి జన్మ వృత్తాంతం, తన గురువు జంగమ మల్లికార్జునుడికి, శివుడికి భేదం లేదు అని చెప్పటం కనుపిస్తుంది.

శివకవులలో పండితత్రయం ఉంది. క్రీ.శ. 950కి చెందిన శ్రీపతి పండితుడు, క్రీ.శ. 1030కి చెందిన శివలెంక మంచెన, క్రీ.శ. 1160కి చెందిన మల్లికార్జున పండితులను పండితత్రయం అంటారు. వీరిలో శ్రీపతి పండితుడు బ్రహ్మసూత్రాలకు శివపరంగా భాష్యం రాసాడని చెబుతారు. ఈయననే పాల్కురికు సోమనాథుడు గొప్ప కవిగా పేర్కొన్నాడు. కానీ ఆయన రచించిన కావ్యాలు ఏవీ దొరకలేదు. శివలెంక మంచెన రచించిన గ్రంథాలు కూడా అలభ్యాలే. మల్లికార్జున పండితుడు చందవోలులో వెలనాటి చోడుని ఆస్థానంలో బౌద్ధులను ఓడించి శైవ మతాన్ని స్థాపించాడు. ఈయన సంస్కృతంలో రుద్రమహిమ, పంచ గద్యలు, అమరేశ్వరాష్టకం, గుణ సహస్రమాల, లింగోద్భవ గద్యలను రచించాడు. కన్నడంలో బసవగీత, ప్రభులింగ స్తోత్రాలను రచించాడు. తెలుగులో ఈయన రచించిన శివతత్త్వసారం శివభక్తి తత్త్వాన్ని బాగా ప్రచారం చేసింది. శివకవుల కవిత్వంలో ఉన్న లక్షణాలలో ప్రధానమైనది మార్గ పద్ధతిని అనుసరించే లాక్షణికుల నియమాలకు లోబడక పోవడం. శివకవులు శైవ వాఙ్మయాన్ని ఇతర వాఙ్మయంలాగానే అభివృద్ధి చేసారు. శైవవాఙ్మయంలో సంప్రదాయ సిద్ధాంత గ్రంథాలు, పురాణాలు, నాటకాలు, చరిత్రలు, శతకాలు, యక్షగానాలు, దండకాలు, స్తుతులు, గేయాలు, వచనాలు లాంటి ప్రక్రియలన్నీ వచ్చాయి.

### 3.7.1. శతకాలు :

శివకవులు పెంచి పోషించిన సాహిత్య ప్రక్రియ శతకం. క్రీ.శ. 12వ శతాబ్దికి ముందు శతక రచన కనుపించదు. మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్త్వసారం అనే శతకం శతక రచనకు మూలమైంది. శివకవులు దేశి, సంప్రదాయాన్ని అనుసరించి సంగీత, సాహిత్య సమ్మిళితంగా యక్షగానాలను కూడా రచించారు. నిమ్మనాథుడు రచించిన గురునంబి చరిత్ర, వాలె కోటయ్య రచించిన భక్తి కథ విధానం లాంటివి ఇలాంటి రచనలే. శివకవులు తమకు ముందున్న నన్నయ్య లాంటి వారు మార్గ పద్ధతిలో కవిత్వం రచించారన్న దృష్టితో నన్నయ్య లాంటి కవులను తమ రచనలలో ఎక్కడా ప్రస్తావించలేదు. సంస్కృత సమాసాలతో నిండి ఉంజడే తెలుగును కాక జాను తెనుగును మాత్రమే ఆదరించారు. దేశి కవితకే పట్టం కట్టి ప్రచారం చేసారు.

### 3.7.2. ద్విపద :

ద్విపద రచన శివకవులందరికీ ఆదరణీయమైంది. పాల్కురికి సోమన

"తప్పకుండ ద్విపదలు రచియిందు - నొప్పదు ద్విపద కావ్యోక్తినా వలదు

అరూఢ గద్యపద్యాది ప్రబంధ - పూరిత సంస్కృత భూయిష్టరచన

మానుగా సర్వసామాన్యంబుగా మిఁజానుఁదెనుఁగు విశేషము ప్రసన్నతకు

. . . . . . . . . . . . . . . . . . . . . . . తిన్నని సూక్తుల ద్విపద రచింతు

నదియునుగా కైహికా ముష్మీకద్వి - పద హేతువవుట ద్విపద నొగబరగు

"ద్విపదాం బురు హముల ధృతి బసవేశు - ద్విపదాంబులతి ప్రీతిఁ బూన్తు"

అని ద్విపద ఛందస్సుకున్న యోగ్యతను చెప్పాడు.

### 3.7.3. ఛందస్సు :

శివకవులు ఛందస్సు విషయంలో కొంత స్వేచ్ఛగా వ్యవహరించారు. పాల్కురికి సోమన మాత్రా గణాలతో కూడిన జాతులలో ప్రాస, యతి చెల్లుతుందన్నాడు. కానీ రంగనాథ రామాయణం, హరిశ్చంద్ర చరిత్ర లాంటి వాటిలో ఉన్న ద్విపదలలో ప్రాస యతి కనుపించదు. శివకవులు అఖండ యతిని పాటించారు. పూర్ణబిందువుకు, అర్థబిందువుకు ప్రాస నియమాన్ని పాటించారు. భాష విషయంలో కూడా ఈ కవులు స్వేచ్ఛగా వ్యవహరించారు. దీంతో కొన్ని అసాధారణ ప్రయోగాలు వెలువడ్డాయి. దీపగంభములు, చౌదశాబ్దంబు, ముల్లోక మధ్య నిత్య నేమంబు, సర్వాంగ కచ్చడము, ఇతర వేల్పులు, ధర్మకవి లాంటి వైరి సమాసాలు వారి రచనల్లో చోటు చేసుకున్నాయి. క్త్వార్థక సంధులు, గసడదవాదేశ సంధుల విషయంలో కూడా వీరు మార్గ కవుల పద్ధతిలో కాక తమ ఇచ్ఛానుసారం ప్రవర్తించారు. మరుగున పడిన దేశ్య శబ్దాలను ప్రయోగంలోకి తెచ్చారు. సంస్కృత పదాలను తత్సమ, తద్భవాలుగా మార్పు చేయకుండా యధాతథంగా ప్రయోగించే పద్ధతిని అనుసరించి మణి ప్రవాళ శైలికి ప్రాచుర్యం కల్పించారు. "అనియతగణైః" ప్రాసోర్వ్యా, యతిర్వ్యాయనంగ తదితర ప్రయోగాలు ఇలాంటివే. శివభక్తుల కథలను కావ్యాలుగా రచించే సంప్రదాయం తెలుగులో ప్రవేశ పెట్టింది ఈ కవులే. క్రీ.శ. 12వ శతాబ్దంలో ఆవిర్భవించిన శైవ వాఙ్మయం, 13వ శతాబ్దంలో హరిహరనాథతత్త్వం వ్యాపించటంతో వెనుకపడింది.

ఇలా శివకవులు భాష విషయంలోనూ, సాహిత్య ప్రక్రియలలోనూ ఒక కొత్తదనానికి శ్రీకారం చుట్టి తమ కవిత్వ లక్షణాల విశిష్టతను చాటుకున్నారు.

## 3.8. రాదగిన ప్రశ్నలు :

1. దేశికవితోద్యమం గురించి వ్రాయండి.
2. దేశి - మార్గ కవితా రీతులను వివరించండి.
3. జాను తెనుగు ప్రత్యేకత తెల్పండి.

## 3.9. ఆధార గ్రంథాలు :

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర
2. తెలుగు సాహిత్య సమీక్ష - డాక్టర్ జి. నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొ॥ కొర్లపాటి శ్రీరామమూర్తి

డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు
లెక్చరర్, హిందూ కళాశాల
గుంటూరు - 522 001.

పాఠం - 4

# శివ కవులు

4.0 లక్ష్యం
4.1 నన్నెచోడుడు
4.2 మల్లికార్జున పండితారాధ్యుడు
4.3 పాల్కురికి సోమన
4.4 రంగనాథ రామాయణము
4.5 రాదగిన ప్రశ్నలు
4.6 ఆధారగ్రంథాలు

## 4.0 లక్ష్యం :

శివకవులైన నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు, గోన బుద్ధారెడ్డి కవితా వైశిష్ట్యాన్ని ఈ పాఠంలో తెలుసుకుంటారు.

## 4.1. నన్నెచోడుడు :

తెలుగు సాహిత్య పరిశోధకులు నన్నెచోడుడి కాలాన్ని క్రీ.శ. 1160 ప్రాంతంగా భావిస్తున్నారు. ఈయన కుమార సంభవం అనే కావ్యాన్ని రాసాడు. నన్నెచోడుడు నన్నయ్య కంటే ముందువాడన్న ఓ వాదం ఉంది. కానీ దాన్ని పండితులు అంతగా ఒప్పుకోలేదు. మార్గకవితను పూర్తిగా నిరసిస్తూ ఈయన దేశికవితను, జానుతెనుగును, వస్తుకవితను ప్రచారంలోకి తెచ్చాడు.

"మును మార్గ కవిత లోకంబున
వెలయగ దేశి కవిత పుట్టించి తెనుం
గును నిలిపిరాంధ్ర విషయంబున చాళుక్యరాజు
మొదలుగ బలువుర్"

అని నన్నెచోడుడు తొలిసారిగా మార్గ, దేశి కవితల ప్రస్తావనను తెచ్చాడు. మార్గను కుమార్గముగా సూటిగా గుచ్చి కుదిపేసాడు.

నన్నెచోడుడు ఏ కాలానికి చెందినవాడన్న విషయంలో కూడా భేదాభిప్రాయాలున్నాయి. దీనికి కారణం ఆయన రచించాడని అంటున్న కుమార సంభవమనే కావ్యంలో ఆయన తల్లితండ్రుల పేర్లు తప్ప మరి ఏ ఇతర ఆధారాలు లేకపోవటమే.

"అరి సరసాల మౌళిదళితాంఘ్రి యుగుండగువాడు, పాకనాఁ
డిరువది యొక్క వేయిటి కధీశుఁ నాఁజను చోడ పల్లికిన్
జిరతర కీర్తికగ్ర మహిషీ తిలకంబున హైహయాన్వయాం
బర శశిరేఖయైన గుణభాసని శ్రీపతికిం దనూజుఁడన్"

ఈ పద్యంలో తన రాజ్యం సంగతి, వంశం, తల్లితండ్రులు, గురువుల ప్రస్తావన తెచ్చాడు.

క్రీ.శ. 10వ శతాబ్దికి పూర్వం కుడుంబాలూరు శాసనంలో విక్రమకేసరి అనే చోళరాజు మల్లికార్జున మునికి ఒక మఠాన్ని కట్టించినట్లుంది. క్రీ.శ. 902 బీచుపల్లి శాసనంలో చోడబల్లి అనే చోళరాజు విశ్వనాథ దేవుడికి భూదానమిచ్చినట్లుగా ఉంది. వీటిని బట్టి మానవల్లి రామకృష్ణ కవి నన్నెచోడుడు క్రీ.శ. 940 ప్రాంతానికి చెందినవాడని అభిప్రాయం వ్యక్తం చేసారు. చోడబల్లి, నన్నెచోడ, మల్లికార్జునులు అనే పేర్లు ఆ కాలంలో చాలా మందికి ఉంటుండటంతో నన్నెచోడుడు ఏ కాలానికి చెందిన వాడో తేల్చి చెప్పటం కష్టతరమైంది. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, జయంతి రామయ్య గారు నన్నెచోడుడు క్రీ.శ. 1125 ప్రాంతానికి చెందినవాడని పెద్దచెరుకూరు శాసనాన్ని బట్టి నిర్ణయించారు. శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి తదితరులు తిక్కన యుద్ధవర్ణనలకు, నన్నెచోడుడి యుద్ధవర్ణనలకు పోలిక ఉండటంతో నన్నెచోడుడు తిక్కనకు తరువాతి వాడని అన్నారు.

### 4.1.1. కుమార సంభవం :

నన్నెచోడుడు రచించిన కుమార సంభవ కావ్యం శివకవులకు కొంత మార్గదర్శకంగా అయింది. ఆయన ఆ కావ్య ప్రారంభంలో మహాదేవుడిని ప్రార్థించాడు. అభీష్టదాత పార్వతీపతేనని అన్నాడు. అయితే ఆ తరువాత నన్నెచోడుడు విష్ణుమూర్తిని, బ్రహ్మను కూడా స్తుతించాడు. అంతటితో ఆగక గణపతిని, కుమారస్వామిని, మన్మథుడుని, సరస్వతిని కూడా నన్నెచోడుడు కుమార సంభవ అవతారికలో ప్రార్థించాడు. అలా దేవతలను స్తుతించాక తన గురువైన జంగమ మల్లికార్జునుడుని స్తుతించాడు. ఈ స్తుతిలో గురువుకు, శివుడికి భేదమే లేదని ప్రతిపాదించాడు. మామూలుగా అయితే వీరశైవకవులు కేవలం శివుడుని మాత్రమే స్తుతించటం, శివ పారమ్యాన్నే లక్ష్యంగా పెట్టుకోవటం ఉంటుంది. కానీ నన్నెచోడుడు శివుడినే కాక ఇతర దేవతలను కూడా స్తుతించటం జరిగింది. దీన్ని బట్టి నన్నెచోడుడిని వీరశైవుడు అని చెప్పటానికి అవకాశం కుదరటం లేదు. అలాగే ఆయన తనకు పూర్వులైన వాల్మీకి, వ్యాస, కాళిదాస, భారవి, ఉద్భట, బాణ కవులను మాత్రమే స్తుతించాడు. కానీ తెలుగు సాహిత్యంలో ఉన్న కవులను ఎవరినీ పేర్కొనలేదు. ఈ తెలుగు కవులంతా మార్గకవితను అవలంబించారన్నదే అందుకు ప్రధానకారణం.

"మును మార్గ కవిత లోకం
బున వెలఁయగ దేశి కవితఁ బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బునఁజన జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"

ఈ పద్యంలో తెలుగు భాషను నిలిపింది చాళుక్యరాజులేనని అంటాడాయన.

మార్గ పద్ధతిలో వెళ్ళే కవులు రసవంతమైన కృతిని రచించలేని కుకవులని వారు ఈగల లాంటి వారని అన్నాడు. ఈగలు రసాన్ని వదలి పిప్పిమీద వాలిన చందంగా రసాస్వాదన చేయలేని దుర్మార్గత్వంలో మార్గకవులు ఉన్నారన్నది నన్నెచోడుడి భావన.

తెలుగు సాహిత్యంలో షష్ఠ్యంత రచనా సంప్రదాయాన్ని నన్నెచోడుడే నెలకొల్పాడు. ఆ తరువాత ఈ సంప్రదాయాన్ని తిక్కనాది కవులు కొనసాగించారు.

### 4.1.2. కవిత్వ విశేషాలు :

నన్నెచోడుడి కవిత్వంలో కొన్ని విశేషాలున్నాయి. ఈయన తన కవిత వస్తుకవిత అని అంటాడు. అలాగే జానుతెనుగులో వర్ణన. అర్థపుష్టి, రసపుష్టి, అక్షరరమ్యతలు కూడా తన కవితా విశేషాలని నన్నెచోడుడు చెప్పాడు. వస్తుకవిత అంటే సాధారణంగా

ఇతివృత్త ప్రధానమైనది అని అర్థం. కథావస్తువును పోషిస్తూ అలంకారాలు, నవరసాలు, అష్టాదశ వర్ణనలు చేస్తూ చెప్పే కవిత వస్తుకవిత అని పండితాభిప్రాయం. కుమార సంభవం లోని కథా ప్రణాళిక వస్తుకవిత పద్ధతిలో ఉన్నట్టు తెలియచేస్తుంది. సతి పుట్టుక, దక్ష యజ్ఞ విధ్వంసం, పార్వతీదేవి జననం, ఉమా వివాహం, ఉమాశివ సంయోగం, కుమారస్వామి జననం, తారకాసురవధ లాంటివి కుమార సంభవంలో ఉన్నాయి. ఈ కథాక్రమాన్నంతా జాను తెనుగులో అలంకారాలు, వర్ణనలతో రసవత్తరంగా వర్ణించి చెప్పాడు నన్నెచోడుడు. ఈయన తన కవితను వస్తుకవిత అని అనటమేకాక వాల్మీకి, భారవి, ఉద్భటుడు లాంటి కవుల కావ్యాలలో కూడా వస్తు కవిత ఉందన్నాడు. కన్నడ కవితా ప్రభావం చేత నన్నెచోడుడు ఇలా వస్తుకవితను ఆదరించి ఉంటాడు. ఈయన కథా కథన రచనా విధానంలో కూడా ప్రత్యేకత ఉంది. కథను రసవంతమైన సన్నివేశం నుంచి చమత్కారంగా ప్రారంభిస్తాడు. కుమార సంభవంలో శివుడు గజాననుడితో ఆడుకున్న సందర్భం ఇలాంటిదే. జాను తెనుగు అనే విషయాన్ని నన్నెచోడుడు తొలిగా ప్రకటించాడు. ప్రసన్నతా గుణం ఉండి వ్యావహారిక భాషకు సన్నిహితంగా ఉండే భాషే జానుతెనుగు. అయితే జానుతెనుగంటే ఈ కవి దృష్టిలో అచ్చ తెనుగు మాత్రం కాదు. ఎందుకంటే ఈయన కుమార సంభవంలో సగానికి పైగా సంస్కృత పదాలు కనుపిస్తాయి. నన్నెచోడుడు ఉపయోగించిన దేశీయపద బంధాల కూర్పు, వ్యావహారిక భాషాప్రయోగాలు ఆయన శైలిని ఎరుకపరుస్తాయి.

నన్నెచోడుడు ప్రబంధ కవితకు ఆద్యుడు. ఎందుకంటే కావ్యంలో అష్టాదశ వర్ణనలను తొలిగా చెప్పిన కవి ఈయనే. ఈయన తరువాత వచ్చిన ప్రబంధకవులు ఈ కవి చెప్పినట్టుగా

"వనజల కేశీరవి శశి

తనయోదయ మంత్రగతి రతక్షిత పరణాం

బునిధి మధు ఋతువురోద్వా

హనగ విరహ దూత్యవర్ణి నాష్టదశమున్"

ఈ అష్టాదశ వర్ణనలను తమ ప్రబంధాల ప్రధాన లక్షణంగా చేసుకొని రచన సాగించారు. అందుకే ఈ కవిని ప్రబంధ ప్రజాపతి అని కూడా పండితులు పిలుస్తుంటారు. నన్నెచోడుడు చేసిన వసంత ఋతువర్ణన ఇలా మనోహరంగా కనుపిస్తుంది.

"పొన్నలు పూచెఁ బొన్నలోఁగిఁ బూవక ముందఱఁ బూచె గోఁగులా
లున్న గొన్నండ గోగులను బూవక ముందఱ బూచె బూరువుల్
పొన్నలుఁ గొండ గోఁగులును బూరువులు న్నొగిఁ బూవకుండగా
ముపరం బురం గంనిమోనదుగు లౌర్వఁసబూనె నానునిన్"

అని చెప్పిన పద్యంలో సూర్యోదయ వర్ణన, గ్రీష్మ వర్ణన, పార్వతి వర్ణన, రతిక్రీడ వర్ణనలో ఆయన వర్ణనాచాతురి ఉంది.

### 4.1.3. రసపోషణ :

నన్నెచోడుడి కావ్య రచనలో అర్థపుష్టి బాగా ఉంటుంది. వర్ణనలకు తగిన విధంగా ఛందస్సును వాడుకోవటంలో ఆయన నేర్పరి. మన్మధుడి పరివారంలో మత్తకోకిలలున్నాయని వర్ణించేటప్పుడు మత్తకోకిల ఛందస్సులోనే పద్యాన్ని రచించాడు. ఇలాంటి వర్ణనలు ఆయన అర్థపుష్టికి ఉదాహరణలు. రసపుష్టి కూడా ఈయన శైలిలో భాగమే. శృంగార రస పోషణలో నన్నెచోడుడి శైలి ప్రస్ఫుటంగా ఉంటుంది. రతీ మన్మధుల సంసార ఘట్టంలో ఈయన పాటించిన నాటకీయ శైలి ఆకర్షణీయంగా ఉంటుంది.

కాళిదాసు కుమార సంభవాన్ని అనుసరించినప్పటికీ స్వతంత్ర కల్పనలను చేసి తన కుమార సంభవానికి రసపుష్టిని కలిగించాడు. అక్షర రమ్యత అనే లక్షణం కూడా ఈయన దగ్గర ఉన్న ఓ ప్రత్యేకత. పదాల పొందిక, అర్థ గాంభీర్యం, సులభంగా అర్థం అయ్యేలా ఉండటం వీటన్నిటినీ పాటించటం చేత నన్నెచోడుడి శైలి తెలుగు సాహిత్య చరిత్రలో ఓ ప్రత్యేకతను సంతరించుకొని ఉంది.

## 4.1.4. వర్ణనలు :

నన్నెచోడుడు నన్నయ్య కావ్య రచనా మార్గాన్ని అనుసరించలేదు. అయితే కన్నడ భాషలోని పంప మహాకవి మార్గాన్ని అనుసరించాడు. కుమార సంభవ కావ్య కథను శివపురాణం నుండి గ్రహించాడు. దీనికి కాళిదాసు విరచిత కుమార సంభవం కూడా కొంత ఆధారమే అయినా రచనలో తనదైన శైలిలో దేశీయమైన మార్పులు చేసాడు. అష్టాదశ వర్ణనలతో నవరస పరిపోషణతో అలంకారాలతో ప్రబంధరూపంలో కుమార సంభవం నన్నెచోడుడి చేతిలో రూపుదిద్దుకుంది.

కుమార సంభవంలో నన్నెచోడుడు పరమేశ్వరుడిని సతీదేవిని నాయకా నాయకులుగా చేసి కథను నడిపాడు. కథా గమనం అష్టాదశ వర్ణనలతో సాగింది. పార్వతీ పరమేశ్వరుల శృంగార కేళిని రసవత్తరంగా వర్ణించాడు. అలాగే పార్వతీ దేవి చెలికత్తెలతో జలకేళిలో ఉన్నప్పుడు నీటిలో ఉన్న ఆమె ముఖాన్ని చూసి పద్మం అనే భ్రాంతితో తుమ్మెదలు మూగాయట. ఇలా జలకేళి వర్ణన అందులోనూ నాయికా పరంగా చేసిన వర్ణన అద్భుతంగా ఉంది. సూర్యోదయ, చంద్రోదయ వర్ణనలు, సముద్ర, మధుపాన, పుర, ఋతు వర్ణనలు, వివాహం, విరహం, రతీ వర్ణనలను చేసిన తీరు కుమార సంభవ కావ్యంలో నన్నెచోడుడి రచన వైదుష్యానికి మచ్చుతునకలుగా కనుపిస్తాయి. ఈ కావ్యంలో ఆయన ఉపయోగించిన అలంకారాలు ఎంతో రమణీయాలు. యమకం, వృత్యనుప్రాస, ఛేకాను ప్రాస, ఉపమ, రూపకం, ఉత్ప్రేక్ష, అర్థాంతరన్యాసం లాంటి అలంకారాలను నన్నెచోడుడు ప్రయోగించాడు. అలాగే రస పోషణ విషయంలో కూడా ఎంతో గొప్పగా తన కవిత్వాన్ని చెప్పాడు. ఈ కావ్యంలో అంగీరసం వీరమని విమర్శకులంటారు. వీర రసానికి స్థాయీభావం ఉత్సాహం. తారకాసుర వధ, దక్షయజ్ఞ విధ్వంసం లాంటి వాటిలో వీరరస పరిపోషణ ప్రస్ఫుటంగా కనుపిస్తుంది. తారకాసురుడు యుద్ధానికి తరలి వచ్చినప్పుడు రౌద్రరసం, దేవాసుర యుద్ధంలో భీభత్సం, పార్వతీ పరమేశ్వరుల సంభోగంలో శృంగారం, శివుడి నేత్రాగ్నిలో మన్మథుడు దగ్ధమైనప్పుడు కరుణరసం ఇలా సందర్భానుసారంగా కుమార సంభవంలో రస పోషణ కనుపిస్తుంది. నన్నెచోడుడు అనుసరించిన ఈ కవితా విధానం అనంతర కవులకు మార్గదర్శకంగా కూడా అయింది. ఇలా నన్నెచోడుడి కుమార సంభవం తెలుగు సాహిత్య చరిత్రలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకొని ఉంది.

## 4.2. మల్లికార్జున పండితారాధ్యుడు :

మల్లికార్జున పండితుడు గోదావరి మండలంలోని దాక్షారామ నివాసి. అక్కడ ఉన్న భీమేశ్వర స్వామి దేవాలయ పూజారి కుమారుడు. బాగా చదువుకోవటం వల్ల పండితుడయ్యాడు. శివ పురాణంలో చెప్పినట్టుగా విబూది, రుద్రాక్షలను ధరించాడు. వీర మాహేశ్వర దీక్షను స్వీకరించాడు. దీంతో నాటి వైదిక మతస్థులు ఈయన ఒంటినిండా విబూది పూసుకోవటం, రుద్రాక్షలను ధరించటం చూసి ఎగతాళి చేసారు. కానీ మల్లికార్జున పండితుడు వాటిని ఏ మాత్రం లెక్కచేయలేదు. అంతేకాక దాక్షారామానికి సమీపంలో ఉన్న కోటిపల్లిలో ఉన్న అవాంతరయ్యను గురువుగా ఎంచుకొన్నాడు. ఆయన దగ్గర శైవమత రహస్యాలను తెలుసుకున్నాడు. కన్నడ దేశంలోని బండారు బసవన్న శైవమత ప్రచారాన్ని, మహిమను విని అదే పద్ధతిలో తాను కూడా శైవమత ప్రచారం చేయాలనుకున్నాడు. క్రీ.శ. 12వ శతాబ్దంలో వెలనాటి చోళులు చందవోలును రాజధానిగా చేసుకొని ఆంధ్రదేశాన్ని పాలించారు. ఆ రాజుల ఆశ్రయంలోనే జైన, బౌద్ధ మతాలు రేకు విప్పాయి. అయితే మల్లికార్జున పండితుడు జైనులను, బౌద్ధులను తన వాదంతో ఓడించి శైవ మతానికి మంచి ప్రాచుర్యం కల్పించాడు. శైవమత ప్రవక్త బసవన్న సందేశాన్ని అందుకొని ఈయన బసవన్నను

చూడాలని కటకానికి బయలుదేరాడు. అయితే దోవలోనే బసవేశ్వరుడు మరణించాడన్న వార్త తెలిసింది. దానికి ఎంతగానో విలపించి శ్రీశైలానికి వెళ్ళాడు. అయితే శ్రీశైలం ఎక్కే ఓపిక లేక తన శిష్యులను పిలిచి తన మొక్కు చెల్లించమని చెప్పాడు. ఆ శిష్యులు గురువు చెప్పినట్లే మొక్కు చెల్లించి గిరి ప్రదక్షణ చేసి వచ్చిన తరువాత కన్నుమూసాడు.

### 4.2.1. శివతత్త్వసారము :

మల్లికార్జున పండితుడి రచనలలో లభ్యమౌతున్నది శివతత్త్వసారమొక్కటే. క్రీ.శ. 1110 - 1175 సంవత్సరాల మధ్య కాలంలో ఆయన జీవించి ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. క్రీ.శ. 1168 - 1175 మధ్య కాలంలో పండితుడు శివతత్త్వసారాన్ని రచించి ఉండవచ్చని అంటారు. ఇది కాక ఆయన లింగోద్భవగద్య, రుద్ర మహిమ, అమరేశ్వరాష్టకం, భీమేశ్వర గద్యస్తుతి, స్తోత్ర పంచకం, పర్వత వర్ణనం, శ్రీముఖ దర్శన గద్య తదితరాలను రచించినట్లు పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో చెప్పాడు. శివతత్త్వసారంలో 489 కంద పద్యాలున్నాయి. సాధారణంగా శతకమంటే నూరు కానీ నూట ఎనిమిది కానీ పద్యాలు వుంటుంటాయి. శివతత్త్వసారంలో ఇలా పద్య సంఖ్యానియమం లేకపోవటంతో పాటు మకుట నియమం కూడా కనుపించదు. శివతత్త్వసార శతకంలో శివభక్తుల గుణాలు, మహిమలతో పాటు జైన, బౌద్ధ, అద్వైత మతాలను ఖండించటం కూడా కనుపిస్తుంది. దీనిలోని కవితా శైలి నన్నయ్య శైలిలాగా ఉంటుంది. శివతత్త్వసారం లోని శబ్దాడంబరం పండితులకు మాత్రమే అర్థమయ్యే రీతిలో ఉంటుంది. పామరులకు మాత్రం సులభ గ్రాహ్యంగా లేదని శిష్టా రామకృష్ణ శాస్త్రి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వంలో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. శివతత్త్వసారంలో శివకవులు ఎక్కువుగా ఉపయోగించిన దేశి కవిత, జాను తెనుగు కనుపించవు. కష్టతరమైన అన్వయంతోనూ, అంతగా ప్రచారంలో లేని మాటల ప్రయోగాలతోనూ పద్యాలు నిండి ఉంటాయి. “అలరి ఎయిదఁడు ఆలోపు ముద్దలడిఁచిన పాదటి, సూడబెట్టులాంటి పదాలు ఓ పట్టాన అందరికీ అర్థంకావు. శ్రుతులలో ఉన్న అనేక సంస్కృత వాక్యాలను మల్లికార్జున పండితుడు తన పద్యాలలో ఇమిడ్చాడు. ఇతర మతాలను ఖండించేటప్పుడు ఈయన కఠినవైఖరిని అవలంబించాడు. చిన్ననాడే బాగా చదువుకొని పండితుడయ్యాడు. వేద వేదాంగ శాస్త్రకోవిదుడని పేరు తెచ్చుకున్నాడు. ఆయన పాండిత్యం, శాస్త్రజ్ఞానం అంతా శివతత్త్వసారంలో దర్శనమిస్తాయి. పాశుపత శాఖకు చెందినవాడు మల్లికార్జున పండితుడు. ఈ శాఖకు చెందిన శైవులు ప్రాణులన్నీ పశువులని, ఆ పశువులను పాలించేది పశుపతి అయిన శివుడేనని అంటారు. భక్తితో మోక్షాన్ని చేరుకోవచ్చంటారు. వర్ణవ్యవస్థను అంగీకరించటం, పెద్దలు చెప్పినట్టు శివదీక్షలో ఉండి రుద్రాక్ష, విభూతిని ధరించటం చేస్తారు. లింగధారణ మాత్రం చేయరు. శివతత్త్వసారంలో వీరశైవ మతబోధ మాహాత్మ్యం ప్రస్ఫుటంగా కనుపిస్తాయి. భర్త శివభక్తుడు కాకపోతే అతడిని భార్య వదిలేయాలి. శైవమత ప్రచారం కోసం జీవహింస చేసినా తప్పు లేదు. శివుడి సేవలో మరణిస్తే అపర కర్మల అవసరం ఉండదు. పైగా సంతోషంతో పండుగ చేసుకోవాలి అనేలాంటి తీవ్రతర ఆచారాలు ఈ గ్రంథంలో కనుపిస్తాయి. శివతత్త్వసారం ఇలా వీరశైవమతసారాన్ని అక్షరాక్షరాన కలిగి ఉంది. పైగా శతక రచనకు ఇదే మార్గదర్శకమై ఉండటంతో దీనికొక ప్రత్యేక స్థానం లభించింది.

### 4.3. పాల్కురికి సోమనాథుడు :

“తొలికోడి కనువిచ్చి నిలిచి మైవెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
నిక్కించి, మెడ సాచి, నిక్కి మున్సాచి
కొక్కొరో కుర్రని కూయకమున్న ----”

తెలుగు తోటలో మొదటి కోకిల కంఠమెత్తి, తెలుగు వాళ్ళ కోసం, తెలుగు ఛందస్సులో పాటలు పాడింది. ఆ కోకిల పేరు పాల్కురికి సోమనాథుడు. అతడు పాడిన తెలుగు ఛందస్సు పేరు ద్విపద. తెలుగు జాతి ఆయన కిచ్చిన దివ్యాయుధం ద్విపద. తెలుగుజాతికి అతడిచ్చిన గొప్ప కానుక కూడా ద్విపదే. పాల్కురికి సోమనాథుడు పుట్టకపోతే పాడుకొందుకు తెలుగు వాళ్ళకే ఛందస్సూ ఇంత రాణించేది కాదేమో! ప్రజల కోసం అతడు పుట్టాడు. ప్రజలే అతణ్ణి అమరకవిని చేసాడు. అని సమగ్రాంధ్ర సాహిత్యం రెండో సంపుటంలో ఆరుద్ర పాల్కురికి సోమనాథుడి విశిష్టతను గురించి పేర్కొన్నాడు. సోమనాథుడి కాలాన్ని గురించి కూడా పండితలోకంలో భిన్నాభిప్రాయాలే ఉన్నాయి. బసవ పురాణాన్ని పద్య కావ్యంగా చెప్పిన పిడపర్తి బసవన్న పాల్కురికి సోమన కాకతీయ ప్రతాపరుద్రుడి కాలం నాటి వాడని చెప్పాడు. కాకతీయులలో ప్రతాపరుద్రుడు క్రీ.శ. 1289 - 1323 వరకూ రాజ్యాన్ని పాలించాడు. దీని ఆధారంగానే సోమన 13, 14 శతాబ్దాల మధ్య కాలంలోని వాడని అంటున్నారు. కానీ పాల్కురికి సోమన 12వ శతాబ్ది నాటి వాడేనని మరి కొందరు పండితులన్నారు. క్రీ.శ. 1132 నుండి 1168 దాకా రాజ్యమేలిన కాకతీయ రుద్రదేవుడే పిడపర్తి బసవన్న చెప్పిన ప్రతాపరుద్రదేవుడని భావించి ఆ కారణంగా సోమన 12వ శతాబ్దినాటి వాడని అన్నారు. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణంలో "ప్రాతవడ్డ మాటల తమ నేర్పు చూపి యొకటన్ హృదయం బలరింపలేక" తదితర పద్యాలను పాల్కురికి సోమనను దృష్టిలో వుంచుకొనే చెప్పి ఉంటాడని ఈ పండితులు అన్నారు. క్రీ.శ. 12వ శతాబ్దిలోనే నన్నెచోడుడు, పండితారాధ్యుడు, పాల్కురికి సోమన జీవించటాన్ని బట్టే ఈ కాలానికి శివకవి యుగంగా పేరొచ్చింది.

### 4.3.1. కవితారీతి :

పాల్కురికి సోమనాథుడు తెలుగులో వీరశైవ వాఙ్మయాన్ని విస్తృతంగా అందించాడు. పండితులను, సామాన్యులను ఇద్దరినీ తన రచనల ద్వారా ఆకట్టుకుంటుండేవాడు. పండితులను సమాధాన పరచటం కోసం సోమనాథ భాష్యం, రుద్ర భాష్యాదులను సామాన్య ప్రజల ఆదరణ పొందటానికి బసవ పూరాణం, పండితారాధ్య చరిత్రలను రచించాడు. ఇలా తెలుగులోనే కాక కన్నడ భాషలో కూడా గ్రంథ రచన చేసాడు ఈ కవి. నాటివారు సోమనను భృంగిరిటి అవతారమని భావించేవారు. అనంతర కాలంలో వచ్చిన శ్రీనాథుడు, పోతన, ధూర్జటి వంటి మహా కవులకు పాల్కురికి సోమన మార్గదర్శకుడయ్యాడు. దాదాపు ద్విపద కవులంతా ఈయన మార్గంలోనే నడిచారు. ఇంతటి గొప్ప కవి తెలుగువాడు కావటం విశేషం. వీరశైవ ఆంధ్ర వాఙ్మయం అంతా సోమన రచనల మీదే ఆధారపడి ఉంది. వైదిక మతాన్ని ఎదుర్కోవటానికి చతుర్వేదసారం, అనుభవసారం, రుద్రభాష్యం, బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, వృషాధిప శతకం, బసవరగడ, బసవోదాహరణాదులను రచించాడు. బసవపురాణం, పండితారాధ్య చరిత్రలలో శివభక్తుల కథలను నిక్షిప్తం చేసాడు. ఆనాడు సామాన్య ప్రజలలోకి జైన, బౌద్ధమతాలు దూసుకు వెళ్ళటానికి కారణం భాష విషయంలో వారు సులభశైలిని పాటించటమేనని సోమన గ్రహించాడు. అందుకే తాను కూడా సామాన్య ప్రజలకు వీరశైవాన్ని తెలియచెప్పటం కోసం దేశీయ పద్ధతిలో, ద్విపదలో, జాను తెనుగులో రచన చేసాడు.

సత్కృతి యన నూత్న సంగతిదనరఁ
దొమ్మిది రసములు దులుకాడు దాని
యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణ
మగువలంకారంబు లసరారుదాని
ద్విగుణార్ధ భావముల్ దీటు కొనంగ
దేట తెనుంగున ద్విపద రచింతు
ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన,
మానుగ సర్వ సామాన్యంబుగా మి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు .... "

అని సోమన ప్రజల భాషలో తాను కవిత్వం చెప్పినట్లుగా వివరించాడు. వీరశైవమత మూల పురుషులైన బసవన్న, పండితారాధ్యులను నాయకులుగా చేసి వారికి దైవత్వాన్ని ఆపాదించి కావ్యాలను రచించాడు. పాల్కురికి సోమనాథుడు ఆరాధ్య బ్రాహ్మణుడని కొందరంటారు. కాదు జంగమ కులం వాడని మరి కొందరి భావన. అయితే సోమన మాత్రం కులాలకతీతంగా వీరశైవ మతాన్ని గొప్పగా ప్రచారం చేసాడు. పాల్కురికి సోమనాథుడికి గురులింగార్యుడు శివదీక్ష నిచ్చాడు. కరస్థలి విశ్వనాథుడు, కట్టకూరి కోటిదేవరలు కవితా గురువులు. ఈయన ఓరుగల్లు సమీపంలోని పాల్కురికి (పాలకుర్తి) నివాసి. కానీ చిలుకూరి నారాయణరావు గారు సోమన కర్ణాట దేశంలోని హోల్కురికి నివాసి అని చెప్పారు. అయితే అధిక శాతం పండితులు ఈయనను పాల్కురికి నివాసిగానే పేర్కొంటున్నారు. సోమన తన కాలంలో వాడుకలో ఉన్న తెలుగునే కవిత్వంలో చెప్పి ప్రజలకు బాగా చేరువయ్యాడు. అయితే వీరశైవ మతం తప్ప ఇతర మతాలేవీ మతాలు కావని అనడంతో శైవేతరుల ఆదరణ పొందలేక పోయాడు. ఏది ఎలా ఉన్నా పాల్కురికి సోమనాథుడు తన కవిత్వం ద్వారా తెలుగు కవిత్వానికి కొత్త రూపాన్ని ఇచ్చినవాడయ్యాడు.

### 4.3.2. రచనలు :

పాల్కురికి సోమనాథుడు శివకవులలో ఇంత గొప్పవాడు కావటానికి అందరి కన్నా ఎక్కువగా రచనలు చెయ్యటమే కారణం. ఈయన ముప్పైకి పైగా గ్రంథాలను రచించాడు. బసవ పురాణం, పండితారాధ్యచరిత్ర, అనుభవసారం, చతుర్వేదసారం, చన్నమల్లు సీసాలు, వృషాధిప శతకం, బసవోదాహరణం సోమన తెలుగు రచనలు. సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, అష్టకం, పంచకం, నమస్కార గద్య, అక్షరాంక గద్య, పంచ ప్రకార గద్య, బసవోదాహరణం ఈయన సంస్కృత కృతులు. ఇవి కాక మిగిలినవన్నీ కన్నడ భాషలో రాసినవే.

అనుభవసారం అనేది చిన్న పద్య కృతి. పలు రకాల ఛందస్సులు దీనిలో ఉన్నాయి. గురుభక్తి మహిమ, శివపూజా విధానం, భక్త లక్షణం, జంగమ సేవ, షట్ స్థల వివరణం తదితర శైవ ధర్మాలు దీనిలో ఉన్నాయి. శైవ భక్తులు కాని వారి మీద జాలి, కరుణ, శైవుడు చూపకూడదన్న ప్రబోధం దీనిలో ఉంది. షట్ స్థల వైభవ కావ్యంలో వర్ణితమైనవే చన్నమల్లు సీసాలు. ఇవి ముప్పై రెండు ఉన్నాయి. తాను జీవసమాధికి వెళుతూ ముప్పై రెండు మెట్లు కిందికి దిగుతూ ఒక్కొక్క మెట్టు దగ్గర చెప్పుకొన్నవే ఈ చన్నమల్లు సీసాలని పండితులంటున్నారు. చతుర్వేద సారంలో పాల్కురికి సోమనాథుడు శ్రుతి. స్మృతి పురాణాలలో చెప్పిన విషయాలను శైవ మతానికి అన్వయిస్తూ నాలుగు వందల సీస పద్యాలతో రచించాడు. వృషాధిప శతకంలో బసవా బసవా బసవా వృషాధిపా అనే మకుటంతో పద్య రచన చేసాడు. సంస్కృత, ద్రవిడ, మణి ప్రవాళ, కర్ణాట, మహారాష్ట్ర భాషల పదాలు ఈ శతకంలో ఉన్నాయి. బసవేశ్వరుడి మహిమలను, శక్తిని ఈ శతకం వివరిస్తుంది. బసవోదాహరణంలో బసవేశ్వరుడని స్తుతించటం కనుపిస్తుంది. బసవ పురాణం అనేది వ్యాసకృత అష్టాదశ పురాణాలకు అనువాదం కాదు. దీనిలో సంప్రదాయ బద్ధంగా ఉండే పురాణ లక్షణాలు కూడా లేవు. అయితే శివ భక్తులలోనూ, పురాతన భక్తి గీతార్థాలలోనూ వ్యాపించి ఉన్న బసవన్న కథలను ఒక చోటికి చేర్చి బసవపురాణంగా సోమన రచించినట్లు కనుపిస్తుంది.

బసవ పురాణం ఏడు ఆశ్వాసాల ద్విపద కావ్యం. ప్రధానంగా దీనిలో బసవేశ్వరుడి మహిమలు ఉన్నాయి.

"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె - సరసమైన పరగిన జానుఁదెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ - గూర్చెద ద్విపదలు గోర్కిదైనాఁ
దెలుఁగు మాటల సంగ వలదు వేదముల -కొలది యాకాఁ జూడు డిల నెట్టులనిన
తేట తెనుంగుంగున ద్విపద రచించు . . . . . . . . . . . . . .
అరూఢ గద్య పద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ట రచన
మానుగ సర్వ సామాన్యంబు గామిఁ - జానుఁ దెనుఁగు విశేషము ప్రసన్నతమ్"

ఈ కారణం చేతనే బసవ పురాణాన్ని ద్విపద ఛందస్సులో జాను తెనుగులో సోమన రచించాడు.

మల్లికార్జున పండితారాధ్యుడి జీవిత విశేషాలతో పండితారాధ్య చరిత్రను సోమన రచించాడు. ఇలా తెలుగులో ఆయన కవితా ప్రస్థానం సాగింది.

సంస్కృత గ్రంథాల విషయానికి వస్తే వైదిక మతాన్ని ఎదిరించి వీరశైవ స్థాపన చేయటానికి సోమనాథుడు సంస్కృత భాషలో కూడా గ్రంథ రచన చేసాడు. సోమనాథ భాష్యం, రుద్ర భాష్యం, బసవ పురాణం, నమస్కార గద్య, పంచప్రకార గద్య, అక్షరాంక గద్య, అష్టోత్తర నామ గద్య, వృషభాష్టకం, పంచరత్నాలు, బసవాష్టకం అనేవి ఈయన సంస్కృత గ్రంథాలు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన చెయ్యటమే వివేక మన్నది ఈయన మాట. అదే అనంతర కాలంలో తిక్కన కూడా అంగీకరించిన మాటయింది.

పాల్కురికి సోమనాథుడి రచనలు శ్రీనాథుడి రచనలంత ఆదరణను తెలుగునాట పొందాయి. అయితే అవన్నీ శైవమత ప్రచారానికి ఉపకరించేవిగానే ఉన్నాయి. అనంతర కాలంలో వచ్చిన పోతనాదులకు కూడా ఈ కవి ఆదర్శప్రాయుడయ్యాడని చెప్పటానికి

"క్షీరాబ్ధి లోపలఁ గ్రీడించు హంస, గోరునే వడియాల నీరు ద్రావంగ

జాత ఫలంబులు చుంబించు చిలుక, భూతిబూరుగు మ్రానిపండ్లు గన్గొనునే"

ఈ పద్యం పోతన రచించిన మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు బోవునే మదనములకు అనే పద్య రచనకు స్ఫూర్తినిచ్చినట్లు కనుపిస్తుంది. ఇలా పాల్కురికి సోమనాథుడు తెలుగుతనం కోసం తపిస్తూ ఆ తపనను వీరశైవ మతవ్యాప్తికి సాధనంగా చేసుకొని చక్కటి గ్రంథరచన చేసిన వీరశైవ కవిగా పేరొందాడు.

## 4.3.3. పాల్కురికి సోమన ద్విపద కావ్య వైశిష్టం :

ద్విపద ఛందస్సులో కావ్య రచన చేసి ఎందరికో మార్గదర్శకుడయ్యాడు సోమన. ద్విపద దేశీ సంప్రదాయానికి చెందింది. సాధారణంగా ఉన్న ఆసు, మధుర, చిత్ర, విస్తర అనే నాలుగు కవితారీతులతో ద్విపద మధుర కవితా శాఖకు చెందింది. ఇది మాత్రా ఛందస్సుకు సంబంధించింది. దీనిలో రెండు పాదాలు ఉంటాయి. ఒక్కొక్క పాదానికి మూడు ఇంద్ర గణాలు, ఒక సూర్య గణం ఉంటాయి. పాదంలోని మూడో గణం మొదటి అక్షరం యతి స్థానంగా ఉంటుంది. ఏ పాదానికి ఆ పాదంలోనే యతి ఉంటుంది. ఇలాంటి రెండు పాదాలను ప్రాస కలుపుతూ ఉంటుంది. ప్రాస నియమం లేని ద్విపదను మంజరీ ద్విపద అని అంటారు. మంజరి ద్విపద పాదాలను రెండింటిని ఒకదాని తరువాత ఒకటి రాస్తే తరువోజ పద్యపాదమవుతుంది. క్రీ.శ. 12వ శతాబ్దంలో పుట్టిన వీరశైవమత ప్రచారానికి ఈ ద్విపద గొప్ప సాధనంగా అయింది. పాల్కురికి సోమనాథుడు తన ద్విపదలలో రెండు పద్ధతులను ప్రత్యేకంగా పాటించాడు. ప్రాస యతి వాడటం, ఏ పాదానికి ఆ పాదం విడిగా ఉండక ఒక పాదంతో మరో పాదాన్ని కలుపుతున్నట్లుగా కొన్ని పంక్తులను రచించడం అనేవి ఈయన ప్రత్యేకతలు. సోమనను అనుసరించిన గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని, తాళపాక చిన్నన్న వెంకటేశ్వర స్తుతి పరమైన కావ్యాలను ద్విపదలోనే రచించారు. దీనివల్ల పాల్కురికి సోమనాథుడు రచించిన అద్విపద ఎంతగా ఆదరణ పొందిందో అర్థమవుతుంది. శైవకవులను చూసి వైష్ణవ కవులు కూడా ఇలా ద్విపదనే తమ మత ప్రచారానికి అనువుగా చేసుకున్నారు. తెలుగు సాహిత్యంలో బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, రంగనాథ రామాయణం, పలనాటి వీరచరిత్ర, కాటమరాజు కథలు, సిద్దేశ్వర చరిత్ర, గౌరన రచించిన హరిశ్చంద్రోపాఖ్యానం, తాళ్ళపాక తిమ్మక్క రచించిన సుభద్ర కళ్యాణం, అష్టమహిషి కళ్యాణం, పరమయోగి విలాసం, అన్నమాచార్య చరిత్ర (తాళ్ళపాక చిన్నన్న), రఘునాథాభ్యుదయం ఇలాంటి ఎన్నెన్నో విశిష్టమైన ద్విపద కావ్యాలు తెలుగులో ఆవిర్భవించటానికి సోమనాథుడే స్ఫూర్తినిచ్చాడు.

ద్విపద అనే శబ్దం సంస్కృతమే అయినా అది తెలుగు దేశీ ఛందస్సుగా ప్రసిద్ధికెక్కింది.

## 4.4. రంగనాథ రామాయణం - అవాల్మీకాలు :

రంగనాథ రామాయణాన్ని గోన బుద్ధారెడ్డి రచించాడన్నదే అధిక సంఖ్యాక పండితాభిప్రాయం. బుద్ధారెడ్డి పాల్కురికి సోమనాధుడి ద్విపద రచన విధానాన్నే అనుసరించాడు. దేశీయతా మనోహరమైన రచనగా రంగనాథ రామాయణాన్ని తీర్చిదిద్దాడు బుద్ధారెడ్డి. ఇది వాల్మీకి రామాయణానికి ఆంధ్రీకరణమే అయినా ఎక్కువగా స్వతంత్ర్యరీతిలోనే రూపుదిద్దుకుంది. జాతీయమైన విశేషాలతో సర్వజనీనమైన కావ్యంగా దేశీయతామహితంగా రంగనాథ రామాయణం అవతరించింది. ఇన్ని విశేషాల సమాహారమే అయినా రంగనాథ రామాయణంలో అవాల్మీకాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. దీనికి కారణం బుద్ధారెడ్డి తన కాలం నాటికి సమాజంలో ప్రచారంలో ప్రామాణికసంబంధ విశేషాలను గ్రహించటమేనన్నది పండితుల పరిశీలనా సారం.

ఈ అవాల్మీకాలలో తొలిగా కనిపించేది బాలకాండలోని గౌతమ ఆశ్రమ వృత్తాంతం. దీనిలో ఇంద్రుడు కోడి అయై కూసినట్లు వర్ణితమైంది. ఇది గౌతముడిని అహల్యనుండి వేరు చేయడానికి కవి చేసిన ప్రయత్నం. ఈ ప్రయత్నం బాగానే వున్నా ఇది వాల్మీకి రామాయణంలో కనిపించదు. అహల్యా శాప విమోచన ఘట్టంలోనే అహల్య రాయిగా పడి వుంది అని చెప్పిన విషయం మూలంలో లేదు. కానీ ఇది రాముడి మహాత్మ్యాన్ని వర్ణించటానికి చక్కటి సాధనమైంది.

ఆ తరువాత అయోధ్యకాండలో మంథర పాపదర్శిని మాత్రమే అని వాల్మీకి రామాయణంలో ఉంది. కానీ రంగనాథ రామాయణంలో "రాముడు బాల్యంబునందుఁ దన కాలు విఱిచిన తప్పు సాధింపనిది నాకుఃదఱి" అని మంథరకు రాముడి మీద వున్న వైరానికి కారణమేమిటో చెపుతూ కన్పిస్తుంది. అరణ్యకాండలో వున్న జంబుమాలి వృత్తాంతం, యుద్ధకాండలోని సులోచనా సహగమన వృత్తాంతం, కాలనేమి కథ లాంటి కథలు వాల్మీకి రామాయణంలో లేవు. అరణ్యకాండలో లక్ష్మణుడు సీతాదేవి ఎత్తిపొడుపు మాటలను భరించలేకే రాముడి దగ్గరకు పర్ణశాలను విడిచి వెళ్ళిన సందర్భంలో రంగనాథ రామాయణంలో .. . . . . "పర్ణశాల చుట్టు బరులేడు వ్రాసి వర్ణించి యాబరుల్ వడి దాటకమ్మ ఎవ్వడే నీ బరుల్ వెసదాటి వచ్చు నవ్వీరవరు తలలలియు నాక్షణమె" అని చెప్పిన విషయం అవాల్మీకం. అలాగే యుద్ధకాండలో వున్న కథాంశాలు ఎక్కువగా అవాల్మీకాలు. రావణుడు విభీషణుడిని సభలో తన్ని పురి నుండి వెడలగొట్టడం, శ్రీరాముడు ఉడుత భక్తిని చూసి ఆనందించడం, కైకసి వృత్తాంతం, కైకసి రావణుడికి రాముడి మహిమలు చెప్పడం, రావణుడు రాముడి ధనుర్విద్య కౌశలాన్ని పొగడడం, నాగపాశ బద్ధులైన రామలక్ష్మణుల దగ్గరకు నారదుడి రావడం, మండోదరి రాముడి మహాత్మ్యాన్ని రావణుడికి చెప్పడం, రావణుడి ముందు హనుమంతుడు తోకను పెంచటం ఇలాంటివి ఎన్నెన్నో అవాల్మీకాలు రంగనాథ రామాయణంలో కన్పిస్తాయి. యుద్ధకాండ చివరలో గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణంలో ప్రవేశపెట్టిన "సౌమిత్రిహాసము" వాల్మీకి రామాయణంలో లేదు. ఇది ఆంధ్ర స్త్రీలు నిరంతరం పాడుకునే గేయాలలో ప్రశస్త్యమైన "లక్ష్మణదేవర నవ్వు" అనే దానికి ఛాయారూపం. గోన బుద్ధారెడ్డి సమాజంలో ప్రచారంలో వున్న రామాయణ సంబంధ విషయాలను రంగనాథ రామాయణంలో చెప్పాడనటానికి ఇదొక ఉదాహరణ. రంగనాథ రామాయణం పురాణ మార్గంలో కథాకథన ప్రధానంగా దేశీయ పదబాహుళ్యంగా సర్వజన సుబోధకంగా బుద్ధారెడ్డి చేతిలో జీవం పోసుకుంది. దీనిలో వున్న అవాల్మీకాలను పెద్దగా లెక్కచేయక ప్రజలు దీనికి పారాయణ యోగ్యతను కూడా కల్పించారు. తెలుగు సాహిత్యంలో ఇలా రంగనాథ రామాయణం అవాల్మీకాల పుట్టే అయినా ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుని వుంది.

## 4.5. రాదగిన ప్రశ్నలు :

1. నన్నెచోడుని కవితావైశిష్ట్యం తెల్పండి.
2. పాల్కురికి సోమన కవితాశైలిని తెల్పండి.
3. మల్లికార్జున పండితారాధ్యుని శైవభక్తిని వివరించండి.
4. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణంలో చేసిన అవాల్మీకాలు తెల్పండి.

## 4.6. ఆధార గ్రంథాలు :


1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
2. తెలుగుసాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
3. తెలుగుసాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి



డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు
లెక్చరర్, హిందూ కళాశాల
గుంటూరు - 522 001.

పాఠం - 5

# తిక్కన యుగం

5.0 లక్ష్యం
5.1 కవి పరిచయం
5.2 తిక్కన వ్యక్తిత్వం
5.3 నిర్వచనోత్తర రామాయణం
5.4 భారతాంధ్రీకరణ విధానము
5.5 కవితా వైశిష్ట్యము
5.6 రసనిర్వహణ
5.7 పాత్ర పోషణ
5.8 వర్ణనా నైపుణ్యాం
5.9 నాటకీయ శైలి
5.10 రాయబారములు
5.11 తిక్కన ఇతర కృతులు
5.12 తిక్కన సమకాలికులు
5.13 రాదగిన ప్రశ్నలు
5.14 ఆధార గ్రంథాలు

## 5.0 లక్ష్యం :

తిక్కన సోమయాజి వ్యక్తిత్వాన్ని, భారతాంధ్రీకరణ విధానాన్ని, కవితావైశిష్ట్యాన్ని, నాటకీయశైలిని, భాషా ప్రయోగ చాతుర్యాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 5.1 కవి పరిచయం :

మహాకవి తిక్కన కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు. తన కావించిన సృష్టి తక్కొరుల చేతగాదు అని ఎఱ్ఱాప్రెగడచే పొగడ్తలందుకొనినాడు. వేదాది సమస్త విద్యాభ్యాసవిభాసి, బహుకళాసంపన్నుడు, సకల విద్య కళాచణుడు, వాఙ్మయ మహార్ణవ వర్తన కర్ణధారుడు అని తిక్కనను ప్రశంసించాడు కేతన తన దశకుమార చరిత్రలో.

తిక్కన పితామహుడు మంత్రి భాస్కరుడు. ఇతడు గుంటూరు విభుడు. సారకవితాభిరాముడు. తిక్కన తండ్రి కొమ్మనామాత్యుడు దండనాథుడు. కొమ్మన అన్న కుమారుడు ఖడ్కతిక్కన.

కవి తిక్కన మనుమసిద్ధి రాజునకు మంత్రి. మనుమసిద్ధి తిక్కనను 'మామా' అని పిలిచేవాడు. ఆ పిలుపు సార్థకమయ్యే విధంగా తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం' రచించి మనుమసిద్ధికి అంకితమిచ్చాడు. తిక్కన సుమారు క్రీ.శ. 1210 - 1300 మధ్యకాలమున జీవించి యుండినట్లుగా చరిత్రకారులు నిర్ణయించారు.

## 5.2 తిక్కన వ్యక్తిత్వం :

తిక్కన తొలిరచన నిర్వచనోత్తర రామాయణం రచనాకాలానికి మిక్కిలి ఆత్మవిశ్వాసం కలవాడు. వచనం లేకుండా కవిత రచించడం గొప్ప అని, అది ప్రౌఢులకే సాధ్యమని తలచాడు. తన కవిత్వం గురించి

లలిత పద హృద్య పద్యం
బులన కథార్థంబు ఘటిత పూర్వాంసమై
యలతి యలతి తునియలగా
హల సంధించిన విధంబున నురగజేతున్

నిర్వచనోత్తర రామాయణ రచనాకాలానికి తిక్కన 'సోమయాజి' కాడు. బుధజన విధేయుడు మాత్రమే. తర్వాత సోమయాగం చేసి సోమయాజిగా ఖ్యాతి పొందాడు. భారత రచనా కాలానికి తిక్కనలో వినయ సౌశీల్యంతో గూడిన హృదయ పరిపాకం స్పష్టంగా కనబడుతుంది. వినయభూషణుడు. మహాజ్ఞాని. నిర్వచనోత్తర రామాయణం, విరాటపర్వం, దశకుమార చరిత్ర అవతారికలు తిక్కన కవితాధర్మాలను, వాటి వలన వ్యక్తమయ్యే తిక్కన వ్యక్తిత్వాన్ని వివరించడానికి ముఖ్య ఆధారాలు. దశకుమార చరిత్రలో తిక్కన వంశవర్ణన వివరంగా ఉంది. తిక్కన గొప్ప పండితుడు. నానా వేదాంగ తత్త్వజ్ఞుడు, సకలాగమ తత్త్వార్థ విచారోదారుడు, రాజకీయ చతురుడు, ఆశ్రితజన పోషకుడు, కవిబ్రహ్మ.

## 5.3 నిర్వచనోత్తర రామాయణం :

తిక్కన నిర్వచనోత్తర రామాయణావతారికలో "అమలోదాత్త మనీష నేనుభయ కావ్యప్రౌఢి బాటించు శిల్పమునం బారగుడ, కళావిదుడ" నని చెప్పుకున్నాడు.

పూర్వరామాయణం వదిలి, ఉత్తరరామాయణం ఏలనను ప్రశ్నకు తిక్కనయే చెప్పిన సమాధానము - "ఎత్తటిదైనను ధీరోదాత్త నృపోత్తముడు రామధరణీపతి" కథను చెప్పుకొనవచ్చునని.

తిక్కన తాత మంత్రి భాస్కరుడు పూర్వరామాయణాన్ని రచించియుండుట, తిక్కనకు పూర్వమే గోన బుద్ధారెడ్డి పూర్వరామాయణాన్ని రచించియుండుట వల్లను తిక్కన ఉత్తరరామాయణ కథను స్వీకరించియుండును.

శ్రీరాముడు అరణ్యవాసానంతరం అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్యాభిషిక్తుడగుటతో ఈ కావ్యం ప్రారంభమవుతుంది. వాల్మీకి ఉత్తరరామాయణంలోని సప్తమకాండం ఆధారంగా నిర్వచనంగా తిక్కన ఈ కావ్యాన్ని రచించాడు. ఇది మొత్తం 10 ఆశ్వాసాల కావ్యం. రావణాదుల కథ, వారి పూర్వుల చరిత్ర, పరాక్రమాదులు మొదటి ఏడాశ్వాస్వాలలో వర్ణింపబడ్డాయి. తరువాతి 3 ఆశ్వాసాలలో సీతా పరిత్యాగం, లవణాసురవధ, అశ్వమేధయాగం, రామ కుశలవుల సమాగమం, సీత భూమాతను చేరడం మున్నగునవి వర్ణించబడ్డాయి.

అయోధ్యపుర వర్ణనతో కావ్యమారంభమవుతుంది. తరువాత పూర్వ రామాయణ కథ చెప్పబడింది. ఇవి మూలమున లేవు. వేదవతి వృత్తాంతము, రంభరావణ సంవాదము యథామూలకములు. కావ్యాంతమున రామనిర్యాణం, రామాదుల సరయూప్రవేశం పరిహరించాడు తిక్కన. తద్వారా నిర్వచనోత్తర రామాయణం ఒక స్వయం సంపూర్ణమైన మంగళాంతం అయిన స్వతంత్ర కావ్యంగా భాసిల్లింది.

నిర్వచనోత్తర రామాయణంలోని వర్ణనలు భారతమందలి వర్ణనలకు దీటైనవి. షష్ఠాశ్వాసంలో రావణాసురుడు కైలాసాన్ని చేరి ఆ పరిసర ప్రాంతాలను చూచి ఆనందించిన విధానాన్ని తిక్కన మనోహరంగా వర్ణించాడు.

సెలయేఱు వేఱుజెలువగు
శిలపై దజ్జలము దిగుచు సింధుర ఏలిచూ
డ్కుల కొప్పె పుండరీక
స్థలమున మకరందమాను షట్పదము క్రియన్

శిలపై నిలచిన సెలయేటి నీటిని తొండంతో పీలుస్తున్న ఏనుగు తెల్ల కలువపై నుండి మకరందాన్ని పీల్చే తుమ్మెదలా ఉందట. నాటకీయ రచనలో అందెవేసిన తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో కూడ రావణుడు కుబేరుని దూతను సంహరించుట, వాలిని బంధింపబోయి భంగపడుట, భర్త తనను జనాపవాదం వల్ల విడనాడాడని తెలిసిన సీత మూర్ఛిల్లి, తరువాత విలపించడం మొదలైన సన్నివేశాలు కన్నులకు కట్టినట్లు వర్ణించాడు.

## 5.4 భారతాంధ్రీకరణ విధానము :

తిక్కన భారతాంధ్రీకరణము నన్నయ భారతాంధ్రీకరణము వలె స్వతంత్రము. అందు ప్రపంచీకరణం, క్లుప్తీకరణం, అన్యధాకరణం, హరిహరనాథ తత్త్వప్రబోధం కలవు.

### 5.4.1. ప్రపంచీకరణం :

అజ్ఞాతవాసమునకు బయలుదేరి విరాట నగరమునకు చేరు సమయమున ద్రౌపది "విరాటుని రాజధాని దూరమునందు కలదు. అపరాత్రిని ఇక్కడే వసింతము. నా మార్గాయాసము మిక్కుటమైనది" అని అనినట్లు మూలమున కలదు.

తిక్కన భారతమున ద్రౌపది మార్గాయాసము ప్రపంచీకరింపబడింది.

డప్పి జనించె వ్రేళుల పుటంబులు పొక్కదొడంగె గోళ్ళలో
జిప్పిల జొచ్చె నెత్తురులు చిత్తము నాకు గడున్ వశంబుగా
దప్పుర మిచ్చటిచ్చటను నాసల వచ్చితి నెంత దవ్వొకో
యిప్పటి భంగి నొక్కడుగు నేగెడు దానికి నోర్వ నెమ్మెయిన్
ఇందు ద్రౌపది దయనీయస్థితి కళ్ళకు కట్టినట్లు వివరింపబడింది.

### 5.4.2. క్లుప్తీకరణము :

కీచకుడు ద్రౌపది సౌందర్యమును వర్ణించి, నీచమైన తన ఆంతర్యమును, కోర్కెను తెలిపినపుడు ద్రౌపది 'సుదీర్ఘమైన ధర్మోపన్యాసము' చేసి, తుదిని తన గంధర్వపతులు ఇది తెలిసినచో కుపితులై సంహరింతురని హెచ్చరించినట్లు మూలమున కలదు. నీచుడైన కీచకునికి ధర్మోపన్యాసము నిష్ప్రయోజనమని తిక్కన ధర్మప్రసంగ శ్లోకములను పరిహరించి, ద్రౌపది తుది మాటను మాత్రమే కత్తి దూసినట్లు పలికినట్లు రచించాడు.

దుర్వారోద్యమబాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మధన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణా కృతులేవు రిపు నిను డోర్లీలన్ వెసంగిట్టి గం
ధర్వుల్ మానము బ్రాణముంగొనుట తథ్యంబెమ్మెయిన్

### 5.4.3. అన్యథాకరణం :

భీష్ముడు శిఖండిని చంపననుటతో, దుర్యోధనుడు కారణమడుగుట, తర్వాత భీష్ముడు చెప్పిన అంబోపాఖ్యానము, సనత్సు జాతీయమును పరిహరించుట, కురుక్షేత్రములో అర్జునునకు శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలోని వేదాంత విషయములెల్ల విడిచిపెట్టి 700 శ్లోకములను 57 పద్యగద్యములుగా తెనిగించుట, విపులమైన మూలములోని విదురనీతిని కాంతా సమ్మితముగా సంగ్రహించుట మొదలైన ఘట్టములందు ఔచిత్యవంతంగా తిక్కన ఆంధ్రీకరించినాడు.

### 5.4.4. హరిహరాద్వైతం :

హరిహరుడు ఒకరేనని చెప్పే అద్వైత వేదాంతమే హరిహరాద్వైతం. తెలుగులో సాహిత్యంలో హరిహరనాథ తత్త్వాన్ని ప్రచారంలోనికి తెచ్చినది తిక్కన. అయితే హరిహరనాథుని ఆరాధించే సంప్రదాయం తిక్కనకు ముందే ఉన్నది. క్రీ.శ. 578లో పృథ్వీవల్లభ బిరుదుగల చాళుక్యరాజు మంగళేశ్వరుడు చెక్కించిన హరిహరనాథుని మూర్తి బీజపూరు జిల్లా బాదామి గుహలలో ఉన్నది. మరొకటి నెల్లూరు జిల్లా భైరవునికోనలో ఉన్నది. ఈ రెండవ విగ్రహాన్ని క్రీ.శ. 8వ శతాబ్దిలో పల్లవ చక్రవర్తి నరసింహవర్మ చెక్కించాడు.

క్రీ.శ. 13వ శతాబ్దిలో తిక్కన మహాభారతం రచించడానికి పూర్వం 'మహేశ్వరాంఘ్రి కమల ధ్యానైకశీలుడు'. మహాభారత రచనకు పూనుకొనడానికి హరిహరనాథుడే ప్రేరణ. ఆయన తిక్కనకు కలలో కన్పించాడు. భక్తిపరవశుడై తిక్కన

కిమస్థి మాలాం కిము కౌస్తుభం వా
పరిష్క్రియాయాం బహుమన్య సేత్వం
కింకాల కూటః కుమువా యశోదా
స్తన్యం తవ స్వాదు వద ప్రభోమే

అని ఆ దేవదేవుని స్తుతించాడు. హరిహరనాథుడు తిక్కనతో 'పారశర్యుని కృతియయి భారతమను పేర బిరగు పంచమవేదము జనులకు ఆరాధ్యము. తద్గౌర మూహించి నీవు అఖండ భక్తితో తెనుగు బాసని నిర్మింప దివురుటరమ భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె! దీనికెదనియ్యె కొని వేడ్కనూని కృతి పతిత్వమర్థించి వచ్చితి' నన్నాడు. 'జన్మాంతర దుఃఖములు దొలగునట్లు చేయుము' అని హరిహరనాథుని వేడుకొని తిక్కన భారత రచనకు సిద్ధమైనాడు.

### 5.5 కవితా వైశిష్ట్యము :

కవిత్వాన్ని గురించి తిక్కన కొన్ని నిష్కర్షమైన అభిప్రాయాలను నిర్వచనోత్తర రామాయణ పీఠికలో తెలిపాడు. పలుకులలో పొందికలేక రసభంగము చేయుచు, ప్రాతబడ్డ మాటలతో తమనేర్పు చూపి, హృదయాన్ని అలరింపలేక నవ్వులపాలయ్యే కవులను తిక్కన 'దుర్విటుల'తో పోల్చాడు. తెలుగు కవిత్వము చెప్పదలచిన కవి అర్థమునకు తగిన మాటలు కూర్చుకొని యతిప్రాసలతో రచించాలి గాని మరొక విధంగా రచించకూడదు. జాత్యముగాని సంస్కృతభాషను తాను ఎక్కడను తెలుగులో బలవంతంగా జొప్పించనని తిక్కన స్పష్టం చేశాడు. కావ్యము సరసులైనవారి చెవులకు ఇంపు కలిగించాలని తలచాడు.

సుకవీంద్ర బృంద రక్షకుడెవ్వడనిన వీడను నాలుకకు దొడవైనవాడు
చిత్త నిత్య స్థిత శివుడెవ్వడనిన వీడను శబ్దమునక ర్థమైనవాడు
దశదిశా విశ్రాంత యశుడెవ్వడనిన చూపుటకు గుఱియైనవాడు
సకల విద్యాకళాచణుడెవ్వడనిన వీడని చూపుటకను గుఱియైనవాడు

అని తిక్కన ప్రజ్ఞా విశేషాలను ఆయన శిష్యుడైన కేతన దశకుమార చరిత్ర పీఠికలో వేనోళ్ళ కొనియాడాడు.

భారతామృతము కర్ణపుటంబుల నారగ్రోలి యాంధ్రావళి మోదము బొరయునట్లు మహాకవిత్వ దీక్షావిధి నొంది పద్యగద్యాలలో రచన కావిస్తానని తిక్కన తెలిపాడు. నా నేర్చిన భంగి జెప్పి వరణీయుడు నయ్యెద భక్తకోటికిన్ అని పలికాడు.

ధర్మేతి హాసమైన వ్యాసభారతాన్ని 'బుధ సంతోషంబు నిండారగ ఆంధ్రావళి మోదము బరయునట్లు' తెలుగు భాషలో రసమయ కావ్యంగా తీర్చి దిద్దిన మహాకవి తిక్కన సోమయాజి.

## 5.6 రసనిర్వహణ :

తిక్కన భారతాన్ని నానా రసాభ్యుదయోల్లాసిగా తీర్చాడు. విరాటపర్వం ఒక్కదానిలోనే శృంగార, వీర, రౌద్ర, కరుణ, భీభత్సరసాలను పోషించి ఆ పర్వాన్ని భిన్న రసాలకు కూడలిగా నిలిపాడు.

భారతంలో ప్రధానరసం శాంతం. వివిధ సన్నివేశాలకు, వివిధ సంఘటనకు సముచితంగా, సమయస్ఫూర్తిగా వివిధ రసములను పోషించి రసరమణీయకంగా తిక్కన భారతాన్ని రచించాడు.

ఉద్యోగ పర్వంలోని ఉత్తరాభిమన్యుల ఘట్టము, ఆనుశాసనిక పర్వములోని సుదర్శనాగ్నుల ఘట్టము శృంగార రస ప్రధానములు.

ఉత్తర గోగ్రహణ ఘట్టమున ఉత్తరకుమారుని ప్రగల్భములు హాస్యరస పూరకములు.

ఎత్తున గొందు గౌరవుల నెల్లను మార్కొనిరేని గోవులం
దెత్తు ముహూర్త మాత్రమున దేరికి సారధి లేమిజేసినా
చిత్తమునన్ విచారదశ జెందెడు నెవ్వడు గల్గనొక్కొనా
కిత్తఱి నే గదా కడపనెంతయు నేర్తు రధంబనంబురిన్

తగుసారధి దొరకొనినం
బగతుర భంజించుటెంత పని కదుపుల ద
వ్వగ గొని పోదురొకో యి
ట్లగునె కలండేని సూతు నరయుండెందున్

ఇవి ఉత్తర కుమారుని వీరాలాపములు. అయినను గతిలేక బృహన్నలను సారధిగా జేసుకొని బయలుదేరి, కౌరవసేనను చూచి, మేను గరుపాటి, మనస్సు తలకి, చూపు ఱిచ్చపడి తొట్రుపడుచు బృహన్నలతో పలికిన పలుకులు, బృహన్నల ఎంత వారించినా రధము ఒగ్గి పరుగిడుట హాసజనకము.

ద్రౌపది తన భంగపాటును చెప్పుకొను సందర్భమున, అభిమన్యుని వధ ఘట్టమున, ముఖ్యముగా యుద్ధ పంచకమున కరుణ రసమునకు ఆలవాలము.

మహాభారతంలోని మహాద్భుతము శ్రీకృష్ణుని విశ్వరూప ప్రదర్శనము. అర్జునుడు స్తుతించిన విశ్వరూపము విస్మయ స్థాయికము.

ఉత్తర గోగ్రహణ యుద్ధమందు వీరరౌద్ర భీభత్సాలను, ఉద్యోగ పర్వమందు వీరరసము పోషింపబడ్డాయి. వీరరసము బహువిధము. యుద్ధవీరము, ధర్మవీరము, దానవీరము, దయావీరము ప్రసిద్ధములు అందు యుద్ధవీరము మహాభారతమందు నిబద్ధము.

కనుగొని కోప వేగమున గన్నులు నిప్పులురాల నంగము
ల్కనలగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంతపీ
డన రట దాస్యరంగ నికట భ్రుకుటీచటుల ప్రవృత్తన
ర్తన ఘటనా ప్రకర భయద స్ఫురణా పరిణద్ధ మూర్తియై
రౌద్ర రసోచితమైన ఈ వర్ణన భీమసేనును కోపవేగాన్ని స్పష్టంగా ప్రకటిస్తోంది.

రణరంగమున ఏనుగుల కళేబరములు, గుఱ్ఱముల అవయవములు, రధికుల సారధుల శరీర ఖండములు తునాతునకలుగా పడియుండెను. రక్తనదులు పిశాచములు జలక్రీడలాడు మహా ప్రవాహమయ్యెను. జుగుప్స కలిగించు ఈ వర్ణన భీభత్సరస నిలయము.

అర్జునుని భయపెట్టిన కర్ణుని భార్గవాస్త్ర ప్రయోగము, తత్సందర్భముగా తిక్కన రచించిన పద్యము (ఘోరానేక ..... ) నందలి శబ్ద సంయోజనము భయానక రసోచితము.

## 5.7 పాత్రపోషణ :

లోక పరిశీలనలో మేటి అయిన తిక్కన పాత్రల మనస్తత్వ చిత్రణలో అనితర సాధ్యమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు.

విరాటపర్వంలో సైరంధ్రి, వలలుల సంభాషణలో వారి మనస్తత్వాన్ని నైపుణ్యంతో చిత్రించడమే కాకుండా, కీచక సుధేష్ణ పాత్రలను మిక్కిలి సామర్థ్యంతో తీర్చిదిద్దాడు. కీచకుణ్ణి ఒక శృంగార నాయకునిగా చిత్రిస్తూనే, అతని కామము ధర్మబద్ధమైనది కాదు కాబట్టి అతని వధ అతని కామానికి అనుగుణమైనదనే భావాన్ని కల్గించాడు తిక్కన.

విరాట నగరాన్ని ప్రవేశించే సందర్భంలో పాండవులు 'మహిత జ్వాలా కృతులు మానధనుల్' అని తెల్పడం సముచితంగా ఉంది. ద్రౌపది, కుంతి పాత్రలను తెలుగు దేశపు స్త్రీలు అనే భావన కలిగే విధంగా వారి మానాభిమానాలను వెల్లడించే విధంగా సంభాషణలు పలికించాడు. ముఖ్యంగా ద్రౌపది అభిమానవంతురాలు. అవమానం భరించలేదు. అలా అవమానించిన వారి అంతం చూడవలెనని కోరికతో భర్తలను పురికొల్పుతుంది. ద్రౌపది తన అవమానాన్ని గుర్తుకు తెచ్చుకొని రాయబారానికి వెళ్తున్న శ్రీకృష్ణునితో పలుకు సందర్భంలో ఆమె ఆంతర్యం సుస్పష్టంగా గోచరిస్తుంది. ద్రౌపది పాత్ర సంపూర్ణ స్వరూపం ఆ ఘట్టంలో ఆవిష్కరింపబడింది.

ద్రోవది బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెండ్రుకల్
దావల చేతబూని యసి తచ్చవి బొల్చు మహా భుజంగమో
నా విల్లసిల్లి వ్రేలగ, మనంబున బొంగు విషాద దోషముల్
గానక లేక బాష్పములు గ్రమ్మర దిగ్గన లేచి యార్తయై

"ఇవి దుస్ససేను వ్రేళ్ళు దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి" అని వెండ్రుకలను కృష్ణునికి చూపి తన మనసులో దాచి వుంచిన అగ్ని కణాలను తన పలుకుల ద్వారా ప్రదిర్శించింది ద్రౌపది. ఆమె హావభావాలను, చేష్టలను కన్నులకు కట్టినట్టు చిత్రించాడు తిక్కన.

ఉత్తర, సంజయుడు, అభిమన్యుడు, భీష్ముడు, విదురుడు, ధర్మరాజు ఒకరేమిటి ఏ పాత్రను పరిశీలించినా తిక్కన ప్రత్యేకత ద్యోతకమవుతుంది. ధర్మజుడు 'మెత్తని పులి' అన్న తిక్కన పాత్రపోషణా సామర్థ్యాన్ని ఎంతైన కొనియాడవచ్చును.

## 5.8 వర్ణనా నైపుణ్యం :

వర్ణనలు చేయవలసిన చోట్ల తిక్కన ప్రబంధ కవులవలె సుదీర్ఘ వర్ణనలు చేయడు. అయినా విరాట పర్వాన్ని 'ప్రబంధమండలి' గా తీర్చి, అనంతర ప్రబంధ కవులుకు మార్గదర్శకుడయ్యాడు. ఉత్తర ఆభిమన్యుల వివాహాఘట్టములో వర్ణనలన్నీ దేశీయమైన ఆచారాలను తెలియజేస్తూ తిక్కన స్వతంత్రతను వెల్లడిస్తాయి. తిక్కన వర్ణనలు స్వాభావికంగా, సందర్భానుకూలములై యుండునేగాని సాంకేతికములై, సంపీడ్యత ప్రకర్ష ప్రకటనార్థమై గూర్చినవిగా నుండక కథాగమనమును సాగించునవై యుండునుగాని కథా ప్రసారమున కడ్డుతగలవు (శిష్ట్లా రామకృష్ణ శాస్త్రి - ఆంధ్రవాఙ్మయచరిత్ర సర్వస్వము).

కీచకుని విరహాన్ని వర్ణించేటప్పుడు తిక్కన చేసిన ప్రకృతి వర్ణనలు తర్వాతి కవులకు మార్గదర్శకమైనాయి.

అంతేకాక తిక్కన వర్ణనలు ఆ దృశ్యాలను పఠితలకు సాక్షాత్కరింపజేస్తాయి. తిక్కన స్త్రీలను కాక, వారు నడిచేటప్పుడు, నవ్వేటప్పుడు, పలికేటప్పుడు కలిగే సౌందర్యాన్ని ఎక్కువగా వర్ణించాడు. బృహన్నలను సారధిగా ఒప్పించడానికి ఉత్తర అతని దగ్గరకు పోయేటప్పుడు తిక్కన ఆమె విలాసాన్ని 'అడుగులను కాంతి నయ్యెడ బద్మరాగమ్ముల నెలకట్టు కరణినొప్పగా'.

ఆమె రూపమును కళ్ళకు కట్టినట్టు మనోహరంగా వర్ణించాడు. అట్లే యుద్ధపర్వాలందు యుద్ధ ఆరంభ, విరామం సూచించడానికి దినాద్యంత సంధులననువర్ణిస్తూ సూర్యుని ఉదయం, అస్తమయాలతో పోల్చి ఆ వర్ణనలకు కథా సన్నివేశంతో సన్నిహితమైన సంబంధాన్ని కల్పించాడు.

ఔచిత్యానికి భంగం కలగనీయకుండ, వర్ణనల కోసమే వర్ణనలు చేయకుండ, కథాగతికి వర్ణనలు తోడ్పడే విధంగా రచించడం తిక్కన విశిష్టత.

## 5.9 నాటకీయశైలి :

నాటకీయత అనగా సజీవపాత్ర సాక్షాత్కారము. మనోభావ వ్యక్తీకరణము. సంభాషణ నైపుణ్యము.

సంఘటనాత్మకమైన, సంఘర్షణాత్మకమైన, ఉత్కంఠాపాదకమైన, ఆశ్చర్యజనకమైన దృశ్యరూప చిత్రణము నాటకీయత.

శ్రవ్యకావ్యమైన భారత ఇతిహాసాన్ని తిక్కన కావ్యలక్షణ శోభితమైన ప్రబంధముగా చేయడమే కాక దానికి నాటకీయత కూడ సంతరించాడు. నాటకంలో వలె పాత్రలు మన ఎదుట నిలబడి వ్యవహరించేటట్లు రచించాడు. విరాట ఉద్యోగ పర్వాలందలి ఏ ఘట్టాన్ని పరిశీలించినా ఈ విషయం తెలుస్తుంది. పాత్రల సృష్టి నాటకీయతకు ప్రాణం. తిక్కన భారతం చదువునపుడు కథ చదువుతున్నట్లు కాక నాటకాన్ని చూస్తున్న భావం కలుగుతుంది.

శ్రీకృష్ణుడు రాయబారమునకు వెళ్లు సందర్భంలో ద్రౌపది అతనికి తన భంగపాటును తెలుపు ఘట్టమునందు తన "వెండ్రుకలు గోవిందు ముందటం బెట్టి" అనగనే, ఏమి చేయునో ఏమి పలుకునో అని ఉత్కంఠ కలుగును. తరువాత "ఇవి దుస్ససేను" "ఈ వెండ్రుకలు పట్టి" అను పద్యములు ఆశ్చర్యము గొలుపును. "బంధురంబయిన క్రొమ్ముడి గ్రమ్మున విడ్చి వెండ్రుకల్ దావలచేత బూని యసి తచ్చవి బొల్చు మహా భుజంగమో నా విలసిల్లి వ్రేలగ" - ఇది దృశ్యరూప చిత్రణం. నాటకమును చూస్తున్నట్లు ఉత్కంఠ, పాత్ర సాక్షాత్కారము.

ఉత్కంఠాపాదకముగ, ఆశ్చర్యజనకముగ దృశ్యరూప చిత్రణ చేయడం రెండు విధాలు. ఒకటి కవి ప్రత్యక్ష కథనం. రెండోది కథలోని పాత్రల చేతను మరియొక పాత్రను ప్రశంసింపచేసి పాత్ర చిత్రీకరణ చేయడం.

విరాట నగరానికి వెళ్ళునప్పుడు మార్గాయాసంలో అలసిన సుకుమారి అయిన ద్రౌపది ధర్మరాజుతో "డప్పి జనించె వ్రేళుల పుటంబులు పొక్కు దొడంగె" అను పద్యములో ద్రౌపదికి కలిగిన ఆయాసం, దైన్యం కనబడుతుంది.

కౌరవ సైన్యాన్ని చూచి భీతిపొందిన ఉత్తరుని మూర్తిని తిక్కన కళ్ళకు కట్టినట్లు వర్ణించిన విధం -

"వెలవెల బాఱుచు వెగడొంద బెదవుల తడియాఱు నెంతయు దల్లడిల్లు . . . . . "

భారత కవులలో నన్నయది కథాకథన దృష్టి. ఎఱ్ఱనది వర్ణనాత్మక దృష్టి. తిక్కనది కథాకథనము వర్ణనాత్మకము కలిపి మూసపోసిన నాటకీయ శిల్పదృష్టి. కనుకనే వ్యాసభారతంలో లేని శోభ, గౌరవం ఇతనికి దక్కింది.

ఉత్తర గోగ్రహణ ఘట్టంలో కౌరవులు విరాటుని గోవులను ముట్టడించి తీసుకొని పోవు సందర్భంలో ఉత్తరుడు కౌరవులతో యుద్ధం చేయుటకై వెళ్ళడానికి సరియైన సారధిలేడని అంటాడు. అప్పుడు సైరంధ్రి వేషంలో ఉన్న ద్రౌపది బృహన్నలకు సారధ్యం వచ్చునని చెబుతుంది. ఉత్తరుని చెల్లెలు ఉత్తర బృహన్నల దగ్గర నాట్యం నేర్చుకుంటుంది. ఆ చనువుతో ఉత్తర బృహన్నలను పిలవడానికి నర్తనశాలకు వచ్చినపుడు వారి మాటలలో నాటకీయ లక్షణాలు కన్పిస్తాయి.

"నీ కందువ సైరంధ్రి చెప్పినం బ్రియంబంది నిన్ను దోడ్తేర నన్ను బనిచిన నేనును నీ పాల చనువు కలుగుటం చేసి యెల్ల విధంబుల దెత్తునని బూని వచ్చితి నీవును నా పలుకులు కుఱచచేయక . . . . . . "

అని ముద్దుసేసిన ఆ మాటలకు నవ్విన బృహన్నల "జగదీశ్వరపుత్రీ నాకు సారధ్యము నేర్పుగలదే . . . . " అంటూ మెల్లమెల్లగా బయలుదేరి ఉత్తరకుమారుని చెంతకు వెళతారు.

యుద్ధానికి ఉత్తరుడు బృహన్నల వెళ్ళునపుడు కౌరవ సైన్యం చూచి ఉత్తరుడు భయంతో రథాన్ని వెనక్కు త్రిప్పమని, ప్రాణాల మీద ఎవరికి తీపి ఉండదు అని ఉత్తరుడు అడుగు సందర్భంలో హాస్యంతో కూడిన నాటకీయత కన్పిస్తుంది.

అట్లే కీచకుని వృత్తాంతమంతయు ఒక నాటకంలాగా వుంటుంది. ఈ విధంగా తిక్కన మనస్తత్వాన్ని చిత్రించడంలోనూ, సంభాషణా చాతుర్యంలోను నాటకీయ శైలిని పోషించాడు.

### తెలుగుదనం

తిక్కన శైలి ప్రధానముగా తెలుగు దనముతో కూడుకొనినది. తెలుగుదనమంటే శుష్కమైన తెలుగు మాటల కూర్పుకాదు. తెలుగు వాడు తన తలపులను వెల్లడించు తీరు తెలుగుదనము. ఇది నేడు పల్లెలలో నాగరికతా గంధము సోకని వారి నోళ్ళలో మాత్రమే మిగిలి వున్నది. తిక్కన భారతములో ప్రతి పదమునందును ఈ తెలుగుదనము వెలుగుచున్నది.

నడవడియను మున్నీటం
గడవం బెట్టంగ నోడకరణిందగి తా
నొడగూడు ననిన సత్యము
గడచిన గుణమింక నొండుగలదే యరయన్

పదములను తూచినట్లుగ, అర్థము విశేషములతో అతుకునట్టుగ ఉపయోగించడం తిక్కన కవితా విభూతలలో ఒక్కటి. తెలుగు మాటలకు గల బలమును తిక్కన తన రచనలో నిరూపించాడు.

ఇందఱు జూడగా నిచట నెమ్మెయి నన్ను బతివ్రతా గుణా
స్పందిత వర్తనం బరమ సాధ్వి ననిందిత శీల గీచకుం
డెందును నెట్టి యంగనల నెవ్వరు జేయని యట్ల సేయగా
గొందఱకైన నిప్డు దయకుందఱి గాదటె యేమి సెప్పుదున్

అవమానము పొందిన తెలుగు ఆడబడుచు ఏ విధంగా మాటలాడుతుందో ద్రౌపదియు ఆ విధంగానే మాట్లాడింది.

ధర్మజుడు ఆజ్ఞాతవాసానికి ముందు ద్రౌపదిని గూర్చి బాధపడినాడు. ఆ బాధను వ్యక్తీకరించడానికి తగిన శైలి తేటతెనుగు మాటలకూర్పే.

ఇది కడుముద్దరాలు పనులేమియు జేయగనేర దెంతయున్
మృదువొక కీడు పాటునకు మేకొన జాల దుదాత్త చిత్తమొం
టి దిరుగుదాని కోర్వ దొకటిన్ దనుదా సవరించు చొప్పెఱుం
గదు తగ నొండ్లనుం గొలువగా వెరవెమ్మెయి గల్గు నక్కటా

వందలకొలదిగా ఇట్టి పద్యములలోని తెలుగు పదముల పొందిక భావగాంభీర్యములు తిక్కన మహాకవి తెలుగు భాషకు జీవము పోసినాడనడం సత్యం. నన్నయ కవిత్వంలో మూడు వంతులు సంస్కృత పదాలు, ఒక వంతు తెలుగు పదాలను అభిప్రాయముంది. తిక్కన కవితలో మూడు వంతులు అచ్చ తెలుగు పదములు, ఒక వంతు తత్సమ పదాలను విషయం తేటతెల్లం. తిక్కన చిన్నచిన్న పదాలతో భావ వ్యక్తీకరణ గావించుతాడు.

అయితే, సందర్భాన్ననుసరించి, రసము ననుసరించి దీర్ఘసమాసాలతో, సంస్కృత పదభూయిష్టంగానూ తిక్కన రచన గావించినాడు. ఉత్తరుడు కౌరవ సైనమును చూచినప్పుడు అది అత్యంత భయంకరంగా తోచినది. భీష్మ ద్రోణాదులతో కూడిన భయంకరమైన కౌరవ సైన్యాన్ని వర్ణించడానికి సంస్కృత పదభూయిష్ఠమైన రచన తప్పదు.

భీష్మ ద్రోణ కృపాది ధన్వినికరా భీలంబు దుర్యోధన
గ్రీష్మాదిత్య పటు ప్రతాప విసరా కీర్ణంబు శస్త్రాస్త్రజా
లోష్మ స్ఫార చతుర్విధోజ్జ్వల బలాత్యుగ్రంబు దగ్రధ్వజా
ర్చిష్మ త్వా కలిబంబు సైన్యమిదియే జేరంగ శక్తుండనే

**జాతీయాలు :**

తన కవితను తెలుగుదనముతో నింపదలచిన తిక్కన ఆ భాషాజాతీయాలను సందర్భానుసారముగా ప్రయోగించాడు. ఇవి పదబంధాలలో జిగిబిగి కలిగించాయి. తిక్కన కవి భారతంలో ప్రయోగించిన జాతీయాలు, సామెతలు కోకొల్లలు. జాతి జీవనంలో వ్యవహారంలో ఉన్న సజీవమైన భాషనే కవి గ్రంథస్థం గావించాడు. కాదుకూడదన, పిల్లి పట్టిన యీరువు, అరచేత ప్రాణంబులిడి, కయ్యమునకు గాలుదువ్వ, ఉల్లికుట్టు మాటలు, నేయి వోసిన యగ్ని, అగ్ని చల్లనగుట, కంటికిన్ ఱెప్పయువోలె, కొంగున నగ్ని దాచినట్లు, అందని మ్రానిపడ్లు గోమదలచుట, నివురు గవిసిన మెఱయని నిప్పువోలె, శ్రీరా మోకాలొడ్డిన వారి విధము - మున్నగునవి తిక్కన కవితలో క్షీరోదక వృత్తి కలిసిపోయి అందము చేకూర్తాయి.

## యుద్ధవర్ణన :

తిక్కన కార్యదక్షుడైన మహామంత్రియేకాక, అవసరమైనచో కవచ ఖడ్గధారియై రణరంగాన వీరవిహారం చేసిన సేనాపతి. భారతంలోని యుద్ధ పంచకములో యుద్ధభూమిని చిత్రవిచిత్రంగా వర్ణించాడు.

"చేయి దునిసిన దక్కటి చేతం గైదువు కొని కవియువారును, గాలు దునిసిన నెదిరి మీదికి లంఘించువారును, దల దునిసినందారుమును గన్నిడిన వారిం బొడిచి పడువారును, దెగిపడియు, నపుడు గఱచుటయును, బొమములు వడుటయును నెడలని తలల నొప్పువారును . . . . "

యుద్ధరంగమున ఆకస్మికంగా తలతెగి పడిన వారికి వెన్వెంటనే చైతన్యము పోదు. దానిని పైరీతిగా వర్ణించాడు తిక్కన.

ఎంతటి ప్రాముఖ్యత, ప్రత్యేకత ఉన్నా భయంకరమైన యుద్ధఘట్టములను చదువుతున్న పాఠకుడికి విసుగు జనించక తప్పదు. ఆ సమయంలో పాఠకుల హృదమాలనొక విచిత్రానంద స్థితిలో నుంచడానికి తిక్కన కొన్ని చమత్కారాలను ప్రయోగించాడు. యుద్ధ దృశ్యాలను ప్రకృతి దృశ్యాలతో పోల్చి వర్ణించడం ఒక పద్ధతి. వీరభావాన్ని శృంగార సంబంధంగా వర్ణించడం మరొక పద్ధతి.

యుద్ధరంగంలో అలసిపోయిన యోధులు గజముల కుంభ స్థలములపై నిద్రించారు. దానిని తిక్కన వర్ణించిన తీరు -

తరుణుల కుచములపై రతి
పరవశులై యోహకు పతుల పగిది సమర సం
భరిత శ్రమమున నిద్రిం
చిరి కరి కుంభముల జెంది బెన్నుగ జోదుల్

స్త్రీల వక్షోజములను ఏనుగుల కుంభ స్థలములతో పోల్చి వర్ణించడం కవి సమయం. యుద్ధభూమిలోని ఏనుగుల కుంభ స్థలములను తరుణీ కుచ కుంభములతో పోల్చడం తిక్కన ప్రత్యేకత.

## అలతి యలతి పదముల కూర్పు :

తిక్కన సాధారణంగా దీర్ఘసమాసాలను రాయక చిన్నచిన్న పదాలతో భావవ్యక్తీకరణ గావిస్తాడు. ఆ పదముల కూర్పు నేర్పు రమణీయంగా వుంటుంది. ఒక పద్యములో పెక్కు వాక్యాలుండునట్లు రచన చేస్తాడు.

పరశురాముడు అంబను స్వీకరింపుమని భీష్ముని ఆదేశించగా భీష్ముడు వినయంగా తిరస్కరించాడు. అప్పుడు పరశురాముడు భీష్మునితో అన్న మాటలను

గురుడని నన్నెఱుంగు, దనఘుండవు, నా వచనంబు నందనా
దరణము సేని తెన్నియు విధంబుల బల్కెదు భక్తితోడ, నీ
వెరవులు దక్కు, మీ యబల వేగమ పెండిలి సేయు, మంతితో
మరలు మదీయ కోపశిఖి మానదు వేఱొక వేయు జేసినన్

అని ఎనిమిది చిన్నచిన్న వాక్యాలుగల పద్యం వ్రాసినాడు తిక్కన.

తిక్కన పద్య నిర్మాణంలో ఒక సమత ఉంటుంది. పద్యాన్ని మొదలుపెట్టి ముగించడంలో ఒక సక్రమత గోచరిస్తుంది. అతడు రచించిన సీసపద్యాలు మరొక తార్కాణం. తిక్కన సీసములు ఏ పాదమునకాపాదము తెగిపోవుచుండును. నాలుగు పెద్ద

పాదాలలోని రచనకు తరువాతి గీత పద్యంలోని కూర్పునకు ఒక విడదీయరాని సంబంధముంటుంది. ద్రౌపది ధర్మజుని స్తుతించుచు చెప్పిన పద్యం -

ఎవ్వని వాకిట నిభమద పంకంబు
రాజభూషణ రజోరాజినడగు
నెవ్వని చరిత్రమెల్ల లోకములకు
నొజ్జయై వినయంబు నొఱపుగఱపు
నెవ్వని కడగంట నివ్వటిల్లెడు చూడ్కి
మానిత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేడు వారాసుల
కడపటి కొండపై గలయ బ్రాకు
నతడు భూరి ప్రతాప మహా ప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటీరమణి ఘృణి వేష్టితాంఘ్రి
తలుడు కేవల మర్త్యుడే ధర్మసుతుడు

అసంఖ్యాకులైన సామంతరాజులు అతి సమ్మర్దముగ కలరని, ధర్మరాజు అంతటి మహారాజని ధ్వన్యర్థము.

## నవ్వులు :

సందర్భానుసారముగా పాత్రలు నవ్వడం, ఆ నవ్వుల్ని కవులు వర్ణించడం సర్వసాధారణం. కాని తిక్కన వర్ణించినన్ని నవ్వులు మరే కవీ వర్ణించలేదు. అవి ముప్పది రెండు విధాలు. వానిలో మళ్ళీ 3 విధాలు. 1. పిన్ననవ్వు, 2. చిఱునవ్వు, 3. అల్లనవ్వు, 4. అలతినవ్వు, 5. మందస్మితము, 6. హర్షమందస్మితము, 7. అంతస్స్మితము, 8. జనితమందస్మితము, 9. ఉద్గత మందస్మితము, 10. అనాదర మందస్మితము, 11. సాదర దరహాసము, 12. తిన్నని నవ్వు, 13. లేత నవ్వు, 14. కొండొక నవ్వు, ఇవి చిన్న నవ్వులు.

15. పెలుచ నవ్వు, 16. ఉబ్బు మిగిలిన నవ్వు, 17. గేలిగొను నవ్వు, 18. ఒత్తిలి నవ్వు, 19. అపహాసము, 20. రోషకదినహాసము, 21. ఉద్ఘటహాసము, 22. కలకల నవ్వు, ఇవి పెద్ద నవ్వులు.

23. ఎలనవ్వు, 24. ప్రౌఢస్మితము, 25. బెట్టు నవ్వు, 26. కన్నుల నవ్వు, 27. కన్నుల నిప్పులు రాల నవ్వు, 28. కినుకు మానిన నవ్వు, 29. కినుకు మునుంగు నవ్వు, 30. కటిక నవ్వు, 31. నవ్వుగాని నవ్వు, 32. ఎఱ్ఱ నవ్వు, ఇవి గొప్ప నవ్వులు.

## 5.10 రాయబారములు :

తిక్కన మహాభారతంలో మూడు రాయబారములున్నవి. మూడు రాయబారములు మూడు విధాలుగ ఉన్నవి. ప్రతి దానిలోనూ తిక్కన ప్రతిభ ద్యోతకం.

### ద్రుపద పురోహితుని రాయబారము :

ద్రుపద పురోహితుడు పాండవుల రాయబారి. పురోహితులకు లౌక్యము పూజ్యం. రాయబారానికి లౌక్యమే ముఖ్యం. పాండవులనుభవించిన క్లేశములను తెలిపి, వాటికి పరోక్షంగా ధృతరాష్ట్రుడే కారణమని ప్రకటించి, సూటిగా ప్రశ్నించడం ద్రుపదుని

లౌక్యరాహిత్యానికి తార్కాణం. ఇది అతి తీక్ష్ణమని, రాయబారికి తగదని భీష్ముడు కూడ పలికాడు.

**సంజయుని రాయబారము :**

సంజయుడు కౌరవుల రాయబారి. పరమలౌక్యుడు. కుశల ప్రశ్నలలోనే ధర్మరాజు కోపమును గ్రహించి, ప్రకోపశమముగ పలికి, ఇంద్రప్రస్థమో మరొక పట్టణమో అడుగునట్లు చేసి, రుధిరాభీలాన్నము కంటె భిక్షాన్నమైన మేలని పలుకుతూ, ధర్మరాజు యొక్క అహింసాధర్మమును, అనింద్య చరిత్రమును ప్రశంసించి దాదాపు స్తోత్ర పారాయణం చేసాడు. ఎంతటి వాడైనను స్తోత్రమునకు పడిపోవుట సహజము. ధర్మరాజు కూడ కోపమును మాని, అహింస వైపు మొగ్గి కృష్ణ రాయబారమునకు పూనుకొనెను.

**శ్రీకృష్ణుని రాయబారము :**

శ్రీకృష్ణుడు పాండవుల రాయబారం. సర్వజ్ఞుడు. సంధి పొసగదని తెలిసి సంధి ప్రయత్నము నిర్వంచనముగ చేసిన నీతి విశారదుడు. ధర్మ సంస్థాపనము తన కర్తవ్యం. అందుకే నయభయముల శ్రీకృష్ణుడు సంధివచనములు పిలికినాడు. ధృతరాష్ట్రుడు చలింపలేదు. పాండవుల వీరశౌర్యములను వివరించి చెప్పి, సంధియో, యుద్ధమో నిర్ణయించుకొమ్మని నిర్ణయాధికారం ధృతరాష్ట్రునికే వదిలాడు. ఇది సర్వజ్ఞుని ఉచితజ్ఞత. తిక్కన అనుభవజ్ఞత.

**5.11 తిక్కన ఇతరకృతులు :**

**కవి వాగ్బంధనము :**

తంజావూరు సరస్వతీ మహల్‌లో ఒక ఛందోగ్రంథమున్నది. కవిసార్వభౌమ ఛందస్సని దీని నామాంతరం. దీనిలోని ఒక పద్యములో తిక్కన పేరుండుటచే ఇది తిక్కన కృతమని ఒక అభిప్రాయం. కాని తిక్కన సమకాలికుడు కేతన ఆంధ్రభాషా భూషణమున ఇదివరకెవ్వరును తెలుగునకు లక్షణము చెప్పలేదని విన్నవించాడు. పైగా 'కవి వాగ్బంధము' ముప్పది యాఱు పంక్తుల తాళపత్ర గ్రంథము. ఇంత చిన్న గ్రంథమును తిక్కన వ్రాసినాడనుట నమ్మశక్యము కాదు. మనుమసిద్ధి మహారాజు తండ్రి తిక్కన రచించియుండ వచ్చునేమో.

**కృష్ణశతకము :**

తిక్కన కృష్ణశతకము రచించాడని ఉదాహరణంగా చెప్పు పద్యములోని "కృష్ణ! భక్తప్రియా! అన్న మకుటముతో ఉన్న శతకముగాని, మరే పద్యములు కాని లభించుటలేదు. 'కృష్ణా! దేవకీనందనా' అను మకుటముతోనున్న వెన్నెలకంటి జన్నయ రచించిన శతకమొకటి ఉన్నది. ఈ పద్యము దానిలోనిది కావచ్చును.

**విజయసేనము :**

తిక్కన విజయసేనమను ప్రబంధమును రచించెనను ప్రతీతి లోకమున వ్యాప్తిలోనున్నది. పెదపాటి జగ్గన (క్రీ.శ. 1550) తన సంకలన గ్రంథంలో కొన్ని పద్యాలు ఉదాహరించాడు. ఇందు రెండు వినాయకుని స్తుతించేవి. తిక్కన ఒక గ్రంథంలో వినాయకుని రెండు పద్యములలో స్తుతించితే, నిర్వచనోత్తర రామాయణంలో గాని, భారతంలోని వినాయకునేల స్తుతించలేదు.

'విజయ సేనము'నకు, అమరేశ్వరుని 'విక్రమసేనము' నకు ఉదహరించుటలో ఒకదానికొకటి పొరబడిఉండవచ్చు. కాని కొన్ని పద్యములు తిక్కన నిర్వచనోత్తర రామాయణంలోని సీసపద్యములను పోలివున్నవి. కనుక ఈ గ్రంథమును తిక్కన బాల్యమున రచించెనని అనుమానించుట కవకాశమున్నది.

## 5.12 తిక్కన సమకాలికులు :

### మూలఘటిక కేతన :

తిక్కన సమకాలికులలో ముఖ్యుడు. తన సంస్కృత దశకుమార చరిత్రను తిక్కనకు అంకితమిచ్చాడు. ఇది చంపూ కావ్యము. దశకుమార చరిత్ర, ఆంధ్రభాషా భూషణం, విజ్ఞానేశ్వరీయం అనే మూడు గ్రంథాలు ఇతను రచించాడు. దశకుమార చరిత్ర తెలుగులో తొలి కథా కావ్యము. కేతన కవిత్వంలో జటిల సమాసాలుకాని, అన్వయ కాఠిన్యం కాని ఉండవు. ఆంధ్ర భాషాభూషణం తెలుగులో తెలుగుభాషకు కేతన 196 పద్యాలలో చెప్పిన మొట్టమొదటి స్వతంత్ర వ్యాకరణం. ఇందు కేతన తెలుగు, తెనుగు అను రెండు శబ్దాలను వాడాడు. విజ్ఞానీశ్వరీయం తెలుగు భాషలో మొట్టమొదటి ధర్మశాస్త్ర గ్రంథం. ఇందు మూడు ఆశ్వాసాలున్నాయి. 433 పద్యాలున్నాయి. దీనివలన ఆనాటి ఆచార వ్యవహారాలు చక్కగా తెలుస్తాయి.

### మారన :

ఇతడు తిక్కన శిష్యుడు. ఇతడు రచించిన మార్కండేయ పురాణం ప్రథమాంధ్ర పురాణం. తిక్కన అనుగ్రహం వలన తనకు కవితాశక్తి అబ్బిందని మార్కండేయ పురాణం ఆశ్వాసాంత గద్యలో చెప్పాడు. అష్టాదశపు రాణాలలో మార్కండేయ పురాణం ఏడవది. మహాభారతంలో సంపూర్ణములు కాక సంశయములో ఉన్న కథలను మార్కండేయ పురాణం వివరిస్తుంది. ఇది 8 ఆశ్వాసాలలో సుమారు 2547 గద్యపద్యాలతో వుంది. వర్ణాశ్రమ ధర్మాలు, శ్రద్ధనియమాలు, పురాతన వంశావళి మొదలైనవి ఈ పురాణంలో చాల ఎక్కువ. ఇందు మహిషాసు మర్ధనం, శుంభ నిశుంభుల కథలను మారన ఉత్తేజకరంగా అనువదించాడు.

### మంచన :

ఇతడు రచించినది కేయూరబాహు చరిత్ర. ఇది చంపూ కావ్యము. ఇందులో పంచతంత్ర హితోపదేశముల నుండి కొన్ని కథలను గ్రహించి తన కాలాన జన సామాన్యంలో వాడుకలో ఉన్న కొన్ని కథలను కల్పించి మొత్తం 22 కథలు "కేయూరబాహు చరిత్ర" లో చేర్చాడు. అతను సంగ్రహంగా కథలు చెప్పుట రచనలోని గొప్ప నేర్పు. ఈయన కవిత్వం సలక్షణం, సరసం అయింది. అతని పద భావసంపద, రచనా ప్రౌఢిమ, ధారాశుద్ధి ఎన్నదగినది. అతని శైలి సరళమైన కథాకథన పద్ధతికి చెందింది.

### బద్దెన :

ఇతను చిన్న సామంతరాజు. నీతిశాస్త్ర ముక్తావళి అనే రాజనీతి గ్రంథాన్ని రచించాడు. 162 పద్యాలున్నాయి. రాజనీతి పద్ధతి, మంత్రి పద్ధతి, ఉపాయ పద్ధతి మొదలైన వాటిపై నీతి బోధకాలైన పద్యాలున్నాయి. ఇతని శైలి రమ్యమై మృదువుగా వుంటుంది. అన్వయ కాఠిన్యం ఉండదు. లోకోక్తులతో, చక్కని ఉపమానాలతో రచన హృదయాంగమంగా ఉంటుంది.

### యథావాక్కుల అన్నమయ్య :

'సర్వేశ్వరా' అన్న మకుటంతో నూటనలుబడిరెండు మత్తేభశార్దూల వృత్తాలను రచించి, శతకాన్ని దూదికొండ సోమేశ్వరారాధ్యునకు అంకితమిచ్చిన యథావాక్కుల అన్నమయ్య కాలము క్రీ.శ. 1242 ప్రాంతము. అన్నమయ్య మల్లికార్జున పండిత, పాల్కురికి సోమల రచనల నుండి, సంస్కృత శివస్తోత్రాల నుండి భావాలను స్వీకరించాడు. ఈ శతకంలో పద్యాల నడక ధారాళంగా సాగుతుంది. శైలి ప్రసన్న గంభీరమై, భక్తి స్ఫోరకంగా ఉంటుంది. తర్వాతి కవులనేకులు ఇందలి పద్యాలను అనుకరించారు.

## 5.13 రాదగిన ప్రశ్నలు :

1. తిక్కన కవితా తత్త్వాన్ని వర్ణించండి.
2. తిక్కన నాటకీయతను వివరించండి.
3. తిక్కన నిర్వచనోత్తర రామాయణ రచనను విశ్లేషించండి.
4. తిక్కన భారతాంధ్రీకరణ విధానాన్ని వివరించండి.

## 5.14 ఆధార గ్రంథాలు :


తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ జి. నాగయ్య

సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర

తెలుగు కవుల చరిత్ర - నిడదవోలు వేంకటరావు

తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి



డాక్టర్ సి.హెచ్. సుశీలమ్మ

రీడర్, తెలుగుశాఖ

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

గుంటూరు

పాఠం - 6

# ఎఱ్ఱన యుగం

6.0 లక్ష్యం
6.1 ఎఱ్ఱన జీవత విశాషాలు - రచనలు
6.2 అరణ్యపర్వశేషం - ఎఱ్ఱన కర్తృకమా?
6.3 ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వం
6.4 ఎఱ్ఱన కవితారీతులు
6.5 రాదగిన ప్రశ్నలు
6.6 ఆధారగ్రంథాలు

## 6.0 లక్ష్యం :

ప్రబంధ పరమేశ్వరుడుగా ప్రసిద్ధి చెందిన ఎఱ్ఱన జీవిత విశేషాలను, ఎఱ్ఱన రచనలను పరిచయం చేయడం, ఎఱ్ఱన కవితారీతులను విపులీకరించడం.

## 6.1. ఎఱ్ఱన జీవిత విశేషాలు :

కవిత్రయంలో తృతీయుడైనా విశేష ప్రతిభా సంపన్నుడు ఎఱ్ఱన. ఆయన క్రీ.శ. 1280 - 1360 ప్రాంతం వాడని సాహితీ చరిత్రకారులు నిర్ధారించారు. పోతమాంబ, సూరనార్యులు ఆయన తల్లిదండ్రులు. తాత ఎఱపోత సూరి. పండిత ప్రకాండుడైన ఎఱపోత సూరి ఎఱ్ఱనను అరణ్యపర్వశేషాన్ని పూరించమని ప్రేరేపించినట్లు నృసింహపురాణ కావ్యావతారిక వల్ల స్పష్టమవుతుంది. ఆయన గురువు శంకరస్వామి. పాకనాడులోని గుడ్లూరు ఆయన నివాసస్థానం. ఎఱ్ఱన కుటుంబీకులు గుడ్లూరు నుండి చదలవాడకు వచ్చిన సందర్భంగా ప్రోలయ వేమారెడ్డి తమ్ముడైన మల్లారెడ్డి పరిచయం ఏర్పడింది. మల్లారెడ్డి ప్రేరణ వల్ల ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి అయ్యాడు. అద్దంకి పాలకుడైన ప్రోలయ వేమారెడ్డి ఆస్థానకవి ఎఱ్ఱనను ఆప్యాయతతో "సకల భాషా కవిత్వ విశారదుడవు, సాధుసమ్మతుడవు, నిత్యసామ్యమతివి" అని ప్రశంసించాడు. బాల్యం నుండి శివభక్తి తత్పరుడైన ఎఱ్ఱనకు 'శంభుదాసుడను' బిరుదు సార్థకమయింది. గురువైన శంకరస్వామి సాన్నిహిత్యం శివభక్తి తత్పరతకు ఉత్కర్ష కల్గించింది. ఆయన రచనల వల్ల "ప్రబంధ పరమేశ్వరుడు" అనే బిరుదు సార్థకమయింది.

### 6.1.1. ఎఱ్ఱన రచనలు - సంగ్రహ పరిచయం :

ఎఱ్ఱన వంశీకుడైన చదలవాడ మల్లన తన 'విప్రనారాయణ చరిత్రము' అనే కావ్యంలో ఎఱ్ఱనను, ఆయన రచనలను ప్రశంసిస్తూ -

సీ॥ ప్రతిభతో నారణ్య పర్వశేషముఁ జెప్పెఁ
గవులకుఁ జెవుల పండువులు గాగ
వల్మీక భవువచో వైఖరి రామాయ
ణంబు నాంధ్ర ప్రబంధంబుఁ జేసె
నారసింహుని పూరాణ మొనర్చె హరిమెచ్చి
నన్ను నెన్నఁడు చూచినాఁడ వనఁగఁ
బ్రౌఢిమై హరి వంశ భాగముల్ రెండును
రచియించె సభలందుఁ బ్రాజ్ఞులెన్న

దురిత హరుఁ బ్రబంధ పరమేశ్వరునిఁ జెద
ల్వాడ నిలయు నాదు వంశకర్త
ధన్యమూర్తి, శంభుదాసు నెఱ్ఱాప్రెగ్గ
డ నునుతింప బ్రహ్మకునుధరంబె?''

పై ప్రశంసవల్ల ఎఱ్ఱన రచించిన కృతులు నాలుగు తెలుస్తున్నాయి. పై పద్యంలో ఎఱ్ఱన కృతులు రచనాక్రమాన్ని అనుసరించి వరుసలో చెప్పినట్లుగా భావించనవసరం లేదు.

### 6.1.2. రామాయణం :

ఇది అలభ్యం. చదలవాడ మల్లన తన విప్రనారాయణ చరిత్రలో "వల్మీక భవు వచోవైఖరి రామాయణంబు నాంధ్ర ప్రబంధంబుఁ జేసే'' అని ప్రశంసించినందున ఎఱ్ఱన వాల్మీకి ననుసరించి రామాయణం రచించినట్లు తెలుస్తుంది. కూచిమంచి తిమ్మకవి తన 'సర్వలక్షణ సార సంగ్రహం' లో ఎఱ్ఱన రామాయణంలోనివని తొమ్మిది పద్యాలు ఉటంకించుట మరొక తార్కాణం. 'గణపవరపు వేంకటకవి' తన 'ప్రయోగ రత్నాకరం'లో 'ఎఱ్ఱాప్రగడ సంక్షేప రామాయణము' నుండి అని ఉదహరించాడు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ఎఱ్ఱన రామాయణంలోనివైన నలభై ఆరు పద్యాలను లక్షణ గ్రంథాలనుండి సంగ్రహించి ప్రచురించాడు. ప్రోలయ వేమారెడ్డి "................. చేతో మోద మెలర్ప రామ కథమున్ జెప్పించి యత్యుత్తమ ఖ్యాతిం బొందితి ..........'' నని హరి వంశమందు కలదు. ప్రోలయ వేమారెడ్డికి అది అంకితమైనట్లు స్పష్టమౌతుంది. ఎఱ్ఱన రామాయణం లభించకుండుట దురదృష్టకరం. డా॥ జి. నాగయ్య గారు ఊహించినట్లు "సామాన్య జనుల మెప్పించెడి అవాల్మీకాంశములు లేకపోవుటను బట్టి భాస్కర రామాయణం వలె ఎఱ్ఱన రామాయణం లోకమున ప్రఖ్యాతి చెంది ఉండదు'' అనే అభిప్రాయం ఆలోచించదగిందే.

### 6.1.3. హరివంశం :

ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి కోరిక మేరకు భారత పరాంశమైన హరివంశాన్ని రచించినట్లు తెలుస్తుంది.

"భారత పరాంశమని యిం
పారఁగఁ జెప్పుదురు బుధులు హరివంశము నీ
వారమ్మ కథఁ దెనుంగుగ
ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్''

అని ప్రోలయ వేమారెడ్డి అర్థించినందున తన పూర్వ కవులైన నన్నయ తిక్కనలను అనుసరించి హరివంశాన్ని రచించి ప్రోలయ వేమారెడ్డికి అంకింతమిచ్చాడు.

సంస్కృత హరివంశంలో హరివంశ పర్వము, విష్ణుపర్వము, భవిష్యపర్వము అని మూడు భాగాలున్నాయి. ఎఱ్ఱన యధాతథంగా ఈ విభాగాన్ని అనుసరించక తన హరివంశాన్ని పూర్వోత్తర భాగాలుగా రెండుగా విభజించడం. పూర్వభాగంలో తొమ్మిది ఆశ్వాసాలున్నాయి. ఉత్తరభాగంలో పది ఆశ్వాసాలున్నాయి. మూలంలోని షట్పుర వధ, భానుమతీహరణము, ప్రభావతీ ప్రద్యుమ్నము, హంసడిభకోపాఖ్యానము, కార్తవీర్యార్జున కథ, సూర్యవంశ చరిత్ర దివోదాసు చరిత్రము, దుష్యంతుని కథ, మొదలైన వాటిని అనువదించలేదు. కొన్ని ఘట్టాలను సంక్షేపించాడు. కొన్నింటిని ఔచిత్య దృష్టితో పెంచి రచించాడు. నీలా సుందరి పరిణయం వంటి అమూలకాంశాలను చేర్చాడు. ఎఱ్ఱన, నన్నయ, తిక్కనల భారతానువాద పద్ధతిని కొంతమేరకు అనుసరించి భారత పరాంశమైన హరివంశాన్ని ఆంధ్రీకరించాడు.

### 6.1.4. నృసింహపురాణం :

ఎఱ్ఱన తాతగారైన ఎఱపోత సూరి ఆదేశానుసారంగా ఎఱ్ఱన నృసింహపురాణాన్ని రచించాడు. బ్రహ్మాండాది పురాణాంతర్గత మైన ఇతివృత్తాన్ని విస్తరించి, స్వతంత్ర రచన అనే విధంగా ఐదు ఆశ్వాసాలలో రసవత్తరంగా రచించాడు. నృసింహపురాణం పేరుకు మాత్రమే పురాణం. పురాణ లక్షణాలు దీనికి అన్వయించవు. కథ పురాణాంతర్గతమైన రచనా విధానం కావ్య పద్ధతిలో సాగింది. ఎఱ్ఱన కొన్నిచోట్ల ప్రబంధమని, మరికొన్ని చోట్ల మహాప్రబంధమని పేర్కొన్నాడు.

మహర్షులు రౌమహర్షని వలన పురాణేతి హాసాలను వినే సందర్భంలో సర్వగుణ సమగ్రం, పాపహరం, ముక్తి సాధనమైన తీర్థాన్ని గూర్చి వివరించమని అడిగారు. ఆ సందర్భంలో అహోబల క్షేత్ర మహిమను రౌమహర్షుడు, మహర్షులకు వినిపించాడు. ఇందులో అహోబల క్షేత్రానికి ప్రాధాన్యం ఉన్న ప్రహ్లాద, హిరణ్యకశిపుల వృత్తాంతమే విస్తరించబడింది. పోతన ప్రహ్లాద వృత్తాంతానికి ఎఱ్ఱన గారి ఈ వృత్తాంతమే స్ఫూర్తి అని కొందరి విమర్శకుల అభిప్రాయం.

స్వతంత్ర కల్పనలతో, మనోహరమైన వర్ణనలతో, శబ్దమాధుర్యంతో, రచింపబడిన నృసింహపురాణాన్ని విమర్శకులు తొలి ప్రబంధంగా పేర్కొన్నారు. కానీ దీనిని ప్రబంధ ప్రక్రియకు మూలమైన రచనగా పేర్కొనుట సమంజసం. ఈ రచన వల్లే ఎఱ్ఱనకు 'ప్రబంధ పరమేశ్వరుడు' అన్న బిరుదు సార్ధకమైందన్న విమర్శకుల అభిప్రాయం ఆమోదయోగ్యంగా ఉంది. తదనంతరం వెలువడిన క్షేత్రమహాత్మ్య కావ్యాలకు కూడా ఇది మార్గదర్శకమైంది. దీనికే 'లక్ష్మీనరసింహావతారం' అనే పేరు కూడా ఉంది. డా॥ జి. నాగయ్య గారు ప్రశంసించినట్లు "వస్త్వైక్యం, వర్ణనా బాహుళ్యం, రసపోషణం, అను ప్రబంధ లక్షణములు నృసింహ పురాణమందు ప్రస్ఫుటముగా ఉన్నవి. పురాణేతిహాసములు అనువదింప బడుతున్న కాలంలో ప్రబంధ లక్షణ శోభితమై వెలసినదీ మహాకావ్యం" అనే అభిప్రాయం అక్షర సత్యం.

## 6.2. అరణ్యపర్వశేషం - ఎఱ్ఱన కర్తృకమా? :

### 6.2.1. ఎఱ్ఱన అరణ్యపర్వశేషము :

నన్నయ రచింపగా మిగిలిన అరణ్యపర్వశేషాన్ని ఎఱ్ఱన రచించినట్లు స్పష్టమైన ఆధారాలున్నా, కొందరు పండితులు ఎఱ్ఱన శిథిలమైన అరణ్యపర్వ భాగాలను మాత్రమే పూరించాడని వింత ప్రతిపాదనలు చేశారు. వారి అభిప్రాయాలను పరిశీలిద్దాం.

1. నన్నయ మూడు పర్వాలను పూర్తిగా రచించాడనే భావం తిక్కన విరాటపర్వంలో చెప్పిన "అందాది దొడంగి మూడు కృతులాంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుండొనర్చె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్" అని పేర్కొన్నాడు. మారన మార్కండేయ పురాణంలో "భారత సంహితమున్ త్రిపర్వము లెవ్వడొనర్చెనట్టి ............ నన్నయభట్టు గొల్చెదన్" అని ప్రశంసించినందున నన్నయ మూడు పర్వాలు పూర్తిగా రచించాడని, తాళ పత్రాల్లో అరణ్యపర్వంలో కొన్ని భాగాలు శిథిలమైనందున ఎఱ్ఱన వాటిని మాత్రమే పూరించి ఉంటాడని కొందరు పండింతుల అభిప్రాయం.

తిక్కన, మారనలు నన్నయ మూడు పర్వాలు రచించాడని స్థూలంగా మాత్రమే చెప్పారు. రెండున్నర పర్వాలని నిష్కర్షగా చెప్పుట ఔచిత్యంగా ఉండదని వారు భావించి ఉంటారు. ఎఱ్ఱన శిథిలమైన భాగాలను మాత్రమే పూరించి ఉంటే ఎఱ్ఱన నిజాయితీగా పేర్కొనేవాడు. కనుక పై వాదం ఆమోదయోగ్యం కాదని పండితులు ఖండించారు.

2. నన్నయ మూడు పర్వాలు ఆంధ్రీకరించినందునే తిక్కన నాల్గవదైన విరాట పర్వం నుండి ఆరంభించాడని, లేనిచో తిక్కన అరణ్య పర్వం శేష భాగము నుండి ఆరంభించేవాడని కొందరు పండితుల వాదన.

నన్నయ అరణ్యపర్వాన్ని ఆంధ్రీకరిస్తూ అర్థాంతరంగా మరణించినందున, అరణ్యపర్వ శేషం నుండి ఆరంభించేందుకు కీడుగా శంకించిన తిక్కన దాని జోలికి వెళ్ళక విరాట పర్వం నుండి తన రచన ఆరంభించాడని పండితులు చెప్పే అభిప్రాయం సమంజసమే ననిపిస్తుంది.

3. ఎఱ్ఱన రచించిన 'నృసింహ పురాణం'లో ఆయన తాతగారైన పోతసూరి చెప్పినట్లుగా కనిపించే పద్యం ఎఱ్ఱన శిథిలమైన భాగాలను మాత్రమే పూరించాడనే అభిప్రాయం కల్గిస్తుంది.

"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పఠంబులఁ గావ్యకర్తవై
యెన్నికమై ప్రబంధ పరమేశుడనంగ నరణ్య పర్వ శే
షోన్నయ మంధ్ర భాష సుజనోత్సవ మొప్పగ నిర్వహించి తా
నన్నయ భట్టు తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్"

పై పద్యంలో 'అరణ్య+పర్వ+శేష ఉన్నయము' అనే ప్రయోగం 'ఉన్నయం' అనే పదానికి 'ఉద్ధరణ', 'పూరణ', అనే అర్థాలున్నాయి. 'ఉద్ధరణ' అనగా శిథిలమైన భాగాలను సవరించుట అనే అర్థం. 'పూరణ' మనగా నన్నయ విడిచిన అరణ్యపర్వ శేష భాగాన్ని ఎఱ్ఱన పూరించాడని చెప్పుట సమంజసం. పెక్కుమంది పండితులు ఈ అభిప్రాయాన్ని అంగీకరించి నిర్ధారించారు.

4. ఎఱ్ఱన అరణ్యపర్వ శేషాన్ని 'తద్రచనయకాన్' ఆంధ్రీకరించెదనని చెప్పినందున నన్నయ శైలినే అనుసరించాడు. కానీ కొన్ని చోట్ల స్వతంత్రమైన రచనా విధానాన్ని అనుసరించాడు. నన్నయ అరణ్యపర్వం నాల్గవ ఆశ్వాసంలో మధ్యాక్కర పద్యాన్ని రచించాడు. అందులో మొదటి గణం మొదటి అక్షరానికి ఐదవ గణం మొదటి అక్షరానికి 'యతి'ని పాటించాడు. ఎఱ్ఱన యతిమైత్రిని పాటించిన పద్ధతి సమంజసంగా ఉందని తదనంతర కవులు మధ్యాక్కర రచనలలో ఎఱ్ఱననే అనుసరించారు. ఎఱ్ఱన అరణ్యపర్వ శేషాన్ని రచించాడని చెప్పుటకు ఇది స్పష్టమైన ఉదాహరణ.

5. నన్నయ ఆంధ్రీకరించిన భారతంలో ఆదిపర్వంలో కర్ణ జనన వృత్తాంతం సందర్భంగా కుంతికి కర్ణుడు సద్యో గర్భం వల్ల జన్మించినట్లు చెప్పాడు. అరణ్య పర్వ శేషంలో కుంతి పది నెలలు మోసి 'కర్ణుని' కన్నట్లు వర్ణించాడు. నన్నయ అరణ్య పర్వ శేషాన్ని రచించి ఉంటే కర్ణ జనన వృత్తాంతంలో వైరుధ్యం ఉండదు. ఈ తార్కాణాన్ని అనుసరించి అరణ్య పర్వ శేషాన్ని నన్నయ రచించ లేదని ఎఱ్ఱన రచించాడని సహేతుకంగా నిరూపించవచ్చు. ఇటువంటి వైరుధ్యమున్న సంఘటనలు మరికొన్ని ఉన్నాయి. కనుక అరణ్య పర్వ శేషం ఎఱ్ఱన కృతమని స్పష్టమవుతుంది.

## 6.3. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వం :

ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు నృసింహపురాణం రచించే నాటికే ఉన్నట్లు విదితమౌతుంది. నృసింహపురాణ అవతారికలో ఎఱ్ఱన తాత ఎఱపోత సూరి ప్రశంసలో -

"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పథంబులఁ గావ్యకర్తవై
యెన్నికమై ప్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వ శే
షోన్నయ మాంధ్ర భాష సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా
నన్నయ భట్టు తిక్కన కవినాధుల కెక్కిన భక్తి పెంపునన్"

పై పద్యాన్ని అనుసరించి ఎఱ్ఱనకు అరణ్యపర్వ శేషం, హరివంశములు రచించిన తర్వాత మాత్రమే ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదు లభించినట్లు పై పద్యం వల్ల తెలుస్తుంది.

తిక్కన భారతాంధ్రీకరణలో విరాట పర్వంలో 'ప్రబంధమండలి' అనే పదాన్ని ప్రయోగించాడు. తదనంతర తెలుగు కవులు, కేతన, ఎఱ్ఱనలు ప్రబంధ శబ్దాన్ని కావ్యానికి పర్యాయ పదంగా ఉపయోగించారు. ఎఱ్ఱన, నృసింహపురాణ రచనలో 'మహాప్రబంధ కల్పనా కుతూహలుడు' అయ్యాడు.

ప్రబంధమంటే ప్రకృష్టమైన బంధము కలదని అర్థం. భారవి 'కిరతార్జునీయము' లో ఏకాదశ సర్గం నలభై మూడవ శ్లోకంలో "అవిజ్ఞాత ప్రబంధ స్స్యవచో వాచస్పతేరపి" అని ప్రయోగించాడు. దీనికి మల్లినాధ సూరి అవిజ్ఞాతః, ప్రబంధః, పూర్వాపర సంగతిః, యేనసః అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యాన్ని అనుసరించి ప్రబంధ శబ్దానికి 'పూర్వాపర సంగతి' అనే అర్థాన్ని చెప్పుకోవచ్చు. ఈ అర్థాన్ని దృష్టిలో ఉంచుకొని "అరణ్యపర్వ మధ్యమున నిల్చిపోయిన నన్నయ రచనకును విరాటపర్వాదిగా నడిచిన తిక్కన రచనకును సంగతిని కూర్చినవాడు కనుక 'ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన' అనుట సమంజసమే అనిపించుచున్నది" అని చెప్పిన డా॥ ఆకొండి విశ్వనాథం గారి మాటలు ఆలోచింపదగినవే.

ఎఱ్ఱన తనకు ప్రబంధ పరమేశ్వరుడన్న బిరుదు ఉన్నట్లు తన కావ్యాల్లో ఎక్కడా చెప్పుకోలేదు. ఎఱ్ఱన తాత ప్రశంసవల్ల మాత్రమే తెలుస్తుంది. అరణ్య పర్వ శేష రచన నాటికి ప్రజాభిమానం, పండితప్రశంస, ఎఱ్ఱనకు కలిగినందునే ప్రబంధ రచనమున సాటిలేని వాడనే అర్థంలో 'ప్రబంధ పరమేశ్వరుడు' అనే బిరుదు వచ్చిఉండవచ్చునని కొందరు పండితులు ఊహించారు.

ప్రాచీన కాలంలో కావ్యానికి పర్యాయపదంగా ప్రబంధ శబ్దాన్ని కవులు ప్రయోగించేవారు. ప్రత్యేకించి ప్రబంధలక్షణాలుగా అష్టాదశవర్ణనలు, వర్ణనా ప్రాధాన్యం, వస్త్వైక్యం, నాటకీయత, రసదృష్టి, పాత్రచిత్రణ, మొదలైన వాటిని పేర్కొన్నారు. ఈ లక్షణాలను ఎఱ్ఱన కావ్యాల్లో పరిశీలిద్దాం. ఎఱ్ఱన గ్రంథాలన్నింటిలో ప్రబంధ లక్షణాలున్నందునే ఆయనకు ర్పబంధ పరమేశ్వరత్వం సార్థకమైందని విమర్శకుల అభిప్రాయం. ప్రత్యేకించి హరివంశ, నృసింహ పురాణాల్లో ప్రబంధ లక్షణాలు విరివిగా ఉన్నాయి. వాటిని పరిశీలిద్దాం.

### 6.3.1. వర్ణనా ప్రాధాన్యం :

ప్రబంధ రచనకు ప్రాణం వర్ణనా ప్రాధాన్యం. ఎఱ్ఱన కావ్యాల్లో వర్ణనా ప్రాధాన్యం అధికంగా ఉంది. ఆయన వర్ణనలు ప్రత్యేకతను సంతరించుకొన్నాయి.

ఎఱ్ఱన హరివంశంలో శ్రీకృష్ణుని శైశవ క్రీడా వర్ణన సందర్భంగా

"పాపని బట్టరమ్మయని బాధల కోర్వక తెచ్చి తెచ్చితన్
గోపికల య్యశోదకును గుప్పున నొప్పన సేయ జ్యనా
గోపిక యందునందు జని గోకుల మిల్లిలు దప్పకుండ ల
క్షీపతి గ్రుమ్మరుం గడియ సేపున రేపున నిచ్చనిచ్చటన్"

(హరివంశము పూర్వభాగం పంచమ 2-3)

పై పద్యంలో బాలకృష్ణుని 'లక్ష్మీపతి' అని సంబోధించుట అనౌచిత్యంగా అనిపిస్తుంది. ఆలోచించి పరిశీలించగా శ్రీకృష్ణుని మహానుభావుత్వం స్ఫురించి సాభిప్రాయమేననిపిస్తుంది.

నృసింహపురాణంలో నృసింహుని వర్ణించే సందర్భంలో సంస్కృత సమాసభూయిష్ఠమైన పద్యాన్ని రచించాడు.

"శ్రీస్తన కుంకుమ నిషిక్త భుజాంతర భాగవిస్ఫుర
త్కౌస్తుభరత్న నూత్నరుచి గర్విత నాభి సరోజ సౌరభ
ప్రస్తుత మత్త భృంగరవ రాగరసోల్బణ భోగిభోగత
ల్ప స్తరణందలంచు సుకృతాత్ముల పాప్త సమస్త కల్మషుల్"

పై వర్ణనలో అక్షరరమ్యతతో కూడిన హృద్యమైన భావన నన్నయ పద్య రచనా శైలిని స్ఫురింపజేస్తుంది.

నృసింహ పురాణంలో సందర్భోచితంగా అష్టాదశ వర్ణనలు చేశాడు. ఆయన వర్ణనల్లో భావ పటుత్వం, శాస్త్ర వైదుష్యం, లోకజ్ఞత ప్రశంసనీయాలు. కావ్యారంభంలో క్షీరాబ్ధి, శ్వేతద్వీప, వైకుంఠపుర వర్ణనలు తదనంతర కవులకు మార్గదర్శకాలయ్యాయి. ద్వితీయాశ్వాసంలో శ్రీహరి ప్రత్యంశ వర్ణనం పాఠకుల దృశ్య సాక్షాత్కారాన్ని కలిగిస్తుంది.

అరణ్య పర్వ శేషంలో సావిత్రి దర్శించిన యముని వర్ణనకు అద్భుతంగా అక్షరరమ్యత విలసిల్లే విధంగా చేశాడు.

"కనిమెంగోమల నీలకుఘ విలసత్కాలాంజనా కొరుఘో
రనిశాతోత్కట దంష్ట్ర నుజ్జ్వల చలద్రక్తాక్ష ప్రత్యగ్ర కాం
చన వర్ణాంబరు నంత్యకాల దహన జ్వాలా ప్రచండన్ జగ
జ్జన సంత్రాసను నొక్కదివ్య పటుపాశ ప్రౌఢ హస్తోద్ధతున్"

పై పద్యంలో అక్షరరమ్యతతో పాటు ల, క, త, ల, ల, ప, త, వర్ణవిన్యాస వక్రత యముడి రూపాన్ని దృశ్య సాక్షాత్కారం చేస్తుంది. తదనంతర కవులకు మార్గదర్శకమైంది. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వానికి హేతువైంది.

## 6.3.2. నాటకీయత :

ప్రబంధ లక్షణాల్లో నాటకీయమైన సంభాషణాచాతుర్యం ప్రధానమైంది. ఎఱ్ఱన కృతులన్నిటిలో నాటకీయత స్పష్టంగా ఉంది.

అరణ్యపర్వ శేషంలో సావిత్రి సత్యవంతునితో సంభాషించే సందర్భంలో చక్కని నాటకీయత స్ఫురిస్తుంది.

"ఎవ్వరి దాననంబు జవళేక్షణ యేకతమట్టు లేలనీ
ఎవ్వన భూమియందు జనియించెద నావుడు తండ్రి పంపునం
దివ్యన భూమియందు జరియించెద సద్వరు గోరికన్యన్
నెవ్వరి దాన గావలయు నేర్పడ చెప్పుము రాజనందనా"

(4 - 324 ప)

సావిత్రి నర్మగర్భంగా "సద్వరు గోరికన్య నేనెవ్వరి దానగా వలంద" అనుటలో చక్కని చతురత స్ఫురిస్తుంది.

హరివంశంలో యశోదకు గోపికలు శ్రీకృష్ణుని ఆగడాలు నివేదించే సందర్భంలో "పలుక నలుక తోడ గోపిక మోర్తు

నర్తించు విధంబున చేతులు సాచుచుం గృష్ణు జననం గదిసి" "అనుచుండ మఱియొక్క అతిన ఆగ్రహము కనందఱత్రోచి కొంచరుగుదెంచి" "అనగ వేఱొక్క గొల్లత నావుకనోర్తు" యశోదను అధిక్షేపించే సందర్భం సహజసిద్ధమైన నాటకీయతతో సాగింది. ఇటువంటి సన్నివేశాలు ఎఱ్ఱన రచనల్లో ఎన్నో ఉన్నాయి.

### 6.3.3. వస్త్వైక్యం :

ఎఱ్ఱన కావ్యాల్లో వస్త్వైక్యాన్ని పాటించాడు. ప్రత్యేకించి నృసింహ పురాణం పేరుకు మాత్రమే పురాణమైనా పురాణ లక్షణాలు దీనికి వర్తించవు. కథాపురాణ సంబంధ రచన కావ్య పద్ధతి ఎఱ్ఱన కొన్ని చోట్ల ప్రబంధమని, కొన్ని చోట్ల మహా ప్రబంధమని పేర్కొన్నాడు. మహర్షులు, రోమహర్షుని వల్ల పురాణేది హాసాలను వినే సందర్భంలో ముక్తి సాధనమైన అహోబలక్షేత్ర చరిత్రను రోమహర్షణుడు వినిపించాడు. కనుక ఇది తీర్థ క్షేత్ర మహిమ ప్రధానంగాగల కావ్యం. ప్రధాన కథకు భంజకంగా ఉపాఖ్యానాలు లేక, ప్రహ్లాద, హిరణ్యకశిపుల వృత్తాంతమే మొదటినుండి చివరి వరకు వర్ణించబడిన అయిదాశ్వాసాల కావ్యం. బ్రహ్మాండ పురాణాంతర్గతమైన స్వల్ప కథను ఆధారంగా చేసికొని కావ్యాన్ని విస్తరించి రచించాడు. ఇది ప్రబంధ ప్రక్రియకు మార్గదర్శకమైన రచనమని విమర్శకుల అభిప్రాయం. వస్త్వైక్యానికి భంగం కలిగిన రీతిలో తీర్చిదిద్దాడు. ఇతర కృతుల్లో కూడ వస్త్వైక్యాన్ని పాటించాడు. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వానికి ఇదొక కారణం.

పాత్రపోషణ, రసపోషణ, అలంకారిక శోభసూక్తి, వైచిత్రి, మొదలైన ప్రబంధ లక్షణాలను ఎఱ్ఱన కవితా రీతుల్లో పరిశీలించవచ్చు.

ప్రబంధ పరమేశ్వరత్వాన్ని గూర్చి ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి అభిప్రాయాన్ని పరిశీలిద్దాం.

"నన్నయ" విద్యాదయింతుడని తిక్కన ప్రశంస. విద్యాధవుడు విష్ణువైన, విద్యాదయితుడను విష్ణువగును. కావున నన్నయ విష్ణువు, తిక్కన బ్రహ్మ, ఎఱ్ఱన పరమేశ్వరుడు కావచ్చును. అఖిలజగత్తునకు త్రిమూర్తులవలె, ఆంధ్రసాహిత్య జగత్తుకు నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు త్రిమూర్తులు. కవిత్రయము. ఉత్తరపద విశేషణములైన బ్రహ్మ, పరమేశ్వర శబ్దములు శ్రేష్ఠవాచులు. కవిబ్రహ్మ కవిశ్రేష్ఠుడు, ప్రబంధ పరమేశ్వరుడు ప్రబంధ రచనమునందు శ్రేష్ఠుడు. అరణ్యపర్వ శేషంలోని ఆంధ్రీకరణ పద్ధతి, కవితారీతి, శైలీసరణి, ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరుడను ప్రశంసకు సమర్థములు" అనే అభిప్రాయం ఆమోద యోగ్యంగా ఉంది. కాని ప్రబంధ పరమేశ్వరత్వానికి ఎఱ్ఱన ఇతర కృతుల్లోని శైలీ సరణి, కవితారీతులను కూడ పరిగణించుటే సమంజసం.

## 6.4. ఎఱ్ఱన కవితారీతులను వివరించండి. :

ఎఱ్ఱన కవిత్వమందు 1. వర్ణనా నైపుణ్యము, 2. పాత్రచిత్రణ, 3. ఆలంకారిక శోభ, 4. సూక్తి వైచిత్రి, 5. తెలుగు నుడికారం, 6. రసపోషణ, మొదలైన విషయాలను గూర్చి పరిశీలిద్దాం.

### 6.4.1. వర్ణనా నైపుణ్యము :

ఎఱ్ఱన రచనల అన్నింటి యందునూ వర్ణనా ప్రాధాన్యం స్పష్టంగా ఉంది. ఆయనకు ప్రబంధ పరమేశ్వరుడన్న బిరుదు వర్ణనా ప్రాధాన్యం వల్లే లభించింది.

ఎఱ్ఱన అరణ్యపర్వ శేష ఆరంభంలో చేసిన సరస్వతీ స్తవం అద్భుతమైంది.

"అంబ నవాంబు జోజ్జ్వల కరాంబుజ శారద చంద్ర చంద్రికా
డంబర చారుమూర్తి ప్రకట స్ఫుట భూషణ రత్న దీప్తికా
చుంబిత దిగ్వి భాగ శ్రుతి సూక్త, వివిక్త నిజ ప్రభావ భా
వాంబర వీధి విశ్రుత విహారి నమం గృప జూడు భారతీ"

సంస్కృత సమాస భూయిష్టమైన పై శారదాస్తవం నన్నయ శైలిని స్ఫురింప జేసేటట్లున్నది. ఈ పద్యాన్ని పోతన భాగవతంలో యధాతథంగా గ్రహించుట ఎఱ్ఱన వర్ణనా వైభవాన్ని తెలియజేస్తుంది.

నృసింహ పురాణంలోని మత్స్య, కూర్మ, వరాహావతార వర్ణన అద్భుతమైనది. భగవంతుని తల, పాదసేవనం, మానవునకు ముక్తిదాయకాలని వర్ణించే సందర్భంలో -

"విన్నంజాలు భవన్మహత్త్వము భవద్విజ్ఞాన సద్గోష్ఠియం
దున్నంజాలు భవద్పదాంబురుహ సేవోత్సాహ సంపన్నులం
గన్నంజాలు భవత్స మంచిత జగత్కల్యాణ నామంబు బే
ర్కొన్నజాలు నరుండు శాశ్వత శుభారూఢుండు లక్ష్మీశ్వరా"

పై పద్యం పోతనకు ఒరవడి వంటిది.

నృసింహ పురాణంలో మున్నీటిలో ఉన్న ప్రహ్లాదుని వర్ణన గొప్ప భావుకతతో ఉన్నది.

"ఘన భుజగ శత ఫణావృత
తనుడై బాలుడు పయోధి తరగల మీదన్
పెనుపాప సెజ్జ బవళిం
చిన వెన్నుని పాటియగుచు జెన్నె సలారన్"

చక్కని ఉపమాలంకార శోభితమైన పై పద్యం ఎఱ్ఱన వర్ణనా చమత్కారానికి నిదర్శనం. ఈ వర్ణనా నైపుణ్యమే ఎఱ్ఱనను ప్రబంధ రచనకు మార్గదర్శకునిగా, ప్రబంధ పరమేశ్వరునిగా నిలిపింది.

## 6.4.2. పాత్ర చిత్రణ :

ఎఱ్ఱన పాత్ర పోషణలో ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. ఆయన కావ్యాలన్నింటిలో పాత్ర పోషణ నైపుణ్యం పాఠకులకు ఆహ్లాదం కల్గిస్తుంది. అరణ్య పర్వం శేషంలో కుంతి పాత్ర చిత్రణ నన్నయ గారి కుంతి కంటే విలక్షణంగా చిత్రించాడు. తెలుగు సాహిత్య సమీక్షలో డా॥ జి. నాగయ్య చెప్పినట్లు "నన్నయ కుంతికంటే ఎఱ్ఱన కుంతి గడుసరి, వ్యంగ్య ప్రధానంగా మనసులోని భావములను వ్యక్తపరచగల జాణ" అనుట అక్షరసత్యం. ఆమె సూర్యభగవానునితో మాట్లాడే సందర్భంలో

"జగములయందు ధర్మువును సత్యము నీయది గాదె యెందునే
తగవులు నీ యెఱుంగని విధంబులె యిట్టిది నీదు భంగి కిం
దగవగునేని మార్పలుకు దానని యేనగు గాక నీకు నిం
పగు తెఱగా చరింపుమిట యావలనయ్యెడు నిందకోర్చితిన్"

పై పద్యం వల్ల ఎఱ్ఱన కుంతి జాణతనం స్పష్టమౌతుంది.

హరివంశంలో బాలకృష్ణుని పాత్రను అత్యంత సహజసిద్ధంగా తీర్చిదిద్దాడు. బాలకృష్ణుని అల్లరిచేష్టల ద్వారా ఆ పాత్రకు సరిక్రొత్త మెఱుగులు దిద్దాడు. గోపికల పాట్లు అగచాట్లను యశోదతో విన్నవించిన సందర్భంలో ఆమె వారికి చాకచక్యంగా వారిని సాంత్వన పరుస్తూ -

"మీ సేగులెల్ల నచ్చెద - వేసరకుడు మీరు లేక వేగునె మాకున్
చేసెం జేయడు బాలకుడా సురపుం బనులు నిజములనియెదరు బలే"

అని గోపికలతో చెప్పుటలో యశోద లౌకిక దక్షత స్పష్టమౌతుంది.

నృసింహ పురాణమందు ప్రహ్లాద హిరణ్యకశిపుల, నృసింహుల పాత్రలను శ్రద్ధతో తీర్చిదిద్దాడు. ప్రహ్లాదుని పాత్రలో భక్తితత్త్వాన్ని, విజ్ఞాన వికాసాలను, చిత్రించాడు. హిరణ్యకశిపును పాత్రలో గాఢ తపోనిరతిని, శౌర్యసాహసాలను, దర్పోద్ధతిని, వైరస్వభావాన్ని సముచితమైన రీతిలో పోషించాడు.

నృసింహుని పాత్ర స్వరూప స్వభావాదులను సముచిత రీతిని తీర్చిదిద్దాడు.

### 6.4.3. ఆలంకారిక శోభ :

ఎఱ్ఱన అలంకారాలను సమయోచితంగా చమత్కార స్ఫోరకంగా కథానుగుణంగా ప్రయోగించాడు. నృసింహపురాణంలో శ్రీహరి అంగాంగ వర్ణనను చిత్రించే సందర్భంలో శబ్దాలంకారాలను ఔచితంగా ప్రయోగించాడు. పిదప 'పూర్వదిశాపతి వదనంబున తెల్పుమిగిలె' అనే పద్యంలో ఉపమాలంకారాన్ని ప్రయోగించాడు.

హరివంశంలో బాలకృష్ణుని శైశవ క్రీడలను వర్ణించే సందర్భంలో -

"మన్ను రొంపియు బెండయు మకటువట్టి
పాంశుక క్రీడ దనమేను భాసురముగ
హరి అనేక ధాతుచ్చటా వ్యక్తమైన
శైల కుంజర కలబంబ వోలెనొప్పె"

అని ఉపమాలంకార శోభితంగా సురచిర సుందరంగా వర్ణించాడు.

నృసింహ పురాణంలో సందర్భోచితంగా, ఉత్ప్రేక్షా, రూపకా, స్వభావోక్తి, విరోదాబాసా, శ్లేష మొదలైన అలంకారాలను ప్రవేశపెట్టాడు. ఎఱ్ఱన కవితా విశేషాలలో అలంకారిక శోభ పేర్కొనదగింది.

### 6.4.4. సూక్తి వైచిత్రి :

'సూక్తి' అంటే 'మంచిమాట' అనే అర్థమే కాకుండా రమణీయమైన చమత్కారమైన మాటలకూర్పును సూక్తిగా పరిగణించవచ్చును. కవితాపరమైన చతురోక్తులు, సుభాషితాలు, సామెతలు, మొదలైన వన్నీ సూక్తి వైచిత్రిగానే పరిగణించబడతాయి. ఎఱ్ఱన సూక్తి వైచిత్రిని శ్రీనాథుడు ప్రశంసిస్తూ -

"పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని లేవ
సూక్తి వైచిత్రి నొక్కక్క మాటు" అన్నారు.

జక్కన కూడా ఎఱ్ఱన శబ్ద వైచిత్రిని ప్రశంసించాడు. ఎఱ్ఱన సూక్తి వైచిత్రిని పరిశీలిద్దాం.

అరణ్య పర్వ శేషంలో ధర్మ వ్యాధుడు కౌశికునికి ధర్మ సూక్ష్మాలు తెలిపే సందర్భంలో హితబోధకు సంబంధించిన సన్నివేశం సూక్తివైచిత్రికి మంచి ఉదాహరణ.

"భూతహితంబుగా పలుకు బొంకును సత్యఫలంబు నిచ్చు ద
ద్భూత భయాస్పదంబగు ప్రభూతపు సత్యము బొంకునట్లు ప్రా
ణాతురుడైనచో బరిణయంబున యందును బల్కుబొంకు స
త్యాతిశయంబు యండ్రు మహితాత్మక, యిట్టివి ధర్మ సూక్ష్మముల్"

పై పద్యం ఎఱ్ఱన సూక్తివైచిత్రికి మంచి ఉదాహరణ.

'హింస చేయనివాడు లేడిజ్జగమున' వంటి లోకోక్తులు, 'కుంపటిలో తామర మొల్చిన క్రియ', 'నిప్పున చెదలంటునే' బలియునింట దానినైన జెఱువ వెఱుతురు, నోరు మూయ జెడతల వాపోయెడు" - మొదలగు సూక్తులు, హితోక్తులు ఎఱ్ఱన సూక్తివైచిత్రికి నిదర్శనాలు. ఈ సూక్తివైచిత్రి కూడా ప్రబంధ రచనకు పుష్టికి కల్గించునదే.

### 6.4.5. తెలుగు నుడికారము :

ఎఱ్ఱన కవిత్వమందు తెలుగు పలుకుబడులతో కూడిన తెలుగు నుడికారం ప్రత్యేకించి అరణ్య పర్వ శేషమందు 'ధర్మవ్యాధోపాఖ్యానం'లో హింస, అహింసలను ధర్మవ్యాధుడు కౌశికుడు వివరించు సందర్భంలో

"హాలికుడెంతయు నోజతో దునగ సీరాగ్రంబునం జోకి ప్రా
ణులనేకంబులు సచ్చు హింస యది యౌనో కాదో వేయేల మ
ర్త్యుల నేలం జనించుచో బదములం ద్రొక్కంబడుం బెక్కు జం
తులు హింసా విధిగా దనంగ వశమే దోషజ్ఞ యూహింపుమా"

పై పద్యమంతా ఒకటి రెండు పదాలు తప్ప తెనుగు నుడికారంతో గుబాళిస్తుంది. 'సావిత్రోపాఖ్యానం'లో సావిత్రి సత్యవంతునితో సంభాషించే సందర్భంలో

"ఎవ్వరిదాన వంబుజ దళేక్షణ యేకత మిట్టు లేల"

"కలిమియు లేమియున్ సతము గావవి సెందినచో"

మొదలైన పద్యాల్లోని తెలుగు నుడికారం పాఠకులకెంతో మోదము కల్గిస్తుంది.

### 6.4.6. రసపోషణ :

కావ్యానికి రసం ప్రధానం. ఎఱ్ఱన ప్రత్యేక శ్రద్ధతో సన్నివేశానుగుణంగా రస పరిపోషణ చేశాడు. ప్రధానమైన శృంగార రసంతోపాటు హాస్య, వీర, భయానక, రౌద్ర, భీభత్స రసాదులను సందర్భోచితంగా పోషించి హరివంశ కావ్యాన్ని రసవత్తరంగా తీర్చిదిద్దాడు.

నృసింహపురాణంలో శాంతం అంగిరసంగా పోషింపబడింది. శ్రీమన్నారాయణుని దేవతలు స్తుతించే సందర్భంలో శాంతం, హిరణ్యకశిపుడు నరసింహునితో యుద్ధం చేసే సందర్భంలో వీరం, నృసింహుడు హిరణ్యకశిపుని సంహరించు సందర్భంలో రౌద్ర, భయానక, భీభత్సాలు, హిరణ్యకశిపుని ఉద్యానవన విహారంలో శృంగారం, లీలావతి దుఃఖించే సందర్భంలో కరుణం, పోషించి నవరసభరితంగా తీర్చిదిద్దాడు. ఎఱ్ఱన కావ్యాల్లో రసపరిపోషణకు సముచిత ప్రాధాన్యం ఉంది.

## 6.5. రాదగిన ప్రశ్నలు :

1. ఎఱ్ఱన జీవిత శేషాలను కృతులను సమీక్షించండి.
2. 'అరణ్యపర్వ శేషం' ఎఱ్ఱన కృతమా? చర్చించండి.
3. ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వాన్ని వివరించండి.
4. ఎఱ్ఱన కవితారీతులను వివరించండి.

### 6.5.1. చిన్న ప్రశ్నలు :

1. చదలవాడ మల్లన
2. ఎఱ్ఱన రామాయణం
3. హరివంశం
4. నృసింహపురాణం

## 6.6. ఆధార గ్రంథాలు :


1. తెలుగుసాహిత్య చరిత్ర - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ
2. తెలుగుసాహిత్య చరిత్ర - ప్రథము భాగం - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
3. తెలుగుసాహిత్య సమీక్ష - భాగం-1 - ఆచార్య జి. నాగయ్య
4. తెలుగుసాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా॥ నా॥ శాస్త్రి
5. ప్రబంధ పరమేశ్వరుడు - ఎఱ్ఱన మహాకవి - డా॥ ఆకొండి విశ్వనాథం



డాక్టర్ పి.వి. సుబ్బారావు,
ఎం.ఏ., పి.హెచ్‌డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
సి.ఆర్. కళాశాల
చిలకలూరిపేట - 522 616

పాఠం - 7

# శ్రీనాథ యుగం

7.0 లక్ష్యం
7.1 జీవిత విశేషాలు
7.2 సాహిత్య విశేషాలు
7.3 అవసానదశ
7.4 కవితారీతులు
7.5 శ్రీనాథుని కావ్యాలు
7.6 రాదగిన ప్రశ్నలు
7.7 ఆధారగ్రంథాలు

## 7.0 లక్ష్యం :

శ్రీనాథుని గ్రంథాలు, కవిత్వ విశేషాలు, అనువాద వైశిష్ట్యం ఈ పాఠంలో తెలుసుకుంటారు.

## 7.1 జీవిత విశేషాలు :

పదునాలుగవ శతాబ్దం శివకవుల ప్రాభవం తరువాత, పదిహేనవ శతాబ్దంలో సాహిత్యం మరింత వికాసం పొందింది. కారణం శ్రీనాథుడు, బమ్మెర పోతన వంటి మహోన్నతమైన కవుల చేత సాహితీ సరస్వతి నూతనాభరణాలు ధరించింది. అవి వెలకట్టలేనివి. ఆ అమూల్యాభరణాలకు కారణమైన కవుల్లో శ్రీనాథుడు సుప్రసిద్ధుడు.

### 7.1.1. తల్లిదండ్రులు :

శ్రీనాథుడు పాకనాటి నియోగిబ్రాహ్మణుడు. భారద్వాజ గోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. అధ్వర్యువేద శాఖాదీప నిష్ణాతుడు. కమలనాభుని పౌత్రుడు. మారనభీమాంబల పుత్రుడు. శ్రీనాథుడు క్రీ.శ. 1378 నుండి క్రీ.శ. 1454 వరకు జీవించి ఉన్నట్లు చరిత్ర తెలియజేస్తుంది. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుడు, కవితావిద్యాధరుడు. సరససాహిత్య సామ్రాజ్య చక్రవర్తి. శ్రీనాథుని తండ్రి మారయ విద్యారాజీవభవుడు.

### 7.1.2. నివాసం :

శ్రీనాథుని స్వస్థలం గురించి పండితులలో అనేక అభిప్రాయాలున్నాయి. ఈతడు కర్ణాట దేశస్థుడని, తూర్పుతీరంలోని కాళీపట్టణమని కొందరి అభిప్రాయం. శ్రీనాథుడు భీమేశ్వర పురాణం కృతి ఆదిలో

"కనక క్ష్మాధర ధీరు వారధి తటీ కాల్పట్టణాధీశ్వరున్
ఘనునిన్ బద్మపురాణ సంగ్రహ కళా కావ్యప్రబంధాధిపున్
వినమజ్జ్యాంతర సార్వభౌము గవిత విద్యాధరుం గొల్తునా
యను సందాత బ్రదాయ శ్రీకమలనాభామాత్య చూడామణిన్"

అని వివరించాడు. పై పద్యం వలన శ్రీనాథుని పితామహుడు కమలనాభామాత్యుడు పద్మపురాణ గ్రంథాన్ని నిర్మించినట్లు, ఆయన కవితా విద్యాధరుడని తెలుస్తుంది. అంతే కాదు పశ్చిమ సముద్ర తీరాన కర్ణాట దేశంలో చేరిన కాల్పట్టణానికి మంత్రి అని విశదపడుతుంది. ఈ కాల్పట్టణమే కాళీ పట్టణమని కొందరి అభిప్రాయం. కాల్పట్టణం ఎక్కడ వుందో ఎవరికి తెలియదు.

భీమేశ్వర పురాణంలోనే

"ప్రౌఢి బరికింప సంస్కృత భాష యంద్రు
పులుకు నుడి కారమున నాంధ్రభాష యందు
రెవ్వరేమన్న నాకేమి కొఱత
నా కవిత్వంబు నిజము కర్ణాట భాష"

అని వివరించడం వలన, తన కావ్యాల్లో కన్నడ పదాలు చోటుచేసుకోవడం వలన శ్రీనాథుడు కర్ణాట దేశస్థుడని కొందరి వాదం. మరి కొందరు కర్ణే అటతీతి కర్ణాట అని అర్థం చెప్పి ఆయన కవిత్వం చెవులకు యింపుగా వుంటుంది కాబట్టి కర్ణాట పదం వాడాడని మరో వాదం. ఏది ఏమైనా శ్రీనాథుడు కర్ణాట దేశంలో జన్మించినా తల్లిదండ్రులు ఉద్యోగమో మరేదో కారణం వలన కొండవీటి సీమలో స్థిరపడ్డారు. తెలుగు వారితో కలిసిమెలిసి ఉండి తెలుగులో శ్రీనాథుడు కమ్మని కావ్యాలు రచించాడు.

## 7.2 శ్రీనాథుని సాహిత్యవిశేషాలు :

శ్రీనాథుడు కొండవీడు పాలించిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి పదవి నిర్వహించాడు. క్రీ.శ. **1404** నుండి **1420** వరకు ఈ పదవిలో ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

"విద్యాధికారో శ్రీనాథో వీరశ్రీవేమభూపతేః
అకరోదాకరో ద్వాచాంనిర్మలం ధర్మశాసనమ్"

విద్యాధికారి బహుదేశ బుధులతో విద్యా పరీక్ష చేయడం విద్యాధికారి కర్తవ్యం. పెదకోమటి వేమారెడ్డికి అఖిల పురాణ విద్యాగమాలు వినివించటంకూడ విద్యాధికారి కర్తవ్యం.

"వినిపించినాడవు వేమభూపాలువ
కఖిల పురాణ విద్యాగమములు
భాషించినాడవు బహుదేశ బుధులతో
విద్యాపరీక్షణ వేళలందు"

భీమఖండంలోని పై పద్యం వలన శ్రీనాథుడు విద్యాధికారి అని స్పష్టపడుతుంది. పెదకోమటి వేమారెడ్డి కవిపండిత పోషకుడు. ఇతని ఆస్థానంలో ఆంధ్రకవి సార్వభౌముడు శ్రీనాథుడు, సంస్కృత కవి సార్వభౌముడు వామన భట్టబాణుడు సూర్యచంద్రుల వంటివారు. వామన భట్టబాణుడు బహు గ్రంథకర్త. నలాభ్యుదయము, రఘునాథాభ్యుదయము అనే పద్యకావ్యాలు, వేమభూపాల చరిత మనే గద్యకావ్యం రాశాడు. పార్వతీ పరిణయము, శృంగార భూషణము అనే దృశ్యకావ్యాలు, శబ్ద చంద్రిక, శబ్ద రత్నాకరము అనే నిఘంటువులు రచించాడు. వామన భట్ట బాణుడు విద్యారణ్యమహర్షి శిష్యుడు కూడ. అట్టివాని సరసన నివబడిన ధీటైన ఆంధ్రకవి కవిసార్వభౌముడు శ్రీనాథుడు. శ్రీనాథుని విద్యాధికారి పదవి పెదకోమటి వేమారెడ్డి సృష్టి శ్రీనాథునికి పూర్వగాని తరువాత గాని ఈ పదవి లేదు. కోమటి వేమారెడ్డి కూడ స్వయంగా కవి. ఇతడు సాహిత్య చింతామణి, సప్తశతీసారము రచించాడు. ప్రతిదినం సరసకావ్య సమాకర్ణన పరాయణుడు. అందువలననే పెదకోమటి వేమారెడ్డికి అఖిల పురాణ విద్యాగమాలు

వినిపించాడు శ్రీనాథుడు. పెదకోమటి వేమారెడ్డి తరువాత అతని కుమారుడు రాచవేముడు కొండవీడు పాలించింది కొద్ది కాలం మాత్రమే. రెడ్డి రాజుల పరంపరలో వీరభద్రారెడ్డికి శ్రీనాథుడు కాశీఖండం అంకితమిచ్చాడు. వీరభద్రారెడ్డి క్రీ.శ.**1423** నుండి **1440** వరకు రాజ్యమేలాడు.

శ్రీనాథుడు రాచకొండ పరిపాలించే సర్వజ్ఞ సింగభూపాలుని దర్శించాడు. సర్వసింగ భూపాలుని దర్శించడానికి పోతూ శారదాంబను స్తుతించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలియజేస్తుంది.

"దీనారటంకాల దీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల
బలుకుతోడై తాంధ్రభాషా మహాకావ్య నైషభ గ్రంథ సందర్భమునకు
బగులగొట్టించి తుద్భట వివాద ప్రౌఢి గౌడడింఢిమ భట్టు కంచుఢక్క
చంద్రభూషణ క్రియాశక్తి రాయల యొద్ద బాదుకొల్పితి సార్వభౌమ బిరుదు"

ఇంత కాలంబున లెగారు వింతరీతి
నెట్లు మెప్పించెదొ కదా యింక మీద
రావు సింగాంక భూపాలు ధీవిశాలు
సకల సద్గుణానికురంబ శారదాంబ"

(వెలుగోటి వారి వంశావళి **160** పద్యం)

శ్రీనాథుడు తనకు పూర్వీకులైన ఆంధ్ర గీర్వాణ కవిశ్రేష్టులను ప్రస్తుతించాడు. అల్లయ వేమరాజు సమ్ముఖంలో ఈ విషయం స్పష్టంచేశాడు.

"వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండ లీల నొక్కొక్క మాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యు చితబంధంబుగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు"

(కాశీఖండం - **1-13**)

వేములవాడ భీమనవలె ఉద్దండ, కవితా విధం, నన్నయభట్టు వాక్ప్రౌఢి, తిక్కన రసాభ్యుచిత బంధం, ఎర్రన సూక్తి వైచిత్రి అనుసరిస్తానని వినయంగా పలికాడు. సంస్కృత కవులను కూడ శ్రీనాథుడు ప్రస్తుతించాడు.

"వ్యాస వాల్మీకి సంయమి వాక్సుధాం బోధి
లోలోర్మి పంక్తుల నోలలాడి
భట్టు బాణ మయూర భారతీ సందర్భ
సౌభాగ్య గరిమంబు సంగ్రహించి
భాససౌమిల్లక ప్రతిభాస మున్మేష

హేలా విశేషంబు నిచ్చగించి
మాఘ భారవి వచోమకరంద నిష్యంద
మాధుర్యమునకు సమ్మదమునొంది
కాళిదాసు మనంబులో గాంచి మ్రొక్కి
రాజశేఖరు గవిరాజు బ్రస్తుతించి"
(శృం. నై. 1-17)

శ్రీనాథుడు వ్యాసుడు, భట్ట, బాణ, మయూర భారతీ, భాసుడు, సౌమిల్లక, మాఘుడు, భారవి, కాళిదాసు, రాజశేఖరుడు మొదలైన సంస్కృతకవులను స్తుతించినట్లు పై పద్యం స్పష్టం చేస్తుంది. నన్నయ, తిక్కన మొదలైన వారంతా రాజాస్థానాలు అలంకరించినా శ్రీనాథునంతటి ఐశ్వర్యం, పలుకుబడి, అధికారం వారికి లేదు. శ్రీనాథుడనుభవించిన రాజభోగం, విశేష లోకానుభవం పూర్వ కవులకు గాని అర్వాచీనులకు గాని లేదు. బహుదేశాటనం, బహుగ్రంథ పఠనం, అనేక బుధుల వ్రాడి సంభాషణ మానవుని లోకజ్ఞతకు తార్కాణం.

శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయలు పాలించే కర్ణాట దేశం వెళ్ళాడు. రాయల ఆస్థాన పండితుడు గౌడ డిండిమభట్టును వివాద ప్రౌఢితో ఓడించాడు. డిండిమభట్టు కంచుఢక్కను పగులగొట్టించి ప్రౌఢరాయల చేత కనకాభిషేక సత్కారం పొందాడు.

నాసికేతోపాఖ్యానం రచించిన దగ్గుపల్లి దుగ్గన శ్రీనాథునికి బావమరది. దుగ్గన తన బావ గారిని గురించి -

"కవి సార్వభౌముడైన కర్ణాట విభుచేత కనక రత్నాభిషేకములు గనిన" వాడని తన గ్రంథంలో ప్రశంసించాడు.

శ్రీనాథుడు దక్షిణాధీశుని ముత్యాలశాలలో దీనారటంకాలతో తీర్థమాడిన ధీవిశాలుడు. రాచకొండ రాజ్యంలో సర్వజ్ఞ బిరుదు కలిగిన రావుసింగ మహీపాలుని నిండుకొలువులో మెప్పించిన ప్రజ్ఞగలవాడు. పంటమైలారు రెడ్డి అండదండలు పొందినవాడు. తెలుగురాయల సమాదరణ పొందాడు. సుజన విధేయుడు. రాజమహేంద్రవర రాజ్యంలో వీరమహేశ్వరుడైన వీరభద్రారెడ్డికి విద్వాంసుడుగా కొంతకాలమున్నాడు. బంగారు పాత్రలో భజన స్వీకారం, రత్నాంబరాలు ధరించాడు. కస్తూరి విలేపనాలతో సదా ఘుమఘుమలాడుతూ ఉండే రసికుడు. రుద్రాక్షమాలలు ధరిస్తాడు. విభూతి ధారణ, ఎల్లప్పుడు సర్వేశ్వర ధ్యానసంయమనం కలవాడు. ఇవన్నీ శ్రీనాథుని హావభావాలు. ఈశ్వరార్చన కళాప్రియుడు. యోగం, భోగం రెంటి యందు ఆసక్తి కలవాడు. చిన్నప్పటి నుండి కవిత్వం చెప్పగలదిట్ట. అందుకే శ్రీనాథుని కవితాశ్రీనాథుడని కీర్తిస్తుంటారు.

ఇతడు సాహిత్య లోకానికి బంధువు. సహృదయుడు. ప్రతిక్షణ స్మరణీయుడు. ఆంధ్రదేశానికి, అంధ్రభాషకు గర్వకారణమైన కవిసార్వభౌముడు.

## 7.3 శ్రీనాథుని అవసానదశ :

బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. ఈశ్వరార్చన కళాప్రియుడైన శ్రీనాథుడు చివరకు లక్ష్మీకటాక్షం దూరమైంది. పెదకోమటి వేమారెడ్డి విద్యాధికారి, వీరభద్రారెడ్డి విద్వాంసుడై అనేక సంవత్సరాలు సౌభాగ్యప్రాభవం పొందాడు. క్రీ.శ. 1447 సం.లో రాజమహేంద్రవర రాజ్యం గజపతుల వశమైంది. అప్పటినుండి శ్రీనాథునికి ఆంధ్రరాజుల అండదండలు తొలగిపోయాయి. కష్టకాలం మొదలైంది. కపిలేంద్ర గజపతి అధీనంలో ఉన్న విజయనగర సామ్రాజ్యభాగం కృష్ణాతీరం. కృష్ణాతీరంలో ఉన్న బొడ్డుపల్లెను శ్రీనాథుడు గుత్తకు తీసుకున్నాడు. పంట పండించాడు. కాని పంటంతా నష్టమైంది.

"కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబీలాక్షులు దిని పోయె దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్టు చెల్లింతు టంకంబు లేడునూర్లు"

విజయనగర ప్రభువులకు కట్టవలసిన ఏడువందల టంకాల గుత్తధనం ఏవిధంగా కట్టగలనని వాపోయాడు. కృష్ణానది వరదలకు కొంత బీడపడి కొంత పంట నష్టమైంది. ఆదుకొనే నాథుడు లేడు. రాజులకు దయాదాక్షిణాలుండవు గదా. రాజశాసనం కఠినమైంది. హృదయ విదారకం.

"కవిరాజు కంఠంబు కౌగిలించెనుగదా పురవీధినెదురెండ బొగడ దండ
ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మంబున దగికి యుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేతి వియ్యమందెనుగదా వెదురుగొడియ
సార్వభౌముని భుజస్తంభ మెక్కనుగదా నగరి వాకిట నుండు నల్లగుండు

శ్రీనాథుని కాలంలో ఉన్న శిక్షలు ఇవి. శ్రీనాథుడు యింతటి శిక్ష అనుభవిస్తున్నా ఎంత ధైర్యం కలవాడో క్రింది పద్యం వివరిస్తుంది.

"కాశీ విశ్వేశు గలసె వీరారెడ్డి రత్నాంబరంబులే రాయడిచ్చు
కైలాసగిరి పంట మైలారు విభుడేగె దినవెచ్చమే రాజు దీర్పగలడు
రంభగుడె దెనుంగు రాయరాహుత్తుండు కస్తూరి కేరాడు బ్రస్తుతింతు
స్వర్గస్తుడయ్యె విస్సన మంత్రి మది హేమపాత్రాన్న మెవ్వాని పంక్తి గలుగు"

భాస్కరుడు మున్నె దేవుని పాలి కరిగె
గలియుగంబున నికనుండి గష్టమనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి"

ఇంతకంటె గుండె పిండివేసే విషాదం, దుర్భరం తెలుగు సారస్వతంలో ఏ కవి అనుభవించలేదు. శ్రీనాథుని మహోజ్జ్వల జీవితంలో నిర్భరమైన విషాదం.

## 7.4 శ్రీనాథుని కవితారీతులు :

ఆంధ్రవాఙ్మయ చరిత్రలో శ్రీనాథయుగం ప్రత్యేకమైనది. శ్రీనాథుని కాలంలో క్షేత్ర మాహాత్మ్య రచనలు, ప్రబంధశయ్య, సుప్రసిద్ధమైన సాహిత్య ప్రక్రియకు ఈ యుగం దోహదం చేసింది. ఇతని కాలంలో కథాకావ్యాలు కూడ అధికంగానే రచింపబడినాయి. జక్కన విక్రమార్క చరిత్ర, అనంతుని భోజరాజీయము, దుగ్గన నాసికేతోపాఖ్యానము మొదలైన గ్రంథాలు వెలువడినాయి. నన్నయాదుల అనువాద యుగం, పెద్దనాదుల ప్రబంధ యుగం గంగాయమునల మధ్య సరస్వతీ నది వలె శ్రీనాథుని సాహిత్య ప్రక్రియ చోటు చేసుకుంది. శ్రీనాథుడు అనువాదాలు స్వతంత్ర గ్రంథాలు రచించాడు. శ్రీనాథుడు తన గ్రంథాలలో రసవైవిధ్యం, రచనా వైవిధ్యం, ఇతివృత్త వైవిధ్యం చక్కగా చూపించాడు. శ్రీనాథుని కాలంలో ప్రబంధ లక్షణాలుగల కావ్యాలు, భక్తి గ్రంథాలు, తత్త్వ గ్రంథాలు రచింపబడినాయి. ఈ కాలం నందలి కవులు అసమాన ప్రతిభా పాటవం గలవారు.

శ్రీనాథుని కాలంలోని కవి పండిత సంఘాలు విద్యా పీఠాలు శ్రీనాథకవిని ఆలంకారిక శేముషీ దురంధరునిగ తీర్చిదిద్దినాయి. సకవి విద్యా సనాథుడైన శ్రీనాథుని కవిత్వ ధారలు శృంగార నైషధంలో పరాకాష్టపొందాయి. పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథునికి విద్యాధికారి పదవినిచ్చి గౌరవించాడు. రాజాస్థానంలో అది గొప్ప పదవి. మరే ఇతర కవి ఆ పదవి పొందనంతటి కవితాస్థాయి గలవాడు శ్రీనాథుడు. తిక్కనకు కంద పద్యం వేమనకు ఆటవెలది వలె శ్రీనాథుడు సీసపద్యం చెప్పడంలో అందె వేసిన చేయి. శ్రీనాథుని సీసపద్యం నడక, సొంపు, లయ మరే కవికి లేదు. సీస పద్యానికి శయ్యా సౌభాగ్యం కలిగించింది శ్రీనాథుడు.

శ్రీనాథుడు నన్నయ ప్రౌఢకవితా పద్ధతి, తిక్కన రసాభ్యుచిత బంధం, ఎర్రన సూక్తి వైచిత్రి అనుసరిస్తానని తన కవితా విధానాన్ని ప్రకటించాడు. విస్తృత భావ ప్రదర్శన, అలంకార భూషణ, ఔచిత్య సమాదరణ, అనౌచిత్య పరిహారం, సన్నివేశ కల్పనా సౌష్టవం, సజీవ పాత్ర సాక్షాత్కారం, వక్రోక్తి నైపుణ్యం, అర్థ గాంభీర్యం, సుందర చమత్కారం, తెలుగు నుడికారం శ్రీనాథుని కవిత్వంలో చోటుచేసుకున్నాయి. మధుమయ మార్గ ఫణితి గలవాడు. ఆంధ్ర సాహితే విశ్వానికి శ్రేయస్సు సమకూర్చిన శ్రీనాథుని కవితాశైలి అనితర సాధ్యం. అనేక మధుర కవితాలక్షణాలున్న శ్రీనాథుని సాహిత్యంలో - 1. రసం, 2. అలంకారం, 3. వర్ణనలు ముఖ్యమైనవి.

### 7.4.1. రసం :

శ్రీనాథుడు రచించిన గ్రంథాల్లో శృంగారనైషధ మొక్కటే కథా సూత్రంతో బంధింపబడిన కావ్యం. మిగిలిన కావ్యాలన్ని స్థలపురాణాలు, వీరగాథలు, కట్టుకథలు ధర్మబోధలతో నిండిన కావ్యాలు. శృంగారనైషధంలో అంగిరసం శృంగారం. హరవిలాసం ఐదు కథలతో నిండిన ఖండకావ్యం. శివభక్తి ప్రధానమైన గ్రంథాలు భీమేశ్వర పురాణం, కాశీఖండం. ఇవి స్థలపురాణాలు కూడ. శివరాత్రి మాహత్మ్యం శివప్రాముఖ్యం తెలిపే గ్రంథం. పలనాటి వీరచరిత్ర వీరగాథాకావ్యం. శ్రీనాథుడీ కావ్యాల్లో రసమిర్వహణ పద్ధతి సుందరంగా వ్యక్తం చేశాడు. క్షేత్ర మాహాత్మ్యాలను కూడ కావ్యకళాకౌశలంగా తీర్చిదిద్దాడు. భక్తికి కూడ రసత్వాసిద్ధిని కలిగించిన రసోపేతుడు.

"పతిపాణి పల్లవచ్యుత నీవిబంధన
వ్యగ్ర బాలాహస్త వనరుహంబు
ధవకృతాధర బింబదశ నక్షతి వ్యధ
భుగ్న లీలావతీ భ్రూలతంబు
ధరణినాయక భుజాపరిరంభ మండలీ
గాఢ పీడిత వధూఘన కుచంబు
వరనఖాంకుర మృదు వ్యాపార పులకిత
నీరజాక్షీ నితంబోరు యుగళి

అస్తిమామ్యభార మస్తి కౌతూహలం
బస్తిఘర్మ సవిత మస్తికంప
మస్తి భీతి యస్తి హర్ష మస్తి వ్యథం
బస్తి లాభమయ్యె నపుడురతము

(శృం. నై. 7 - 177)

నాయికా నాయకులైన నలదమయంతులు. వారికి ఒండొరులపైగల అనురాగం రీతి. అది స్థాయీభావం. నాయకుడు

నాయిక నీవిబంధం సడలించడం, అధరాన దంతక్షతం కావించడం, నాయికను కౌగలించడం, నితంబంపై మృదువుగా నఖక్షతం చేయడం వలన నాయిక వ్రీడ, గ్లాని, హర్షం, రోమాంచం మొదలైన సంచారి భావాలు కలిగినాయని కవి వర్ణన. ఇది సంభోగ శృంగార వర్ణన.

"లలన యొకర్తు వగ్గు కృకలాసము చేరగ వెచ్చి వంచనన్
నలునకు గుంచెవట్టు నెలనాగ పదద్వయ మధ్యంబునన్
నిలిపిన గాలుప్రాక నది కాయ సామకు దోడి భామినుల్
గలకు నవ్వనూడ్చె నదిగట్టిన పుట్ట ముపాయ శూన్యతన్"

(శృం. నై. 6 - 111)

నలదమయంతుల వివాహ సందర్భంలో బంతిభోజనాలు జరుగుతున్నాయి. ఒక నెరజాణ ముసలి ఊసరవెల్లిని తెచ్చి నలునకు కుంచెవిసరు చెలికత్తె పాదాలనడుమ వదిలింది. ఆ తొండ మీదికి ప్రాకగానే ఆమె చేసేదిలేక కట్టుకున్న వస్త్రం గబగబ విప్పింది. అది చూసి చెలికత్తెలు కలకల నవ్వారు. ఇది హాస్యరసం స్థాయీభావ హాస్యం.

కరుణ రసానికి స్థాయీ భావం శోకం. ఇష్టజనవియోగం వలన ఆత్మకు కలిగే దుఃఖాతిశయం.

"అవ్విధంబున బాష్పధారీ కులాధ్యక్షు
డగుచు సత్యవతీ సూనుడడలు టయుని
నెంతయును దాను గన్నుల నీరు నించె
గరుణ చిత్తంబులో నుబ్బ గలశ భవుడు

(భీ.పు. 3.3)

వేదవ్యాసుడు కుంభసంభవునితో తన కాశీవియోగగాథ తెలిపాడు. అగస్త్యుడు కూడ దేవకార్యర్థియై ప్రాణప్రదమైన కాశిని విడిచి రావలసి వచ్చింది. వారిద్దరు వారణాసి వియోగ దుఃఖ మగ్నులైనారు. వ్యాసుని శోక గాథ విన్న అగస్త్యుడు భార్య లోపాముద్రకు కన్నుల్లో నీరు నిండింది.

వీరభద్రుని దండు భయానకంగా విజృంభిస్తుంటే దేవతలంతా భయంతో కకావికలైనారు.

"సిగ్గుపడి విరియ బాఱిరి
బగ్గన బొరి పుచ్చు వీరభద్రుని ధాటిన్
నుగ్గులయి యవురు సవురయి
గగ్గులకాడై కకావికలయి యమర్త్యుల్"

(కాశీఖండం 7 - 88)

చిన్న కందపద్యంలో భయానకం అందంగా తీర్చిదిద్దబడింది.

సముద్రంలో పుట్టిన హాలాహలం చూచి దేవతలు తఱిత్రాడు వదలి పారిపోవటం, బ్రహ్మాండ భాండం పెట్లటం, దిక్కులు చిట్లటం, పాతాళం బ్రద్దలవటం, గగనం పగలటం మొదలైనవి భయానక స్ఫోరకాలు. ఇట్లు శ్రీనాథుడు తన గ్రంథాల్లో సందర్భానుసారంగా రస పోషణ కావించి పాత్రలకు ఔచిత్యం కల్పించాడు.

### 7.4.2. అలంకారాలు :

కావ్యానికి అలంకారాలు ఆభరణాలు. అలంకారాలను గురించి ఉద్భటుడు 'కావ్యాలంకార సంగ్రహమ'ని, రుయ్యకుడు 'అలంకార సర్వస్వమ'ని, వాగ్భటుడు 'వాగ్భటాలంకారమ'ని, కేశవమిశ్రుడు 'అలంకార శేఖరమ'ని దండి 'కావ్యాదర్శమ'ని ఆయా పేర్లతో అలంకార గ్రంథాలు రచించారు. అలంకారమంటే ఆభరణం. వాస్తవిక జీవితంలో వలె కావ్య జీవితంలో కూడ అలంకారం ప్రముఖస్థాన మాక్రమించింది. చంద్రలోకంలో జయదేవుడు వంద అలంకారాలు సోదాహరణంగా నిరూపించాడు. శ్రీనాథుడు శబ్దసౌందర్యానికి ప్రాముఖ్యమిచ్చాడు. కాని శబ్దాడంబర ప్రియుడు కాదు. ఆయన కవిత్వంలో చిత్ర కవిత్వం, గర్భ కవిత్వం, బంధ కవిత్వ లక్షణాలు కనిపించవు. శబ్దాలంకారాలు కూడ అవసరమైనప్పుడు ఉపయోగించాడు.

ఉపమాలంకారం

"ఇచ్చలేకుండినను నగ్నియెట్లు గాల్చు
దన్ను నంటిన వారి నద్దాహశక్తి
నిచ్చలేక గ్రుంగినను దహించునట్లు
తైర్థకుని బొందియున్న పాతకము గంగ"

(కా.ఖం. 5 - 46)

ఇష్టమున్నా లేకున్నా తనను తాకినవారిని అగ్ని దహిస్తుంది. అట్లే ఇష్టమున్నా లేకున్నా తనలో మునిగిన వారి పాపాలు గంగ భస్మం చేస్తుంది.

స్మృత్యలంకారం - ఒక దానిని చూచి తాదృశమైన మరో వస్తువును స్మరిస్తే స్మృత్యలంకారం.

"పైపయి గర్భ గేహమున బన్నికమీఱి వెలుగు మాలికా
దీపశిఖా ప్రరోహములు దేఱగ జూచి యనుస్మరించెలో
నాపృథి వీసురుండు మహిషాసుర మస్తక శోణితార్ద్రదు
ర్గాపరమేశ్వరీ పదనఖంబుల రూపము సంవదించినన్

(శి. మా. - 3 - 111)

బ్రాహ్మణ బ్రువుడైన సుకుమారుడు కాళికాదేవిని సందర్శించాడు. గర్భగుడిలో దేదీప్యమైన వెలుగులు వెదజల్లుతున్న దీప కళికలు మహిషాసుర మస్తక రక్త రంజితమైన దుర్గాదేవి చరణ నఖాలను స్మరించాడు.

నిదర్శనాలంకారం - సదృశమైన వాక్యాలకు అభేదా రోపము నిదర్శనాలంకారం. శ్రీనాథుడు సర్వజ్ఞసింగ భూపాలుని ప్రశంసించు సందర్భంలో

"సర్వజ్ఞ నామధేయము
శర్వునకే రావు నింగ జనపాలునికే
యుర్విఁజెల్లును దక్కొరు
సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే"

(చా.మ.ప్ర.భా. పుట 117)

అని పలికినట్లు చాటు పద్యాల్లో తెలుస్తుంది. సర్వజ్ఞుడనే బిరుదనామం శివునికే చెందుతుంది సింగభూపాలునికే వర్తిస్తుంది. వీరిరువురు కాక మరొకరిని సర్వజ్ఞుడనటం కుక్కను కుంజరమనటమేనని భావం. ఇతడుని సర్వజ్ఞుడనటం కుక్కను కుంజరమనటమేనని సమాన వాక్యార్థాలకు అభేదారోపణ చేయటం నిదర్శనాలంకారం. ఒక వర్ణంగాని రెండు మూడు వర్ణాలు గాని పునరుక్తి కలిగితే వృత్యాను ప్రాసాలంకారం.

"పాండు నందన ఘన భుజాదండ కవిత
చండ గాండీవ తాడిత ఖండ పరశు
పృథు జటామండలంబున బెండుగట్టి
తాండవం బాడె మిన్నేటి తరగదండు"

(హరవిలాసం 7 - 80)

వరాహం కోసం కిరీటి, కిరాతుల పోరు ఘోరమైంది. పూర్ణబిందు పూర్వకడ వర్ణం గాండీవి గాండీవ ప్రచండతను తెలిపే వీర విజృంభణలో వృత్యానుప్రాస సందర్భానుసారంగా వర్ణింపబడింది.

ఛేకానుప్రాస - ఛేకులంటే దుఃఖితులు. వారిచే ప్రవర్తింపబడిన అనుప్రాస ఛేకానుప్రాస. ఒకే పద్యంలో ఛేకానుప్రాస వృత్యానుప్రాస రాసిన సమర్థుడు శ్రీనాథుడు.

"కూర్మి రంభోరు వునుదాను గుంభ భవుడు
కుంభినీ ధర మహిత్ర వక్షోజ శాత
కుంభ కుంభ ద్వయీ పరిరంభణార్తు
శంభుశ్రీ మల్లికార్జును సంభజించె"

(కాశీఖండం 3 - 54)

లోపాముద్రా సహితుడైన అగస్త్యుడు శ్రీశైలక్షేత్రం వెళ్ళి భ్రమరాంబా సహితుడైన మల్లికార్జునుని దర్శించిన సందర్భంలో వృత్యానుప్రాస ఛేకానుప్రాస కలిసిన పద్యం చెప్పడం సముచితంగా ఉంది.

యమకం - సమానమైన వ్యంజనాలు పునరుక్తి చేయడం.

యమకం "ఏరీ ధరణిపు లల్లయ
వీర క్ష్మా పతికి సాటి వితరణ గరిమన్
ధారాధర ధారాధర
దారాధర వాహ దాన ధారానిధికిన్ "

(కాశీఖండం 1 - 47)

వీరభద్రారెడ్డి ఔదార్యం

ధారాధర ధారాధర ధారాధరవాహ - మేఘునితో భోజరాజుతో జీమూత వాహనునితో సరియగు దానధర్మాలకు నిధి అల్లయ వీరభద్రుడు. వితరణంలో అతనికి సాటివారు లేరు. ధారాధర శబ్దం పునరుక్తి.

శ్రీనాథుడు తన గ్రంథాల్లో 'అలంకారమును భూషించి' అన్నట్లు అర్ధాలంకారాలు విరివిగాను కొన్ని శబ్దాలంకారాలు ప్రయోగించి తన కావ్య కన్నెలకు సొగసుచేకూర్చాడు.

**7.4.3. వర్ణనలు :**

శ్రీనాథుడు రాయిని కూడ రసవంతంగా వర్ణింపగలడు. శ్రీనాథుడు తన కావ్యాల్లో 'రసంబు పోషించి అలంకారంబు భూషించి అన్నట్లే వర్ణనల విషయంలో 'ఔచిత్యం బాదరించి' అనౌచిత్యాన్ని పరిహరించాడు. తెలుగుదనం నింపి కరుణ రసోపేతమైన పద్యంలో స్వభావోక్తి వ్యక్తమైన పద్యం.

"తల్లిమదేక పుత్రిక పెద్ద కన్నులు గాన విప్పుడు మూడు కాళ్ళ ముసలి
యిల్లాలు గడు సాధ్వి యేమియు నెరుగదు పరమ పాతివ్రత్య భవ్య చరిత
వెనుక ముందర లేరు నెనరైన జూట్టాలు లేవడి యెంతేని జీవనంబు
కానక కన్న సంతానంబు శిశువులు జీవన స్థితి కేనతావలంబు

కృపదలంపగదయ్య యోనృపవరేణ్య
యభయమీవయ్యయో తుహినాంశువంశ
కావగదవయ్య యర్థార్థి కల్ప శాఖి
ని గ్రహింపకువయ్యయో నిషధరాజ"

(శృంగార నైషదము 1 - 109)

హంసను పట్టుకున్న నలునితో హంస తన సంసారాన్ని వర్ణించిన తెలుగు పద్యం.

తనంతటి ప్రత్యర్థి ఉన్నప్పుడు మానవుడు పొందే మానసిక వేదన సహజంగా ఈ విధంగా ఉంటుందనడానికి క్రింది పద్యం ఉదాహరణ.

"కంటికి నిద్రవచ్చునే సుఖంబగునే రతికేళి జిహ్వకున్
వంటక మించునె యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె మానుషంబు గలయట్టి మనుష్యున కెట్టి వానికిన్
గంటకడైన శత్రువొకండు తనంతటివాడు గల్గినన్"

(కాశీఖండం 1 - 108)

మనసున్న మనిషి పొందే ఆవేదన.

మూడు రోజులు భిక్ష దొరకలేదని వ్యాసుడు కాశిని శపించబోయాడు. పార్వతి కడుపునిండా భోజనం పెట్టింది. తరువాత శివుడు శపించి వ్యాసుని కాశి నుండి వెలివేస్తాడు. శివశాపానికి ముందు పార్వతి వ్యాసుని వారించే పద్యం

"భిక్ష లేదని యింత కోపింతురయ్య
కాశికాపట్టణము మీద గానిసేయ
నీ మనశ్శుద్ధి తెలియంగ నీలకంఠు
డింత చేసెను గాక కూడేమి భ్రాతి"

(భీమేశ్వర పురాణం 2 - 114)

శ్రీనాథుడు సామెతలు, లోకోక్తులు, జాతీయాలు ప్రయోగించడంలో సిద్ధహస్తుడు. కుబేరుని పూర్వజన్మ కథ. యజ్ఞదత్తుని కుమారుడు సుకుమారుడు. తల్లి సుకుమారుని గారాబం చేయడం వలన చెడిపోయాడు. తండ్రికి తెలియదు. కుమారునికి నీతులు బోధిస్తూ తల్లి పలుకుతుంది.

"తల్లి బడికొల్లి చట్టంబు నుల్లసంబు
లాడుదురు నన్ను గుర్తి నిన్న హరహంబు
దుర్ణయంబెల్ల నా మీద ద్రోచి జనులు
డబ్బరలు పల్కు వారి కడ్డంబు గలదె"

(కాశీఖండం 4 - 96)

తల్లివంటి వాడే పిల్లవాడనే సహజ లోకోక్తి.

ఒక ప్రదేశం గురించి కాని ఒక క్షేత్రం గురించి కాని ఒక తీర్థ స్థానం గురించి కాని సముచితంగా వర్ణించడం దేశౌచిత్యం. దేశౌచిత్యం ఎక్కువగా పాటించినవాడు శ్రీనాథుడు. పురాణాలు తెనిగించడం వలన కవికి ఈ లక్షణం సామాన్యం.

"ధవళలోచన శ్రీపర్వతంబు మహిమ
బ్రస్తుతింపంగ శక్యమే బ్రహ్మకైన
గండ శిలలెల్ల శంభు లింగంబు లిందు
సిద్ధమును లిందు జరియించు చెంచులెల్ల"

(కాశీఖండం 3 - 59)

అగస్త్యమహర్షి లోపాముద్రకు శ్రీశైల ప్రభావం వర్ణించే సందర్భంలోనిది పై పద్యం. కొండయందుండే గండశిలలన్నీ శివలింగాలేనట. ఇక్కడ సంచరించే చెంచులంతా తపస్సంపన్నులైన మునులు.

"జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశ భాషలందు, దెనుగు లెస్స
జగతి దల్లి కంటె సౌభాగ్య సంపద
మెచ్చుటాడు బిడ్డ మేలుగాదె"

(క్రీడాభిరామం పుట. 13)

'దేశభాషలందు తెలుగులెస్స' ఇవి శ్రీనాథుని సువర్ణాక్షరాలు. శ్రీకృష్ణదేవరాయలు ముచ్చటపడి ఆముక్తమాల్యదలో ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు.

శ్రీనాథుడు వయోభేదాలు సముచితంగా చిత్రించాడు. దీనినే అవస్థాచిత్రణం అంటారు.

"బలబల వేగఁజేపకడ బంకజ దీర్ఘిక దీర్ఘమాడె నె
చ్చెలులును దాను నిందుముఖి శేషవిభూషణ బూజసేయుని
చ్చలు దెలి కన్నులున్ మొలక చన్నులు బొమ్మల మీద వ్రాలు గుం
తలములు జూచి పౌరులు మనంబున నువ్విళు లూరుచుండగాన్

(కాశీఖండము 5 - 144)

యౌవనవతి అయిన సుశీల వర్ణన పై పద్యం తెలియజేస్తుంది.

శ్రీనాథుడు శైవభక్తి పరాయణుడు. ఈశ్వరార్చన కళాశీలుడు. భక్తి ఆవేశంతో పరమానందంతో శివుని బాష్పపూరిత నేత్రుడై రోమాంచకంచుకిత గాత్రుడై వ్యాసుని పరంగా వర్ణించిన వర్ణన

"ముక్కంటీ నీకు మ్రొక్కెదను, శివా నీకు నవాంజలి, భవానీకు
నభివాదనంబు, పాండు రంగా నీకు దండంబు, రాజశేఖరా
నీకు జేజే, హరా నీకు జోహారు, గిరీశా నీకు వరివస్య,
యష్టమూర్తీ నీకు బ్రతిష్ట, యీశానా నీకు దాస్యంబు,
త్రిపుర హరా నీకుపాసన, మృడా నీకు శరణు, మృత్యుంజ
యా నీకు బ్రస్తుతి, ప్రమథాధిపా నీకు నారాధనంబు, పినాకీ
నీకు నమస్కారంబు, కైలాసనిలయా నీకు గోపులు, పస్యల్లలా
టా నీకు నేటికోళ్ళు, గిరీ మనోహరా నీకు నమస్కారంబు"

(భీమేశ్వర పురాణము 3 - 212)

దీనిలో పరమేశ్వరునికి సంబంధించి పదిహేడు సంబోధనలున్నాయి. ఒక్కో సంభోధనకు ఒక్కో పర్యాయ పదం ఉపయోగింప బడింది. పరమేశ్వర స్తుతి శ్రీనాథుని భాషా సౌందర్యానికి నిదర్శనం. తెలుగు పదాలే గాక శ్రీనాథుడు సంస్కృత పద భూయిష్ట రచన చేయగలవాడు.

'ప్రౌఢి బరికింప సంస్కృత భాష యండ్రు' అని చెప్పుకున్నాడు.

"గిరిశ స్థూలభుజా పరీత విభవ క్రీడా సమాస్ఫాలిత
స్థిర బాణాసన గూఢ పాద్గుణలతా దీర్ఘోగ్ర ఘోషంబునన్
ధరణీ చక్రముదిర్దిరం దిరిగె బాతాళంబు ఘూర్ణిల్లె నం
బరముం దిక్కుల వ్రయ్యలయ్యె బగిలెన్ బ్రహ్మాండ భాండంబులున్

(భీమేశ్వర పురాణము 4 - 133)

భూమి రథం, రవిచంద్రులు, రథచక్రాలు, శ్రుతిచతుష్టయం, గుఱ్ఱాలు, చతుర్ముఖుడు సారధి, మేరువు ధనుస్సు, వాసుకి నారి, విష్ణువు బాణం, సముద్రం తూణం, ఈ పరికరాలతో మహాదేవుడు త్రిపుర విజయానికి బయలుదేరాడు. మత్తేభ వృత్తంలో ఈ వర్ణనంతా ప్రయాణించింది.

శ్రీనాథుడు వర్ణించిన భోజన పదార్థాలు మరే కవి వర్ణించలేదు. 'మొగి విరిసి కరకు కూడని లేజిగు రరటాకు' నుండి వర్ణించటం మొదలుపెట్టాడు. పప్పు, పాయసం, గుడం, ద్రాక్షా, పానకం, ఖండశర్కర, రంభాఫలశ్రేణి, గోక్షీరం, మండిగలు, ఏరుబ్రాలకల మహారం వర్ణిస్తుంటే పాఠకునికి నోరూర వలసిందే.

శ్రీనాథుని పురుష పాత్రలంతా అఘమర్షణ స్నానంచేసిన వారు. (పాపం నశించడానికి జపించే మంత్రం అఘమర్షణం) స్త్రీలంతా చిరుబంతి పసుపు స్నానం. శ్రీనాథునికి నాట్యంలో గొండ్లి యిష్టం. పాటలు పాడేటప్పుడు, నాట్యం చేయించేటప్పుడు

శ్రీనాథుడు దేశిమార్గ కవితే ప్రయోగించాడు. ఏడ్చే స్త్రీ వర్ణన చూసి రాయల కాలంనాటి కవులు ఇంకా మహత్తరంగా వర్ణించారు.

"కొసరి వసంత కాలమున గోయిల గ్రోల్చిన భంగి నేడ్చిన
బ్బిసరుహ నేత్రకొండ చరి బెద్ద యెలుంగున వెక్కి వెక్కి వె
క్క సమగు మన్యు వేగమున గాటుక కన్నుల నీరు సోనవై
యుసిరిక కాయలంతలు పయోధరములే దిగజారినట్లుగన్"

(కాశీఖండము 5 - 167)

ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా, అల్లసానివారు అటూ ఇటూ, భట్టుమూర్తి బావురుమని ఏడిపించడానికి పై పద్యంలోని శ్రీనాథుని వెక్కసమైన వెక్కి వెక్కి ఏడుపే కారణం.

దగ్గుపల్లి దుగ్గన శ్రీనాథుని పాండిత్యాన్ని గురించి క్రింది విధంగా వర్ణించాడు.

"సంస్కృత ప్రాకృత శౌర సేనీ ముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు
పన్నగపతి సార్వభౌమ భాషిత మహా
భాష్య విద్యా సమభ్యాస బలము
అక్షపాదకణాద పక్షిలో దీరిత
న్యాయకళాకౌశలాతిశయము
శ్రుతి పురాణాగమ స్మృతి సాంఖ్య సిద్ధాంత
కబళ నవ్యుత్పత్తి గౌరవంబు

పూర్వకవి ముఖ్య విరచిత పూర్వ కావ్య
భావ రస సుధాచర్వణ పౌఢతయును
గందళింపగ కాశికా ఖండ నైష
ధ ప్రముఖ వివిధ ప్రబంధము లొనర్చి"

(నాసికేతో పాఖ్యానము 1 - 18)

శ్రీనాథుని కవిత్వం భావరస సుధ కలిగినది. ప్రౌఢ కవితాపటిమ గలదని దుగ్గన అభిప్రాయం.

గంధర్వ అప్సరస గొండ్లి నృత్యాన్ని పండు వెన్నెల్లో ఆలపించి హిందోళ రాగం విన్న కవి శ్రీనాథుడు ఖండ శర్కరలు, ఘనసారం కంటె తియ్యనైన కవిత్వం చెప్పగలవాడు. కస్తూరి సౌరభాలు వెదజల్లే ఆయన కవిత్వంలోని వర్ణనలు అనితర సాధ్యం. శ్రీనాథుడు తన జీవిత కాలంలో రచించిన రచనలను వర్ణించడానికి ఎన్నో జీవితాలు కావాలి.

## 7.5. శ్రీనాథుని కావ్యాలు :

శ్రీనాథుని కావ్యాలు ఆంధ్ర సరస్వతికి అలంకారాలు. శృంగారనైషధ రచనతో కవిసార్వభౌమ బిరుదం చేపట్టాడు. ఇతడు బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. సకల విద్యా సనాథుడు. సరస సాహితీ సామ్రాజ్య క్ష్మాధరుడు. ప్రాచీన సంస్కృతాంధ్ర కవులు తనకు మార్గదర్శకులైనట్లే అర్వాచీన ఆంధ్ర కవులకు కావ్య నిర్దేశకుడైనాడు. నన్నయ శ్రీనాథుల నడిమి కాలం అనువాద

యుగమని చెప్పవచ్చు. శ్రీనాథుని భీమఖండం, కాశీఖండం, శృంగారనైషధం అనువాద కావ్యాలు. స్వతంత్ర రచనలైన హరవిలాసము, పలనాటి వీరచరిత్రము కవి లోకజ్ఞత చాటే గ్రంథాలు. ఈ విధంగా శ్రీనాథుని సాహిత్య ప్రక్రియా వైవిధ్యం మరే తెలుగు కవి చూపలేదు. శ్రీనాథుడు తన గ్రంథాలను గురించి ఒక పద్యం చెప్పుకున్నాడు. చెప్పనివి ఇంకా ఉన్నాయి.

"చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూగు మీసాల నూత్నయౌవనమున శాలివాహన సప్తశతి నుడివితి
సంతరించితి నిండు జవ్వనంబున యందు హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష
ప్రౌఢ నిర్భర వయః పరిపాకమున గొనియాడితి భీమనాయకుని మహిమ"

ప్రాయమింతకు మిగుల గై్రవాలకుండ
కాశికాఖండమను మహాగ్రంథమేను
తెనుగు గావింతు కర్ణాట దేశ కటక
పద్మవన హేళి శ్రీనాథభట్ట సుకవి"

(కాశీఖండం ప్రథమాశ్వాసం)

శ్రీనాథుడు తన బాల్యం నుండి కవిత్వం రాశానని పలికాడు. ఆయన రచించిన గ్రంథాలు మరుత్తరాట్చరిత్ర, శాలివాహణ సప్తశతి, హర్షుడు రచించిన హర్షనైషధాన్ని శృంగార నైషధమనే పేరంతో అనువాదం, భీమేశ్వర పురాణం, కాశీఖండం. ఇంకా శ్రీనాధుడు హరవిలాసము, శివరాత్రి మహాత్మ్యము, పల్నాటి వీరచరిత్రము, వల్లభాభ్యుదయము, ధనుంజయ విజయము, నందనందన చరిత్రము, రామాయణము పాట మొదలైన పదునేడు గ్రంథాలు రచించాడని సాహితీకారులు పేర్కొన్నారు.

## 7.5.1. మరుత్తరాట్చరిత్ర :

శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్ర చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు రాశానని చెప్పాడు. అనగా కవికి పదహారేళ్ళ ప్రాయంలో ఈ గ్రంథం రచించి ఉంటాడని సాహితీ విమర్శకులు వేటూరి ప్రభాకరశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, కందుకూరి వీరేశలింగం గారు అభిప్రాయపడ్డారు.

నూనూగు మీసాల నూతన యౌవనంలో శాలివాహన సప్తశతి రచించానన్నాడు. సుమారు ఇరవై సంవత్సరాల వయసులో శ్రీనాథుడు ఈ గ్రంథం రచించాడని పండితుల అభిప్రాయం. ఈ కావ్యం హాలుడు రచించిన ప్రాకృత గాథలకు తెలుగు అనువాదం. దురదృష్టవశాత్తు శ్రీనాథుని తెలుగు గాథాసప్తశతి లభ్యంకాలేదు. ఒక్క పద్యం మాత్రం లభించింది.

"వారణ సేయరావ గొన వానవ వారిజ మందు దేటి క్రొ
వ్వారుచు నుంటి నీ వెరుగవా ప్రియ నా తెర గంటి కె
వ్వారికి గెంపురాదె తగవా మగవారల దూరనీ విభుం
డా రసినీ నిజం బెరుగు నంతకునంతకు నోర్వు నెచ్చలీ"

పై పద్యం పరిశోధకులకు అమూల్య రత్నం వంటిది.

## 7.5.2. శృంగారనైషధం :

శృంగారనైషధాన్ని నైషధం విద్వదౌషధ మన్నట్లే శ్రీనాథుడు అనువదించాడు. నిండు జవ్వనంలో అనగా సుమారు ముప్పై

సంవత్సరాల ప్రాయంలో శృంగారనైషధ గ్రంథం రచించాడు. పెదకోమటి వేమన మంత్రి మామిడి సింగనకు ఈ గ్రంథం అంకిత మిచ్చినట్లు చెప్పాడు శ్రీనాథుడు.

"శ్రీవేమ మండలేశ్వరుని మంత్రి
యమిత దుర్మంత్రి కదనముద్రావతార
శాసనుడ రాయ వేశ్యా భుజంగ బిరుద
మంత్రి పెద్దయ సింగ నామాత్య వరునకు"

(శృం. నై. 1 - 9)

అన్నాడు. శ్రీనాథునికి శృంగారనైషధంపై మక్కువ ఎక్కువ. ఆంధ్రభాషా నైషధాబ్జ భవుడనని, ఆంధ్రనైషధకర్త, పలుకు తోడై తాంధ్ర భాషా మహా కవ్య నైషధ గ్రంథ సందర్భమునకు అని తానే చెప్పుకున్నాడు.

"కల్పించినాడవు గాఢ పాకంబైన
హర్ష నైషధ కావ్య మాంధ్ర భాష"

(భీమఖండం 1 - 23)

అని బెండపూడి అన్నయామాత్యుడన్నట్లు శ్రీనాథుడు వివరించాడు. శ్రీహర్షుడు రచించి హర్షనైషధం సంస్కృతంలో పౌఢకావ్యం. పాండిత్యం కష్టతరమైంది. దానిని శ్రీనాథుడు 1280 గద్యపద్యాల్లో ఎనిమిది ఆశ్వాసాలుగా రచించాడు. నిషదాధిపతి నలుడు హంసను బంధించాడు. తనను వదిలి పెడితే కుండిన దేశరాజు కూతురు దమయంతితో నలుని అందం వివరిస్తానని హంస పలికింది. అలా హంస రాయబారంతో నలదమయంతుల వివాహం జరిగింది. దిక్పాలకుల విరహం. నలుని దౌత్యం మొదలైన ఘట్టాలు వివాహానికి పూర్వం రసవంతంగా వర్ణించాడు శ్రీనాథుడు. గ్రంథం శృంగార రసప్రాధాన్యం కాబట్టి శృంగారనైషధమని నామౌచిత్యం చేశాడు కవి.

"ప్రాతఃకాలము వాయసంబు పణినా పత్యోక్త శాస్త్రంబులో
దాతజ్ స్థానులు చెప్పుడెవ్వి యను చందం బోప్ప గౌ కౌ యనం
జాతుర్యంబలరార నుత్తరము విస్పష్టంబుగా గోకిల
వ్రాతంబిచ్చె దుహీదుహీ యని గృహారామ ప్రదేశంబు లన్"

పాణిని గ్రంథంలో తా, త ణ్ స్థానాలు వివరింపుమని వాయసాలు కౌ కౌ అని ప్రశ్నిస్తే కోకిలలు వాటికి తుహి తుహి అని సమాధానం చెప్పినాయట. శ్రీనాథుని అందమైన ఆంధ్రీకరణకు ఈ పద్యం ఉదాహరణ. శృంగార నైషధంలో శ్రీనాథుడు శబ్దార్థ ప్రాధాన్యం, శయ్యా సౌభాగ్యం, పాత్రపోషణ అనౌచిత్య పరిహరణ మొదలైన కవితా మాధుర్యాలు కలబోసి రచించిన రసవత్తర మహాగ్రంథం.

### 7.5.3. భీమేశ్వర పురాణం :

శ్రీనాథుడు ప్రౌఢనిర్భర వయః పరిపాకంలో రచించానన్నాడు. ఈ గ్రంథం బెండపూడి అన్నయామాత్యునికి అంకితమిచ్చాడు. సంస్కృత భీమఖండాని శ్రీనాథుడు తెలుగులో అనువదించాడన్నారు పండితులు. ద్రాక్షారామం మీద అభిమానం చేత భీమేశ్వర పురాణం రచించాడని పండితులు ఊహ. ఇది స్కాందపురాణంలోని గోదావరీ ఖండానికి అనువాదమని శ్రీనాథుడు వివరించాడు.

పంచారామాల్లో ద్రాక్షారామ ప్రశక్తి, భీమేశ్వరుని మహిమ మొదలైన పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యాలు ఈ గ్రంథంలో వర్ణింపబడినాయి.

"నవమరుత్తు చరిత్రంబు నైషధంబు
సప్తశతి పండితారాధ్య చరితమనగ
గావ్యములు పెక్కు చెప్పి యుగాంక్ష చనక
వెండియును గావ్య మొకటి గావింప దలచి"

(భీ. ఖం. 1 - 47)

అని పలికాడు. వ్యాసునికి మూడు రోజులు కాశిలో భిక్ష దొరకలేదు. అందువలన కాశిని శపించబోయాడు. అమ్మవారు పెద్ద ముత్తైదువ రూపంలో కనిపించి శిష్యులకు వ్యాసునికి షడ్రసోపేతమైన భోజనం పెట్టింది. పిదప వ్యాసుని కాశినుండి వెళ్లగొట్టడం కథాంశం.

### 7.5.4. కాశీఖండం :

శ్రీనాథుడు ప్రాయమింతకు మిగుల క్రైవాలకుండగనే కాశీఖండాన్ని అనువదించానని తెలియజేశాడు. శ్రీనాథుడు భీమేశ్వర పురాణం తరువాతే కాశీఖండం రచించాడు. కాశీఖండం రాజమహేంద్రవర రాజ్యాధిపతి వీరభద్రారెడ్డికి అంకితమీయబడింది. శ్రీనాథుని గ్రంథాల్లో 'కాశీఖండం అయఃపిండం" అని 'నైషధం విద్వదౌషధమ'ని ప్రతీతి. ఇతని గ్రంథాల్లో ప్రౌఢ తమ రచన కాశీఖండం. సంస్కృత కాశీఖండానికి తెలుగు అనువాదానికి పొత్తులేదు. సంస్కృత కాశీఖండం కావ్యశైలిలో ఉంటుంది. తెలుగు కాశీఖండంలో పతంజలి యోగశాస్త్రం, గాయత్రీ మంత్ర మహిమ, మంత్ర శాస్త్ర విశేషాలు పొందుపరుప బడినాయి. ఇది శ్రీనాథుని పాండిత్య ప్రతిభకు గీటురాయి. అందువలననే కాశీఖండం అయఃపిండమని శ్రీనాథుని గ్రంథానికే పేరు కాని సంస్కృత గ్రంథానికి కాదు.

అగస్త్యుడు లోపాముద్రకు కాశీక్షేత్రాధిక్యం వివరించడం ప్రధాన ఇతివృత్తం. వింధ్యపర్వతం మేరుపర్వతంతో తలపడి పెరిగిపోయింది. సూర్యచంద్రుల గమనానికి ఆటంకమేర్పడింది. దేవతల ప్రార్థన చేత గొప్ప తపశ్శక్తి సంపన్నుడైన అగస్త్యుడు కాశీనుంచి ప్రయాణమైనాడు. వింధ్యపర్వతం గర్వమణచి దక్షిణ దిక్కు ప్రయాణం చేస్తు వస్తున్నాడు. దారిలో లోపాముద్రతో అనేక పుణ్య కథలు వివరించినట్లు గ్రంథ వివరణ. అగస్త్యుడు తన కిష్టమైన కాశి పట్టణాన్ని వదిలి భార్యతో కదిలి పోయే ముంది మహర్షి పడిన మానసిక వేదన శ్రీనాథుడు కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు.

"పరమ కళ్యాణి యోభాగీరథీ గంగ వార్ధిభామిని పోయి వత్తునమ్మ
యమరేంద్రులార లోలార్క కేశవులార వనజ సంభవ పోయి వత్తునయ్య
శ్రీ విశాలాక్షి దాక్షిణ్య పుణ్య కటాక్షి వాసవార్చిత పోయి వత్తునమ్మ
శ్రీ పుర్ణభద్ర పారిషద నాయకులార వటుక భైరవ పోయి వత్తునయ్య"

"తీర్థ సంవాసులార కృతార్థులార
పాశుపతులార భాగ్య సంపన్నులార
మందిరోద్యాన వాటికా మఠములార
పోయి వత్తునె మీ కాశి పురము వెడలి"

లోపాముద్ర, అగస్తులు జీవితచరమాంకంలో కాశి పట్టణంలో స్థిరపడి విశాలాక్షి విశ్వేశ్వరులను సేవించుకోవాలనుకున్నారు. విధి వక్రించింది. వింధ్య గర్వ మణచడానికి కాశీ పట్టణాన్ని వదిలి పోవలసి నందుకు దుఃఖ భాజనులైనారు.

### 7.5.5. శివరాత్రి మహాత్మ్యం :

కాశీఖండం తరువాత రచించిన గ్రంథం. శ్రీనాథుడీ గ్రంథాన్ని ధనికుడైన ముమ్మడి శాంతయకు అంకితమిచ్చాడు. శ్రీనాథుడు దేశాటన ప్రారంభించి శ్రీశైలం చేరాడు. శివరాత్రి మాహాత్మ్య సమయంలో 'సిద్ధ భిక్షావృత్తి యతీశ్వరుడు' తన ప్రియ భృత్యుడైన శాంతయ్యను శ్రీనాథుని చేత కృతినందుకొమ్మని పలికాడట. శాంతయ్య 'సిద్ధ భిక్షావృత్తి' వద్ద ఉద్యోగి. శివరాత్రి మాహాత్మ్యానికి మూలకథ ఈశాన సంహిత. "స్కాందంబు నందీశాన సంహితం జెప్పబడ్డ యురులింగోద్భవంబును శివరాత్రి మాహాత్మ్యంబును" (శి.మా. 1 - 38) అని శ్రీనాథుడు పేర్కొన్నాడు.

బ్రాహ్మణ కుమారుడు పాపాలెన్నో చేసి శివరాత్రి వేళ మరణించడం. యమభటులు వరుణ పాశాలతో బంధిస్తుంటే శివకింకరులు అడ్డుపడ్డారు. పరస్పర యుద్ధం. చివరకు శివ భటులు యముని సేనానిని కూడ తరిమి సుకుమారుని బంధనాలూడ్చి కైలాసం తీసుకెళ్ళారు. సుకుమారుడు కైలాసంలో శివుని చూచి దండప్రణామాలాచరించాడు. శివుడు సుకుమారునికి ప్రమథత్వం ప్రసాదించాడు. శివరాత్రి జాగరణం, ఉపవాస మహిమ తెలిపే శైవగ్రంథం శివరాత్రి మాహాత్మ్యం.

### 7.5.6. పలనాటి వీరచరిత్ర :

శ్రీనాథుడు రచించిన మరో గ్రంథం. ఇది ద్విపద కావ్యం. సమగ్ర గ్రంథం దొరక లేదు. బాల చంద్రుని యుద్ధ భాగం వరకు మాత్రమే లభించింది. శ్రీనాథుడే ద్విపద కావ్యాన్ని సులభశైలిలో రచించాడు. వేయి ఆమడ పోయి అయినా వీరకథ వినాలనే సామెత. పలనాడులోని వీరుల చరిత్ర తెలిపే గ్రంథం. శ్రీనాథుడు పలనాడు చుట్టివచ్చాడు. కాశీఖండంలో కాశీ విశ్వేశ్వరుని స్తుతించినట్లు పల్నాటి వీరచరిత్రలో చెన్నకేశవ స్వామిని స్తుతించాడు శ్రీనాథుడు. నలగామరాజు కొలువులో గాయకులు, నాట్యకత్తెలు నెరపిన కళా ప్రదర్శన శ్రీనాథుని సంగీత నాట్య శాస్త్ర పరిజ్ఞానం చాటుతుంది. పలనాటి వీరచరిత్రలో చెన్నకేశవుడు "ఈ ప్రబంధము నీవు రచింపుమని" ఆదేశించినట్లు కవి తెలిపాడు.

"ఘనుడైన శ్రీనాథకవి రాజరాజు
చెన్నుని కృపచేత జిత్తముప్పొంగి
బాలుని విక్రమ ప్రౌఢి యంతయును
విరచించె జనులకు విదితంబు గాను"

అని శ్రీనాథుడు గ్రంథాంతంలో తెలిపాడు. పల్నాటి వీర చరిత్రలో బ్రహ్మనాయుడు వర్ణభేదం లేకుండా 'చాపకూడు' ఏర్పాటు చేశాడు. అదీ చెన్నకేశవుని ఆలయంలో. దానికి కోపించిన నాగమ్మ యుక్తులతో యుద్ధం జరగడం, ఎంతో మంది పలనాటి వీరులు మరణించడం గ్రంథంలోని ముఖ్య కథాంశం. దీనిని పిల్లభారతమన్నారు సాహితీవేత్తలు.

### 7.5.7. హరవిలాసం :

శ్రీనాథుని మరో గ్రంథం. ఇది ఏడాశ్వాసాల గ్రంథం. అంతా శివ భక్తుల చరిత్ర తెలియజేసే కథల గ్రంథం. గౌరీ కళ్యాణం, కిరాతార్జునీయం, శివుని హాలాహల భక్షణం భక్త శిరియాళుని చరిత్ర మొదలైన కథాంశాలున్నాయి. ఈ గ్రంథాన్ని శ్రీనాథుడు సుగంధ భాండాగారాధ్యక్షుడైన అవచి తిప్పయసెట్టికి అంకితమిచ్చాడు. ఈ గ్రంథాన్ని కాంచీపురంలో రాసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

### 7.5.8. ధనంజయ విజయం :

ధనంజయ విజయమనే మరో గ్రంథం రచించాడు. ధనుంజయ విజయం కృతి భర్త పెదకోమటి వేమారెడ్డి మామ దంతలూరి గన్నభూపాలుడు. గన్నభూపాలుడు ధాన్యవాటీ పురాధీశ్వరుడు. పెద కోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక. ఆమె తండ్రి దంతలూరి గన్నభూపాలుడు. సూరాంబిక సంతాన సాగర తటాకం త్రవ్వించింది. ఈ సంతాన సాగర తటాక శాసనకర్త శ్రీనాథుడు.

### 7.5.9. నందనందన చరిత్ర :

నందనందన చరిత్ర రచించి శ్రీనాథుడు దినవెచ్చ మిచ్చిన పంట మైలారు రెడ్డికి అంకితమిచ్చాడు. పంట మైలారు రెడ్డి వైష్ణవ భక్తుడు. శ్రీనాథుడు నందనందన చరిత్ర రచించినట్లు భీమఖండంలోని రాధామాధవ స్తవం నిదర్శనం. శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారి పదవి నిర్వహించినా వేమునికి అంకితమిచ్చెన గ్రంథమేది లేదు.

శ్రీనాథుడు విద్యాధికారి పదవిపొంది అనేక రాజాశ్రయాల్లో గౌరవం పొందాడు. బంగారు పాత్రలో భోజనం చేశానన్నాడు. కస్తూరీ తాంబూల చర్వణం, సుగంధ పరిమళాల భూయిష్టమైనవాడు. రసిక, రసమయ భక్తిజీవితం అనుభవించాడు. కనక స్నానం చేశాడు. ఉరు భాషా విశేషోద యా జిహ్వాస్వాంతుడు. కవిసార్వభౌముడు. అంతటి గొప్పవాడు జీవిత చరమాంకంలో కుల్లాయి, కూర్పాసనం ధరించాడు. విశ్వస్త వడ్డించిన వెల్లుల్లి, తిపిష్టాన్ని బ్రతకడం కోసం రాజీపడి తిన్నాడు. చల్ల, అంబలి త్రాగాడు. చివరకు ఇక బ్రతకడం కూడ కష్టమని భావించాడు. తన కాలంలో ఉన్న రెడ్డి రాజులంతా మరణించారు. ఆదరించేవారు లేరు. "కలియుగంబున నికనుండ కష్టమనుచు" దుఃఖించాడు. విషగుళికవలె శ్రీనాథుని చరమాంకం పాఠకలోక హృదయాలను ద్రవింపచేస్తుంది. శ్రీనాథుని కవితాశైలి అనితర సాధ్యం. ప్రతి కావ్యం అమృత రస ప్రవాహం. సాహితీ లోకం శ్రీనాథుని కెంతో ఋణపడిఉంది.

### 7.5.10. పలనాటి వీరచరిత్ర :

పలనాటిసీమ కృష్ణాతీరాన సముద్రానికి సుమారు 120 మైళ్ళ దూరంలో ఉంది. దానికి ఉత్తర పడమట 75 మైళ్ళ పొడవున కృష్ణానది ప్రవహిస్తుంది. దక్షిణ దిక్కు కొండలు, దట్టమైన అడవులచేత ఆవరింపబడి ఉంటుంది. దీని వైశాల్యం ఇంచుమించు నూటయాభై చదరపు మైళ్ళు. నాగులేరు, చంద్రవంక ఈ ప్రాంతంలో ప్రవహించే ముఖ్య నదులు. పలనాటి వీరచరిత్రలో వచ్చే ప్రధానమైన ఊళ్ళు కార్యమపూడి, మాచర్ల పట్టణాలు నాగులేటి తీరంలో ఉన్నాయి. గురజాల మొదలైనవి చంద్రవంక తీరంలో ఉన్న పట్టణాలు. ఈ పలనాటిసీమ వైశాల్యం పది వందల తొంబై చదరపు మైళ్ళని Sewell పండితుడు చెప్పాడు.

(List of antiquities Vol. -1)

పలనాటి వీరచరిత్ర శ్రీనాథుడు రచించాడు. శ్రీనాథుడు తన వార్థక్యదశలో రచించనట్లు తెలుస్తుంది. శ్రీనాథుడు రచించిన చివరి గ్రంథమిది. రాజమహేంద్రవర రాజ్యం అంతంలో శ్రీనాథుడు శ్రీశైలం పోయి అటనుండి పలనాటిసీమ పర్యటించాడు. ఆ సమయంలో శ్రీనాథుడు రచించిన గ్రంథం. అప్పటికి వయసు మీరిన వాడవటం వలన ఏడుగురు లేఖకులతో ఈ గ్రంథం రాయించాడని కథనం. చెన్నకేశవుని ఆలయంలో కూర్చుని దాదాపు భారతమంత పెద్దదిగా ఉన్న ఈ గ్రంథాన్ని రెండు మాసాల్లో రచించాడని కథనం.

## అంకితం :

పలనాటి వీరచరిత్రలో చెన్నకేశవుడు 'ఈ ప్రబంధము నీవు రచింపుమ'ని ఆదేశించాడట. అందువలన ఈ గ్రంథం రచించి చెన్నకేశవునికి అంకితమిచ్చాడు శ్రీనాథుడు. దీనిలోని శైలి ఇతర గ్రంథాలతో సరిపోలదు. ఇది ద్విపద ప్రబంధమని అంటారు. ఈ కావ్యం పామరులు పాడటానికి అనువైన రచనాశైలి గలదు.

## కావ్య విశేషాలు :

పలనాటి వీరచరిత్రలో శ్రీనాథుడు సంగీత నాట్యప్రావీణ్యం చూపాడు. ఈ గ్రంథం బాలచంద్రుని యుద్ధ వర్ణన వరకు మాత్రమే లభ్యమైంది. శ్రీనాథుడు దీనిలో రచించిన యుద్ధ వర్ణనలు, పలుకుబడులు భారతాన్ని తలపింపజేస్తుంది. తిక్కన భారతంలో యుద్ధ రంగంలో ప్రవహించు రక్తం నదీ ప్రవాహంగా వర్ణించాడు. శ్రీనాథుడు బాలచంద్రుని యుద్ధఘట్టంలో కార్యమపూడి యుద్ధభూమి కూడ అట్లే ఉన్నదని వర్ణించాడు. భారతకథని పలనాటి వీరచరిత్రకి సామ్యం ఉంది. సవతి సోదరులు నలగామ రాజు మలిదేవుల సవతి సోదరుల మధ్య పోరు. కోడి పందాలు. అరణ్యావాసం. రాయబారానికి వచ్చిన అలరాజుకు నాగమ్మ విషమిచ్చి చంపడం మొదలైన ఘట్టాలు వర్ణింపబడినాయి.

బ్రహ్మనాయుడు కులమతాలకు అతీతంగా చెన్నకేశవుని ఆలయంలో 'చాపకూడు' ఏర్పాటు చేశాడు. దానికి కోపించిన నాగమ్మ నలగామరాజు పక్షం వహించి తన కుయుక్తులతో యుద్ధానికి రాజును సన్నద్ధుడిని చేస్తుంది. భారతంలో శకునివలె నాగమ్మ పాత్ర పోషింపబడింది. యుద్ధంలో ధర్మం జయిస్తుంది. అన్ని కులాల వారికీ ప్రాధాన్యముంటుందీ గ్రంథంలో.

బాలచంద్రుని యుద్ధభాగం కృతి అవతరణికలో శ్రీనాథుడీ విధంగా చెప్పుకున్నాడు.

"మను భరత్వాజ వంశవర్ధనుడ
కవి సార్వభౌముడు ఘనతగన్నట్టి
శ్రీ నాథుడనువాడ శివ భక్తి పరుడ
విలసిల్లు పలనాటి వీరుల చరిత
జనులెల్ల భక్తిచే చదువుట కొరకు
మంజరీద్వి పదగా మన్నించి నేను
చెప్పబూనితి వచః శ్రీ మెరయంగ"

పలనాటి వీరచరిత్ర గ్రంథం మొత్తం లభ్యం కాలేదు. దీనిని 'పిల్ల భారత' మంటారు. శ్రీనాథుడు వార్థక్యంలో పలనాడు ప్రాంతం సంచరించి అనేక చాటువులు చెప్పినట్లు చరిత్ర తెలియజేస్తుంది.

ఉదా॥ చిన్నచిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళు నాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబులును తేళ్ళు
పలనాటి సీమ పల్లెటూళ్ళు

రాళ్ళు రప్పలతో నిండినది, నాగులేరు ప్రవహించేది, సర్పాలు, తేళ్ళకు ఆవాసమైనది పలనాటి ప్రాంతమని శ్రీనాథుని అభిప్రాయం.

### 7.5.11. శృంగార నైషధము :

సంస్కృతంలో శ్రీహర్షుడు రచించిన హర్షనైషధాన్ని శ్రీనాథుడు తెలుగు అనువాదం చేశాడు. శృంగారనైషధంలో శ్రీనాథుడు తన పాండిత్య ప్రతిభ నంతటిని ప్రవేశ పెట్టాడు. ఈ గ్రంథ రచనా విధానం వలన శ్రీనాథుడు ఒక కవి కంటె ఒక పండితుడని చెప్పవచ్చు. పండితులకు కూడా కొరుకుడు పడని పదజాలాన్ని శృంగారనైషధంలో చొప్పించాడు. అందుకే "నైషధమ్ విద్వదౌషధమ్" అన్నారు సాహితీపరులు.

**అంకితం :**

శృంగారనైషధ గ్రంథాన్ని శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి మంత్రి మామిడి సింగనకు అంకితమిచ్చాడు.

**కవితా విశేషాలు :**

శ్రీనాథుడు తన నిండు యౌవనంలో ఈ గ్రంథం రాశానని తెలిపాడు. "సంతరించితి నిండు జవ్వనంబున యందు హర్షకావ్య మాంధ్రభాష" అన్నాడు. అందుకే గ్రంథం శృంగార రసభూయిష్టంగా మృదు మధురంగా తీర్చిదిద్దబడినది. ఈ గ్రంథం శృంగార రస ప్రాధాన్యం, వర్ణనా ప్రాచుర్యం, శయ్యానైగనిగ్యం వస్త్వైక్యంగల రసవత్తర కావ్యం.

నలుడు నిషధ దేశాధిపతి. కుండినదేశ రాజు కుమార్తె దమయంతి. హంస రాయబారంలో వారిరువురు ఒకరినొకరు చూడకుండానే ప్రేమించుకున్నారు. భీమరాజు దమయంతికి స్వయంవరం ప్రకటించాడు. ఆమెను వివాహమాడటానికి నలుడు ప్రయాణమైనాడు దారిలో దిక్పాలకులు అడ్డగించారు. దమయంతి వారిలో ఎవరినైనా ప్రేమించేటట్లు చేయమని తెలిపారు. ముందుగా మాట ఇవ్వటం వలన నలుడు వారి మాటకు తలవంచాడు. దమయంతి అంతఃపురం చేరడానికి దిక్పాలకులు నలునికి 'తిరస్కరిణీ' విద్య ప్రసాదించారు. ఆ విద్యతో నలుడు దమయంతి అంతఃపురం ప్రవేశించాడు. దిక్పాలకుల అభిప్రాయం వెల్లడించాడు. దమయంతి నిషధరాజును తప్ప ఎవరినీ వివాహమాడనని స్పష్టం చేసింది. హంస కాలి గోరుతో తామరాకుపై వ్రాసిన చిత్రంతో సరిపోలటంవలన వచ్చినవాడు నలుడని తెలిసికొంది. స్వయంవరంలో దమయంతి దిక్పాలకుల మాయను తెలుసుకొని నలుని మెడలో పూలహారం వేసింది. కవి పురుషుడు రాకముందే స్వయంవరం జరిగిపోవడం వలన కవి నలుని పాదాల్లో ప్రవేశించాడు. తత్ఫలితంగా నలుడు రాజ్యం, భార్యను సంతానాన్ని వదిలి వెళ్ళిపోవలసి వచ్చింది. కొన్నాళ్ళకు భీమరాజు దమయంతికి పునర్వివాహం ప్రకిటించాడు. ఈ విషయం తెలిసి ఎక్కడున్నా వస్తాడనే ఆశ కలిగింది దమయంతికి, ఆమె తండ్రికి అట్లే సర్పదష్టుడై విరూపంలో ఉన్న నలుడు అశ్వశాలలో ఉండటం చెలికత్తెలు చూసి దమయంతికి నివేదించారు. దమయంతి, భీమరాజు నలుని గుర్తించి ఆహూతులైన రాజులను మన్నించమని కోరారు. వారంతా నలదమయంతుల పునస్సమాగమం హర్షించారు.

శృంగార నైషధంలో నలదమయంతుల వాక్చాతుర్యం వర్ణనాత్మకమైనది. ధర్మబద్ధమైనది. నలదమయంతుల వివాహ సందర్భంలో భీమరాజు చేసిన వేడుకలు, భోజనాలు అన్నీ శ్రీనాథుడు తన అభిరుచికి తగినట్లు వర్ణించినవే. ఆనాడు రాజకొలువులో నలుడు చేసిన వంటవలన నేటికీ నలపాకమనే ప్రసిద్ధి.

నలుడు దిక్పాలకులనెవరినైనా ప్రేమించమని దమయంతితో పలికాడు. దమయంతి ఉరివేసుకొని మరణిస్తే ఆకాశం పాలించే ఇంద్రుడు, అగ్నికి ఆహుతైతే అగ్నిదేవుడు నీటిలో దూకి మరణిస్తే వరుణదేవుడు ఏ విధంగా మరణించినా యమధర్మరాజు దమయంతిని పొందుతారని ఎవరో ఒకరిని వరింపుమని పట్టుదలగా పలికాడు నలుడు. దిక్పాలకుల మాటల సూదులను గుచ్చుతున్నావని, దేవతలంతటివారు సామాన్య మానవ స్త్రీని ప్రేమించటం ఉచితం కాదని పలికింది దమయంతి. చేతనైతే నలుని గురించి వర్ణింపుమని దానివలన యిప్పటి వరకు పరాయివారిని పొగిడిన పాపం పోతుందని నలుని కోరింది. స్త్రీ సహజమైన

ధర్మోపదేశం దమయంతి పాత్రలో కనిపిస్తుంది.

పేరు చెప్పని నలునితో దమయంతి

"నీ చరితంబు చూడ నతి నిష్ఠురముయ్యెడు లోకపాల దు
ర్వాచక సూచికాంకుర పరంపర దూర్చెడు మాటిమాటికిన్
నా చెవులందు నీకు దగునాయిటు సేయగ దప్పనంటి బా
ధా చరణంబు నైజమగదాతల పోయు గృతాంత దూతకున్"

(శృం. నై. 4 - 81)

అని స్పష్టం చేసింది. దూతగా వచ్చిన వాడు మనసు కష్టపెట్టకూడదు అని ఒక్క మాటలో విస్తృతార్థం తెలిపాడు కవి.

"హస్తములు మోడ్చి వేడెదననఘ నిన్ను
మానుమిట బట్టి యే నీకు మాన్య నేని
పాక శాసన ముఖ్య దిక్పాల వర్య
పాణి పీడన కార్య సంప్రార్థనంబు"

(శృం. నై. 4 - 82)

పాణిపీడనం శ్రీనాథుని కల్పితం. మూలంలో లేదు. వివాహం సుఖం కలిగించేది. పాణి గ్రహణమేకాని పాణి పీడనం కాదని కవి అభిప్రాయం. శ్రీనాథుడు తన కవిత్వంలో ఔచిత్యాన్ని ఆదరించి అనౌచిత్యాన్ని పరిహరిస్తానని స్పష్టంగా చెప్పాడు. శృంగార నైషధ రచనా ప్రాభవం వలన శ్రీనాథుడు కవి లోకంలో అందనంత ఎత్తుకెదిగాడు. శృంగార నైషధంపై శ్రీనాధునికి గాఢాభిమానం. 'ఆంధ్ర భాషా నైషధాబ్జ భవుడు' నని చెప్పుకున్నాడు. అలంకార భూషణం, భావోప లక్షణం, రసపోషణ అమూల్యమైన గద్యపద్యాలు సోదాహరణగా నిరూపించాడు కవి. అందుకే పండితులు 'నైషధమ్ విద్వదౌషధ' మన్నారు.

### 7.5.12. శివరాత్రి మాహాత్మ్యము :

శ్రీనాథుడు పదిహేనవ శతాబ్దికి చెందినవాడు. పెదకోమటి వేమారెడ్డికి ఆస్థాన విద్వాంసుడుగా చాలకాలం ఉన్నాడు. కొండవీడు పాలించిన రాజుల వద్ద మాత్రమే కాక విజయనగరం రాజమహేంద్రవరం పాలించిన రాజుల ప్రశంసను కూడ పొందాడు. శివరాత్రి మాహాత్మ్య గ్రంథం ముమ్మడి శాంతయ్యకు అంకితమీయబడింది.

### అంకితం :

శ్రీనాథుడు రాజమహేంద్రవరం విడిచి వచ్చిన తరువాత శ్రీశైలం దర్శించాడు. శ్రీశైలంలో 'శాంత భిక్షావృత్తి యతీశ్వరుని సందర్శించాడు. ఆ యతీశ్వరుని ఆజ్ఞ చొప్పున శివరాత్రి మహాత్మ్య గ్రంథం రచించి అతని భృత్యుడైన శాంతయ్యకు అంకితమిచ్చాడు. శివరాత్రి మాహాత్మ్యానికి మూలం 'ఈశానసంహిత', "స్కాందంబునం దీశాన సంహితం జెప్పబడ్డ యురులింగోద్భవంబుని శివరాత్రి మాహాత్మ్యంబుని" (శి.మా. 1 - 38) అని శ్రీనాథుడు శివరాత్రి మాహాత్మ్యం మూలకథను స్పష్టం చేశాడు.

### కథా విధానం :

బ్రాహ్మణ కుమారుడు సుకుమారుడు. అతడు జూదం, మద్యం, చండాలికను వివాహం చేసుకోవడం మొదలైన వ్యసనాలకు

బానిసైనాడు. బ్రాహ్మణాచారం మంటగలిపాడు. చివరకు తినడానికి తిండిలేక ఒక శివరాత్రి మహా పర్వదినాన శివాలయం ప్రవేశించాడు. శివబ్రాహ్మణులు జాగరణ చేసి ఆదమరచి ఉన్న సమయం. తెల్లవారబోతుంది. తిండి లేక శుష్కించిన సుకుమారుడు దేవుని నైవేద్యం దొంగిలించబోయాడు. కాలుజారి నందీశ్వరునికి తగిలి తలపగిలి మరణించాడు. అనేక పాపాలు చేసి మరణించిన సుకుమారుని ప్రాణం బంధించి తెమ్మని యమధర్మరాజు భటులను పంపాడు. శివరాత్రి జాగరణ, ఉపవాసం చేసిన కారణంగా శివుడు శివ భటులను పంపి సుకుమారుని కైలాసం తెమ్మన్నాడు. యమభటులు, శివభటులకు యుద్ధం. చివరకు శివభటులు యమభటులను పారద్రోలి సుకుమారుని తీసుకొని కైలాసం చేరారు. సుకుమారుడు కైలాసంలోని శివునికి దండప్రణామం చేశాడు. శివుడు సుకుమారునికి ప్రమథ గణాల్లో స్థానం కల్పించినట్లు కథ.

శివరాత్రి మాహాత్మ్యం పూర్తి శైవ గ్రంథం. ప్రతి మాసం కృష్ణ చతుర్దశిని మాసశివరాత్రి అని, మాఘమాసంలో వచ్చే కృష్ణచతుర్దశినే 'మహాశివరాత్రి' అంటారు. ఇది మహాశివరాత్రి మహిమ తెలియచెప్పే గ్రంథం. ఈశానసంహితలో నిమిత్తమాత్రమైన కథను విస్తృతపరచి శ్రీనాథుడు మహాగ్రంథంగా తీర్చిదిద్దాడు. దీనిలోని సుకుమారుని పాత్ర ప్రాధాన్యమైనది. దురలవాట్ల వలన కలిగే దుష్ప్రభావం, తల్లి బిడ్డపై ప్రేమతో అతని దుర్మార్గం దాచి పెట్టిన విధం, దాని ఫలితంగా ఆమె భర్త చేత పరిత్యజింప బడటం, సుకుమారుని శివస్తుతి మొదలైన ఘట్టాలు దీనిలో పొందు పరచబడినాయి. ఇంకా ఈ గ్రంథంలో పంటలు, పక్షులు, చలి, గంధవహుడు, మకర సంక్రాంతి, కాశి మొదలు రాజమహేంద్రం వరకు గల పుణ్యక్షేత్రాల ప్రస్తావన, కర్ణాట తాటంకిని, దాక్షారామ భీమేశ్వరుడు, పాశుపతులు, కాలాముఖులు, జటాధారులు, పరివ్రాట్టులు మొదలైన అనేక అంశాలు వివరింపబడినాయి.

### 7.5.13. హరవిలాసము :

'హరవిలాసము' గ్రంథాన్ని శ్రీనాథుడు రచించాడు. ఇతి శ్రీనాథుని స్వతంత్ర కావ్యం. ఏడు ఆశ్వాసాల ప్రబంధం. కాశీఖండం తరువాత రచింపబడింది. శివుని విలాసాలు తెలిపే కావ్యం. ఈ గ్రంథంలో సిరియాళుని చరిత్ర, గౌరీ కళ్యాణం, పార్వతీ పరమేశ్వరుల దారుకా వనవిహారం, హాలాహల భక్షణం కిరాతార్జునీయం అనే కథలు వర్ణింపబడినాయి.

### అంకితం :

వేమారెడ్డి కుమారుడు అనపోతారెడ్డి మరణానంతరం కొమరగిరి ప్రభువు రాజ్యమేలాడు. కొమరగిరి రాజు కాలంలోనివాడు అవచి తిప్పయసెట్టి. అతడు సుగంథ భాండాగారాధ్యక్షుడు. అవచి తిప్పయసెట్టి శ్రీనాథునికి బాల్య స్నేహితుడు. శ్రీనాథుడు హరవిలాసాన్ని అవచి తిప్పయసెట్టికి అంకితమిచ్చాడు.

### కవితా విశేషాలు :

హరవిలాసంలో శ్రీనాథుడు ఇతర కవిస్తుతి కాని కు కవినింద కాని చేయలేదు. శృంగార నైషధం కాశీఖండాల వలె సంస్కృత భాషాంతరీ కరణం కాదు. సంస్కృత ఆంధ్ర పదాలతో అలంకరింపబడిన గ్రంథం. వీరశైవులైన చిరుతొండ నంబి, తిరు వెంగనాంబి తమ కుమారుడు సిరియాళుడు. ఆ బాలుని వధించి శరీర మాంసాన్ని కపట జంగములైన పార్వతీ పరమేశ్వరులకు అర్పించిన విధం మొదటి రెండు ఆశ్వాసాల్లో వర్ణింపబడింది. దక్షుని కుమార్తె సతీదేవి యోగ మార్గంలో శరీరం వదిలేసింది. తిరిగి హిమవంతునికి మేనకకు జన్మించింది. ఆమె తల్లిదండ్రుల అనుమతితో తపసు ప్రారంభించింది. జయవిజయలు తోడు వచ్చారు. పార్వతి కాలానుగుణమైన కఠోర తపసు చేసింది. ఆమె తపసు పరమేశ్వరుని గురించి. పరమేశుడు బ్రాహ్మణ వేషంలో వచ్చి తపసు మానుకోమన్నాడు. పార్వతి తన తపసు శివుని కొరకేనని నొక్కివక్కాణించింది. సంతోషించిన పరమేశ్వరుడు ప్రత్యక్షమైనాడు.

"సాక్షాత్కారముజెంది నవ్వుచు గరీశానుండు ధాత్రీధరా
ధ్యక్షా పత్యము ప్రేమ నిర్భర కటాక్షా లోకన ప్రౌఢిమన్
వీక్షించెన్ ధరళాక్షియున్మనమున వ్రీడా ప్రమోదక్షమా
దాక్షిణ్యంబులు సందడింప నికిచెంద త్సన్నిధానంబునన్"

(హరవిలాసము 4 - 36)

పార్వతి తన తండ్రి సన్నిధానంలో వివాహం నిర్ణయింపబడుతుందని జయవిజయల చేత శివునికి చెప్పించింది. వివాహానంతరం శివపార్వతున వనవిహారం శృంగార రస రమ్యంగా వర్ణించాడు శ్రీనాథుడు. ఆరవ ఆశ్వాసం హాలాహల భక్షణం. దేవలోకానికి వచ్చిన దూర్వాసునికి అప్సరస పుష్పమాల సమర్పించింది. దూర్వాసుడు దానిని ఇంద్రునికి బహూకరించాడు. ఇంద్రుడు ఆ మాలను ఐరావతం మెడలో వేశాడు. జంతు స్వభావం చేత ఐరావతం మాలను చిందరవందర చేసింది. అది చూసి దూర్వాసుడు శపించాడు. దేవలోక ఐశ్వర్యమంతా సముద్రంలో కలుస్తుందని శాపమిచ్చాడు. దాని ఫలితమే దేవదానవుల సముద్రమధనం. హాలాహహం ఉద్భవించింది.

"కటుకమగు విషము విషధర
కటకంబగు కేలబూని కౌతూహలియై
ఘటికా సంసిద్ధుడు రస
ఘటిక యునుంబోలె మృడుడు గుటుకున మ్రింగెన్"

(హరవిలాసము 6 - 70)

శివుడు విషాన్ని రసగుళిక వలె మ్రింగి లోకాలను రక్షించాడు. సప్తమాశ్వాసం కిరాతార్జునుల యుద్ధం తెలిపే ఘట్టం. అర్జునుడు ఇంద్రకీల పర్వతంపై పాశుపతాస్త్రం కొరకు తపసు చేస్తున్నాడు. శివపార్వతులు బోయన వేషంలో తపోవన ప్రాంతానికి వచ్చారు. క్రూరమైన సూకరం మీదికి రాబోతుంటే అర్జునుడు ప్రాణ రక్షణ కొరకు బాణం ప్రయోగించాడు. అదే సమయంలో శివుడు వేట నెపంతో సూకరంపై బాణం వేశాడు. శివుడు అర్జునుడు వేసిన బాణానికి కోపించాడు. తాపసి వేటాడవచ్చునా అని ప్రశ్నించాడు. ప్రాణ రక్షణ కొరకు బాణం వదిలానని అర్జునుడు సమాధానం చెప్పాడు. ఇద్దరికి వాదం పెరిగింది. యుద్ధానికి సన్నద్ధులైనారు. కొంత భీకరపోరు తరువాత అర్జునుని అమ్ములపొదిలో బాణాలు మాయమైనాయి. అర్జునుడు పట్టువదలక ఉపతీయి, తోరహత్తం, సీసం, డొక్కరం, మొదలైన మల్ల యుద్ధం చేశాడు. శివుడు అర్జునుని పరాక్రమానికి సంతసించాడు. తన నిజ స్వరూపం చూపాడు. అర్జునుడు శివునికి అమ్మవారికి నతులనుతులు చేశాడు. అర్జునుని కోరిక మేరకు శివుడు పాశుపతాస్త్రం ఉపదేశించాడు. పార్వతి అక్షయబాణ తూణీరాలిచ్చింది. కిన్నర కింపురుష గరుడ గంధర్వ విద్యాధరులు తమతమ దివ్యాయుధాలు అర్జునునికి ప్రసాదించారు. ఇంద్రుడు వజ్రాయుధం ఇచ్చాడు. దేవతలంతా తమతమ నివాసాలకు, పార్వతీపరమేశ్వరులు కైలాసానికి అంతర్ధానమైనారు.

హరవిలాసం పూర్తిగా శివలీలలు తెలియచేసే శైవగ్రంథం. మృదు మధురమైన శైలి. కాశీఖండం, భీమేశ్వర పురాణం మొదలైన అనువాత గ్రంథాలకంటె విలక్షణమైన గ్రంథం హరవిలాసము.

## 7.6. రాదగిన ప్రశ్నలు :

1. శ్రీనాథుని జీవిత విశేషాలను తెలియజేయండి.
2. శ్రీనాథుని కవితా వైశిష్ట్యమునుగ్గడింపునది.
3. హరవిలాసంలోని అనువాద వైశిష్ట్యంను తెలియజేయండి.
4. శృంగార నైషధంలోని అనువాద వైశిష్ట్యం తెలియజేయండి.
5. పలనాటి వీరచరిత్ర రచనా వైఖరిని తెలపండి.
6. శ్రీనాథుని కావ్యాలను విశ్లేషించండి.

## 7.7. ఆధార గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి | ఖండవల్లి లక్ష్మీరంజనం, ఖండవల్లి బాలేందు శేఖరం |
| 2. | కాశీఖండము | శ్రీనాథుడు |
| 3. | చాటు పద్యమణిమంజరి | వేటూరి ప్రభాకరశాస్త్రి |
| 4. | తెలుగు వీరగాథా కవిత్వము | డా॥ తాగిరాల వేంకట సుబ్బారావు |
| 5. | భీమేశ్వర పురాణము | శ్రీనాథుడు |
| 6. | శృంగార నైషధము | శ్రీనాథుడు |
| 7. | శివరాత్రి మాహాత్మ్యము | శ్రీనాథుడు |
| 8. | శ్రీమధ్భాగవత ప్రకాశము | ఎక్కిరాల కృష్ణమాచార్యులు |
| 9. | శ్రీనాథుడు చారిత్రక విభాగము | డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి |
| 10. | శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము | డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ |
| 11. | సమగ్ర ఆంధ్ర సాహిత్యము (సంపుటాలు) | ఆరుద్ర |
| 12. | హరవిలాసము | శ్రీనాథుడు |



డాక్టర్ యం. కమల
లెక్చరర్
సి. ఆర్. కాలేజి
చిలకలూరిపేట

పాఠం - 8

# బమ్మెర పోతన

8.1 లక్ష్యం
8.2 జీవిత విశేషాలు
8.3 సాహిత్య జీవతం
8.4 భాగవతం
8.5 విక్రమార్క చరిత్ర
8.6 శృంగార శాకుంతలము
8.7 నాసికేతోపాఖ్యానము
8.8 భోజరాజీయము
8.9 రాదగిన ప్రశ్నలు
8.10 ఆధారగ్రంథాలు

## 8.1 లక్ష్యం :

బమ్మెర పోతన జీవిత విశేషాలు, సాహిత్య జీవితం, భాగవత రచనా వైశిష్ట్యం తెలుసుకుంటారు. అలాగే జక్కన విక్రమార్క చరిత్ర, పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార శాకుంతలము, దగ్గుపల్లి దుగ్గన నాసికేతోపాఖ్యానము, అనంతామాత్యుని భోజరాజీయము గూర్చి తెలుసుకుంటారు.

## 8.2 జీవిత విశేషాలు :

బమ్మెర వంశస్థుడు బమ్మెర పోతనామాత్యుడు. పదిహేనవ శతాబ్దంలో జీవించిన భక్తకవి. వ్యాస భాగవతాన్ని ఆంధ్రీకరించాడు.

### 8.2.1. తల్లిదండ్రులు :

పోతన తల్లి లక్కమాంబ. తండ్రి కేసన. పోతన గారిది కౌండిన్యస గోత్రం. ఆపస్తంబ సూత్రుడు. పోతన గురువు ఇవటూరి సోమనాథారాధ్యుడు.

#### పోతన నివాసం, కాలం :

పోతన కాలం వివాదాస్పదం. పదిహేనవ శతాబ్దం పూర్వ భాగమని శ్రీనాథునికి సమకాలీకుడని విమర్శకులు చివరకు నిర్ణయించారు. పోతన ఓరుగల్లు సమీపంలోని ఒంటిమిట్ట నివాసి. పోతన స్కంధాంత గద్యాలలో "ఇది శ్రీ పరమేశ్వర కరుణా కవిత కవితావిచిత్ర కేతన మంత్రి పుత్ర సహజ పాండిత్య పోతనామాత్య" అని చెప్పుకున్నాడు. పోతన మొదట వీరశైవ కుటుంబానిని చెందిన వాడు. రానురాను హరిహరులకు సమాన ప్రాముఖ్యమిచ్చాడు. పోతన భోగినీ దండకము, వీరభద్ర విజయము నారాయణ శతకము, భాగవతం ఆంధ్రీకరణ రచనలు చేశాడు.

## 8.2.2. అంకితం :

పోతన భాగవతాన్ని శ్రీహరికి మాత్రమే అంకితమిచ్చానన్నాడు. పీతవస్త్రపరిధాయకి, పద్మభవాండభాండనిర్మాయికి, శేషశాయికి శ్రీమహాభాగవతం సమర్పించాడు.

"ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
సమ్మెట పోటులంబడక సమ్మతి శ్రీహరికిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితాంబుగన్"

(శ్రీమహాభాగవతం 1 - 11)

పోతన తన గ్రంథాన్ని అధములైన రాజులకిచ్చి పురాలు, వాహనాలు, ధనం తీసుకోవటం ఇష్టం లేదన్నాడు. సామాన్యంగా కవులు తమ కావ్యాలను ఆ కాలంలోని రాజులకు అంకితమివ్వటం ఆచారం. పోతన ఆ ఆచారం తనకు నరకప్రాయమని స్పష్టం చేశాడు. తెల్లని కన్నులు, విశాలమైన వక్షం రాజలాంఛనాలు గలిగిన శ్రీరాముడే దర్శనమిచ్చి గ్రంథం రాయమని ఆదేశిస్తే మానవులకు అంకితమివ్వడాని పోతన ఇష్టపడతాడా. ఇష్టపడడు. శ్రీరామచంద్రునికే పోతన భాగవతం అంకితం చేశాడు. పోతన దృష్టిలో రాముడు కృష్ణుడు ఇద్దరూ సమానమే.

## 8.2.3. వ్యాస భాగవత రచనకు ప్రేరేపణ :

వ్యాసమహర్షి వేదాలు విభజించాడు. పురాణాలు రచించాడు. ఇంక తాను చేసేపని ఏమిటని వేదన పడుతున్నాడు. ఆ సమయంలో నారదుడు వచ్చి వ్యాసుని విచారం తెలుసుకున్నాడు. వ్యాసునితో, వ్యాసమహర్షీ నీవు భాగవంతుని చరిత్ర విపులంగాను వివరంగాను రచించలేదు. అలంకార యుక్తంగా ఎన్ని రచనలు చేసినా శ్రీకృష్ణ మహిమ వర్ణించకపోతే అంతా వ్యర్థమని పలికాడు.

"నైష్కర్మ్య మప్యచ్యుత భావవర్జితాం
నశోభతే జ్ఞానమలం నిరంజనమ్
కుతః పునశ్శశ్వద భద్ర మోశ్వరే
న చార్పితం కర్మ యదప్య కారణమ్"

(శ్రీమద్భాగవతము - వచనం - దాశరధి రంగాచార్య - 5వ పుట)

నిష్కర్మ నిరంజనమైన జ్ఞానం భగవద్భక్తి లేకపోతే వర్జింప బడుతుంది. కామ్య కర్మలు భక్తితో భగవంతున కర్పింపకపోతే ప్రకాశింపవని నారదుడు వ్యాసునికి తెలిపాడు. దాని ఫలితమే వ్యాసుడు రచించిన శ్రీభాగవతము. సంస్కృత భాగవతాన్ని పోతన తెలుగులో అనువదించాడు. సంస్కృత భాగవతం పన్నెండు స్కంధాలుగా విభజింపబడింది. పద్దెనిమిది వేల శ్లోకాలు గలది. పరీక్షిత్తుకు భాగవతం వినిపింప గోరాడు శ్రీశుకుడు. దేవతలు అమృతభాండాన్ని తెచ్చి దానిని తీసుకొని భాగవతం యిమ్మన్నారటి. కాని శ్రీశుకుడీయలేదు. అంతటి మహిమగల భాగవతాన్ని పోతన ఆంధ్రులకు అందించాడు. అది తన పురాకృత సుకృతమని పోతనామాత్యుడు భావించాడు. భాగవత కథామృతాన్ని గ్రోలి పరీక్షిత్తు మోక్షం పొందాడు.

## 8.3. పోతన సాహిత్య జీవితం :

ఒకనాడు పోతన స్నానంచేసి మహేశ్వర ధ్యానం చేస్తు ఉన్మీకితలోచనుడై ఉన్నాడు. ఆ సమయంలో రాజచిహ్నాలుగల

రామభద్రుడు దర్శనమిచ్చాడు. కనిపించి పోతనతో భాగవతం రచింపమని చెప్పాడట.

"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్విన్ బురాణావళుల్
దెనుగున్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జన్మంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు లేకుండగన్"

(భాగవతము 1 - 16)

అని వివరించాడు పోతన. జన్మరాహిత్యం కొరకు పోతన ఈ విషయాన్నే మరల చక్కగా వివరించాడు.

"పలికెడిది భాగవతమట పలికించు విభుండు రామభద్రుండట
నే పలికిన భవహరమగునట పలికెద వేరొండు గాథ బలుకగనేలా"

అని స్పష్టంగా చెప్పాడు. పోతన శివభక్తుడు. తాను రచించేది భాగవతం. భాగవతం రచింపమని ఆదేశించింది శ్రీరామ భద్రుడు. కాబట్టి తాను చెప్పేదంతా భవునికే చెందుతుందని వివరించాడు.

పోతన సహజ పాండిత్యం కలవాడు. తెలుగు భాగవతం కూడ మొత్తం పన్నెండు స్కంధాలు. కాని వీనిలో ఐదవ స్కంధం పూరించింది బొప్పనామాత్యుని పుత్రుడు గంగనార్యుడు. స్కంధాంత గద్యంలో ఈతని గురించి ఇంతకంటె ఎక్కువ చెప్పలేదు. ఏకాదశ, ద్వాదశ స్కంధాలు రచించింది వెలిగందుల నారయ. ఇతడు పోతనకు ప్రియ శిష్యుడనని చెప్పుకున్నాడు.

నారయ అనువాదం పోతన అనువాదం కంటే భిన్నంగా విశిష్టాద్వైత విధంగా ఉంటుంది. నారయ పూర్వులు కరీంనగర మండలం వెలిగందల కావటం చేత వెలిగందల ఇంటి పేరైంది. షష్ఠ స్కంధం ఏర్చూరి సింగయామాత్యుడు రచించాడు. షష్ఠ స్కంధం ఖిలమై పోయినట్లు చెప్పక పోతనవలె సింగన రాశాడు. శ్రీకృష్ణునికి అంకితంగానే షష్ఠ స్కంధం రచింపబడింది.

పోతన ప్రథమ స్కంధం ప్రథమ పాదంలోనే

"శ్రీ కైవల్య పదంబు జేరుటకునై జింతించెదన్"

అని తన మనసులో మాట చెప్పి గ్రంథం ప్రారంభించాడు. ఇష్ట దేవతా స్తుతి చేసి తన పూర్వజన్మ పుణ్యఫలం వలన శ్రీమన్నారాయణ కథాప్రపంశం రచించి తన జన్మ సఫలం చేసుకుంటానని స్పష్టం చేశాడు పోతన. నన్నయ తిక్కనాది కవులు భాగవతం తెలుగు చేయలేది. అలా చేయకపోవటం తన సుకృతమని భావించాడు. ఇక రచనా విధానాన్ని చెబుతూ కొందరు సంస్కృతాన్ని ఇష్టపడతారు. మరి కొందరికి తెలుగు ఇష్టం. ఇంకొందరు సంస్కృతం తెలుగు రెంటిని ఇష్టపడతారు. పోతన మాత్రం తన కవితా గుణం చేత అందరిని మెప్పిస్తానని పలికాడు.

"కొందరికి తెలుగు గుణమగు
గొందరికి సంస్కృతంబు గుణమగు రెండున్
గొందరికి గుణమగునే
నందర మెప్పింతు గృతులనయ్యెయెడలన్"

(భాగవతము 1 - 18)

### 8.3.1. రచనా విధానం :

పోతన వ్యాసుడు, శ్రీశుకుడు, బాణుడు, మయూరుడు, కాళిదాసు, భారవి, మాఘుడు, మొదలైన సంస్కృత కవులకు వినయంగా నమస్కరించాడు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలకు ప్రణతులర్పించాడు. వర్తమాన కవులకు ప్రియం పలికాడు. భావి కవులను బహూకరించాడు. పోతన నాచన సోమన, నన్నెచోడులను తన కవితా శైలిలో అనుకరించానన్నాడు. పోతన సంస్కృతం తెలుగు పదాలు సమానంగా ఉపయోగించాడు. సీసపద్యాల తరువాత పోతన ఎక్కువ ఆటవెలది పద్యాలు రాశాడు. శబ్దాలంకారాలు విరివిగా వాడుకున్నాడు. వృత్యాను ప్రాసలో రాసిన పద్యాలు కోకొల్లలు. అంత్యప్రాస ఇష్టపడతాడు.

భాగవతానికి 'హయగ్రీవ బ్రహ్మవిద్య' అనే పేరుంది. ఈ పురాణాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. దానినే పోతరాజు ఈ విధంగా చెప్పాడు.

"భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు
శూలికైన దమ్మి చూలికైన
విబుధ వరుల వలన విన్నంత కన్నంత
తెలియ వచ్చినంత తేటపరతు"

(శ్రీ మహాభాగవతము 1 - 17)

పై పద్యం వలన తాను తెలుసుకున్నది, పెద్దల వలన విన్నది తెలియజేస్తానని పాఠకులకు సవినయంగా వివరించాడు.

"లలిత స్కందము గృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమన సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలియున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్విజ శ్రేయమై"

(శ్రీ మహాభాగవతము 1 - 20)

భాగవతాన్ని పోతన ఒక దేవతా కల్పవృక్షంగా భావించి పై పద్యం చెప్పాడు.

### 8.3.2. కృతులు :

పోతన కాలంలో రాచకొండనేలే సర్వజ్ఞ సింగభూపాలుడు రసికుడు. అతడొకనాడు 'గోపాల దేవోత్సవంలో పాల్గొన్నాడు. అతనిని ఒక వారకాంత చూసి మోహించింది. ఆమె తల్లిని తిట్టి బతిమాలి శపించి సింగభూపాలుని తీసుకురమ్మని ప్రాధేయపడింది. చివరకు రాజు వచ్చి వేశ్యను ఏలుకున్నాడు. రాజాశ్రయంలో సానివాడలో ఆమెకు సమాన ప్రతిపత్తి కల్పించాడు. పోతన ఈ విషయాలన్నీ ఒక దండకంలో రాశాడు. ఆ గ్రంథమే 'భగినీ దండకము'. ఇది శృంగార రసభూయిష్ఠమైన రచన. పోతన నాలుగాశ్వాసాల కావ్యం వీరభద్ర విజయం.

దీనిలో దక్ష యజ్ఞ సందర్భంలో సతీదేవి మరణిస్తుంది. వీరభద్రుడు అవతరించాడు. దక్షుడు మరో మన్వంతరంలో యజ్ఞం చేసి శివ నింద చేస్తాడు. అప్పుడు శివుడు మళ్ళీ వీరభద్రుని పుట్టించి యుద్ధానికి పంపుతాడు. ఈ రెండు యజ్ఞాల మధ్య పార్వతి పుట్టడం, శివుని తపసు కామదహనం, పార్వతి తపసును కపట బ్రహ్మచారు వేషంలో వచ్చి ఆమెని పరీక్షించడం, సప్తర్షులను పిలిపించి పార్వతి పరమేశ్వరుల వివాహం మొదలైన అంశాలున్నాయి వీరభద్ర విజయము కావ్యంలో.

పోతన తన గ్రంథాలను రాజులకు అంకితమిస్తాడైమోనని సరస్వతి కళ్ళనీళ్ళు పెట్టుకొంటే పోతన ఆమెను ఊరడించాడనే కథ లోకంలో ప్రచారంగా ఉంది.

"కాటుక కంటినీరు చనుకట్టు పయింబడనేల యేడ్చెదో
కైటభదైత్య మర్దనుని గాదిలి గోడల యోమదంబ
యోహాటక గర్భురాణీ నిను నా కటికిం గొని పోయి యల్ల క
ర్నాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ"

పోతన కాలంలోని కీచకుల వంటి రాజులకు అమ్మనని సరస్వతికి మాట ఇచ్చినట్లు కథనం. భాగవతం ఆదిలోనే మనుజేశ్వ రాధముల కిచ్చి పురాలు వాహనాలు ధనం తీసుకోనని కవి స్పష్టంచేశాడు. పోతన కోరినది గ్రంథం మొదలు చివర కైవల్యమేనని స్పష్టం చేశాడు. భగవంతుని అదే ప్రార్థించాడు. పోతన దారిద్ర్యాన్ని అనుభవించాడంటారు పండితులు. అతడు వ్యవసాయం చేసి జీవించాడంటారు. పోతన శ్రీనాథుని వలె శృంగార ప్రియుడు కాదు. తన కెల్లప్పుడు భగవంతుని చింత. శ్రీ కైవల్య పదము చేరడానికి చింతిస్తూ వుంటాడని అనేక చోట్ల చెప్పాడు. గ్రంథం చివరి వరకు అదే మాట నిలబెట్టుకున్న భక్తిపరుడు. కూచిమంచి తిమ్మకవి "అమ్మహాత్ము కవిత నెందును లోపమ్ము కలుగదభవ" అన్నట్లు పోతన కవిత్వంలో ఎక్కడా లోపంలేదు. ఆతని రచనా విధానం సహజ సుందరం గాను, గంగా ప్రవాహం వంటి కమ్మని రుచి గలది. భోగాలు ఆశించని నిరాడంబరుడు పోతన.

## 8.4. భాగవతం :

సమస్త వేదాంత విద్యా రహస్యనిధి, సహజ పాండిత్య విశారదుడు, పటుతర కవితా విజ్ఞాని బమ్మెర పోతన. ఆంధ్ర ప్రజలు అభిమానించే భక్త కవి. తన గ్రంధాలు రాజులకు అంకిత మిచ్చి పురాలు, వాహనాలు, సొమ్ములు తీసుకోనని ప్రతిజ్ఞ చేసిన ఏకైక కవిశ్రేష్ఠుడు. వ్యాస భాగవతాన్ని తెలుగులో అనువదించి తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన పరమభక్తుడు. భాగవతంలో భక్తి కలదని వేరే చెప్పవలసిన పని లేదు. భాగవతం అంటేనే భగవంతుని లీలలు వర్ణించేది. భాగవత రచన ఆది నుండి అంతం వరకు భగవంతుని భరించి, తరించిన కవి బమ్మెర పోతన.

వ్యాస మహర్షి సంస్కృతంలో భాగవతాన్ని రచించి శుకునికి వినిపించాడు. శుకుని ముఖం నుండి జాలువారిన అమృత ప్రవాహం భాగవతం. భాగవతం మోక్ష శాస్త్రం. భగవద్రూపం. కలియుగంలో దీనిని పఠించినా విన్నా ముక్తి చేకూరుతుంది. శ్రీ శుకుడు పరీక్షన్మహారాజుకు వినిపించిన ఈ భాగవతాన్ని పోతన ఆంధ్రుల పాలిట కల్ప వృక్షం వలె అనువాదం చేశాడు. భాగవతమే కల్పవృక్షమన్నాడు పోతన.

"లలిత స్కందముగృష్ణ మూలము శుకాలాపాభి రామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమన స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై
వెలయన్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్ద్విజ శ్రేయమై"

(శ్రీ మహాభాగవతము 1 - 20)

శ్రీ కృష్ణుడే మూలంగా గల భాగవతం శుకుడు ఆలపించాడు. కల్పవృక్షం వంటిదని పోతన వివరించాడు. పోతన తొలుత శివభక్తుడు. పోతనకు ధ్యానంలో శ్రీరాముడు సాక్షాత్కరించాడు. భాగవతం రాయమన్నాడు. ఇది శ్రీకృష్ణుని దివ్యలీలలు తెలిపే గ్రంథం. అగ్ని ఒక్కడై అనేక విధాలుగా తేజరిల్లునట్లు విశ్వాత్మకుడైన పురుషుడొక్కడే సమస్త భూతాకారాలు తాల్చినవాడు.

లోకకర్త అయిన ఆ విశ్వవ్యాపి దేవతలు, తిర్యక్కులు, మానవులు మొదలైన జాతుల రూపంలో ఆవరించి ఉన్నాడు. లోకాలను రక్షిస్తున్నాడని పోతన వివరించాడు. పోతన మనసులో శివుడు, కేశవుడు అనే భేదాలు లేవు. చిన్ననాటి ఆటలు ఆడుకుంటున్న శ్రీకృష్ణుని శివునితో పోలుస్తూ ఒక చక్కని పద్యం చెప్పాడు.

"తనువున నంటిన ధరణీ పరాగంబు పూసిన నెఱి భూతిపూతగాగ
ముందర వెలుగొందు ముక్తాలలాంబు తొగల సంగడి కాని తుమక గాగ
ఫాలభాగంబుపై బరగు కావిరి బొట్టు కాముని గెల్చిన కన్నుగాగ
కంఠమాలిక లోని ఘననీల రత్నంబు కమనీయ మగుయెడ కప్పుగాగ

హారవల్లు లురగ హారవల్లులు గాగ
బాలలీల ప్రౌఢ బాలకుండు
శివుని పగిది నొప్పె శివునికి దనకును
వేఱులేమి దెల్ప వెలయునట్లు"

(శ్రీ మహాభాగవతము 10 - 296)

శ్రీకృష్ణుని వంటినంటిన మట్టి విభూతిలా ఉంది. నెత్తిన ఉన్న ముత్యాల దండ చంద్రవంకలా ఉంది. నుదుటి బొట్టు మూడవ కన్నువలె ఉంది. మెడలోని హారం లోని నీలం వల్ల కంఠం నీలంగా ఉంది. మిగిలిన హారాలన్ని పాములవలె భాసిస్తున్నాయి కలికి. 'నే పలికిన భవహరమగునట' అని ముందే చెప్పాడు పోతన. పోతనకు సాక్షాత్కరించిన కోదండ రామునికే భాగవతం అంకితమిచ్చాడు. నన్నయ, తిక్కనాదులు భాగవతాన్ని తెనిగించకుండా ఉండటం తన భాగ్యమని భావించాడు కవి.

భాగవతం ప్రథమ స్కంధంలో విశ్వాత్మకుని రూపం పోతన మనసులో స్థిరపరచుకున్నాడు.

"హరినామ స్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజహంసావళీ
సురుచి భ్రాజితమైన మానససర స్ఫూర్తిన్ వెలుగొందు శ్రీ
హరినామ స్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబ య్యు శ్రీ
కరమై యుండ దయోగ్య దుర్మదనద త్కాకోల గర్తాకృతిన్"

(శ్రీ మహాభాగవతము 1 - 94)

## 8.4.1. భక్తితత్త్వం :

హరినామస్తుతి లేని కావ్యం పవిత్రమైన నదిలో కాలకూటం ఉన్నట్లే ఉంటుంది. భాగవతం భక్తికి ఆలవాలమైన గ్రంథం. భక్తి తొమ్మిది మార్గాలని పోతన వివరించాడు. ఈ తొమ్మిది మార్గాలలో భక్తికి బోధించడానికి భాగవతంలో ఉపాఖ్యానాలు రాయబడినాయి.

"తను హృద్ భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం
బనునీ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మిను
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ దైత్యోత్తమా"

(శ్రీ మహాభాగవతము 7 - 167)

భక్తి మార్గాలు తొమ్మిది. 1. సఖ్యము, 2. శ్రవణము, 3. దాసత్వము, 4. వందనము, 5. అర్చనము, 6. సేవ, 7. ఆత్మలో ఎరుక, 8. సంకీర్తన, 9. చింతన.

**8.4.2. సఖ్యభక్తి :**

స్నేహభావంతో కలిగిన భక్తి సఖ్యభక్తి. కుచేలుడు శ్రీకృష్ణునికి సహాధ్యాయి. బలరాముడు, కృష్ణుడు, కుచేసుడు సాందీపని వద్ద విద్యాభ్యాసం చేశారు. కుచేలుడు శ్రీకృష్ణుని యందు స్నేహ పూర్వకమైన భక్తి కలిగినవాడు. దరిద్రంచేత జీర్ణించిన వస్త్రం ధరించటం వలన కుచేలుడన్నారు. అతడు సుధాముడు. కుచేలుడు సంసార బాధలు భరిస్తూ భార్య ప్రేరేపణతో శ్రీకృష్ణుని వద్దకు ద్వారకా నగరం బయలుదేరాడు శ్రీకృష్ణునకు కానుకగా కుచేలుని భార్య కొన్ని పృథుక తండులాలను యిచ్చింది.

ద్వారకానగరం ప్రవేశిస్తూనే కుచేలుడు శ్రీకృష్ణుని వైభవాన్ని, రూపలావణ్య విశేషాలను తలుచుకుంటున్నాడు. ద్వారక ప్రవేశించిన కుచేలునికి కృష్ణుడెదురేగి తీసుకొని వచ్చి తన తల్పంపై కూర్చుండబెట్టాడు.

"అట్లు కూర్చుండబెట్టి నెయ్యమున గనక
కల్మసకిలంబుచే గాళ్ళు గడగి భక్తి
దజ్జలంబులు దనదు మస్తకమున దాల్చి
లలిత మృగమదసార మిళితమైన"

(శ్రీ మహాభాగవతము 10 - 978)

శ్రీ కృష్ణుడు కుచేలుని పాదప్రక్షాళన చేసి అర్ఘ్యం సమర్పించి కస్తూరి ఘనసారంతో మిళితమైన తాంబూలం సమర్పించాడు. స్నేహభావం చేత శ్రీకృష్ణుడు కుచేలుని కిచ్చే గౌరవం చూచి శుద్ధాంత కాంతా జనం. ఈ బ్రాహ్మణుడు పూర్వజన్మలో ఏ తపస్సు చేశాడోగదా అని ఆశ్చర్యపోయారు. కృష్ణుడు కుచేలుని భార్యాబిడ్డల క్షేమం తెలుసుకున్నాడు. బాల్యంలో సాందీపని ఆశ్రమంలో జరిగిన విశేషాలు స్నేహితులిద్దరు నెమరు వేసుకున్నారు. కృష్ణుని స్నేహపూర్వకమైన మర్యాదలకు కుచేలుని శరీరం పులకించింది. ఆనంద బాష్పాలు జడిగొన్నాయి. సఖ్య భక్తికి అర్జునుడు పరాకాష్ట అని చెప్పవచ్చు.

**8.4.3. శ్రవణము :**

భక్తికి మరో లక్షణం శ్రవణం. భగవంతుని కథలు వినటం. శుకుడు పరీక్షితుకు భాగవత కథ వినటం సర్వ శ్రేష్టమని తెలిపాడు.

"విష్ణు కీర్తనములు వినని కర్ణంబులు కొండల చిలములు కువల యేశ
చక్రి పద్యంబులు జదువని జిహ్వాలు కప్పల జిహ్వాలు కౌరవేంద్ర
శ్రీ మనోనాథు వీక్షింపని కన్నులు కేకి పింఛాక్షులు కీర్తిదయిత
కమలాక్షు పూజకు గాని హస్తంబులు శవముపస్తంబులు సత్యవచన

హరి పదతులసీదళామోద రతిలేని
ముక్కు పంది ముక్కు ముని చరిత్ర
గరుడ గమను భజనగతి లేని పదములు
పాదపముల పాద పటల మనఘ"

(శ్రీ మహాభాగవతము 2 - 50)

### 8.4.4. దాసత్వము :

భగవంతునికి దాస్యం చేయటం దాసత్వం. అంబరీషుడు సంవత్సం పాటు తన భార్యతో కలిసి ద్వాదశీ వ్రతం ఆచరించాడు. "కార్తీక మాసంబున మూడు రాత్రులుపవసించి, కాళిందీ జలంబుల సుస్నాతుడై మధువనంబున మహాభిషేక విధానంబు నవిహిత పరికర సంపన్నుండై హరి నభిషేకంబు సేసి, మనోహరంబులైన గంధాక్షతంబులు సమర్పించి నభినమోవాదంబులైన పుష్పంబులం బూజించి" (శ్రీ మహాభాగవతము 9 - 91) సేవించినవాడు. అంబరీషుని మనసు పరమేశ్వర పాదాలపైన అతని పలుకులు విష్ణునామ పఠనంలోను చూపులు గోవింది రూప వీక్షణంలోను నిమగ్నమైనాయి.

"అళని కోహమానె హరులందు గదులందు
ధనములందు గేళి వనములందు
బుత్రులందు బంధుమిత్రుల యందును
బురమునందు నంతి పురము నందు"

(శ్రీ మహాభాగవతము 9 - 88)

విష్ణుసేవకుడైన అంబరీషుడు పుత్రులు, బంధుమిత్రులు ధనం మీద ఆశ లేకుండా సేవించాడు. శ్రీకృష్ణుడు కంసుని పిలుపవీ మేరకు మధురానగరం ప్రవేశించాడు. సుదాముడనే మాలాకారుడు బలరామ కృష్ణులకు అర్ఘ్యపాద్యాలు, తాంబూల కుసుమ గంధాలిచ్చి సేవించాడు. సుదాముడు శ్రీకృష్ణుని పాదకమల సేవ ప్రసాదింపుమని ప్రార్థించాడు. కుబ్జ బలరామ కృష్ణులకు నానావిధ పరిమళ లేపనాలిచ్చి శ్రీకృష్ణుని తన గృహానికి ఆహ్వానించింది.

### 8.4.5. వందనము :

రుద్రాక్షలు, భూతి, కృష్ణాజనం ధరించిన ముని సంఘం శ్రీకృష్ణుని దర్శించడానికి ద్వారక ప్రవేశించారు. విశ్వామిత్ర, అసిత, కణ్వ, దూర్వాసుడు, భృగువు, అంగీరసుడు మొదలైన మహర్షులు శ్రీకృష్ణుని దర్శించారు. పుండరీకాక్షుడు, కౌస్తుభాభరణుడు, కుండలమండితుడైన కృష్ణునికి వందనాలర్పించారు.

"జనములు నిను సేవింపని దినములు వ్యర్థంబు లగుచు దిరుగుచునుండున్
దనువులు నిలకడ గావట వనములలో నున్ననైన వ్యరుహనాభా"

(శ్రీ మహాభాగవతము 11 - 14)

కృష్ణుని సేవించని ధ్యానించని రోజులు వ్యర్థం. వనాలలో ఉన్నా వారి శరీరాలు నిలకడగా ఉండవు. ఆర్త జనులకు కృష్ణుని పాదపద్మాల యందు ధ్యానం ఆభరణాలవంటిదని కూడ మహర్షులు కృష్ణునికి వందనాలర్పించారు. అక్రూరుడు కృష్ణుని దివ్యరూపాన్ని నీటిలో నింగిలో వ్యాపించటం తిలకించి అనేక విధాల వందనాలర్పించినవాడు. రుక్మిణి మనసెపుడు కృష్ణుని పాదాలయందే లగ్నమయేట్లు కోరుకుంది. నరకాసుర వధానంతరం భూదేవి కృష్ణునికి నమస్కరించింది.

"ధాత గన్న మేటి తండ్రికి నజునికి
నీకు వందనంబు నేనొనర్తు
నిఖిల భూతరూప నిరుపమయీాశ ప
రా పరాత్మ మహిత యమిత చరిత"

(శ్రీ మహాభాగవతము 10 - 202)

బ్రహ్మకు తండ్రి, అమిత చరిత్రగల శ్రీకృష్ణునికి భూదేవి పాపభారం పోగొట్టినందుకు అనేక వందనాలర్పించింది. ఈ వందనాలన్ని పోతన తన భక్తి భావంతో సంతృప్తిగా వర్ణించినవి.

### 8.4.6. అర్చన :

గోవిందునకు మునిపత్నులు, భక్ష్య, భోజ్య, చోష్య, పానీయాలు "అన్నంబులు కుంభంబుల నిడుకొని సంరంభంబుల సముద్రంబులకు నడచు నదుల తెరగున" **(10-856)** ఏతెంచి గోవిందుని అర్చించారు. 'భువన మోహన నటవేష భూతి" అయిన శ్రీకృష్ణుని మునిపత్నులు కన్నుల కరవుదీర అర్చించారు. ఇంద్రయాగం వలన ఫలం లేదు. పసులకు, కొండకు, బ్రాహ్మణోత్తములను పూజించటం శ్రేష్టమని యాదవులంతా తలచారు. గోపాలురంతా గిరిగి పూజలొనరించారు. వారు సమర్పించిన పాయసము, ఆపూపము, పైదపుపిండి, పప్పు ఫలశాకాలన్ని

"తానొక శైలాకృతి దాల్చి గోపకులతో నొండొండ బూజించి గో
పకదత్తాన్నము లాహరించె విభుడా ప్రత్యక్ష శైలాకృతిన్"

శ్రీ కృష్ణుడు శైలాకృతిలో స్వీకరించాడు.

### 8.4.7. సేవ :

సేవ అనగా భగవంతుని పాదసేవ. భగవంతుని పాదసేవచేసి తరించిన భక్తులు భాగవతంలో అనేకులు గోచరిస్తారు. రామాయణంలో ఆంజనేయుడు శ్రీరాముని, భాగవతంలో గోపికాస్త్రీలు నవవిధ భక్తిమార్గాలు అనుసరించినవారు. వల్లవకాంతలు శ్రీకృష్ణుని సేవించడానికి వారివారి బంధువులను, పుత్రులను, మిత్రులను, భర్తలను వదలి యమునానదీ సైకతాలకు వేంచేసేవారు. శ్రీకృష్ణుడు కనిపించకపోతే వారంతా బృందావనం కలయదిరిగి వెతికేవారు.

"నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళిపరిసర్పిత పింఛము వాడు నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు చెల్లల మానధనంబు దెచ్చెనో
మల్లియలార మీ పొదలమాటున లేడుగదమ్మ తెల్పరే

(శ్రీ మహాభాగవతము 10 - 1010)

బందావనంలో కనిపించే లతలు, పూలు, చెట్లు, పుట్టలు శ్రీకృష్ణుని కొరకు వెతికే గోపికల భక్తి అనితరం సాధ్యం.

### 8.4.8. ఆత్మలో ఎరుక :

ఆత్మను నివేదించడం, ఆత్మలో గల ఎరుక వలన మాత్రమే

"బాంధవమునన్నైన బగనైన వగనైన
బ్రీతినైన బ్రాణభీతినైన
భక్తినైన హరికి చిరతంత్రులై యుండు
జనులు మోక్షమునకు జనుదురధిప "

(శ్రీ మహాభాగవతము 10 - 971)

పగ, వగ, బంధుత్వం, ప్రీతి కలవారెవరైనా భక్తి కలిగినవారు మోక్షానికి అర్హులేనని భాగవతం వక్కాణిస్తుంది. శత్రుత్వం వలన కంసుడు, శిశుపాలుడు, హిరణ్యకశిపుడు, భక్తితో భీష్ముడు మొదలైన వారు మోక్షం పొందినవారు.

"కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్ సంబంధులై వృష్ణులున్
బ్రేమన్ మీరలు భక్తి నేముని దెచక్రింగంటి మెట్లైనను
ద్దామ ధ్యాన గరిష్టుడైన హరి జెందన్ వచ్చు ధాత్రాశ్వరా"

(శ్రీ మహాభాగవతము 7 - 18)

ఇంకా కామవాంఛ చేత గోపికలు బంధుత్వం వలన యాదవుల మోక్షం పొందారని పోతన వర్ణించాడు.

బలిచక్రవర్తి వామనునికి మూడు అడుగుల దానం యివ్వడానికి అంగీకరించాడు. శుక్రాచార్యుడు వారించాడు. బలి తన మానం ప్రాణం పోయినా వామను డడిగిన దానం యిచ్చి తీరుతానన్నాడు.

"బ్రదుక వచ్చు గాక బహుబంధములనైన
వచ్చుగాక లేమి వచ్చు గాక
జీవధనములైన జెడు గాక పడుగాక
మాట దిరుగ లేదు మానధనుడు"

(శ్రీ మహాభాగవతము 8 - 597)

అని శుక్రాచార్యునికి సమాధానం చెప్పాడు. వామను డడిగినట్లే మూడు అడుగుల దానం సమర్పించి పాతాళానికి త్రొక్కబడినాడు. బలిచక్రవర్తి ఆత్మ నివేదన ఆచంద్ర తారార్కం.

### 8.4.9. సంకీర్తన :

గజేంద్రమోక్షం కథలో గజేంద్రుడు చేసిన విష్ణు సంకీర్తన కరుణ రసోపేతం. గజేంద్రుడు విష్ణుని గురించి కీర్తిస్తున్నాడు. దుఃఖిస్తున్నాడు. గజేంద్రుని మకరం పట్టుకుంది. అహోరాత్రులు మొసలి పట్టునుండి విడిపించుకోవడానికి ఏనుగు ప్రయత్నించింది. వీలు కాలేదు. విష్ణు స్మరణ మొదలు పెట్టింది.

"ఎవ్వనిచేజనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
యెవ్వని యందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వడు నాధి మధ్యలయు డెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మ భవు నీశ్వరునే శరణంబు వేడెదన్

(శ్రీ మహాభాగవతము 8 - 73)

ఈ లోకాలకు కారణమైన వాడు, అనాది మధ్యలయుడు, సమస్తం తానే అయిన ఈశ్వరునే శరణం వేడుకుంటానన్నాడు గజేంద్రుడు.

స్త్రీ నపుంసక పురుషమూర్తి కానివాడు, తిర్యక్కులు, అమరులు, నరులరూపం కానివాడు, కర్మగుణ రూప భేద సదృశం కానివాడు, కర్మగుణ రూప భేద సదృశం కానివాడు. కాని అన్నే తానే అయిన పరమాత్ముని సంకీర్తన గావించాడు. తన బాధ పోలేదు.

"కలడందురు దీనులయెడ
గలడందురు పరమ యోగి గణముల పాలం
గలడందు రన్ని దిశలను
గలడు గలండనెడు వాడు గలడో లేడో"

(శ్రీ మహాభాగవతము 8 - 86)

పై పద్యం పోతన అభిప్రాయమని చెప్పవచ్చు. గజేంద్రుడు విశ్వాత్మకుని స్మరించి స్మరించి చివరకు ఈశ్వర సన్నిధానం కల్పించుకున్నాడు. మొర అధికమైంది.

"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుక దప్పెన్ మూర్ఛ వచ్చెద నువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింప దగున్ దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా"

(శ్రీ మహాభాగవతము 8 - 90)

నీవే తప్ప నాకెవరు లేరని గజేంద్రుడు రక్షింపుమని వేడుకున్నాడు. సిరికి కూడ చెప్పకుండా భక్తుని మొర ఆలించి విష్ణువు బయలుదేరాడు.

### 8.4.10. చింతన :

ఉత్తాన పాదుడనే రాజుకు ఇద్దరు భార్యలు. సునీతి, సురుచి. సునీతి కుమారుడు ధృవుడు. రాజుకు సురుచి అంటే ప్రేమ ఎక్కువ. సురుచి కుమారుడు ఉత్తముడు. ఉత్తానపాదుడు ఒకరోజు సురుచి కుమారుణ్ణి తొడమీద కూర్చుండ బెట్టుకున్నాడు. అప్పుడు ధృవుడు అక్కడకు వచ్చాడు. తండ్రి ఆదరించలేదు. సవతి తల్లి నీకు తండ్రి తొడ మీద కూర్చునే యోగం ఉంటే నా కడుపున పుట్టి ఉందువు అని ఈసడించింది. తండ్రి మాట్లాడలేదు. ధృవుడు సునీతి దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెప్పి దుఃఖించాడు. తల్లి సురుచి మాటలు నిజమేనన్నది. సరశరణ్యుడైన 'హిచరణంబులుగను' మని కుమారుని ఓదార్చింది. ధృవుడు బాలుడు ఇల్లు వదలి అరణ్యాల వెంట పోతున్నాడు. దారిలో నారదుడెదురైనాడు. ధృవుని నిర్ణయం తెలుసుకున్నాడు. వాసుదేవ మంత్రం ఉపదేశించాడు. ఆ బాలుని కళ్ళకు కట్టినట్లు విష్ణువర్ణన చేశాడు.

"హారి కిరీట కేయూర కంకణ ఘన
భూషణుండాశ్రిత పోషణుండు
లాకిత కాంచీ కలాప శోభిత కటి
మండలుండంచిత కుండలుండు
మహనీయ కౌస్తుభమణి ఘృణి చారుగ్రై
వేయకుండ నందదాయకుండు
సలలిత ఘనశంఖ చక్రగదా పద్మ
హస్తుండు భువన ప్రశస్తుడజుడు

క్రమ సౌరభవన మాలికా ధరుండు
హతవిమోహుండు నవ్య పీతాంబరుండు
లలిత కాంచన నూపురాలంకృతుండు
నిరతిశయ సద్గుణుండు దర్శనీయతముడు

(శ్రీ మహాభాగవతము 4 - 251)

ధ్రువుడు తపస్సు చేయబోయే విష్ణువు దర్శనీయతముడు అని పలికి నారదుడు వెళ్ళి పోయాడు. ఏడు రోజులు ఓంకారంతో కూడిన పన్నెండు అక్షరాలు గల వాసుదేవ మంత్రాన్ని జపించి విష్ణుని దర్శించి ధృవుడు ధృవపదం పొందాడు.

హరికథలు చదివితేనే సంసార దుఃఖం నశిస్తుందని సూతుడు వివరించాడు. ఇక నవవిధ భక్తి మార్గాలు ఆచరించే వారికి ఇహపరలోక పుణ్యం లభిస్తుందని వేరే చెప్ప పనిలేదు. అంబరీషో పాఖ్యానం, కుచేలోపాఖ్యానం, కృష్ణలీలలు, గజేంద్ర మోక్షం, గోపికా గీతాలు, దక్షయజ్ఞం, ధృవచరిత్ర, భ్రమర గీతాలు, రుక్మిణీ విజయం, వామన చరిత్ర మొదలైన ఘట్టాలన్నీ భాగవతంలో భక్తిరస ప్రేరకాలు. పరమ భక్తుడైన పోతన ఘంటాన్నుండి జాలువారిన ప్రతి పద్యం అమృత బిందువు. "అమ్మా మన్నుదినంగనే శిశువులో వెఱ్ఱినో యాకొంటినో" అని అమాయకంగా పలికిన బాలకృష్ణుడు తల్లికి తన నోట్లో బ్రహ్మాండ భాండాన్ని చూపాడు. కృష్ణలీలలు వర్ణించడం పోతన భక్తి వలన మాత్రమే.

"అతి రహస్యమైన హరి జన్మ కథనంబు
మనుజు డెవ్వడేని మాపు ఱేపు
జాలభక్తి తోడ జదివిన సంసార
దుఃఖరాశి బాసి తొలగిపోవు"

(శ్రీ మహాభాగవతము 1 - 64)

## 8.5. విక్రమార్క చరిత్ర - జక్కన :

కాశీమజిలీ కథల వలె జక్కన విక్రమార్క చర్తిలో కవి విక్రమార్కుని గురించిన అనేక కథలు వివరించాడు. ఈ గ్రంథం విక్రమార్కుని కథలు, భట్టి విక్రమార్కుని కథలు, విక్రమార్కుని సింహాసనంపై ఉండే ముప్పై రెండు బొమ్మలు చెప్పిన కథలు, భేతాళుడిని తెచ్చేటప్పుడు విక్రమార్కునికి చెప్పిన కథలు ఇరవై అయిదు అని తెలుగులో ప్రచారం ఉంది. వీటిని గ్రంథరూపంలో విక్రమార్క చరిత్రగా రూపొందించినది జక్కన కవి.

### 8.5.1 నివాసం :

జక్కన నెల్లూరి నివాసి. ఇతని తాత పెద్దయామాత్యుడు. ఇతడు మంచి చిత్రకవి. పెద్దయామాత్యుని కుమారుడు అన్నయ్య. చక్కని మాటకారి. సంగీత కళారసజ్ఞులు అన్నయ్యను అఖిలరాజ కుంజర సభల్లో కొనియాడేవారట. అన్నయ్య కుమారుడే జక్కన కవి. జక్కన మంచి వైదుష్యం, కావ్య రచనా చాతుర్యం కలవాడు. శారదా దయా విధేయుడు. అఖిల కవి మిత్రుడు. బెల్లంకొండ సిద్ధ పట్టణానికి, సిద్ధ పట్టణానికి సమీపంలో బెల్లంకొండ వుంది. ఈ ప్రాంతాలలో వెన్నెలకంటి వారి వంశంలోని వారు రాజకీయ ఉద్యోగాల్లో ఉండేవారు. వారిలో సిద్ధన మంత్రి జక్కనను పిలిచి ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం అనిపించే కథలన్నీ విన్నాను. విక్రమార్క చరిత్రను ప్రబంధంగా రచించమని కోరాడట. దాని ఫలితమే విక్రమార్క చరిత్ర. ఇది ఎనిమిది ఆశ్వాసాల గ్రంథం. విక్రమార్కుని సాహస కృత్యాలు, జీవితం తెలిపే గ్రంథం.

### 8.5.2. కథాసారాంశం :

మధురా నగరాన్ని పాలించే శృంగార శేఖరుడనే రాజు కొలువులో చంద్రగుప్తుడనే బ్రాహ్మణుడున్నాడు. అతడు అందగాడు. ఆ రాజ్యపు దండనాధుని చెల్లెలు మదనరేఖ చంద్రగుప్తుని చూసి మోహించింది. కులం తక్కువ పెళ్ళిని చంద్రగుప్తుడు ఒప్పుకోలేదు. మదనరేఖ చంద్రగుప్తుని వివాహం చేసుకోలేకపోతే మరణిస్తానంది. దండనాధునికి చెల్లెలంటే ప్రాణం. అతడంటే రాజుకు ఇష్టం. అందుచేత శాస్త్రరీత్యా బ్రాహ్మణుడు నాలుగు కులాల కన్యలను వివాహం చేసుకోవచ్చని నిర్ణయించారు. రాజుగారి పురోహితుని కూతురు శీలవతి, రాజు కూతురు రాగమంజరి, రాచవిధుల అధికారి. ధనగుప్తుడనే వైశ్యుని కూతురు సుమతిని చంద్రగుప్తుడు వివాహమాడాడు. తరువాత మదనరేఖను వివాహం చేసుకున్నాడు. ఈ నలుగురు ఇల్లాళ్ళలో బ్రాహ్మణ స్త్రీకి వరరుచి, క్షత్రియ కాంతకు విక్రమార్కుడు, వైశ్య వనితకు భట్టి, శూద్రస్త్రీకి భర్తృహరి అనే కుమారులుదయించారు. విక్రమార్కునికి పట్టం కట్టి చంద్రగుప్తుడు శ్రీశైల పర్వతం వద్ద కాలం గడపడానికి వెళ్ళిపోయాడు.

విక్రమార్కుడు కాళికాదేవి వరం వలన లబ్ద ప్రతిష్ఠుడైనాడు. ఆరు నెలలు రాచవిధులు, ఆరునెలలు దేశాటనం చేస్తాడు. అతిని సాహసకృత్యాలు తెలిపే గ్రంథం విక్రమార్క చరిత్ర.

శ్రీశైల శిఖరం చూస్తే ముక్తి. కాశిలో మరణిస్తే మోక్షం కలుగుతుందని కూడ కవి నమ్మకం కలిగించాడు. (శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే). కాశిలో మరణించిన వారు ఎంత ప్రసిద్ధులో కవి వివరించాడు.

"రూప మొక్కటి రెండు రూపువై చెలువొందు
        మూడు మొనల పాటు ముట్టుబట్టు
బాహు చతుష్కంబు బంచాస్యములు బూను
        షణ్ముఖుని పై బ్రేమ సలుపుచుండు
సప్తాశ్వ చంద్రు వీక్షణములుగా నొప్పు
        నెనిమిది మూర్తుల వినుతికెక్కు
నవని ధీశ సఖుండనంగ గీర్తి వహించు
        బదికొంగులైన యంబరము గట్టు

బదునొకండు విధంబుల బ్రణుతికెక్కు
వెలయ బండ్రెండు గనుపుల విల్ల పట్టు
గ్మి పాశల విత్రి విఖ్యాతి మొరయు
గాశిలో మేన దొరగిన ఘన యగుండు"

(విక్రమార్క చరిత్ర 2 - 192)

అంకెల్లో మోక్షం చూపెట్టాడు జక్కన. "కంచి చూడని కన్నులు కన్నులగునె" అన్నాడు కవి. జక్కన రచనావిధానంలో శ్రీనాథుని అనుకరించిన సందర్భాలున్నాయి. విక్రమార్కుని సాహసకృత్యాలు నేటికీ ఆబాలగోపాలం తెలుగు ప్రజలు చెప్పుకుంటూనే ఉంటారు. నాచన సోమునివలె సామెతలు వాడాడు కవి. తెలుగుదనం ఉట్టిపడే జాతీయాలేకాక సంస్కృత లోకోక్తులు కూడ ఉపయోగించాడు జక్కన కవి.

## 8.6. శృంగార శాకుంతలము - పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు :

### తల్లిదండ్రులు :

పిల్లలమఱ్ఱి వారి ఇంటిలో అందరూ కవులే. పినవీరన తాత, తండ్రి సోదరుడు అంతా కవిత్వం చెప్పగల దిట్టలు. శ్రీనాథుని బాల్యసఖుడు హరవిలాసం కృతిపతి అయిన అవచి తిప్పయసెట్టికి అక్షరాభ్యాసం చేయించింది పినవీరనతాత పిల్లలమఱ్ఱి పెద్దన. అతని కుమారుడు గాదిరాజు. అతడు 'విద్యాభారతీ జాని' అనే విశేషణానికి తగిన పండితుడు. అతని భార్య పేరు నాగాంబ. గాదిరాజు, నాగాంబలు పిల్లల కోసం నోములు వ్రతాలు చేశారు. చివరకు శ్రీశైల ప్రాంతంలో ఉన్న భారతీ తీర్థులనే మహానీయుడిని సేవించారు. ఆయన దీవెనల వలన గాదిరాజు నాగాంబలకు ఇద్దరు పిల్లలు పుట్టారు. వారు కవలలు. వారే పిల్లలమఱ్ఱి పెదవీరభద్రుడు, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు.

### 8.6.1. నివాసం :

నల్లగొండ జిల్లాలో నల్లగొండకు సమీపంలో పిల్లలమఱ్ఱి గ్రామం ఉంది. ఈ పిల్లలమఱ్ఱి గ్రామం నుండి వీరు పాకనాడ చేరారు. శ్రీనాథుని కాలం నాటికి పిల్లలమఱ్ఱి వారు నెల్లూరులో ప్రధానులుగా ఉన్నారు.

### 8.6.2. కావ్యాలు :

పినవీరభద్రుడు పాతిక, ముప్పై సంవత్సరాలు వచ్చేసరికి అనేక గ్రంథాలు రచించాడు. విష్ణుమూర్తి పది అవతారాలు వివరిస్తూ 'అవతార దర్పణం' అనే కావ్యాన్ని రమణీయంగా రాశాడు. 'నారదీయ పురాణాన్ని తెలుగులో అనువదించాడు. 'మాఘమహాత్మ్యం' చక్కని శైలిలో రచించాడు. 'మానసోల్లాసం' అనే గ్రంథం రచించాడు. అయితే ఈ గ్రంథాలేవి నేడు లభ్యం కావు. పినవీరభద్రుడు తాను ఇన్ని గ్రంథాలు రచించినట్లు శృంగార శాకుంతలము ప్రథమాశ్వాసంలో (1-22) తెలిపాడు. కాళిదాసు రాసిన శాకుంతలం చాల ప్రసిద్ధి గలది. ఈ నాటకాన్ని ప్రబంధ కవులు కావ్యంగా రూపొందించలేదు. పినవీరభద్రుడు కాళిదాసు నాటకాన్ని శ్రవ్యకావ్యంగా అనువదించాడు. శ్రీనాథుడు శృంగార నైషధమన్నట్లు పినవీరభద్రుడు శృంగారశాకుంతలమని పేరు పెట్టుకున్నాడు. ఇతని గ్రంథాల్లో జైమిని భారతం కూడ సుప్రసిద్ధం.

### 8.6.3. అంకితం :

నెల్లూరి దగ్గర సోమరాజు పల్లె గ్రామానికి అధికారి చిల్లర వెన్నమంత్రి. చిల్లర వెన్నమంత్రి కోరిక మేరకు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు శృంగార శాకుంతలము రచించి అతనికే అంకితమిచ్చాడు. చిల్లరవెన్న మంత్రి శైవుడు. సోమవార వ్రతం పాటించేవాడు.

### 8.6.4. కావ్యవిశేషాలు :

ఎఱ్ఱన నవరసాలు కాక అష్టరసాలనే చెప్పాడు. అట్లే పినవీరన అష్టరసాలలో శృంగారం మిన్న అని తెలిపాడు.

"శృంగారము ముఖ్యంబగు
నంగియు నంగములు దలప నష్టరసములున్
సాంగమగునేని డంకము
బంగారముతోడి యొక ప్రబంధము వొందున్"

(శృం. శా. 1 - 25)

శృంగార శాకుంతలము నాలుగు ఆశ్వాసాల గ్రంథము. దీనిలో ఏడు వందల డెబ్బై రెండు గద్యపద్యాలున్నాయి. మహాభారతం మూలకథను కొంత మార్చి కాళిదాసు నాటకం రచించాడు. భరతుడు పుట్టిన తరువాత ఆరేళ్ళకు శకుంతల దుష్యంతుని వద్దకు

వెళ్ళినట్లు వ్యాసభారత కథనం. కాళిదాసు గర్భవతినే భర్త వద్దకు పంపాడు. భారతంలో ఆకాశవాణి గుర్తుచేసేవరకు దుష్యంతునికి శకుంతల గుర్తురాదు. కాళిదాసు దూర్వాసుని శాపం, అంగుళీక వృత్తాంతం చెప్పి దుష్యంతునికి శకుంతల గుర్తు వచ్చేట్లు రచించాడు. ఈ ఘట్టాలను పిన వీరయ్య స్వీకరించాడు. కొడుకు పుట్టకనే శకుంతలను భర్తవద్దకు పంపినట్లు పినవీరయ్య రచించాడు.

పినవీరభద్రుడు కథతో పాటు తన కాలంలో ఉన్న ఆచార వ్యవహారాలు తెలిపాడు. కాళిదాసు శాకుంతలంలోని శ్లోకాలేకాక కాళిదాసు కావ్యాలలోని శ్లోకాలను కూడ ఉపయోగించాడు కవి. శకుంతల పురుడు పోసుకున్న వైనం, కుల కన్యకా ధర్మాలు, దుష్యంతుని వేట విధానాలు, మేనకా విశ్వామిత్రుల శృంగారం మొదలైన ఘట్టాలు పినవీరన రసవత్తరంగా రచించాడు. మూలకథను, కాళిదాసు మార్పులు రెంటిని స్వీకరించి రచించిన గ్రంథం ప్రబంధానికి తగిన వర్ణనలు చేశాడు. ''కావ్యేషు నాటకం రమ్యమ్ నాటకేషు శకున్తలా'' అన్నది ఆర్యోక్తి. శకుంతలా నాటకంలో చతుర్థంకం. అందులో నాలుగు శ్లోకాలు రమ్యంగా ఉంటాయి. కాళిదాసు నాటక చతుర్థాంకానికే వన్నె పెట్టినట్లు పినవీరభద్రుడు తన గ్రంథం రచించాడంటారు పండితులు. నన్నయ ప్రౌఢ రచనా సంపత్తి, తిక్కనా వాక్చాతుర్యం, నాచన సోముని కవితా మహాత్మ్యం, శ్రీనాథుని భాషానిగుంభన పరిమళం వీరభద్రుని రచనలో చోటుచేసుకున్నాయి. పినవీరనకు సమీపకాలం అర్వాచీనుడు కొరవి గోపరాజు. అతడు పిన వీరనకు 'మహామతి' అనే విశేషం వాడాడు. ఒక రాత్రికి రాత్రి ఒక మహా కావ్యం పూర్తి చేశాడని సరస్వతీ దేవి ఈ గ్రంథం రాసిందని చెప్పుకునేవారు. ఈ విషయాన్ని ఒక చాటు పద్యం కూడ వివరిస్తుంది.

"పిల్లల మఱ్ఱి పిన వీరన
కిల్లాలట వాణి యట్టులే కాకున్నన్
వెల్లముగ నొక్క రాతిరి
తెల్లగ తెలవారు వరకు తేగలడె కృతిన్''

(చాటు పద్య మణిమంజరి 1 పుట 141)

పిన వీరన సరస్వతీ దేవిని తన ఏలిక సానిగా పూజించేవాడని సాహితీకారులు పేర్కొంటారు. తక్కిన కవులు సరస్వతీ దేవిని పూజించేవారు గౌరవించేవారు. పిన వీరన మాత్రం 'వాణి నా రాణి' అని చెప్పుకున్నాడు.

పిల్లల మఱ్ఱి పిన వీరభద్రుడు జైమిని భారతం రచించి సాళ్వ నరసింహా రాయలకు అంకితమిచ్చాడు. జైమిని భారత కథ అంతా శ్రీకృష్ణ భక్తి ప్రతిపాదకం. పిన వీరన ఈ రెండు గ్రంథాల వలన మతసామరస్యం కలవాడని తెలుస్తుంది.

పిన వీరభద్రుని శృంగార శాకుంతలము, జైమినీ భారతము మాత్రమే లభ్యమవటం సాహితీ ప్రియుల అదృష్టం.

## 8.7. నాసికేతోపాఖ్యానము - దగ్గుపల్లి దుగ్గన :

శ్రీనాథుని బావమరది దగ్గుపల్లి దుగ్గన. ఇతడు నాసికేతోపాఖ్యానము రచించాడు. శివకాంచీ మాహాత్మ్యం రాశాడంచారు కాని ఆ గ్రంథం లభ్యం కాదు. శివకాంచీ మాహాత్మ్యం తరువాతే నాసికేతోపాఖ్యానం రాసినట్లు తెలుస్తుంది.

### తల్లిదండ్రులు :

దుగ్గల తండ్రి తిప్పనార్యుడు. తల్లి ఎర్రమ. శాండిల్య గోత్రుడు. ఇతనికి పోతన, ఎర్రనామాత్యుడనే ఇరువురు సోదరులున్నట్లు శ్రీనాథునికి ప్రియమైన బావమరది అని నాసికేతోపాఖ్యానం తెలియజేస్తుంది.

"కవి సార్వభౌముడై కర్ణాట విభుచేత గనక రత్నాభిషేకములు గనిన
శ్రీనాథ సుకవి కూరిమి సేయు మరిదివి దుగ్గయ కవి రాజ దుగ్గుబల్లి
తిప్పనార్యునకును సతీమణి ఎఱ్రమకును దనూజుడవు పోతనకు నెఱ్ఱ
నామాత్య వరునకు ననుగు దమ్ముండవు శాండిల్య గోత్రుడౌ సరసమతివి

జెప్పనేర్తువు కృతులు స్థిరముగాగ
గాన నీవు రచింపంగ గడగియున్న
నాసికేత చరిత్రంబు నాదు పేర
నంకితము సేయు కవిరాడు లాదరింప"

(నాసికేతోపాఖ్యానము 1 - 18)

అని గంగయామాత్యుడు దుగ్గనను ప్రశంసించాడు.

**అంకితం :**

గంగయామాత్యుడు దుగ్గనను ప్రశంసించి తనకు కావ్యం అంకితమీయమని పలికినట్లు పై పద్యం వెల్లడిస్తుంది. శ్రీనాథునితో పాటు ఆంధ్రదేశ సంచారం చేస్తూ దుగ్గన శ్రీనాథుని మరణానంతరం ఉదయగిరి మంత్రులను ఆశ్రయించాడు. దుగ్గన తన నాసికేతోపాఖ్యానాన్ని ప్రబందమనే ప్రకటించాడు. "ఇది శ్రీమత్కమలవాభ పౌత్ర మారయామాత్య పుత్ర కవి సార్వభౌమ సకల విద్య సనాథ శ్రీనాథ మహాకవీంద్ర ప్రసాద లబ్ద కవితా విశేష దగ్గుపల్లి తిప్పనార్య ప్రియ తనూజ దుగ్గన నామధేయ ప్రణీతంబైన నాసికేతో పాఖ్యానంబను మహా ప్రబంధంబు . . . . . . . " అని ప్రకటించడం వలన శ్రీనాథుని వలన తాను కవినయానని చెప్పినట్లు తెలుస్తుంది.

**కవితావిశేషాలు :**

నాసికేతుని కథ. కఠోపనిషత్తులోను భారతం ఆనుశాసనిక పర్వంలోను ఉంది. కాని ఆ కథలకు దుగ్గన రాసిన కథకూ తేడా ఉంది. మూలంలో నాసికేతుడు అని వుంది కాని నచికేతుడు అంటారు. ముక్కు మూసుకొని తపసు చేసుకొనే ముని వీర్యాన్ని ముక్కుతో వాసన చూడటం వలన పుట్టిన వాడు నాసికేతుడన్నాడు దుగ్గన. ముని వీర్యకణాన్ని ఆఘ్రాణించిన చంద్రవతి నెల తప్పింది. ఈ అకాల గర్భాన్ని దాచరాదని చెలికత్తెకు చెప్పి తల్లిదండ్రులకు ఈ విషయం నివేదించమని కోరింది. తండ్రి విని మూర్ఛపోయి తెప్పరిల్లాడు. కొరగాని కూతురు ఎంతకైనా తెగిస్తుందని ఆమెని అడవికి పంపడమే ప్రాయశ్చిత్తమని భావించాడు. చంద్రవతి అడవికి పంపబడింది. అడవిలో ఆమె ఆర్తనాదం తృణబిందుడనే ఋషి విన్నాడు. ఆమెని ఆదుకొని తన ఆశ్రమం చేర్చాడు. ఆశ్రమంలో ఆమెకి బిడ్డ పుట్టాడు. వాడు పెరిగి పెద్దవాడై తాను ఎవరి కొడుకునని ప్రశ్నిస్తే ఏమని చెప్పేదని విచారించింది. ఆ బాలుడిని చంద్రవతి ఒక పెట్టెలో పెట్టి నీళ్ళలో వదులుతూ ఈ బాలుడు తన జననానికి కారణమైన ఆ మహానుభావుని చేరుగాక అని ప్రార్థించింది. "ఫాలభాగంబునన్ గర కమలంబులు మొగిడ్చి భాగీరథికిం బ్రణామంబు జేసి . . . . . " (నాసికేతోపాఖ్యానము 7 - 239) పెట్టెను వదిలింది. ఆ పెట్టె వెళ్ళి తండ్రిని చేరుకుంది. అద్దంలో తన నీడలా ఉన్న బాలుడిని తండ్రి ఆదరించాడు. చంద్రవతి బిడ్డను వదిలింది కాని బిడ్డపా ప్రేమతో ఉన్మతురాలైంది. బిడ్డను వెతుకుతూ చెట్లూ పుట్టలూ తిరుగుతూ ఉంది. ఒకచోట ఆ బాలుడు కనిపించాడు. బాలుడిని చంద్రవతి అనేక ప్రశ్నలు వేసింది. వాటిలో కొన్నిటిని చెప్పలేక పోయాడు. ముని రాక కోసం ఎదురు చూసింది. ఆశ్రమం అలంకరించింది. ముని ఆశ్రమం చేరాడు. ఒకరినొకరు చూసుకున్నారు. ఆనాడు కలలో కనపడినదీ చిన్నదే అని భావించాడు ముని. ఒకరి విషయాలు ఒకరు చెప్పుకున్నారు. చంద్రవతి మునిని వివాహం

చేసుకోమని కోరింది. తండ్రికి కబురు చేస్తే రాజు అంగీకరించాడు. బిడ్డతో పాటు వధూవరులు ఆశ్రమం తిరిగివచ్చారు. కొన్నాళ్ళకు తండ్రి బిడ్డకు అభిప్రాయ భేదాలు కలిగాయి. తండ్రి హోమానికి సమిధలు తేలేదని నీవు నా కొడుకువా అన్నాడు. బాలుడు ఈశ్వర సేవ కంటె ఆత్మ విద్య శ్రేష్టమైందని సమాధానం చెప్పాడు. తండ్రి కోపించి కుమారుని యమలోకానికి పొమ్మని శపించాడు. నాసికేతుడు యమలోకం వెళ్ళి యమధర్మరాజును మెప్పించి తిరిగి వచ్చాడు. భూలోకంలోని ప్రజలకు యమలోక విశేషాలు తెలిపాడు. ఈ కథ మొత్తం మూడవ ఆశ్వాసంలో 187 పద్యాల వరకు మాత్రమే గ్రంథం లభ్యమైంది. మిగిలిన గ్రంథం దొరకలేదు.

దుగ్గన శ్రీనాథునికి శిష్యుడైనా శ్రీనాథుని రచనా పద్ధతులు వంట పట్టించుకోలేదు. శ్రీనాథుడు తాను ఆశ్రయం పొందిన రెడ్డి రాజులందరిని స్తుతించాడు. దుగ్గన చారిత్రక విషయాలేమీ చెప్పలేదు. యమధర్మరాజుకు నాసికేతునికి జరిగన సంభాషణ తార్కికము, రసవత్తరమైనది. సాంఘిక, ఆధ్యాత్మిక విషయాలెన్నో ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి.

## 8.8. భోజరాజీయము - అనంతామాత్యుడు :

అనంతామాత్యుడు 'భోజరాజీయము' అనే గ్రంథం రచించాడు. ఈ గ్రంథం క్రీ.శ. 1435 ప్రాంతంలో రచించాడని పండితుల నిర్ణయం.

### నివాసం :

ఇతడు కృష్ణాజిల్లా నివాసి. ఇతని ముత్తాత బయ్యన్న మంచికవి. బయ్యన్నను తిక్కన మెచ్చుకొని 'భవ్యభారతి' అనే బిరుదు ఇచ్చాడు. అనంతామాత్యుని తండ్రి నివసించిన ఊరు 'పెరుమగూరు'. అనంతామాత్యుడు నివసించిన ధ్రువపట్టణం రెండూ ఎక్కడున్నాయో ఇప్పటికీ తెలియదు.

### గురువు :

అనంతామాత్యుని గురువు తిరుమల నల్లాన్ చక్రవర్తి. గురువుతో కలిసి అహోబల నరసింహుని దర్శించాడు. గురువు గారి ఆదేశం మేరకు భోజరాజీయము రచించి అహోబల నరసింహునికి అంకితమిచ్చాడు.

### కావ్యవిశేషాలు :

భోజరాజు 'పరమార' వంశపు రాజు. అతడు మాళవ దేశాన్ని పాలించాడని చరిత్ర స్పష్టం చేస్తుంది. భోజరాజు ముఖం చూస్తే కవిత్వం పుట్టుకొస్తుందనే మాటతో ధారానగరాన్ని అనంతామాత్యుడు చక్కగా వర్ణించాడు. పాత కథలు తీసుకొని వాటిని అనుసరిస్తూ స్వకల్పిత పురాణాలు సృష్టించి రచించిన గ్రంథం భోజరాజీయము. విక్రమార్కుని సింహాసనం ఎక్కదలిచినప్పుడు భోజుడు విన్న కథలు. దీనిలో చెప్పబడిన కథలన్నీ ప్రశస్త ధర్మోపదేశాలన్నాడు.

> "సూత్ర కథ భోజరాజ చ
> రిత్ర మయా నడుమ ధర్మ రీతులు నీతుల్
> చిత్ర కథలై తలిర్పగ
> శ్రోతృ ముఖముగా నొనర్ప జొప్పడియుండున్"

ప్రధాన కథతో పాటు అనేక పుణ్య క్షేత్రాలు వాటి ప్రాశస్త్యం వివరించాడు అనంతామాత్యుడు. శ్రీరంగం, ప్రయాగ కాశి, గయ, గంగా యమునల సంగమం, హేమకూటం మొదలైన వన్నీ అందంగా చిత్రించాడు. భారత, భాగవతాల్లోని కథలను

తీసుకొని వాటికి చక్కని వర్ణనలు జోడించి రమ్యంగా చిత్రించాడు. చెప్పుగూడతో పాయసంతోడి ఆతిథ్యమిచ్చిన సజ్జనుడు స్వర్గంలో అనుభవించిన ప్రతిఫలం, బ్రహ్మరాక్షసనికి ఆహారంగా బలి కావలసిన మోగమున్నా కాని అందుకు సిద్ధపడి పుష్పగంధిని పెళ్ళాడిని రత్నకుండుని కథ, అన్నదానం చేసే మరదిని వదినెలు వేరు కాపురానికి పంపిన కథ. ఇనా ఎన్నో కథలు వివరించాడు. ఈ కథల్లో మరల ఉపాఖ్యానాలు. భోజ రాజీయంలో ఆబాలగోపాలం చెప్పుకునే కథ గోవ్యాఘ్ర సంవాదం.

కాపురం చేస్తున్నా వసిష్ఠుడు సదాబ్రహ్మచారు. కడుపునిండా భోజనం చేస్తున్నా అగస్త్యుడు నిత్యోపవాసి. ఎందుకంటే దానికి అనంతుడు చెప్పిన ధర్మసూక్ష్మం క్రింది పద్యం.

"ఆశనాభిరతి లేక యటవీ స్థలంబున నియత తపోనిష్ట నెరపుచుండ
గృహ ధర్మ నిరతులు కొనివచ్చి భక్తి పూర్వకముగా దగసమర్పణము జేయు
నన్నపానాదులన నాసక్తుడై కొనునతడు నిరాహారుడుంద్ర బుధులు
ధర్మ మార్గమున సంతతి యుపార్జింప సమాన్యయంబున వివహంబు వడసి

మనసు తమకంబు లేకాత్మవనిత యందు
బూని ఋతుకాల మందున గాని తిధులు
పరిహరించి యధోచిత భంగిగౌలి
సలుపు వాడు సదా బ్రహ్మచారి యంద్రు"

అరణ్యంలో తపసు చేసుకొనేవారు తినేది భోజనం లెక్కలోకి రాదని, మనసులో కోర్కె లేకుండా భార్యతో సంసారం చేసినా అది బ్రహ్మచర్యం క్రిందకే వస్తుందనే ధర్మసూక్ష్మం వివరించాడు కవి.

భారతంలోగల పద్యం

"నుతజలపూరితంబు లగు నూతులు నూరిటికంటె సూనృత
వ్రత యొక బావి మేలు మరిబావులు నూరిటి కంటె నొక్కస
త్క్రతు పదివేలు తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్

**(భారతము ఆది. 4 - 94)**

పై పద్య భావాన్ని అనంతుడు ఒక కందంలో అందంగా చెప్పాడు.

"శత కూపాధిక దీర్ఘిక
శతవాప్యధికంబు గ్రతువు శత యజ్ఞ సము
న్నతు డొక్క సుతుడు దత్సుత
శతంబున కెక్కు డొక్క సత్యోక్తి నృపా"

పూర్వ గ్రంథాలను అనుకరించి ధర్మసూత్రాలకు ప్రామాణికత్వం చేకూర్చాడు కవి. అనంతామాత్యుడు భోజరాజీయము మాత్రమే కాక ఛందస్సును గురించి విపులంగాను, వ్యాకరణం గురించి కొంచంగాను, అలంకారాలకు ముఖ్యమైన రసం గురించి మరో గ్రంథం రచించాడు. ఆ గ్రంథం పేరు 'రసాభరణము'. గద్యలో దీనిని అనంతుడు రసాలంకారమన్నాడు. ప్రబంధకవులు కాంతా సమ్మితమైన కథలు రచించారు. వారు కులకాంతలు కదు వారకాంతలు. అనంతామాత్యుడు కులకాంతా సమ్మితమైన కావ్యం రచించాడు.

## 8.9. రాదగిన ప్రశ్నలు :

1. పోతన జీవిత విశేషములను తెలియజేయండి.
2. పోతన భాగవతములోని భక్తి తత్త్వమును వివరించండి.
3. నవవిధ భక్తి మార్గాలను తెలియజేయండి.
4. జక్కన విక్రమార్క చరిత్ర గురించి వ్రాయండి.
5. పిల్లలమర్రి పినవీరభద్రుని శృంగార శాకుంతలము గురించి వ్రాయండి.
6. దగ్గుపల్లి దుగ్గన నాసికేతోపాఖ్యానము గురించి వ్రాయండి.
7. అనంతామాత్యుని భోజరాజీయము గురించి వ్రాయండి.

## 8.10. ఆధార గ్రంథాలు :

| | | |
|---|---|---|
| 1. | భాగవత తత్త్వము - మానవత్త్వము | డాక్టర్ పప్పు వేణుగోపాలరావు |
| 2. | శ్రీమద్భాగవత ప్రకాశము | ఎక్కిరాల కృష్ణమాచార్యులు |
| 3. | సమగ్ర ఆంధ్ర సాహిత్యము | ఆరుద్ర |
| 4. | శ్రీమద్భాగవతము | పోతనామాత్యుడు |
| 5. | నాసికేతోపాఖ్యానము | దగ్గుపల్లి దుగ్గన |
| 6. | విక్రమార్క చరిత్రము | జక్కన |
| 7. | శృంగార శాకుంతలము | పిల్లలమర్రి పినవీరభద్రుడు |
| 8. | భోజరాజీయము | అనంతామాత్యుడు |

డాక్టర్ యం. కమల
లెక్చరర్
సి. ఆర్. కాలేజి
చిలకలూరిపేట

## పాఠం - 9

# ప్రబంధ యుగం


9.0 లక్ష్యం

9.1 ప్రబంధ లక్షణములు

9.2 మనుచరిత్ర - ప్రబంధ లక్షణ సమన్వయము

9.3 అల్లసాని పెద్దన

9.4 రాదగిన ప్రశ్నలు

9.5 ఆధారగ్రంథాలు


## 9.0 లక్ష్యం :

ప్రబంధ లక్షణాలను తెలిసికొనుట మనుచరిత్రకు అన్వయించుట ఈ పాఠంయొక్క లక్ష్యం.

ఆంధ్ర సాహితీ చరిత్రలో ప్రబంధ యుగమున కాక ప్రత్యేక స్థానముంది. ఈ యుగంలో ఆంధ్ర భోజుడైన శ్రీకృష్ణ దేవరాయలు స్థాపించిన భువన విజయం సభాభవనం సాంస్కృతిక కళానిలయం. ఈ యుగంలో పెద్దన, తిమ్మన, ధూర్జటి, రామరాజ భూషణుడు, సూరన, తెనాలి రామకృష్ణుడు ప్రసిద్ధ ప్రబంధ కవులు. శ్రీకృష్ణ దేవరాయలు స్వయంగా కవియై సాహితీ సమరాంగణుడైనాడు. వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయత్వం, శృంగార రసప్రాధాన్యం, వర్ణనా బాహుళ్యం, ఆలంకారిక రచన మొదలైనవి ప్రబంధ సామాన్య లక్షణాలుగా గ్రహించబడ్డాయి. యుగధర్మాన్ని బట్టి, రచనా రీతిని బట్టి ఈ యుగమందలి రచనలు ప్రబంధాలుగా పేర్కొనబడ్డాయి. ఈ అధ్యాయంలో ముఖ్యులైన ప్రబంధ కవులను, కృతులను గూర్చి తెలుసుకుందాం.

## 9.1. ప్రబంధ లక్షణములు :

ఆంధ్ర వాఙ్మయ సుక్షేత్రంలో పండిన బంగారుపంట ప్రబంధం. తెలుగు ప్రబంధాల పుట్టుక క్రీ.శ. 16వ శతాబ్దిలోనే అకస్మాత్తుగా జరుగలేదు. దానికి క్రమ పరిణామముంది. నన్నయ భారతం పురాణమే అయినా రచన మాత్రం ప్రబంధోన్ముఖంగానే సాగింది. నన్నెచోడుని కుమారసంభవంలో తొలిసారిగ ప్రబంధ లక్షణాలు ఎక్కువగా కన్పించాయి. తిక్కన రాసిన నిర్వచనోత్తర రామాయణంలో సీతారాముల వనవిహార సందర్భంలో తిక్కన చూపిన శృంగార రసనైపుణ్యం తరువాత ప్రబంధ కవులకు మార్గదర్శకమైంది. ఎఱ్ఱన భారత అరణ్య పర్వంలోని సావిత్రోపాఖ్యానం, భిలపురాణం, హరివంశంలోని ఉష అనిరుద్ధుల కథను ప్రబంధాలుగానే రచించాడు. ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన వర్ణన విషయంలో ప్రబంధ కవులకు ప్రధమాచార్యుడు. ఉత్తర హరివంశాన్ని రచించిన నాచన సోమన వర్ణనా ప్రాశస్త్యానికి, దీర్ఘసమాస భూయిష్ట రచనకు ప్రబంధ కవులకు మార్గదర్శకుడు. శ్రీనాథుడు ప్రబంధకవులకు మహాచార్యుడు. అతని శృంగార నైషధం ప్రబంధ కవులకు మార్గదర్శకం. ప్రబంధోచితమైన అలంకారిక శైలి, సమతాగుణాలంకృతమైన సమపద సీస పద్యరచనకు పదసంవిధాన నైపుణికి, రసపోషణకు, స్త్రీ పాత్ర సౌందర్య వర్ణనకు నైషధమ్ ఆంధ్రప్రబంధ కవులకు భిక్షపెట్టింది. రాయల యుగానికి పూర్వం నుండి ప్రబంధ శబ్దం వినవచ్చినా పద్యరచనా నైపుణి, రసపోషణ, ఆలంకారిక రచన, వ్యంగ్య వైభవం, కావ్యశిల్పం, ఔచిత్య స్ఫూర్తి, కవితా చమత్కారాలు, కావ్యగుణాలు, మొదలైన ప్రబంధ లక్షణాలు కావ్యాలలో అచటచటా కన్పించినా విస్తృతంగా కన్పించింది రచింపబడింది ఈ యుగంలోనే. "వస్త్వైక్యము, అష్టాదశ వర్ణనలు కలిగి, శృంగార రస ప్రధానమై, అతిశయించిన అర్థములతో కూడిన శబ్దములు కలిగి, అలంకారాదులతో భూషింపబడి,

ఎక్కువ విస్తృతి లేనిదైన ఇతివృత్తంతో భాషాంతరీకరణంగాక స్వతంత్ర రచనయే అయిన తెనుగు కావ్యం ప్రబంధమని శ్రీ కాకర్ల వెంకటనరసింహం గారు నిర్వచించారు. ఈ దృష్టితో చూచినపుడు నన్నెచోడుని కుమార సంభవం తొలి ప్రబంధం అవుతుంది గాని రాయల యుగము నాటి రచనలకు ఆ పేరు రూఢి అయింది. ఎందుకంటే ప్రబంధ లక్షణాలన్నీ రాయల కాలంనాటి ప్రబంధాలలో పరిపుష్టిగాంచాయి.

సంస్కృత లాక్షణికుల వివిధ మత భేదాలను క్రోడీకరించి తెలుగు కవులు ప్రబంధంలో అష్టాదశ వర్ణనలుండాలని పేర్కొన్నారు. అవి 1. పుర, 2. సముద్రం, 3. పర్వతం, 4. ఋతువులు, 5. సూర్యోదయం, 6. ఉద్యానం, 7. సలిలక్రీడ, 8. మధుపానము, 9. రతి, 10. విప్రలంభం, 11. వివాహం, 12. కుమారోదయం, 13. మంత్రం, 14. దౌత్యం, 15. ప్రయాణం, 16. యుద్ధం, 17. నాయకాభ్యుదయం, 18. చంద్రోదయం.

ప్రబంధ లక్షణాలన్నింటిని సమకూర్చుకున్న మొదటి ప్రబంధం పెద్దన మనుచరిత్ర. తరువాత నంది తిమ్మన పారిజాతాపహరణం, రామరాజ భూషణుని వసుచరిత్ర, పంగళి సూరన రాఘవ పాండవీయం, కావ్యాలలో ప్రబంధ లక్షణాలను చూడవచ్చు. పెద్దనాదుల కావ్యాలను ప్రబంధాలనడానికి కారణం వస్త్వైక్యము, ఏకనాయకాశ్రయం, రసాధిక్యత, నాటకీయత, ఆలంకారిక రచన, అష్టాదశ వర్ణనలకు స్వతంత్ర రచన మొదలైన కావ్య కళాధర్మాలకు అధిక ప్రాధాన్యం ఉండడంవల్ల ప్రబంధాన్ని ప్రత్యేక కావ్య ప్రక్రియా భేదంగా పరిగణించారు. 18వ శతాబ్దం వరకు ఈ ప్రబంధ రచన కొనసాగింది.

## 9.2. మనుచరిత్ర - ప్రబంధ లక్షణ సమన్వయం :

కృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో అగ్రగణ్యుడు అల్లసాని పెద్దన. పెద్దన మనుచరిత్ర ప్రబంధాన్నేగాక "హరికథాసారము" అను మరొక గ్రంథాన్ని రచించి తన గురువు శఠగోపయతికి అంకిత మిచ్చినట్లు తెలుస్తోంది. పెద్దన తన మనుచరిత్రను శ్రీకృష్ణ దేవరాయలకు అంకితమిచ్చాడు. పెద్దనకు "ఆంధ్ర కవితా పితామహుడు" అను బిరుదు కలదు. మార్కండేయ పురాణం నందలి కథను స్వీకరించి తన స్వంత కల్పనలతో మనుచరిత్రను ఒక మహాప్రబంధంగా దిద్ది తీర్చినందువల్ల ఈ బిరుదు కలిగినదని కొందరి అభిప్రాయం. ఆంధ్ర పంచకావ్యాలలో మొదటిది మనుచరిత్ర. ప్రబంధ కవితకు పెద్దన మార్గదర్శకుడు. అనంతర ప్రబంధ కవులకు ఆదర్శప్రాయుడు.

### 9.2.1. కావ్యనామము :

పెద్దన ప్రబంధానికి "మనుచరిత్ర", "స్వారోచిష మనుచరిత్రము", "స్వారోచిష మనుసంభవము", అని మూడు పేర్లున్ననూ గ్రంథ భాగంలో మాత్రం స్వారోచిష మనుసంభవము, స్వారోచిష మనుచరిత్రము అని రెండు పదాలను ప్రయోగించాడు. "మను చరిత్రంలందు కొనువేళ పురమేగ ............ " అనే పెద్దన చాటు పద్యంలో "మనుచరిత్ర" అని ఉంది. ఈ కావ్యంలో స్వారోచిష మనువు పుట్టుటకు కారణమైన చరిత్ర వర్ణించబడింది. పెద్దన ఆశ్వాసాంత గద్యాలలో స్వారోచిష మనుసంభవమనే పేర్కొన్నాడు. "మనుచరిత్ర" అనే పేరే జన వ్యవహారంలో ప్రసిద్ధి చెందింది.

### 9.2.2. వస్త్వైక్యము :

మనుచరిత్ర ఆరు ఆశ్వాసాల కథా ప్రబంధం. మొదటి మూడు ఆశ్వాసాలలో స్వరోచి జననం, గుణశీలాలు చెప్పబడ్డాయి. తరువాతి మూడు ఆశ్వాసాలలో స్వరోచిజన్మ సంస్కారాది సద్గుణగుణ నిరూపణం చేయబడింది. వరూధినీ వృత్తాంతం, స్వరోచి చరిత్ర అనే రససమంచితాలు, స్వయం సంపూర్ణాలైన రెండు కథలను కలిపి ఒకే సూత్రంలో సంధించడంలో పెద్దన నేర్పు వ్యక్తమయింది. స్వరోచి వరూధినివలె దేవతాంశ సంభూతుడు. భువన రక్షాదక్షతగల శౌర్యవంతుడు. స్వరోచి చాలాకాలం వరకు ముగ్గురు

భార్యలతో శృంగార భోగాలనుభవించి వారియందు ముగ్గురు కుమారులను గాంచి వారిని ప్రత్యేక రాజ్యాలకు పట్టభద్రులను గావించాడు. ఒకనాడతడు అడవికివెళ్ళి ఒక జింకను సంహరించబోగా ఆ జింక "తనను అనురాగంతో కౌగలించుకోమ''ని కోరింది. ఆతడావిధంగా చేయగా జింక శాపవిముక్తినొంది వనదేవతగా రూపొందింది. ఆమెను పరిగ్రహించిన కొంతకాలానికి స్వారోచిషుడు అను కుమారుడు కలిగాడు. స్వారోచిషుడు విష్ణుమూర్తిని ప్రసన్నుని గావించుకొని విష్ణువు అనుగ్రహంచే రెండవ మనువుగా రాజ్యాన్ని పాలించాడు. ప్రవరునిలోని గుణసంపద స్వరోచికి కాక అతని కుమారుడైన మనువుకు సంక్రమించింది. బాల్యంనందే భక్తి వైరాగ్య సంపన్నుడై చిరకాల తపస్సు వలన విష్ణువును సాక్షాత్కరింప చేసుకొనిన స్వారోచి యందు ధర్మవీరము ప్రవరుని తేజోమూలంగా సంక్రమించింది. మనుసంభవమునకు ప్రధాన కారణమైన ప్రవరుని చరిత్ర లేనిచో మనుచరిత్రకు బీజం లేదు. అందుకే వరూధిని ప్రవరుల వృత్తాంతాన్ని పెద్దన విశదంగా వర్ణించాడు. ఈ ప్రబంధంలోని ప్రవరుడు, మాయాప్రవరుడు, స్వరోచి, స్వారోచిషుల కథలన్నీ పరస్పరాశ్రయాలై, వస్తైక్యము కలిగి కథా నిర్మాణ చాతుర్యాన్ని వెల్లడిస్తుంది.

### 9.2.3. మూలకథలో పెద్దన చేసిన మార్పులు :

కృష్ణదేవరాయలు పెద్దనను మార్కండేయ పురాణానాన్ననుసరించి మనుచరిత్రను రచించమని అడిగాడు. అందుకే పెద్దన సంస్కృతాంధ్ర మార్కండేయ పురాణాలను చదివి కథావిధానంలో కొన్ని మార్పులు చేర్పులు ఒనరించి మనుచరిత్రను ఆదర్శ ప్రబంధంగా రూపొందించాడు. మార్కండేయ పురాణంలో మనుచరిత్ర 150 పద్యాలలో వ్రాయబడింది. పెద్దన తన ప్రబంధాన్ని సుమారు 800 పద్యాలు, గద్యాలతో రసవంతంగా రాశాడు. సంస్కృతాంధ్ర మార్కండేయ పురాణాలలో ప్రవరుని ప్రాయంకాని, అతని వైవాహిక జీవిత విషయాలు కాని కుటుంబవివరాలు తెలియచేయలేదు. అతని వైరాగ్యం సంగతి కూడా సూచించలేదు. పెద్దన మనుచరిత్రలో ప్రవరుని గూర్చి -

"యౌవనమందు యజ్వయుధ నాఢ్యుడునై కమనీయ కౌతుక
శ్రీ విధి గూకటుల్ గొలిచి చేసిన కూరిమి సోమిదమ్మ సౌ
ఖ్యావహయై భజింప సుఖులై తలిదండ్రులు గూడి దేలియున్
దేవర వోలెనుండి యిలుదీర్పగఁ గాఁపుర మొప్పు వానికిన్" (మ.చ. 1 - 53)

ప్రవరుడు అరుణాగ్ని హోత్రుడని, వివాహితుడని, వృద్ధులైన తలిదండ్రులు పార్వతీ పరమేశ్వరులవలె అతని కాపురాన్ని దిద్ది తీర్చుచున్నారని, మాన్యక్షేత్రములు చక్కగా ఫలించడం వల్ల ఇంట పాడి పంటలకు తరుగులేదని పెద్దన తెల్పాడు.

పెద్దన ఔచిత్య పోషణకు మార్చిన మరొకమార్పు, సంస్కృతంలో సిద్ధుడు చూచిన తీర్థక్షాత్రాదులను విని ప్రవరుడాశ్చర్యం ప్రకటించినట్లుంది. తెలుగు పురాణంలో "వాయపురజ్జవేల మునివల్లభ ........ నమ్మ నెద నీవలు'' కని ప్రవరుడన్నట్లున్నది. అతిధిని గూర్చి యిట్లనుట ఉచితంకాదని పెద్దన ప్రవరునిచే వినయపూర్వక ప్రార్థన చేయించాడు. మూలములో సిద్ధుడు పాదలేపాన్ని ప్రవరున కిచ్చినట్లుండగా పెద్దన ప్రబంధంలో పసరిదియదియని చెప్పకుండ సిద్ధుడే ప్రవరుని పాదాలకు పూసాడని వర్ణించాడు. ఈ మార్పు తరువాత కథకు ఎంతో అనుకూలంగా ఉంది. మూలంలో మంచు కారణంగా పాదలేపనం కరిగిన తర్వాత కూడా ప్రవరుడు ఇంకా కొన్ని వింతలు చూచినట్లుంది. పెద్దన దీనిని తొలిగించాడు. వరూధిని ప్రవరుని కౌగిలించుకున్నప్పుడు ప్రవరు "డోర మోమిడి యంప ద్వయంబంటి పొమ్మంచు ద్రోయుట'' పెద్దన కల్పించిన సన్నివేశం. పెద్దన శిల్పచమత్కృతికి వరూధుని ప్రవరుల ఘట్టము ప్రబల దృష్టాంతం. వారిరువురి చతుర సంభాషణలు, యుక్తిప్రయుక్తులు, అన్నీ కల్పితాలే. వరూధిని భోగలాలసతకు ప్రతినిధి. ప్రవరుడు వైరాగ్య ప్రవృత్తికి ప్రతీక. ముసలి మునిని చూచి మనోరమ నవ్వెనని మూలము నుండగా, శాపమివ్వడానికది చాలదని పెద్దన "బూచివలెనున్న అతని మోమును ఆమె పట్టుకున్నదని'' వర్ణించాడు. శాపంపెట్టిన తరువాత మనోరమను నాగబెత్తంతో పసరంకన్నా హీనంగా కొట్టినగాని చెలికత్తెలు మునిని నిందించరని పెద్దన ఈ విధంగా కల్పించాడు. మూలంలో ఒక

చెలికత్తెకు కుష్ఠు, మరొక చెలికత్తెకు రాజయక్ష్మము కలగాలని ముని శపించినట్లు కల్పించాడు. మూలంలో వరూధినీ ఇందీవరాక్షుల సంబంధం గూర్చిలేదు. పెద్దన ఇందీవరాక్షుడు వరూధిని తమ్ముడని తెల్పి తెలుగునాట విరివిగా కన్పడే మేనరికాన్ని సూచించాడు. ఇందీవరాక్షుడు ఆయుర్వేద విద్యతోపాటు తన కూతురగు మనోరమను సమర్పించు సందర్భంలో మనోరమ స్వరోచిచే తన చెలికత్తెల రూపాన్ని మార్పించినట్లు మూలంలో ఉంది. పెద్దన మనోరమ, స్వరోచీల ప్రథమ సంగమ సమయంలో జరిగినట్లు మార్చాడు. దీనివల్ల మనోరమ ఆత్మవిశ్వాసం, హైందవకుటుంబ కన్యల సౌశీల్యాన్ని తెలుపుతున్నది.

### 9.2.4. కథాకథనం :

కథాకథనంలో పెద్దన ప్రదర్శించిన నేర్పు ప్రశంసనీయం. పెద్దన మూలంలో లేని వర్ణనలు చొప్పించినా అవి కథాగమనానికి ప్రతిబంధకాలుగా లేవు. మనోరమ కథ, ఇందీవరాక్షుని కథ, విభావసి కథను సంగ్రహంగా చెప్పాడు. వరూధిని గర్భం, స్వరోచి జన్మించి పెద్దవాడగుట మిక్కిలి సంక్షేపంగా ఉంది. ఈ సందర్భంలో వర్ణనల కాస్కారమున్నా ప్రధాన కథను దృష్టిలో పెట్టుకొని ఆ భాగాన్ని సంగ్రహించాడు. వరూధినీ ప్రవరాఖ్యుల సంభాషణ నాటకంలాగా సరసంగా నడిపించాడు. వరూధినీ మాయాప్రవరుల సంభాషణలు రమ్యంగా ఉన్నాయి.

మనుచరిత్రలో మాయాప్రవరుని చూచిన వరూధిని ప్రవరుడే యని భ్రాంతిపడటంలో కథంతా ఆధారపడిఉంది. పెద్దన ఆ భ్రాంతిని, శాంబరీ వృత్తాంతాన్ని కావ్యారంభంలోని పద్యాలలోనే గాక అచ్చటచ్చట వర్ణనలలో ఎక్కువగా సూచించాడు. కావ్యాది పద్యంలో విష్ణువు లక్ష్మిని కౌగిలించుకొన్నప్పు డాతని యెదపై అంటుకొన్న లక్ష్మీ వక్షోజ కస్తూరి పంకజాన్ని చూచి నందనాదులు అతడు లక్ష్మికి సమీపంలో ఇంకొక భార్యయైన భూదేవిని కూడ నిల్పెనాయని భావించిన క్రమం వర్ణించబడింది. వినాయకుని ప్రార్థనలో విఘ్నేశ్వరుడు పార్వతి చన్ను కుడుస్తూ కుడివైపున వున్న స్తనాన్ని కబళింపబోయి అచటున్న పాపసరాలను చూచి మృణాళాంకురాలని భ్రాంతి చెందినట్లు వర్ణించబడింది. ఈ రెండు పద్యాలలోని భ్రాంతి కావ్య కథలోని వరూధిని భ్రాంతిని వ్యక్తం చేస్తున్నది. ప్రవరాఖ్యుడు హిమాలయములకు వెళ్ళిన తర్వాత వర్ణించబడిన సంధ్యాకాల వర్ణనలోని భ్రాంతి తరువాత వరూధిని గుటికానున్న భ్రాంతిని ధ్వనింపచేస్తున్నది.

### 9.2.5. సజీవ పాత్రల సృష్టి :

పాత్రల స్వరూప స్వభావాలను సందర్భానికి తగినట్లు విస్తరింపచేసి వారి స్వరూపాన్ని పాఠకుల హృదయాలపై ముద్రించడం పెద్దన ప్రత్యేకత. వరూధిని ప్రవరుల పాత్రలు అసాధారణమైనవి. ప్రవరుడు మానవోత్తముడు. వరూధిని గంధర్వ యువతి. ప్రవరునిది కర్మభూమి. వరూధినిది భోగభూమి. వరూధిని ఎరిగిన ధర్మము, నీతి అతిలోక సౌందర్యాన్ని ప్రేమించడం. తన మనసుకు నచ్చిన సుందరాకారుని తన జీవిత సర్వస్వంగా ఆరాధించి అతనితో భోగాలను అనుభవించడం. ఆమెకు జన్మ సాఫల్యం. ప్రవరుడు ఏకపత్నీవ్రతుడు. సదాచార సంపన్నుడు. సహజ వైరాగ్య సంపన్నుడు. ఆమె దృష్టిలో ప్రవరుని తిరస్కారం క్షంతవ్యం కాని కాఠిన్యం. అతని దృష్టిలో వరూధిని వలపు పరమ నికృష్టమైన దుష్కార్యం. ఈ రెండు పాత్రలను పెద్దన ఆత్మిక శక్తితో, మనోధర్మ విజ్ఞానం, సంభాషణా చాతుర్యంతో, అద్వితీయ శిల్పసామర్థ్యంతో, నాటకీయ తాటస్థ్యంతో భావకుల మనోనేత్రాలకు సజీవులై కన్పించేటట్లు చిత్రించాడు.

### 9.2.6. రస నిర్ణయం :

ప్రబంధంలో శృంగార రసం ప్రధానంగా అవసరాన్నిబట్టి తక్కిన రసాలు పోషింపబడాలని సామాన్య నిర్దేశం. మనుచరిత్రలోని ప్రధాన రస నిర్ణయంలో అభిప్రాయ భేదాలున్నాయి. వరూధిని ప్రవరుల కథలో శమప్రధానుడైన ప్రవరుడు ఆలంబనంగా అంగిరసం శాంతమని, ప్రణయ ప్రధానమైన వరూధిని ఆలంబనంగా శృంగార రసం అంగరసమని పింగళి లక్ష్మీకాంతంగారన్నారు. ధర్మవీరకు

ప్రధాన రసమని సముద్రాల నాగయ్యగారు సోదహరణంగా నిరూపించారు. ప్రవరుడు గృహస్థ ధర్మాలును పాటించే ధర్మవీరుడు. ప్రవరుడు ఏకపత్నీవ్రతుడు. అందుచేతనే వరూధినిని తిరస్కరించాడు. కర్మదీక్షా పరతంత్రుడు కాబట్టి ఇల్లు చేరకపోయిన సమస్త ధర్మాలు మంటకలుస్తాయని దుఃఖించాడు. పుణ్యతీర్థ క్షేత్రాదులు శమప్రధానులను ఆకర్షించును గాని ప్రవరుని మాత్రం గృహదారాదుల నుండి విముఖుని చేయలేకపోయాయి. దీనిని బట్టి ప్రవరుడు రాగద్వేషాదుల కతీతుడు కాడని గృహస్థ ధర్మాలను పాటించి ధర్మవీరుడని తెలుస్తున్నది. ప్రధాన నాయకుడైన స్వరోచిలో జన్మతః ఉత్సాహం కలిగింది. వివాహానికి ముందు యుద్ధవీరుడు. వివాహమైన తర్వాత ముగ్గురు భార్యలతో సుఖమనుభవించడంవల్ల శృంగారం పోషింపబడింది. స్వరోచి రాక్షసుల ఘోరయుద్ధంలో వీరభయానకాలు, స్వరోచి హరిణాన్ని కౌగలించుకొనే సన్నివేశంలో ఆమె వనదేవతగా మారడంలో అద్భుతరసం, స్వారోచిషుని తపస్సు కాలంలో శాంతరసం, మనువు పట్టాభిషేకానంతరం ధర్మవీరం పోషింపబడింది. ఈ విధంగా మనుచరిత్రలో సర్వత్రా ధర్మ వీరమ్ ప్రధానరసంగా విలసిల్లింది.

### 9.2.7. వర్ణనల ఔచిత్యం :

ప్రబంధంలో వర్ణనలు కవియొక్క నిశిత పరిశీలనకు, లోకజ్ఞతకు, కల్పనా చాతుర్యానికి దీపికలు. మనుచరిత్రలో కథకు, వర్ణనలకు సమప్రాధాన్యమీయబడింది. పెద్దన వర్ణనలు స్వాభావికమై కథాగతికి అనుకూలంగా ఉంటాయి. పెద్దన ప్రవరుడు చూచిన హిమగిరిని వర్ణించాడు.

చ. "అటజని కాంచె భూమిసురుడంబర చుంబి శిరస్సరజ్ఝరీ
పటల ముహుర్ముహుర్లు ఠదభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుటనటనానుకూల పరిపుల్ల కలాప కలాపి జాలమున్
గటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్"

(మ. చ. 2 - 3)

ఇచట ప్రకృతి రమ్యంగా వర్ణించబడింది. ఆకాశమునంటు శిఖరాగ్రాలనుండి ప్రవహించు సెలయేళ్ళ అలల చప్పుడు మద్దెలల మ్రోతవలె విన్పించగా పించాలను విప్పి నెమళ్ళు ఆ ధ్వనికి తగినట్లు నాట్యమాడుతున్నాయి. పర్వతము మధ్య ఆడ ఏనుగులు తొండాలతో చెట్లను పట్టి ఊపుతున్నాయి. ఇది ప్రయోజనకరమైన వర్ణన. ఈ పద్యంలో ధ్వని, భావికథా సూచనముంది. తరంగ నిస్వనానికి నెమలి నాట్యం చేస్తుంది. ప్రవరుని చూచి వరూధిని యను నెమలి నాట్యం చేస్తుంది. కరేణువనగా ఆడ ఏనుగు. అది వరూధినియే. వృక్షము స్థిరుడైన ప్రవరుడు. ఏనుగు సాలాన్ని కంపింపచేసి విసిగి వెడలిపోయింది. వరూధిని ప్రవరుని కంపింప చేయ ప్రయత్నించింది కాని విఫలమైంది. ఇంత భావ్యార్థ సూచకాన్ని పెద్దన ప్రకృతి రామణీయకతతో పాటు స్ఫురింపచేశాడు.

పెద్దన చరద్రూపములను చిత్రించుటలో మేటి. వరూధిని ప్రవరుని చూచినప్పుడు -

"చూచి ఝుళం ఝుళత్కటిక సూచిత వేగ పదార విందయై
లేచి కుచంబులుం దుఱుము లేనడు మల్లలనాడ నయ్యెడన్
బూచిన యొక్క పోకనును బోదియ జేరి విలోకన ప్రభా
వీచికలన్ దదీయ పదవీకలశాంబుధి వెల్లి గొల్పుచున్

(మ. చ. 2 - 29)

కాలియందెలు ఘల్లుమని ధ్వనించగా తటాలున లేచి సన్నని నడుము అటుఇటు చలించగా పుష్పించిన పోకచెట్టు ప్రానుచాటున చేరి నిలుచుండి ప్రవరుడు వచ్చే మార్గాన్ని చలించుచున్న తెల్లని కన్నుల కాంతులు క్రమ్ముకొనగా చూచుచు నిలిచిందట. ఇట చిత్రకారుడు కూడ చిత్రించలేని వరూధిని మూర్తిని పెద్దన సృష్టించాడు.

వరూధిని చూచిన ప్రవరుని రూపరేఖావిలస వర్ణన పెద్దన కల్పితం. ప్రవరుడు అగ్నిహోత్రుని ప్రార్థించి తన గృహమునకు వెడలిన తర్వాత వరూధిని యొక్క విరహబాధను అనుభవించే సందర్భంలో అస్తమిస్తున్న సూర్యుడు, వరూధినిని నిరాకరించి మన్మధ బాధకు గురిచేసి ప్రవరుడు కఠినమైన మనసుతో వెళ్ళాడనే కోపంతో ఎఱ్ఱబారినట్లు పెద్దన ఉత్ప్రేక్షించి కథకు సంబంధం కల్పించాడు.

వరూధిని హృదయం విరహవేదనలో అంధకారమావరించింది. అపుడు చంద్రోదయమైంది. వెన్నెల విరహిణులకు సుఖాన్నీయదు కాబట్టి పెద్దన వెన్నెలను చిచ్చుతో పోల్చాడు.

ఈ విధంగా పెద్దన ఉచితమగు మితమైన వర్ణనలు చేశాడు. అష్టాదశవర్ణనలలో మధుపానంతపు తక్కిన వాటినన్నిటిని వర్ణించాడు. పెద్దన వర్ణనలు కథాసందర్భోచితమై కథాకార్యమునకావశ్యకములై ఒప్పాయి.

### 9.2.8. సుధామయోక్తులు :

సహజమైన మనోరంజకంగా నున్న మృదుమధురోక్తులను పెద్దన "సుధామయోక్తుల" నినారు. మృదుమధుర పదగుంఫితం, విపులార్థ భావస్ఫోరకం, మురువుగా నురవడించు రసప్లావనం, కావ్య గౌరవ శోభాకర మనోహరాలంకార కల్పనం ....... ఈ గుణాలన్నీ కలిపి సుధామయోక్తులైనాయి. పెద్దన సుధామయోక్తులు "అల్లిక జిగిబిగి" తో కూడినవి. రాయలు పెద్దనను "శిరీష కుసుమ పేశీల సుధామయోక్తులతో" రచించిమన్నారు. అదే విధంగా తన ప్రబంధాన్ని రచించినట్లు కన్పిస్తున్నది. కథాగమన మనోహరత్వాని చాటు మృదుల పద సంఘున బిగి, మృదు పద సంఘటనకు మాధురీ మహిమ చేకూర్చు సరళ భావ పరంపరల పొందిక "బిగి", పెద్దన కవిత యందీ జిగిబిగి మనుచరిత్ర కావ్యమంతటా అల్లిబిల్లిగా అల్లుకొంది. పెద్దన ప్రవరుడు గాంచిన హిమాలయమును వర్ణిస్తూ "అటజని కాంటె భూమిసురుడ"ను పద్య పెద్దన ధారాశుద్ధికి, శయ్యాసౌభాగ్యానికి నిదర్శనం.

> "అటజని కాంటె భూమిసురు డంబర చూబి శిరస్సర ఝరీ
> పటలము హుర్మ్ము హుర్లు తదభంగ తరంగ మృదంగ విస్స్వన
> స్ఫుట నటనానుకాల పరిపుల్ల కలాప కలాపి జాలమున్
> గటక చరత్కరేణు కరకంపిత సాలము శీత శైలమున్"

ఈ పద్యంలో "శిరస్సరఝరీ" అన్నపుడు పైనుండి దుముకు జలపాత స్ఫురణ ధ్వనిస్తున్నది. "కలాప కలాపి" అను మాటలలో విచ్చుకొన్న ఫించాలు రూపుకడ్తాయి. "అభంగతరంగ మృదంగ" అను అనుప్రాసలో మృదంగవాదం వీనులకు సోకుతుంది. ఈ పద్యంలో ఏ శబ్దాన్ని తొలగించినా అంతకంటే అచట సరిపోయే శబ్దాన్ని కూర్చడం అసాధ్యం. దేనికదే గొప్ప అర్థాన్ని ప్రకాశింప చేస్తున్నది. మేఘ గంభీర కంఠధ్వని గల ప్రవరుని చూచి వరూధినియను నెమలి నాట్యం చేసిందనే భావి భావం స్ఫురిస్తుంది. ఆడ ఏనుగు వరూధిని, వృక్షం స్థిరుడైన ప్రవరుడు. ఏనుగు సాలాన్ని కంపింపచేసి వెడలిపోతుంది. వరూధిని ప్రవరుని కంపింప చేయ ప్రయత్నించి వరూధిని విఫలమైంది. ఈ పద్యంలో హిమవన్నగ వర్ణన కళ్ళకు కట్టినట్లు వర్ణించడమేగాక భావ్యార్థ్య సూచకంగా ఉంది.

వరూధినిని వర్ణిస్తూ పెద్దన "విద్యుల్లతా విగ్రహ" శతపత్రేక్షణ, చంచరీకచికుర, చంద్రాస్య, చక్రస్తని నతనాభి", అను ఆరు విశేషణాలు పేర్కొన్నాడు. ప్రవరుని వర్ణిస్తూ "కమ్మని కుందీనంబు గసుగందీని మేను, ఎలదేఁటి దాటులన్ బమ్మెర వోవఁ ద్రోలు

వెంట్రుకలు, ఇందుబింబమున్ గిమ్మన నీని మోము, గిరిక్రేపులు మూపులు. కౌను కానరాదు వికటాంబకముల్ శీతపత్ర జైత్రముల్'' అను ఆరు విశేషణములచే పెద్దన కూర్చాడు. పెద్దన ప్రవరుని అందచందాలను వరూధిని కంటె అధికంగా వర్ణించి ప్రవరునిపై వరూధినీ వలపుకు బలమైన హేతువు కల్పించి స్వరోచి సంభవానికి కారణం కల్పించాడు. పద్యరచనా శిల్పం, శబ్దసంధానం భావగాంభీర్యం చక్కగా సమ్మేళనాన్ని పొంది 'అల్లసాని వాని యల్లిక జిగిబిగి'' అను పదానికి అర్థం కల్పించింది.

ఈ విధంగా పెద్దన మనుచరిత్ర వివిధ ప్రబంధ లక్షణోపేతమై శిరీష కుసుమ పేశల సుధామయోక్తులతో రచింపబడింది. కృష్ణదేవరాయలు తన కిచ్చిన బిరుదును పెద్దన సార్థకమొనర్చుకున్నాడు.

## 9.3. అల్లసాని పెద్దన :

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో అగ్రగణ్యుడు ప్రథముడు అల్లసాని పెద్దన. కృష్ణరాయలకు హితుడు. సంస్కృతాంధ్రాలలో సమంగా కవిత చెప్పి స్వయంగ రాయలచే గండపెండేరాన్ని తొడిగించుకొన్నాడు పెద్దన. రాయల మెప్పు పొంది కోకటం, తనెంపూడి మొదలైన అగ్రహారాలను బహుమతిగా అందుకున్న విద్యత్కవి. "కోకట గ్రామద్యనేకాగ్రహారము లడిగిన సీమలయందు నిచ్చెనను'' పాదాన్ని బట్టి రాయలు పెద్దనకు కోకటగ్రామాన్నే గాక మరికొన్ని గ్రామాలను కూడా ఇచ్చినట్లు తెలుస్తున్నది. అగ్రహారాలనే గాక కటకాదిసీమ నాయకరం కూడా ఇచ్చి గౌరవించినట్లు తెలుస్తున్నది.

చ. నిరుపహతి స్థలంబు రమణీ ప్రియ దూతిక తెచ్చియిచ్చుక
పుఁరవిడె మాత్మ కింపయిన భోజనము య్యెలమంచ మొప్పుత
ప్పొరయు రసజ్ఞ లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకిన గాక యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే

అనే చాటు పద్యాన్ని బట్టి రాజోచిత భోగాలనుతించినా ఔదార్యసంపన్నుడని, వైష్ణవ మతాన్నవలంబించినా శివునియందు కూడా భక్తి కలిగియున్నాడని పెద్దన వేయించిన దానశాసనం వల్ల తెలుస్తున్నది. కోకట గ్రామంలోని కొంత భాగాన్ని ఆ గ్రామంలోని సకలేశ్వర దేవునికి ధూపదీప నైవేద్యాలకై దానం చేసినట్లు మరికొంత భాగం చెన్నకేశవ స్వామివారి దీపారాధనకు దానం చేసినట్లు శాసనాల వలన తెలుస్తున్నది. కోకట గ్రామాన్ని వైష్ణవులకు అగ్రహారంగా ఇచ్చి గురువు స్మృత్యర్థం దానికి శఠకోప పురమని పేరు పెట్టాడట. కోకట గ్రామ కైఫీయతులో పినాకిని నుండి కోకట గ్రామానికి ఒక కాలువ తవ్వించినట్లు చెప్పబడింది.

పెద్దన బళ్ళారి ప్రాంతమందలి దూపాడు పరగణాలోని దోరాల గ్రామంలో జన్మించాడని కవిచరిత్రలో ఉంది. కొందరు విమర్శకులలో కడప మండలం కమలాపురం తాలూకాలోని కోకట గ్రామమో, పెద్దనపాడో అని అభిప్రాయం. పెద్దన చొక్కయా మాత్యుని పుత్రుడు. అన్నూరు శాసనాన్ని బట్టి పెద్దన ఋగ్వేద శాఖీయుడని, అశ్వలాయన సూత్రుడని, వసిష్ఠ గోత్రుడని తెలుస్తున్నది. రాయల కొలువులోని కవులలో వయసుచేత, ప్రతిభాసంపద చేత పెద్దయైన పెద్దన రాయలచే అపార గౌరవ సత్కారాలను పొందాడు. రాయలు గండపెండేరాన్ని స్వయంగా పెద్దన కాలికి తొడిగి, ఆంధ్ర కవితాపితామహ బిరుదునిచ్చి మనుచరిత్ర అందుకొనేవేళ పల్లకి రాయలు పట్టుకొని ఎత్తుట ఇందుకు నిదర్శనాలు.

పెద్దన హరికథాసారము, మనుచరిత్రమను రెండు కావ్యాలను రచించాడు.

### 9.3.1. హరికథాసారము :

మనుచరిత్ర ప్రబంధ రచనకు ముందు పెద్దన హరికథాసారమను ఒక ప్రబంధాన్ని రచించినట్లు లాక్షణికులుదాహరించిన పద్యాలను బట్టి తెలుస్తున్నది. అందులోని షష్ఠ్యంతులతో కూడిన ఒక పద్యాన్ని బట్టి దీనిని శఠకోపయతికే అంకితం చేయబడిందని

తెలుస్తున్నది. కాని ఆ గ్రంథం లభించలేదు. లభ్యములైన ఏడెనిమిది పద్యాలను బట్టి ఇందులో శ్రీహరి అవతార కథలు వర్ణింపబడినట్లు తెలుస్తున్నది.

### 9.3.2. మనుచరిత్ర :

హరికథాసారము తర్వాత పెద్దన 'స్వారోచిషమనుసంభవము' అనే ఉత్తమ ప్రబంధాన్ని రచించాడు. మనుచరిత్ర ఆంధ్రసాహిత్య చరిత్రలో పంచకావ్యాలలో ఒకటిగా పరిగణింప బడడమేగాక ప్రబంధాలకు శిరోభూషణమై అలరారుచున్నది. మనుచరిత్రను పెద్దన రాయలకే అంకితంగావించాడు. రాయలు తనను మనుచరిత్ర వ్రాయమని అడిగిన పరిస్థితులను మనుచరిత్ర అవతారికలో వర్ణించాడు. రాయలు భువనవిజయ సభలో సింహాసనంపై కూర్చుండి ప్రాజ్ఞులతో కవితా గోష్ఠి చేస్తూ పెద్దనను చూచి

తే. 'సప్త సంతానములలోఁ బ్రశస్తిఁ గాంచి
ఖిలము గాకుండునది ధాత్రిఁ గృతియూన
కృతిరచింపుము మాకు శిరీష కుసుమ
పేశల సుధామ యోక్తులఁ బెద్దనార్య! 1 - 14

క. హితుడవు చతుర వచో నిధి
వతుల పురాణాగ మేతిహాస కథార్థ
స్మృతియుతుడ వాంధ్ర కవితా
పితామహుఁడ వెవ్వరీడు పేర్కొనసీకున్ 1 - 15

క. మనువులలో స్వారోచిష
మనుసంభవ మరయ రస సమంచిత కథలఁ
విననింపు కలిధ్వంసక
మనఘ! భవచ్చతుర రచన కనుకూలింబునన్ 1 - 16

కావున మార్కండేయ పురాణోక్త ప్రకారంబు చెప్పుమని అడిగి కర్పూర తాంబూల మిచ్చాడు. పెద్దన గద్యములో తన కావ్యాన్ని "స్వారోచిష మనుసంభవమ"ని పేర్కొన్నాడు. కాని మనుచరిత్రమనే పేరు ప్రచారంలో ఉంది. ఈ కావ్యంలో స్వారోచిషమను జనన వృత్తాంతమే కాని అతని చరిత్ర లేదు. అందువలన స్వారోచిషమను సంభవమనుట ఉచితం కాని 'మనుచరిత్ర' అందుకొనువేళ అని పెద్దనే పేర్కొనడంవలన ఆ సంక్షిప్త నామమ్ లోకమున ఎక్కువ ప్రచారం పొందింది. కృష్ణరాయల కోరిక మేరకు మనుచరిత్ర ప్రబంధాన్ని రచించి కృష్ణదేవరాయలకే అంకితమిచ్చాడు.

మనుచరిత్రకు మూలం మార్కండేయ పురాణం. మారన దీనిని తెలుగులోనికి అనువదించాడు. పెద్దన సంస్కృతాంధ్ర మూలములను రెండింటిని అనుసరించాడు. మూలానికి మెరుగులు దిద్ది ప్రబంధరీతికి అనువుగా వర్ణనలు చేసి ఒక మహాప్రబంధంగా దిద్ది తీర్చాడు.

### 9.3.2. మనుచరిత్ర ఇతివృత్తం :

అరుణాస్పదమందలి విప్రోత్తముడైన ప్రవరుడు సిద్ధుడు పూసిన పాదలేపంతో హిమవత్పర్వత ప్రాంతానికి వెళ్ళి అచటి పుణ్య ప్రదేశాలను చూసి ఆనందించాడు. మధ్యాహ్ననికి నిత్యకర్మానుష్ఠానం, మాధ్యాహ్నికం మొదలైనవి నిర్వరింప వలసినవాడై ఇక ఇంటికి తిరిగి పోదలచగా మంచువలన సిద్ధుడు పూసిన పాదలేపము కరిగి పోవడంవల్ల వెళ్ళలేక ఎవరైనా ఇంటికి దారి

చూపించరాయని వెదుకుచూ ఒకచోట గారుడోత్కీర్ణమైన భవనంలో వీణవాయించుచున్న ఒక దేవకాంతను చూచాడు. ఆమె ప్రవరుని చూచిన వెంటనే ముగ్ధురాలై మోహించి అతని పొందు కోరింది. కాని ధర్మదీక్షాపరతంత్రుడైన ప్రవరుడు నిరాకరించి అగ్నిహోత్రుని ప్రార్థించి స్వగృహాన్ని చేరుకొన్నాడు. వరూధిని ప్రవరుని కొరకు వియోగం అనుభవించుచున్న సమయంలో పూర్వ వరూధినిచే నిరాకరించబడిన గంధర్వుడు ఇదే అదనుగా భావించి ప్రవరుని వేషంలో వచ్చి ఆమెను మోసపుచ్చి సుఖించగా వారికి కొంతకాలానికి స్వరోచి అనే కుమారుడు కలిగాడు. స్వరోచి పెరిగి పెద్దవాడై వేటకు వెళ్ళి రాక్షస రూపంలో వున్న ఇందీవరాక్షుని శాపవిముక్తుని చేసి అతని కుమార్తె మనోరమను వివాహం చేసుకున్నాడు. ఈమెతో పాటు ఈమె చెలులగు విభావసి, కళావతీ, లను పెండ్లాడి వారి యందు విజయుడు, కురునందనుడు, విభావసుడు అను కుమారులు పొందాడు. తరువాత ఒకనాడు స్వరోచి వేటకు వెళ్ళినప్పుడు ఆడజింక ఒకటి అతని దగ్గరకు వచ్చి తనను కౌగిలించుకోమని కోరగా అతడామె కోరిక తీర్చాడు. వెంటనే ఆమె వనదేవతగా మారింది. ఆమెను పరిగ్రహించిన కొంతకాలానికి స్వారోచిషుడు అనే కుమారుడు పుట్టాడు. స్వారోచిషుడు విష్ణుమూర్తిని ప్రసన్నుని గావించుకొని విష్ణువు అనుగ్రహంచే రెండవ మనువుగా రాజ్యాన్ని పాలించాడు.

### 9.3.2(అ) పాత్రచిత్రణ :

పెద్దన కవితా ప్రతిభకు నిదర్శనం వరూధినీ ప్రవరాఖ్యుల ఘట్టం. ఈ ఘట్టంలో పెద్దన పాత్రలను పోషించిన తీరు అపూర్వం. ప్రవరుని పాత్రను వర్ణిస్తూ -

ఉ. "ఆపురిఁ బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి భా
షాపర శేషభోగి వివిధాధ్వర నిర్మల ధర్మకర్మ దీ
క్షా పరతంత్రుఁ డంబురుహ గర్భ కులాభరణం బనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యుఁ డలేఖ్య తనూ విలాసుడై 1 - 51

ఆ.వె. వాని చక్కదనము వైరాగ్యమునఁ జేసి
కాంక్ష సేయు జారకామినులకు
భోగబాహ్యమయ్యెఁ చూచిన సంపెంగ
పొలుపు మధు కరాంగనలకుఁ బోలె 1 - 52

అని ప్రవరుని గుణగణములను స్పష్టంగా చిత్రీకరించాడు.

ప్రవరుడు శ్రోత్రీయ బ్రాహ్మణోత్తముడు. అతడు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి. భాషపరశేష భోగి. కర్మఠుడు. నిరంతర ధ్యాపన తత్పరుడు. అతడు అనుకూల వతియైన భార్యతో, తలిదండ్రులతో కూడి అతిథి అభ్యాగతులకు సేవచేసేవాడు. వరూధినిని వర్ణిస్తూ -

మ. "అతఁడావాత పరంపరా పరిమళ వ్యాపార లీలన్ జనా
న్విత మిచ్చోటని చేరఁబోయి కనియె న్విద్యుల్లతా విగ్రహన్
శతపత్రేక్షణఁ జంచరీక చికురన్ జంద్రాస్యఁ జక్రస్తనిన్
నీతనా భిన్నవలా నౌకానౌక మరున్నారీ శిరోరత్నమున్ 2 - 25

ప్రవరాఖ్యుడు గాలివాటుగా వచ్చిన వాసనను బట్టి వరూధిని ఉన్న తావుకు వెళ్ళి వరూధిని చూసినపుడు వరూధిని అందం వర్ణించబడింది. మెరుపుతీగ వంటి శరీరం, తామరల వంటి కనులు, తుమ్మెదలు వంటి తలవెంట్రుకలు, చంద్రునివంటి ముఖము, చక్రవాకముల వంటి చనులు, లోతయిన నాభిగల దేవతా స్త్రీయైన వరూధిని అందం అందంగా వర్ణించబడింది.

రసాధి దేవతయైన వరూధిని ప్రవరుని చూచి

ఉ. “చూచి ఝుళం ఝుళత్కటక సూచిత వేగ పదారవిందయై
లేచి కుచంబులుందుఱుమ లేనడుమల్లలనాడ నయ్యెడన్
బూచిన యొక్క పోఁకనును బోదియఁ జేరి విలోకన ప్రభా
వీచికలన్ దదీయ పదవీ కలశాంబుధీ వెల్లిగొల్పుచున్ 2 - 29

ప్రవరుని సౌందర్యానికి ముగ్ధురాలైన వరూధిని మనోభావాలను చరద్రూపంలో చిత్రించాడు పెద్దన. వరూధిని తన స్థితిని తెల్పుటకు అందెల ఝుళం ఝుళలను విన్పించింది. తన సొగసును తెల్పుటకు కుచాలను సర్దుకొంది. అంతేకాడు ప్రవరుని చూచి “ఎక్కడివాడో? యక్షతనయేందు జయంత వసంతకంతులం చక్కదనంబున గెలువ జాలెడు వాడ”ని అతని మార్గానికి అడ్డంగా నిలిచి వలపును ఆపుకోలేక అతని కౌగిలించుకొని అధరమిమ్మని కోరింది. ఈ సన్నివేశం వరూధిని ధైర్యాన్ని సూచిస్తున్నది. పై పద్యంలో వరూధిని చరద్రూపాన్ని కళ్ళకు కట్టించాడు పెద్దన.

### 9.3.2(ఇ). వస్త్వైక్యం :

ఈ కావ్యం నందలి ప్రవర, మాయాప్రవర, స్వరోచి, స్వారోచిషుల కథలన్నియు జిగిబిగి కలవై పరస్పరాశ్రయములై వస్త్వైక్యం కలిగి కథా నిర్మాణ చాతుర్యాన్ని వెల్లడి పరుస్తున్నవి.

### 9.3.2(ఈ) రస నిర్ణయం :

ప్రబంధంలో శృంగార రసం ప్రధానంగా అవసరాన్ని బట్టి తక్కిన రసాలు పోషింపబడాలని సామాన్య నిర్దేశం. మనుచరిత్ర ప్రబంధంలోని రసనిర్ణయంలో అభిప్రాయ భేదాలున్నాయి. వరూధిని ప్రవరుల కథలో శమ ప్రధానుడైన ప్రవరుడు ఆలంబనంగా అంగిరసం శాంతమని, ప్రణయ ప్రధానమైన వరూధిని అలభ్యంగా శృంగార రసం అంగ రసమని” పింగళి లక్ష్మీకాంతంగారన్నారు. సముద్రాల నాగయ్య గారు “ప్రవరాలంబనంగా ధర్మవీరమ్ ప్రధానరసమని” సోదాహరణంగా నిరూపించారు. ప్రవరుడు గృహధర్మాలను పాటించే ధర్మవీరుడు. ప్రవరుడు ఏకపత్నీవ్రతుడు. అందువల్లే వరూధినిని తిరస్కరించాడు. కర్మదీక్షా పరతంత్రుడు కాబట్టి ఇల్లు చేరక పోయినా సమస్త ధర్మాలు మంట కలుస్తాయని దుఃఖించాడు. పుణ్యతీర్థ క్షేత్రాదులు శమప్రధానులను ఆకర్షించును గాని ప్రవరుని మాత్రం గృహదారాదుల నుండి విముఖుని చేయలేక పోయాయి. దీనిని బట్టి ప్రవరుడు రాగద్వేషాలకతీతుడు కాడని గృహస్థ ధర్మాదులను పాటించు ధర్మవీరుడని తెలుస్తున్నది. ప్రధాన నాయకుడైన స్వరోచిలో జన్మతః ఉత్సాహం కలిగింది. వివాహానికి ముందు యుద్ధవీరుడు. వివాహమైన తర్వాత ముగ్గురు భార్యలతో సుఖమనుభవించడం వల్ల శృంగారం పోషించబడింది. స్వరోచి రాక్షసుల ఘోర యుద్ధంలో వీరభయానకాలు, స్వరోచి హరిణాన్ని కౌగలించుకొనే సన్నివేశంలో ఆమె వనదేవతగా మారడంలో అద్భుతరసం, స్వారోచిషుని తపస్సు కాలంలో శాంతరసం, మనువు పట్టాభిషేకానంతరం ధర్మవీరం పోషింపబడింది. ఈ విధంగా మనుచరిత్రలో సర్వత్రా ధర్మవీరమ్ ప్రధానరసంగా విలసిల్లింది.

### 9.3.2.(ఉ) వర్ణనల ఔచిత్యం :

మనుచరిత్రలో వర్ణనలకు కథతో సమానంగా ప్రాధాన్యమీయబడింది. పెద్దన వర్ణనలు స్వాభావికమై కథాగతికి అనుకూలంగా ఉంటాయి.

ప్రవరుడు గాంచిన హిమగిరి సౌందర్యాన్ని పెద్దన వర్ణిస్తూ

చ. "అటజని కాంచె భూమిసురు డంబరచుంబి శిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లు ఠదభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుట నటనానుకాల పరిఫుల్ల కలాపకలాపి జాలమున్ 2 - 3

ఆకాశమునంటు శిఖరాగ్రాలనుండి ప్రవహించు సెలయేళ్ళ అలల చప్పుడు మద్దెలల మ్రోతవలె విన్పించగా పింఛాలను విప్పి నెమళ్ళు ఆ ధ్వనికి తగినట్లు నాట్యమాడుతున్నాయి. పర్వతము మధ్య ఆడ ఏనుగులు తొండాలతో చెట్లను పట్టి ఊపుతున్నాయి. ఇది ప్రయోజనకరమైన వర్ణన. ఈ పద్యంలో ధ్వని, భావ కథా సూచనుంది. తరంగ విస్వనానికి నెమలి నాట్యం చేస్తుంది. కరేణువనగా ఆడ ఏనుగు. అది వరూధినియే. వృక్షము స్థిరుడైన ప్రవరుడు. ఏనుగు సాలాన్ని కంపింపచేసి విసిగి వెళ్ళిపోయింది. వరూధిని ప్రవరుని కంపింపచేయ ప్రయత్నించింది కాని విఫలమైంది. ఇంత భావ్యార్థ సూచకాన్ని పెద్దన ప్రకృతి రామణీయకతతో పాటు స్ఫురింపచేశాడు.

పెద్దన వర్ణించిన సాయం వర్ణన

చ. "తరుణి ననన్యకాంత నతిదారుణ పుష్పలీ ముఖ వ్యథా
భరవి వశాంగి నంగభవు బారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోష భీషణ
స్ఫురణ వహించె నోయన నభోమణి దాల్చెఁ గషాయ దీధితన్ 2 - 10

పెద్దన సాయంకాల వర్ణనను ప్రకృత కథతో సంబంధాన్ని కల్పించి వర్ణించాడు. సూర్యుడస్తమించినపుడు కషాయదీధితి దాల్చడం సహజం. దానిని ప్రవరుడొనర్చిన వరూధినీ తిరస్కార జనిత రోషంగా చిత్రించి వర్ణనకు కథకు సంబంధం కల్పించాడు.

చంద్రోదయ వర్ణన -

మ. జలజాగార పరంపరల్ మఘవదా శాభిత్తిఁ దీంద్రించుచున్
దళమై వెన్నెల చిచ్చు లంటిన మిళద్బాహ్యచ్ఛద శ్యామికా
చ్ఛలనం గంది ముడుంగుచో సిమసిమచ్ఛ బ్దంబుతోఁ బుట్టున
గ్గల పుం గ్రొంబొగలో యనంగ వెడలెన్ గర్భనస్వ నద్భృంగముల్ 3 - 22

కటిక చీకటి మెల్లమెల్లగా దశదిశలు ఆక్రమించింది. వరూధిని హృదయంలో అంధకారం ఆవరించింది. అపుడు చంద్రోదయమైంది. వెన్నెల విరహిణులకు సుఖమునివ్వదు. అందుకే పెద్దన వెన్నెలను చిచ్చుతో పోల్చి వర్ణించాడు. చంద్రోదయంతో కమలాలు ముడుచుకున్నాయి. వరూధిని హృదయ కమలం కూడ ముడుచుకుందని వరూధిని విరహానికి తగినట్లు వర్ణించాడు పెద్దన.

### 9.3.2(ఈ) అల్లసాని అల్లిక జిగిబిగి :

అల్లసాని వాని అల్లిక జిగిబిగియని చాటూక్తి ఉంది. "జిగి" అనగా అర్థానికి సంబంధించింది. దానికి కాంతి అని అర్థం కూడా చెప్పవచ్చు. అనగా రసవంతములగు భావాలతో కూడిందని అర్థం. "బిగి" అనగా సుందరములగు పదాల కూర్పు లేక కథల కూర్పు అని అర్థం. పెద్దన మనుచరిత్రలో జిగిబిగి అనే గుణాలున్నాయి. పెద్దన పద్యాలలో కూర్పున చూపిన నేరు అద్వితీయం. పద్యాలు మృదు పదలలితాలు. కవితలో మాధుర్యం పదలాలిత్యం వలన కలుగుతుంది. ఇటువంటి కవిత్వమే

పాఠకునకు తన్మయత్వం కలిగించి రసానందం కలిగించి బ్రహ్మానందాన్ని పొందిస్తుంది. ఇదే కావ్య ప్రయోజనం కూడా. ఇటువంటి ప్రయోజనమే పెద్దన కవిత్వంలో ఉంది.

ఉ. ఎక్కడి యూరు? కాల్నిలువ కింటికి బోయెదనంచుఁ బల్కెదీ
వక్కట మీ కుటీర నిలయంబులకున్ సరిరాక పోయెనే
యిక్కడి రత్న కందరము లిక్కడి నందన చందనోత్కరం
బిక్కడి గొంగ సైకతము లిక్కడి యీలవలీ నికుంజముల్ 2 - 50

ఈ పద్యములోని కవిత చవులూరించు మధురద్రాక్ష పాకాన ఉంది. జిగిబిగికి ఉదాహరణ ఈ పద్యం. ఇటువంటి పద్యాలు అనేకం మనుచరిత్రలో ఉన్నాయి.

తీర్థయాత్రపై కోరికతో ప్రవరుడు "నను మీ శిష్యుని తీర్థయాత్ర వలనన్ ధన్యాత్ముగా జేయరే" అని సిద్ధుని ప్రార్థించగా సిద్ధుడు ఒక పసరును ప్రవరుని పాదాలకు పూసి వెళ్ళినాడు. ఈ సందర్భంలో ప్రవరుడు హిమాద్రికి ఏ విధంగా వెళ్ళాడు? ఎపుడు వెళ్ళాడు? నడిచి చేరాడా? ఎగిరి వెళ్ళాడా? అనే ఊహను పెద్దన పాఠకునకే విడిచిపెట్టాడు. ఈ విధంగా చేయడం కథకు పటుత్వం కొరకే. ఇదే కథానిర్మాణంలోని జిగిబిగి.

### 9.3.2.(బు) అలంకారిక రచన :

మనుచరిత్ర ప్రబంధంలో అలంకారాలు ప్రత్యేక స్థానాన్ని పొందాయి.

ఉ. తొంగలిఱెప్పలం దొలగఁ ద్రోయుచుఁ బైపయి విస్తరిల్లుక
న్నుంగవ యాక్రమించు కొనునో ముఖ చంద్రు నటంచుఁ బోవనీ
కంగజుఁ డాన వెట్టి కదియన్ గుఱి వ్రాసెననంగ జాఱిసా
రంగ మదంబు లేఁ జెమట గ్రమ్మె లలాట ముడిగ్గి చెక్కులన్ 2 - 32

వరూధిని విశాలమైన కన్నులతో రెప్ప వాల్చక చూస్తున్నది. అవి ముఖానంతటిని ఆక్రమించునేమోయని తలచి మన్మధుడు అంతకు మించి పోరాదని గీటు గీచినట్లు కస్తూరి బొట్టు కరిగి చెక్కిలి మీద స్రవించిన చారతోచిందట! ఈ పద్యంలోని ఉత్ప్రేక్షాలంకారం పెద్దన ఆలంకారిక రచనకు ఉదాహరణ.

పెద్దన మనుచరిత్ర ప్రబంధం సకల శాస్త్ర పాండిత్యాల సమ్మేళనం. పెద్దనకు గల వేదాంత పరిజ్ఞానం, సంగీత శాస్త్ర ప్రావీణ్యం ఈ ప్రబంధం ద్వారా తెలుస్తున్నది. పెద్దన తన ప్రతిభా, చాతుర్యాన్ని చూపి మనుచరిత్రను ఉత్తమ ప్రబంధంగా తీర్చిదిద్ది ఆంధ్ర కవితాపితామహుడయ్యాడు.

### 9.4. రాదగిన ప్రశ్నలు :

1. పెద్దన మనుచరిత్రలోని కవితావైశిష్ట్యాన్ని వివరించండి.
2. పెద్దన మనుచరిత్ర ఉత్తమ ప్రబంధం సోదాహరణంగా విశదీకరించండి.
3. పెద్దన కవితా విశిష్టతను విపులీకరించండి.
4. 'మనుచరిత్ర ప్రబంధరాజం' - వివరించండి.
5. ప్రబంధ లక్షణములను తెలిపి మనుచరిత్రతో సమన్వయించండి.

## 9.5. ఆధార గ్రంథాలు :

1. తెలుగుసాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. తెలుగుసాహిత్య చరిత్ర - తెలుగు అకాడమి
4. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము - ఖండవల్లి లక్ష్మీరంజనం

డాక్టర్ యం. స్వర్ణలతాదేవి
ఎం.ఏ.,యం.ఫిల్. పి.హెచ్‌డి.
రీడర్ & తెలుగు శాఖాధిపతి
టి.జె.పి.యస్. కళాశాల
గుంటూరు.

# పాఠం - 10

# ప్రబంధ కవులు

10.0 లక్ష్యం
10.1 నంది తిమ్మన
10.2 ధూర్జటి
10.3 రామరాజభూషణుడు
10.4 పింగళి సూరన
10.5 శ్రీకృష్ణదేవరాయలు
10.6 తెనాలి రామకృష్ణుడు
10.7 సమీక్ష
10.8 రాదగిన ప్రశ్నలు
10.9 ఆధారగ్రంథాలు

## 10.0 లక్ష్యం :

నంది తిమ్మన, ధూర్జటి, రామరాజ భూషణుడు, పింగళి సూరన, కృష్ణదేవరాయలు, తెనాలి రామకృష్ణుల ప్రబంధాలను గూర్చి ఈ పాఠంలో తెలుసుకుంటారు.

## 10.1. నంది తిమ్మన :

నంది తిమ్మన కృష్ణరాయల ఆస్థానాన్ని అలంకరించిన అష్టదిగ్గజ కవులలో ఒకడు. పారిజాతాపహరణము అనే ఐదు ఆశ్వాసాల శృంగార ప్రబంధాన్ని రచించి కృష్ణరాయలకు అంకితమిచ్చాడు. సర్వసాధారణమగు కుటుంబగాథతో నాటకీయ సంవిధానంలో మధుర సంపుటంలో పారిజాతాపహరణ ప్రబంధం సర్వజన సమాదరణను పొంది బహుళ ప్రచారం పొందింది.

### 10.1.1. ముక్కు తిమ్మన వ్యవహారనామం :

నంది తిమ్మనకు ముక్కు తిమ్మన అని నామాంతరముంది. ముక్కును గూర్చి ముద్దులొలుకు పద్యాన్ని రచించి భట్టుమూర్తికి విక్రయించినాడని అందుకే అతనికి ముక్కు తిమ్మన అని పేరు వచ్చినదని ఒక కట్టుకథ ఉంది. ముక్కు తిమ్మనది ముద్దుపలుకు

### 10.1.2. ప్రబంధ రచనా హేతువు :

తిమ్మన పారిజాతాపహరణాన్ని రచించడానికి ప్రబల కారణం ఒకటుంది. కృష్ణరాయల భార్య తిరుమలదేవి ఒక రాత్రి శయన మందిరంలో రాయల కోసం నిరీక్షించి అస్తవ్యస్థంగా నిద్రించింది. సాహిత్యగోష్ఠిలో పాల్గొన్న రాయలు ప్రొద్దు పోయిన తరువాత మందిరానికి వచ్చి శయ్యపై మేను వాల్చాడు. అంత నిద్రావస్థలో ఉన్న తిరుమలదేవి కాలు రాయల శిరస్సుకు తగిలినందుకు రాయలు కోపించి, ఆమెను మందలించి తిరస్కారంతో వెళ్ళిపోయాడు. అపుడు తిరుమలదేవి తనకు అరణంగా వచ్చిన కవి నంది తిమ్మనతో చెప్పగా వారి మధ్య వైరాన్ని తొలగించి కృష్ణరాయలకు కర్తవ్యోపదేశాన్ని అన్యాపదేశంగా చేసి తిరుమలదేవి మనస్తాపాన్ని

పోగొట్టడానికి ఈ ప్రబంధాన్ని తిమ్మన రచించాడు. కృష్ణరాయలు తనకు కృతిని అంకితం చేయమని కోరనప్పటికి తిమ్మన ఈ ప్రబంధాన్ని వ్రాసి రాయలకే అంకితమిచ్చాడు. కథానాయకులగు రాయలు, కృష్ణులకు, సత్యభామకు తిరుమలదేవికి అవినాభావ బంధురంగా వుండునట్లు తిమ్మన కథాచిత్రణ చేశాడు.

### 10.1.3. మూలకథలో మార్పులు :

ఈ ప్రబంధానికి మూలం సంస్కృత హరివంశం. మూలంలోని కొన్ని కల్పనలను యథాతథంగా తిమ్మన అనువదించాడు. మూలంలో వ్రతోద్యాపనోత్సవం చేసుకొను రుక్మిణికి కృష్ణుడే పారిజాత మిచ్చినట్లు, అప్పుడే అరుదెంచిన నారదుడు రుక్మిణిని పొగడి సత్యను తూలనాడినట్లు ఉంది. అనువాదంలో నారదుడు దేవలోకం నుండి తెచ్చిన పారిజాతాన్ని కృష్ణుని చేతికిచ్చి కృష్ణుని కనుసన్నలతో రుక్మిణికి ఇప్పించినట్లు ఉంది. నారద పాత్ర కల్పనవల్ల ప్రబంధంలో కథా సంవిదానానికి, పాత్ర పోషణకు చక్కని అవకాశం కలిగింది. కోపగృహంలో వున్న సత్యభామను కృష్ణుడు అనునయించడం, తన కోరిక నెరవేర్చుటకు తపస్సు చేసుకొనడానికి అనుజ్ఞ ఇవ్వమని సత్యభామ ప్రార్థించినట్లు మూలంలో ఉంది. కానీ తిమ్మన సత్యభామ స్వాంతన ఘట్టంలో మనోహరమగు కల్పన చేశాడు. సత్య తన చేతి లీలారవిందంతో కృష్ణుని జంకించించి ఆగ్రహమును, అవమానమును నిగ్రహించు కోలేక "అర్మిలి మ్రొక్కు" మ్రొక్కిన అతని శిరమును వామపాదంతో తొలగత్రోచినట్లు తిమ్మన కల్పించాడు. సమయ స్ఫూర్తిగల కృష్ణుడు ఆ తాపును మన్ననగానే భావించాడు. పారజాత వృక్షమునే ఆమె పెరటి చెట్టుగ నాటింతునని బాస చేశాడు. ఈ మార్పు వల్ల ఈ సన్నివేశం మనోరంజక మగుటేగాక తిమ్మన అభీష్టార్థ సిద్ధికి తోడ్పడింది. నిరహంకారం, నిష్కళంకం, అయిన ప్రేమతత్త్వాన్ని సత్యభామకు (తిరుమలదేవికి) బోధించుట తిమ్మన పరమోద్దేశం. అందుకే మూలంలో సంగ్రహంగా వర్ణింపబడ్డ పుణ్యక వ్రతాన్ని తిమ్మన తన ప్రబంధంలో విపులంగా వర్ణించాడు. పుణ్యక వ్రతాన్ని ఆచరించడానికి సత్యను నారదుడే ప్రోత్సహించి ఆచరింప చేసినట్లు తిమ్మన కల్పించాడు. పైన పేర్కొన్న మార్పులే కాక తిమ్మన పారిజాతాపహరణంలో ప్రబంధోచితములగు వర్ణనలు, కల్పనలు, సన్నివేశాలను రమ్యంగా చిత్రించి నాటకీయతను వస్త్వైక్యాన్ని పాటించి అతి సుకుమార ప్రబంధంగ తీర్చిదిద్దాడు.

### 10.1.4. పాత్ర చిత్రణా కౌశలం :

పారిజాతాపహరణ ప్రబంధంలో నాయిక సత్యభామ. నాయకుడు శ్రీకృష్ణుడు. సత్యభామ రూపురేఖలో కోపతాపాలను మొదటగా ప్రస్ఫుటంగా జీవకళ ఉట్టిపడేటట్లుగా తిమ్మన చిత్రించాడు. ఆమె తన ప్రాణం కంటే పతినే ఎక్కువగా ప్రేమించే అనురాగమూర్తి. సవతులెవ్వరిని లెక్కచేయని అహంకారి.

"చక్కని దాననంచు నెలజవ్వని నంచు జగంబులోనఁపే
రెక్కిన దాననంచు పతియెంతయు నా కనుఁరక్తుడంచుఁదా
నిక్కుచు విఱ్ఱవీగుచు గణింపదు కాంతల సత్య ఇంతకున్
స్రుక్కక యున్నె నీ మహిమ సూచిన బోటులు విన్నవించినన్"

కథా సూచనం పాత్ర స్వభావం రెండు ఈ పద్యంలో పొందుపరచబడ్డాయి. సూక్ష్మాతి సూక్ష్మమగు పాత్రల మనోధర్మాలను వ్యక్తం చేయడంలో తిమ్మన చూపిన ప్రతిభ అసాధారణమైంది.

పారిజాత కుసుమమును కృష్ణుడు రుక్మిణి కిచ్చిన సందర్భంలో సత్యభామను గూర్చి నారదుడన్న మాటలను చెలికత్తె పూసగుచ్చినట్లు చెప్పింది. అప్పటి సత్యభామ స్వరూపాన్ని తిమ్మన నేర్పుతో ఈ క్రింది విధంగా చిత్రించాడు.

"అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుంబలె నేయి వోయభ
గ్గున దరికొన్న భీషణ హుతాశన కీలయనంగ లేచిహె
చ్చిన కనుదోయి కెంపు తన చెక్కుల గుంకుమ పత్ర భంగ సం
జనిత నవీన కాంతి వెదజల్లఁగ గద్గద ఖిన్న కంఠియై          పా.ప. 1 - 82

వస్తు గుణం వర్ణనతో పాటు ఆకార వర్ణన ప్రబంధలక్షణ సామాన్యం. అందుకు ఈ పద్యం నిదర్శనం.

సత్యభామ మనః పరివర్తనాన్ని గూర్చి తిమ్మన ఈ క్రింది విధంగా వ్యక్తం చేశాడు.

"ఏమేమీ కలహాశనుండ చటికై యేతెంచి యిట్లాడెనా
యామాటల్చెవి యొగ్గి తా వినియెనా యా గోపికావల్లభుం
డేమేమాడెను రుక్మిణీ సతియు నీవింకేటికిన్ దాఁచెదే
నీ మోమాటలు మాని నీరజముఖీ నిక్కం బెఱింగింపవే"          పా.ప. 1 - 83

అని చెలిని సత్యభామ గ్రుచ్చి అడిగింది. ఇందలి మధుర మనోహర ద్రాక్షాపాకం అందరకు ఆస్వాదయోగ్యం. సత్యభామ పాత్రను ఆమె నైజానికి తగ్గట్లు వర్ణించాడు.

"అతుల మహాను భావమని యవ్విరి దానాక పెద్ద సేసి య
చ్యుతునకు నిచ్చకం బొదవ సూడిద యిచ్చిన నిచ్చెఁగాక తా
నతఁడు ప్రియంబు గల్గునెడ కర్పణ సేసినఁ జేసెఁగాక యా
మతకరి వేలుపుందపసి మమ్ము దలంపఁగ నేలయచ్చుటన్"          1 - 84

"పలుదెఱఁగు ముళ్ళ మాటలు, కలహమె కల్యాణ మని జగంబుల వెంటన్
మెలఁగెడు మౌనికి సహజము వలదని వారింప వలదె వల్లభుఁడతనిన్
మునియేమిసేయు రుక్మిణి గొనఁ గారణమేమి ధూర్త గోపాలుడు సే
సిన చెయిదమేమి చెప్పుదు మనమెరియదె ప్రాణమైన మగఁ డిట్లయినన్"   1 - 85

పై పద్యాలలోని ప్రతి పదము ఎంతో అర్థంతో కూడుకొన్నది. సత్యభామకు సవతియగు రుక్మిణిపై గల అసూయను, ఆమె స్వాభిమానాతిశయాన్ని, ఆమె కోపానికి గల కారణాన్ని ఈ పద్యాలలో చక్కగా వ్యక్తం చేశాడు. ఆమె తన పతిని ప్రాణంతో సమానంగా ప్రేమించింది. ఆ ప్రేమ ప్రభావం ఈర్ష్యాసూయలకు కారణమైంది.

రుక్మిణికి కృష్ణుడు పారిజాత పుష్పాన్నిచ్చినట్లు, నారదుడు సత్యభామను గూర్చి అన్న మాటలు వినిన సత్య అలిగి, కోపంతో కోపగృహంలో ప్రవేశించింది. అప్పటి ఆమె బహిరంతర మూర్తులను కళ్ళకు గట్టినట్లు వర్ణించాడు తిమ్మన.

మాసిన చీరఁ గట్టికొని మౌనముతోడ నిరస్త భూషయై
వాసిన కట్టుఁ గట్టి నిడువాలిక గస్తురి పట్టు వెట్టిలో
గాసిలి చీఁకటింటికడ కంకటిపై జలదాంత చంద్రరే
ఖా సదృశాంగియై పొరలె గాఢ మనోజ విషాద వేదనన్          1 - 99

బిసరుహ పత్రలోచనకుఁ బెల్లగు మోహము సంఘటిల్లె వె
క్కసమగు నెవ్వగ ల్పొడమెఁ గంపము పుట్టెఁ జెమర్చె మేను మా
నసమున విన్న బాటొదవె నాటెఁ గడుంబరి తాపవేదనల్
మసకపుఁ బాము కాటు గతి మచ్చర మన్విస మగ్గలింపఁగన్ 1 - 100

వెడ వెడఁగన్ను మూయుఁ గనువిచ్చు నగుందలయూచుఁ బాన్పుపైఁ
బడు నుసురంచు లేచుఁ దటబాటును దత్తరముం జలంబు లో
నడరఁగఁ గోపవేగమున నగ్గలమైన మనోజ బాధలం
బడి మదహస్తి హస్తగత పద్మిని యుంబలె సొంపు పెంపఱన్ 1 - 101

ఈ పద్యాలలో కోప గృహములోనున్న సత్యభామ బాహ్య అంతరంగిక రూపాన్ని అప్పటి సత్యభామ కనుగుణంగా వర్ణించాడు. సత్యభామ మానక్రోధ వివశత్వమునకు పరమావధి ఆమె అఖిల లోక వంద్యుడగు తన పతి శిరమును ఎడమ కాలితో తొలగ త్రోయుటతో కల్గింది. పారిజాత వృక్షాన్ని తెచ్చి యిస్తాననగానే ఆమె మురిసిపోయి గతం మరచింది. సత్యభామ స్వాధీన పతిక. కృష్ణుడు దక్షిణుడైనను అనుకూల నాయకుడు. తన భర్త తనకు విధేయుడని అతని సముఖంలోనే ప్రకటించింది. కృష్ణుడు సత్యభామా విధేయుడను విషయం అడుగడుగునా ప్రచురితమైతే తప్ప ఆమెకు తృప్తి ఉండదు. పుణ్యక వ్రత నిర్వహణతో ఆమె అహంకారం ఈర్ష్యాసూయాది వికారాలు సమసిపోయాయి. విశుద్ధమైన ప్రేమతత్త్వాన్ని గ్రహించగల్గింది. దానితో పారిజాతమునే గాక ప్రాణనాథుని కూడా త్యాగం చేయకలిగింది. కృష్ణుడు ఆ శృంగార రసాధి దేవతకు శాశ్వతంగా వశుడయ్యాడు.

నంది తిమ్మన శ్రీకృష్ణుని పరమాత్మ స్వరూపునిగా కాక మానవత్వం భాసించు ప్రణయ మూర్తిగా, బహుపత్నీత్వం వల్ల కలిగే సమస్యలతో నలిగిపోయిన గృహస్థునిగ, కలహప్రియుని తంత్రాలతో ప్రణయ కలహాలకు లోనైన రసిక శేఖరునిగా, ప్రణయతత్త్వవేదిగ, పరిపూర్ణంగా తన్నారాధించిన వారికి ఆధీనుడై ముదాన్ని కూర్చే పరహితా చరణ శీలిగా చిత్రించాడు.

### 10.1.5. వర్ణనలు :

పారిజాతాపహరణంలో తిమ్మన ప్రకృతి వర్ణనలు, సన్నివేశ వర్ణనలు, పాత్రల మనోభావ వర్ణనలు లలిత మధురములగు పదజాలంతో ప్రసాద గుణ ప్రధానంగా మనోహరాలైన ఉపమ ఉత్ప్రేక్షా ద్యాలంకారాలతో చాతుర్యంగా నిర్వహించాడు. కథాగమన నిరోధకాలు, ఔచితీ భంజకాలైన వర్ణనలు కన్పించవు. నాయికా నాయకులైన సత్యాకృష్ణులు కథా ప్రారంభం నాటికే వివాహితులు గనుక అంగాంగ వర్ణనలు, విరహ వర్ణనలు లేవు. మిగిలిన జలక్రీడ, సాయంకాలం, అంధకారం, నక్షత్ర చంద్రోదయ, సూర్యోదయ, మేరువు, నందనం, వైజయంతం, ఇత్యాది వర్ణనలు అతి హృద్యంగా చేశాడు. తిమ్మన చేసిన సాయంకాల వర్ణన.

ఆయత తేజముల్దరిగి యంబుజ బాంధవుఁడస్త సీమకుం
బోయినఁ జూచి వేచిన తమో విభుఁడంప దినాంత యోధుఁడీ
చాయఁ దదీయ పత్నిఁ బెలుచంబడ వీడిచికొంచుఁ బోయెడుం
గోయను మాడ్కి నంతట శకుంతరవంబు సెలంగె నెల్లెడన్ 2 - 30

అంబుజ బాంధవుడు తేజో విహీనుడగుట చూచి అదను కొరకై వేచియున్న అతని శత్రువగు తమోవిభుడు తన బంటగు దినాంత యోధుని పంపగా అతడు సూర్యుని పత్నియగు ఛాయాదేవిని క్రిందపడ వైచి ఈడ్చుకొని పోవుచుండగా శకుంత రవముల రూపంలో ఆమె ఆక్రందన మొనర్చిందట. ఈ వర్ణన మనోజ్ఞాలంకార భాసమై ప్రబంధ రచనా విశిష్టతను వ్యక్తం చేస్తుంది.

తిమ్మన పారిజాతాపహరణ సూచకంగా రమ్యమైన భావాలంకారాలతో చంద్రోదయవర్ణన చేశాడు.

యామవతీ కళత్రు నుదయావ సరంబున కంటెఁ బాండిమ
శ్రీమును తోఁచెఁ దూర్పు దెస సిద్ధము కృష్ణుఁడు పారిజాతమున్
భామినికై హరించునని పాయని నెవ్వగ నింద్ర రాజ్యాల
క్ష్మీ ముఖ మండలంబున వసించన వెల్లదనంబు కైవడిన్ 2 - 38

ఇదే విధంగా మిగిలిన వర్ణనలు భావాలంకారాలతో ప్రశంసనీయంగా ఉన్నాయి.

శ్రీకృష్ణుడు సత్యభామా భవనానికి వచ్చే సందర్భంలో కవి వర్ణించిన పద్యం.

అరదము నెక్కి కేతన పటాంచల చంచలమైన తాల్మితో
దురగ జనంబు ముగ్గడ వద్రోచి కడంగెడు తత్తరంబుతోఁ
దిరిగెడు బండి కండ్ల పగిదిన్ భ్రమియించు మనంబు తోడ నా
హరినను దెంచె సత్య సముదంచిత కాంచన సౌధ వీధికిన్ 1 - 104

కృష్ణుడు తనకు జరగబోవు కడగండ్లను కనిపెట్టే బయలుదేరాడు. ఈ పద్యంలో రమణీయములైన ఉపమానాలను చెప్పి శ్రీకృష్ణుని తాత్కాలిక మానసిక స్థితిగతులను తెలియచేశాడు. మనస్తత్వానుగుణంగా సన్నివేశాన్ని వర్ణించే కవితారీతిలో తిమ్మనకు గల నైపుణ్యం ఈ పద్యం వ్యక్తీకరిస్తున్నది.

### 10.1.6. నాటకీయత :

పారిజాతాపహరణం ప్రబంధాకారం దాల్చిన నాటకం. ఆశ్వాస విభాగాలనే అంక విభాగాలతో పంచ సంధులతో పాత్ర ప్రవేశాది సూచనలతో సర్వాలంకృతమైన రంగమున కథ ప్రదర్శింపబడుచున్నదనే భావన కల్గిస్తుంది. వివిధ పాత్రలన్నీ పాఠకుల ఎదుట నిల్చి మాట్లాడినట్లుండును. ప్రారంభంలోని ఇష్టదేవతాస్తుత్యాది పద్యాలను నాందీ పద్యాలుగా పరిగణించవచ్చు. సవతుల మధ్య రవరవలు, ప్రణయ కలహం, తన్నివారణ, విశుద్ధ ప్రణయతత్త్వం కావ్యార్థ సూచనలు. కృతిపతికి సంబంధించిన విషయాలు ప్రస్తావన. కావ్యాంతంలో వున్న కృతి కర్తృ ప్రశంసను ప్రస్తావనలోనే సూత్రధారుని ద్వారా పలికించవచ్చు. రంగస్థలమున రుక్మిణీ కృష్ణుల దగ్గరకు నారదుడు ప్రవేశించడంతో నాటకం ప్రారంభమౌతుంది. అంతలో నారదుడు చేసిన కృష్ణస్తుతి రూపమైన భరత వాక్యంతో నాటకం పరిసమాప్తమైంది.

నాటకీయతకొక ఉదాహరణ. కోపగృహంలోకి ప్రవేశించిన సత్యభామతో కృష్ణుని సంభాషణ.

ఇందుని భాస్యమై తొడవలేల ధరింపవు సన్నగా వురీ
వెందును మానలేవు తెలుపేటికి గట్టితి నీటికారుచుల్
కెందల రాకుమోవిఁదులకింపగఁ జేయక యున్కియేమినీ
చందము వింతయయ్యెడు నిజంబుగ నాకెఱుగంగఁ జెప్పుమా 1 - 115

ఆమె అతని శిరము వామ పాదంతో తొలగద్రోసింది. అయినా "నను భవదీయదాసుని మనంబున నెయ్యపు గిన్కబూని తాచిన యది నాకు మన్ననయ" అని అన్నాడు. అందుకు సత్యభావ,

ఈ నాయగారపుంబ్రియము లీపస లీమొగమిచ్చు మాటలే
లా నిను నమ్మియుండిన ఫలంబిదె తోడనఁ గల్గె నాకు నీ
యానసు మీననుంజెనకి యాఱడి పెట్టిన నవ్వు వారలం
గాన వెఱుంగనే పసుల కాపరి భావజ మర్మ కర్మముల్ 1 - 125

అని పల్కింది. పాత్రోచితము, సహజసుందరమైన ఇటువంటి సంభాషణారచన పారిజాతాపహరణ ప్రబంధమంతటా కన్పిస్తుంది.

### 10.1.7. రసపోషణ :

ఈ ప్రబంధంలో శృంగారం ప్రధానరసం. కవి ఎంతో ఉదాత్తంగా పోషించాడు. ఇందు సత్యాకృష్ణుల ప్రణయం మధుర శృంగారం. ఖండిత నాయికగా సత్యభామను చిత్రించిన ఘట్టం అసదృశం. ఈ కావ్యంలో సొగసంతయు మానక్రోధ వివశ అయిన సత్యాదేవిలో కలదని కంఠోక్తిగా చెప్పవచ్చు.

పాటల గంధి చిత్తమునఁ బాటిలు కోపభరంబు దీర్పనె
ప్పాటను బాటుగామి మృదుపల్లవ కోమలతత్ప దద్వయీ
పాటల కాంతి మౌళిమణి పంక్తికి వన్నియపెట్ట నా జగ
న్నాటక సూత్రధారి యదునందనుడ ర్మిలి మ్రొక్కె, మ్రొక్కినన్ 1 - 120

జలజాతాసన వాసవాది సురపూజా భాజనంబై తన
ర్చు లతాం తాయుధ కన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునం
దొలగం ద్రోచె లతాంగి యట్లయగు నాధుల్నేరముల్సేయఁబే
రలుకం జెందినయట్టి కాంతలుచిత వ్యాపారముల్నేర్తురే 1 - 121

ఈ పద్యాలలో శ్రీకృష్ణుని అనురాగాతిశయం, నాయికా నాయకుల ప్రణయ విలాసాలు శృంగార రసబంధురంగ చిత్రించబడ్డాయి. పై రెండవ పద్యంలో అర్థాంతన్యాస లోకానికి కనువిప్పుగుటయేగాక రసపోషణకు సముచితమై ఉంది. తిమ్మన శృంగారానికి అంగంగా వీరరసాన్ని ఔచితీ శోభితంగా పోషించాడు.

వేల్పు మ్రానియందు వెడుకపడు కూర్మి
సతుల కోర్కిఁ దీర్ప జాలియపుడు
హరియు హరియుఁ బోరినన్యోన్య జయకాంక్ష
నసుర జీవితాపహాశుగముల

హరి, ఇంద్రుడు పారిజాతం కొరకు యుద్ధం చేస్తున్నారు. పారిజాతం శచీదేవికి ప్రీతికరమని కృష్ణుడు సత్యభామతో -

వారణ రాజయాన! సురవల్లభుఁడా శచినంక పీఠముం
జేరిచి సోగ వెంద్రుకలఁ జిక్కులు వాపి వియన్నదీ నవాం
భోరుహ నాళ సూత్రములఁ బొందుగ దీని లతాంతముల్సరు
ల్గా రచియించి నించు గుతుకంబున వీఁగు మెఱంగు క్రొవ్వెదన్ 4 - 8

అని చెప్పాడు. ఇందు సత్యాకృష్ణుల ప్రణయానికి తోడు శచీంద్రుల ప్రణయం సరసంగా చెప్పబడింది. శచీదేవి ప్రీతి కొరకు ఇంద్రుడు సత్యాదేవి సంతోషం కొరకు కృష్ణుడు యుద్ధం చేస్తున్నారు. వీరి పోరుకు కారణం వారి సతుల మీద ప్రేమ. కాబట్టి ఇందు శృంగార రసం ప్రాధాన్యం వహించింది. దాని పుష్టికై వీరం అంగరసంగా కూర్చబడింది.

### 10.1.8. రచనా శిల్పం :

నంది తిమ్మన రచనా శిల్పం కడు రమ్యం. మృదులీలా భావాలను మృదుతర శైలిలో వ్రాయడంలో సిద్ధహస్తుడు. ఆంధ్ర సాహిత్య లోకంలో మృదు మధుర లలిత ప్రబంధమని పేర్కొనదగింది పారిజాతాపహరణ ప్రబంధమొక్కటే.

ఉ॥ ఈసునఁబుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచే
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుట న్లలితాంగి పంకజ
శ్రీ సఖమైన మోము పయిఁ జేల చెఱంగిడి బాల పల్లవ
గ్రాస కషాయ కంఠ కలకంఠ వధూకల కాకలీ ధ్వనిన్ 1 - 133

ఈ పద్యంలో సత్యభామ ఏడ్చిన రీతి ముద్దుగొలుపునట్లు వర్ణించబడింది. అందుకే "ముక్కు తిమ్మన రాయల నాటి అంతఃపుర రహస్యాలను కూడా తెలియచేశాడు. తిమ్మన పద్య రచనలో మూతన ప్రక్రియలను అవలంబించాడు. బంధ కవిత్వం, గర్భ కవిత్వం ఈ కావ్యంలో ప్రదర్శించాడు.

క॥ ధీర శయనీయ శరధీ
మార విభాను మత మమత మనుభా విరమా
సార సవన నవసరసా
దారధ సరమ తార హార తామరస ధరదా!

ఈ పద్యం ఏ పాదమునైన మొదటినుండి చివర వరకు చదివినా, చివరి నుండి మొదటి వరకు చదివినా ఒకే రీతిగా ఉంటుంది.

ఈ విధంగా రమణీయమగు శైలితో సరస గుణాలంకారములతో శోభిల్లుచూ సహృదయులకు పరమానందం కలిగిస్తున్నదీ ప్రబంధం.

## 10.2. ధూర్జటి :

శ్రీకృష్ణదేవరాయల భువనవిజయ సభాభవనాన్ని అలంకరించిన వారిలో ధూర్జటి మేటి కవి. ధూర్జటి శివభక్తి తత్పరుడు. శైవ విజ్ఞానంలో సంపూర్ణ పాండిత్యం కలవాడు. అయినప్పటికి అద్వైత విద్యానిధి .. మంత్ర తంత్రాది శాస్త్రాలను పరిశీలించిన తత్త్వవేత్త, జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించి సంసారంపై విరక్తి చెంది, వైరాగ్యాన్ని పొందిన భక్త కవి. రక్తి నుండి విరక్తిని పొందిన జ్ఞాని. శ్రీకాళహస్తి మహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకం అనే రెండు గ్రంథాలు రచించాడు. ఈ రెండు గ్రంథాలు భక్తిరస ప్రధానాలు. శివ పారమ్య ప్రబోధకాలు. ఈ కావ్యాలను శివార్పణంగా ధూర్జటి రచించాడు.

### 10.2.1. శ్రీకాళహస్తి మహాత్మ్యము :

ధూర్జటి రచించిన శ్రీకాళహస్తి మహాత్మ్యము ప్రబంధం నాలుగు ఆశ్వాసాల మధుర కావ్యం. నారాయణ వనమనే పట్టణాన్ని పరిపాలించే యాదవ భూపాలుని భక్తిని పరీక్షించడానికి శివుడు మాయా జంగంధారై రాగా రాజు గారి దాసి అతనిని

చూచి మక్కువతో ఇంటికి తీసుకువెళ్ళింది. అతనికి సేవలు చేస్తూ రాజ సేవను మరచింది. రాజు ఆమెను పిలిపించి ఆమె శిరోజాలను కోయించి పంపాడు. మాయా జంగముడు ఆమెను కనికరించి స్పృశింపగా ఆమె పూర్వరూపం వచ్చింది. రాజు ఆశ్చర్య చకితుడై సేవకురాలి ఇంటికి వచ్చి మాయాజంగాన్ని శివుడుగా తెలిసికొని అర్చించాడు. అపుడు మహేశ్వరుడు రాజుకు శ్రీకాళహస్తి మాహాత్మ్యాన్ని చెప్పాడు. ఈ కావ్యంలోని నాలుగాశ్వాసాలు వీరిరువురకి జరిగిన సంభాషణే వసిష్ఠుడు, బ్రహ్మ, సాలెపురుగు, సర్పం, ఏనుగు, తిన్నడు, నత్కీరుడు, వేశ్యాపుత్రికలు, యాదవరాడు వీరందరూ శివసాయుజ్యం పొందిన కథలే ఈ కావ్యంలో వర్ణించబడ్డాయి. కావ్యారంభంలో -

శా॥ శ్రీ విద్యా విధియై మహామహిమచేఁ జెన్నై, వశిష్ఠాజ లూ
తవాశన సామ జాటవిక గోత్రాదేవ నత్కీర రా
జీవాక్షి యుగ యాదవాధి పులకున్ శ్రేయస్కరం బైనయా
ర్యా వామాంగము దివ్య లింగము మదీ యాభీష్టము ల్సల్పెడున్ 1 - 1

అని నాందీ పద్యంలో కథా సూచన చేశాడు ధూర్జటి. ఈ కథకు మూలం సంస్కృతంలోని షడధ్యాయి కథ. ఇది స్కాంధ పురాణంలోని వైష్ణవ ఖండం లోనిదని విమర్శకుల అభిప్రాయం. ధూర్జటి కేవలం కథ మాత్రమే గాక బహుళ ప్రచారంలో ఉన్న కథలను కూడా స్వీకరించి తన కావ్యాలలో చోటు కల్పించాడు. భిన్న కాలములందలి కథలను గ్రహించి వానినన్నింటిని ఏక సూత్రంగ నిబంధించాడు. ఈ కావ్యాన్ని ప్రబంధ రీతికి అనువైన వర్ణనలతో, కవితా చమత్కృతులతో రసవంతంగ కూర్చి ధూర్జటి మహాకవైనాడు.

### 10.2.1.(అ) పాత్ర చిత్రణ :

పాత్ర చిత్రణలో ధూర్జటి సిద్ధహస్తుడు. తన పూజ విఘ్నం నొందిందని సర్పం, ఏనుగు వేదన చెందాయి. ఈ ఘట్టంలో మనోవేదన పొందేవాని చేష్టలను స్పష్టంగా వర్ణించి పాత్రౌచిత్యాన్ని పాటించాడు ధూర్జటి.

సీ. భోగవతీ ఝుతంబునఁ జొచ్చి బోటుల
తోడ నాడెడు జలక్రీడలుడిగి
పువ్వు బోణులుఁ దానుఁ బొత్తుల భుజియించు
మధుర సుధాహార విధిఁ దొఱంగి
బహువిధ తాన సంపన్న గానంబుల
నిక్కి చొక్కెడు తన నేర్పు వదలి
ప్రాణ నాయిక తోడఁ బర్యంక సీమల
మసకాన బెనఁగు సంభ్రమము విడిచి

గీ॥ నిద్రవోయెడు సుఖమెల్ల నేలఁ గలిపి
ప్రతి దినంబును దాఁజేయు రత్నపూజ
శివునిపై నుండకుండినఁ జింతనొంది
రాత్రి శివరాత్రిగా జాగరమ్ము చేసె 2 - 119

ఈ విధంగానే ఏనుగు కూడ తన వ్రత పూజ విఘ్నమైనందుకు వేదన చెందుతూ -

సీ॥ పిడి యేనుగుల వెంటఁ బడిపోక యుడుగని
వెడవిల్తు వేఁడిమి విడువు చూప

చింతయన్ వేగి తనలో తనులోను చేసికొనియె
.............................................................. 2 - 125

అని సర్ప గజాల అవస్థలను చేష్టానుగుణంగ రసవంతములైన పద్యాలలో వర్ణించాడు.

మూడవ ఆశ్వాసంలో తిన్నని పాత్రలో ఆటవికుల జీవితాన్ని కళ్ళకు గట్టినట్లు వర్ణించాడు. తిన్నని అమాయకుడైన భక్తుడుగ చిత్రించాడు. పరమేశ్వరుని యందు నిర్మల భక్తి మోక్షదాయకమని తిన్నని కథ ఉపదేశిస్తుంది.

శా. ఇల్లో ముంగిలియో యనుంగు జెలులో యొడైన చుట్టంబులో
యిల్లాలో కొడుకో తరింపవశమే యేపోడు ముల్లేక మా
పల్లెం గోరిన వెల్ల నుం గలవు తెప్పల్గాగ నీకిచ్చెదన్
జెల్లంబో! యిటనొంటి నుండ కటు విచ్చేయం గదే లింగమా 3 - 70

అని రాతిలో మూర్తిని దర్శించిన భక్తుడు తిన్నడు.

ఈ కావ్యంలో నత్కీరుని పాత్ర ప్రధానపాత్ర. తిన్నని పాత్ర భక్తి మార్గాన్ని ఉపదేశించగా నత్కీరుడు జ్ఞానమార్గాన మోక్షాన్ని ఉపదేశించాడు. నత్కీరుడు పాండ్య సభలో విద్యాధికారి. ఇతని మెప్పు పొందిన వారికి పాండ్య రాజు వేయి మాడలు బహుకరిస్తాడు. హరిద్విజుని కవితలో తప్పు వుందని చెప్పగా ఈ పద్యాన్ని వ్రాసిచ్చిన శివుడే పాండ్య సభకు వచ్చి దోషం తెల్పుమని అడుగగా నత్కీరుడు.

"................ లోకమున గదే
పూనుకొని సహజ గంధము
వేనలికింగలదటన్న, వేయుదెఱుగులన్" 3 - 158

అని దోషాన్ని చూపగా శివుడు ఫాలనేత్రంతో తన నిజస్వరూపాన్ని చూపినప్పుడు

క॥ తలచుట్టు వారఁ గన్నులు
గలిగినఁ బద్యంబు దప్పుగా దనవశమే
వలదిచ్చట నీమాయా
విలసనములు పనికిరావు విడువుమటన్నన్ 3 - 171

అని శివుని అధిక్షేపించాడు. మహాకవి ఇతరులకు లోబడడుకదా! ఇది మహా కవి ధూర్జటి అనుభవమేమో! ఈ కావ్యమంతటా ధూర్జటి ఆత్మీయత గోచరిస్తుంది. వారవనితలను కూడా తన కావ్యంలో ఉత్తమ పాత్రలుగా చిత్రీకరించాడు. ధూర్జటి ఏ పాత్రను గ్రహించినా ఆధ్యాత్మిక భావశబలతను కన్పరుస్తూ వర్ణిస్తాడు.

### 10.2.1(ఆ) వర్ణనలు :

ప్రబంధాలకు ఆయువు పట్లు వర్ణనలు. వర్ణనలను ఔచితా శోభితంగా వర్ణించాడు ధూర్జటి. సూర్యాస్తమయ వర్ణన ..

సీ॥ ప్రాగ్వ ధూమణి చిమ్మఁ బశ్చిమ దిక్కాంత
పట్టిన చెంగల్వ బంతియనఁగ
గాలవిష్ణుండంధకార దైత్యుని వ్రేయఁ

జరమాద్రిఁ బడిపోవు చక్రమనఁగ
దినమహీరుహమునఁ దేజోమయంబుగాఁ
బండి రాలిన పెద్ద పండనంగ
దివి నుండి దేవదానవ యుద్ధ రక్తార్ర్వ
మై నేలఁ గూలు రధాంగమనఁగఁ

గీ॥ పద్మినీ సంగమ శ్రాంతిఁ బరిహరింప
నవర జలనిధి జలకంబు లాడఁబోవు
కరణి నెఱసంజ చందురు గాని పచ్చ
డంబు ధరఁబెట్టి భానుబింబంబు గ్రుంకె 2 - 128

ఈ పద్యం ధూర్జటి భావనా బలానికి, సరస కవితా శక్తిని వ్యక్తం చేసే వర్ణన. ఈ పద్యంలో ఉత్ప్రేక్ష రమణీయంగా ఉంది.

సూర్యోదయ వర్ణన.

శా॥ ప్రాతః కాల తుషార శీకర చయప్రాప్తిన్ లసన్మౌక్తికో
పేతాగారము లట్లు చెల్వెసకి తద్బిందు చ్ఛటా జాతఖ
ద్యోత చ్ఛాయలఁ గొంతసేపు బహురత్నో దీర్ణ గేహంబులై
యతా కల్పిత తంతు పద్మములు వొల్చుం జెప్పఁ జిత్రంబులై 2 - 97

సాలెపురుగు శిల్ప ప్రావీణ్యంతో శివలింగంపై గూడు కట్టింది. రాత్రి దానిపై మంచు కురిసి బిందువు లేర్పడ్డాయి. ఆ బిందువులపై సూర్యకిరణాలు పడి ముక్తాహారంగా భాసిలిందని అందంగా వర్ణించాడు.

ధూర్జటి కాళహస్తి మహత్మ్యంలో యధోచితాలు హృద్యమైన వర్ణనలు చేశాడు. ధూర్జటి వర్ణనలు సహజములై ఒప్పారినవి. తనకున్న శివభక్తిని వర్ణనల ద్వారా కూడా ప్రదర్శించాడు.

### 10.2.1.(ఇ) రసపోషణ :

ఈ కావ్యంలో ప్రధాన రసం శాంతం. అంగరసం శృంగారం. దాసి మాయా జంగముల సంగమంలో శృంగారం, హరిద్విజుని కాపాడుటలో కరుణ, వృక్షం నుండి పడిన ఆకులు పక్షిత్వమీనత్వములు పొందుటలో అద్భుతం, తిన్నని యందు భక్తిరసం, కుమారస్వామి రాక్షసుని సంహరించు ఘట్టంలో వీరం, శబరుల మధుపాన మత్త చేష్టలలో కొంత హాస్యాన్ని పోషించాడు. ఇతర రసాలను సందర్భానుసారంగ పోషించి కృతకృత్యుడయ్యాడు ధూర్జటి.

### 10.2.1.(ఈ) కవిత్వ లక్షణాలు :

ధూర్జటి కవిత్వ మెట్లుండవలెనో శివుని ద్వారా చెప్పించాడు.

శా॥ ఈ రాజన్యుని మీదనేఁ గవిత సాహిత్య స్ఫురన్మాధురీ
చారు ప్రౌఢిమఁ జెప్పి పంపవిని మాత్సర్యంబు వాటించిన
త్కరుండూరకె తప్పు పట్టినట! యేది లక్షణం బొయలం
కారంబో పదబంధమో రసమొ చక్కం జెప్పుఁడ్రా తప్పనన్ 3 - 167

కవిత్వం సులక్షణమై, చక్కని పదబంధాలతో, అలంకారాలతో ఒప్పుచు రసవత్తరంగా ఉండాలని చెప్పాడు. దానితో పాటు ప్రౌఢిమయు, మాధుర్యాన్ని గూడ జోడించాలని వ్యక్తీకరించాడు. ధూర్జటి కవిత్వం ప్రౌఢమై మాధుర్యంతో నిండి ఉంది. అందుకనే రాయలు ఈ మహాకవి ..

స్తుతిమతియైన యాంధ్ర కవి ధూర్జటి పలుకుల కేలగల్గెనో
యతులిత మాధురీ మహిమ . . . . . . . . అని ప్రశంసించాడు.

భవబంధాలకు దూరుడై అచంచలమైన భక్తి విశ్వాసాలతో పరమేశ్వరార్పణంగా శ్రీకాళహస్తి మహాత్మ్యమును రచించి ధన్యుడైనాడు ధూర్జటి మహాకవి.

### 10.2.2. శ్రీకాళహస్తీశ్వర శతకము :

శ్రీకాళహస్తీశ్వర శతకము ధూర్జటి రెండవ రచనగా ప్రసిద్ధికెక్కింది. ధూర్జటి సంపూర్ణ వైరాగ్య స్థితిని, పరిపూర్ణ వేదాంత జ్ఞానానికి శతక పద్యాలు నిదర్శనం. తన జీవితానుభవాల నుండే ధూర్జటి సంపూర్ణ జ్ఞాని అయినాడు. ధూర్జటి కవితా విషయంలో పరిపూర్ణ పాండిత్యాన్ని పొందే నిరహంగారుడనడానికి శతక పద్యంలోని ఈ క్రింది పద్యం నిదర్శనం.

శా॥ ఏ లీలన్ నుతియింప వచ్చునుపమోత్ప్రే క్షాధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలభ్యంబైన నీ రూపమున్
చాలుంజాలు కవిత్వమున్ నిలుచునె సత్యంబు వర్ణించుచో
ఛీ, లజ్జింపరు గాక మాదృశ కవుల్ శ్రీకాళహస్తీశ్వరా!

అని భగవదర్చనకు కవితా శక్తి చాలదనినాడు. "రాజుల్మత్తులని వారి సేవ నరకప్రాయమని, వారిచ్చు అంభోజాక్షి చతురంతయాన తురగీ భూషాదులు" ఆత్మీ వ్యధా బీజాలని నిరసించాడు. జీవితంలో తాను చేసిన ఘోర దుర్దశలు తలచుకున్న రోత కల్గుతున్నదనే పశ్చాత్తాపంతో కాళహస్తీశ్వరుని సేవించడానికి సన్యాసయ్యాడు. కవిత్వంతోనే భగవదర్చనం చేయదలచాడు ధూర్జటి. జీవిత సత్యాలను తెలియపరస్తూ నాటి సాంఘిక జీవనానికి దర్పణంగా శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని భక్తిరసం పొంగునట్లుగా రచించాడు.

తన సర్వస్వమూ పరమేశ్వరుడని భావించాడు గాబట్టే ఈ భవబంధాలు, తల్లి తండ్రి, అన్న, తమ్ముడు, ఋణానుబంధాలు వ్యర్థమనీ, వీరెవ్వరూ తనను ఆదుకునే వారు కారని, సర్వదోష నివారకుడు, సర్వపాప సంహారకుడు అయిన ఈశ్వరుడు తాను నమ్మిన దైవమనీ, సంసారమనే విషాద సముద్రాన్ని దాటించి శాశ్వతమైన సుఖాన్ని ఇవ్వగలిగిన దేవుడు ఆ ఈశ్వరుడేనని తన అంతరంగంలోని భక్తి ప్రపత్తులను నివేదన చేస్తూ -

నిన్ను న్నమ్మిన రీతి నమ్మ నొరులన్ నీ కన్న నా కన్నలే
రన్నల్దమ్ములు తల్లిదండ్రులు గురుండాపత్సమయుండు నా
యన్నా యెన్నడు నన్ను సంసృతి విషాదాంభోది దాటించి య
ఛ్ఛిన్నానంద సుఖాబ్ధి తేల్చెదొ లేదో శ్రీకాళహస్తీశ్వరా .. అని ప్రార్థించాడు.

'ఈశ్వరా! నిన్ను త్రికరణ శుద్ధిగా నమ్మి సేవించే వారికి ఎటువంటి గ్రహదోషాలు, దుర్నిమిత్తాలు అంటవు. నీ సేవ చేసిన వారికి క్లేశ బంధాలు తొలగిపోతాయి. అగ్నిహోత్రాన్ని మిడుతల దండు కప్పగలుగుతుందా' అని ప్రశ్నిస్తాడు.

ఈ విధంగా పరిపక్వమైన మనస్సుతో, పరాకాష్ఠ స్థితికి చేరిన భక్తిభావంతో సమస్తము ఈశ్వరమయం కాగా తన

అంతరంగము నావిష్కరణ చేస్తాడు ధూర్జటి ఈ శతకంలో. ఈ విధంగా ఈ శతకంలో ప్రతి పద్యంలోనూ శ్రీకాళహస్తీశ్వరా అని ఎలుగెత్తి తన భక్తి తత్పరతను చాటుకొని శతక వాఙ్మయం మొత్తానికి నాయకమణి వంటి శతకాన్ని రచన చేసి, తన మనః పరిపూర్ణత్వానికి అక్షర రూపం ఇచ్చాడు భక్తాగ్రేసరుడైన ధూర్జటి.

భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నమైన ఈ శతకమును వయో వృద్ధుడైన పిమ్మట ధూర్జటి రచించి వుంటాడు. మొట్ట మొదటి పద్యంలోనే ఈ కవి పొందిన మానసిక పరిణతి పాఠకులకు విదితమౌతుంది. ఈ సంసార మేఘంలో సంపదలు మెరుపు తీగెల వంటివి. అనగా అవి చాల కొద్ది కాలం మాత్రమే నిలిచివుండేవి. ఆ మబ్బుల నుండి కురిసిన పాపాలకు జడివానలో పద్మం వికాసాన్ని కోల్పోయింది. ఆ పద్మం తిరిగి వికసించాలంటే నీ కరుణ అను వెన్నెలను నాపై ప్రసరింపజేయుము. చిద్భావనలతో నా జీవితం వృద్ధి పొందుతుందని, భగవంతుని కరుణ కోసం పరితపించాడు.

భగవంతుని కరుణా కటాక్షాలు పొందాలంటే నిశ్చలమైన భక్తి ఒక్కటే మార్గం. యజ్ఞయాగాదులు, జపతపాలు, వేదశాస్త్ర పఠనాలు మొదలైన వాటితో అవసరంలేదు. క్రిమికీటకాదులు సైతం అనన్య భక్తితో నిన్ను సేవించి తరించలేదా! జ్ఞానాన్ని ఉపదేశించే విద్యలన్నీ మిథ్యయే - అని తన అభిప్రాయాన్ని ఇలా తెలియజేసాడు.

ఏ వేదంబు పఠించెలూత భుజంగం బేశాస్త్రములుచ్చాచే తా
నే విద్యాభ్యాసనం బొనర్చె కరిచెంచే మంత్రమూహించె బ
ధావిర్భావ నిధానములే చదువులయ్యా కావు! మీ పాదసం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా

భగవంతుడు సర్వవ్యాపకుడు. ఆ సర్వవ్యాపకత్వాన్ని దర్శించాలంటే ఆత్మ దర్శనం పొంది ఆత్మజ్ఞానం పొందగలగాలి. లేకుంటే 'మన' 'తన' భేదాలు సర్వసామాన్యమే. ఆ సమ్యగ్దర్శనం కలగాలంటే ఈశ్వర కరుణా విశేషం మన మీద అపారంగా వర్షించాలి. నీటిలో ముంచినా పాలలో ముంచినా నీవే దిక్కు అని త్రికరణ శుద్ధిగా ప్రతికర్మను భగవదర్పితం చెయ్యాలి. ఈ అనుభూతి కోసం పరితపించే హృదయం ధూర్జటిది. అందుకనే 'నీ రూపంబు దలంపగా తుదమొదలేనేగాన, నీవైనచో రారమ్మని యందు చెప్పవు నీటన్ముంపుము పాలముంపుమిక నిన్నే నమ్మినాడంజుమి' అని తన హృదయాన్ని పరమేశ్వరుని ముందు తేటపరుస్తాడు.

## 10.3. రామరాజభూషణుడు :

సంగీత కళా రహస్యనిధియైన రామరాజభూషణుడు ప్రబంధయుగకవి. రామరాజభూషణుని అసలు పేరు మూర్తి. భట్రాజు కలమునకు చెందినవాడగుటచే భట్టుమూర్తి అని పిలిచేవారు. భట్టుమూర్తి, రామరాజభూషణుడు ఒకరా? కాదా? రాయల కొలువులో ఉండెనా? లేదా? అనే విషయాలలో వాదోపవాదాలున్నాయి. కొంతమంది పరిశోధకులు భట్టుమూర్తి, రామరాజభూషణుడొకరే యని నిర్ధారించారు. రామరాజభూషణుడు పెద్దనకు శిష్యుడని అందుచే బాల్యంలో శ్రీకృష్ణదేవరాయల కొలువులో ఉండి ఉండవచ్చుని కొందరి అభిప్రాయం. రామరాజభూషణుడు 16వ శతాబ్దంవాడు. శ్రీరామ భక్తుడు. హనుమంతుని అనుగ్రహంచే కవిత్వంలో ప్రావీణ్యాన్ని సంపాదించి చతుర్విధ కవితా ప్రావీణ్యుడైనాడు. సంస్కృతాంధ్ర భాషలలో అసమానమైన పాండిత్యం కలవాడు. శ్లేష రచనా ధురీణుడు. సాహిత్యరస పోషణ చక్రవర్తి. సంగీత కళా రహస్యనిధి. దినమున కొక ప్రబంధం చెప్పగల దిట్ట. రామరాజు నరసభూపాలీయమను నామాంతరంగల కావ్యాలంకార సంగ్రహమనే అలంకార శాస్త్రాన్ని రచించి అళియ రామరాజు మేనల్లుడగు తొరగంటి నరసరాజుకు అంకితం గావించాడు. వసుచరిత్ర మహా ప్రబంధాన్ని రచించి అళియ రామరాయల సోదరుడైన తిరుమల రాయనికి అంకితమిచ్చాడు. హరిశ్చంద్ర నలోపాఖ్యానమనే ద్వ్యర్థి కావ్యం రచించి తన దైవమగు శ్రీరామచంద్రమూర్తికి అంకితమిచ్చాడు.

### 10.3.1. నరసభూపాలీయము :

రామరాజభూషణుడు మొట్టమొదటగా కావ్యాలంకార సంగ్రహము అనే అలంకార శాస్త్రాన్ని రచించి నరసభూపాలీయము అనే పేరు పెట్టాడు. ఈ గ్రంథం రామరాజభూషణుని విద్యావైదుష్యానికి నికషోపలం. విద్యానాథుడు రచించిన ప్రతాపరుద్రీయం నుండి లక్షణాలను గ్రహించి లక్ష్యాలను మాత్రం స్వతంత్రంగా రచించాడు. ఈ గ్రంథ నాయకుడు నరసరాజు. నరసభూపాలుని ఆశ్రయించి నాడు కాబట్టి దీనికి నరసభూపాలీయం అనే పేరు తగినట్లుగా ఉంది. దీనిలో ఐదు ఆశ్వాసాలున్నాయి. ఇందు కావ్య లక్షణాలు, నాయక భేదాలు, రసాలు, గుణాలు, దోషాలు, రీతులు, వృత్తులు, అలంకారాలు మొదలైనవి వివరించబడ్డాయి.

### 10.3.2. వసుచరిత్ర :

రామరాజభూషణుడు తన అసమాన పాండిత్యంతో, రమణీయ కవితా వైభవంతో రచించిన ప్రబంధం వసుచరిత్ర. ఆంధ్ర సాహిత్య చరిత్రలో వసుచరిత్ర ఒక అపూర్వసృష్టి.

### కవితాలక్షణాలు - కవి అభిప్రాయం :

కవితా లక్షణాలును గూర్చి రామరాజుకు ఒక ప్రత్యేకమైన అభిప్రాయం ఉంది.

ఉ॥ కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నములాద్య సత్కథ
ల్వావిరి పుట్టు రత్నముల వారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వ వృత్తములు సానలు దీరిన జాతి రత్నముల్
గావున నిట్టి మిశ్ర కథగా నొనరింపుము నేర్పు పెంపునన్ 1 - 19

అనే కృతిపతి పలుకులను బట్టి కేవలం కల్పిత కథలు కృత్రిమ రత్నాలని, పురాణ కథలు గని నుండి అపుడే వెలికి తీసిన మూగరాళ్ళని, కల్పనలతో కూడిన పూర్వకథలు సానలు తీరిన జాతి రత్నాలని కవి యొక్క భావనగా తెలుస్తున్నది. రామరాజు మహాభారతంలోని ఆదిపర్వంలో నన్నయ నాలుగు గద్యపద్యాలలో సమకూర్చిన ఉపరిచర వసుకథను ఆధారంగా తీసుకుని తన విశేషమైన ప్రజ్ఞాపాటవాలతో ఆరు ఆశ్వాసాలు గల మహాప్రబంధంగ వసుచరిత్రను రచించాడు.

### 10.3.2.(అ) ఇతివృత్తం - మార్పులు :

వసురాజు అధిష్ఠాన పురానికి ప్రభువు. వన విహారానికి వెళ్ళినపుడు కోనలోని సంగీతాన్ని విని నర్మసఖుని తోడ్పాటుతో గిరికాదేవిని చూచాడు. నర్మసఖుడు యతి వేషధారియై గిరిక చెలియైన మంజువాణి నుండి ఆమె వృత్తాంతాన్ని తెలిసికొన్నాడు. సందర్భానుగుణంగ వసురాజు గిరిక దగ్గరకు వచ్చాడు. ఇరువురు అనురక్తులయ్యారు. తర్వాత విరహం - మంజువాణి దౌత్యం - దేవేంద్రుని పెద్దరికం - గిరికా వసురాజుల వివాహం. ఇది సంక్షిప్తకథ. భారతమూలమగు ఈ కథను ఆధారంగా చేసుకొని తన వర్ణనా సామర్థ్యంతో, అమేయకల్పనతో పెంచి వసుచరత్ర సౌధాన్ని నిర్మించాడు.

మూలంలో వసురాజు తపస్సుకు మెచ్చి ఇంద్రుడు దివ్యమైన ఒక విమానం, సకల ప్రహరణాలను వారించు ఇంద్రమాల, దుష్ట శిక్షణ మొనర్చు వేకుయష్టి ఇచ్చినట్లుంది. ప్రబంధంలో వసురాజు కోలాహలుని తన గోటితో ఎగమీటినందుకు అతని ప్రతాపానికి మెచ్చి ఇంద్రుడు విమానాదుల నిచ్చినట్లుగా మార్చబడింది. దివ్యమాల, వేణియష్టి అను వస్తువులను వివాహ సందర్భంలో వసురాజుకు ఇంద్రుడు బహుకరించినట్లు ప్రబంధంలో మార్చి చెప్పడం ఉచితంగా ఉంది. వసురాజు గిరికను చూడడానికి ముందే అతనికి ఏడుగురు పుత్రులున్నట్లు మూలంలో ఉండగా ప్రబంధంలో వసురాజు అవివాహితుడైనట్లు చమత్కారంగా కల్పించబడింది.

ఈ విధంగా రామరాజభూషణుడు తన వసుచరిత్రలో రసభావాద్యనుగుణంగా అనేక సన్నివేశాలను కల్పించి సానలు దీరిన జాతిరత్నంగా తీర్చిదిద్దాడు.

## 10.3.2.(ఆ). ప్రధానపాత్రలు :

ఈ కావ్యంలోని ప్రధానపాత్రలు వసుమహారాజు, గిరిక, నర్మసఖుడు, మంజువాణి. శుక్తిమతి, కోలాహలుడు నదీపర్వతాలు. వసుమహారాజు చేదిభూపాలుడు. శౌర్య ధైర్యము, ఉదారభావములు కలిగిన ధీరోదాత్తుడయిన ఉత్తమ నాయకుడు. కోలాహల పర్వతాన్ని కొనగోటితో మీటిన మహా బలాఢ్యుడు. ఇంద్రుని మెప్పు పొంది విమానమును, ఇంద్రమాల, దివ్యయష్టిని బహుమానంగా పొందిన వాడు. ఆర్తత్రాణపరాయణుడు సరసుడు. ఈ ప్రబంధంలోని నాయిక గిరికాదేవి ఉత్తమ లక్షణాలు కలిగింది. సౌందర్యరాశి. తన మనోభావాలను సరసంగా వ్యక్తీకరింపగల చతురనాయిక. నర్మసఖుడు రాజుకు ఆంతరంగికుడు. రాజుకు అన్ని విధాల ఉపకరించే వాడు. గిరిక వృత్తాంతాన్ని నేర్పుగా తెలుసుకొన్నవాడు. యతి వేషాన్ని ధరించి గిరిక దగ్గరకు వెళ్ళి అచట వారికి తనపై భక్తి కుదురునట్లుగ నటించిన చతురుడు. మంజువాణి చెలికత్తెలలో సార్థక నామమైన చతురభాషిణి. కార్యనిర్వహణ దక్షురాలు. ఈమె గిరిక పక్షాన ప్రణయదౌత్యాన్ని నేర్పుగా నిర్వహించి వసురాజు గిరికల వివాహానికి తోడ్పడింది.

## 10.3.2.(ఇ). వర్ణనలు :

ఈ ప్రబంధంలో వర్ణనలకు అధిక ప్రాధాన్యమీయబడింది. ఈ వర్ణనలు కవి పాండిత్యానికి, భావనాబలానికి గీటురాళ్ళు.

మ॥ తన రాజీవ శరం బెరుగదు నిశాత్వంబు లేఁ గల్వుతూ
నీరం బారఁగ గోసి తద్రుటి ఫలానీకంబు ప్రాతర్మహా
సీరి గ్రామణి తూరుపెత్తె ననదో చెందూర్పు నందెల్పత
ద్ద్వార న్యస్త పలాల రాశిక్రియ నిందుండేఁ గె నిస్సారుడై 4 - 130

ఇది చంద్రాస్తమయ వర్ణన. మంజువాణి వసురాజు నుండి అంగుళీయకాన్ని తెచ్చిన తరువాత గిరిక చెలికత్తె చేసిన వర్ణనిది. తూర్పారబట్టిన ధాన్యపు పొట్టువలె చంద్రుడు కాంతిహీనుడై పడమటి దిక్కున ఉన్నాడని కవి చేసిన ఉత్ప్రేక్ష అతని అలంకారిక రచనకు నికషోపలం.

పాత్రల మనస్తత్త్వాలను నిశితంగా పరిశీలించి వర్ణించడానికి ఈ క్రింది పద్యం ఉదాహరణ.

శా॥ మాయాశీలురు చంచలాత్ములను కంపా శూన్యలాత్మైకకా
ర్యాయత్తు ల్పమయానుకూల హృదయ వ్యాపార గోపాయ కో
పా యజ్ఞల్మగ వారలాపయి మహీపాలుర్మహా వైభవ
శ్రీయోగాంధులు సెప్పనేల మగవారి న్నమ్మగావచ్చునే 4 - 90

ఈ పద్యంలో మగవారి స్వభావం నిశితంగా విమర్శింపబడింది.

రామరాజు శుక్తిమతీ కోలాహలుల ఘట్టం ఒక ప్రత్యేక కళాఖండంగా దిద్ది తీర్చినాడు. గిరిక జన్మను గూర్చి తెల్పుతూ మంజువాణి శుక్తిమతి కోలాహలుల వృత్తాంతాన్ని గూర్చి తెల్పిన సందర్భం. శుక్తిమతినది కోలాహలం పర్వతం. ఈ రెండూ అచేతనాలు అయినా ఈ రెండిటి యందు కవి తన ప్రతిభాపాండిత్యాలతో, కల్పనా చాతుర్యంతో నాయకనాయిక భావాన్ని ఆరోపించి కథను సాగించి అచేతనాలకు చేతనత్వం ఆపాదించాడు.

కోలాహలుడు హిమవంతుని కుమారుడు. ప్రస్తుత ఘట్టానికి నాయకుడు. శుక్తిమతి బ్రహ్మ కొలువు నుండి మరలి వస్తున్నప్పుడు కోలాహలుని కంటపడింది. అంతకు పూర్వమె ఆమెను చూచి మోహించి, ఆమెను కలిసికొనుటకు అవకాశం కొరకు ఎదురుచూస్తున్నాడు కోలాహలుడు.

సీ॥ సుమనోధి వాసభాసుర శిఖోన్నతి వాఁడు
ఘనసార తిలక వాసనల వాఁడు
ఘన సంకుమద సాంద్ర గండ భాగమువాఁడు
నవరాగ పద్మ దంతములవాఁడు
కలితోప కంఠ నక్షత్రమాలిక వాఁడు
హరిచందన చ్ఛాయ నమరు వాఁడు
తపనీయ మేఖ లాధాళ ధళ్యము వాఁడు
మణిపాద వలయ ధామంబు వాఁడు

తే॥ నర్ఘ్యరత్నావళీ విచిత్రాంబరాభి
రామ శృంగారముల వాఁడు, హైమగర్భ
గేహమున కేఁ గువాడు, కోలాహలాఖ్యుఁ
డొక ధరాధీశుఁ డెదురయ్యె సువిదకపుడు 2 - 107

కవి కోలాహలుని ఒక శృంగార పురుషుడగు నాయకునిగా ఆరోపించి వర్ణించాడు. ప్రకృతం పర్వతం. అప్రకృతార్థమున నాయకుడు. తన సమీపం నుండి వెళ్ళుచున్న శుక్తిమతిని (నదిని) చూచి మోహించాడు. ఎంత మంది కాంతలను చూచినా అతనికి మోహం కలగలేదు. పూర్వజన్మ కృతముగా ఈమెపై అతనికి ప్రేమ కలిగిందట. తన సర్వస్వమును అర్పింతునని బాసచేసి తనను ఏలుకొమ్మని కోరినాడు. కాని అతని చేష్టల శుక్తిమతికి నచ్చలేదు. "పర్వతరాజు పుత్రుడని, జగన్మాత సోదరుడ"ని గౌరవంగా వినయంగా ఒరగా వెళ్ళింది. నదులు పర్వతాలను ఆనుకొని ప్రవహించుట సహజం! అతనికి వినయంగా సమాధానం చెప్పింది.

మ॥ మతిఁ గ్రీడారతి గల్గెనేని సకలక్ష్మా పుణ్యదేశాళిఁ గాం
చితపః స్ఫూర్తి మెయింగృశించి వనరాశింజెందు మాబోఁట్లను
ద్ధతిచేఁ గ్రమ్మగ నేల నీకుఁ గఱవే తారుళ్య లావణ్య జృం
భిత రంభాది నిలిపం భామలన భూభృక్మాళి రాగాంధుడై 2 - 136

శుక్తిమతి తన అసమ్మతిని నేరుగా వ్యక్తపరచింది. తాను విరాగియని "తాపసవృత్తితో తీర్థయాత్రలు చేయుచు, శరీరమును కృశింప చేసుకొనుచు అడవులలో గడుపుచుండు మావంటివారలు నీ కేళీ విలాసాలకు తగరు. నీకు రంభాదులు కరవు కారని" చమత్కారంగా విన్నవించింది. నదులు వ్యాపించిన దేశాలన్నీ పుణ్యతీర్థాలే. అవి తపస్ఫూర్తిచే అంటే ఎండ వేడిమిచే కృశించుట యధార్థమే. నదులు వనరాశిని చేరుట ధర్మమ్! ఇది రామరాజు భూషణుని ప్రకృతి పరిశీలనా శక్తిని తెలియచేస్తుంది.

కోలాహలమును ఒరిసికొని శుక్తిమతినది ప్రవహిస్తున్నది. ఆ నదియొక్క ప్రవాహా వేగంచే పర్వతం కొంత ఒరిగి నదిలో పడినట్లున్నది. ఆ ఒరుగుటను కోలాహలుడు శుక్తిమతిని బలాత్కరించినట్లే ఉంది. అప్పటి శుక్తిమతి యొక్క స్థితిని వర్ణించిన తీరు.

ఉ॥ వేణి చలింపఁ గంపిత నవీన మృంకాళ భూజాగ్ర కంకణ
శ్రేణి నటింప లోలశ ఫరీ నిబిరీ సకటాక్ష కాంతివి
న్నాణము చూప హంసకగణ క్వణనంబులు మీర, సైకత
శ్రోణి వివర్తి తాబ్జముఖ సోభితయై కడు సంభ్రమించినన్ 2 - 138

ప్రకృతార్థంలో పర్వతము నదిని అడ్డగించుటచే నది యొక్క పాయ వేర్పాటును పొందింది. తామరతూండ్లు కంపించాయి. హంసలు కలగుండుపడ్డాయి. అప్రకృతార్థంలో నాయిక జడ కంపించింది. ఆమె గడగడ వణికింది. గాజులు మ్రోగాయి. తొట్రుపాటు చెంది ముఖం ప్రక్కకు త్రిప్పింది. ఇది శ్లేషతో కూడిన రమణీయమైన వర్ణన. ప్రకృతార్థం చెప్తూ అప్రకృత విషయాలను ధ్వనింప చేయడం వసుచరిత్ర ప్రబంధం యొక్క వైశిష్ట్యం. దీనిలో పర్వతపరమగు అర్థం, నదీపరమగు అర్థం వాటి పరిధులను అతిక్రమించక శబ్ద శక్తితో అప్రకృతమైన నాయికా నాయక భావాన్ని ఘటింపచేశాడు. అచేతనములగు నదీ పర్వతాలకు చేతనత్వాన్ని కలిగింప చేసి వాచ్యర్థంకన్నా వ్యంగ్యార్థాన్ని మనోహరంగా ధ్వనింప చేశాడు.

### 10.3.2.(ఈ). శబ్దచమత్కృతి - శ్లేష వైచిత్రి :

శబ్దచమత్కాతారాలకు, శ్లేషవైచిత్రికి వసుచరిత్ర పుట్టిల్లు. శ్లేష చమత్కృతనిన రామరాజుకు ప్రీతి. ప్రకృతార్థానికి ఆటంకం కలుగకుండా సహజ రమణీయంగా శ్లేషను కూర్చాడు. శ్లేషనగా అనేకార్థముల కూడిక. ఒక చక్కని అర్థమే ఆనందకరమై ఒప్పుచుండగా అనేకార్థాలు ఒకే పదంలో కూర్చిన అమితమైన ఆనందం కలుగుతుంది. శుక్తిమతిన వర్ణించిన సందర్భంలో దీనిని మనం చూడగలం.

ఉ॥ జీవనమెల్ల సత్కవి నిషేవి తమాశయమెల్ల నచ్ఛతా
పావన తాగభీర తలపట్టు ప్రచారములెల్ల విశ్వధా
త్రీ వలయత్రికాల ఫలదేశికము ల్నవకంబులెల్లము
క్తావళి విభ్రమాస్పదము లానది పెంపు నుతింపశక్యమే 2 - 105

ఈ పద్యంలో ధార్మికమగు స్త్రీ పరంగా, నదీపరంగా చెప్పబడిన రెండు అర్థాలు సుందరమై ఒప్పినవి. శుక్తిమతీ నది నీటి పక్షులకు ఆశ్రయం. ఇందున్న మడుగులు నిర్మలాలు. జలములు పవిత్రం. ఈ నది శంఖాలు, ముత్యాలకు అలవాలం. కాబట్టి ఈ నది పెంపునుతింప శక్యంకాదు. ధార్మిక స్త్రీ పరంగా శుక్తిమతి జీవనం కవి సేవితం. ఈమె హృదయం పవిత్రం. గంభీరం. ఈమె సౌందర్యం ముక్తులకు కూడా భ్రమను కలిగిస్తుంది. ఈ పద్యంలోని "కవి సేవితము" మొదలైన పదాలు శ్లేష కొరకు తెచ్చి పెట్టుకొన్నవి కావు. రసపాద వశ్యమున తమంతతాముగా నిలిచిన పదాలు.

కోలాహలుడు శుక్తిమతి దగ్గరకు రాగా అతిథి పూజ గావించి శుక్తిమతి, కోలాహలునితో మాట్లాడిన పద్యం.

సీ॥ అతుల శైవలవ తీశతము లీనెడు మీకు
నాయిచ్చు విమలార్ఘ్య తోయమెంత
ప్రాలేయ నిలయ సంభవము గాంచిన మీకు
బన్నీట నొనరించు పాద్యమెంత
సరస మందార మంజరుల రంజల మీకు
బెనఁచి పూదండ లర్పించు టెంత

గోరత్న దోహన గురులక్ష్మి గల మీకు
నుపదగా మణివర్గ మొసఁగుటెంత

తే॥ యనఘ యెవ్వారలైనఁ గొండంత వారి
కవనిఁ గొండంత పూజ సేయంగఁ గలరె
భక్తి నేనిచ్చు నీపుష్పపత్రతోయ
మాత్రము గైకొనుటెకాక గోత్ర తిలక 2 - 121

ఈ పద్యంలో నాయకపరంగ శైలపరంగా రెండర్థాలున్నాయి. సుకుమారియగు శుక్తిమతి కోలాహలుని ఔద్ధత్యాన్ని సహింపక వ్యంగ్యంగా అతనిని పరిహసించింది. 'అనేక నదులకు ప్రభావస్థానమగు మీకు నేనిచ్చు అర్ఘ్యజలమెంత?' అనేది బాహ్యార్థం. కోలాహలుని కడనుండు నీరు పాచి తీగలతో మలినమైనదని తానిచ్చు విమలార్ఘ్యతోయమని అతని కెట్లు లభిస్తుందని అంతరార్థం. ఈ పద్యంలో బాహ్యాభ్యంతరార్థాలు భాసిస్తున్నవి. కొండంత వారికి కొండంత పూజ చేయగలరా? అను జాతీయం కొండపరంగా రామరాజభూషణుడు తన నేర్పును ప్రదర్శించాడు.

### 10.3.2.(ఉ). రసపోషణ :

వసుచరిత్ర ప్రబంధంలో ప్రధానరసం శృంగారం. ఇతర రసాలు సందర్భానుసారంగా పోషించబడ్డాయి. వసురాజు శుక్తిమతి ఆర్తిని విని కాపాడిన ఘట్టంలో కరుణరసం, కోలాహలుని పాదతాడనమున వీరం, నర్మసఖుడు యతివేషధారిగా ప్రవేశించిన సన్నివేశంలో అద్భుతరసం మొదలగు రసాలను రసవత్తరంగా పోషించాడు. గిరిక వసురాజుల శృంగారం రమ్యంగా పోషించబడింది. వర్ణనలన్నీ శృంగార రసానికి పోషకాలయి వసుచరిత్రకు ఔన్నత్యాన్ని కలిగించాయి.

### 10.3.2.(ఊ). నాటకీయత :

వసుచరిత్ర దృశ్యకావ్యమైనను రామరాజభూషణుడు కొంతవరకు నాటకీయంగా నడిపించాడు. "శ్రీభూపుత్రి వివాహవేళ" అనే కృత్యాది పద్యం నాటకంలో నాందీ పద్యం వంటిది. దీనిలో కథా సూచన చేయబడింది. అట్లే కావ్యాంత పద్యం భరతవాక్యంగా చెప్పబడింది. పాత్రల ప్రకాశాలు, ప్రవేశ సూచనలు నాటకీయ గుణాలు, సంస్కృత నాటకంలోని విదూషకుని పాత్ర కూడా ప్రవేశపెట్టాడు. ఈ ప్రబందంలోని విదూషకుని కార్యకీరణ నైపుణ్యం నాటకోచితం, గిరికను చూడడానికి వసురాజు రావడం, విదూషకుడు యతి వేషంలో వెళ్లడం, మంజువాణి రాజు దగ్గరకు గిరిక విరహ వేదనను తెలియజేయడానికి వెళ్ళి ఉంగరాన్ని తీసికొని రావడం మొదలైన ఘట్టాలు, విదూషక మంజువాణుల సంభాషణలు వంటి సంభాషణలు నాటకీయ విధానాన్ని అనుసరించాయి.

గంధ గజయాన గీత ప్రబంధ కలన
నలరి యతిలియ్యమై వచ్చు నరిది మగువ
లార! కనుగొంటి రేయను నాళివాక్య
మొకటి విననైననిదె వేళ యొదవెననుచు 2 - 81

అని చెలి పలికన "యతిలియ్యమై వచ్చు" అను వాక్యంలోని అక్షరసామ్యాన్ననుసరించి విదూషకుడు వారి చెంతకు చేరాడు.

అదే విధంగా వసురాజు గిరిక చెంతకు ప్రవేశించినపుడు విదూషకుడు తన మంత్రమహిమ అన్నట్లు "మజ్ఝా" అనగానే -

మ॥ ఇది సంధింపఁగ వేళయంచు వసురాజేంద్రుడు నీరంధ్ర నీ
రదవార ప్రతి సీర వెల్పడిన తారా భర్త లీలన్ లతా
చ్ఛద సంఛాదికఁ బాసి నిల్చె నెదుటన్ సారంగరాగ భ్రమ
న్మద భృంగీరుతి వందిమాగధ కథా మాధుర్యం ముందెల్పిగన్ 3 - 43

ఇదే తగిన సమయమని వందిమాగధుల కైవారముల వలె తుమ్మెదల ఝుంకారములు స్తోత్ర వాక్యములు పలుకుచుండగా తెరమాటున నుండి ప్రవేశించినట్లుగా వసుమహారాజు గిరిక చెంతకు ప్రవేశించడం మనోహరంగా చెప్పబడ్డాయి.

చంద్రోదయ వర్ణన సందర్భంలో తెర తీయబడటం మనోజ్ఞంగా చూపాడు.

మ॥ హరిదంబోరుహ లోచనల్గగన రంగాభోగ రంగత్తమో
భరనేపథ్యము నొయ్యనొయ్య సడలింపన్ రాత్రి శైలూషికన్
వరుసన్ మౌక్తిక పట్టమున్ నిటలమున్ వక్త్రంబు నుందోఁచెనా
హరిణాంకాకృతి వాల్చెరేకయి సగంబై బింబమై తూర్పునన్ 4 - 17

దిక్కులనెడు స్త్రీలు ఆకాశమనెడు రంగస్థలమున చీకటనెడు తెరను నెమ్మది నెమ్మదిగా తొలగింపగా రాత్రి దిక్కులనెడు నాట్యస్త్రీకి ముందుగా ముత్యాలహారం, పిదప నొసలు, తర్వాత మొఖము వరుసగా ప్రకాశించెనా అన్నట్లు చంద్రుని రూపం మొదట రేఖాపరంగా, సగంగా, తరువాత పూర్ణబింబంగా ప్రకాశించిందట. ఈ వర్ణనవలన కవికి గల నాటక ప్రయోగ నైపుణ్యం తెలుస్తున్నది.

### 10.3.2.(బు). సంగీత కళావైదుష్యం :

వసుచరిత్ర సంగీత సాహిత్యాల సమ్మేళనం. రామరాజభూషణుడు సంగీత కళా రహస్యనిధి.

మ॥ అరిగాఁ బంచమ మేవగించి నవలాలవ్వేళ హిందోళవై
ఖరిఁ బూనన్ బికజాత మాత్మరవ భంగ వ్యాకులంబై వనీ
ధరనా లంచిత పల్లవ వ్రత విధుల్ దాల్పన్ దదీయధ్వనిన్
సరిగా గైకొనియెన్ వసంతము మహా సంపూర్ణ భావోన్నతిన్ 1 - 130

ఇది వసంత వర్ణన. స్త్రీలు కోకిలలకు ఇష్టమైన పంచమ స్వరమును అరిగా భావించి హిందోళరాగాన్ని పాడారు. అందులకు పికములు బాధ చెంది చిగురుటాకులను మాత్రమే భక్షించి తపంచేసి పంచమ స్వరంతో పాడగా వసంతం సరిగా గ్రహించిందట. అనగా స్త్రీలు హిందోళ వసంతములు పాడారని తాత్పర్యం. హిందోళ రాగం ఋషభవర్జితం. వసంత రాగం ఋషభసహితం. వసంత రాగం పంచమ స్వరంతో కూడి ఉన్నపుడే అది సంపూర్ణ రాగమని తెల్పాడు.

మ॥ పదమెత్తం గలహంస లీలయధర స్పందంబు సేయన్ శుభా
స్పదమౌ రాగ కదంబకంబు శ్రుతి చూపన్ శ్రీవిలాసంబుకే
ల్గ దలింపన్ సుకుమార పల్లవ నీవై లాలక్ష్మి వీక్షింప ష
ట్పదియుం బొల్చుఁ దరంబె కన్నెఁ గొనియాడన్ వాక్ప్రౌఢిమన్ 3 - 59

ఈ పద్యం సంగీత సాహిత్య సరస సమ్మేళనం. దీనియందు చెప్పబడిన పదము, రాగ కదంబకము, శ్రుతి, పల్లవి, ఏల, షట్పది మొదలుగా గల పదాలు సంగీతశాస్త్ర సంబంధమైనవి. గిరిక మరాళయాన. ఆమె పెదవులు రాగవంతాలు. ఆమె చేతులు

చిగురుటాకువలె, చూపులు తుమ్మెదలవలె ఉన్నవి. ఈమెను పొగడుట ఎవరితరంకాదు. అనే భావంతో పాటు ఆమె పదం పాడినచో కలహంస రాగం. పెదవి కదలినచో రాగ సమూహం. శ్రుతి చూడగ శ్రీరాగం. అని సంగీతార్థంతో శ్లేష చమత్కృతితో రెండు భావాలను ఈ పద్యంలో మేళవించి చెప్పిన కవి చాతుర్యం వర్ణనాతీతం. రామరాజభూషణుడు సంగీత కళానిధి కావున పద్యాలన్నీ శ్రావ్యాలు. రమణీయాలై ఒప్పారుచున్నాయి.

ఈ విధంగా సర్వాలంకార భూషితమైన వసుచరిత్ర తమిళం, సంస్కృతం, ఆంగ్లం మొదలగు భాషలలోనికి అనువదింపబడింది. వసుచరిత్ర ననుసరించిన కనుపర్తి అచ్చయామాత్యుని పురూరవ చరిత్ర అడిదం సూరకవి రచించిన కవిజన రంజనం, అకలంకం కృష్ణకవి రచించిన శకుంతలా పరిణయం, కూచిమంచి తిమ్మకవి రచించిన రసికజన మనోభిరామ మొదలైన కావ్యాలు పిల్ల వసుచరిత్రలుగా ఎన్నబడినవన్ని వసుచరిత్ర ఔన్నత్యం తెలుస్తున్నది.

## 10.2.2. హరిశ్చంద్ర నలోపాఖ్యానము :

రామరాజు పాండిత్య ప్రకర్షను తెలియచేసే మరొక రచన హరిశ్చంద్ర నలోపాఖ్యానం. ఇది ద్వ్యర్థి ప్రబంధం. హరిశ్చంద్రుని యొక్క నలుని యొక్క కథలను రెండింటిని రమణీయ శ్లేషలతో కూర్చిన గ్రంథం. ఇది ఐదు ఆశ్వాసాల ప్రబంధం. దీనిని తన దైవమైన శ్రీరామునికి అంకితమిచ్చాడు. దీనిలోని నల కథకు మూలం హర్షునిచే రచింపబడిన సంస్కృత నైషధం. హరిశ్చంద్రుని కథకు మూలం మార్కండేయ పురాణ దేవీభాగవతాలు. మూలము నుండి కథను గ్రహించినప్పటికి అర్థద్వయాన్ని సంపాదించడానికి కొన్ని మార్పులు చేశాడు. ప్రబంధసిద్ధికి అష్టాదశ వర్ణనలను సమకూర్చాడు. "సంస్కృతాంధ్ర భాషా సామ్రాజ్య సర్వంకష చతుర్విధ కవితా నిర్వాహక సాహిత్యరస పోషణ రామరాజభూషణ ప్రణీతంబగు హరిశ్చంద్ర నలోపాఖ్యానంబను మహా ప్రబంధంబు" అని చెప్పుకొనిన విధంగా ఈ కావ్యాన్ని ఉత్తమ ద్వ్యర్థి కావ్యంగా రచించాడు. పింగళి సూరన చెప్పిన శ్లేష భేదాలను రామరాజు పాటించాడు.

క॥ క్షితిభర్త కుమారుడులో<br>
హితుడన విలసిల్లెఁ జేర్చి హృదయంబున సం<br>
తత ముదమునకు జనాదర<br>
మతి సాంద్రముగా బహుశ్రుతానందితుఁడై  1 - 21

ఇది సభంగ శ్లేషతో చెప్పిన పద్యం. హరిశ్చంద్రుని కుమారుడు లోహితుడు జనానందకరముగ విలసిల్లెనని హరిశ్చంద్ర కథా పక్షమునకు అర్థం. దమయంతిని గూర్చి నలుడు వినుటయే తనకు సాధనముగా ఉండెనని మన్మధుడు సంతోషించెనని నల కథా పక్షమున అర్థము. క్షితి భర్త+మారుడు-లోన్ -హితుడన అని విభజన.

హరిశ్చంద్ర నలోపాఖ్యానమున రెండు కథలకు సామ్యము తక్కువే అయినను తన శబ్ద శక్తితో తనకు గల ప్రజ్ఞను ప్రదర్శించిన విద్యత్కవి రామరాజభూషణుడు.

## 10.4. పింగళి సూరన :

పింగళి సూరనార్యుడు ఆంధ్ర సాహిత్య రంగంలో తన అపూర్వ కల్పనా చాతుర్యంతో సాహితీ శిఖరాగ్రాన అధిష్టించిన మహాకవి. ప్రబంధ ధోరణికి భిన్నంగా నూతన కావ్య సృష్టికి పూనుకొనిన మహాకవి. సూరన అష్టదిగ్గజ కవులలో ఉన్నాడా? లేదా అన్న విషయం వివాదగ్రస్తం. సూర కవిది పింగళ వంశం. ఈయన భార్య పెద్దన్నకు మనుమరాలు. సూరన ఈశ్వర భక్తుడు. శబ్ద పరిజ్ఞానమునందు అసమాన పాండిత్యం కలవాడు. నవ్యమగు కల్పనలను చేయడంలో అద్వితీయుడు. సూరన గరుడ పురాణం,

రాఘవ పాండవీయం, కళా పూర్ణోదయం, ప్రభావతీ ప్రద్యుమ్న గ్రంథాలను రచించినట్లు తెలుస్తున్నది. గిరిజా కళ్యాణము కూడా రచించాడని ఊహ. కాని గరుడ పురాణం, గిరిజా కళ్యాణాలు అలభ్యం.

### 10.4.1. రాఘవ పాండవీయము :

అపారమైన శబ్ద పరిజ్ఞానం, కవితా చాతుర్యం కలిగిన సూరన రాఘవ పాండవీయం అను అపూర్వమైన ద్వ్యర్థి కావ్యాన్ని రచించాడు. ఈ కావ్యాన్ని విరూపాక్ష క్షేత్రాధిపతి యైన విరూపాక్షేశ్వరునకు అంకితమిచ్చాడు. ద్వ్యర్థి కావ్య రచనకు ఆద్యుడు భీమన ఒక రాఘవ పాండవీయం రచించినట్లు తెలుస్తున్నది. కాని అది లభ్యం కాలేదు. సూరన రాఘవ పాండవీయమే లభించిన దానిలో మొదటిది. దీని ననుసరించి రామరాజభూషణుడు మొదలైన కవులు ద్వ్యర్థి కావ్యరచనలు చేశారు.

రాఘవ పాండవీయం రామకథ, భారత కథలు వచ్చునట్లు రచింపబడిన కావ్యం. సూరన "కోవిదాను కంపా ఘనబుద్ధి చూపెదఁ జమత్కృతి మత్కృతి మత్కృతిత్వమున్" అని ప్రతిజ్ఞ చేసి నెరవేర్చాడు. ఇటువంటి కావ్యాలు ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అపూర్వం. ఈ కావ్యం సూరన సంస్కృతాంధ్ర భాషా పాండిత్యానికి, శబ్దాల కూర్పునేర్పుకు నిదర్శనం.

ఈ కావ్యనందితకు ఆంధ్రభాషా సంస్కృతాభి భాషాశ్లేష, ఉచిత శబ్ద శ్లేష, అర్థ శ్లేష, ముఖ్యాగౌణ వృత్తి శ్లేష, అర్థాన్వయ శ్లేష, శబ్దాన్వయ శ్లేషలను చెప్పి తన కావ్యంలో చూపించాడు.

ఈ రామ భారత కథలు రెండింటి యందు కొన్ని అంశాలు సమానం. దశరథునకు పాండురాజుకు పుత్రులు లేక పోవడం వరప్రసాదంచే సంతతి కలగటం, ఇరువురు శాపగ్రస్తులగుట, రామునకు శివధనుర్భంగం, అర్జునునకు మత్స్యయంత్ర ఛేదనము మొదలగు అంగాలు రెండు కథలలో సమానాలే. కాని భారత కథలో సన్నివేశాలు ఎక్కువ. అయినా తన ప్రతిభతో కావ్య నిర్మాణం చేసి కృతకృత్యుడయ్యాడు.

### 10.4.2. కళాపూర్ణోదయము :

ఆంధ్ర సాహిత్యానికి అమూల్యాలంకారమగు కావ్యం కళాపూర్ణోదయం. అపూర్వ కథాకల్పనతో కమనీయ కవితా శిల్పంతో రచింపబడిన ఈ కావ్యం సూరన అద్భుత సృష్టి. పూర్వ కవులు ప్రఖ్యాతం లేక మిశ్ర కథలను మాత్రమే స్వీకరించగా సూరన కల్పితమగు కథను కావ్య వస్తువుగా గ్రహించాడు. "కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నాలని" రామరాజభూషణుడు నిరసించినను సూరనకు కీర్తి తెచ్చిపెట్టినది కళాపూర్ణోదయమే.

"సకల లక్షణ లక్షితంబయిన మహాప్రబంధము కీర్తి కారణంబని" ఊహించి సూరన చేసిన రచన ఇది. ఎనిమిది ఆశ్వాసాలు గల ఈ కావ్యాన్ని సూరన నంద్యాల కృష్ణమరాజుకు అంకితమిచ్చాడు.

### 10.4.2(అ). కథాకల్పన :

కథను కల్పించుటలో, ఉత్కంఠ కలుగునట్లు దానిని నడిపించడంలో సూరన అగ్రగణ్యుడు. ఆద్యుడు. ఈ కావ్యంలో ప్రధానమైంది కళాపూర్ణుని కథ. ఈ కథకు మూలం సరస్వతీ చతుర్ముఖుల ప్రణయ కేళీవిలాసం. కావ్య ప్రారంభంలో చెప్పవలసిన ఈ వృత్తాంతం కావ్యం మధ్య పంచమాశ్వాసంలో చెప్పడంవలన సూరన కల్పనాచాతుర్యం, కథనదక్షత వెల్లడవుతున్నది.

ప్రణయ కుపితురాలైన సరస్వతిని వినోదపరచడానికి ఎదురుగా పంజరంలోని చిలుకకు ఉబుసుపోకగా బ్రహ్మ తమ ప్రణయలీలా విలాసాలను కథా రూపంలో చెప్పాడు. బ్రహ్మ యొక్క సంకల్పరూపమగు ఆ ఊహయే వాస్తవమై భూలోకంలో అవతరించింది. విమానయానంలో రంభ నలకూబరునితో ప్రస్తావించిన కళాపూర్ణ వృత్తాంతాన్ని పూదోటలో ఆ సమయంలో వున్న

కలభాషిణి అవ్యక్తముగ విని నారద మహర్షిని ఆ వృత్తాంతాన్ని గూర్చి అడుగగా నారదుడు రంభా నలకూబరుల ప్రసంగాలను తెల్పుతూ నలకూబరునకు రంభ ఆ కళాపూర్ణుని కథ చెప్పకూడదని తాను కూడా చెప్పుటకు వీలులేదని కలభాషిణితో చెప్పాడు.

తే॥ అతివ రంభకును గలయట్టి భయము
నాకుఁ గల్గుటఁద త్కథ నీకుఁ జెప్ప
గూడదట్లయ్యు మిక్కిలిఁ గువలయమున
వెలయగలదది వెలయు త్రోవలును గలుగు 1 - 101

రంభకు భయమెందుకనగా ఎవరు కళాపూర్ణుని కథ చెప్పుదురో వారు భూలోకమున పుట్టవలెనని సరస్వతి ఇచ్చిన శాపం. కాబట్టి దేవతలు ఆ కథను చెప్పరు. అందుకే నారదుడు ఆ కథ చెప్పుటకు భయపడ్డాడు. పాఠకుడు అయిదు ఆశ్వాసాలు చదువునంతవరకు ఈ కథలోని మర్మము తెలుసుకొనలేరు. చతుర్ముఖుడు తన సతియగు సరస్వతితో ప్రణయకేళిలో తేలియాడు చున్నపుడు ఆమె పెడమొగము పెట్టింది. అపుడామె ముఖ ప్రతిబింబం కొలనులోని మణిస్తంభంలో ప్రతిబింబింపగా ఈ విషయాన్ని భంగ్యంతరంగా “కాసారపురంలో (చెరువున) కళాపూర్ణుడు (ముఖ ప్రతిబింబము) అను రాజు కలడు” అని చిలుకతో బ్రహ్మకథను ప్రారంభంచేసి చెప్పిన కథే కళాపూర్ణుని కథగ రూపుదిద్దుకొని భూలోకంలో వ్యాపించింది.

### 10.4.2(ఆ) కథైక్యము :

ఈ కావ్యంలో కలభాషిణీ, మణికంధరుల, సుగాత్రి శాలీనుల, సముఖా సత్తి మణిస్తంభుల, మధురలాలస కళాపూర్ణుల కథలు ఒకదానినొకటి పెనవేసుకొని వ్యాపించినవి. ఈ కథలకు ఏక సూత్రతను ఘటింప చేయుటకు మణిహారవృత్తాంతాన్ని కల్పించాడు. సుగ్రహుడు తపస్సు చేసి విష్ణువు నుండి పొందిన మణిహారం మధురాపుర బ్రాహ్మణునకు లభించింది. దానినతడు కృష్ణునకు సమర్పించాడు. కృష్ణుడు బహుమతిగా మణికంధరునకు ఇచ్చాడు. అతని నుండి అలఘు వ్రతునకు, తరువాత కళాపూర్ణునకు వచ్చినది. కళాపూర్ణుడు శిశుప్రాయంగా వున్న మధురలాలిసకు ఈయగా ఆమె వారల పూర్వజన్మల వృత్తాంతాన్ని హార మహిమ వలన ఆశ్చర్యకరం తెల్పుతుంది. ఈ విధంగా మణిహార వృత్తాంతాన్ని కల్పించి కావ్యానికి కథైక్యాన్ని కూర్చాడు సూరన.

### 10.4.2(ఇ). విచిత్ర కల్పన :

ఈ కావ్యంలో ‘తృతీయాశ్వాసంలో ఇరువురు రంభలను, ఇరువురు నలకూబరులను ప్రవేశపెట్టిన సన్నివేశం ఒక విచిత్ర కల్పన. నారదుడు తన గాన విద్య యొక్క గుణగణాలను తెలిసికొనుటకు కలభాషిణికి కామరూపాన్ని అనుగ్రహించాడు. నలకూబరుని సౌందర్యం చూచి మోహించిన కలభాషిణికి కామరూపం అనుగ్రహించాడు. నలకూబరుని సౌందర్యం చూచి మోహించిన కలభాషిణికి ఈ వరం ఎంతగానో ఉపకరించింది. మృగేంద్ర వాహనచే ఎగురగొట్టబడిన మణిస్తంభుడు కలభాషిణితో కూడా ఒక పొదరింటిలో పడగా అతడు కలభాషిణిని బలాత్కరింపబోయాడు. అపుడామె రక్షింపుమని మొరపెట్టగా అంతకు మునుపే మణికంధరుడు తన తపోభంగమునకై వచ్చిన రంభతో క్రీడించుచు ఆమెను సంతోషపరచుటకు తన తపశ్శక్తితో నలకూబరాకారుడై ఉన్నాడు. అతడు కలభాషిణి మొరను విని రక్షించుటకు వచ్చి, మణిస్తంభుని వెంటాడి వచ్చు లోపల కలభాషిణి ఇతడే నలకూబరుడనుకొని తాను రంభగా మారింది. ఈ విధంగా కలభాషిణి మణికంధరులే ఒకరికి తెలియకుండ మరొకరు రంభా నలకూబర వేషధారులై మోహంతో వుండగా నిజమైన రంభ నలకూబరుని వెదకుచూ వచ్చింది. అక్కడ తన ప్రతిరూపాన్ని చూచి ఆశ్చర్యాన్ని పొందింది. ఇంతలో నిజ నలకూబరుడు అక్కడకు వచ్చాడు. ఇది విచిత్ర సన్నివేశం. హాస్యరస సంభరితమగు అత్యద్భుత కల్పన. ఈ సందర్భంలో స్త్రీ సహజమగు అసూయా ద్వేషాలతో రంభ లిరువురు చేసికొనిన దూషణలు, సంభాషణలు రసవత్తరాలు.

## 10.4.2(ఈ) నాటకీయత :

కళాపూర్ణోదయం. కావ్యంలోని కవిత నాటకీయంగా సాగింది. సూరన సంభాషణలను నాటకీయంగా మలచడంలో చతురుడు. పాత్రల హావభావాదులను, చేష్టలను తెలియచేయుట, పాత్రల చేతనే పాత్రల స్వభావాన్ని చెప్పించుటనే నాటకం లక్షణం ఈ కావ్యంలో ఉంది.

ఆకాశయానమున మణికంధరుడు కలభాషిణి డోలావిహారాన్ని గూర్చి నారదునకు చెప్పు సందర్భంలో -

మ॥ తమిఁ బూదీగెలఁ దూగుటుయ్యెలలఁ బంతాలాడుచుం దూగునా
కొమరుం బ్రాయపు గుచ్చి గుబ్బె తలయంఘ్రుల్ చక్కగాఁ జాఁగిమిం
టి మొగం బై చనుదెంచు తీవిఁగను గొంటే దివ్య మౌనీంద్ర నా
క మృగీ నేత్రల మీఁద గయ్యమునకుంగాల్ చాఁచులా గొప్పెడున్ 1 - 43

అని రాబోవు రంభా నలకూబర వివాద సన్నివేశమును సూచించి కథకు చక్కని బీజం వేశాడు. మణికంధరుని మాటలను సమర్థించుచు నారదుడును కలభాషిణి తప్పక దేవతా స్త్రీలను తలదన్నునని చెప్పుచుండగా అటు ప్రక్కనే మరొక విమానంలో ప్రియమైన నలకూబరునితో ప్రయాణించుచున్న నారదుని మాటలు విన్నది.

ఆ॥ విని యొకింత కనలి, మనసొక లాగైన
నతని నారదుఁడని యాత్మ నెఱిఁగి
భావ వికృతి యెఱుక పడనీక యడఁచియ
మ్మగువ తనదు ప్రియుని మొగము చూచి 1 - 47

ఈ పద్యంలో నాటక పాత్రలవలె రంభయొక్క అప్పటి అవస్థను, ముఖ కవళికలను, హావభావాలను ఎరింగించాడు. నాటకంలో వలె సంభాషణలను సాగించాడు.

క॥ నిను బోలు వనిత నీకును
వనజ ముఖీ! యితనిఁ బోలువాఁడితనికి నెం
దును గల్గి కలచునో? యి
ట్టి నిగాఢపు ముదము సొంపు తీవులు చనునే 1 - 61

అని భావి కథా సూచన చేశాడు.

నిజరంభ మాయారంభలు మాటకు మాటకు బదులు పలుకుచూ ఒట్లు వేసికొనుచు సాగిన ఈ కలహ సంభాషణకు చక్కని జాతీయాలు, సామెతలు తోడ్డై మరింత మధురమైన హాస్యరస సంభరితమై ఒప్పారినది.

## 10.4.2(ఉ). కవితా శిల్పం :

కళా పూర్ణోదయంలోని కవితా శిల్పం సూరన ప్రతిభకు దర్పణం. కల్పిత కథను స్వీకరించుటచే సూరన తన భావనా బలమును, కవితా వైవిధ్యము, రసపోషణ నైపుణ్యాన్ని ఈ కావ్యంలో చూపగలిగాడు. ఈ కావ్య కవితా స్వరూపాన్ని గూర్చి కవి పాత్రల మాటున ఉండి ఈ క్రింది విధంగా చెప్పాడు.

లయవిభాతిః చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము గలిగినను
సౌరభముఁ జలువయుదలిర్పం బొలుపెసఁ
గ కప్పురపుఁ బలుకులకుఁ గోమలత నెలకొనిన సౌరభముఁ జలువపస
యుం గోమలతయును గలిగి జనముల మిగుల బెంపె సగు
మలయ పవనంపుఁ గొదమలకు మధురత్వం బలవడిన నీడు మణి
గలదనఁ గవచ్చుఁ గడు వెలయఁ గల యీసు కవి పలుకులకు నెంచన్ 1 - 83

ఈ సుకవి పలుకులు వెన్నెలలవలె చల్లదనాన్ని, కర్పూరం వలె కోమలత్వాన్ని, తుమ్మెదల ఝుంకార మాధుర్యాన్ని పొందిన వనుటకు ఈ ఒక్క పద్యం చాలు.

కవిత్వాన్ని గురించి సూరన తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాడు.

సీ॥ పొసఁగ ముత్తెపు సరుల్ పోహళించిన లీలఁ
దమలోన దరయు శబ్దములు గూర్చి
యర్థంబు వాచ్య లక్ష్య వ్యంగ్య భేదంబు
లెరిఁగి నిర్దోషత నెసఁగఁ జేసి
రసభావంబులకు నర్హంబుగ వైదర్భి
మొదలైన రీతులిమ్ముగ నమర్చి
రీతులకుచితంబులై తనరారెడు
ప్రాణంబులింపుగాఁ బాదుకొల్పి

తే॥ యమరనుపమాదులును యమకాదులునగు
నట్టి యర్థ శబ్దాలం క్రియలు ఘటించి
కవితఁ జెప్పంగ నేర్చు సత్కవిరునకు
వాంచితార్థంబు లొసఁగని వారుఁ గలరె 1 - 82

అని కవితా లక్షణాలను వివరించి కలభాషిణిచే చెప్పించాడు. తన కళాపూర్ణోదయం ఇటువంటి లక్షణాలతో కూడిన కావ్యమని ధ్వనింప చేసాడు సూరన.

### 10.4.2(ఊ). రసపోషణ :

కళాపూర్ణోదయం నవరసభరితమగు మనోహరకావ్యం. ఇది ఒక నూతన సృష్టి. ఇది శృంగారం ప్రధానరసంగా గల కావ్యం. శృంగార రసమును వైవిధ్యంలో చూపిన సూరన ప్రతిభ నిరుపమానం. ఈ కావ్యంలో నాలుగు కథలలో నాలుగు విధాలైన శృంగారాన్ని చూపించాడు.

సృష్టికర్తయగు బ్రహ్మ తన సృష్టి కార్యానికి ముందుగా భావనా జగత్తును కళాత్మకంగా ఊహించి నిర్మించాడనుటకు నిదర్శనంగా సరస్వతీ చతుర్ముఖుల కేళికథ చెప్పబడింది. ప్రకృతి (సరస్వతి) విలాసముచే తన్మయుడైన పురుషుడు (బ్రహ్మ) సృష్టికి ఉపక్రమిస్తాడు. బ్రహ్మ వాక్కు యదార్థం. ఇది వీరి ప్రణయ పరమావిధి.

కలభాషిణి మణికంధరుని వలచినది. కాని అది కార్యరూపమును పొందక అణగి ఉన్నచో జన్మాంతర మందయినను

సిద్ధిపొందు నని వీరి ప్రణయానికి సిద్ధాంతం కల్పించాడు. మణికంధరుని పొందు లభింపమిచే కలభాషిణి మనసు నలకూబరుని యందు ఆసక్తమయింది. ఇది ప్రణయధర్మము. అందుచే కవి ఈమెను వారకాంతగా కల్పించాడు.

ఈ కావ్యమునందు సుగాత్రీ శాలీనుల కథ ఆణిముత్యం. శాలీనుడు సహజ సౌందర్యా రాధకుడు. ఇది తెలియని సుగాత్రి ఒంటినిండ సొమ్ములు అలంకరించుకొని భర్త దగ్గరకు రాగా ఆమెను అతడు పట్టించుకోలేదు. చాలాకాలం వరకు ఆదరించని శాలీనుడుతో సుగాత్రి "ఒకవేళ సవతి ఉన్నచో ఆమెకును, మీకును సేవచేయుదునని" "పతి మన్ననలు గాంచె, యెంచెఁ దన్మతికి నట్టి సొంపులే గాని భూషణా లింపుగామి" అని సుగాత్రిని పతిభక్తి పరాయణగాను, శాలీనుని నిరాడంబరమగు సహజ సౌందర్యోపాసకునిగను చిత్రించి వీరి శృంగారాన్ని భారతజాతికి ఆదర్శంగా చూపించాడు సూరన. ఇటువంటి ఉదాత్త శృంగార రస పోషణ మరి ఏ ఇతర కావ్యాలలో చూడం.

శల్యాసరుని చరిత్రలో వ్యర్థ ప్రణయము. అసురమైన కామం. ఈ కామేచ్ఛ అతని నాశనానికి దారి తీసింది. రంభానలకుబరుల ప్రణయంలో కళాతౌల్యం, సౌందర్యారాధన, ప్రధానంగా చూపించాడు.

ఈ విధంగా శృంగార వైవిధ్యాన్ని బహుముఖాలుగా చూపించి, అణుమాత్రం అశ్లీలం అంటనీయక ఉత్తమ స్థాయిలో రసపోషణ కావించిన సూరన అద్వితీయుడు.

### 10.4.2 (ఋ) వర్ణనలు :

ఈ కావ్యం నందలి వర్ణనలు హృదయాన్ని ఆకర్షించేవిగా వర్ణించాడు.

తే॥ దర్కకోగ్ర ప్రతాప సంతప్తమైన
తాపసుని చిత్త మప్పుడా తలిరుఁబోడి
చెలువమనియెడు నమృతంపుఁ గొలనిలోన
నోలలాడుచుఁ దిరిగి రాఁజాలదయ్యె 3 - 24

ఇది మణికంధరుడు రంభను చూచి ఆకర్షితుడైన సందర్భంలోనిది. ఈ వర్ణన సూరన భావనాశక్తికి మచ్చుతునక. సూరన అవతారికలో ఈ కావ్యం "అత్యపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయంబును, శృంగార రసప్రాయంబును, బుణ్యవస్తు వర్ణనా కర్ణనీయంబును నగు కళాపూర్ణోదయంబు" అని చెప్పినట్లుగ పుణ్య వస్తువులుగా వేదాంత ప్రబోధం, తీర్థయాత్రాది వర్ణనలు చేయబడినవి. నారదుడు మణికంధరునకు విష్ణుసేవను గుర్చి తెల్పుతూ అనేక వేదాంత విషయాలను ప్రబోధించాడు.

### 10.4.2(ౠ). సార్థకనామము :

ఈ కావ్యానికి కళాపూర్ణోదయం సార్థక నామము. సరస్వతీ చతుర్ముఖుల ఘట్టంలో ఇతని కవిత్వకళ పూర్ణంగా ఉదయించింది. వ్యక్తిగతమగు విలాసలీలలు అనుభూతిగా ఉన్నపుడు ఒక విధంగా, అది మాటలలోనికి వచ్చినపుడు మరొక విధంగ, అది భూలోకానికి వచ్చినపుడు చిలువలు పలువలుగ వ్యాపించింది. కాబట్టి కళాపూర్ణోదయం కావ్యం కళల యొక్క సంపూర్ణ వికాసం. కావుననే దీనికీ పేరు సార్థకమైంది.

### 10.4.3. ప్రభావతీ ప్రద్యుమ్నము :

కళాపూర్ణోదయాన్ని రచించిన తరువాత పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నమను ప్రబంధాన్ని రచించాడు. వజ్రనాభుడు

రాక్షసుని కుమార్తెయైన ప్రభావతిని, కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుడు వివాహమాడుట ఇందలి ప్రధాన కథా వస్తువు. కావ్యాంతంలో "అఘహరణ హరివంశ కథాశ్రయంబు" అని కవి చెప్పడం వల్ల హరివంశం నుండి ఈ కథ గ్రహించబడిందని తెలియుచున్నది. కాని తెలుగు హరివంశంలో ఈ కథ లేదు కాబట్టి సంస్కృత హరివంశం దీనికి మూలం. కేరళ రాజగు రవివర్మ రచించిన ప్రద్యుమ్నాభ్యుదయము ఈ కథకు ఆధారమని పరిశోధకుల నిర్ణయం. ఈ ప్రబంధాన్ని తన తండ్రి అమరామాత్యునకు అంకితమిచ్చాడు.

### 10.4.3(అ) మూలమునకు మార్పులు :

సూరన మూలం నుండి కథను స్వీకరించి ఉచితమగు మార్పులు చేర్పులు చేసి ప్రభావతీ ప్రద్యుమ్నమును అయిదు ఆశ్వాసాలుగల రసవత్తర ప్రబంధంగా రచించాడు. మూలమున గల 'వజ్రనాభ వధ' అనే పేరును మార్చి శృంగార రసస్ఫోరకమగు ప్రభావతీ ప్రద్యుమ్నము అను పేరు పెట్టుట ఒక మార్పు. మూలంలో ఇంద్రుడే హంసలను పిలిచి ప్రభావతికి ప్రద్యుమ్నుని యందు ప్రేమ కలిగించే భారం మీదే అని ఉపాయం చెప్పినట్లుండగా సూరన శుచిముఖీ వల్లభుని వలన శుచిముఖిని ఇంద్రసభకు పిలిపించి ఆ హంస యొక్క ఔన్నత్యాన్ని పరిశీలించి కార్యభారాన్ని దానికే విడిచినట్లు మార్పుచేశాడు. ఇది ఇంద్రుని ఉదాత్తతకు భంగంరాని విధంగా ఉంది. చిలుక రాయబారం, సరస్వతీ బ్రహ్మల ప్రణయ కలహం మొదలగు మార్పులు చేశాడు. అంతే గాక మూలంలో వజ్రనాభుని మ్రోల రంభాభి సరణమను నాటకం ప్రదర్శింప బడినట్లుండగా సురన తన ప్రబంధంలో గంగావతరణమను నాటకమును ప్రదర్శించినట్లు వ్రాశాడు. మూలంలో భద్రనటునికి కార్యరంగ ప్రవేశముంది. శ్రీకృష్ణుడు భద్రునికి శత్రురాజ్య నిర్మూలన కార్యభార మప్పగించినట్లు మూలంలో చెప్పబడింది. సూరన ప్రబంధంలో భద్రనటునకు కార్యరంగ ప్రవేశం లేదు. నటనకు వటువులకు జరిగిన సంవాదంలో శ్రీకృష్ణుడు వటు వచనాలను ఉపశృతిగా చేసుకొని ప్రద్యుమ్నుని భద్రనట వ్యాజమున వజ్రపురానికి సుకరంగా పంపవచ్చునని నిశ్చయించుకొన్నట్లు సూరన వ్రాశాడు. మూలంలో శుచిముఖి పాత్రకు వ్యక్తిత్వంలేదు. ప్రబంధంలో మొత్తం కథంతయు శుచిముఖి ద్వారానే నడచింది.

### 10.4.3(ఆ). పాత్ర చిత్రణ :

సూరన ప్రభావతి ప్రద్యుమ్న ప్రబంధంలో శుచిముఖి పాత్రచిత్రణ విశిష్టంగా ఉంది. శుచిముఖి కేవలం పక్షి కాదు. కార్యం సాధించే మంత్రి. శుచిముఖి లోకజ్ఞత, రాజనీతి యెత్తులు, వాచా ప్రౌఢిమ మానవులను దేవతలను కూడ మించి పోయింది. దాని మాట నేర్పు, బుద్ధి కుశలత, సంస్కార పూరితమగు వాక్కు వర్ణనాతీతం.

దేవేంద్రుడు తన పరివారానికి చేతకాని పనిని హంసలచే చేయించబూని హంసలను వేగు నడుపుమని కోరాడు. అపుడు శుచిముఖి ఇంద్రునికి చెప్పిన సమాధానం.

చ॥ తడవులబట్టి యేము సతతంబును బోదుము వాని వీటికిన్
గడుమతి చాల మింగడుపు కక్కురితిన్, సురలోకనాధ! మా
యెడగల యట్టి తప్పిది సహింపుము పక్షుల మౌట నొక్క వెం
బడినిది చెల్లె గాక రిపు ప్రాంతము చేరెడు వారలాప్తులే 1 - 118

అని తార్కికముగ పలుకుచు ఇంద్రుని సంతోషపరచి తనయుడు ప్రసన్నత పొందుటకు ప్రయత్నించింది. మాట నేర్పుతో ధర్మజ్ఞతను వెల్లడించింది. ప్రభావతి చెలి రాగవల్లరి శుచిముఖిని ప్రశంసిస్తూ

ఉ॥ అంతవు గావు నీవు మమునారసి ప్రోవఁగ మూర్తి మత్వమున్
గాంచిన భాగ్య దేవతవు గాని మదుక్తి తెరంగు నేడుగె

ల్పించితి వేజగంబులను లేఁడిటువంటి మనోహరాంగ కుం
డంచు గలంచు నిజ్జలరుహాసీన మానక నాదు చిత్తమున్ 3 - 57

శుచిముఖి పాత్ర చిత్రణకే సూరన ప్రభావతి ప్రద్యుమ్నాన్ని రచించాడని పండితుల అభిప్రాయం.

సూరన శుచిముఖిని ఇంద్రుడు ప్రశంసించు సందర్భంలో కవిత్వాన్ని గూర్చిన అభిప్రాయాన్ని ఇంద్రుని ద్వారా చెప్పించాడు.

సీ॥ శబ్ద సంస్కార మెచ్చట జారగ నీక
పదమైత్రి యర్థ సంపదలఁ బొదల
యాకాంక్షిత స్ఫూర్తి యాచరించుచును
శాఖా చంక్ర మణ క్రియఁ గడవఁ జనక
ప్రకృతార్థ భావంబు పాదుకోనదుకుచు
నుపపత్తి యెందు నత్యూర్జితముగ

గీ॥ నొకట బూర్వోత్తర విరోధ మొదవకుండ
దత్త దవీయవ వాక్య తాత్పర్య భేద
ములు మహా వాక్య తాత్పర్యమునకు నొనర
బలుక నేర్చుట బహుతపః ఫలము గాదె 2 - 3

సూరన అనుకొనిన ఉత్తమ కవితా లక్షణాలన్నీ శుచిముఖిలో ఉన్నట్లుగా చెప్పడం శుచిముఖి విశిష్టత కూడా తెలుస్తున్నది. ఈ శుచిముఖి బ్రహ్మరథ వాహనుడైన సారంధరుని కూతురు. దానిని భారతీదేవి పెంచి పెద్ద చేసింది. దాని కవిత్వానికి మెచ్చి "ఉపమాతిశయోక్తి కామధేనువు" అనే బిరుదు నిచ్చి సరస్వతీ దేవియే స్వయంగా దాని కాలికి తొడిగింది. సూరన శుచిముఖి అపూర్వశిల్పం. అఘటనా ఘటన సామర్థ్యం కలది. అది ఇంద్రోపేంద్రులకే ఉపాయాలు చెప్పింది. ప్రభావతీ ప్రద్యుమ్నులను కలిపింది. వజ్రనాభుని చంపించి దేవతనకు మేలు చేకూర్చింది.

శుచిముఖి పాత్రము నందీ విధముగా శాస్త్ర పరిశ్రమను, రాజకీయ కార్యధురీణతను, సమయోచిత సంభాషణ చణత్వమును, కార్య సంధాన కుశ లతను, స్వామి భక్తిని, వినయ విధేయతలను, శత్రు విజయ వ్యూహరచనా శక్తిని, వస్తు పరిశాలనా పటిమను, మిత భాషిత్వమును సర్వజ్ఞతను పాత్రమును కత్తి మీద నడిపింపగల జాగరూకతను, చతుర వచన రచనా ధురంధరత్వమును గూర్చ గలిగిన పింగళి సూరన.

చ॥ శుచిముఖి యంద్రడు దానిని వచో నిపుణత్వము నందు సత్కథా
రచనల యందు నీతి విధురత్వము నందు బహుశ్రవావలో
కచణత యందు నెందు సరిగానము దానికి వేయు నేలదా
ని చతురతా విశేషములు నీవెకనన్ వలయున్ మహాత్మకా

అని పొగడి "శుచిముఖీ పాత్ర సంవిధాన కౌశలమును నెరుగు భారము నితురుల మీదనే వదలినాడు" అని కేశవ పంతుల నరసింహశాస్త్రి గారు శుచిముఖి పాత్ర ప్రాముఖ్యాన్ని సమీక్షించారు.

ఇదే విధంగా శ్రీకృష్ణుడు, ఇంద్రుడు, గదసాంబులు, ప్రద్యుమ్నుడు మొదలగుగా గల పాత్రలు చక్కగా పోషింపబడినవి. కాని ప్రభావతీ పాత్రౌచితీ నిర్వహణమునందు మాత్రం సూరన కృతకృత్యుడు కాలేదు. ప్రభావతి తన మోహాన్నే గణించిందే కాని

ప్రద్యుమ్నుడు తన తండ్రికి శత్రువైన శ్రీకృష్ణుని కుమారుడని తెలిసిన తర్వాత కూడా ధర్మసందేహమున కేమియు లోను కాలేదు. పితృభక్తి, ఆత్మానురాగము అను భావద్వయం ఆమెను కలచినట్లు కన్పించదు. పితృభక్తి ఉంటే దేవకార్యం జరుగదు. అందువలన కథా నిర్వహణము వేరుగా ఉంటుంది. అద్భుత కల్పనా శక్తిగల సూరన కథలో మార్పు చేయగలడు. కాని ఈ ప్రబంధ రచనా కాలం నాటికి అతని దృష్టి పూర్వ పుణ్య కథలను ప్రవచించుటయందే ఉంది కాని స్వకపోల కల్పనకై దృష్టి సారించలేదు.

### 10.4.3(ఇ). వర్ణనలు :

ఈ ప్రబంధంలోని వర్ణనలన్నీ కథలో ఇమిడి ఉన్నవే. ఇందులో సందర్భానుగుణంగా వర్ణనలే కాని అష్టాదశ వర్ణనలను నింపవలెనని తలంచలేదు.

ప్రద్యుమ్నుని వాహ్యాళిలో సూరన వర్ణించిన అశ్వ వర్ణన చలావస్థలో మిక్కిలి రమ్యమైంది. ప్రద్యుమ్నుడు భిన్నరీతుల నడుపు అశ్వము చూపరులకు

సీ॥ తొలుదొల్త నయ్యేక తురగంబు మండల
గతిచారి యగుచు నిక్కంబు తోఁచె
నా వెనుకను సరూపా శ్యాలి చెదరక
చక్రాకృతిని బర్వు సరణి తోచె
నంతటనది నిస్ఫుటా వయవంబునా
నెనసి యేకాంగ వేష్టనతతోఁచెఁ
దుదఁదద్వి భూషణ ద్యుతిరాజి మాత్రంబు
కొఱవిత్రిప్పిన రీతి మెఱసి తోచె

గీ॥ నంతకంతకు గతివేగ మగ్గలింప
రాగవాగె యెచ్చరిక పరాకు జియ్య
యను జనులు ఱిచ్చవడి తమపని మఱవఁగ
బరఁగు నమ్మేటి నెఱరౌతు ప్రౌఢికతన 2 - 33

మొదట ఒకే గుఱ్ఱము గాను, వేగము హెచ్చిన కొలది పెక్కు గుఱ్ఱములు గాను, అటు తరువాత ఒకే అవయవము గాను, ఆ పైన నగల కాంతి మాత్రం కన్పించినట్లు సూరన పై పద్యంలో వర్ణించాడు. మండ లగతచారి, చక్రాకృతి, ఏకాంగ వేష్టనత, కొరవిత్రిప్పిన రీతి అను పద ప్రయోగాల వలన గుఱ్ఱము యొక్క వివిధ భంగిమలను సూచించినాడు.

### చంద్రోదయ వర్ణన

చ॥ పనువడ వేళు నాళములుఁ బగ్గములుం బలెఁ గ్రిందఁ బర్వు శో
భన కిరణ ప్రకాండములు భాసిలఁ జందురుఁ డొప్పె నెంతయున్
మనసిజుఁడెల్ల ప్రాణుల మనంబులు చేలుగ రాగ బీజముల్
పెనుజితనంబు తోడ వెదపెట్టెడు రౌప్యపు జడ్డిగంబనన్ 4 - 124

క్రిందికి బిర్వు కిరణములు వేణునాళములుగ, పగ్గములుగా ప్రాణుల హృదయములు చేలుగా, మన్మధుడు రాగ బీజములు వెదజల్లు వెండి జడ్డగమో అన్నట్లు చంద్రు డొప్పెనని వర్ణించిన ఈ భావం నూతనమైంది.

### 10.4.3(ఈ). రసము :

ప్రభావతీ ప్రద్యుమ్నం శృంగార రస ప్రధాన ప్రబంధం. కావ్య ప్రస్తావనలో "పురాతన మిధునం బులంగొనియాడి" అనే వాక్యంలో ఈ కావ్యం శృంగార ప్రధానమని చూపబడింది. శృంగారానికి తోడు వీరము అంగరసం. శ్రీకృష్ణుడు గదసాంబులతో బ్రహ్మవర ప్రసాదుడయిన వజ్రనాభదైత్యుని చంపవలెనని వారికి ఉపాయం చెప్పి పంపు ఘట్టము వీర రసస్ఫోరకం. ఇంద్రుడు పంపిన రథము నధిరోహించి కృష్ణుడిచ్చిన చక్రాయుధంతో వజ్రనాభుని ప్రద్యుమ్నుడు సంహరించి ప్రభావతిని వివాహమాడాడు. ఈ విధంగా శృంగారమునకు అంగరసంగా వీరరసాన్ని పోషించాడు.

### 10.4.3(ఉ). నాటకీయత :

ప్రభావతీ ప్రద్యుమ్నంలో నాటకీయ పద్ధతి అనుసరింపబడింది. ఇందలి సన్నివేశాలు, పాత్రలు, పాత్రల సంభాషణలు నాటకీయ ప్రాముఖ్యాన్ని వహించాయి. సన్నివేశాలను నాటకీయంగ కూర్చుట సూరన ప్రజ్ఞే. పింగళి లక్ష్మీకాంతం గారు "ప్రభావతీ ప్రద్యుమ్న కథ ఉపక్రమణము నుండియు, రంగమున ప్రదర్శింపబడు నాటకము వలెనే గోచరించుచుండును. ఒక్కొక్క కవి ఒక్కొక్కచో ఏదో కొంత నాటక వైఖరి చూపగల్గి యుండవచ్చు గాని సూరన వలె సమగ్ర నాటక పద్ధతిని రచన చేసిన కవి ఇంకొకడు లేడు. అందును పాత్రోచిత సంభాషణము నందాయన అద్వితీయుడు" అని ప్రభావతి ప్రద్యుమ్నము నందలి నాటకీయతను గూర్చి తెలిపినారు. ఇంద్రోపేంద్రుల మంతనము, నటవటు ధూర్తుల ఛలోక్తులు, ఇంద్రునితో శుచిముఖి విన్నపం, శుచిముఖీ ప్రద్యుమ్నుల పరిచయం, ప్రద్యుమ్నుని స్వగతం, శుచీముఖీ శుకముల యెత్తులపైయెత్తులు ప్రభావతీ ప్రద్యుమ్నుల ప్రణయ కోపానునయములు ఇత్యాది ఘట్టములందు సూరన సంభాషణ క్రమ చాతుర్యాన్ని సంభాషణ వైవిధ్యాన్ని ప్రదర్శించాడు. ప్రభావతి ప్రద్యుమ్నంలో 'గంగావతరణ' మను నాటక ప్రదర్శనము జరిగినట్లు సూరన వర్ణించాడు. ఈ నాటకం వజ్రనాభుని ముందు ప్రదర్శింపబడింది. కృష్ణుని కుమారుడగు ప్రద్యుమ్నుడు మాయా నటుని వేషముతో వజ్రనాభుని పురము ప్రవేశించిన సందర్భమది. ప్రద్యుమ్నుడే సూత్రధారియై పూర్వరంగం నడిపించాడు. పూర్వ రంగమైన తరువాత ప్రద్యుమ్నుడు నాంది పఠించి, ప్రసావనాదులు నడిపి పంచసంధులుగల గంగావతరణ నాటకము ఆడించాడు. నాటక ప్రయోగావసరము నందు భగీరథాదుల ఆకారధారణము, గంగానది నదులు, కైలాస పర్వతము, అడవులు, పశుపక్ష్యాదులు వీటన్నిటిని కల్పించి అది కల్పన కాదని యధాస్థితియే అని ప్రేక్షకులాశ్చర్య పడునట్లు ప్రద్యుమ్నుడు నాటక మాడినట్లుగా సూరన వర్ణించాడు. ప్రభావతీ ప్రద్యుమ్నమును నాటకీయ మార్గమున రచించాడు.

ఈ విధంగా పింగళి సూరన తన పూర్వుల కంటె విలక్షణంగ రాఘవ పాడవీయమును ద్వ్యర్థి కావ్యముగను, కళాపూర్ణోదయమును కథాకావ్యముగను, ప్రభావతీ ప్రద్యుమ్నమును నాటకీయ మార్గమున రచించి ఆంధ్ర సాహిత్య చరిత్రలో మహోన్నత స్థానాన్ని ఆక్రమించాడు.

## 10.5. శ్రీకృష్ణదేవరాయలు :

ఆంధ్ర సాహిత్య చరిత్రలో పదహారవ శతాబ్దం స్వర్ణయుగం. ఈ యుగకర్త సాహితీ సమరాంగణ సార్వభౌముడగు శ్రీకృష్ణదేవరాయలు. సంస్కృతాంధ్ర కర్ణాటక భాషాపండితులను ఆదరించి ఆంధ్ర సాహిత్యంపై విశేష గౌరవాన్ని, ఆదరణను చూపి ఆంధ్ర భోజుడని ప్రశస్తిని బొంది సారస్వత పోషకులలో అగ్రగణ్యుడుగా పేరు పొందాడు. కవితామార్గ ప్రవర్తకుడగుటయే గాక స్వయంగా ఆముక్తమాల్యద అనే చక్కని ప్రబంధాన్ని రచించి మహాకవిగా కీర్తి గడించాడు. ఆముక్తమాల్యదను రచించడానికి పూర్వం రాయలు మదాలస చరిత్ర, సత్యవధూప్రణనము, సకల కథాసార సంగ్రహం, జ్ఞాన చింతామణి, రసమంజరి కృతులను సంస్కృత భాషలో రచించాడు.

ఆముక్తమాల్యద కర్తృత్వాన్ని గూర్చి భిన్నాభిప్రాయాలున్నాయి. ఆముక్తమాల్యద ప్రబంధాన్ని పెద్దన రచించి రాయలు పేరుపెట్టాడని కొందరి వాదం. మరి కొందరు రాయలు, పెద్దనగాక వైష్ణవ భక్తుడు ఎవరో ఈ ప్రబంధాన్ని రచించి రాయలు పేరు పెట్టాడని వారి వాదం. కాని కవితా ప్రావీణ ఫణీశుడు, కవితా పోషకుడు, భువన విజయ నిర్మాత, అగు శ్రీకృష్ణదేవరాయలే ఈ ప్రబంధాన్ని రచించాడని పెద్దనాదుల పరిష్కారాదులుండ వచ్చునని పలువురి అభిప్రాయం.

రాయల ప్రబంధాన్ని తిరుపతి వేంకటేశ్వరునకు అంకితం గావించాడు. ఈ ప్రబంధంలో విష్ణుచిత్తుడను గృహస్థు నిరంతరం భగవంతుని సేవించుచూ పుష్పమాలికలను అర్పించుచూ శ్రీవిల్లి విత్తూరును మన్నారు స్వామిని సేవించుచు ఆ స్వామి అనుగ్రహాన్ని పొందడం. విష్ణుచిత్తునకు తులసివనంలో లభించిన గోదాదేవి స్వామి యందలి ప్రేమతో ఆయనకు సమర్పించడానికి అల్లిన మాలలను తాను ధరించి ఆ తర్వాతే స్వామికి సమర్పించేది. ప్రీతితో భగవంతుడు ఆ మాలికలను గ్రహించుట, గోదా శ్రీరంగనాధుల కళ్యాణం ఈ ప్రబంధంలోని ప్రధాన ఇతివృత్తం. ఇది విష్ణు చిత్తుని చరిత్ర కాబట్టి విష్ణు చిత్తీయం అనే పేరు కలిగింది. గోదాదేవి తాను ధరించిన మాలలను తిరిగి భగవంతునకు అర్పింపగా రంగనాధుడు ప్రీతితో గ్రహించుటచే ఆముక్తమాల్యద అనే పేరు సార్ధకమైంది. ఆముక్త = ధరించిన, మాల్య = పూలదండలను, ద = ఇచ్చునది అని అర్థం.

రాయలు ఈ కథను "చూడి కొడుత్తాళ్" అనే ద్రావిడ ప్రబంధాన్ని ఆధారంగా చేసికొని రచించాడు. ఇతివృత్తం ద్రావిడ ప్రబంధంనుండి గ్రహించినా దానిని ప్రబంధానికి అనుకూలంగా రసానికనుగుణంగా, తన వైష్ణవ సిద్ధాంతానికి తగినట్లుగా కొన్ని మార్పులను చేసి మనోజ్ఞమగు వర్ణనలతో పెంచి ఒక మహా ప్రబంధంగా రూపొందించాడు. భగవంతునకు ప్రత్యక్ష స్థానం కల్పించాడు. ఈ కావ్యంలో శ్రీరంగనాథుడే నాయకుడు. భూదేవి యొక్క అవతారమయిన గోదాదేవి నాయిక. వీరి వివాహమ్ కథా వస్తువు. ఇది ఏడు ఆశ్వాసాల ప్రబంధం. మొదటి నాలుగాశ్వాసాలు విష్ణుచిత్తుని కథ. మిగిలిన మూడు ఆశ్వాసాలు ప్రధానమైన గోదాదేవి కథ. మధ్యలో సందర్భోచితంగ యామునాచార్య చరిత్ర, ఖాండిక్య కేశి ధ్వజోపాఖ్యానం, మాల దాసరి కథ ఉపాఖ్యానాలుగా చెప్పబడ్డాయి.

### 10.5.1. మార్పులు :

మూలంలో పాండ్యరాజు తన పరిపాలనను గురించిన బాగోగులను తెలిసికొనుటకు మారువేషంలో మధురానగరంలో పుర వీధులలో తిరుగుచుండగా రాజపురోహితుని ఇంటి అరుగు మీద కూర్చున్న బ్రాహ్మణుని మాటలు విన్నట్లున్నది. కావ్యంలో మత్స్యధ్వజుడు ఒకనాటి రాత్రి భోగినీ కాంత గృహానికి వెళ్తూ బ్రాహ్మణుని మాటలు విని ఇహంకంటె పరం కొరకు తాపత్రయ పడుట మంచిదని భావించి గృహోన్ముఖుడైనట్లు చెప్పబడింది. ఇటువంటి మార్పు రాజుకు వైరాగ్యం కలగడానికి కారణమైంది.

ఉ॥ ఎక్కడి రాజ్య వైభవము లెక్కడి భోగము లేటి సంభ్రమం
బక్కట! బుద్బుద ప్రతిమ యైన శరీరము నమ్మి మోక్షపుం
జక్కి గణింప కుంటి యుగ సంధుల నిల్చియుఁ గాలుచేతి బల్
త్రొక్కుల నమ్మను ప్రభృతులున్ దుద రూపరకుండ నేర్చిరే 2 - 78

క॥ కానఁ దటిచ్చల మగురా
జ్యానందము మఱఁగి యింద్రియా రాముఁడనై
పోనింతనుండి పరలో
కానందం బునకె యత్నమాపాదింతున్ 2 - 81

మత్స్యధ్వజుడు పరలోకానందానికై చేసే ప్రయత్నం కన్పిస్తున్నది. ఈ ప్రయత్నం గ్రంథ రచనోద్దేశానికి బీజప్రాయం. రాయలు నిరూపించ దలచింది విశిష్టా ద్వైతమత ప్రాశస్త్యం. మోక్షప్రాప్తికి అదే ఉత్తమ మార్గమని చెప్పదలచి మార్పు చేశాడు.

గోదాదేవి లక్ష్మీదేవి యొక్క అంశ వలన జన్మించిందని మూలంలో ఉండగా దానిని అంగీకరిస్తూనే భూదేవిగా నోపచారంతో పరమాత్ముని సేవించుటకు కుతూహలంకలదై గోదాదేవిగా అవతరించిందని మార్చాడు. ఈ మార్పుకు కారణం చండాల బ్రహ్మరాక్షస్సంవాదాన్ని ప్రబంధంలో చేర్చడానికే. విమర్శలు, శాస్త్రాలు చదివిన బ్రాహ్మణుని కంటె విష్ణుభక్తిగల మాలదాసరే అధికుడని తెలుపుట కవి ఉద్దేశం. మూలంలో విష్ణుచిత్తుడు ఆముక్తమాల్యదను శ్రీరంగానికి తీసికొనిపోగా రంగనాథుడు ఆమెను ఐక్యం చేసుకొన్నట్లు ఉంది. ఆ విధంగా గాక లౌకిక రీతిలో వివాహాన్ని సంప్రదాయంగా జరిపించినట్లు మార్పు చేశాడు. యామునాచార్య చరిత్రను ఈ ప్రబంధంలో ప్రసక్తి లేకపోయినా సంఘసంస్కారానికి, రాజనీతులు ఉపదేశించడానికి కల్పించబడింది. రాజు వాదంలో ఓడిన తన సోదరిని బ్రాహ్మణుడైన యామునాచార్యున కిచ్చి వివాహం చేసి రాజ్యాన్ని కూడా అర్పించాడు. ఈ ఘట్టంలో రాయలు ఉపదేశించిన నీతులు స్వానుభవాలే.

తే॥ కన్నొకటి నిద్రవోఁ బెఱకంట జాగ
రంబు గావించు భూరు హాగ్రంబు మీది
యచ్చ భల్లంబు గతి భోగమనుభవించు
నెడను బహిరంత రరులపై దృష్టివలయు 4 - 241

ఒక కంటితో నిద్రించియుండు ఎలుగుబంటి వలె రాజ్య సుఖాలనుభవించు రాజు ఇంటను బయటను గల శత్రువులను కనిపెట్టుచు మెలగవలెనని బోట్టెంచడంబక ఉదాహరణ.

ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం అమూలకం. ఇది విష్ణు పురాణములోనిది. శరణాగతి ధర్మాన్ని ఉపదేశించడానికి ఈ కథలు గ్రహించాడు.

## 10.5.2. వస్త్వైక్యము :

ఆముక్తమాల్యద కావ్యంలో వస్త్వైక్యం కొరవడిందని కొందరి విమర్శకుల భావన. ఇందలి ప్రధాన కథ గోదా శ్రీరంగేశ్వరుల ప్రణయం. గోదాదేవి పెంపుడు తండ్రి విష్ణుచిత్తానిది ప్రధాన పాత్ర. ప్రధాన కథకు సంబంధించని ఖాండిక్య కేశిధ్వజుల సంవాదం, యామునాచార్య వృత్తాంతం, మాలదాసరి కథ ఉపాఖ్యానాలున్నందువల్ల వస్త్వైక్యం లేదని విమర్శకుల భావన. కాని వస్త్వైకం లేదనుడ సమంజసం కాదు. ఈ కావ్యంలోని ప్రధాన కథయైన గోదాదేవి రంగనాథుల వివాహంలో అంతర్భూతంగా ఉన్నాయి. "వస్త్వైక్యమనగా చిన్న సంఘటనల పొసగింపు. ఇందలి ఉపాఖ్యానములన్నియు ప్రధాన కథయైన గోదాదేవి రంగనాథుల వివాహమందు అంతర్భూత మొందుచున్నవి. ఆముక్తమాల్యద వస్త్వైక్యముగల ప్రబంధమని'' కాండూరు వెంగళాచార్యులు చక్కగా నిరూపించారు.

విష్ణువు తన సతీమణి లక్ష్మితో "విష్ణుచిత్తునిచే పాండ్యరాజుకు జ్ఞానమార్గం కలిగించెద చూడు'' మని చెప్పి విష్ణుచిత్తుడు సాక్షాత్కరించి పాండ్య సభకు వెళ్లి రాజుకు జ్ఞాన మార్గాన్ని ఉపదేశించమని ఆజ్ఞాపించి, కార్య సాధనలో తానెప్పుడూ అతనికి అండగా ఉంటానని పల్కి విష్ణుచిత్తుని కార్యోన్ముఖుని చేసి అంతర్థానమయ్యాడు. విష్ణుచిత్తుడు పాండ్యరాజు సభకేగి ఖాండిక్య కేశిధ్వజ సంవాదాన్ని వినిపించాడు. వేదాంత బోధకమైన ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం విష్ణుచిత్తుని కథకు అంగభూతమే. యామునాచార్య వృత్తాంతం కూడా విష్ణువు లక్ష్మికి చెప్పినట్టిదే. విష్ణువు ప్రేరణచే యామునాచార్యుడు పాండ్యరాజు సభకు వెళ్ళి వాదంలో పరమతాలను ఖండించి శైవంపై అభిమానంగల రాజును వైష్ణవమతంపై మరల్చి రాజుచే సన్మానాన్ని పొంది అతడిచ్చిన అర్థ రాజ్యాన్ని పరిపాలించాడు. ఈ రెండు ఉపాఖ్యానాలు రంగనాథునిచే భూదేవికి కృష్ణరాయలు చెప్పించడానికి ముఖ్యకారణం భూదేవి అవతారమైన గోదాదేవికి రంగనాథునిపై ప్రేమ భక్తి భావాలను పెంపొందించడం కోసమే. గోదాదేవి విరహం అర్థంగాక

విష్ణుచిత్తుడు శ్రీరంగనాథునితో మొరపెట్టగా ఆయన మాలదాసరి కథను విష్ణుచిత్తునికి చెప్పాడు. మూలంలో వరాహమూర్తి భూదేవికి మాలదాసరి కథను చెప్పినట్లుంది. భూదేవి మాలదాసరి కథలోని కైశికీగాన మహాత్మ్యం విన్నది. భూదేవే గోదాదేవిగా జన్మించింది. భూదేవి గోదాదేవిగా జన్మించడానికిది హేతువుగా కృష్ణరాయలు నిక్షేపించాడు. అందువల్ల మాలదాసరి కథకు గోదాదేవి కథకు ఒక సంబంధమేర్పడింది. కైశికీ గాన మహాత్మ్యము వివరించి అట్లే తానుకూడ స్వామిని గూర్చి పాడవలెనని భూదేవి గోదాదేవిగా అవతరించెనని మూలంలో లేని కల్పనకు కృష్ణరాయలు చేశాడు. కాబట్టి ప్రధానకథైన గోదాదేవి రంగనాథుల వివాహానికి పైన పేర్కొన్న ఉపాఖ్యానాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

### 10.5.3. రసనిరూపణ :

ఆముక్తమాల్యద కావ్యంలో గోదాదేవి రంగనాథునిపై మరలుగొని విరహ వేదనచే తపించి, రంగనాథుని వివాహమాడినట్లున్నది. ఈ కావ్యంలో నాయకుడు దివ్య ప్రకృతి. అందుకే నాయిక విరహ వేదన మాత్రం వర్ణించబడింది. నాయకుని విరహవేదనను వర్ణించలేదు. గోదాదేవి దేహ సౌందర్యం ముప్పై పద్యాలలో వర్ణించాడు. వసంత వర్ష ఋతు వర్ణనలు శృంగార రసపుష్టికే తోడ్పడ్డాయి. ఆముక్త మాల్యదలోని అంగిరసం శృంగారం. ఈ శృంగారం అలౌకికమైంది. సర్వాత్మనా స్త్రీ పురుషులు స్వయం వ్యక్తిత్వాన్ని విస్మరించి అన్యోన్య విలీనత్యమున సుఖించునొక ద్వంద్వాతీత స్థితి ఉంది. ప్రధానమైన శృంగారానికి అంగంగా వీర రసం పోషింపబడింది. ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానంలో దయా వీరం, యామునాచార్య వృత్తాంతంలో ధర్మ వీరం, మాలదాసరి కథలో దాన వీరం, అంగ రసాలుగా పోషింపబడ్డాయిని డా. టి. కోటేశ్వరరావు గారు తన ఆముక్తమాల్యదా సౌందర్యం నందు నిరూపించారు. మత్స్యధ్వజునిపై దయకల్గుట వలననే విష్ణుచిత్తుడు ఉత్సాహంతో బ్రహ్మవిద్యా సమ్మిళితమగు ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానంలో చెప్పాడు కనుగ ఇది దయావీరసంబంధి. పాండ్యరాజుచే ధర్మచ్యుతి జరిగే సందర్భంలో యామునాచార్యుడు తన పాండిత్య ప్రకర్షచే విష్ణుభక్తిచే రాజును విష్ణుభక్తునిగా మార్చి ధర్మ రక్షణ గావించాడు గనుక ధర్మ వీరం పోషింపబడింది. మాలదాసరి బ్రహ్మరాక్షసునకు తన కైశికీ గాన ఫలాన్ని దానంగా ఇచ్చి అతనిని ధరింపచేశాడు. ఇచట దాన వీరం పోషింపబడింది. యామునాచార్యుడు ధర్మస్థాపనకై పాండ్యరాజును సందర్శించిన సందర్భాలలో యుద్ధ వీరం వర్ణించబడింది. మాలదాసరి పాత్ర చిత్రణలో శాంతరసంకూడా పోషించబడింది. రాక్షసుడు సోమశర్మగా మారిన సందర్భంలో అద్భుతరసం పోషించబడింది. ఆముక్తమాల్యదలో వీరాద్భుత శాంత రసాలు అంగిరసమగు శృంగారానికి పరిపోషకాలయ్యాయి. ఆముక్తమాల్యదలో అంగిరసం భక్తి అని కొందరి వాదన. ఈ కావ్యంలో ఉపాఖ్యానాలలో భక్తి భావ మున్నదను మాట వాస్తవమే యైనా అవి అలౌకిక శృంగారమిళితం. కొందరు మధురభక్తి శృంగారమున్నదన్నారు. "మధురభక్తి పరకీయులగు వారికి నున్నది. గోదాదేవి స్వకీయ. మధురభక్తి యందు వైవాహిక మంగళము లుండవు. ఇందున్నది కదా! ఇందుచే నిందలి రసము భరతముని నిరూపించిన శృంగారమే" అని డా.టి. కోటేశ్వరరావు గారి నిర్ణయం.

### 10.5.4. వర్ణనలు :

రాయలు ఆముక్తమాల్యదను వర్ణనాత్మకంగా రచించాడు. రాయలు వర్ణనా ప్రియుడు. రాయలు చేసిన వర్ణనలలో రాయల ప్రత్యేకత కన్పిస్తుంది. రాయల వర్ణనలు సహజములు. స్వభావ సిద్ధములు. విల్లి పుత్తూరును వర్ణించే సందర్భంలో -

మ॥ తలఁ లక్షచ్ఛటఁ గ్రుక్కి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర
స్థలి నిద్రింపఁగ జూచి యారెకులు షస్నాత ప్రయాతద్విజా
వలి పిండీకృత శాటులన్సవిఁ దదా వాసంబుఁ జేర్పంగరే
వుల డిగ్గ న్వెసఁ బారువానిఁగని నవ్వున్మాలి గోప్యోఘముల్ 1 - 65

రాయలు ద్రావిడ దేశమునకు దండయాత్రగా వెళ్ళిన సందర్భంలో ఆ ప్రదేశాలలోని ప్రజల ఆచార వ్యవహారాలను పరిశీలించి తన కావ్యంలో వర్ణించాడు. బాతులు తమ రెక్కలలో తల దూర్చి నిద్రించుట, బ్రాహ్మణులు ద్రవిడ దేశమున ప్రాతఃకాలముననే కాలువలకు స్నానార్థం వెళ్ళుట, భటులు నిజాయితీగా ఎవరి సొత్తును వారికి అప్పగింప చూచుట, కాపు స్త్రీలు పంటపొలాలకు కాపలా ఉండడం అనే సూక్ష్మ విషయాలను సైతం నిశితంగా పరిశీలించడం రాయల ప్రత్యేకత.

మ॥ శయ పూజాంబుజముల్ ఘటిందడబడన్ జన్దోయిలేఁ గౌనుపై
దయఁ దప్పన్ బసుపాడి పొగడపు పాదం బొప్పఁ జెంగల్వడి
గ్గి య నీరచ్యుత మజ్జనార్థము గటింగీలించి, దివ్య ప్రబం
ధయుగాస్యల్ ద్రవిడాంగనల్ నడుతురుద్యానంపులో త్రోవలన్ 1 - 56

ఈ పద్యంలోని స్వభావోక్తి అద్భుతంగా ఉంది. రాయల వలె రమ్యంగా స్వభావోక్తిని వర్ణించువారు లేరనుట అతిశయోక్తి కాదు. ద్రవిడ స్త్రీలు పసుపుతో స్నానం చేసి, తీర్థపు బిందెను రొంటి యందు ధరించి, తమ చేతిలోని కమలముల నాళములు నీటి బిందెలలో తొట్రుపాటు చెందుచుండగా, వారు దివ్య ప్రబంధాన్ని గానం చేస్తూ, కాలికి తొడిగిన పావడాలు కదలి ఆడుచుండగా ఉద్యానవన త్రోవలో నడచుచున్నారని వర్ణించడంలో రాయల పరిశీలన ద్యోతకమవుతుంది.

**వర్షవర్ణన**

తే.గీ. స్థూల పరిపక్వ కాననోదుంబ రాగ్ర
రంధ్రముల వాననీరు సొరంగ వెడలె
మశక పంక్తులు దావ దూమంబు లణఁగ
రచ్చ సేయంగ వెడలె విశ్రాంతి కనగ 4 - 111

పెద్దవై పండిన మేడిపండ్ల లోనికి వాననీరు ప్రవేశించింది. అంతవరకు ఆ పండ్లలో నున్న దోమల పంక్తులు వెంటనే వరుసగా పైకి వచ్చినవట. ఆ దోమలు కారుచిచ్చులు చల్లారడం వలన విశ్రాంతి కొరకు కొలువు చేయ ఆలోచించి బయటకు వచ్చినట్లు వర్ణించడం అసామాన్యం.

రాయల కమనీయ భావనా పటిమకు నిదర్శనం గ్రీష్మ వర్ణన.

తే.గీ. తోఁట బగలుండి మల్లెలు దురిమి కావు
లమర మా పైన నిక్షు యంత్రముల కొయ్యఁ
జేరు ప్రజ వొల్చె భావి వృష్టికిని గ్రుడ్డు
తో మధురిమేచ్ఛ డిగు నెఱ్ఱ చీమలనగ 2 - 71

పగలంతా తోటలో ఉండి ప్రొద్దు గ్రుంకగా మల్లెపువ్వులు శిరమున ముడుచుకొని చంద్రకావి వస్త్రమును ధరించి చెరుకు గానుగల సమీపములకు మెల్లగా ప్రవేశించుచున్న జనము ముందు రాగల వర్షానికి గ్రుడ్లు మోసికొని తీపి మీద కాంక్షచేత దిగివచ్చుచున్న ఎఱ్రచీమల వలె ఒప్పుచున్నవని వర్ణించడం రాయల భావనా పటిమకు నిదర్శనం.

ఆముక్త మాల్యద పంచమాశ్వాసంలో గోదాదేవి విరహం వర్ణించబడింది. ఇచట రాయలు గోదాదేవి హృదయ తాపాన్ని మాత్రమే వర్ణించాడు. ఈ వర్ణనను గూర్చి దివాకర్ల వెంకటావధాని గారు "ఆంధ్ర వాఙ్మయమున విరహము నింత పరమౌచిత్య

భాసురముగా వర్ణించిన వారింకొకరు లేరు. రాయలు రాజయ్యు ఈ సందర్భమున శృంగారము నెంతో నిగ్రహముతో నిరుపమాన నైర్మల్యముతో వర్ణించినాడు ..... అందుచేతనే యా వర్ణనమున కొక యపూర్వ సౌందర్యమును బ్రత్యేక బ్రశస్తియు జేకూరినవి" అని తెల్పారు. అష్టాదశ వర్ణనల లోకాన్ని వర్ణనలు లేవు. అయినప్పటికి అది దోషం కాదని అలంకారికులే తలుపుట వలన ఇది దోషం కాదు. "రాయల వర్ణనలు గొప్ప ఉపజ్ఞను, ఊహా శాలితను వ్యక్తము చేయును. చేపట్టిన వస్తువు స్వభావపుటాంతర స్నాయువులను గూడా స్పృశింపగల చూపతని కున్నదని ఋజువు చేయగలవు. కాని అనపేక్షిత విస్తీర్ణములై కథాగతి కడ్డుతగులున" ని డా. యస్వీ. జోగారావు గారు వివరించారు. కృష్ణరాయల వర్ణనలలో భావ పటిష్టత అధికం.

## 10.5.5. శైలి :

ఆముక్త మాల్యద కావ్యంలోని శైలి ప్రౌఢం. ఆముక్తమాల్యద వంటి శైలీ వైవిధ్యమున్న ప్రబంధం మరొకటి లేదు. కృష్ణరాయల శైలి వర్ణనాత్మకం. సంస్కృత గ్రంథాలను పెక్కింటిని రచించిన తరువాత ఈ ప్రబంధాన్ని రచించడంవలన దీర్ఘ సమాసాలు అధికంగా ఉండడమే గాక సంస్కృతాంధ్రముల ప్రౌఢిని సమ్మేళనము చేసికొని రూపొందించుకొనిన విశిష్టశైలి రాయలది. అక్కడక్కడ ద్రావిడ పదాలు, మారుమూల పదాలు కూడా ఉపయోగించాడు. మాలదాసరి బ్రహ్మరాక్షసుడు ఆశ్రయించిన మఱ్ఱి వృక్షాన్ని చూచినప్పటి వర్ణన.

శా॥ కాంచె న్వైష్ణవుఁ డర్థయోజన జటాఘోటోర్ధ్వ శాఖోప శా
ఖాంచ జ్జాట చరన్మరుద్రయ దవీయః ప్రేషితో ద్యచ్ఛదో
దంచ త్కీట కృత వ్రణ చ్ఛలన లిప్యాపాదితా ధ్వన్యని
స్పంచా రాత్మ మహా ఫలోపమ ఫలస్ఫాయ ద్వటక్ష్మాజమున్ 6 - 15

బ్రహ్మరాక్షసుని మార్గమగుటచే ఇటు రాకూడదని బాటసారులను హెచ్చరించు లిపితో వ్రాయబడిన మఱ్ఱి ఆకులు గాలికి దూరంగా ఎగిరిపోయినట్లు వర్ణింపబడింది. ఈ విచిత్ర కల్పనం అపూర్వం. రాయల కవిత్వం నారికేళపాకమున ఉన్నా అచటచ్చట ద్రాక్షాపాకం కూడ ఉంది.

పూర్వ కవులు ఆశ్వాసాంతము లందు గద్యాలనే రచించగా రాయలు తెలుగు కవులెవ్వరూ చేయని విధంగా ఆశ్వాసాంతంలో గదల్యిలకు బదులుగా పద్యాలు రచించాడు.

ఈ విధంగా ఉత్తమ ప్రబంధానికి తగిన వర్ణనలతో, శైలితో రస రమణీయంగా వైష్ణవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి తన రాజసానికి తగినట్లుగా ప్రౌఢ శైలీ విన్యాసంతో ఒక ప్రత్యేకతను పొందునట్లుగా ఆముక్తమాల్యదను రచించాడు శ్రీకృష్ణదేవరాయలు.

## 10.6. తెనాలి రామకృష్ణుడు :

శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలసిన కవులలో తెనాలి రామకృష్ణకవి ప్రముఖుడు. ఈ కవి రాయల కాలంలో ఉన్నాడా? లేడా? అనే విషయంలో వివిధాభిప్రాయాలున్ననూ 16వ శతాబ్దపు కవి అని అందరూ అంగికరించినదే. ఇతని ఇంటి పేరు గార్లపాటి. తెనాలి అగ్రహారంలో నివసించినందువల్ల తెనాలి అనే ఇంటిపేరుతో వ్యవహరింపబడుచున్నాడు. తెనాలి రామలింగకవి, తెనాలి రామకృష్ణకవి ఒకరా? ఇద్దరా? అనే అంశంపై వాదోపవాదాలున్నాయి. పలు పరిశోధకులు రామలింగ, రామకృష్ణులు ఒక్కరేనని శైవుడైన రామలింగకవి ఉద్భటారాధ్య చరిత్రను రచించిన తరువాత వైష్ణవాన్ని స్వీకరించి రామకృష్ణుడై పాండురంగ మహాత్మ్యమును రచించాడని తెలుపుచున్నారు. రామకృష్ణకవి శైవ, వైష్ణవ పురాణాలను కరతలామలకం కావించుకొన్నవాడు. కుమారభారతి అని, సరస్వతీదేవి యొక్క అపరావతారమని శ్లాఘించబడ్డాడు. రామకృష్ణుడు లింగపురాణము, కందర్పకేతు విలాసము, ఉద్భటారాధ్య

చరిత్ర, హరిలీలా విలాసము, పాండురంగ మహాత్మ్యములు, ఘటికాచల మహాత్మ్యమను కృతులు రచించాడని తెలియుచున్నది. అందు ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మహత్మ్యము, ఘటికాచల మహాత్మ్యమను గ్రంథాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. కందర్పకేతు విలాసమందలి కొన్ని పద్యాలు, హరిలీలావిలాసం లోని కొన్ని పద్యాలు పెదపాటి జగ్గన్నచే సంకలితమైన ప్రబంధ రత్నాకరం నుండి లభిస్తున్నవి. ఇవి గాక రామకృష్ణకవిగా చెప్పబడే చాటువులు అనేకం ఉన్నాయి.

### 10.6.1. ఉద్భటారాధ్య చరిత్రము :

తెనాలి రామలింగకవి శైవుడుగా వున్నప్పుడు రచించిన కావ్యం ఉద్భటారాధ్య చరిత్ర. లభ్యకృతులలో మొదటిది. శైవగురువగు ఉద్భటుని మహిమలు ఈ కావ్యంలో తెలుపబడ్డాయి. ఈ కావ్యాన్ని రామలింగకవి కొండవీటి దుర్గ పాలకుడైన నాదెండ్ల గోపమంత్రి రాజకార్య నిర్వాహకుడైన దేచమంత్రికి అంకితమిచ్చాడు.

పార్వతీ పరమేశ్వరుల ఏకాంత వాసానికి భంగం కలిగించిన గంధర్వులకు "పిశాచ రూపులు కండు'' అని శివుడు శాపమిచ్చాడు. ఉద్భడుడనే శివ గురువు యొక్క శవధూమము తగలిన పిదప శాపం నుండి విముక్తి కలుగునని శాపావసానమును కూడ తెలిపాడు. ఇది ఇందలి ప్రధాన కథ. కృతిపతియైన దేచమంత్రికి గురువు చంద్రశేఖరుడు. ఈ గురువు ఉద్భటుని వంశంలోని వాడని తెల్పుటకు ఉద్భడారాధ్య చరిత్రను రామలింగకవి రచించినట్లు స్పష్టమవుతున్నది. ఈ కావ్యంలో శివునకు గురవగు చంద్రశేఖరునకు నామసామ్యంవలన అభేదం చెప్పబడింది.

రామలింగకవి పాల్కురికి సోమనాధుని బసవపురాణ కథను కొంత వరకు అనుసరించాడు. మతపరమైన గ్రంథమైనను రమ్యమైన కథా నిర్మాణంతో రసవత్తరమగు సన్నివేశాలతో చక్కని కావ్యంగా ఉద్భటారాధ్య చరిత్రను రామలింగకవి రచించాడు.

శివభక్తి ప్రబోధనందు ఈ కావ్యం కృతార్థతను పొందింది. రామలింగకవి అరణ్యాన్ని వర్ణిస్తూ -

సీ॥ అచల సుతాభర్త కర్చించి మరికాని
    మృగములేఁ బూరిమేయవచట
అసమలోచనునకు నర్పించి మరికాని
    యళులు క్రొవ్విరి తేనె లానవచట
అంధ కధ్యంసికి నర్పించి మరి కాని
    కోయిల లిగురాకుఁ గొరుకవచట

గీ॥ తక్కుగల జంతువులు శంభుఁ దలచి కాని
యుచిత వర్తనములఁ గోరియుండ వచట
వదనములు వేయుఁ గలయంత వానికైన
నా యరణ్యంబుఁ గొనియాడ నలవియగునె 1 - 54

అరణ్యంలోని పశుపక్ష్యాదులకున్న శివభక్తి నిరమ్యంగా వర్ణించాడు.

### రామలింగకవి - కవితాలక్షణము :

రామలింగ కవి యొక్క కవితా లక్షణాలను గూర్చి కృతిపతియగు దేచయ మంత్రి ప్రశంసిస్తూ

చ॥ విలసదయాతయామ బహువేద వివేక పవిత్ర భావసం
కలితములైన వాక్యములఁ గావ్యము జెప్పఁగ నేర్తు వాదికా
వ్యుల కవితా నిగుంభన సమున్నతి గాంచిన వాఁడవౌదు వీ
వలఘు వచో విలాస సుగుణాకర రామయలింగ సత్కవీ 1 - 26

రామలింగకవి కావ్యనిర్ణయ ధురీణుడు, ఆది కావ్యుల కవితా నిగుంభనములను గ్రహించునాడని, అలఘువచో విలాసుడని ప్రశంసింపబడుటచే ఇవే ఈ కావ్యము నందలి కవితా లక్షణములని తెలియుచున్నది. దేచయ మంత్రి రామలింగకవి కవితా లక్షణాలను ప్రశంసించాడు. తన కృతి వేద వాక్యంవలె పవిత్రమైనదని, శివుని కంటె శివభక్తులు ఎక్కువని రామలింగ కవి భావం. ఈ కావ్యంలోని ప్రమథేశ్వర దంపతులు, ముండభోజుడు, మదాలసుడు, ఉద్భటుడు మొదలైన పాత్రలన్నీ ఈ అంశాన్ని నిరూపిస్తాయి. ఈ కావ్యము నందలి వర్ణనలు కూడా కథకు అనుకూలములై హృదయానికి ఆనందాన్ని కలిగిస్తాయి.

### 10.6.2. పాండురంగ మహాత్మ్యము :

తెనాలి రామలింగకవి వైష్ణవమును స్వీకరించిన తరువాత తెనాలి రామకృష్ణకవియై వ్రాసిన తీర్థ క్షేత్ర మహాత్మ్యమును వర్ణించి ప్రబంధం పాండురంగ మహాత్మ్యము. ఇది ఉత్తమము ఉదాత్తమైన రచన. మోక్ష సాధనకు ఉపాయంగా సులభమగు భక్తి మార్గమును ఆకర్షణీయంగా చూపుటే మహాత్మ్య కావ్యాల పరమ ప్రయోజనం. ఈ లక్ష్యంతోనే రమకృష్ణకవి పాండురంగ మహాత్మ్యమును రచించాడు. ఈ కావ్యం శైవ వైష్ణవ మార్గాల మిశ్రిత గ్రంథం. ఈ కావ్యాన్ని రామకృష్ణకవి విరూరి వేదాద్రి మంత్రికి అంకితమిచ్చాడు.

పాండురంగ మాహాత్మ్య రచనకు మూలం స్కాంధపురాణం అని రామకృష్ణకవి తెల్పినాడు కాని పద్మపురాణంలో పాండురంగని ప్రసక్తి కొంత కన్పిస్తుంది. ఈ కావ్యం స్థల, దైవ, తీర్థ మహాత్మ్యముల మూడింటను గొప్ప ప్రభావము గల అయిదాశ్వాసాల ప్రబంధం. ప్రథామాశ్వాసంలో అగస్త్యముని దక్షిణయాత్ర, కుమారస్వామి వృత్తాంతం, గౌరీశంకరుల ఉద్యానవన విహారం మొదలైనవి, ద్వితీయాశ్వాసంలో పుండరీక వృత్తాంతం, పుండరీకక్షేత్ర మాహాత్మ్యం, తీర్థన మాహాత్మ్యం, తృతీయాశ్వాసంలో నిగమశర్మోపాఖ్యానం, రాధాచరిత్ర, చతుర్థాశ్వాసంలో రాధతపస్సు, సుశీల చరిత్ర పంచమాశ్వాసంలో సుశర్మోపాఖ్యానం, అయుత నియతుల చరిత్ర మొదలైనవి వర్ణింపబడ్డాయి.

పుండరీకుడు విష్ణువును గూర్చి తపస్సుచేయగా ఆ దేవుడు ప్రత్యక్షమై అతని కోరిక ప్రకారం పాండురంగడను పేరుతో భైమీ నదీ తీరంలో వెలిసాడు. ఆ క్షేత్రంలో నిగమశర్మ, సుశర్మ, అయుతుడు మొదలగువారు ముక్తిని పొందారు. శివుడు పార్వతికి, కుమారస్వామికి, నారదునకు తీర్థక్షేత్ర దైవతముల ప్రాధాన్యంగల ఒకే పుణ్యక్షేత్రం పౌండరీక క్షేత్రమని వారి ప్రశ్నకు సమాధానంగా చెప్పిన కథ ఇది.

ఈ కావ్యంలో రామకృష్ణకవి చూపిన కథన కౌశలం, పాత్రపోషణా విధానం, వర్ణనా చాతుర్యం, రసపోషణ మొదలైన కవితా గుణాలు నిరుపమానాలు.

### 10.6.2(అ). కథనకౌశలం :

పాండురంగని క్షేత్రం వెలయుటకు పుండరీకుని కథ ఆధారం, ఆ క్షేత్ర మాహాత్మ్యమును తెల్పుటకు దుర్నీతుడగు నిగమశర్మ కథ చెప్పబడింది. తీర్థ మాహాత్మ్యమును వర్ణించడానికి సుశర్మోపాఖ్యానం, దైవమాహాత్మ్య ప్రకటనకు అయుతనియుతుల చరిత్రలు కూర్చబడ్డాయి.

## 10.6.2(ఆ). పాత్ర పోషణ :

రామకృష్ణకవి పాత్ర పోషణలో దిట్ట. ఈ కావ్యంలో పుండరీకుడు, నిగమశర్మ, నిగమశర్మ అక్క, సుశీల మొదలగు పాత్రలను చక్కగా పోషించాడు. పౌండరీక క్షేత్రానికి ఆ పేరు పుండరీకుని వలన కలిగింది. ఇటువంటి ప్రధాన పాత్రను ప్రవేశపెడ్తూ అతని గుణగణాలను భావికథా సూచనకు అనుగుణంగా వర్ణించాడు. పరమ భాగవతోత్తముడగు పుండరీకుడు ఆర్యజన స్తవనీయుడు. ఉజ్వల గుణ రత్ననిధి. సత్యదయార్జవ శాంతిదాంతులు గల సన్ముని. ఇటువంటి పుండరీకుని గుణాలను వర్ణిస్తూ

సీ॥ చలిచీమ నేనియుఁ జాఁద్రొక్క శంకించు
బలుకఁడెన్నడు మృషాభాషణములు
కలుష వర్తనులున్న పొలము పొంతఁజనండు
కలిమికుబఁడు లేమిఁగలఁగఁడాత్మఁ
దలయెత్తి చూడఁ డెవ్వలనఁ బరస్త్రీల
ధైర్యంబు విడఁడెట్టి ధర్దరముల
నొరుల సంపదకునై యువ తపింపఁడు లోన
నిందింపఁ డెంతటి నీచునైన

గీ॥ మిన్న కయ చూడఁడాకలిగొన్న కడుపు
సర్వ భూతదయోద యోత్సవ మొనర్చు
నిగమ ఘంటాపథైకా ధ్వనీన బుద్ధి
బ్రహ్మ విద్యాన వంద్యుండు బ్రాహ్మణుండు 2 - 6

ఇంతటి పరమాత్ముడు కాబట్టే భగవంతు డనుగ్రహించి దర్శనమిచ్చాడు. పుండరీకుని కోర్కెననుసరించే పాండురంగడుగా భైమీనదీ తీరంలో పరమాత్ముడు స్థిరనివాస మేర్పరచుకొన్నాడు. పరమాత్మ సందర్శన మొనర్చిన పుండరీకుని ఏ విధంగా చిత్రింపవలెనో రామకృష్ణకవి ఊహించి తగినట్లుగా అతని పాత్రను తీర్చిదిది కృతకృత్యుడయ్యాడు.

పాండురంగక్షేత్ర మహాత్మ్యం కథలలో నిగమశర్మోపాఖ్యానం మిక్కిలి రసవంతమైంది. ఈ కావ్య రచనకు వెన్నెముక నిగమశర్మోపాఖ్యానం. ఈ క్షేత్రమాహాత్మ్యాన్ని తెల్పుతూ

గీ॥ బ్రాహ్మణునిఁ దల్లిఁ దండ్రిని భ్రాతదాత
గురు జనంబుల హింసించు క్రూరుఁడైన
శీధు పానాభిరీతుఁడు దుశ్శీలుఁ డైనఁ
బాండురంగాధిపతిఁగాంచి పరమునొందు 5 - 53

ఇది ఈ క్షేత్ర మహాత్మ్యం. నిగమశర్మను దుశ్చరితునిగ చిత్రించి అతనికి సాయుజ్య మిప్పించాడు.

మ॥ వనితా మానస సూనసాయకుఁడు జీవత్తాత పాదుండు భూ
జన సన్మాన్య విశుద్ధ వర్తనుఁడు దంచ త్యాగశీలుండు చం
ద్రుని పెన్నుద్ది సమగ్ర కాంతి మహిమన్ నూనూఁగు మీసాల లే
గొనబుం బ్రాయపుఁ దేజు కూనయతఁడు త్కోచుండు వాచాలతన్ 3 - 6

నిగమశర్మ పేరుకు విరుద్ధమైనవాడు. నిగమశర్మ పాత్ర స్వభావ చిత్రణలో ప్రావీణ్యాన్ని కనపరచాడు రామకృష్ణకవి.

నిగమశర్మ ప్రవర్తనను కండ్లకు కట్టినట్లీ విధంగా చిత్రీకరించాడీ క్రింది పద్యంలో

సీ॥ ఉష్ణాని హోమాగ్ని యూద నొల్లఁడు గాని
విరహ జ్వరార్తితో వెచ్చనూర్చు
సంధ్యకుఁ బ్రార్థనాంజలి ఘటింపఁడు గాని
యెరఁగు నీర్ష్యా కషాయితల కర్థి
నాగమ వాదంబు కొఁగాదనడు గాని
విటవాదములె తీర్చు వేగిలేచి
కంబు భృత్వా దోదకంబు గ్రోలఁడు గాని
యౌవతాధర శీధు వాని చొక్కుఁ

గీ॥ బుణ్య చిహ్నంబుల ఘనంబున ఘటింప
సిగ్గు వడుఁగాని కర నఖశిఖర లిఖన
జాత నూత్న క్ష తాంకముల్ సమ్మతించు
నారజము మీరి యాదుర్వి హొరహొరి 3 - 12

నిగమశర్మ తేనెపూసిన కత్తి. అపవిత్రుడు. ఎంతటి దుష్కార్యములు చేయటానికైనా తెగించేవాడు. తలిదండ్రులను బంధువులను నమ్మించి మోసగించిన వంచకుడు. తనకు ప్రాణదాతయిన రైతు యొక్క భార్యను తీసుకొనిపోయిన కృతఘ్నుడు. కట్టుకున్న ఇల్లాలిని, కన్న తలిదండ్రులను మోసగించాడు. బ్రాహ్మణత్వాన్ని వీడినిషాద స్త్రీతో వుండి మాంసాహారుడయ్యాడు. ఇన్ని పాపాలు చేసినా పుండరీకక్షేత్రంలో మరణించడంవలన వానికి విష్ణు సాయుజ్యం కలిగింది.

నిగమశర్మ అక్క మరొక అద్భుత సృష్టి. నిగమశర్మ అక్కగానే ప్రసిద్ధిగాని ఆమెకు పేరు పెట్టలేదు. ఆమె పనిపాటలలో దిట్ట. ప్రజ్ఞ సాటిలేనిది. అభిమానవతి. తమ్ముని దుర్మార్గాలను గూర్చి విని వానిని అదుపులో పెట్టుటకు కుటుంబంతో పుట్టింటికి వచ్చింది. కొద్ది రోజుల్లో ఇంటిని చక్కదిద్దింది. ఇంతలో చుక్క తెగిపడిన విధంగా తమ్ముడు ఇంటికి వచ్చాడు. తమ్ముని చక్కదిద్దుటకు ఆమె పడిన పాట్లు, చూపిన ప్రజ్ఞ, వాక్చాతుర్యం ఇతర స్త్రీలలో కన్పించదు. తమ్మునితో నయగారంతో పలికిన మాటలకు ఈ క్రింది పద్యం ఉదాహరణ.

శా॥ ప్రారంభించిన వేదపాఠమునకున్ బ్రత్యూహ మౌనంచునో
యేరా తమ్ముఁడ నన్నుఁ జూడఁ జనుదే వెన్నేళ్ళ నోయుండి చ
క్షూరా జీవ యుగంబు వాచెనినుఁ గన్గోకున్కి మీ బావయున్
నీ రాకల్ మదిఁ గోరుఁ జంద్రు పొడుపున్ నీరాకరంబున్ బలెన్ 3 - 33

ఈ పద్యం ఆమె సంస్కార ప్రియత్వానికి, వాత్సల్యానికి నిదర్శనం. సామాది ఉపాయాలతో తమ్ముని వలో పెట్టుటకు ప్రయత్నించింది. కాని అక్క మాటలను పెడ చెవిని పెట్టిన మూర్ఖుడు నిగమశర్మ.

రామకృష్ణకవి పాత్రల మనః ప్రవృత్తులను బాగా పరిశీలించిన వారు. లోకజ్ఞుడు. కాపు పడతి నిగమశర్మ వెంటపోవు సమయంలో

ఉ॥ ఆకుమరుంగు పిందెయయి యంతిపురంబును బోలెనున్నరా
కాకుముద ప్రియాస్య భయగాఢ తర త్వరనేగు గాని లో
వాకలి దప్పియున్ రవికరార్తియు నెన్నదు, మన్మథాస్త్రకీ
లాకుల తప్త చిత్తలకు లక్ష్యమె తక్కిన కొప్పు లెవ్వియున్ 3 - 82

అని వర్ణించాడు. కాపు పడతి మన్మధార్తితో త్వరత్వరగా అతనివెంట వెళ్తున్నప్పుడు ఆకలిదప్పులుగాని, ఎండవేడిమి గాని లెక్కచేయలేదు. మన్మథ బాధకు లోబడిన వారికి ఇతరములగు బాధలేమియును లెక్కకు రావు. అది వసంతకాలం. వారి కోరికలు కార్యరూపం ధరించుటకు అది ఉద్దీపనము కల్గించినదను భావము కలిగినదై ప్రకరణోచితముగ చేయబడిన వర్ణన.

## 10.6.2(ఇ). వర్ణనా చాతుర్యం :

పాండురంగ మాహాత్మ్యం భక్తిరస ప్రధానమైన కావ్యమైననూ ప్రబంధ మార్గమును అనుసరించబడి వ్రాయబడిన కావ్యం. ఈ కావ్యంలోని వర్ణనలు సందర్భశుద్ధి కలిగి ఔచితీ పోషకములై యున్నవి.

కాశీపుర వర్ణన

శీతాహార్య సుతాళినీవికచ రాజీవంబు విశ్వేశ్వర
జ్యోతిర్లింగ విశుద్ధ రత్నఖని మోక్షాపాయముక్తాబ్ధివే
లాదీరావని డుందినామక గజాలానంబు, గంగామృత
స్రోతో నిస్స్రుతి చంద్ర గోళి యనమించున్ గాశిశ్రీరాశియై 1 - 99

తుంగభద్రానది వర్ణన

శా॥ గంగా సంగమ మిచ్చగించునె మదిన్ గావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే
రంగత్తుంగ తరంగ హస్తముల నారత్నా కరేంద్రుండు నీ
యంగబంటి సుఖించు నేని గుణ భద్రా తుంగభద్రా నదీ. 1 - 139
అగస్త్యుడు దర్శించిన తుంగభద్రానదిని రామకృష్ణకవి సరసంగ వర్ణించాడు.

సముద్ర వర్ణన

ఉ॥ ధేనుగ జాశ్వ రత్న సుదతీ ప్రముఖా ఖిల వస్తు కోటివై
మానిక భర్తమున్ గొనియు, మచ్చర మారఁ బయోధిలోఁ తుగై
కోనెస కొల్వెనో బలుమొగుల్గమి ప్లుష్ట కరీష పిండరే
ఖా నిభ వృత్తి నత్తెరఁగు గాకటి నీరవి ద్రావ నేటికిన్ 3 - 144

సముద్రాన్ని పైపైన మధించగానే కామధేనువు, ఐరావతము, లక్ష్మీదేవి మున్నగు అమూల్య వస్తువులు లభించాయి. సముద్రాన్ని ఇంకా లోతుగా మధించిన ఎన్ని అమూల్య వస్తువులు లభిస్తాయో అనే ఆశతో మేఘాలు నీటిని గ్రోలుచున్నాయి. సముద్రపు నీటిని మేఘాలు పానము చేసి వాటిని తిరిగి వర్ష రూపంలో ప్రసాదించటం సంప్రదాయ సిద్ధం. ఇది ఒక అపూర్వ కల్పన.

## 10.6.2(ఈ). రసపోషణ :

ఈ కావ్యంలోని ప్రధానరసం శాంతరసం. శృంగారం, వీరం, కరుణ మొదలగు రసాలు సందర్భానుసారంగ పోషించబడ్డాయి. నిగమశర్మ భార్య చాలాకాలం వచ్చిన భర్తను సేవించిన విధం.

కం॥ ఆపై దలి ప్రాణేశ్వరు
శ్రీ పాద ద్వయముఁ గడిగె శీతలవారిన్
వ్యాపృత నిజనిశ్వాసజ
తాపంబునఁ గొంత కొంత తప్తముకాఁగన్ 3 - 25

భార్య నిగమశర్మకు చన్నీళ్ళతో పాదములు కడిగినది. అప్పుడామె నిట్టూర్పులచే అతని పాదములు వెచ్చబడి కొంత సుఖమును కల్గించినదట. భర్త యందు ఆమెకు గల గాఢమైన అనురాగము ఈ పై పద్యంలో చిత్రింపబడినది. సుకుమారమగు శృంగారం ఈ పద్యంలో పోషించబడింది కాని భర్త అనురక్తుడు కాలేదు.

## 10.6.2(ఉ). పదగుంఫనము :

పదాల కూర్పు పదగుంఫనము. “పాండురంగ విభుని పదగుంఫనము” మనది ప్రచారంలో ఉంది. ముళ్ళపూడి భాస్కరరావు గారు “సంస్కృతమునను తెలుగునను నూతన పదములను గ్రహించి కూర్పు చేయుటయే పాండురంగ విభుని పదగుంఫనము” అని తన అభిప్రాయాన్ని తెలిపారు. ప్రబంధ కవులలో రామకృష్ణ కవికి ఒక విశిష్టత సంపాదించి పెట్టినది పదగుంఫనం.

తెనాలి రామకృష్ణకవి నూతన సమాసాలను కూర్చి తన పదగుంఫనా చాతుర్యాన్ని ప్రదర్శించాడు. చంద్రరేష అనడానికి “తారావిటార్థమౌళి” అని, “షణ్ముఖుడు” అనుటకు “షట్కంఠ” అని, “చంద్రముఖి” అనుటకు “నీహార మయూఖ జిన్ముఖి” అని “ఇందిరావిభుడు” అనుటకు “ఇందీవిభుడ”ని, “జన్మాంతర” మనుటకు “భవాంతరమ”ని నూతన సమాసాలను కల్పించాడు.

రామకృష్ణ కవి పదగుంఫనా ప్రౌఢిమ దశావతార స్తుతి యందు కన్పిస్తుంది.

సీ॥ నీటిలోఁ జివుకక నిలిచి క్రుమ్మరు పూన్కి
కఠిన కర్పురపుఁ జుక్కాను బిగువు
దంష్ట్ర నెత్తిన మహీ తలపు గాడుపుఁ జీర
యురుదారు కలనయందు దయమగుట
పరులకుఁ దనకట్ల బలిమి చూపు విధంబు
పులిమిన నెత్రు గుక్కిలపు నూనె
ద్వీపాంతరమునకుఁ దెగువమైఁ జనుపెంపు
చే ముట్టు నాఁగంటి జీని తగులు

గీ॥ సాగతాగమ మాలి విశాస్త్ర సరణి
వల్గు వల్గన చిత్ర ధావనముఁ గల్గు
నిన్ను దరిచేరి భవవార్ధి నిస్తరంచి
దరిఁదరియకున్నఁ గలదె మోదము మురారి 2 - 66

దశావతారముల ఓడ మత్స్యావతార ముండుటచే నీటిలో చివుకదు. కూర్మపు చిప్పవలన చుక్కాని బిగువుగ ఉంటుంది.

వరహావతారపు కోర తెరచాప. కొయ్యతో చేయబడిన నావ దారుస్తంభము నుండి వెడలిన నరసింహావతారం. దాని కట్లు మూడును వామనావతారం. నెత్తురు గుగ్గిలపు నూనె రాచి యుండుటచే పరశురామావతార మందున్నది. ద్వీపాంతరముల కరుగు ఓడ కావున రామావతారం. అది చేముట్టు నాగంటి జీని తగులు కావున బలరామావతారం. నౌకా నిర్మాణానికి శాస్త్ర సరణి బుద్ధావతారం.

కొన్నిచోట్ల పదగుంఫనమును శబ్దాలంకార రూపంగా ప్రదర్శితమయ్యాయి.

ఉ॥ ఈ కడ జాతి నాఁతికి హిహీ మహిదేవుఁడు చిక్కెనంచునన్
రాకకుఁ బోకకున్ జనపరంపర కెంపగు చూడ్కిఁ జూచియం
బూకృత మాచరించుటకు బుద్ధిఁ దలంకఁ గలంక ముక్త చం
ద్రా కృతిఁ బొల్చునీ ముఖమునం దమృతస్థితి గాంచి మించుటన్ 3 - 95

జాతి-నాక, రాక-పోక, తలంక-కెలంక అను చోట్ల శబ్దాలంకార రూపంలో పదగుంఫనం చూడవచ్చు.

సముద్ర వర్ణనలో రామకృష్ణ కవి ప్రదర్శించిన పదగుంఫనం తీరు నూతన భావనలతో నిండి ఉంది.

ఉ॥ ధేను గజాశ్వరత్న సుదతీ ప్రముఖాఖిల వస్తుకోటివై
మానిక భర్తమున్ గొనియు, మచ్చరమారఁ బయోధిలోఁ తుగై
కోనెస కొల్పెనొ బలుమొ గుల్గమి ప్లుష్ట కరీష పిండరే
ఖా నిభవృత్తి, నత్తెరఁగు గాకట నీరవిద్రా వనేటికిన్ 3 - 144

సముద్రాన్ని పైపైన మధించగానే కామధేనువు, ఐరావతము, లక్ష్మీదేవి మున్నగు అమూల్య వస్తువులు లభించాయి. సముద్రాన్ని ఇంకా లోతుగా మధించిన ఎన్ని అమూల్యమైన వస్తువులు లభించునో అను ఆశతో మేఘములు నీటిని గ్రోలుచున్నవి. సముద్రపు నీటిని మేఘములు పానము చేసి వాటిని తిరిగి వర్ష రూపమున ప్రసాదించుట సహజం. దానిని తన పదగుంఫనంలో అపూర్వకల్పనతో నూతన భావాన్ని వెల్లడి చేశాడు.

రామకృష్ణుని అలంకార ప్రయోగం కావ్యరసాస్వాదనకు ఎంతో ఉపకరిస్తుంది. రామకృష్ణకవి ఉపమ, రూపకం, స్వభావోక్తి, అర్థాంతరన్యాసాలంకారాలను ఎక్కువగా ప్రయోగించును.

క॥ ఇంతలునంతలు నగు తన
సంతానము చంట వెంట సందడి చేయన్
భ్రాంతమున నిలిచి తమ్ముని
కుంతల బంధమ్ము విడిచి కుశలాశయమై 3 - 29

ఈ పద్యమునందు స్వభావోక్తి రమణీయం. చక్కని జాతీయముతో మరింత సౌందర్యవంతమైంది.

రామకృష్ణకవి కవితా రచనమున భాషా స్వాతంత్ర్యం కలవాడు. దిన వెచ్చము, వ్రాయస ప్రవృత్తి, కనక క్రోవి మొదలగు వైరి సమాసాలను త్రాటిగట్టు = బ్రాహ్మణుడు, రసవతి = వంటశాల, రాతికొడుకు = కప్ప, ఉత్కోచుండు = దిట్ట మొదలగు ప్రయోగాలను ప్రయోగించాడు.

రామకృష్ణ కవికవితలో లోకోక్తులు, జాతీయములు, సామెతలు అడుగడుగున నుండి కవి యొక్క లోకానుభవాన్ని

తెలియచేస్తున్నాయి. తల లోపల నాలుక పూసలలో దారంబు (3-59) గుడినుండి గుడితాళ్ళు దీయుకరణి (3-68) ఉవిదలకు బుద్ధి పెడతల నుండు గాదె (3-81) మడుఁగు సగము మైలయు సగమే (5-220) తేనె పూసిన కత్తి (3-46) నేతిబీరకాయ (3-13).

రామకృష్ణుని కవితలో పరిహాస రసికత ఒక విశిష్ట లక్షణం. జాతి మాత్రోప జీవి అయిన నిగమశర్మకు ఆ పేరు పెట్టుటలోనే హాస్య ప్రియత్వం వ్యక్తమవుతుంది. నిగమశర్మ అక్క చేసిన హితబోధను వినినట్లే నటించి ఒకనాటి రాత్రి దొరికిన సొమ్ములను చేతపట్టుకొని తాను పడుకున్న పక్కకు కూడ చెప్పక పారిపోయి నపుడు తండ్రి తన దర్భముద్రిక పోయినదని ఏడ్చాడు. తల్లి తనకు అత్తగారిచ్చిన సుదర్శన హారం పోయినందుకు ఏడ్చింది. బావగారు నవగ్రహములు గల చెవిపోగులు పోయినందుకు ఏడ్చాడు. నిగమశర్మ అక్క మాత్రం తన ముక్కుపుడక పోయినందుకు ఏడ్చింది. ఇది రామకృష్ణుని పరిహాసరాసిక్యానికి ఉదాహరణ.

ఈ విధంగా రామకృష్ణ కవి పాండురంగ మాహాత్మ్యమును సకల లక్షణ లక్షితంగా కమనీయ కవితా రామణీయకతతో రచించి ఒక ప్రత్యేకతను సంపాదించుకొన్నాడు. ఆంధ్ర పంచ కావ్యాలలో ఒకటిగా పరిగణింపబడుటకు రామకృష్ణకవి ఔన్నత్యానికి నిదర్శనం.

### 10.6.3. ఘటికాచల మహాత్మ్యము :

తెనాలి రామకృష్ణకవి పాండురంగ మాహాత్మ్య కావ్యం రచించిన తరువాత ఘటికాచల మాహాత్మ్యమును రచించాడు. దీనిని 475 గద్యపద్యాలలో మూడు ఆశ్వాసాల కావ్యంగా రామకృష్ణుడు రచించాడు. నూటయెనిమిది దివ్య తిరుపతులలో ఘటికాచల మొకటి. ఇచటి దైవం యోగలక్ష్మా నృసింహస్వామి. ఘటికా చల మాహాత్మ్యంలోని అవతారికా భాగాన్ని పూర్తిచేయక ముందే మరణించగా రామకృష్ణకవి మనుమడు రచించి ఖండోజి రాయుడను మహారాష్ట్ర రాజుకు సమర్పించాడు. “ఆతని యిష్టసిద్ధి గావించి” ఆ ప్రభువును తన్నాశ్రయించి యుండిన. వేంకటగిరికవిచే దేవతాస్తుతి మొదలుగా షష్ఠ్యంత కందాల వరకు గల 60 పద్యాలు రచించి ఘటికాచల మాహాత్మ్యములో చేర్చాడు. కృత్యాది పద్యాలను రామకృష్ణ కవి వ్రాయలేదని వేంకటగిరి కవే వ్రాసాడని అవతారికను బట్టి తెలుస్తున్నది. కావ్యాన్ని మాత్రం రామకృష్ణ కవే వ్రాశాడు. “కాళ్ళు చేతులు లేనికథ, పోలు పొందులు లేని యతుకులు, అనావశ్యకమైన విస్తరమును కలిగి, యా కావ్యమొక బలవంతపు మేఘ స్నానముగా ఏ ఘటికాచల భక్తుని కోసమో వ్రాసి యెందుకో మూలపడవేసినట్లు కానవచ్చుచున్నదని” అనంత కృష్ణశర్మ గారి అభిప్రాయం. “రామకృష్ణుని రచనలలోనే కాదు, కొన్ని స్థల పురాణాలలో సహితం ఇది పేలవంగా కనబడుతుంది” అని ఆరుద్ర గారు వ్రాశారు.

నైమిశారణ్య మందలి మునులు వైష్ణవ క్షేత్రములలో ముఖ్యమైన దానిని చెప్పవలసినదని కోరగా సూతుడు నారద భృగు సంవాదాన్ని వివరించాడు. దాని సారమే ఘటికాచల మాహాత్మ్యము. ఈ క్షేత్రంలో నారదుడు తపసుచేసి బ్రహ్మకు కుమారుడుగా పుట్టాడు. సప్త మహర్షులు ఈ క్షేత్రంలో తపస్సు చేశారు. రామకృష్ణకవి పురాణముల నుండి కొంత కథను గ్రహించి సుందరమగు వర్ణనలతో దీనిని రచించాడు.

16వ శతాబ్దం ఆంధ్ర సాహితికి స్వర్ణయుగమై ప్రబంధమనే నూతన ప్రక్రియకు స్థానం కల్పించింది. శ్రీకృష్ణ దేవరాయలు కవులను పోషించడమే గాక ఆంధ్రభోజుడని కీర్తిగాంచాడు. రాయల భువన విజయం కళాపోషక కేంద్రమై ప్రబంధరూపంగా స్వతంత్ర కావ్యాలనేకం అవతరించాయి. ఆంధ్ర కవితా పితామహుడైన అల్లసాని పెద్దన మనుచరిత్ర ప్రబంధాలలో కెల్లా తలమానికమైంది. ఈ యుగము నందలి ప్రబంధాలు ఆ యుగ ప్రజా జీవితాలకు ప్రతిబింబాలు. భక్తి కావ్యాలు, స్వతంత్ర కావ్యాలు, ద్వర్థి కావ్య రచనలు, శ్లేష రచనలు, చిత్ర కవితలు, శతకాలు, శాస్త్ర గ్రంథాలు అవతరించి ప్రబంధ యుగాని కొక ప్రత్యేకతను సంతరించి పెట్టాయి.

## 10.8. రాదగిన ప్రశ్నలు :

1. పారిజాతాపహరణ ప్రబంధ విశిష్టతను వివరించండి.
2. ధూర్జటి కృతులను గూర్చి వ్రాయండి.
3. శ్రీకాళహస్తి మహాత్మ్య కావ్య విశిష్టతను వివరించండి.
4. వసు చరిత్ర కావ్య వైశిష్ట్యాన్ని వివరించండి.
5. రామరాజభూషణుని కృతుల విశేషాలను తెలియచేయండి.
6. పింగళి సూరన కల్పనా రమణియతను తెల్పండి.
7. కళాపూర్ణోదయం సూరన అద్భుతసృష్టి - వివరించండి.
8. ప్రభావతి ప్రద్యుమ్న కావ్యం జాతి రత్నం - విశదీకరించండి.
9. ప్రబంధ వాఙ్మయంలో ఆముక్త మాల్యదకు గల విశిష్టతను వివరించండి.
10. కృష్ణదేవరాయల కృతులను సమీక్షించండి.
11. పాండురంగ మహాత్మ్యంలోని కవితా వైశిష్ట్యాన్ని విశదీకరించండి.
12. (అ) ఉద్భటారాధ్య చరిత్ర (ఆ) ఘటికాచల మహాత్మ్యము.

## 10.9. ఆధార గ్రంథాలు :


1. ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యం
2. జోగారావు. యస్వీ - సారస్వత నీరాజనము
3. తెలుగు అకాడమి - తెలుగు సాహిత్య చరిత్ర
4. నాగయ్య. జి (డాక్టర్) - తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం)
5. నారాయణాచార్యులు పుట్టపర్తి - రామకృష్ణుని రచనా వైఖరి
6. ప్రభాకరశాస్త్రి వేటూరి - మీగడ తఱకలు
7. ప్రభాకరశాస్త్రి వేటూరి - ప్రబంధ రత్నావళి
8. లక్ష్మీకాంతం పింగళి - సాహిత్య శిల్ప సమీక్ష
9. లక్ష్మీరంజనం ఖండవల్లి - ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము
10. వేంకటావధాని దివాకర్ల - ఆంధ్ర వాఙ్మయ చరిత్రము



డాక్టర్ యం. కమల
లెక్చరర్
సి. ఆర్. కాలేజి
చిలకలూరిపేట

## పాఠం - 11

# పద సాహిత్యం

11.0 లక్ష్యం
11.1 వైశిష్ట్యము
11.2 అన్నమాచార్యుడు
11.3 క్షేత్రయ్య
11.4 త్యాగయ్య
11.5 రామదాసు
11.6 రాదగిన ప్రశ్నలు
11.7 ఆధార గ్రంథాలు

### 11.0 లక్ష్యం :

తెలుగునాట ఆబాల గోపాలాన్ని, పండిత పామరులను అలరించిన పదకవితను, క్షేత్రయ్య, త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు పదకవితా లక్షణాలను తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

### 11.1 వైశిష్ట్యము :

కవిత్వాన్ని, సంగీతాన్ని కలగలిపి గనయోగ్యమైన సాహిత్యాన్ని సృష్టించిన వారు పదకవులు. పదకవిత్వంలో భక్తి, శృంగారాలు పరాకాష్టనందుకొన్నాయి. పదమంటే పాట. పదకవిత పండిత పామర జనరంజకమైనది. దేశికవితా రీతులలో మధుర కవితా రీతికి చెందినది పదకవిత. పదం సంగీత సాహిత్యాల సమ్మేళన రూపం. ఇందులోని సాహిత్యాంశాన్ని "వాక్కు" అనీ, సంగీతాంశాన్ని "గేయం" అనీ అంటారు. వాక్కును గేయాన్ని రచించగలవాడు వాగ్గేయకారుడని అర్థం.

సంగీత ప్రాధాన్యమున్న వాటిని కృతులని, సాహిత్య ప్రాధాన్యమున్న వాటిని కీర్తనలని, సంగీత సాహిత్య ప్రాధాన్యమున్న వాటిని పదములని చెప్పవచ్చు. దేశికవితలను సమాదరించిన శివకవులు ఊయల పాటలను, శంకర పదాలను, వెన్నెల పదాలను, నివాళి పదాలను పేర్కొన్నారు. తెలుగు పదకవితకు 15వ శతాబ్దం వసంతకాలం.

తెలుగులో పదకవితలు రచించినవారు తెలుగు భాష తియ్యదనాన్ని, శక్తిని నిరూపించారు. వాటిపై అలంకార శాస్త్రాలు, వ్యాకరణాల భారం ఉండదు. తమ జీవితానుభవసారాన్ని సహజమైన రీతిలో పదకవులు వెల్లడించారు.

పదకవులు క్షేత్రయ్య వంటి ఒకరిద్దరు తప్ప మిగిలినవారు రాజాశ్రయాన్ని నిరసించారు. నిధి చాల సుఖమా? రాముని సన్నిధి చాల సుఖమా? అని ప్రశ్నించుకొని, దైవాన్నే నమ్ముకున్నారు.

భక్తికవులు గర్హస్థ్య జీవనాన్ని నిరసించలేదు. సంసార జీవితాన్ని అనుభవించకుండా ఎవరు మోక్షాన్ని పొందలేరని వీర అభిప్రాయం. కర్మకాండలకు వీరు ప్రాధాన్యమియ్యరు. కులభేదాలను తొలగించాలని ప్రబోధించారు. వీరి కవితలలో భాష, రూపం సామాన్యులకు దగ్గరగా ఉంటాయి. సామాన్యుల నోళ్ళలో మెదిలే పదప్రయోగాలే వీరి కవితలలో కన్పిస్తాయి.

## 11.2. అన్నమాచార్యుడు :

పదకవితకు పట్టాభిషేకం కట్టినవాడు అన్నమయ్య. తిరుమలేశుని మురిపించి, పూజించి, ఆడి, పాడి, అర్చించి, తన జీవితాన్ని అర్పణం చేసుకున్న భక్తాగ్రేసరుడు అన్నమయ్య. పద కవితా పితామహుడుగా, సంకీర్తనాచార్యుడుగా అన్నమయ్య శ్రీవేంకటేశ్వర స్వామికి అంకితంగా ముప్పయి రెండు వేల పదాలు రచించి చరితార్థుడైనాడు.

అన్నమయ్య క్రీ.శ. 15వ శతాబ్దంలో జీవించాడు. ఆయన జీవితంలో అధిక భాగం దక్షిణాపథమంతటిలో అతి పెద్ద పుణ్యక్షేత్రమైన తిరుపతిలోను, దాని పరిసరాలలోను గడిచింది. స్వామికి అనుదినం ఆయన కనీసం ఒక నూతన కీర్తనైనా నియతంగా అర్పించేవాడట.

వేంకటేశ్వరస్వామి దివ్యసుందర రూపదర్శనం వల్ల తనకు కలిగే ఆనందాన్ని అన్నమయ్య ఎన్నో కీర్తనలలో వర్ణించాడు. స్వామిని "చాల నేరిచి పెద్దలిచ్చిన నిదానమ"ని, "గారవించి దప్పితీర్చు కాలమేఘ" మని, "చెడనీక బ్రతికించు సిద్ధమంత్ర" మని, "చేవదేర కాచినట్టి చింతామణి" అని, "రోగాలడచి రక్షించే దివ్యౌషధ" మని ప్రస్తుతించాడు.

క్రీ.శ. 1408 లో శ్రీ వేంకటేశ్వరస్వామి నందకాంశగా తాళ్ళపాక గ్రామంలో సూరి, లక్కమాంబలనే దంపతులకు క్రోధి సంవత్సర వైశాఖ శుద్ధ పౌర్ణమినాడు విశాఖ నక్షత్రంలో అన్నమయ్య జన్మించాడు. చిన్నప్పటి నుండి అన్నమయ్య వెంకన్న పేరు చెబితే మైమరిచిపోయేవాడు. ఒకనాడు పొలంలో గడ్డికోస్తున్న అన్నమయ్య తిరుమలకు వెళ్తున్న భక్తబృందాన్ని చూచి, చేతిలోని కొడవలిని పారవేసి తిరుమలకు బయలుదేరాడు. "అదిగో అల్లదిగో శ్రీహరివాసము" అనే కీర్తన అప్పుడు రచించి వుంటాడు. కొండ ఎక్కుతూ త్రోవలో ఒక వెదురు పొద క్రింద మైమరచి నిద్రపోయాడు. అతనికి కలలో అలిమేలు మంగమ్మ దర్శనమిచ్చింది. నాయనా చెప్పుల కాళ్ళతో కొండ పైకి ఎక్కరాదు అని చెప్పి దివ్యప్రసాదాలిచ్చి అతని ఆకలిని తీర్చింది. అతడు మేలుకొని అమ్మవారిపై ఒక శతకము రచించాడు. కొండమీదకు వెళ్ళి స్వామి దర్శనం చేసుకున్నాడు.

కొన్నాళ్ళకు అన్నమయ్య తిరిగి తాళ్ళపాక గ్రామం చేరుకొని తల్లిదండ్రుల కోరికపై తిమ్మక్క, అక్కలమ్మ అనే కన్యలను పెళ్ళిచేసుకుని కొన్నాళ్ళు గృహస్థాశ్రమంలో గడిపాడు.

అన్నమయ్య భక్తిప్రపత్తులను, పదరచనా నైపుణ్యాన్ని గురించి విని టంగుటూరును పరిపాలించే సాళ్వ నరసింగరాయలు ఆయనను తన ఆస్థానానికి ఆహ్వానించాడు. రాజాశ్రయం వైష్ణవ ధర్మవ్యాప్తికి ఉపకరిస్తుందని అన్నమయ్య సమ్మతించాడు. కొలువులో ఒకనాడు అన్నమయ్య భక్త్యావేశంలో

ఏమొకో చిగురుటధరమున
యెడనెడ గస్తురి నిండెను
భామిని విభులకు వ్రాసిన పత్రిక కాదుగదా

అనే శృంగార కీర్తనను ఆలపించాడు. సాళ్వ నరసింగరాయలు అటువంటి పదము నాపై నొకటి చెప్పుమని అడిగినాడు. 'నరహరిని కీర్తించే నా నాలుక నరుని కీర్తించలేదు' అని అన్నమయ్య తిరస్కరించాడు. రాజు కోపగించి ఆయనను చెరసాలలో త్రోయించాడు. అన్నమయ్య భక్త్యావేశంతో కీర్తనను ఆలపించగా సంకెళ్ళు ఊడిపోయాయి. రాయలు తన తప్పిదాన్ని తెలుసుకొని అన్నమయ్య పాదాలకు ప్రణమిల్లి శరణు వేడాడు. అన్నమయ్య రాజునను గ్రహించి తిరిగి తిరుమల క్షేత్రం చేరుకొన్నాడు. క్రమంగా అన్నమయ్య ఇహలోక సౌఖ్యములపై విరక్తుడయ్యాడు. క్రీ.శ. 1508 లో దుందుభి సంవత్సరము ఫాల్గుణ బహుళ ద్వాదశినాడు శ్రీవేంకటేశ్వరస్వామిలో ఐక్యమయ్యాడు.

### 11.2.1. సంకీర్తనల కవితా విశేషములు :

పల్లవి చరణాలతో కూడిన సంకీర్తనల రచనకు అన్నమాచార్యుడే ఆద్యుడు. అందువలననే పదకవితా పితామహుడని పేరుగాంచాడు. ఆయన 32,000 కీర్తనలు రచించాడు. వాటిలో 12 వేల కీర్తనలు మాత్రమే లభించాయి. ఇవి రాగిరేకుల మీద చెక్కబడి తిరుపతిలో సంకీర్తనా భాండాగారములో ఉన్నాయి.

స్వామి శ్రీచరణాల ప్రశస్తిని కీర్తిస్తూ అన్నమయ్య ఎన్నో పదాలు రచించాడు.

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము
చెలగి వసుధ కొలిచిన పాదము
బలి తల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము

సకల జీవులలో వ్యాపించివున్న పరమాత్మ చైతన్యాన్ని నిరూపించే గేయం -

తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటె

అనేది తెలుగు నాట మిక్కిలి ప్రచారమైంది.

"అసాధారణ భావన, స్వతంత్ర మధురధార, భావముల లోని అసందిగ్ధమైన ఆర్జవము, విషయ వైవిధ్యము అన్నమయ్య కవితలోని ప్రధాన గుణములు" అంటూ అన్నమయ్య కవిత్వాన్ని ప్రశంసించారు శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారు.

తాళ్ళపాక వారిని చదవనిదే తెలుగు రాదని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి భావించారు.

పరమాత్ముని ప్రాభవాన్ని కీర్తిస్తూ రమణీయమైన గీతాలు రచించి, శ్రవణ మధురంగా గానం చేసే ధన్య జీవులు అరుదుగా ఆవిర్భవిస్తూ ఉంటారు. అటువంటి వాగ్గేయ కారుల్లో అగ్రేసరుడు తాళ్ళపాక అన్నమచార్యుడు.

## 11.3. క్షేత్రయ్య :

క్షేత్రయ్య పూర్వనామం వరదయ్య. అనేక పుణ్యక్షేత్రాల సందర్శనం వల్ల వరదయ్యకు క్షేత్రయ్య అనే పేరు వచ్చింది. క్షేత్ర జ్ఞానం కలవాడు క్షేత్రయ్య. ఈ పేరుతోనే ఇతడు ప్రసిద్ధుడైనాడు. మొవ్వ గ్రామంలో వెలసిన మువ్వగోపాలునిపై భక్తి శృంగార రసభావాలతో రచించిన పదాలే మువ్వగోపాల పదాలు. "మువ్వగోపాల" మకుటంతో రచితమైనవే క్షేత్రయ్య పదాలు.

శృంగార రసాధి దేవుడైన గోపాలుని అనుగ్రహం పొందాడు. చక్కని వైదుష్యం గడించాడు. సంస్కృతాంధ్ర భాషల్లోను సంగీతాభినయాలంకారాది శాస్త్రాల్లోను పాండిత్యం సంపాదించాడు. మువ్వగోపాలునిపై శృంగార పదాలు చెప్పనారంభించాడు.

శ్రీమతి సుతుబారికి నేనోపలేక నిను వేడితే
కోపాలా? మువ్వ గోపాలా

ఏ పొద్దు దానింటిలోనే కాపై యుండి నీ సరస స
ల్లాపాలా  మువ్వగోపాలా

అని మొట్టమొదటి మువ్వగోపాల పదం క్షేత్రయ్య రచించాడు.  అటు తర్వాత మువ్వగోపాలునిపై అనేక భక్తి పదాలను రచించాడు.

కంచిలో క్షేత్రయ్య వరదరాజుల దేవాలయంలో రాత్రి పూజను దర్శించి తన్మయత్వంలో మునిగిపోయాడు. ఆ సమయంలో పూజారులు ఆయనను గమనించక ఆలయం తలుపులు మూసివేళ్ళారు.  అతని అంతర్ దృష్టి అంతా కేళీమందిరంలోని అమ్మ అయ్యల అలౌకిక శృంగార రసాభావ భావనలో లీనమైంది.  తెల్లవారుజామున అతడు యోగనిద్ర నుండి మేల్కొని కన్నులు తెరవగా మెట్లనుండి దిగివస్తూ ఒక స్త్రీ కనిపించిందట.  వెంటనే ఆయన మోహనరాగంలో ఝంపె తాళంలో -

"మగువ తన కేళికా మందిరము వెడలెన్
వగకాడ మా కంచి వరద తెల్లవారె ననుచు
విడజారు గొజ్జంగి విరిదండ జడలోను
. . . . . . . . . . . . . . . . . . . . . . . . .

క్షేత్రయ్య శివకేశవా భేదాన్ని చాటడానికని చెవందిలింగా అని చిదంబరంలోని శివుని, కంచివరదా అని కంచిలోని వరదరాజ స్వామిని ఒకే పదంలో

చక్కని దయగలదాయిది నీ జాగా చెవందిలింగా
యిక్కడికి వచ్చినదేమో హెచ్చు కంచి వరదా

సంభోదించాడు.  క్షేత్రయ్య పదాల్లో శృంగారాన్ని చూచు పద కవితలంటే శృంగార పదాలనే భావం ఏర్పడింది.  కాని అతడు రచించిన వర్ణనలు చూచినపుడు ఏ ప్రబంధ కవికీ తీసిపోని వాడని అర్థమౌతుండి.

ఎంత చక్కనివాడే నాసామి ఎంత చక్కనివాడే
ఇంతి మువ్వగోపాలుడు - సంతతము నా మదికి సంతోషము చేసునె
మొలక నవ్వుల వాడె - ముద్దు మాటలవాడే
. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

ఏ భాషకైన సామెతలు, లోకోక్తులు జీవగర్రలుగా ఉంటాయి.  వాటిని అతికినట్లుగా సందర్భోచితంగా ప్రయోగించట మనేది భాషాతత్త్వం బాగా తెల్సిన కవి మాత్రమే చేయగలడు.  అందులో అందె వేసిన చేయి క్షేత్రయ్య.

అరటాకు సామెతయట్లు -
ఇంట గెలిచి రచ్చ గెలువ వలెనను -
ఏ పుట్టలో ఏమున్నదో ఎరుగనైతిని -
కలిమి లేములు కావడి కుండలు -

మొదలైన సామెతలు తెలుగు భాషా జీవతత్త్వాన్ని క్షేత్రయ్య ఎంత బాగా గుర్తించాడో తెలుపుతాయి.

క్షేత్రయ్య పదాలతో సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్య మివ్వటమే కాక పదాలకు అభినయానికి కూడ ప్రాధాన్యమిచ్చాడు.

నాటి కూచిపూడి నృత్యకళాకారుల ప్రభావంతో క్షేత్రయ్య పదాలు పరిపుష్టి చెంది గొప్ప ప్రత్యేకతను సంతరించుకొన్నాయి.

## 11.4. త్యాగయ్య :

త్యాగయ్య తంజావురును నాయక రాజుల తర్వాత పరిపాలించిన 'శాహ్ భూపాలుని' ఆస్థాన వాగ్గేయకారుడైన గిరిరాజ కవికి పౌత్రుడు. గిరిరాజ కవి పుత్రులలో కనిష్ఠుడైన 'రామబ్రహ్మం' కుమారుడు త్యాగయ్య. రామబ్రహ్మం మలబాడీ మహారాడు ఆస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో రామాయణ ప్రసంగాలు చేస్తూ తిరువారూర తిరువయ్యారులలో గృహాదిక బహుమానాలను పొంది నుండినట్లు ఆచార్య విస్సా అప్పారావు గారు తెలిపారు.

గిరిరాజ కవి తండ్రి కాకర్ల పంచనద బ్రహ్మంగారు 1600 ప్రాంతంలో కర్నూలు జిల్లాలోని కంభం తాలూకా ప్రాంతం నుండి తంజావూరు జిల్లాలోని తిరువారూరు అనే పుణ్యక్షేత్రానికి వచ్చి స్థిరపడిన ములకనాటి ఆంధ్రబ్రాహ్మణులు, భరద్వాజ గోత్రులు, వేదశాస్త్ర పురాణ పండితులు.

త్యాగయ్య బాల్యం నుండే రామభక్తి పరాయణుడైనాడు. అతడు తండ్రి దగ్గర సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యాన్ని సంపాదించాడు. తల్లి దగ్గర జయదేవుని, పురందరదాసు, రామదాసు, అన్నమయ్య కీర్తనలు నేర్చుకున్నాడు. ఒకరోజు పూజలో 'నమో రాఘవాయ' అనే దివ్యనామ సంకీర్తన రచించిన ప్రౌఢి. త్యాగయ్య కవితా శక్తిని, కంఠ మాధుర్యాన్ని గమనించిన తండ్రి త్యాగయ్యను 'మలజాజి మహారాజు చేత అర్థ సింహాసన గౌరవం పొందిన ఆస్థాన విద్వాంసుడు' వెంకట రమణయ్య గారి వద్ద శిష్యునిగా చేర్పించాడు.

రామకృష్ణానంద స్వామి అనే మరుద నల్లూరు మర సన్యాసి వచ్చి త్యాగయ్యకు 'నారదోపాస్తి' మంత్రం ఉపదేశించాడట. త్యాగయ్య తిరువయ్యూరులోని పంచ నదీశ్వరుని ఆలయం వద్ద ఈ మంత్రాన్ని పునశ్చరణ చేయగా నారదుడే యతి వేషంలో దర్శనమిచ్చి స్వరార్ణవమనే సంగీత గ్రంథాన్ని నారదీయమనే మరో గ్రంథాన్ని యిచ్చి, వాటి వల్ల సకల సందేహ నివృత్తి కలుగుతుందని చెప్పాడట.

త్యాగరాజుకు 18వ యేట మొదట పార్వతమ్మతో వివాహం జరిగింది. ఆమె మరణించగా ఆమె చెల్లెలు కమలాంబతో వివాహం జరిగింది. అతడు రామకృష్ణా నందస్వామి ఉపదేశానుసారం 'రామ తారక' మంత్రాన్ని నిష్ఠగా తనకు 38 యేళ్ళు వచ్చే సరికి 96 కోట్ల పునశ్చరణ చేసాడు.

త్యాగయ్య జీవనోపాధి కోసం నరుల కొలువు చేయక రామనామ సంకీర్తనతో గ్రామంలోని సద్గృహస్థులు ఇచ్చిన బియ్యం, పప్పులు మొదలగు వాటితో జీవనం సాగించేవాడు. రాజులను ఆశ్రయించి గౌరవంగా బ్రతుకక, బికారి బ్రతుకు బ్రతుకుతున్నందుకు వేరు కుటుంబం చేసారు ఇంట్లోనివారు.

త్యాగయ్య కీర్తి విని తంజావూరును పరిపాలించే రెండవ శరభోజీ మహారాజు త్యాగయ్యను దర్శించ దలచుకొని చీని చీనాంబరాల కానుకలతో ఒక పల్లకీ పంపినాడు. రాజులను సేవించడం వల్ల తాను త్రిశాఖములలో రాముని పూజించుకోవడానికి వీలుండదని తలచి మమత చందనయుత నరస్తుతి సుఖమా! సుమతి త్యాగరాజ సుతుని కీర్తన సుఖమా! అని కీర్తనము వ్రాసి యిచ్చి తాను రానని తిప్పి పంపాడు. తరువాత తిరువనంతపురము మహారాజైన స్వాతి తిరుణాల్ త్యాగయ్యను ఆహ్వానిస్తూ తన ఆస్థాన విద్వాంసుని పంపాడు. ధరణీసుల తెలిమియు నొక పదవా అని తలచి త్యాగయ్య ఆ ఆహ్వానాన్ని కూడా తిరస్కరించాడు. రాజ గౌరవాన్ని తిరస్కరించినందుకు కోపగించి జపేశనం తమ్ముని శ్రీరామ పంచాయతన విగ్రహాలను ఒకనాడు రహస్యంగా కావేరిలో పారవేశాడు. త్యాగయ్య దుఃఖించి నిద్రాహారాలు మాని 'ఎందు దాగినాడో' అనే కృతిని చెప్పగా రాముడు కలలో కనిపించి

కావేరిలో దొరుకుతానని చెప్పాడట. త్యాగయ్య వెళ్ళి కావేరిలోని విగ్రహాలను తీసుకొని కీర్తిస్తూ ఇంటికి తెచ్చాడట.

త్యాగయ్య కృతులలో ఎక్కువ భాగం రామాయణ కథాత్మకమైనవి. విష్ణువు అని వాడవలసిన చోట ఆయన 'రాముడు' అనే వ్యవహరిస్తాడు. రామాయణంలో వాల్మీకి 24,000 శ్లోకాలు రచించినట్లు త్యాగరాడు కూడ 24,000 కీర్తనలు రచించాడని చెబుతారు. ఇప్పుడు 600 కృతులు మాత్రం లభిస్తున్నాయి. త్యాగరాజు 72 మేళకర్త రాగాలలో కీర్తనలు రచించాడు. నాట, గౌళ, అరభి, శ్రీరావళి అనే ఘనరాగ పంచకంలో రచించిన కృతులను బట్టి ఆయన లక్ష్యలక్షణ వేదియైన మహా వాగ్గేయకారుడని తెలుస్తుంది.

ఇపుడు లభిస్తున్న త్యాగరాయకృతులు 600 లలో ఆయన సుమారు 200 రాగాలను ఉపయోగించారు. కృతులలో ఆయన తాళ వైవిధ్యాన్ని కూడ పాటించారు. సాహిత్యపరంగా చూచినప్పుడు త్యాగరాజు కృతులలో వేదాంత బోధకములు, నీతి బోధకములు, మానస బోధకములుగా వైవిధ్యాన్ని కలిగివుంటాయి. ఆయన శిష్టవ్యావహాంకాన్ని ఉపయోగించాడు. "ఉండేదే రాముడొకడు" "ఒక పత్నీవ్రతుడే" లాంటి వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలను కూడ ఆయన చేశాడు. కొన్ని కృతులు మనస్సున నాటి ఉపదేశములతో నిండి ఉంటవి. కొన్నిటిలో భగవంతునితో వంతులాడినట్లు, కొన్నిటిలో జాలితో దీనుడైనట్లు, కొన్నిటిలో నిందాస్తుతులో, స్తుతినిందలో కన్పిస్తాయి.

త్యాగరాజు కృతులలో కొన్నిచోట్ల పదచిత్రాలు మనోహరంగా ఉంటాయి. "మేరు సమాన ధీర" "అలకలల్లాడ" కీర్తనలటువంటివే. శ్రీరాముని అతి లావణ్య రూపాన్ని చూచి తన్మయుడై త్యాగయ్య శృంగార రసాన్ని కూడ అక్కడక్కడ వెదజల్లాడు. అతి మృదువుగా, అతి కోమలంగా, అతి సున్నితంగా ఉంటుంది ఆయన కృతుల్లోని శృంగారం.

బమ్మెర పోతన 'ఇందుగలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండెందెందు వెదకి చూచిన నందందే గలడు' అన్నాడు. 'ఎందెందు జూచిన - నెందెందు బలికిన - నెందెందు సేవించిన - నెందెందు బూజించిన - నందందు నీవని తోచు" అన్నాడు.

తెలుగు జాతి, దేశము, భాష త్యాగరాడు వల్ల ధన్యమైనవి.

## 11.5. రామదాసు :

వాగ్గేయకారులని పిలువబడే వారు ఎందరున్నా నాటికి నేటికి తెలుగుదేశంలోనే కాదు, దక్షిణ భారతదేశమంతటా ప్రసిద్ధి పొందిన వాగ్గేయకారుడు, భక్తశిఖామణి రామదాసు. త్యాగయ్యకు రామదాసంటే ఎంతో గౌరవం, భక్తి. అందుచేతనే తన కృతుల్లో రామదాసుని స్మరించాడు, శ్లాఘించాడు కూడ.

కలియుగమున వరభద్రా
చలమున నెలకొన్న రామచంద్రుని పదభ
క్తులకెల్ల వరుడనం దగి
వెలసిన శ్రీరామదాసు వినుతింతు మదిన్

అని ప్రహ్లాద భక్త విజయంలో సుకవి కీర్తనల్లో రామదాసుకు స్థానమిచ్చాడు.

### 11.5.1. జీవిత విశేషాలు :

రామదాసు అసలు పేరు కంచెర్ల గోపన్న. 1620 - 1680లో ఆంధ్రదేశంలో తన దాశరధీ శతకం ద్వారా, అనేక కీర్తనల

ద్వారా ప్రజలలో రామభక్తిని పెంపొందించాడు. గోపన్న ఆత్రేయ సగోత్రజుడు. అంగన మంత్రి, కామమ్మల పుత్రుడు. రఘునాథ భట్టాచార్యుల శిష్యుడు. జన్మస్థలం నేలకొండ పల్లి. యాదవరాజు, సింగరిదాసు అనేవారు రామదాసు చరిత్రను యక్షగానంగా రచించాడు. దీనిని బట్టి రామదాసు క్రీ.శ. 17వ శతాబ్ది పూర్వార్థంలో ఉండేవాడు. భద్రాచలంలో శ్రీరాముడు పోకల దమ్మక్క అనే భక్తురాలికి తాను భద్రగిరిపైన సీతాలక్ష్మణ సమేతుడై ఉన్నట్లు తెలిపాడు. ఆమె ఆ విగ్రహాలను తెచ్చి, చిన్న గుడి కట్టించి, వాటికి అర్చనలు జరుపుతుండేది.

గోపన్న చిన్నతనంలోనే తెలుగు సంస్కృతాలతో పాటు ఉర్దూ పారసీ భాషలు కూడ నేర్చుకున్నాడు. రఘునాథ భట్టాచార్యుల మంత్రోపదేశం పొంది, పంచసంస్కారాలతో గోపన్న విశిష్టాద్వైతి అయ్యాడు. కమలమ్మ అనే బంధువులు అమ్మాయిని పెండ్లి చేసుకొని గృహస్థుడయ్యాడు. తరువాత గోపన్న దయార్ద్ర హృదయుడు కావటాన దానధర్మాలలో అతని సంపద కరిగిపోయింది. బంధువులైన అక్కన్న మాదన్నల ప్రాపకం సంపాదించి, క్రమంగా పాల్వంచ పరగణాకు తహసీల్దారయ్యాడు.

దమ్మక్క వలన భద్రాచలరాముని గురించి తెలుసుకొని గోపన్న ఆ దేవుని దర్శించి ఆయనకే అంకితమైపోయాడు. గోపన్న కార్యస్థానం భద్రాచలానికి మార్చుకొని శ్రీరామచంద్ర సేవాతత్పరుడయ్యాడు. శ్రీరామునికి మందిరం కట్టించాడు. అనేక కీర్తనలు రచించాడు. ప్రజలాయనను రామదాసని పిలుచుకున్నారు.

ఒకనాడు శ్రీరాముని ఆరాధనలో మైమరచిన రామదాసు తన కుమారుడు గంజిగుంటలో పడి అసువులు బాసిన సంగతిని కూడ గమనించలేదు. తెలుసుకొని 'ఎంత పని చేసితివి రామా' అని పరిపరి విధముల విలపిస్తూ ఆర్తితో రాముని ప్రార్థించాడు. శ్రీరాముని కరుణచేత బాలుడు తిరిగి జీవించాడు.

శ్రీరామునికి ఆభరణాలు, వాహనాలు చేయించడానికి ప్రజాధనం ఆరు లక్షలు వ్యయం చేసాడు రామదాసు. అందుకు సుల్తాను రామదాసుని బంధించి 12 ఏండ్ల శిక్ష విధించాడు. చిత్రహింసల పాలుచేసాడు. రామదాసు చెరసాలలో రాముణ్ణి తలచుకుంటూ దుఃఖిస్తూ చివరకు విషం తాగి ప్రాణాలు విడవడానికి సిద్ధమయ్యాడు. శ్రీరామునికి దయ కలిగి లక్ష్మణునితో కలిసి భటుల వేషంలో వచ్చి ఆరు లక్షల పైకం చెల్లించి రసీదు పుచ్చుకొని అంతర్ధానమయ్యాడు. రామదర్శనం పొందిన తానీషా తనకంటే అదృష్టవంతుడని భావించుకొని రామదాసు శేషజీవితాన్ని భద్రాచలంలో గడిపాడు. క్రీ.శ. 1650 ప్రాంతంలో రామదాసు తనువు చాలించాడు.

### 11.5.2. శతకం :

దాశరథి శతకంలో గోపన్న ఆర్తి, శరణాగతి, దాస్య భక్తి పెల్లుబికింది. ఆయన అనుభూతి అంతా అక్షర రూపం దాల్చింది. అది ధారా శుద్ధిని, శబ్దాలంకార ప్రియత్వమును, లోకోక్తి చమత్కృతిని పాటించడంలో పిండిత రంజకమైనది. ఇందులో 103 పద్యాలున్నవి. 59 ఉత్పలమాలలు, 43 చంపకమాలలతో శ్రీరామచంద్రుని పాదపద్మములను పూజించాడు.

### 11.5.3. కీర్తనలు :

భద్రాచలంలోని రామదాసు మండపంలో ఆయన రచించిన 220 కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. మతానికి సంబంధించిన ఆడంబరాలను, ఆచారాలను కొన్నింటిని రామదాసు తిరస్కరించాడు. మానవసేవయే మాధవసేవ అని భావించి,

పరగదీన జనుల యందు పక్షముదలచినదే చాలు
పరమాత్ముని యందు ప్రీతి బెట్ట నేల నౌ మనసా

అన్నాడు. శ్రీరాముని కాలంలో తాను జన్మించకపోతినే అని దిగులుపడ్డాడు. శతాబ్దాలు గడచినా రామదాసు కీర్తనలు మాధుర్యం హెచ్చిందే గాని తగ్గలేదు.

తెలుగు సాహిత్యంలో పదకవితకొక ప్రత్యేక స్థానమున్నది. పద్య కవిత పండితైక పరిమితం. పద కవిత పండితపామన జనపరవశత్వానికి హేతువు.

## 11.6. రాదగిన ప్రశ్నలు :

1. పద కవిత వైశిష్ట్యాన్ని తెలియజేయండి.
2. క్షేత్రయ్య పదకవితను వివరించండి.
3. అన్నమయ్య పదకవితను వివరించండి.
4. త్యాగయ్య కవితలోని సంగీత సాహిత్య విశేషాలు తెల్పండి.
5. రామదాసు భక్తి తత్త్వాన్ని తెలియజేయండి.

## 11.7. ఆధార గ్రంథాలు :


1. తాళ్ళపాక కవుల కృతులు, వివిధ సాహితా ప్రక్రియలు - వేటూరి ఆనందమూర్తి
2. తెలుగులో పదకవిత - ఎస్. గంగప్ప
3. తెలుగు వాగ్గేయకారులు - ఎస్. గంగప్ప
4. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతారావు



డాక్టర్ సి.హెచ్. సుశీలమ్మ
రీడర్, తెలుగుశాఖ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
గుంటూరు

## పాఠం - 12

# దక్షిణాంధ్రయుగ సాహిత్యం


12.0 లక్ష్యం
12.1 దక్షిణాంధ్రయుగ సాహిత్యం
12.2 మహారాష్ట్ర రాజుల తెలుగు సాహిత్య పోషణ
12.3 మధురాపుర ఆంధ్ర సాహిత్యం
12.4 జింజి సంస్థానం - ఆంధ్ర సాహిత్యం
12.5 యక్షగాన వాఙ్మయం
12.6 రాదగిన ప్రశ్నలు
12.7 ఆధార గ్రంథాలు


### 12.0 లక్ష్యం :

దక్షిణాంధ్రయుగంలో విలసిల్లిన సాహిత్యం, సంస్థానాధీశులు పోషించిన సాహిత్య వైభవం ఈ పాఠంలో తెలుసుకుంటారు.

### 12.1. దక్షిణాంధ్రయుగ సాహిత్యం :

తెలుగు సాహిత్య చరిత్రలో దక్షిణాంధ్ర యుగ సాహిత్య ఆవిర్భావం ఓ ప్రత్యేకతను సంతరించుకొని కనుపిస్తుంది. రాజులు ప్రత్యేక శ్రద్ధవహించి సాహిత్యాన్ని పెంచి పోషించిన పరిస్థితి ఇక్కడ ఉంది. విజయనగర చక్రవర్తులలో ప్రధానంగా శ్రీకృష్ణదేవరాయలు మధురలోను, అచ్యుత దేవరాయలు తంజావూరులోను దక్షిణ దేశ పరిపాలనకు తెలుగు నాయక రాజులను తమ ప్రతినిధులుగా, సామంతులుగా నియమించారు. ఆ నాయక రాజుల రాజ్య రక్షణ కోసం తెలుగు సైనికులను, వారితో పాటు రాజ వినోదం కోసం కవులు, పండితులు, గాయకులను తెలుగు దేశం నుండి దక్షిణ దేశానికి పంపారు. క్రీ.శ. 1665 లో జరిగిన తళ్ళికోట యుద్ధంతో విజయనగర సామ్రాజ్యం మహమ్మదీయుల వశమయింది. దాంతో తెలుగు దేశంలో కవులకు, గాయకులకు రాజాదరణ నశించింది. దాంతో తెలుగు దేశం నుండి వివిధ కళలకు చెందిన కళాకారులు అనేకులు మధుర, తంజావూరులలోని తెలుగు నాయక రాజులను ఆశ్రయించారు. రాజ్యపాలన వ్యవహారాలలోను, కవి పండిత పోషణలోనూ, కళాభివృద్ధిలోనూ ఆ రాజులు విజయనగర రాజుల మాదిరిగానే ఎంతో శ్రద్ధ వహించారు. దాంతో తెలుగు సాహిత్యం తెలుగు దేశపు ఎల్లలు దాటి ప్రధానంగా తంజావూరు, మధుర, జింజి, మైసూరు, పుదుక్కోట లాంటి కేంద్రాలలో ఇలా వెలసిల్లింది. క్రీ.శ. 17, 18 శతాబ్దాల సాహిత్య కాలాన్ని తెలుగు సాహిత్య చరిత్రకారులు దక్షిణాంధ్ర యుగమని ప్రత్యేకించి ఆంధ్ర వాఙ్మయ పరిణామంలో దాని ప్రాధాన్యాన్ని గుర్తించారు. ప్రక్రియ వైవిధ్యంలోనూ, రచనా స్వరూపంలోనూ, భాషశైలిలోనూ, సాహిత్య ప్రయోజనంలోనూ దక్షిణాంధ్ర దేశ కవులు కొంత ప్రత్యేకతను ప్రదర్శించారు.

దక్షిణాంధ్ర యుగ సాహిత్యంలో తొలిగా చెప్పుకోదగ్గ కృషి తంజావూరు నాయక రాజులు చేసారు. క్రీ.శ. 1613 నుండి 1631 వరకూ ఉన్న అచ్యుతప్ప నాయకుని కుమారుడు రఘునాథ నాయకుడు తెలుగు భాషకు చేసిన సేవ చాలా గొప్పది. కవి పండిత పోషణనూ, సరస సాహితీ సృష్టిలో, సంగీత విద్య ప్రావీణ్యంలో విశిష్టాద్వైత మతాభి నివేశంలోనూ, పరమత సహనంలోనూ ఈయన కృష్ణదేవరాయలుతో సహిపోలినవాడు. రఘునాథ నాయకుడు రచించిన కృతులలో వాల్మీకి చరిత్ర, శృంగార సావిత్రీ

ప్రబంధాలు, నలచరిత్ర ద్విపద కావ్యం, రఘునాథ రామాయణం చెప్పుకోతగ్గవి. ఈయన రచించిన ఇతర రచనలు లభ్య కావటంలేదు. ఈ రాజు ఆస్థానంలోని రామ భద్రాంబ, మధుర వాణి, చామకూర వేంకటకవి ప్రసిద్ధులు. అలాగే ఈ రాజు ఆస్థాన కవులలో విద్వత్కవి కృష్ణాధ్వరి ప్రముఖుడు. రఘునాథ భూపాలీయం, నైషధ పారిజాతా వాతారిక, కల్యాణ కౌముది, కందరర్ప నాటకం, శృంగార సంజీవని, తాళ్ళ చింతామణి అనేవి కృష్ణాధ్వరి రచించాడని చెబుతున్నా అవి లభ్యం కావటంలేదు. నైషధ పారిజాతీయం అనే నాలుగాశ్వాశాల ధ్వర్ధి కావ్యాన్ని కూడా ఈయన రాసాడు. దీనిలో నలచరిత్ర, పారిజాతాపహరణ కథ ఉన్నాయి. రఘునాథ నాయకుడి ఆస్థాన కవులలో కవి చౌడప్ప కూడా ఒకడు. రఘునాథ నాయకుడి తరువాత ఆయన కుమారుడు విజయరాఘవ నాయకుడు పాలనలోకొచ్చి తండ్రిని మించి తెలుగు సాహిత్య సేవ చేసాడు. ఈయన తన కొలువు కూటానికి రాజగోపాల విలాసం అని పేరు పెట్టాడు. విజయరాఘవ నాయకుడు తెలుగులో యాభై కృతులను రచించాడు. యక్షగాన ప్రక్రియను ఈయన విశేషంగా ఆదరించాడు. కాళీయ మర్దనం, కృష్ణ విలాసం, విప్రనారాయణ చరిత్ర, రఘునాథాభ్యుదయం, పూతనాహరణం, ప్రహ్లాద చరిత్ర అనేవి మాత్రమే లభ్యమవుతున్నాయి. వీటిలోనూ రఘునాథాభ్యుదయం, విప్రనారాయణ చరిత్ర మాత్రం ముద్రితమయ్యాయి. రఘునాథాభ్యుదయం అనే యక్షగానాన్ని రఘునాథ నాయకాభ్యుదయం అనే పేరున ద్విపద కావ్యంగా కూడా ఈయన రాసాడు. ఈయన గొప్ప శ్రీకృష్ణ భక్తుడు. ద్విపద కావ్యాలే కాక గోపికా భ్రమర గీతాలను తెనిగించటం, పాల్గుణోత్సవ రగడను, గోపాల దండకాన్ని, వీర శృంగార సాంగత్యం, సంపంగి మన్నారు సాహిత్యం, తదితర కావ్యాలను కూడా రచించినట్లుగా ఈయన చెప్పుకొన్నాడు. విజయ రాఘవుడి దగ్గర భోగపత్నిగా రంగాజమ్మ ఉండేది. పట్టపు కవిగా కామరసు వెంకటపతి సోమయాజి ఉండేవాడు. సంగీత సాహిత్యాలు ఒక వ్యసనంగా మారి వాటితోనే ఈయన చరిత్ర అంతమైంది. ఈయన కాలంలోనే యక్షగానానికి గొప్ప ఆదరణ లభించింది. విజయరాఘవుడి ఆస్థానంలో విదుషీమణులు కూడా గొప్ప పేరు తెచ్చుకున్నారు. చంద్రరేఖ, కృష్ణాతజీ, పసుపులేటి రంగాజమ్మ అలాంటి వారిలో ముఖ్యులు. వారు ఆశుకవితలో విశారదులు. రంగాజమ్మ విజయరాఘవుడి చేత కనకాభిషేకం కూడా పొందింది. ఆమె మన్నారుదాస విలాసం అనే యక్షగానాన్ని, మన్నారుదాస విలాస ప్రబంధాన్ని, ఉషాపరిణయ ప్రబంధాన్ని కూడా రచించింది. ఈమె రచించిన సంగ్రహ రామాయణం, భారత భాగవతాలు దొరకటం లేదు. ఈ రాజు ఆస్థానంలోనే చెంగల్వ కాళకవి, కోనేటి దీక్షితకవి చంద్రుడు, పురుషోత్తమ దీక్షితులు, కామరసు వేంకటపతి సోమయాజి అనే కవులు ఉండేవారు. విజయరాఘవ నాయకుడు ఆస్థాన కవులు, కవయిత్రులు అతడిని కథానాయకుడిగా స్వీకరించి యక్షగానాది కృతులను రచించారు. తంజావూరు నాయక రాజులలో చివరివాడు విజయరాఘవ నాయకుడి కుమారుడైన మన్నారు దేవుడు. ఈయన కూడా మంచి కవి. మన్నారు దేవుడు విజయరాఘవాభ్యుదయం, హేమాబ్జ నాయినా స్వయంవరం అనే రెండు గ్రంథాలను రచించాడు. వీటిలో విజయ రాఘవాభ్యుదయం దొరకటం లేదు. తంజావూరు నాయక రాజుల కాలంలో వెలువడిన ప్రతి రచనలోనూ ప్రజా జీవిత స్పర్శ ఉండటం విశేషం. రాజపరంగా శృంగారం, ప్రజాపరంగా హాస్యం ఆ రచనల్లో ఉన్నాయి. తంజావూరు నాయక రాజులు కవులను, గాయకులను, నాట్యగత్తెలను తమ ఆస్థానాలకు ఆహ్వానించి సత్కరిస్తూ కళా పోషణ చేసారు. విజయరాఘవ నాయకుడు క్షత్రయ్యను ఆహ్వానించి ప్రోత్సహించిన సంఘటన దీనికొక ఉదాహరణ.

## 12.2. మహారాష్ట్ర రాజుల తెలుగు సాహిత్య పోషణ :

దక్షిణాంధ్ర యుగ సాహిత్య వికాసంలో మహారాష్ట్ర రాజుల పాత్ర కూడా ఎక్కువగానే ఉంది. విజయ రాఘవ నాయకుడితో తంజావూరు నాయక రాజ్య వైభవం ముగిసింది. ఆ రాజ్యం మొదట మధుర నాయకులకు కైవసమైంది. కానీ ఆ తరువాత అతి కొద్ది కాలంలోనే శహాజీ కుమారుడు, ఛత్రపతి శివాజీ సవతి సోదరుడైన మొదటి ఏకోజీ ఆధీనంలోకి మధుర వచ్చింది. దాంతో ఆంధ్రుల అధికారం అక్కడ అంతరించింది. కానీ ఆంధ్ర సాహిత్యానికి ఆదరణ మాత్రం తగ్గలేదు. తమ మాతృ భాష మహారాష్ట్రమైనా తాము పాలించిన దేశం తమిళ దేశమైనా మహారాష్ట్ర రాజులు తెలుగు భాషను నేర్చుకొని తెలుగులో కావ్య రచనలు కూడా చేసారు. నాయక రాజుల్లాగానే మహారాష్ట్ర రాజులు కూడా తెలుగు కవి, పండిత, గాయకులను ఆదరించి పోషించారు. మొదటి ఏకోజీ కవి

పండిత పోషణలో అపర భోజరాజని కీర్తిని కూడా పొందాడు. సంస్కృత భాషలో ఆయన శబ్దరత్న సమన్వయం, శబ్దార్థ సంగ్రహం అనే నిఘంటువులను రచించాడు. తిరువళ వల్లూరు అనే గ్రామానికి శహాజీ రాజపురం అని పేరు పెట్టి నలభై ఆరు మంది సంస్కృత విద్వాంసులకు దాన మిచ్చాడు. నాయక రాజులలో రఘునాథ నాయకుడు ఎలాంటి వాడో మహారాష్ట్ర రాజులలో శహాజీ అలాంటివాడు. తెలుగు భాషలో ఈయన రచనలు నలభైదాకా ఉన్నాయి. వాటిలో నాలుగు ప్రబంధాలు, మిగిలినవి యక్షగానాలు. యక్షగానాలలో ద్రౌపదీ కల్యాణం, శాంతా కల్యాణం, వల్లీ కల్యాణం, సీతా కల్యాణం, రతీ కల్యాణం, విఘ్నేశ్వర కల్యాణం లాంటివి. అలాగే కృష్ణలీలా విలాసం, సతీపతి దాన విలాసం, కిరాత విలాసం, భక్త వత్సల విలాసం, లాంటివి కూడా ఉన్నాయి. రుక్మిణి సత్యభామ సంవాదం, గంగా పార్వతీ సంవాదం, జలక్రీడలు, పంచరత్న ప్రబంధ నాటకం, త్యాగరాజ వినోద చిత్ర ప్రబంధ నాటకం, రామ పట్టాభిషేకం, శచీ పురందరం, తదితర యక్షగానాలను కూడా శహాజీ రచించాడు. శహాజీ ఆస్థాన కవులలో నివర్తి శేషాచలపతి, దర్భాగిరి రాజకవి, బాలకవి సుబ్బన్న, వాసుదేవ కవి అనే వారు ముఖ్యులు. శహాజీ తరువాత ఆయన సోదరులిద్దరూ మొదటి శరభోజీ, తులజాజి (తుక్కజీ) కూడా సాహిత్యపోషణ చేసారు. మొదటి శరభోజి సంస్కృత భాషాభిమాని. ఈ కారణంగా ఆయన రాఘవ చరిత్ర అనే కావ్యాన్ని రచించాడు. ఆయన ఆస్థాన కవి అయిన పంచరత్న కవి అని బిరుదు పొందిన అనంత నారాయణుడు ఈ గ్రంథాన్ని రాసాడని కొందరంటారు. మొదటి శరభోజి ఆస్థాన కవి అయిన జగన్నాథ కవి సంస్కృతంలో రతీ మన్మథ నాటకం, శరభరాజ విలాసం అనే వాటిని రచించాడు. దర్భా గిరిరాజ కవి మొదటి శరభోజీ మీద తెలుగులో కొన్ని పదాలను, కీర్తనలను రాసాడు. శహాజీ రెండో తమ్ముడు తులజాజి. ఈయనకే తుక్కోజీ అనే పేరు కూడా ఉంది. ఈయన, ఈయన కుమారుడు రెండో ఏకోజీ కూడా గొప్ప గొప్ప కావ్యాలను రచించారు. శరభోజీ కుమారుడు రెండవ శివాజీ తెలుగులో అన్నపూర్ణా పరిణయం అనే యక్షగానానికి కర్త. రెండో శరభోజీ కాలంలోనే మహాభక్తుడు నాద బ్రహ్మ కాకర్ల త్యాగరాజు (త్యాగ రాజ స్వామి) ఉండేవాడు. ఆయన రచించిన నౌకా విజయం లాంటివి ఈ నాటికీ బహుళ ప్రచారంలో ఉన్నాయి. తంజావూరు నాయక రాజుల కాలంలోనూ, మహారాష్ట్రుల కాలంలోనూ యక్షగాన వాఙ్మయమే విరివిగా వచ్చింది. ఇలా ఆ రాజులు తెలుగు భాషకు ఓ ప్రత్యేకమైన సేవ చేసారు.

## 12.3. మధురాపుర ఆంధ్ర సాహిత్యం :

మధురలో తెలుగు నాయక రాజుల పాలన క్రీ.శ. 1532 లో ప్రారంభమైంది. తంజావూరు నాయక రాజులు, మహారాష్ట్ర రాజులలాగా ఈ రాజులకు ప్రశాంత జీవితం ఉండేది కాదు. తరచు యుద్ధాలు చేయాల్సి వచ్చేది. దాంతో కొద్దిగా సాహిత్య సేవలో వీరు వెనుక పడ్డారనే చెప్పాలి. క్రీ.శ. 1529 - 1564 మధ్య కాలంలో పాలించిన విశ్వనాథ నాయకుడి కాలంలో రాయవాచకం రచన జరిగింది. రాయల సామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రక వచన గ్రంథమిది. క్రీ.శ. 1623 - 1629 మధ్య కాలంలో ఉన్న మధుర తిరుమల నాయకుడు క్షేత్రయ్యను, తిరుకాయ కవిని సత్కరించినట్లు ఉంది. తిరుమల నాయకుడి కుమారుడు రెండవ ముద్దు వీరప్ప నాయకుడు అతని పుత్రుడైన చొక్కనాథుడు తెలుగు సాహిత్య సేవకు పూనుకోలేదు. మధురలో సాహిత్య పోషణకు శ్రీకారం చుట్టిన వాడు రెండవ ముద్దు వీరప్ప నాయకుని రెండవ కుమారుడైన ముత్తులింగ నాయకుడు. ఈయననే ముద్దళగిరి అనేవారు. ఈయన క్రీ.శ. 1675 లో ఒక్క సంవత్సర కాలం పాటు మాత్రమే మధురను పాలించాడు. ఆయన తరువాత చొక్కనాథుడి మనుమడు మూడవ ముద్దు వీరప్ప నాయకుడి కుమారుడు అయిన విజయ రంగ చొక్కనాథుడు ఒక్కడే తెలుగును బాగా పోషించిన రాజకవి. ముద్దళగిరి ఆస్థానంలో శ్రీకామేశ్వర కవి, గణపవరపు వేంకటకవి అనే ఇద్దరు తెలుగు కవులుండేవారు. ముద్దళగిరి తన అన్న అయిన చొక్కనాథుడికి ధేనుకా మాహాత్మ్యాన్ని అంకితం ఇచ్చాడు. విజయ రంగ చొక్కనాథుడు (క్రీ.శ. 1706 - 1732) కాలంలో ప్రబంధ వాఙ్మయం వెలసిల్లింది. విజయరంగ చొక్కనాథుడు స్వయంగా శ్రీరంగ మాహాత్మ్యం, మాఘ మాహాత్మ్యం అనే రెండు వచన గ్రంథాలను రచించాడు. ఇలా మధుర నాయక రాజులలో ఈయనొక్కడే గ్రంథకర్తగా మిగిలిపోయాడు. ఈయన ఆస్థాన కవులలో సముఖం వేంకట కృష్ణప్ప నాయుడు ముఖ్యుడు. ఈయన మంత్రి

వెంగల శీనయ్య రామరాజ చరిత్రను రచించాడంటారు. మంచి వైణికుడుగా కూడా శీనయ్యకు పేరుంది. అలాగే శేషము వేంకటపతి, కుందుర్తి వేంకటాచలపతి అనే కవులు ఈ కాలంలో ఉండేవారు.

## 12.4. చెంజి (జింజి) సంస్థానం తెలుగు సాహిత్యపోషణ :

జింజికే చెంజి అని కూడా పేరుంది. మధుర, తంజావూరులకు పాండ్య, చోళ మండలాలు అని ప్రసిద్ధి ఉన్నట్లే చెంజికి కూడా తుండీర మండలం అని ప్రసిద్ధి ఉంది. చెంజి నాయకులు కూడా తంజావూరు, మధుర నాయకులతో సంబంధ బాంధవ్యాలను ఏర్పరుచు కొన్నారు. చెంజిలో క్రీ.శ. 1550 లో సూరప్ప నాయకుడు సాహిత్య పోషణ చేసాడు. ఈయన ఆశ్రయంలో రత్న ఖేట శ్రీనివాస దీక్షితులు ఉండేవాడు. దీక్షితులు భావనా పురుషోత్తమం అనే అయిదంకాల నాటకాన్ని రచించి సూరప్ప నాయకుడికి అంకితమిచ్చాడు. భైష్మీ పరిణయం అనే చెంపు కావ్యాన్ని కూడా రచించాడు. బాలశయన వెంకటకవి సంస్కృతంలో విబుధానంద ప్రబంధం అనే చెంపూ కావ్యాన్ని రాసాడు. చెంపూ రామాయణాన్ని రచించిన ఋగ్వేద కవి వేంకటాచలపతి గురువు తిరువేంగళార్య కవి చెంజి రాజు వరదేంద్రుడి ఆస్థానంలో ఉండేవాడు. వరదేంద్రుడు (క్రీ.శ. 1645 - 1649) చెంజిని పాలించాడు. కువల యాశ్వ చరిత్రం అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించిన సవరము చిననారాయణ నాయకుడు, ఈ వరదేంద్రుడు సమకాలికులు. చెంజి సేనాధిపతి తుపాకుల కృష్ణప్ప (క్రీ.శ. 1637 - 1649) మీదనే క్షేత్రయ్య "తుపాకుల వేంకట కృష్ణప్ప" అనే ముద్రతో పదాలను చెప్పాడు. తుపాకుల అనంత భూపాలుడు. ఇతడు మధుర రాజుల దగ్గర దళవాయిగా ఉండేవాడు. ఇతడు భారత వచన రచనలో కళువె వీరరాజుకు కొంత వరకూ సహాయం చేసాడు. అనంత భూపాలుడు విష్ణు పురాణం, మహా భారతం అనుశాసనిక పర్వం, రామాయణ సుందర కాండము. భగవద్గీత అనే వచన గ్రంథాలను రచించాడు. అయితే వీటిలో విష్ణు పురాణం ఒక్కటే లభ్యమవుతోంది. ఈయన సంస్కృతాంధ్రాలలో మంచి పండితుడు.

జింజి పాలకుల లాగానే మైసూరు రాజ్య పాలకులు, పుదుక్కోట పాలకులు వారితో పాటు కొందరు సంస్థానాధిపతులు కూడా తెలుగు సాహిత్య వికాసానికి ఎంతగానో కృషి చేసాడు.

### 12.5.1. యక్షగాన వాఙ్మయం :

యక్షపాత్ర వేషధారణలే చేసే గాన ప్రధాన వినోద క్రీడను యక్షగానం అంటారు. అయితే గాన ప్రధానంగానే మిగిలిపోక ప్రదర్శనలో నృత్త, నృత్యాంత్మకమైనది గానూ, రూపక పద్ధతికి ఉపయుక్తమైన రచన గానూ పరిణామం చెందిన సాహిత్య ప్రక్రియ కూడా యక్షగానమే అన్నది పండితాభిప్రాయం. యక్షగానం అనే పదాన్ని తొలిగా శ్రీనాథమహాకవి పేర్కొన్నాడు. దీన్ని ఆయన ఒక విధమైన గాన పణితి అని చెప్పాడు. యక్ష గానాన్ని ఒకప్పుడు జక్కుల జాతివారు ప్రధాన వృత్తిగా అవలంబించినట్లు కనుపిస్తుంది. యక్ష శబ్దం క్రమంగా అలా జాతి వాచకంగా కూడా మారింది. యక్షగానాలను ప్రయోగించిన కారణంగానే యక్షులు, జక్కులు అనే పేరు వచ్చింది.

తాళ్ళపాక అన్నమాచార్యుడు సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణం అనే గ్రంథాన్ని ఆయన మనుమడైన తాళ్ళపాక చిన్నన్న తెలుగులోకి అనువదించాడు. ఆ గ్రంథంలో యక్షగాన పదాలను గురించిన వివరణ కనుపిస్తుంది. తాళ్ళ బహుళములు, నవరసాలంకృతములు అయిన పలువిధాల పదాలతో కూడినవి యక్షగానాలని ఆ గ్రంథంలో వివరణ ఉంది. అయితే ప్రాచీన తెలుగు లాక్షణికులు ఎవరూ కూడా యక్షగానానికి కచ్చితమైన నిర్వచనాన్ని చెప్పలేదు. ఈ యక్షగాన రచన క్రీ.శ. 1500 ప్రాంతంలబి కొంత వరకూ సాగింది.

గానాత్మకంగా కేవలం గేయ రూపంలో మాత్రమే ఉండటం యక్షగాన చరిత్రలో తొలి దశగా కనుపిస్తుంది. అది దేశి ఛందస్సుల లోని విడివిడి పాటల సంపుటీకరణం అయి ఉంటుంది. లేదా కథాత్మకం అయినా అయివుండవచ్చును. ఈ

యక్షగాన ప్రాథమిక స్వరూపాన్ని భీమేశ్వర పురాణోదాహరణాన్ని బట్టి గానరూప స్తోత్ర పాఠమని, క్రీడాభిరామోదాహరణాన్ని బట్టి గాన, రూప కథాఖ్యానమని కూడా నిర్ణయించారు. యక్షగానాలకు సంబంధించిన గానాత్మకమైన మొదటి పాటలనే జక్కుల రేకులు అని అంటారు. తెలుగులోని తొలినాటి యక్షగానాలలో వచన భాగం కొద్దిగా మాత్రమే ఉండేది. ఒక స్త్రీ గానీ, పురుషుడు కానీ వీటిని గేయ రూపంలో హావభావాలతో చదవటం కానీ పాడటం కానీ చేస్తుండేవారు. ఇలాంటి వాటికి క్రీ.శ. 1485 - 1509 కాలానికి చెందిన ప్రోలుగంటి చెన్నశౌరి రచించిన సౌభరిచరితం అనే జక్కుల కథను ఉదాహరణగా చెబుతారు. యక్షగాన పరిణామ చరిత్రలో ద్వితీయ దశ సంవాద రూపంగా కనుపిస్తుంది. కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం, చక్రపురి రాఘవాచార్యుడు రచించిన విప్రనారాయణ యక్షగానాలు దీనికి ఉదాహరణ. ఈ ప్రక్రియలో మూడవదశ యక్షగానానికి, వీధి నాటకానికి భేదం లేకుండా వుండటం. ఈ మార్పు క్రీ.శ. 17వ శతాబ్దంలో తంజావురి నాయక రాజుల కాలంలో వచ్చింది. రఘునాథ నాయకుడు రుక్మిణీ కృష్ణ వివాహం అనే యక్ష గానాన్ని రచించినట్లు తెలుస్తోంది. ఆయన కుమారుడైన విజయరాఘవ నాయకుడి కాలంలో ఈ కళా ప్రక్రియ తారస్థాయికి చేరింది. యక్ష గానానికి, వీధి నాటకానికి భేదం లేకపోవటానికి రెండు కారణాలు కనుపిస్తున్నాయి. యక్ష గానం వీధి నాటక గుణాలను కలిగి ఉండటం, యక్ష గానాలు, వీధి నాటకాలు ఒకటే అవటం. విజయరాఘవుడి రఘునాథనాయకాభ్యుదయం, పసుపులేటి రంగాజమ్మ మన్నారుదాస విలాసం లాంటి అనేక యక్షగానాలు దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఆ తరువాత కాలంలో పౌరాణిక ఇతి వృత్తాలతో కూడిన యక్షగానాల స్థానంలో పోషకులైన రాజుల జీవిత ఖండాలు యక్ష గానాలకు కథా వస్తువులయ్యాయి. ఈ వరుసలోనే శృంగార ప్రధానంగా ఉండే యక్షగానాలు కూడా వచ్చాయి. దేశి ప్రక్రియ అయిన యక్షగానాలలో కాలక్రమంలో మార్గ నాటక ఛాయలు కొన్ని ప్రవేశించాయి. మార్గ నాటకాలలోని విష్కంభాలు కథోద్ఘాతాది పాత్ర ప్రవేశ సూచకాలు మాత్రం యక్ష గానాలలో కనుపించవు. కవి, హెగ్గడి కత్తె లాంటి వారు వచ్చి కథా సంధానం చేస్తుంటారు. నేపథ్యంలో ఉండాల్సిన కవి రంగం మీదికి వచ్చి నాటక గత పాత్రలతో కలసి నటించటం యక్షగానాలలోని ప్రత్యేకతగా అయింది. ఈ యక్షగానాలు ఆంధ్ర దేశంలోనూ, ఆంధ్రేతర ప్రాంతాలలోనూ ఆనాడు చాలా ఎక్కువగా ప్రదర్శితమవుతూ ఉండేవి. వీటికి ప్రజాదరణ, రాజాదరణ ఉండటమే దీనికి కారణం. ఈ యక్షగానం "సర్వోపభోగ్యమైన సమాహార కళాస్వరూపమై వివిధ ప్రక్రియాను బంధురమై బహువిధ పద కవితల పాలవెల్లియై అతి మాత్ర వస్తు రసచ్ఛందో భాషా వైవిధ్య భాసురమై భిన్న దేశ భిన్నకాల భిన్న కవ్యుపగ్నమై అనేక లోకవృత్త విశేష ప్రదర్శకమై ఆంధ్ర జాతీయ రూపక కళా సర్వస్వ ప్రతినిధియై అన్యభాషీయులకు అనుకార్యమై యావదాంధ్ర వాఙ్మయమున బహుముఖ వైవిధ్యమూ, వైశిష్ట్యమూ కలిగి విశాల సారస్వత శాఖగా వెలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటే" అని డాక్టర్ ఎస్వీ. జోగారావు గారు అన్న మాట అక్షరసత్యం.

### 12.5.2. వచన వాఙ్మయం :

తెలుగు సాహిత్య చరిత్ర ప్రస్థానంలో వచన వాఙ్మయం ఓ మలుపు లాంటిది. తెలుగులో గద్యం అనే పదానికి వచన మనేది ప్రస్తుతం సమానార్థకంగా వాడుకలో ఉంది. అయితే గద్యానికి, వచనానికి కొంత తేడాను కూడా పండితులు చెప్పారు. తెలుగులో గద్యం పద్యం కంటే పూర్వమే వెలసినా పద్యం సాహిత్య స్థితి పొందినంత తొందరగా గద్యం పొందలేకపోయింది.

సంస్కృత లాక్షణికులు, నైఘంటికులు, రచయితలు, నిశ్ఛంద రచనా విభాగాన్ని గద్యం అని పేర్కొన్నారు. గద్యానికి పర్యాయ పదంగా వారు వచనాన్ని వాడలేదు. సంస్కృతంలో లాగానే నన్నయ్య కూడా వచనము అనే పదాన్ని రచన విధానము అనే అర్థంలో వాడలేదు. నన్నయ్య వచనం అనే పదాన్ని మాటాడబడిన అనే అర్థంలో వాడాడు. సూటిగా, తేటతెల్లంగా ఉండే నోటిమాటకు ప్రతిరూపమే వచనం. ప్రాచీనుల దృక్పథంలో గద్యం వచన స్థితికి, పద్య స్థితికి మద్యలో ఉన్న ప్రక్రియ. పాద నియమం లేక మాత్రాగణ ప్రధానమై నమస్కారగద్య, కైవారగద్య తదితర గద్యలు ఉన్నాయి. వచనానికి కవిత్వరూపాన్ని సమకూర్చే ప్రయత్నమే గద్యరచన, ఛందోరహితమై శ్రుతిలయాన్వితమై అలంకారిక రీతి, భావ ప్రాధాన్యమూ ఉన్న వచనాన్ని గద్య అని అంటారు. "గద్య పద్యమయం కావ్యం చెంపూరిత్యభీ యతే" అని దండి మహాకవి చెప్పాడు. దీన్నిబట్టి చూస్తే గద్యతో కూడిన పద్య కావ్యమే

చెంపూ కావ్యం అవుతుంది. కావ్యంలో పద్యంతో పాటు గద్యానికి గౌరవం ఉందని దీన్ని బట్టే తెలుస్తుంది. సంస్కృతంలో గద్యము అనే అర్థంలో ఉన్న భావాన్నే కన్నడిగులు వచనము అని ఉపయోగించారు. తెలుగు కవులు వచనము అనే పదాన్ని గ్రహించి ఉంటారు అని అనడంలో సందేహం లేదు అని డాక్టర్ ఎమ్. కులశేఖరరావు అన్నారు. గద్యము, వచనము అనే రెండు పదాలను సమానార్థకాలుగా, పర్యాయపదాలుగా తిక్కన మహాకవి తన నిర్వచనోత్తర రామాయణంలో ప్రయోగించాడు. ఛందోరహితమై నియమిత పరిమితి లేని వాక్య రచనకు గద్యము అని పేరు. కావ్యాలంకార సూత్ర వృత్తిని రచించిన వామనుడు ఈ గద్యాన్ని వృత్త గంధి, చూర్ణిక, ఉత్కలిక, ప్రాయము అని మూడు విధాలుగా విభజించాడు. నన్నయ్యకు ముందు, నన్నయ్య కాలంలోనూ వచన ప్రక్రియ ఉన్నట్లు శాసనాలవల్ల తెలుస్తుంది.

తెలుగులో పద్య విద్యకే కాక గద్య విద్యకు కూడా ఆద్యుడు నన్నయ్యే. నన్నయ్య నాటికి గద్య పద్య మిశ్రితమైన చెంపూ కావ్య పద్ధతి హృద్య రచనగా ప్రసిద్ధి చెందింది. కథన, సంవాద, వివరణాదులకు, వర్ణనలకు నన్నయ్య వచనాన్ని వాడాడు. ఆశ్వాసాంత గద్యలలో కవి స్వీయ వృత్తాంతం, బిరుదాదులు ఉంటాయి. ఇది బిరుదు గద్యకు సమానమైనది. బిరుదు గద్యలు సంబోధనలో ఉంటాయి. ఆశ్వాసాంత గద్యలు ప్రథమ పురుషలో ఉంటాయి. శివకవులు ప్రజాభ్యుదయ దృష్టి కలవారే అయినా వచనాలను రచించలేదు. వ్యాఖ్యలకు వివరణలకు పూర్వ కవులు ఈ వచనాన్ని వాడారు. ఛందో వ్యాకరణ అలంకారాది గ్రంథాలలోని వివరణ భాగాలన్నీ వచన లక్షణానుసారంగా వ్యావహారిక భాషలో రాస్తుండేవారని గిడుగు రామ్మూర్తి పంతులు చెప్పారు. కైఫీయతేలు అనే పేరున స్థానిక చరిత్రలను నాటి గ్రామోద్యోగులు రాసారు. వీటిలో శిష్ట వ్యవహార భాషను వాడేవారు.

తెలుగులో కేవలం వచనంలో ఉన్న కావ్యాలు వచ్చాయి. వచన కావ్యాలలో చారిత్రక వచన కావ్యాలు, వచనైక పురాణాలు, క్షేత్ర మహాత్మ్యాదులు ఉన్నాయి. చిన్నయ్య సూరి నిర్ణయించిన నియమాలను పాటిస్తూ తెలుగు వచన రచన క్రీ.శ. 20వ శతాబ్ది ప్రథమ పాదం చివరి వరకూ జరిగింది. తెలుగు వచన రచనలో పానుగంటి లక్ష్మీ నరసింహారావుకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. సరళ గ్రాంథిక భాషలో ఈయన రచన కనుపిస్తుంది. విద్యా వ్యాప్తి వల్ల పఠితల సంఖ్య పెరిగి వచన గ్రంథాల అవసరం ఎక్కువైంది. సంస్కృతం నుండి అనేక పురాణాలు, ఇతిహాసాలు వచనంలోనే అనువాదంలోకి వచ్చాయి. చరిత్ర, రాజనీతి తదితర శాస్త్రాల విషయాలు తెలుగులో వచనంలోనే ఉన్నాయి. కథలు, నవలలు అన్నీ వచన ప్రక్రియలోనే వచ్చాయి. వ్యాసాలు, కథానికలు, కథలు వంటివి వ్యావహారిక వచనంలో రాసి తెలుగు రచయితలు వచన రచనను పరిపుష్టం చేసారు.

### 12.5.3. శతక వాఙ్మయం :

తెలుగు సాహితీ ప్రక్రియలలో శతక ప్రక్రియ ఓ శక్తిమంతమైన ప్రక్రియ. సంస్కృత, ప్రాకృత భాషలలోని శతకమే తెలుగులో కొన్ని విశిష్ట లక్షణాలతో అవతరించింది. సంస్కృత, ప్రాకృత శతకాలలోని సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందో నియమం, రస నియమం, ఆత్మాశ్రయ కవితా ధర్మం అనే లక్షణాలు తెలుగు శతకాలలో రూపు దిద్దుకున్నాయని డాక్టర్ కె. గోపాలకృష్ణా రావు అన్నారు. సామాన్యంగా శతకంలో నూరు పద్యాలకు బదులు నూట ఎనిమిది పద్యాలుండటం కనుపిస్తుంది. ఈ సంఖ్యా నియమం భక్తి శతకాలలో మరింతగా ఉంది. తొలుత భక్తి శతకాలలో పాటించిన ఈ నియమమే క్రమంగా ఇతర శతక రచనల విషయంలో కూడా వాడుకలోకి వచ్చింది. దీనికి కారణం భగవంతుడి స్తోత్రాలను చెప్పేటప్పుడు అష్టోత్తర శతం ఉండటం సంప్రదాయంగా ఉంది. అదే దీనికి కూడా పునాదైంది. కొందరు శతక కర్తలు కావ్యాలలో మాదిరిగానే అవతారికలను చేర్చి సంఖ్యా నియమాన్ని సడలించారు. తెలుగు శతకంలో ఈ సంఖ్యా నియమం లక్షణానుసారంగా వచ్చిందని డాక్టర్ జి. నాగయ్య పేర్కొన్నారు. ప్రాచీన సంస్కృత శతకాలలో మకుట నియమం కొన్నిటిలో పాటించినా అనంతర కాలంలో వెలువడిన శతకాలలో నియమాన్ని సడలించారు. తెలుగు శతకాలలో మకుటం వివిధ రీతులలో ఉన్నా వాటిలో సంబుధ్యంత మకుటాల సంఖ్య అధికంగా ఉంది. ఈ మకుటం అన్యాంకితం, ఆత్మాంకితం అని రెండు విధాలుగా ఉంది. పద మకుటాలు, సమాస

మకుటాలు, అర్థపాద మకుటాలు, ఏకపాద మకుటాలు, ద్విపాద మకుటాలు కూడా ఉన్నాయి. కొందరు శతక కర్తలు పద్య పాదాంతంలో కాక పద్య ప్రారంభంలో మకుటాలను ప్రయోగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. మకుట నియమం ఉన్న తెలుగు శతకాలలో సాధారణంగా వృత్త నియమమో, పద్య నియమమో తప్పనిసరిగా పాటించటం జరిగింది. అంటే శతక కవి చంపకమాలతోనో, ఆటవెలదితోనో ఇలా మరి ఇంకేదైనా ఛందస్సుతోనో శతకాన్ని ప్రారంభిస్తే శతకం అంతా ఒకే రకమైన ఛందస్సులో ఉండే పద్యాలే ఉంటాయి. తెలుగు శతక కర్తలు ఈ ఛందో నియమాన్ని సంస్కృత కవుల నుంచే గ్రహించారు. శతకాలలో ఉండే పద్యాలు వేటికవి స్వతంత్ర భావాలతో ఉంటాయి. అందుకే శతకాలను ముక్తక కావ్యాలు అని కూడా అంటారు. ఇలా వస్త్వైక్యం లేక పోవటం చేత శతక రచనలో రస పోషణకు అంతగా అవకాశం లేదు. అయితే తెలుగులో శృంగార, భక్తి, హాస్యరస ప్రధానాలైన శతకాలు కూడా కొన్ని ఉన్నాయి. శతక కవి తన శతక రచన ద్వారా ఉత్తమ నీతి మార్గాన్ని బోధిస్తూ సంఘానికి ఎంతో మేలు చేస్తుండటంతో ఆ కవులకు గొప్ప గుర్తింపు కూడా వచ్చింది. కొన్ని శతకాలలో కవులు ధర్మతత్వ ప్రబోధం సమకాలీన సాంఘిక పరిస్థితుల వర్ణన కూడా చేసారు. ఇంకొంత మంది భాగవత, రామయణాది కథా సంగ్రహాలను శతకాలుగా చెప్పిన సందర్భాలున్నాయి. ఈ శతక రచన సంస్కృత, ప్రాకృత కన్నడ తదితర భాషలలో వెలువడ్డా తెలుగులో వీటికి గొప్ప ప్రచారం లభించింది. అందుకే శతక సాహిత్యం తెలుగునాట విస్తృతంగా వచ్చింది. మతపరంగా, భక్తిపరంగా, శృంగారాది రసపరంగా శతకాలు వచ్చినట్లే అధిక్షేప శతకాలు కూడా వచ్చాయి.

సమకాలీన సాంఘిక, రాజకీయ వ్యవస్థలో కలిగిన మార్పులు, సామాజికుల అసంతృప్తి, నైతిక విలువల పతనం ఇలాంటివి అధిక్షేప శతకాలలో కనుపిస్తాయి. వీటితో పాటుగా వ్యాకరణం, నిఘంటు, ప్రహేళికా వివిధ శాస్త్ర శతకాలు కూడా వచ్చాయి. శతక రచన ఆవిర్భావం నుండి నేటి దాకా ఎప్పటి కప్పుడు నిత్య నూతనంగానే వర్ధిల్లుతూ వస్తోంది.

### 12.5.4. వేమన :

ప్రజాకవిగా, తిరుగుబాటు కవిగా, లోకకవిగానే కాక అవతార పురుషుడిగా, యోగిగా కూడా మన్ననలందుకున్న ఘనత వేమనకు దక్కుతుంది. వేమన ఊరు, పేరు, కాలం లాంటి విషయాలలో ఎన్నో అభిప్రాయ భేదాలున్నా మంచి పద్య కవిగా ఆయన్నంతా ఒప్పుకున్నారు. భక్తి, నీతి, శృంగార, వైరాగ్య, తత్త్వ, హాస్య ప్రధానంగా పద్య రచన చేసిన వేమనకు శతక సాహిత్యంలో ఓ విశిష్ట స్థానముంది. వేమన పద్యాలు భాషలో, భావంలో, శైలిలో అచ్చమైన తెలుగుదనాన్ని కలిగి అధిక్షేప కావ్యరీతికి శ్రీకారం చుట్టాయి. ఆయన పద్యాలు సహజ గమనం కలిగి ఉంటాయి. వాటిలో రెండు పదాలకు పైన సమాసం ఉండదు. సూటిగా అన్వయ కాఠిన్యం లేకుండా నిష్ఠూరంగా వేమన పద్యాలుంటాయి. పదాల కూర్పులో పొందిక, ఒద్దిక, చేవ ఉంటాయి. ఒకసారి వినగానే మనసు కెక్కి, నోటబట్టి ఉండి పోవటం వేమన పద్యాలలో ఉండే సహజ గుణం. వేమన హేతువాద బుద్ధితో పద్య రచన చేసాడు.

"గుహలలోనఁ జొచ్చి గురువుల వెదకంగఁ గ్రూరమృగ మొకండు తారసిలిన ముక్తి మార్గ మదియె ముందుగాఁ జూపురా" అని అధిక్షేపించిన పద్యాల లాంటి పద్యాలు మనిషిలో సక్రమంగా ఆలోచించే చైతన్యాన్ని కలుగ చేసేవిగా ఉంటాయి. ఇంతటి మహనీయుడు కనుకనే తెలుగు సాహిత్య చరిత్రలో వేమనకు అంతటి గొప్ప స్థానం లభించింది.

### 12.6. రాదగిన ప్రశ్నలు :

1. దక్షిణాంధ్ర యుగంలోని సాహిత్య ప్రత్యేకతను వివరించండి.
2. మధురాపుర రాజుల సాహిత్య పోషణను తెల్పండి.
3. జింజి సంస్థానాధీశుల సాహిత్య పోషణను తెల్పండి.

## 12.7. ఆధార గ్రంథాలు :


1. ఆంధ్రుల చరిత్ర - చిలుకూరి వీరభద్రరావు
2. ఆంధ్ర సంస్థానములు, సాహిత్య పోషణము - ప్రొ॥ తూమాటి దొణప్ప
3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర



డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు
లెక్చరర్, హిందూ కళాశాల
గుంటూరు - 522 001.

## పాఠం - 13

# దక్షిణాంధ్రయుగం - సాహిత్య వైభవం

13.0 లక్ష్యం
13.1 రఘునాథ నాయకుని జీవిత విశేషాలు - కృతులు
13.2 రఘునాథ నాయకుని కవితారీతులు
13.3 విజయరాఘవ నాయకుని జీవిత విశేషాలు - కృతులు
13.4 చేమకూర వేంకటకవి జీవిత విశేషాలు - కృతులు
13.5 చేమకూర వేంకటకవి కవితారీతులు
13.6 రాదగిన ప్రశ్నలు
13.7 ఆధార గ్రంథాలు

### 13.0. లక్ష్యం :

దక్షిణాంధ్ర యుగంలో నాయక రాజులైన రఘునాథ నాయకుడు, విజయరాఘవ నాయకుడు రచించిన కృతుల సమీక్ష, చేమకూర వేంకటకవి కవితా చమత్కారం ఈ పాఠంలో తెలుసుకుంటారు.

### 13.1. రఘునాథ నాయకుని జీవిత విశేషాలు - కృతులు :

విజయనగర సామ్రాజ్యాన్ని అచ్యుతరాయలు పాలించే కాలంలో క్రీ.శ. 1550 ప్రాంతాల్లో ఆయన ఆదరాభిమానాలతో తంజావూరిలో చెవ్వప్ప నాయకుడు రాజయ్యాడు. అతని అనంతరం అతని కుమారుడు అచ్యుతప్పనాయకుడు క్రీ.శ. 1580 ప్రాంతాల్లో రాజై రెండు దశాబ్దాలపాటు పరిపాలించాడు. పిదప క్రీ.శ. 1600ల నుండి రాజ్యపాలనా భారాన్ని కుమారుడైన రఘునాథ నాయకునికి అప్పగించాడు. రఘునాథ నాయకుని పాలనా పాటవంతో దక్షిణాంధ్ర సామ్రాజ్యం విస్తరించింది. సాహితీలత మొగ్గ తొడిగి మూడు పువ్వులు ఆరు కాయలుగా విలసిల్లింది. ప్రత్యేకించి దక్షిణాంధ్రలోని తంజావూరు, మధుర, పుదుక్కోటి, చెంజి, మైసూరు మొదలైన రాజ్యాల్లో, ఉత్తరాంధ్రలోని పెద్దాపురం, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో ఆంధ్ర సాహిత్యం అనితరసాధ్యంగా అభివృద్ధి చెందింది.

రఘునాథ నాయకుడు తన పాలనా కాలంలో (క్రీ.శ. 1600-1631) మూడు దశాబ్దాలపాటు కదన విజయంలో కవి పండిత పోషణలో సరస సాహితీ సృష్టిలో, సంగీత విద్యా ప్రావీణ్యంలో, విశిష్టాద్వైత మతాభినివేశంలో, పరమత సహనంలో శ్రీకృష్ణదేవ రాయలతో రఘునాథ నాయకునికి సామ్యం ఉంది. రాయల వారు భువనవిజయ సభావిలసితుడు. రఘునాథ నాయకుడు 'ఇందిరామందిరా', సభావిలసితుడు. అందుకే విమర్శకులు అపర శ్రీకృష్ణదేవరాయలుగా, అభినవ భోజునిగా అభివర్ణించారు.

రఘునాథ నాయకుడు స్వయంగా కవి, పండితుడు, లలితకళాభిజ్ఞుడు. ప్రత్యేకించి సంగీత శాస్త్ర కోవిదుడు. 'జయంతసేన' అనే కొత్త రాగాన్ని 'రామానందం' అనే కొత్త తాళాన్ని తన పేరుతో 'రఘునాథ మేళవీణ' అనే మేళాంతరాన్ని సృష్టించి సంగీత ప్రియులకు పారవశ్యం కలిగించిన ప్రతిభాశాలి. తన ఆస్థానంలోని వేంకటమఖి, 'మధురవాణి' వంటి వారికి వీణా గురువు.

రఘునాథ నాయకుని సాహిత్య పోషణ అమేయం. ఆయన ఆస్థానంలో సంస్కృత భాష ఆదరణ పొందింది. యజ్ఞనారాయణు

డనే సంస్కృత కవి రఘునాథుని చరిత్రను సంస్కృత భాషలో రఘునాథాభ్యుదయం కావ్యంగా రచించాడు. ఆయన ఆస్థానంలోని పండితకవి 'కృష్ణాధ్వరి' నైషధ పారిజాతీయం అనే ద్వ్యర్థి కావ్యాన్ని రచించాడు. చేమకూర వేంకటకవి, కవిచేడప్ప వంటి ప్రముఖ కవులను ఆదరించి పోషించాడు. రామభద్రాంబ, మధురవాణి వంటి కవయిత్రులను కూడ ఆదరించి కావ్యాలు వ్రాయించాడు. రామభద్రాంబ చతుర్విధ కవితల్లో చతురురాలు. అష్ట భాషా పండితురాలు. గంటకు నూరు పద్యాలు ఆశువుగా చెప్పగల దిట్ట. సంస్కృతంలో 'రఘునాథాభ్యుదయం' రచించింది. తెలుగులో 53 సంస్కృతంలో కూడ యతి నియమాన్ని పాటించిన విదుషీమణి. మధురవాణి కూడ ఆశుకవితలో అందెవేసిన జాణ. సమస్యా పూరణ చతుర. రఘునాధనాయకుని 'రామాయణా'న్ని సంస్కృతీకరించిన కవయిత్రి. ప్రత్యేకించి కనకాభిషేక సత్కారాన్ని పొందింది. సంస్కృతాంధ్రాల్లోనే కాక ప్రాకృతంలో కూడ పండితురాలు. రఘునాథుని కాలంలో ప్రబంధ, ద్విపద కావ్యాలు, యక్షగానాలు, పదరచనలు, అభ్యుదయ కావ్యాలు, చిత్రకవిత్వం, ద్వ్యర్థి కావ్యాలు వంటి ప్రక్రియలు ఆదరణతో విలసిల్లాయి. ప్రత్యేకించి పదసాహిత్యానికి, యక్షగానాలకి ఆటపట్టయింది. ఆయన 'అంకిత మందిన గ్రంథాలు 'విజయవిలసం' వంటివి దాదాపు ఇరవై దాకా ఉన్నాయి.

### 13.1.1. రఘునాథ నాయకుని రచనలు :

సంస్కృతాంధ్రాల్లో రఘునాథ నాయకుడు బహుగ్రంథకర్త. వాటిని పరిశీలిద్దాం.

సంస్కృత గ్రంథాలు - 1. మహాభారత తాత్పర్య సంగ్రహము, 2. రామాయణ కథాసారము, 3. సంగీతసుధ, 4. సాహిత్యసుధ, 5. భరతసుధ మొదలైన సంస్కృత గ్రంథాలు రచించాడు. ఆయన సంస్కృత గ్రంథాలు మహాభారత రామాయణాలు పౌరాణిక భక్తిద్యోతకాలు - సంగీతసుధ, సాహిత్యసుధ, భరతసుధ మొదలైనవి ఆయన సంగీత నాట్య కళాభిజ్ఞతకు తార్కాణాలు. 'సంగీతసుధ' గ్రంథాన్ని గోవింద దీక్షితునితో కలిసి రచించినట్లు తెలుస్తుంది.

### 13.1.2. తెలుగు గ్రంథాలు :

రఘునాథ నాయకుని తెలుగు రచనలు తొమ్మిదిగా విమర్శకులు నిర్ధారించారు. వాటిలో అలభ్యాలు ఐదు. లభ్యాలు నాలుగు. అలభ్య కృతుల్లో బాల్యంలో ఆశువుగా చెప్పిన 1. పారిజాతాపహరణ ప్రబంధము, 2. అచ్యుతాభ్యుదయము, 3. గజేంద్ర మోక్షము, అనేవి ద్విపద కృతులు. 'రుక్మిణీ శ్రీకృష్ణ వివాహము' యక్షగానం. 'జానకీ పరిణామము' చాటు కావ్యం. అలభ్యమైన 'అచ్యుతాభ్యుదయాన్ని' అనుసరించి "తెలుగు సాహిత్యంలో నామకాభ్యుదయ ప్రక్రియకు రఘునాథ నాయకుడే మూలపురుషుడన్న" డా॥ జి. నాగయ్య గారి అభిప్రాయం సమంజసం. యక్షగాన ప్రక్రియాప్రియుడని 'రుక్మిణీకృష్ణ వివాహ' యక్షగానాన్ని అనుసరించి విదితమవుతుంది.

లభ్యకృతుల్లో 1. వాల్మీకి చరిత్ర, 2. రఘునాథ రామాయణము, 3. శృంగార సావిత్రి అనేవి ముచ్చటగా మూడు ప్రబంధాలు. నలచరిత్ర అనే ద్విపద కృతి నాలుగవది. ఈ గ్రంథాలన్నీ రామాంకితాలే.

### 13.1.3. కృతుల సంగ్రహ సమీక్ష :

1. అచ్యుతాభ్యుదయము - రఘునాథ నాయకుని తండ్రి అచ్యుతపు నాయకుని దినచర్యకు సంబంధించిన ద్విపదకృతి. ఆయన కొలువు దీరుట మొదలు అనేక సామాజిక విషయాలను సరళమైన శైలితో రచించాడు. తదనంతర 'అభ్యుదయ' కావ్యాలకు మార్గదర్శి. అలభ్యమైనందున విషయ వివరణకు అవకాశం లేదు.

### 13.1.3(అ). రామాయణము :

రఘునాథ రామాయణం సమగ్రంగా లభించలేదు. బాలకాండలోని మూడు ఆశ్వాసాలు, నాల్గవ ఆశ్వాసంలో శ్వేతద్వీప

వర్ణన వరకు గల **26** పద్యాలతో కలిపి మొత్తం **467** పద్య గద్యాలు మాత్రమే లభించాయి. వాల్మీకి రామాయణంలోని కథామాత్రృకను మాత్రమే గృహించి 'స్వతంత్ర గ్రంథంగా స్వకపోల కల్పితాలతో రసరమ్యంగా అనువదించాడు. ఔచిత్యమైన కల్పనలతో సహజసుందరమైన వర్ణనలతో విలసిల్లే రఘునాథ రామాయణాన్ని రఘునాథుని ఆస్థాన కవయిత్రి సంస్కృతీకరించింది.

## 13.1.3(ఆ). వాల్మీకి చరిత్ర :

ఆదికవి వాల్మీకి గాథను తొలిసారిగా తెలుగులో 'వాల్మీకి చరిత్ర'గా ప్రబంధీకరించిన రామభక్తుడు రఘునాథ నాయకుడు. ఆయన కావ్యాలన్నింటిలో సమగ్రంగా లభించిన గ్రంథమిదే. ఇది మూడాశ్వాసాల ప్రబంధం. ఇందులో **450** పద్యగద్యాలున్నాయి.

సంస్కృతంలో వాల్మీకి చరిత్ర 'ధర్మఖండం'లో 'వాసిష్ఠ రామాయణం'లో, 'భక్త విజయం'లో ఉంది. ధర్మఖండంలోని వాల్మీకి కథకు, వాసిరామాయణం, భక్తవిజయంలోని వాల్మీకి చరిత్రకు కొంత వ్యత్యాసం ఉంది.

రఘునాథ నాయకుడు 'సంస్కృత ధర్మఖండా'న్ని అనుసరించి 'వాల్మీకి చరిత్ర' రచించాడు. కల్పనా రామణీయకతతో స్వతంత్ర గ్రంథంగా ఇది విలసిల్లుతుంది. ఈ కావ్యంలో కవి ఆనాటి తంజావూరు, కావేరి, శ్రీరంగం, ప్రసిద్ధమైన గుళ్లు, గోపురాలు, తటాకాలు, పంటలు మొదలైన సమకాలీనమైన వర్ణనలతో ప్రజా జీవితాన్ని ప్రతిఫలింపజేయుటలో, రాయల వారి ఆముక్తమాల్యదను స్ఫురింపజేశాడు. సందర్భోచితంగా సంగీత నాట్య కళా విశేషాలను వర్ణించాడు. వర్ణనా చమత్కారం, పాత్ర చిత్రణా, అద్భుతమైన కల్పనలతో రసరమ్యకావ్యంగా వాల్మీకి చరిత్రను తీర్చిదిద్దాడు.

## 13.1.3(ఇ). శృంగార సావిత్రి :

మహాభారతంలోని 'సావిత్ర్యుపాఖ్యానం' ఆధారంగా రచించిన రెండాశ్వాసాల శృంగారరస ప్రబంధం. శృంగారంతో పాటు హాస్యం కూడ సముచిత రీతిలో పోషించబడింది. అప్పటి సామాజిక పరిస్థితులైన వేశ్యావినోదాలు, క్రీడావినోదాలు, సంభోగ శృంగారం, రాజాస్థానాల్లోని రాచరిక మర్యాదలు, తంజావూరి సౌభాగ్యవిలాసాలు, అంతఃపుర సంప్రదాయాలు, కవితా గోష్ఠులు మొదలైన అంశాలు అశ్వపతి రాచరికం నెపంతో వర్ణించబడ్డాయి. 'శృంగార సావిత్రి' రచనా విశేషాలను గూర్చి పీఠికలో శ్రీ గంటి సూర్యనారాయణ శాస్త్రి తేటతేట కూర్పులు, భావవైషమ్యములు, సరసపద సంధానములు ఈ గ్రంథ ప్రశస్తిని కూర్చుచున్నవి. దురాన్వయముగాని క్లిష్ట పదరచనగాని ఇందు గానరాదు" అని చెప్పిన మాటలు యధార్థాలు.

## 13.1.3(ఈ). నలచరిత్ర :

రఘునాథ నాయకుని 'నలచరిత్ర' పూర్వోత్తర కథాంశాలున్న ఎనిమిదాశ్వాసాల ద్విపద కావ్యం. రఘునాథ నాయకుని ఇతర కృతులైన వాల్మీకి చరిత్ర, రఘునాథ రామాయణము మొదలైన కావ్యాల్లో సాధారణంగా కనిపించే సంగీత సాహిత్యాభిమానం, శృంగార లోలుపత, హాస్య చతురత ఈ నల చరిత్రలో లేనందున ఇది కర్తృత్వ వివాదానికి ఆస్పదమైంది. దక్షిణాంధ్ర యుగసారస్వత లక్షణాలైన భాషా సౌలభ్యం. కథాకథన సృష్టి ఈ ద్విపద నలచరిత్రలో పుష్కలంగా ఉన్నాయి. ఇది కరుణా రసోపేత కావ్యమైనందున శృంగార రసపోషకాలగు వర్ణనలు మిక్కుటంగా ఉండే అవకాశం లేదు. కనుక ఈ ద్విపద నలచరిత్ర రఘునాథ నాయక రచితమే యని ఆచార్య కె.వి.ఆర్. నరసింహం గారు నిర్ధారించారు. ఇతర నలచరిత్రల కంటే ఇది విశిష్టమైందిగా విమర్శకులు అభిప్రాయపడ్డారు.

రఘునాథ నాయకుని రచనలన్నీ రామాంకితాలే.

## 13.2. రఘునాథ నాయకుని కవితారీతులు :

రఘునాథ నాయకుని లభ్య రచనలైన వాల్మీకి చరిత్ర, రఘునాథ రామాయణం, శృంగార సావిత్రి, నలచరిత్ర ఆధారంగా

ఆయన కవితారీతులను పరిశీలిద్దాం.

రఘునాథ నాయకుని కవిత్వం సరసంగా, కుసుమ కోమలంగా, సంగీత సాహిత్యాల సమ్మిళితంగా ఉంటుంది. రచనలో క్లిష్టత లేకుండా సరళ సుందరంగా ప్రసాద గుణ విలసితంగా రచించగల కవితా పాటవంగల మధురకవి రఘునాథ నాయకుడు. తన కవితాతత్త్వాన్ని వాల్మీకి చరిత్రలో ఆవిష్కరించాడు. మంచి కవిత్వం ఏ విధంగా ఉండాలో వివరించాడు.

"చెప్పవలె కప్పురంబులు కుప్పలుగా పోసినట్లు కుంకుమ పైపై
గుప్పిన క్రియ, విరిపొట్లము విప్పిన గతి ఘుమ్మనం గవిత్వము సభలన్
చెవులకు చవులై చల్లగ కవులకు దవులై సమస్త కావ్య కళాబం
ధువులై రస సింధువులై యవురా యన కవిత లవనినలరగవలదా!"

అద్భుతమైన ఉపమానాలతో ఆహ్లాద జనకంగా పరిమళ భరితంగా, రసస్ఫోరకంగా అవురా! అనిపించే విధంగా మంచి కవిత్వం ఉండాలన్న లక్ష్యాన్ని అక్షరాలా ఆచరించిన కవిశ్రేష్ఠుడు రఘునాథ నాయకుడు. ఆయన కవితారీతుల్లో 1. వర్ణనా వైభవం, 2. పాత్ర చిత్రణ, 3. రసపోషణ, 4. సంగీత శాస్త్ర వైదుష్యం, 5. అలంకారికశోభ, 6. తెలుగుతనం మొదలైన వాటిని పరిశీలిద్దాం.

### 13.2.1. వర్ణనా వైభవం :

కావ్యానికి వర్ణనలు జీవం. కవి ప్రతిభకు తార్కాణాలు వర్ణనలు. పాఠకులకు ఆహ్లాదభరితాలు. రఘునాథ నాయకుని వర్ణనలు లోకజ్ఞతతో ప్రకృతి పరిశీలనతో కూడుకొని పాఠకులను అలరిస్తాయి.

రఘునాథ రామాయణంలో శృంగార క్రీడలో ఉన్న క్రౌంచ పక్షుల జంటను వర్ణిస్తూ

"ఒక్క మహజశాఖపయి నొక్కట వేడుక కూడియుండి మొం
డొక్కటి ఱెక్క విప్పుకొని యొప్పుగ గప్పుచు నొయ్యు బల్కుచున్
ముక్కుల మేను గీరుచును మోమున మోమును జేర్చి మిక్కిలిన్
మక్కువనుండ క్రౌంచ మిధునంబు గనుంగొని సంభ్రమంబుగన్"

చెప్పిన తీరు మనోజ్ఞంగా ఉంది. పై వర్ణనలో క్రౌంచ మిధునపు శృంగారం రసాభాసమైనా పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తుంది.

వాల్మీకి చరిత్రలో సప్తర్షులు తంజావూరులో వేశ్యల లాస్యాలను, వగలను చూసి దానిని ఇంద్ర నగరంగా భావించునట్లు రఘునాథ నాయకుడు అద్భుతంగా ఉత్ప్రేక్షించి వర్ణించాడు.

"అందలి సౌధమూధముల యందమునచ్చటి కేలికావనీ
బృందము చందమా కెలన బింకపు చూపుల కోపులించగా
నిందు ముఖుల్ నటించు వగవెల్ల కనుంగొని పొంగి మౌర పౌ
రందర పట్టణంబె మదిరామది రాజి వెనంచు నెంచుచున్"

శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో గోదావరీతీర పరిసరాలను వర్ణించినట్లు, శ్రీకృష్ణదేవరాయలు విల్లి పుత్తూరు వర్ణనలో ద్రావిడ దేశ ప్రకృతి సౌందర్యాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించినట్లుగా రఘునాథ నాయకుడు తంజావూరులో గుళ్ళు, గోపురాలు, పూలతోటలు, శాలిధాన్య విశేషాలు, నారికేళ వనాలు, వేశ్యల విలాసాలను అద్భుతంగా వర్ణించాడు. ఈ వర్ణనలు ఆయన స్థానిక ప్రకృతి వర్ణనా కౌశలానికి తార్కాణాలు.

వాల్మీకి చరిత్రలో సప్తర్షులు చూసిన బోయపల్లె వాతావరణాన్ని నిశిత పరిశీలనా దృష్టితో వర్ణించాడు. కిరాత జీవిత వర్ణనలు సహజ మనోహర విలసితాలు. బోయపల్లెతో వెదురు బియ్యం దంచే బోయెత రూపాన్ని కళ్లకు కట్టేట్లు సహజ సిద్ధంగా వర్ణించిన తీరు పరిశీలిద్దాం.

"కుమరుగ జంగ సాచి చనుగుబ్బలు మీటుగ పాఱటాకు ప
య్యెద పొదలంగ నెన్నుదురొకింత చెమర్పంగ మేచ కాళినే
ర్పు దొరల పాడి చందనపు తోలు ననేనుంగు కొమ్ముర్ోఁ కటన్
ప్రిదిలెడు కొప్పుతో వెదురు బియ్యము గుప్పు నిజ ప్రియాంగనన్"

పై వర్ణన రఘునాథ నాయకుని నిశత పరిశాలనా దృష్టికి దృష్టాంతం. అచ్చ తెలుగు పదాలతో బొమెత రూపాన్ని సహజ సిద్ధంగా సాక్షాత్కరింపజేశాడు. రఘునాథుని వర్ణనలన్నీ విలక్షణమైనవే. ఆయన రామాయణంలో శృంగార పరమైన చిత్ర వర్ణనలు కొన్నింటిని చేశాడు. ఆశ్రమ వాతావరణంలో చెట్టకు నీళ్ల పోసే ముని కన్యలను శృంగార రసదృష్టితో వర్ణించడం అనౌచిత్యమైనా ఆయన శృంగార రాసిక్యానికి ఉదాహరణగా చెప్పవచ్చు. రఘునాథ నాయకుని వర్ణనా వైభవం విలక్షణమైంది.

### 13.2.2. పాత్ర చిత్రణ :

రఘునాథ నాయకుడు తన కావ్యాల్లో పాత్ర చిత్రణను ప్రత్యేక శ్రద్ధతో చేశాడు. పాత్రల మనస్తత్వ విశ్లేషణతో సహజ సిద్ధమైన రీతిలో చిత్రించాడు. కిరాతుడు వాల్మీకిగా మారిన పిదప అతడి వేషధారణను పాత్రోచితంగా చిత్రించిన తీరు పరిశీలిద్దాం.

"నుదుట జేగురు బొట్టు పదనింక నారని
తులసిమృత్తిక నణర్ధ్య తిలకమిడియె
సెలసువిల్లు వహించు కెలనంబుగాదని
వేణు కుండిక యుండు పాణిఁబూనె
సొగసు నున్నాని కోర సిగ సూటిగాదని
నిడుద పెన్నెఱు లెల్ల జడలు దాల్చె
నిండుగావింపు నీలి దిండు గాదని కటి
పలుచని నార చీరలు ధరించె

దినము తమసా తరంగిణి తీర్థమునను
స్నాన మొనరించి అత్యంత శాంతి మెఱయ
మౌనులుపదేశ మిచ్చిన మంత్ర మెపుడు
జపము సేయుచు నవ్వన చర విభుండు

వాల్మీకి హృదయ పరివర్తనతో తులనాత్మకంగా గత వేషధారణను వీడి సముచితమైన మహర్షి వేషధారణను స్వీకరించిన విధానాన్ని తెనుగునుడికారంతో చిత్రించిన తీరు మనోజ్ఞంగా ఉంది.

రఘునాథ రామాయణంలో ఋష్యశృంగుని పాత్ర చిత్రణలో మౌగ్ధ్యాన్ని హాస్యస్ఫోరకంగా చిత్రించాడు. అతడి తపోభంగానికి విచ్చేసిన దేవవేశ్యల చూసి "హేమకుండిక లెట్టు లెదమోచి కొన్నారల నికుచంబుల కేలనంటి యంటి" కులుకు గుబ్బెతన చూపుల గల్వ విరులంచు దేవతార్చనకుగా దివియంబూను మొదలైన పద్య పంక్తుల్లో ఋష్యశృంగుని అమాయకత్వం విదితమవుతుంది.

దేవవేశ్యల స్తనాలను బంగారు కలశాలుగా భ్రాంతితో పట్టి చూడటం, వారి చూపులను కలువపూలుగా భావించి దేవతార్చనకు వినియోగించాలనుకోవడం భ్రాంతితో కూడిన అతని అమాయకత్వం నవ్వు కలిగిస్తుంది. శృంగార హాస్యస్ఫోరకంగా ఋష్యశృంగుని పాత్ర చిత్రణలో కవి ప్రతిభ స్పష్టమవుతుంది. 'శృంగార సావిత్రిలో సావిత్రి పాత్ర చిత్రణలు పతిభక్తి వినయవిధేయతలను నిక్షిప్తం చేశాడు. ప్రతి పాత్రను సముచిత రీతిలో ఔచిత్యంగా తీర్చిదిద్దాడు.

### 13.2.3. రసపోషణం :

రఘునాథ నాయకుడు మంచి కవితా లక్షణాలను వివరిస్తూ కావ్యాలు 'రసబంధువు'లై ఉండాలన్నాడు. దీని ననుసరించి రస ప్రాధాన్యానికి ఎంతగా ప్రయత్నించాడో స్పష్టమవుతుంది. ఆనాటి కావ్యాలన్నీ పుష్కలంగా శృంగార రసప్లావితాలే. పాఠకులకు ఆహ్లాద రసానందజనకాలే. ప్రత్యేకించి రఘునాథ రామాయణంలో "పలుకగ వలె నవరసములు కులుకం పద్యములు చెవులకున్ హృద్యముగా" అని చెప్పి నందన నవరసభరితంగా కావ్యాలను తీర్చిదిద్దాడు. ఆయన కావ్యాల్లోని రసపరిపోషణను పరిశీలిద్దాం.

అయోధ్యాపుర వాసుల భోగ పరాయణత్వాన్ని వర్ణించే మిషతో తన కాలం నాటి విలాసవంతుల జీవనాన్ని సరస శృంగార భరితంగా వర్ణించాడు.

"ఎవ్వారిఁ జూచిన దవ్వుల వాసనల్ విసరు పూసరులచే పొసగువారె
ఎవ్వారిఁ జూచిన మహామహేంద్ర నీల జాలకలదుత హేమ సౌధయూధ
ముల సీమంతినుల గూడి కామకేళి వేడుకల జెందువారె యవ్వలె యందు"

శృంగార రసభరితమైన వారి జీవనాన్ని శృంగార రసరంజితంగా వర్ణించాడు.

వాల్మీకి చరిత్రలో కిరాతుడి తపో దీక్షణ భంగపరచే రీతిలో బోయ మిటారి గుబ్బెతల శృంగారాన్ని సరసంగా వర్ణిస్తూ

"బాయని బాళి కిన్నెరులు మాటిమాటికి మీటుచు నీ ప్రతాపముల్
హాయని చొక్కి పాడవినవా! కలవా! కునవారిఁ బాసి నీ
లీ మెడ నొంటి నుండ తగవే! తగవే! చనుదెమ్ము వీటికిన్"

బోయెతలు శృంగారాన్ని ఒలకబోశారు.

'శృంగార సావిత్రి'లో సావిత్రి విరహావస్థను శృంగార రసస్ఫోరకంగా వర్ణించాడు.

రఘునాథ రామాయణంలో క్రౌంచ పక్షి నేల కొరిగిన సంఘటనను అసాధారణ ప్రజ్ఞతో కరుణ రసాత్మకంగా వర్ణించాడు.

"పడి రోజుకొనుచు నెత్తురు బుడబుడ గ్రక్కుచును బోర పాడెయెగయూ
ర్పడరగ పొరలందొడగెన్ కన్నుగప్పి వేదన బలియన్"
"కులకుల కూయుచు నిలపై జలజల జుట్టు పలురాల పారె పొరలుచున్
విలవిల దన్నుకొనెడి వలపులు గుంగని మౌని కరుణ పొగలుచు పలికెన్"

క్రౌంచ పక్షి నేల కొరిగిన స్థితిని హృదయ విదారకంగా వర్ణించి పాఠకుల కన్నీరు పెట్టించాడు. వాల్మీకి హృదయం ఆర్ద్రమై కరుణ రసాత్మకంగా కిరాతుని శపించాడు.

ఋష్యశృంగుని ఘట్టంలో హాస్యం తొణికిసలాడుతుంది. వేశ్యా వినోదం, క్రీడా వినోదం మొదలైన సన్నివేశాల్లో హాస్యం

పాఠకుల అలరిస్తుంది. సందర్భోచితంగా, సమయానుకూలంగా రఘునాథ నాయకుడు రసపరిపోషణతో పాఠకులను రంజింపజేశాడు.

### 13.2.4. సంగీతశాస్త్ర వైదుష్యం :

రఘునాథ నాయకుడు వాల్మీకి చరిత్రలో రాగతాళాలను ప్రస్తావించి తన సంగీత శాస్త్ర ప్రతిభను చాటుకొన్నాడు.

"కలికికలి కితలను తుమ్మెద గంతుగంతులు చూడు మాటికి
చిలుకబలుకల కొల్కి పలుకుల చిక్కు చిక్కుల పెట్ట నేటికి . . . . . "

అనే వర్ణన మాధుర్య గుణ భరితమై రాగ తాళబద్ధంగా పుష్పాపచమనం చేస్తున్న 'కలికి'ని సూచిస్తుంది. కవి సంగీతశాస్త్ర వైదుష్యానికి నిదర్శనాలెన్నో ఉన్నాయి.

### 13.2.5. ఆలంకారికశోభ :

రఘునాథ రామాయణంలో వాల్మీకి భరద్వాజులు చూచిన తమసా నదిని అమూలకంగా, స్వతంత్ర కల్పనా భావబంధురంగా చక్కని ఉపమాలంకార శోభితంగా వర్ణించాడు.

"మిసమిస మెఱయుచు లోపల
నిసుకలు గనవచ్చు చుండ నింద్రమణి విభా
విసరము వలె నింపె సగెడు
ప్రసన్న సలిలంబు మనసు రంజలిఁ జేయున్"

నదిలో ఇసుక రేణువులు ఇంద్రమణుల్లా భాసిస్తున్నాయని ప్రసన్న సలిలం మనసుని రంజింపజేస్తుందన్న ఉపమానం మనోజ్ఞంగా ఉంది.

తంజావూరి నాట్యకత్తెల లోగిళ్ల విలాస వైభవాన్ని ఉదాత్తాలంకార శోభితంగా వర్ణించాడు.

"పట్టు గుడారముల్ బకిలి బంగరు వ్రాతల చిక్కు బీగపుం
బెట్టెలు పచ్చఱా పలక పీటలు మేలిన కాసుకుట్టు మే
ల్కట్టులుఁ గ్రొత్త నెత్త పలకల్ తెరలున్ పికదారి ఫారువా
పిట్టల గూండ్ల క్రొమ్మెఱగు పిందెలు కొందఱు తెచ్చి రయ్యెడన్"

పై వర్ణనలో నాట్యకత్తెల సంపన్న విలాసమైన భవనాలను ఉదాత్తంగా వర్ణించాడు.

సందర్భోచితంగా స్వభావోక్తులు, ఉత్ప్రేక్షలు, శ్లేషలను వర్ణించాడు. అర్థాలంకారశోభతో పాటు శబ్దాలంకారాల శోభకూడ రఘునాథ నాయకుని కవిత్వములో ఉంది. కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం.

గ్రీష్మాన్ని వర్ణించే సందర్భంలో వాల్మీకి చరిత్రలో

"పటపట పశిలెంగుంభిని
తటపట పధికుల మనంబు తల్లడె పడియెన్
చిటపట నెగసెన్ దవశిఖి
కటకట గ్రీష్మం బొకింత కనబడునంతన్"

పై వర్ణనలో 'ట' కార ఆవృత్తి చేత గ్రీష్మ తీవ్రతను, బాటసారుల బాధలను వృత్త్యాను ప్రాసయుక్తంగా సహజ సుందరంగా చమత్కారంగా వర్ణించాడు.

## 13.2.6. తెలుగుతనం :

రఘునాథ నాయకుని రచనలన్నింటా తెలుగుతనం గుబాళిస్తుంది. తెలుగు నుడికారపు సొంపు తెలుగు పదాల పోహళింపు చక్కని ధారాశుద్ధి, ప్రసన్న గంభీరమైన శైలీ సౌందర్యం రఘునాథుని కవితలో కనిపిస్తాయి. కొన్ని ఉదహరణలు పరిశీలిద్దాం. సప్తర్షుల ఆదేశానుసారం కిరాతుడు తన భార్యతో తన పాపాల్లో పాలుపంచుకొందువా? లేక నేను భరించవలెనా? అని ప్రశ్నించిన సందర్భంలో ఆమె సమాధానం చెప్పే సందర్భంలో

"తవులగు వారికెవ్వరి కతంబున సాకెదవప్పు దీసి తె
త్తువొ! కొనితెత్తువో తెరువు దోచుచు తెత్తువొ జూదమాడితె
త్తువొ! చనితెత్తువో మదియు దోసమొ పున్నెమొ నాకు నెటి కా
రవరవ నీవు తెచ్చినవి దాఁచక వండగ పాడి నిచ్చలున్"

బోమెత సమాధానంలో తెలుగు నుడికారపు సొగసులు పరిమళిస్తున్నాయి.

కిరాతుడి వైరాగ్యంతో పలికిన మాటల్లో కూడ తెనుగు నుడికారం ఉంది.

"సతులెవ్వరు సుతులెవ్వరు
హితు లెవ్వారేటి వఱద నెందే నొకచో
జత గూడిన కాష్ఠంబుల
గతినించుక కూడివచ్చి కదులుదు రవలన్"

పై వర్ణనలో సూక్తులు వైరాగ్య భరితాలు. చక్కని నానుడులు. ఇటువంటి తెనుగు నుడికారపు పరిమళాలు రఘునాధుని కవిత్వంలో కోకొల్లలుగా ఉన్నాయి.

రఘునాథుని కవిత్వంలోని 'నాటకీయత' కూడ పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తుంది.

రఘునాథ నాయకుని కవితా రీతులను గూర్చి చేమకూర వేంకటకవి చెప్పిన అభిప్రాయాన్ని పరిశీలిద్దాం.

"మాటల నేర్పులా! సరస మార్గములా! కొలువుండు రీతులా!
పాటల గంధులా! నఖల భాగ్యములా! బహుదాన లీలలా!
నాటకశాలలా మొకటి నన్యల దెన్నిట జూడ నన్నిటన్
మేటియు కీర్తిలోలుడు జుమీ రఘునాథ నృపాలుడిమ్మహిన్"

చేమకూర ప్రశంస అక్షర సత్యం. విజయ విలాస అవతారికలో ప్రతి పదంలో జాతి, వార్త, చమత్కారం, అర్థ గౌరవం, ప్రసన్న గంభీరతలు రఘునాథ నాయకుని కృతుల్లో రసవత్తరంగా విలసిల్లుతున్నాయని వివరించారు.

డా॥ యస్. గంగప్ప గారు వాల్మీకి చరిత్రలోని కవితారీతుల వివరిస్తూ "రఘునాథ రాయల సరసత్వం, రాసిక్యం, వైదుష్యం అనన్యసామాన్యం. రాయల సంగీత సాహిత్యాల నిధిత్వానికి, పాండిత్య ప్రకర్షకు, ఉత్తమ కవితా రీతులకు పరమ నిదర్శనం వాల్మీక చరిత్రము". వాల్మీకి చరిత్రలోని కవితారీతులు గంగప్ప గారి వివరణ ఆమోదయోగ్యం.

డా॥ జి. నాగయ్య రఘునాథ నాయకుని కవితారీతులను నిశిత పరిశీలనతో చెప్పిన అభిప్రాయాన్ని పరిశీలిద్దాం.

"రఘునాథ నాయకుడు ప్రబంధోచితముగ కథలను ప్రపంచీకరించుటలోను, నిసర్గమనోజ్ఞమైన కవితాపాటవమును వ్యక్తీకరించుటలోను, రసావిష్కరణమునందును సిద్ధహస్తుడని విదితమగుచున్నది. ప్రక్రియా వైవిధ్యమే గాక రసవత్తరమైన కవితా రచనమును రఘునాథ నాయకుని ప్రత్యేకత. రఘునాథ నాయకుడు అశేషేముషీ ప్రతిభావంతుడు, మధురకవి".

రఘునాథ నాయకుని నిసర్గ మనోజ్ఞ కవితా పాటవాన్ని, రసవత్తరమైన కవితారచనను, ప్రక్రియా వైవిధ్యాన్ని, అశేషేముషీ ప్రతిభను గూర్చి నాగయ్య గారు చెప్పిన మాటలు అక్షరసత్యాలు.

## 13.3. విజయరాఘవ నాయకుని జీవిత విశేషాలు - కృతులు :

రఘునాథ నాయకుని అనంతరం ఆయన కుమారుడైన విజయరాఘవ నాయకుడు క్రీ.శ. 1633లో తంజావూరు రాజ్యపాలకుడయ్యాడు. పాలనా స్థాపనంలో సాహితీ పోషణలో తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని నాలుగు దశాబ్దాల పాటు ప్రజారంజకుడైన పాలకుడని ప్రశంసలందుకొన్నాడు. తండ్రి వలె స్వయంగా కవి. కవి పండిత పోషకుడు. రసికాగ్ర గణ్యుడు. తండ్రి 'ఇందిరామందిర భవనం' భవకంలో సాహితీ కార్యక్రమ విలసితుడు. ఇతడు విజయరాఘవ విలాస సభామందిర విలసితుడు. సంగీత నాట్య కళాప్రియుడు. ఆస్థానంలో నాట్యకత్తెలను, గాయకులను ఆదరించి పోషించాడు. వారు కేళికలు, పదములు, దరువులు, పేరిణీలు మొదలైన నాట్య విశేషాలను అభినయించి ఆహ్లాదం కలిగించేవారు. ఆస్థాన గాయకులు 'జోల', 'సువ్వాల', 'ధవళపదములు', ఏలలు మొదలైన దేశీయమైన పాటలను గానం చేసేవారు.

విజయ రాఘవ నాయకుడు యక్షగాన రచనా ప్రియుడు. స్వయంగా 23 యక్షగానాలను రచించాడు. ఆయన ఆస్థానకవులు, కవయిత్రులు అనేక యక్షగానాలను రచించారు. విజయరాఘవుని కాలం 'యక్షగాన ప్రక్రియా వికాసానికి' స్వర్ణయుగంగా విలసిల్లింది. యక్షగాన ప్రదర్శనలచేత ప్రేక్షకులకు ఆహ్లాదం కలిగించేవారు. పద కవితా పితామహుడు క్షేత్రయ్య విజయరాఘవుని ఆస్థానాన్ని సందర్శించి కొన్ని పదరచనలను చేసి అంకితమిచ్చాడు. చెంగల్వ కాళకవి ఇతని ఆస్థానకవి. చెంగల్వ కాళకవి 'రాజగోపాల విలాసము' అనే మధుర ప్రబంధాన్ని రచించాడు. విజయరాఘవ నాయకుడు అష్టభాషా పండితుడు. ఆయన సాహితీ సార్వభౌమత్వానికి సంకేతంగా పాదానికి 'రాయ పెండేరం' ధరించేవాడని 'రాజగోపాల విలాస' కావ్యం వల్ల తెలుస్తుంది. బహుముఖ ప్రజ్ఞాధురణ 'పసుపులేటి రంగాజమ్మ' విజయరాఘవ నాయకుని ఆస్థాన కవయిత్రి. ఆమె మన్నారుదాస విలాస యక్షగానం, మన్నారు దాస విలాస ప్రబంధం, ఉషా పరిణయం, అనే ప్రబంధం సంగ్రహ భారత, భాగవత, రామాయణాలు రచించింది. ఆమెవి ప్రతిభకు తగిన విధంగా విజయరాఘవ నాయకుడు కనకాభిషేకంతో గొప్పగా సత్కరించాడు. ఆస్థానకవుల కావ్యాలను అభిమానంతో అంకితం తీసుకొన్నాడు.

విజయరాఘవ నాయకుడు బహుగ్రంథకర్త ప్రక్రియా వైవిధ్యంతో 23 యక్షగానాలను, మూడు ద్విపద కావ్యాలను రెండు అనువాద కావ్యాలను, రగడలు, దండకాలు, కావ్యాలు, జానపద బాణీలను ప్రతిభావంతంగా రచించిన కవి శ్రేష్ఠుడు. ఆయన కావ్యాలను సవివరంగా వర్గీకరించి తెలుసుకొందాం.

### 13.3.1. యక్షగానాలు :

1. రాజగోపాల విలాసం, 2. చెంగమల వల్లీ పరిణయం, 3. గోవర్ధనోద్ధరణం, 4. రతిమన్మథ విలాసం, 5. రాసక్రీడ, 6. నవనీతచోరం, 7. పారిజాతాపహరణం, 8. రుక్మిణీ కళ్యాణం, 9. రాధామాధవ వివాదం, 10. ధనాభిరామం, 11. సత్యభామ వివాహం, 12. ఉషాపరిణయం, 13. కాళియమర్దనం, 14. రఘునాథాభ్యుదయం, 15. ప్రహ్లాద చరిత్ర, 16. పూతనాహరణం,

17. విప్రనారాయణ చరిత్ర, 18. సముద్ర మథనం, 19. కృష్ణ విలాసం, 20. ప్రణయ కలహం, 21. కంస విజయం, 22. జానకీ కళ్యాణం, 23. పుణ్యకవ్రతం అనే ఇరవైమూడు యక్షగానాలు రచించాడు.

**13.3.2. ద్విపద కావ్యాలు :**

విజయరాఘవుని ద్విపద కావ్యాలు నాలుగు. 1. రఘునాథ నాయకాభ్యుదయం, 2. మోహినీ విలాసం, 3. పాదుకా సహస్రం, 4. మంజరీ ద్విపద.

**13.3.3. ఆంధ్రానువాద కావ్యాలు :**

ఇవి రెండు. 1. గోపికా గీతలు, 2. భ్రమర గీతలు.

**13.3.4. దండకాలు :**

రాజగోపాల దండకం ఒక్కటి మాత్రమే రచించాడు.

**13.3.5. కావ్యాలు :**

రెండు. 1. వీరశృంగార సాంగత్యం, 2. సంపంగిమన్నారు సాంగత్యం.

**13.3.6. జానపద బాణీలు :**

1. ఫల్గుణోత్సవం అనే రగడలు - చౌపదాలు, 2. వేడికోళ్లు, 3. విన్నపములు, 4. దరువులు, 5. ఏలలు, 6. సంకీర్తనలు మొదలైన జానపద బాణీ ప్రక్రియలను రచించాడు.

పై రచనలన్నిటిలో కొన్ని మాత్రమే లభ్యమౌతున్నాయి. 1. కాళియమర్ధనం, 2. ప్రహ్లాద చరిత్రం, 3. పూతనాహరణం, 4. విప్రనారాయణ చరిత్ర, 5. రఘునాధాభ్యుదయం అనే ఐదు యక్షగానాలు, రఘునాథ నాయకాభ్యుదయం' అనే ద్విపద కావ్యం మాత్రమే లభ్యమవుతున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

**13.3.7. విజయరాఘవ నాయకుని కృతుల సమీక్ష :**

విజయరాఘవుని లభ్యకృతులను సంగ్రహంగా సమీక్షిద్దాం.

**13.3.7(అ). కాళియమర్ధనం :**

ఇది భాగవత ప్రసిద్ధమైన ఇతివృత్తం. విజయరాఘవుని ఇలవేల్పయిన రాజగోపాలస్వామిని 'గోఖిలుడు', గోప్రళయుడు' అనే ఇద్దరు మునులు కాళిందీ నాట్యాన్ని చూడ కుతూహలంగా ఉందని ప్రార్థించారు. వారి కోరిక మేరకు రాజగోపాలుడు బాలకృష్ణుడై కాళిందీ తటాన కాళియ సర్పాన్ని మర్ధించాడు. అతడు నగరానికి తిరిగి వచ్చిన పిదప సఖీజనులు నీరాజనాదులతో సత్కరించుట, కొలువుతీరుట ఇందులోని ఇతివృత్తం. ఇది ప్రసిద్ధమైన యక్షగానమ్.

**13.3.7(ఆ). ప్రహ్లాద చరిత్ర :**

ఇతివృత్తం భాగవత ప్రసిద్ధమైనా, విజయరాఘవ నాయకుడు స్వతంత్రమైన యక్షగానంగా రూపొందించాడు. పాత్రోచితమైన

భాషతో, హాస్యరస ప్రధానంగా విలసిల్లే యక్షగానం. ఇందులో 'ఆస్థాన సంతోషి' పాత్ర విదూషకుని వంటిది. ఇతనికి ప్రత్యేకించిన సంభాషణలుండవు. కాని ఇష్టం వచ్చినపుడు మాత్రం హాస్యస్ఫోరకంగా మాట్లాడతాడు.

### 13.3.7(ఇ). పూతనాహరణం :

ఇందులో ఇతివృత్తం భాగవత ప్రసిద్ధమైనా, స్వతంత్ర యక్షగానంగా దీన్ని విజయరాఘవ నాయకుడు రచించాడు. ఇందులో ఆనాటి పౌరోహిత్య విషయాలు, ఇతర సమకాలీన విషయాలు సున్నితంగా వివరించాడు.

### 13.3.7(ఈ). విప్రనారాయణ చరిత్ర :

పన్నెండుమంది ఆళ్వారుల్లో ఒకడు విప్రనారాయణుడు. ప్రముఖ విష్ణుభక్తుడు. ఇతనిని 'తొండరడిప్పొడి' ఆళ్వారు అనికూడా పిలుస్తారు. ఇతని చరిత్రను చదలవాడు మల్లన్న, సారంగు తమ్మయ్యలు ప్రబంధాలుగా రచించారు. విజయరాఘవ నాయకుడు ప్రత్యేక శ్రద్ధతో దీన్ని యక్షగానంగా తీర్చిదిద్దాడు.

విప్రనారాయణుని కథ విజయరాఘవుని కాలంలో మన్నారు స్వామి గుడిలో జరిగిన విధంగా, చోళరాజే విజయరాఘవునిగా అవతరించినట్లు కల్పనతో రచించాడు. భాషావిశేషాలతో, సరికొత్త రచనా విన్యాసాలతో రూపొందిన యక్షగానమిది.

### 13.3.7(ఉ). రఘునాథాభ్యుదయం :

పితృభక్తి తత్పరతతో విజయరాఘవ నాయకుడు తన తండ్రి చరిత్రను 'రఘునాథాభ్యుదయం' పేరిట యక్షగానంగా, ద్విపద కావ్యంగా రచించాడు. రెండింటిలో కథ సమానమే. తన తండ్రి రచించిన అచ్యుతాభ్యుదయాన్ని దృష్టిలో ఉంచుకొని, తన తండ్రి దినచర్యను, కొలువు తీరుట మొదలైన విశేషాలను వర్ణించాడు. ఇందులో తన తండ్రి ఆస్థాన కవయిత్రులైన రామభద్రాంబ, మధురవాణిల ఆశుకవితా విశేషాలను కూడ వర్ణించాడు.

### 13.3.8. విజయరాఘవుని రచనారీతులు :

విజయరాఘవుని రచనలు ఆధారంగా ఆయన రచనారీతుల్లోని ప్రత్యేకతలను పరిశీలిద్దాం.

1. ప్రక్రియా వైవిధ్యం, 2. యక్షగాన ప్రీతి, 3. అష్టభాషా పాండిత్యం - అన్యభాషాపద ప్రయోగాలు, 4. చూర్ణిక వంటి వచన రచనా ప్రయోగాలు, 5. వచన గీతాలు, మొదలైన విశేషాలను వివరిద్దాం.

### 13.3.8(అ). ప్రక్రియా వైవిధ్యం :

విజయరాఘవ నాయకుడు యక్షగానాలను, ద్విపద కావ్యాలను, ఆంధ్రానువాద కావ్యాలు, దండకాలు, సాంగత్య కావ్యాలు, జానపద బాణీలను చేపట్టి సుసంపన్నం చేశాడు. ఆయన రచనల్లో యక్షగానం ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. బహుగ్రంథ కర్తగా 50 గ్రంథాలు రచించిన ఆయన 23 యక్షగానాలను రచించాడు. 'సాగత్య' కావ్య ప్రక్రియ ఆయన మాత్రమే ప్రవేశ పెట్టిన వినూత్న ఛందో ప్రక్రియ. పెక్కు జానపద బాణీలను ప్రజారంజకంగా రచించాడు. తన ఆస్థాన కవులచేత కూడ ప్రక్రియ వైవిధ్యంతో రచనలు చేయించాడు. క్షేత్రయ్య వంటి కవులచేత పదరచనలు చేయించాడు. ఆయనకు ద్విపద రచన పట్ల అభిమానం అధికం. అందుకే పాదుకా సహస్రం, మోహినీ విలాసం, మంజరీ ద్విపద, రఘునాథ నాయకాభ్యుదయం అనే నాలుగు ద్విపద కావ్యాలు రచించాడు.

### 13.3.8(ఇ). యక్షగానప్రీతి :

ఆంధ్రతాముద్రతో వెలసిన దేశి సాహిత్య ప్రక్రియ యక్షగానం. సంగీతాభినయ సాహిత్య కళల త్రికణీ సంగమ స్థానంలా విలసిల్లే దృశ్యరూపకం. విజయరాఘవుని కాలంలో 'యక్షగాన ప్రక్రియ' ఎంతో ఆదరణ పొందింది. ఆయన స్వయంగా 23 యక్షగానాలను రచించాడు. వాటిలో ఆరు మాత్రమే ఆస్థాన కవుల చేత కూడ యక్షగానాలను వ్రాయించాడు.

యక్షగానాల్లో విజయరాఘవ నాయకుడు విలక్షణమైన మార్పులను ప్రవేశపెట్టాడు. సంస్కృత నాటక పద్ధతిననుసరించి ప్రారంభంలో కవి కృతిపతిని ప్రస్తుతించి, షష్ఠ్యంతాలను చెప్పి కథాక్రమాన్ని ప్రారంభించుట ప్రబంధోచిత పద్ధతి. కాని విజయరాఘవ నాయకుడు తన యక్షగానాల్లో దేవతాస్తోత్రానంతరం మేళగాండ్రచే కైవారం చెప్పించి వారి మూలాన్నే కథక్రమాన్ని నాటకోచితంగా ప్రకటింప జేసేవాడు. ఇది ఇంచుమించుగా సంస్కృత నాటకంలోని నాందీ ప్రస్తావనలవంటిది. కొన్నిటిలో చివర భరతవాక్యాన్ని ప్రవేశపెట్టాడు.

పాత్రోచితమైన వ్యావహారిక భాష, సంవాదాత్మకమైన రచన, రగడకు బదులు సంగీత ప్రధానమైన దరువులను, పదాలను కూర్చుట, హాస్య రసపోషణ మొదలైన విశేషాలు విజయరాఘవుని యక్షగానాల్లో చెప్పుకోదగ్గవి. ఆయన యక్షగానాలు గేయధర్మం కంటె రూపక ధర్మాన్ని గొప్పగా సంతరించుకొన్నాయి. తదనంతర యక్షగాన కవులకు కవయిత్రులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. ఆయన యక్షగాన ప్రీతి ప్రశంసనీయం.

### 13.3.8(ఈ). అష్టభాషా పాండిత్యం - అన్యభాషా పదప్రయోగాలు :

విజయరాఘవ నాయకుడు అష్టభాషా పాండిత్య విలసితుడు. సందర్భోచితంగా తన యక్ష గానాల్లో, కావ్యాల్లో అన్యభాషా పదాలను ప్రయోగించాడు. ప్రహ్లాద చరిత్ర యక్షగానంలో చమత్కారంగా "సలాము సలామయా దానవలలామ్" అని ఉర్దూ పదాలను అలవోకగా 'దానవలలామ్ సమాసంతో కలిపి ప్రయోగించాడు.

'విప్రనారాయణ చరిత్ర' యక్షగానంలో తెలుగు సంస్కృతాలే కాక, తమిళం, కన్నడం పదాలను కూడ ప్రయోగించాడు.

### 13.3.8(ఉ). చూర్ణిక వంటి వచనరచనా ప్రయోగాలు :

విజయరాఘవుడు తన యక్షగానాల్లో 'చూర్ణిక'లను ప్రయోగించాడు. సమాసరహితమైన చిన్నచిన్న పదాలతో కూడిన రచనను చూర్ణిక అంటారు. 'చూర్ణిక'ల ప్రయోగంవల్ల జన సామాన్యాన్ని ఆకట్టుకొనే సంభాషణలు విశేషాదరణ పొందేందుకు హేతువులయ్యాయి.

### 13.3.8(ఊ). వచన గీతాలు :

ఆధునిక కవిత్వంలో ఆదరణ పొందుతున్న వచన గీతాలు వంటి వాటిని విజయరాఘవుడు తన యక్షగానాల్లో ప్రయోగించి ప్రేక్షకుల అభిమానం పొందాడు. విప్రనారాయణ చరిత్రలో వచనగీతాల వంటి ప్రయోగాన్ని పరిశీలిద్దాం.

"మీతో మాకేటి మాటలు
వినభ్రాతిగాను మీ పాటలు
భవనంబులు పర్ణశాలలు
మా పాటలు హరి మీద సలలు"

వంటి సరళమైన గీతాలు నూతన ప్రయోగంగా చేసి విజయాన్ని సాధించాడు.

దక్షిణాంధ్ర యుగసాహిత్యంలో తండ్రిని మించిన తనయుడిగా, బహుగ్రంథకర్తగా, యక్షగాన ప్రక్రియాభివృద్ధి కారకుడిగా సంగీత సాహిత్య నాట్య కళాప్రియుడిగా సముచిత స్థానాన్ని పొందిన విజయ రాఘవనాయకుని రచనలు ప్రత్యేకించి యక్ష గానాలు తదనంతర కవులకు మార్గదర్శకాలయ్యాయి.

## 13.4. చేమకూర వేంకటకవి జీవిత విశేషాలు - కృతుల సమీక్ష :

రాయల అనంతర కవుల్లో అస్వరాన ప్రతిభావంతుడు, అగ్రగణ్యుడు చేమకూర వేంకటకవి. తంజావూరు పాలకడైన రఘునాథ నాయకుని ఆస్థానకవి. ఆస్థానకవి మాత్రమే కాదు. ఆంతరంగికుడు. బాల్య సఖుడు. ఇతని తమ్ములు, కుమారులు కూడ రఘునాథ నాయకుని సేవకులే. కదన రంగంలో, కావ్య రంగంలో రఘునాథ నాయకుని చేదోడువాదోడుగ ఉండి మన్ననలందుకొన్న అభిమానపాత్రుడు. ఇతని తండ్రి పేరు లక్ష్మణామాత్యుడు. తల్లి పేరు గాని, కులగోత్రాలు గాని కావ్యాల్లో పేర్కొననందున సాహిత్య చరిత్రకారులకు స్పష్టంగా తెలియలేదు. ఇతనికి వేంకటరాజు, వెంకటప్ప, వెంకన్న అనే నామాంతరాలున్నాయి. చారిత్ర కాధారాలననుసరించి క్రీ.శ. 1614-1633 మధ్యకాలంలో రఘునాథ నాయకుని రాజ్యపాలన కాలంలో ఉన్నందున క్రీ.శ. 17వ శతాబ్ద పూర్వ భాగానికి చెందిన కవిగా విమర్శకులు నిర్ధారించారు.

చేమకూర వేంకటకవి అఖిల విద్యా విశారదుడు. “శ్రీ సూర్యనారాయణ వరప్రసాదలబ్ధ సారస్వత సుధాసార జనిత యశోలతాంకూరుడ'' నని ఆశ్వాసాంత గద్యాల్లో చెప్పుకొన్నాడు.

చేమకూర వేంకటకవి సారంగధర చరిత్ర, విజయ విలాసము అనే రెండు కావ్యాలు రచించి రఘునాథ నాయకునికి అంకితమిచ్చాడు. ఈ కావ్యాలు కృతిపతి యశస్సుకు దోహదం చేశాయి.

### 13.4.1. సారంగధర చరిత్ర - కృతుల సమీక్ష :

చేమకూర వేంకటకవి తొలి రచన సారంగధర చరిత్ర. వేంకటకవి కన్నా ముందు పెక్కు మంది కవులు సారంగధర చరిత్రను ద్విపద కావ్యంగా, గద్య కావ్యంగా యక్షగానాలుగా, గేయ కావ్యాలుగా రచించి ఉన్నందున ఆంధ్ర దేశంలో సారంగధర కథ మిక్కిలి ప్రచారం పొందింది. ఈ కథను కొందరు కవులు మాళవ దేశంలో జరిగినట్లుగా, మరి కొందరు కవులు రాజ మహేంద్రవరంలో జరిగినట్లుగా చిత్రించారు. గౌరన రచించిన నవనాథ చరిత్రలోని సారంగధర కథను ఆధారంగా గ్రహించి వేంకటకవి మాళవ దేశంలో గల రాజమహేంద్రవరంలో జరిగినట్లు రచించాడు. ఈ కథను మూడు ఆశ్వాసాల ప్రౌఢ ప్రబంధంగా రచించాడు. ఈ కావ్యంలో కృత్యవతారిక లేనందున కర్తృత్వ వివాదానికి గురైంది. కొన్ని ప్రతుల్లో విజయ విలాసంలోని అవతారిక పద్యాలు సారంగధర చరిత్ర అవతారికలో చేర్చి ముద్రించారు. వేంకట కవి గౌరవ కథను గ్రహించినా తన పాండిత్య ప్రకర్షతో, కల్పనా కౌశలంతో కొద్ది మార్పులు చేసి సారంగధర చరిత్రను మధుర ప్రబంధంగా తీర్చిదిద్దాడు. అద్భుతమైన శ్లేష చమత్కారంతో, ఔచిత్యమైన పాత్ర చిత్రణతో సారంగధర చరిత్రను రసవత్తర ప్రబంధంగా రచించాడు.

### 13.4.2. విజయ విలాసం :

ఆంధ్ర సాహిత్య చరిత్రలో అత్యుత్తమ రసవత్ప్రబంధం. ఆంధ్ర భాషా సరస్వతికి అమూల్యమైన ఆభరణం - మందార మకరుద మాధురీ ధుర్యాలగు తేట తెనుగు మాటల మూటలు ఇందులో కోకొల్లలు.

అపర భోజుడైన రఘునాథ నాయకుడు కృతిని స్వీకరించిన సందర్భంగా

"ప్రతి పద్యము నందు చమ
త్కృతి గలుగం జెప్ప నేర్తు నెల్లెడ బెళుకౌ
కృతి వింటి మపారముగా
క్షితిలో నీ మార్గ మెవరికిన్ రాదు సుమీ!"

అనే ప్రశంసవల్ల వేంకటకవి విజయ విలాసం ప్రతి పద్య చమత్కార యుక్తమని, కావ్య శైలి అనన్య సామాన్యమని అవగతమవుతుంది.

మహాభారతం ఆదిపర్వంలో 'సుభాద్రా పరిణయ' ఘట్టం విజయవిలాస కావ్యానికి మూలం. ఈ ఇతి వృత్తాన్ని స్వీకరించి స్వల్పమైన మార్పులతో ముచ్చటగా మూడు ఆశ్వాసాల శృంగార రస ప్రబంధంగా, శ్లేష చమత్కార బంధురంగా తీర్చిదిద్దాడు. కథాగమనం, కల్పనా చాతుర్యం, వర్ణనా నైపుణ్యం, పాత్ర చిత్రణం, శ్లేష యమక చమత్కార పదబంధాలతో, జాతి వార్తా చమత్కార భరితంగా, రసరంజకంగా ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రబంధాన్ని రూపొందించాడు. అందుకే ఆంధ్ర సాహిత్యంలో అనన్య సామాన్య ప్రబంధంగా విరాజిల్లుతుంది.

## 13.5. చేమకూర వేంకటకవి కవితారీతులు :

చేమకూర వేంకటకవి కవిత్వాన్ని గూర్చి పండిత లోకంలో చాల సూక్తులు ప్రచారంలో ఉన్నాయి. "ఇంటి పేరు నసగా ఉన్నా కవిత్వం పసగా ఉంది" అని కొందరి వ్యాఖ్యానం. "చేమకూర పాకాన పండింది" అని మరి కొందరి అభిప్రాయం. "చెక్కెర మడిలో అమృతం పారించి పండించిన చేమకూర" అని మధురమైన కవితాశైలిని రసబంధురంగా కొందరు చమత్కరించారు.

చేమకూర వేంకటకవి కవితారీతులను స్థూలంగా 1. వర్ణనా చమత్కారం, 2. పాత్ర పోషణ చమత్కారం, 3. శ్లేష చమత్కారం, 4. పద ప్రయోగ చమత్కారం, 5. ప్రసన్న గంభీరత, 6. ధ్వని చమత్కారం, 7. లోకోక్తుల చమత్కారం, 8. ఆలంకారిక చమత్కారం, 9. సంభాషణా చమత్కారం మొదలైన విషయాలను పరిశీలిద్దాం.

### 13.5.1. వర్ణనా చమత్కారం :

వేంకటకవి లాక్షణికులు సూచించిన వర్ణన లన్నింటినీ ప్రతిభావంతంగా వర్ణించాడు. ఆయన వర్ణనలు కథాగతికి ఆటంకం కలుగని రీతిలో ఉదాత్తంగా రసపుష్టితో చమత్కార భరితంగా ఉంటాయి.

విజయ విలాసంలో 'పురవర్ణన'లో చమత్కారాన్ని జోడించాడు.

"పోఁక మ్రాకుల మహిమ కప్పురపు టనటి
ఆకుతోటలు సౌభాగ్య మందె కలదు
ప్రజలు మౌక్తిక సౌధ సంపదల మహిమ
వీటిరహి మెచ్చ వలయుఁ బోవేయు నోళ్ల" (విజయ విలాసం 1 - 17)

పోకలు, పచ్చకప్పురపు అరటి ఆకులు, సున్నం వచ్చునట్లు 'వీటిరహి' అని పేర్కొన్నాడు. కప్పుర వీడెం ధ్వనించే విధంగా ఆ మాటలన్నిటిని పురవర్ణనలో చమత్కారంగా పొదిగాడు. చివరకు ఆ తాంబూలపు (వీటి) రుచి (రహి) తాంబూలం వేసుకొన్న నోళ్ళే మెచ్చుకోవాలని చమత్కరించాడు. ఇటువంటి చమత్కార వర్ణన లెన్నో ఉన్నాయి.

### 13.5.2. పాత్ర పోషణ చమత్కారం :

ఈ కావ్యంలో ప్రధాన పాత్రధారి అర్జునుడు. ధీరోదాత్త నాయకుడు. అర్జునుని పాత్రలో ధార్మిక కాముక ప్రవృత్తులను చక్కగా పోషించాడు. దైవ బ్రాహ్మణ భక్తి, నిరుపమ ధైర్య సాహసాలు, నియమ పాలనం మొదలైన లక్షణాలను సముచితంగా చిత్రించాడు. తనను వలచిన ముగ్గురు నాయికలను శృంగార రసవాహినిలో ముంచి ఓలలాడించిన దక్షిణ నాయకుడిగా దక్షతతో వర్ణించాడు.

ఇతర పాత్రలను ఉచిత రీతిగా చిత్రించాడు. అర్జునుడు ప్రత్యక్షంగా చూసిన సుభద్రను మనోజ్ఞంగా చమత్కార స్ఫోరకంగా వర్ణించాడు.

> "కన్నులు దీర్ఘముల్ నగుమొగంబవురా తలకట్టు, తమ్మిపూ
> పున్నమి చందమామలకు, పొక్కిలి చక్కదనంబుఁ జెప్పగా
> నున్నదె మేలు బంతులు పయోధరముల్ మఱికొను సున్నమౌ
> నెన్నిక కెక్కు వ్రాత ఫలమివ్వర వర్ణినికి న్నిజంబుగన్" (విజయ విలాసం - 2 ఆ 104 పద్యం)

సుభద్రను వర్ణించే సందర్భంలో సుందరాంగియైన ఆమె అవయవాలను చక్కని భాషాపరమైన వర్ణాల ఉపమానాలను ప్రయోగించి చమత్కారాన్ని కలిగించాడు. ఆమె కన్నులు విశాలమైనవి (దీర్ఘములు), నగుమోము పద్మంలా, చందమామలా తలపాగలా (తలకట్టు) ఉంది. నాభి సౌందర్యం చెప్ప శక్యం కానంత గొప్పగా ఉంది. పయోధరాలు మేలు బంతులు. గుండ్రనివి. నడుం 'సున్న' అనుటవల్ల నాజూకైన సౌందర్య సూచికం.

ఈ వర్ణనలో దీర్ఘములు, తలకట్టు, గుడి, అనుస్వారం మొదలైన పదాలు వ్రాతకు సంబంధించిన విశేషాలు. ఆమెకు బ్రహ్మ వ్రాసిన వ్రాత ఫలం గణనీయమైందని, ఆమె శ్రేష్ఠమైన వర్ణాలు కలిగి ఉన్నందునే సౌందర్యవతి అని వర్ణించుట ఇందులో చమత్కారం. శృంగార రసోత్పత్తికి, నాయికపై గాయుకునకు అనురాగం కలుగునట్లు సూచించుటకు ఈ వర్ణన దోహదం చేసింది.

### 13.5.3. శ్లేష చమత్కారం :

చేమకూర వేంకటకవి చేతుల్లో శ్లేష చమత్కారంగా భాసించింది. వసుచరిత్రలో రామరాజ భూషణుడు ప్రయోగించిన శ్లేష సంస్కృత భూయిష్టం. సామాన్య పాఠకులకు ఆ శ్లేష చమత్కారం అంతు పట్టదు. చేమకూర శ్లేష సొగసులు తేట తెలుగు మాటలకు సంబంధించినవి. తెలుగు జాతీయాలకు, నుడికారాలకు, ఊతకు సంబంధించినవై పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తాయి. విజయ విలాసం కన్నా ముందు రచించిన సారంగధర చరిత్రలోనే శ్లేష చమత్కారం అంకురించింది. చిత్రాంగి మేడలోకి ప్రవేశించిన సారంగధరుని తన పడక గదిలోకి తీసుకెళ్ళి శృంగార భరిత చిత్రాలను చూపిస్తూ సాగించిన సంభాషణతో శ్లేష చమత్కారాన్ని ప్రదర్శించాడు.

> "అల్లన గాధి రాజు సుతు డర్మిలి మేనక ముద్దొనర్పరా
> గిల్లి కుచంబులాన దమకించుట కంటివె రాకుమార యౌ
> నల్లన గాధి రాజ సుతు డర్మిలి మేనక ముద్దొనర్పరా
> గిల్లి కుచంబులా నఁదమకించుట బాల్యముగాదె మానినీ" (సారంగధర చరిత్ర 2 - 79)

పై పద్యంలో గాధి రాజసుతుడైన విశ్వామిత్రుడు మేనక ప్రియుడు. నగాధిరాజసుతుడైన మైనాకుడు ఆమె పుత్రుడు.

చిత్రాంగి మేనక ప్రియుడైన విశ్వామిత్రుని, సారంగధరుడు అమె పుత్రుడైన మైనాకుని ఉద్దేశించి సంభాషణ సాగించడం శ్లేష చమత్కార భరితంగా ఉంది. అతడు "ఆ కామిని యను వాక్యము వెల్ల వేతె యర్థముగా నేర్పున విత్రిచి మాటలాడినదని" చేమకూర వేంకటకవి చెప్పాడు. ఇటువంటి నేర్పు విరుపు మాటలు విజయ విలాసంలో కోకొల్లలు.

అర్జునుడు చిత్రాంగదను పెండ్లాడాలని తన చెలికాడైన విశారుదుని ఆమె తండ్రి మలయధ్వజుడి దగ్గరకు పంపిన ఘట్టంలో

"అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజ ప్ర
సన్నముఖుడయి మలయ ధ్వజక్షితీశ
కమల హితునకు మామ కాగమన వార్త
తెలుపు మనుచు విశారదుఁ బలిచి పనిచె" (విజయ విలాసం 1 - 15)

పై పద్యంలో 'మామకాగమన వార్త' అనుచోట "మామక+ఆగమనవార్త' అని, "మామకున్+అగమనవార్త" రెండు చమత్కారమైన విరుపులున్నాయని వేదం వేంకటరామశాస్త్రి వంటి పండితులు వ్యాఖ్యానించారు. శ్రీ తాపీ ధర్మారావు హృదయోల్లాస వ్యాఖ్యలో "మామ+కాగ+మన+వార్త" అని తెలుగు విరుపులను చమత్కారంగా చూపించాడు. తిరుమల శేషాచార్యులు 'మామకు+ ఆ+గమనవార్త' మామకు 'విశారదు'ని ప్రమాణంలోని అంతరార్థాన్ని అని విడదీసి చెప్పిన మనోజ్ఞంగా ఉంటుందన్నారు.

చేమకూర శ్లేష చమత్కారం అప్రయత్నసాధ్యం.

"మన సుభద్ర సుకృత మహిమయే మనవచ్చు మన సుభద్ర మయ్యె మనకు నెల్ల". "అమ్మక చెల్ల నా హృదయ మమ్మక చెల్లద వీనికయ్యెడన్" మొదలైన నేర్పు విరుపు మాటలు మహాద్భుతాలు. ఆహ్లాదజనకాలు.

విజయ విలాసంలో కేవలం కొన్ని అక్షరాలమీది ఊతతో మరొక అర్థాన్ని స్ఫురింప జేసిన సందర్భాలున్నాయి.

"అరచందమామ నేలిన దొరగా నెన్నుదురు నెన్నుదురు చిత్తరికిన్

పరవంపు మొల్లి మొగ్గల దొరగా పల్కుదురు పల్కుదురు జవ్వనికిన్

'దొరగా నెన్నుదురు' అన్నప్పుడు తేలికగా తేలిపోవు'ను'

'నెన్నుదుర' అనుటలో నున్న'ను' తో ఊత అగుతుంది.

'పల్కుదురు - పల్కుదురులో కూడ ఇటువంటి ఊతతో కూడిన చమత్కారం ఉంది.

### 13.5.4. పదప్రయోగ చమత్కారం :

చేమకూర వేంకటకవి కవిత్వంలో సన్నివేశానికి తగిన పదాన్ని నిర్ణయించి చక్కని అర్థ స్ఫూర్తితో రస స్ఫోరకంగా ప్రయోగించి నేర్పు ఉంది.

అర్జునుడు తీర్థయాత్రా సందర్భంగా చేసిన గంగానది స్తుతిలో ఆహ్లాదమైన శ్లేష చమత్కారాన్ని ప్రవేశ పెట్టాడు. తాసైరింపకపర్ణ యుండగ భవద్గర్భంబునన్ దాల్చితే జోసహ్యన్ శర జన్మ గాంచి యల నీహారక్షమా భృత్కుమారీ సాపత్న్యముంగన్న మోహపు పురంధ్రీ రత్న మౌదీవకావే, సర్వజ్ఞుండు నిన్ను నేల తలపై నెక్కించు కో జాహ్నవీ నీహా రక్షమా భృత్కుమారె (రాచ కూతురు) అపర్ణ అయిన పార్వతి చేయలేని ఘన కార్యం చేసి శివుడికి పుత్ర ప్రాప్తి కలిగించినందున్ 'జాహ్నవి'ని మోహపు పురంధ్రీ రత్నంగా భావించి అపారమైన గౌరవంతో తలకెక్కించు కున్నాడని సముచితంగా సహేతుకంగా పై పద్యంలో వివరించుట చమత్కారంగా

ఉంది. శివుడి సర్వజ్ఞత్వాన్ని సూచించాడు.

సరస గంభీరమైన విశేషార్థం ధ్వనించే విధంగా వేంకటకవి క్రియా పదాల నుపయోగించి చమత్కారాన్ని సాధించాడు.

"కలదు లేదనున సియాడు కౌను తీరు
తళుకు మొగమున నెగయు గుబ్బల బెడంగు
చూచి యతని నిడువాలు చూపులపుడు
నిండు వేడుక మిన్నంది కొండ(దా(కె" (విజయ విలాసం 2 - 20)

పై పద్యంలో 'మిన్నందుట', 'కొండదా( కుట' అనే క్రియలకు 'సంతోషించుట' అనే అర్థం. 'కౌనును మింటితో, కుచాలను గిరులతో పోల్చుట కవి సమయం. మిన్ను శూన్యాన్ని గిరులు ఔన్నత్యాన్ని సూచిస్తాయి. అర్జునుడు చిత్రాంగత కౌను చూచి మిన్నందుట, గుబ్బల బెడంగు చూచి 'కొండ దాకుట ధ్వని గంభీరాలైన ప్రయోగాలు. ఇటువంటి చమత్కార స్ఫోరకమైన ప్రయోగాలు విజయవిలాసంలో ఎన్నో ఉన్నాయి.

## 13.5.5. ప్రసన్న గంభీరత :

చేమకూర వేంకటకవి విజయ విలాసంలో ప్రతి పదంలో జాతి, వార్త, చమత్కారం, అర్థ గౌరవం ప్రసన్న గంభీరతలు పుష్కలంగా ఉన్నాయి. 'జాతి' అనే మాటకు 'స్వభావం' అనే అర్థాన్ని వేదం వేంకట రామశాస్త్రి గారు, 'స్వభావోక్తి' అనే అర్థాన్ని బులుసు వేంకట రవణయ్య గారు వివరించారు. నాయక రాజుల యుగంలో 'జాతి' అంటే 'హాస్యోక్తి' అనే అర్థాన్ని ఆరుద్ర గారి అభిప్రాయం. చేమకూర వేంకటకవి 'వార్త' అనే పదాన్ని సముచితమైన సామెతకు పర్యాయ పదంగా ప్రయోగించాడు. 'చమత్కారం' అనే పదానికి 'నేర్పు', 'విస్మయం' అనే నైఘంటి కార్థాలున్నాయి. వేంకటకవి దృష్టిలో 'నేర్పు' అంటే శ్లేష. ఆశ్చర్యం కలిగించే, కొత్త విరుపులతో కూడిన రచనయే 'చమత్కారం - హాస్యస్ఫోరక' మైన 'జాతి', నలుగురికి తెలిసే సామెత వంటిది 'వార్త' .. 'నవ్యార్థాలు' 'చమత్కారాలు'న్న కావ్యంలో ప్రతిపదం సముచితంగా ఉంటుంది. దీన్నే చేమకూర వేంకటకవి 'అర్థగౌరవం'గా పేర్కొన్నాడు. సారంగధర చరిత్రలోని పద్యాన్ని ప్రసన్న గంభిరతకు ఉదారహణగా పరిశీలిద్దాం.

"కలరాయిల రాయనికిం
కులసతి రత్నాంగి భోగ కుటిల శిరోజా
తిలకము చిత్రాంగి యునన
నెల జవ్వను లరువురంబు జేందుని భాస్వల్" (సారంగధర చరిత్ర 1 - 4)

పై పద్యంలో రత్నాంగి సచ్ఛీలాన్ని, చిత్రాంగి కుటిల స్వభావాన్ని సూచించాడు. ఈ నాయికలిద్దరినీ క్రమంగా 'అంబుజని భాస్య' 'ఇందునిభాస్య' లని పద్మానికి చంద్రునికి ఉన్న వైర భావాన్ని చెప్పాడు. 'చిత్రాంగి'ని 'ఇందుని భాస్య'గా ఉపమించుటవల్ల పద్మానికి బాధ కలిగించేవాడు చంద్రుడు. కనుక ఆమె వల్ల రత్నాంగికి హాని కలుగుతుందనే భావికథార్థ సూచన విదితమవుతుంది. వేంకటకవి దీన్నే 'ప్రసన్న గంభీరగతి'గా పేర్కొన్నాడు. శ్లేష చమత్కారాలతో 'గంభీరత' పద్యం చదువగానే 'ప్రసన్నం'గా స్ఫురించాలని చేమకూర వేంకటకవి ఆశయం. ఇటువంటి శ్లేష చమత్కారాలు విజయ విలాసంలో ఎన్నో ఉన్నాయి.

## 13.5.6. ధ్వని చమత్కారం :

చేమకూర వేంకటకవి విజయ విలాసంలో పాత్ర చిత్రణలో ధ్వని సిద్ధాంతాన్ని ప్రయోగించాడు. శబ్దశక్తి మూలధ్వని, అర్థశక్తి మూలధ్వని, ఉభయశక్తి మూలధ్వని అనే మూడు భేదాలకూ ప్రతీకాత్మక పాత్ర సృష్టి చేసే ధ్వని సిద్ధాంతాన్ని ధ్వనింప

జేశాడన్న ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారి అభిప్రాయం సమంజసంగా ఉంది. మూడు విధాలైన వ్యంజనా వృత్తికి ముగ్గురు నాయికలను ప్రతీకగా తీసుకొని సుభద్ర, చిత్రాంగి, ఉలూచి పాత్రలను చిత్రించి వేంకటకవి ప్రజ్ఞాపాటవాన్ని చాటుకొన్నాడు.

### 13.5.7. లోకోక్తుల చమత్కారం :

వేంకటకవి 'విజయవిలాసం'లో అందమైన జాతీయాలను, సామెతలను సందర్భోచితంగా, భావగర్భితంగా పలుచోట్ల ప్రయోగించాడు. "అందినన్ సిగము అందక యున్న కాళ్లు" అనే లోకోక్తిని వేంకటకవి చంద్రుని సంచారం సమయానుకూలంగా ఉంటుందన్న విషయాన్ని స్ఫురింపజేశాడు.

"మోక్షమునకు బోవ మొసలెత్తుకొని పోయె" అనే లోకోక్తిని అర్జునుని సౌభద్ర తీర్థ యాత్రలో స్నానం చేసేవారిని మొసలి పట్టుకొనే సన్నివేశంతో సమన్వయించి వర్ణించాడు.

"చేసినది జపము వేసినది గాలము" అనే లోకోక్తిని సందర్భోచితంగా ప్రయోగించాడు. లోకోక్తుల ద్వారా చమత్కారాన్ని సాధించుటలో వేంకటకవి లోకజ్ఞత, ఔచిత్య పరిజ్ఞానం అవగత మవుతున్నాయి.

### 13.5.8. ఆలంకారిక చమత్కారం :

చేమకూర వేంకటకవి శైలి ఆలంకారికమైంది. ఆయన పద్యాల్లో అర్థాలంకారాన్నో శబ్దాలంకారాన్నో ఏదో ఒక దాన్ని ప్రయోగించి పాఠకులకు చమత్కారం కలిగిస్తాడు. ప్రత్యేకించి అనుప్రాస, యమకం వంటి శబ్దాలంకారాలపై ఆయనకు మోజు ఎక్కువ.

"మీరందందం నరుగ నరుగా నరుగా"

పై ప్రయోగంలో 'నరు' పదం అర్థ భేదంతో ఆవృత్తియైన ఛేకాను ప్రాస చేత ఆహ్లాదం కలిగిస్తుంది.

ఆగ్రహోదగ్రుడైన బలరాముని ఆటోపంలో 'ట'కార వృత్త్యాను ప్రాసని అద్భుతంగా ప్రయోగించాడు.

"హుటాహుటిన్ హలాముధుండహో మహోగ్రుడై తనం
తటం దటాన నిప్పుడీ విధం బెఱింగి వచ్చినో
ఘటా ఘటీల నెల్లి బ్రోవ గట్టి పట్టిఁ బంచెనో
యటో యిటో యెటో భటోర్భటార్భటుల్ ఘటిల్లెడున్"

పై పద్యంలో 'హ' కార 'ట' కారాలు బలరాముని ఆగ్రహాన్ని సూచిస్తున్నాయి.

ఉలూచి అర్జునుడి సౌందర్యానికి ఆశ్చర్య పడి మనసులో "అమ్మకచెల్ల! నా హృదయ మమ్మక చెల్లదు వీనికయ్యెడన్"

అనే ప్రయోగంలో 'అమ్మకచెల్ల' పదాన్ని అత్యంత రమణీయంగా అర్థభేదంతో ప్రయోగించి ఆహ్లాదం కలిగించాడు.

'మన సుభద్ర మన సుభద్ర' పదాన్ని యమక సౌందర్యంతో ప్రయోగించాడు. ఇటువంటి యమకాలు, అనప్రాసలు వల్ల చమత్కారాన్ని సాధించాడు. ఉపమా వాచకాల ద్వారా కూడ చమత్కారాన్ని సాధించాడు. సాధారణంగా 'వలె', 'పోలె' మొదలైన ఉపమా వాచకాలను కవులు ప్రయోగిస్తారు. వేంకటకవి ఉపమానాన్ని సూచించేందుకు తమ్ముడు, సఖుడు, జోదు మొదలైన పదాలను మిక్కిలి నేర్పుతో ప్రయోగించి చమత్కారాన్ని కలిగించాడు.

### 13.5.9. సంభాషణా చమత్కారం :

విజయ విలాసంలో యతి వేషంలో ఉన్న అర్జునుని ఆసక్తితో సుభద్ర ప్రశ్నించే సందర్భంలో తెలుగు పలుకుబడులతో చక్కని నాటకీయమైన సంభాషణా చాతుర్యాన్ని ప్రయోగించాడు.

"అవుగా మీరిట మున్నుకన్గొనిన చాయల్లేవుగా
. . . . మేమ్పురముల్ గనంబడియె మీకందంద మార్గంబునన్"
మీరింద్ర ప్రస్థము గనినారా? పాండవుల చూచినారా? సుఖులై
వారందఱు నొకచో నున్నారా? వీరాగ్ర గణ్యు నరు నెఱుఁగుదురా?"

అని ఉత్సుకతతో ప్రశ్నించింది. సుభద్ర మోహాన్ని తెలుసుకొన్న వదినలు మేలమాడిన తీరులో స్వాభావికమైన మృదు హాస్యాన్ని చొప్పించాడు.

సారంగధర చరిత్రలో చిత్రాంగి సారంగధరుల సంభాషణను రసవత్తరంగా, చమత్కారంగా సాగించాడు.

ప్రతి పద్య చమత్కార యుక్తంగా, తెలుగు నుడికారపు సొగసులతో శ్లేష చమత్కార భరితంగా, రస పుష్టితో సాగిన మహా ప్రబంధం విజయ విలాసం.

### 13.8. రాదగిన ప్రశ్నలు :

1. రఘునాథ నాయకుని జీవిత విశేషాలను, కృతులను సమీక్షించండి.
2. రఘునాథ నాయకుని సంగీత సాహిత్య పోషణను వివరించండి.
3. రఘునాథ నాయకుని కవితారీతులను వివరించండి.
4. విజయరాఘవ నాయకుని జీవిత విశేషాలను, కృతులను సమీక్షించండి.
5. విజయరాఘవ నాయకుని కవితా రీతులను వివరించండి.
6. విజయరాఘవ నాయకుని యక్షగాన ప్రక్రియాధురీణతను వివరించండి.
7. చేమకూర వేంకటకవి జీవిత విశేషాలను కృతులను వివరించండి.
8. "విజయ విలాసం చమత్కార రసవత్ప్రబంధం" చర్చించండి.
9. చేమకూర వేంకటకవి కవితా రీతులను వివరించండి.

చిన్న ప్రశ్నలు :

1. వాల్మీకి చరిత్ర, 2. అచ్యుతాభ్యుదయం, 3. శృంగార సావిత్రి, 4. నల చరిత్ర, 5. రామభద్రాంబ,
6. కాళియమర్ధనం, 7. ప్రహ్లాద చరిత్ర, 8. విప్రనారాయణ చరిత్ర, 9. రఘునాథాభ్యుదయం,
10. సారంగధర చరిత్ర

## 13.9. ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడెమి.
   డా॥ వై.వి. కృష్ణారావు, శ్రీ వాడవల్లి చక్రపాణిరావు, 1980
2. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటి - నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి
   డా॥ జి. నాగయ్య
3. తెలుగు సాహిత్య చరిత్ర - విశాలాంధ్ర ప్రచురణలు
   డా॥ ద్వా.నా. శాస్త్రి.

డాక్టర్ పి.వి. సుబ్బారావు
ఎం.ఏ. పి.హెచ్.డి.
రీడర్, తెలుగు శాఖాధిపతి,
సి. ఆర్. కళాశాల
చిలకలూరిపేట - 522 616.